శ్రీరస్తు.

భోజరాజీయము

అనంతామాత్యప్రణీతము

చెన్నపురి:
వావిళ్ల - రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్
వారిచేఁ బ్రకటితము.

All Rights Reserved] 1952 [Price Rs. 4-0-0

CI
CHP

KLVA1D4B148

శ్రీరస్తు

భోజరాజీయము

అనంతామాత్య ప్రణీతము

చెన్నపురి:

వావిళ్ల రామస్వామిశాస్త్రులుఅండ్‌సన్స్ వారిచే

ప్రకటితము.

1952

All Rights Reserved.] [Rs. 4—0—0

Printed by
V. VENKATESWARA SASTRULU
of V. RAMASWAMY SASTRULU & SONS
AT THE 'VAVILLA' PRESS
Madras.
2nd Edition.—1952

మొదటి కూర్పు

పీఠిక

అనంతామాత్యుఁడు

ఈమహాకవి కవిత్రయము తర్వాతనున్న ప్రౌఢకవులలో నొక్కఁడని చెప్పఁదగినవాఁడు. ఈయన తిక్కనకవి బ్రహ్మవలన భవ్యభారతి యను బిరుదమును సంపాదించిన బయ్యన్నకు మునిమనుమఁడు. ముమ్మడన్న మనుమఁడు. తిక్కన్నకుఁ బుత్త్రుఁడు. ఈయనతల్లి మల్లమాంబిక. అక్కన చిట్టన రామచంద్రుఁడు లక్ష్మణుఁడు ఈకవి యనుజులు. ముమ్మడన్న యీయనకు జ్యేష్ఠసోదరుఁడు. ఈవిషయము,

ఉ. భానుతకీర్తి ముమ్మడివిభుండు మదగ్రజుఁడేను వైష్ణవ
ధ్యానసమాహితాత్ముఁడ ననంతసమాఖ్యుఁడ నాదుతమ్ము ల
జ్ఞానవిదూరు లక్కనయు సత్కవి చిట్టనయుఁ వివేకవి
ద్యానిధి రామచంద్రుఁడు నుదారుఁడు లక్ష్మణనామధేయుఁడున్.

అనుపద్యమువలనఁ దెలియవచ్చెడి. దీనినుండి మఱొకవిశేషము కనుఁగొనవచ్చును. అన్నయగు ముమ్మడన్న గ్రామాధికారియనియు, అనుజులలో మొదటివాఁడయిన యక్కన యగస్త్యభ్రాతయనఁదగినవాఁడనియు, చిట్టన సత్కవియనియు, రామచంద్రుఁడు వేదాంతశాస్త్రపండితుఁడనియు, లక్ష్మణుఁడు దాతయనియుఁ దెలిసికొనఁదగిన విషయములు. పద్యమున యతిప్రాసములకై యట్టివిశేషణము లుపయోగింపఁబడినవనియు, నిట్లు చెప్పుట కవులకు సహజధర్మమనియుఁ గొందఱనవచ్చును. అది యజ్ఞానసంపద్విశేషఫలమని చెప్పుటకన్న మఱేమనవచ్చును! తనసోదరుల నిట్టి ఘట్టమునఁ బేరుకొన్న మహాకవి పద్యము కుదురక యిట్లు చెప్పెననుట పరిహాసాస్పదము కాదా! ఏ గీతముననో వచనముననో యట్టివారైనఁ జెప్పియుండరాదా.

ఈయన యాఱువేల నియోగిబ్రాహ్మణుఁడు. ఈయాఱువేల నియోగిశాఖయే కవిబ్రహ్మయగు తిక్కనకాలమునందుఁ బాఁకనాఁటి నియోగిశాఖయను కీర్తినొందియుండెను. ఈరెండుశాఖలకు భేదమించు

కంతయుఁ గానరాదు. ఈయనది కౌండిన్యగోత్రము. ఈయన శ్రీనాథునకుఁ బూర్వుఁడున్నవాఁడని కొందఱును, తరువాతివాఁడని కొందఱును స్వేచ్ఛఁగా సిద్ధాంతము చేసికొన్నారు. మొదటిదానికిఁ గారణము పూర్వకవిస్తుతిలో నెన్నఁబడకున్న కవులనే స్తుతించినందున వారికిఁ దర్వాతివాఁడై శ్రీనాథునకుఁ బూర్వుఁడై యుండవలయునను నదియే. రెండవవారు నేదోయొక హేతువును జెప్పక మానరు కదా. ఐతే "ఎఱ్ఱయమంత్రినాదిగాఁ జన్నకవీంద్రులక." అన్నమాట మొదటివారివాదమును మెడఁబట్టి యవ్వలికి నెట్టునేమో! కవిస్తుతిలో నందఱినెవ్వరును బేర్కొనఁజాలరు. అట్టి యాచారము లేదు.

ఈయనరచించిన గ్రంథములు భోజరాజీయము, *రసాభరణము, ఛందోదర్పణము అనునవి ప్రసిద్ధినొందియున్నవి. భోజరాజీయము అహోబలనరసింహమూర్తికంకితము చేయఁబడినది. తక్కినవి కూడ నరాంకితములుచేయఁబడక విష్ణునామాంకితములై యొప్పారుచున్నవి. భోజరాజీయము విచిత్రకథారత్నాకరమని చెప్పఁదగినది. ఇందుఁ జక్కని స్వభావోక్తు లలరారుచుండును. పద్యములు కడుంగడుహృద్యములు, అలంకారభూయిష్ఠములు. చచ్చుశృంగారమిందు వర్ణితము కాదు. ధారాశుద్ధి యనర్గళముగఁ బ్రవహించుచుండును. రసాభరణము పేరుచేతనే తదంతర్గతవిషయమును దెలుపుచున్నది. ఈగ్రంథరత్నత్రయమున భోజరాజీయము తొలుత రచింపఁబడినట్లు ఛందోదర్పణములోని "అనంతధీమణి లసన్మణిభోజచరిత్ర చెప్పిలక్ష్మీనరసింహుఁగూర్చి" అనుపద్యమునుబట్టి కనుఁగొనవచ్చును.

ఈయననివాసము కృష్ణామండలములోని శ్రీకాకుళమని చెప్పవచ్చును. అని యొకరియూహ.

సీ. విలసితంబగు *కృష్ణవేణామలాపహారిణి భీమరథినాథరిత్రియందుఁ
దనరునదీత్రయాంతర్వేదియగు పావనక్షేత్రమున శోభనములకెల్లఁ
ధరనివాసంబగు పెనుమగూరిపురంబునందు విద్వజ్జనానందమైన
జీవనస్థితి చేతఁ జెన్నొందు వంశకర్తృత్వసంపత్తిఁ బ్రభుత్వమొంది

---

* రసార్ణవమని విజ్ఞానచంద్రికవారు వ్రాసిరి.

* కృష్ణవేణ్ణమలాపహారిణి-అని ముద్రణమునం దగపడియెడి.

తే. నెమ్మిఁ బ్రత్యక్షపరమపదమ్మనంగ
నొప్పు శ్రీకాకుళంబున కొడయఁడైన
యంధ్రవల్లభహరిసేవ నలరుచుండుఁ
బెక్కుభంగుల ముమ్మడి తిక్కవిభుఁడు.

ఈపద్యముంబట్టి నైజాము రాజ్య మీయననివాసమని యిం కొకరి యూహ. ఈ రెండవయూహ యెట్లున్నదో స్థూణానిఖననన్యాయమునను సరించి యూహించెదను.

కృష్ణమలాపహారిణియు బొంబాయి రాజధానిలోఁ గలిసినది. ఇదిపుడు కన్నడదేశము. కృష్ణయుభీమరథియు నైజాము రాష్ట్రమునందు రాయచూర్ పట్టణమునకుఁ బశ్చిమమునఁ బదారుమైళ్లమీఁదఁ గలిసినవి. ఇది తెలుఁగుదేశమని చెప్పవచ్చును. అని రెండవయూహ సిద్ధాంతము.

నదీత్రయాంతర్వేదియనఁగా మూఁడునదుల మధ్యభాగమని యర్థము చేసికొని పై యూహ తనభావమును వెల్లడింపఁజాలినది. మూఁడునదుల మధ్యభాగమున నొకపవిత్రక్షేత్రముండుట సంభవించునా యనునది యొకప్రశ్నము. రెండునదులకు నడుమ యొకగడ్డ యుండవచ్చు. ఆమూఁడింటిసమాగమమునకు సమీపస్థలమనియర్థము చెప్పఁబూనునేమో? ఇట్లర్థము చెప్పుట రసవంతముగ లేదు. అంతర్వేదియనఁగా మధ్యభాగమని యెట్లర్థమగునో యానదులు కలిసినతావునకుఁ జివరనున్న భాగమనియు నర్థమగును. కాన ఈనదులు కలిసి ప్రవహించుచుండఁగాఁ దత్సమీపముననున్న తావనియు నర్థము కావచ్చును. కాఁబట్టి నైజాము రాజ్యమనుటకన్నఁ గృష్ణామండలాంతర్గత శ్రీకాకుళమనుటయే సర్వవిధముల రసము. జగప్రమాదమీపద్ధతినే యున్నది. కాన విపరీతార్థములను జెప్పఁబూనక యీయర్థము నిప్పటికిఁ జెప్పుట మంచిది.

ఈకృతి యహోబలనరసింహమూర్తి కంకితముచేయఁబడినది. దీనింబట్టి యీయన కిలువేలుపు నరసింహమూర్తియని స్పష్టమగును. అహోబిలము దత్తమండలములని పిలువఁబడుచున్న పశ్చిమాంధ్రమండలములలో నొకటిగఁ బరిగణింపఁబడుచున్న కర్నూలుమండలము

లోనిది. దత్తమండలములలోఁ బోతనామాత్యుని కాలమునఁ బుణ్యక్షేత్రములుగాని కవులనాదరించుఘనులుగాని లేరని ప్రల్లదము లాడుచు గంతులువేయువారియహోబిలము మఱెక్కడనున్నదందురో యూహింపఁజాలకున్నాను.

ఇక్కవి తనకృతిని బరమేశ్వరార్పణమొనర్చి సుకృతియయ్యెను. ఈమహాకవికవిత్వము రసికమహాజనులకుం గడుంగడు హృద్యము. శైలి సలక్షణమైనది. కొఱతుకులు పడక సందర్భశుద్ధి తప్పక యతిప్రాసములకై వ్యర్థపదముల వెదకి పడరానిపాట్లు పడక సహజగాంభీర్యమున నలరారుచుఁ దనపావనతచేనొప్పుచున్నది. అసందర్భములగు వర్ణనాదులిందు లేవు. ఏపద్యమును చదివినను శ్రవణముల కత్యంతానందము నిచ్చుచుండును.

గ్రంథమునంతయు నేతన్ముద్రణమున నేఁ బరిశీలింపనందునఁ బ్రమాదములివియని వ్రాయఁజాలను. శైలి యిట్టిదని కనఁబడుటకై యొక్క పద్యమునే యుదాహరించి విరమించెదను.

శా. అంభోరాశిగభీరుఁ డూర్జితయశోహారుండు, ధర్మక్రియా
రంభస్వాంతుఁడు, నీతిమంతుఁ, డసిధారాతీర్థనిర్ముక్తసం
రంభారాతిబలుండు, భూరిబలుఁడై, రాజ్యంబు చేసెన్, మహీ
గాంభోజక్షితినాథుఁ డున్నతబహూత్సాహానాథుఁ డత్యున్నతిన్.

ప్రతిపద్యము ఒక్కొక్కవిధమున మెచ్చఁదగినది. వానిం బఠించినఁ గాని యాశ నివర్తింపదు. నీతిసారమగు నీప్రబంధమెల్లరకుం బఠనార్హమయి వేదమువలెఁ బవిత్రతను గల్పించునదియని చెప్పి కృతకృత్యుఁడనగుటకన్న హెచ్చుగ నిపుడు వ్రాయఁదగినవిషయమేమియు లేదు. అభిప్రాయభేదములను బండితులు మన్నింపఁగలరు.

ఇట్లు పండితపాదసేవకుఁడు,

జనమంచి శేషాద్రిశర్మ.

రెండవకూర్పు

పీఠిక

భోజరాజీయ భూమిక

శ్రీమదాంధ్రసారస్వతమునఁ గవిత్రయముతరువాతఁ బేరెన్నికఁ గన్నవారిలో అనంతామాత్యుఁ డొకఁడు. ప్రతిభావ్యుత్పత్తుల ననుసరించి షడ్విధశ్రేణులకుఁ జెందినట్లు పరిగణింపఁబడిన యావదాంధ్రమహాకవులలో అనంతామాత్యుఁడు తృతీయశ్రేణికిఁ జెందినట్లు శబ్దరత్నాకరమున నిర్ణయింపఁబడియున్నది. అనఁగా నీతఁడు ప్రథమశ్రేణికిఁ జెందిన కవిత్రయమునకును నాచనసోమునకును, ద్వితీయశ్రేణికిఁ జెందిన శ్రీనాథ పోతన సూరనార్యాదులకును దక్కువవాఁడనియు, ధూర్జటి, పినవీరభద్రుఁడు, ముక్కుతిమ్మన, రామరాజభూషణుఁడు, భాస్కరుఁడు, కేతన మున్నగు వారితో సమానప్రతిభాయుతుఁడనియు నుద్దేశ్యము.

ఈతనికాలమున కాంధ్రమున భారతాంధ్రీకరణము పూర్తియగుటయు ననేకము లగునుత్తమకావ్యములు బయలువెడలుటయు జరిగినది. రంగనాథభాస్కరరామాయణములు విరచింపఁబడినవి. నన్నిచోడుని కుమారసంభవము, కేతన దశకుమారచరిత్రము, మంచన కేయూరబాహుచరిత్రము, నాచనసోముని యుత్తరహరివంశము, జక్కన విక్రమార్కచరిత్రము మున్నగునవి బహువిఖ్యాతి నార్జించినవి. అందనంతామాత్యునకు సమకాలికుఁడైన జక్కన రచించిన విక్రమార్కచరిత్ర మద్భుతకథావిధానమై పలువురతోఁబాటు మన యనంతామాత్యుని నాకర్షించినది. విక్రమార్కుఁడు లోకోత్తరపురుషుఁ డగుటయు జక్కన కవిత్వము మృదుమధురమగుటయు నొకదాని కొకటితోడై బంగారమునకుఁ దావి యబ్బినట్లయి రసికహృదయములను విక్రమార్కచరిత్రము చూఱకొన్నది. విద్యాభిమానులగు పాఠకులును నద్భుతకథాశ్రవణలోలురై యింక నట్టి యపూర్వకథాసంవిధానము కలగ్రంథముఁ గెదురుచూడఁ దొడఁగిరి. ఈసమయముననే యనంతామాత్యుఁడు

బయలుదేఱి ప్రజాహృదయమునెఱిఁగి మఱియొక లోకోత్తరపురుషుని చరిత్రము వ్రాయసంకల్పించెను. ఆతని దృష్టికి భోజమహారాజు పొడ సూపెను. విక్రమార్కునివంటి సుప్రసిద్ధమహాపురుషుఁడే యాతఁడును.

"చర్చింప రెండవచంద్రుఁడు మూఁడవ
యశ్విని నాలవ యగ్నిదేవుఁ
డైదవ లోకపాలాఖ్యుఁడాఱవ పాండు
సంతాన మేడవ చక్రవర్తి
యెనిమిదవ మహర్షిజనసత్తముఁడు తొమ్మి
దవ భోగిపతి పదియవ విరించి
పదునొకండవ చక్రపాణి పండ్రెండవ
శూలి పద్మూఁడవ సూర్యుఁడనఁగఁ
దనరుఁగాంతి రూపమునఁ బ్రతాపమున స
త్యమున ధర్మచరిత నాజ్ఞ శుచిని
భూరి సత్త్వమునఁ బ్రబుద్ధతఁ గలిమిని
భూతిఁ దేజమునను భోజవిభుఁడు."

అట్టి లోకోత్తరపురుషుఁడగు భోజభూపతి సూత్రకథఁ దీసికొని తన యపూర్వమేధాసంపద్విలసితమధురకథానికరముఁ గూర్చి యనంతామాత్యుఁడు రచించినదే యీభోజరాజీయము.

కవివంశము-కాలము

అనంతామాత్యుఁడు కౌండిన్యసగోత్రుఁడైన నియోగిబ్రాహ్మణుఁడు. కవిబ్రహ్మ యగుతిక్కనకు సమకాలికుఁడై యాతనిచే భవ్యభారతి యను బిరుదందిన భైరవామాత్యుఁడీతనిముత్తాత. పరమభాగవత విభాసితుఁ డగు ముమ్మడి ప్రెగ్గడ యీతనితాత. శ్రీకాకుళాంధ్రవల్లభుని సేవచేసి స్థిరకీర్తి నార్జించిన తిక్కన్న యీతని తండ్రి. గుణగౌరవ శోభిని యగుమల్లమాంబ యీతని తల్లి. తిరుమల గోవిందచక్రవర్తి యీతని గురువు. ఈతఁడు సుప్రసిద్ధ వంశమునకుఁ జెందినవాఁడగుట నీక్రింది వంశవృక్షము దెలుపుచున్నది.

కౌండిన్యగోత్రము

నందన్న × లక్కమ్మ

- సత్యనమంత్రి × తాతమ్మ
  - బయ్యన్న × ప్రోలమ్మ. (భైరవామాత్య)
    - గంగన్న × కామమ్మ.
      - పెద్దన్న
      - అప్పలన్న.
    - మమ్మడన్న × ఎల్లమ్మ
      - తిక్కన్న × మల్లమ్మ†
        1. మమ్మడన్న
        2. అనంతయ్య యీ గ్రంథకర్త
        3. అక్కన్న
        4. చిట్టన్న
        5. రామచంద్రుఁడు
        6. లక్ష్మణుఁడు.
      - సింగన్న × ఔభళాంబ *
  - నందన్న
  - తిక్కన్న
- త్రిపురాంతకుఁడు × మారమ్మ
  1. దేవన్న
  2. నందన్న
  3. కొమ్మన్న
  4. సూరన్న
  5. మంచన్న
  6. తిక్కన్న

* * *

శ్రీవత్సగోత్రము

అక్కయ్య × అక్కమ్మ

- †మల్లమ్మ
- అయ్యలన్న
- చిట్టన్న
- తమ్మన్న

* * * *

భారద్వాజగోత్రము

సింగన్న × అన్నమ్మ

- * ఔభళాంబ
  - సింగన్న
  - చిట్టన్న
  - మమ్మడన్న
  - సింగన్నశౌరి
  - తిరువేంగళ
  - సింగరన్న
- నారన్న
- మారన్న
- సింగన్న
- వల్లభన్న

అనంతామాత్యుఁడు తనవంశజుల గుణగణముల నధికముగా శ్లాఘించి తనవంశగౌరవము నిరూపించఁ జేసికొనినాఁడు.

అనంతామాత్యుఁడు తన్నుగుఱించి "యేను వైష్ణవధ్యాన సమాహితాత్ముఁడ" "బుధచకోరచిత్తప్రియుఁడ, వీతకళంకుఁడ, కళోపేతుఁడ, నిర్ధూతదురితపృథుతిమిరుఁడ" ననియు,

"నరహరి చరణసరోజ
స్మరణామృతపాన సతత సంతుష్టాంతః
కరణుఁడ సంతత వాణీ
వరప్రసాదానులబ్ధ వాగ్విభవుండన్."

అని యాత్మనివేదనముతోఁ బాటు తాను నృసింహభక్తుఁడని తెలుపు కొనినాఁడు. అగుటచేతనే తనకావ్యరమును శ్రీనృసింహ దేవునకే యంకిత మిచ్చి తన భక్తి విశ్వాసములఁ బ్రకటించి యున్నాఁడు.

అనంతామాత్యుఁడు తనకాలమును గుఱించి తాను రచించిన రసాభరణమున నిట్లు పేర్కొనియున్నాఁడు.

"జానొందన్ శకవర్షముల్ ఋతుశరజ్వాలేందులై యొప్ప న
య్యానందాబ్దమునందు మాఘమునఁ గృష్ణైకాదశీభౌమ యు
క్తానామామృతవేళ నీకృతి యనంతాఖ్యుండు సమ్యగ్రస
శ్రీనిండన్ ధ్రువపట్టణాధిపున కిచ్చెన్ భక్తిపూర్వంబుగన్."

అనఁగా శాలివాహనశకము ౧౩౫౬ వ సంవత్సరమున నానంద సంవత్సర మాఘ బహుళైకాదశీ భౌమవారమునఁ గృతి నిచ్చినట్లు స్పష్టము. దీనికి సరియైన క్రీస్తు వత్సరము ౨౫-౧-౧౪౩౫ ఛందోదర్పణమునకుఁ బూర్వమే భోజరాజీయమును దాను రచియించినట్లు తన ఛందోదర్పణ మున నిట్లు చెప్పుకొనియున్నాఁడు.

"శ్రీనిధి చక్రవర్తి గురుశేఖర పుణ్యకటాక్షలబ్ధ సు
జ్ఞానుఁ డనంతధీమణి లసన్మణి భోజచరిత్ర చెప్పి ల
క్ష్మీనరసింహుఁ గూర్చిన ప్రసిద్ధుఁడు వేడుకతో నొనర్చె ఛం
దోనుతి యోగిహృద్విభులతో యజవర్తి కనంతమూర్తికిన్."

వీనినిబట్టి యనంతామాత్యుఁడు భోజరాజీయము క్రీ. శ. ౧౪౩౦ ప్రాంతమున విరచించి యుండవచ్చును. కావున, ననంతామాత్యుఁడు పదునైదవశతాబ్దారంభము వాఁ డగుట నిర్వివాదాంశము.

భోజరాజీయము : విషయము

భోజరాజీయమునందలి ప్రధానకథాభాగ మిది. తొల్లి మహుఁ డను కాంభోజరాజు కుష్ఠరోగపీడితుఁడై విసిగి వేసారి గౌతమీనదిలోఁ

దన శరీరము విడిచివేయ సంకల్పించి బయలుదేఱి పోవుచుండెను. గౌతమి యీ విషయము నెఱింగి స్త్రీరూపమును ధరించి వాని కెదురై వాని కార్య మడుగును. ఆతఁడు దనమరణోద్యోగము చెప్పును. హేయ మగు నాతనిశరీరమును దాను సహింపనోపక దత్తాత్రేయుఁడను మహ ర్షిని సేవించుచో నాతనిరోగము హరించునని చెప్పి మహాని తదన్వేష ణమునకు మరల్చి యామె వెడలిపోవును. మహాుఁడును దత్తాత్రేయుఁ గనుఁగొని యాతని సేవించి యాతనికటాక్షమున రోగవిముక్తుఁ డగును. పిమ్మట మహుఁడు దత్తాత్రేయుని నివాసస్థానములగు శ్రీరంగము, హేమ కూటము, ప్రయాగక్షేత్రముల మాహాత్మ్యమును దెలుపుమని కోరును. దత్తాత్రేయుఁడును శ్రీరంగమహత్త్వ ముగ్గడించి హేమాద్రి ప్రాశస్త్య మును వక్కాణించి ప్రయాగమాహాత్మ్యము దెలుపు సందర్భమున భోజుని పూర్వజన్మ వృత్తాంతముఁ జెప్పును. భోజుఁడు పూర్వజన్మమున ద్విజుఁడై పుట్టి దారిద్ర్యదుఃఖపీడితుఁడై తీర్థయాత్రలు చేసికొనుచుఁ బ్రయాగతీర్థమున నిష్టకామ్యసిద్ధికై మరణించి పునర్భవమున భోజ రాజయి జన్మించును. ఆతఁడు రాజ్యముచేయు చొకనాఁడు వేటకై యరణ్యమున కేఁగినపు డందు సర్పటియను సిద్ధునిఁగాంచి వానిని బ్రార్థించి తనగృహమునకుఁ దీసికొని పోవును. ఆతఁడొకనాఁటి యర్ధ రాత్రమునఁ దన ధూమవేధి విద్యకతమున భోజుని కొలువుచవికె స్వర్ణ మయముచేసి యెందేనిఁ జనుటవిని, మఱునాఁ డావిషయము నెఱింగి భోజుఁ డొక కృతకమతమున నాతనిరావించును. తనకడ శబ్దభేది యను విద్య గలదని దానిని సర్పటికి బోధింతునని యసత్యమాడి యాతని విద్య నపహరించును. సర్పటి యలిగి భోజుని ప్రార్థనమున నాశాప మాతఁడు తుదకుఁ గ్రమ్మరించును. అంత భోజుఁ డాతనిఁ దనయింట విందునకుఁ బిల్వ నాతఁ డంగీకరింపఁడు.

అగస్త్య వసిష్ఠుల కథ

భోజుఁ డంత నరుంధతీ వసిష్ఠు లగస్త్యునిఁ బూజించి యాతిథ్య మిచ్చుట యనుకథ చెప్పి నిరాహారి సదాబ్రహ్మచారి యగునగస్త్య వసిష్ఠుల మాహాత్మ్యము నుగ్గడించును. ఇనను సర్పటి విశక పంచభిక్షు మహత్త్వ మును దెలుపుకథ చెప్పును.

దుష్టసతి, సత్పతుల చరిత్రము

దుష్టసతి గలయొక సత్పతి రహస్యముగాఁ బంచభిక్షుఁగొను యోగికి వేఁడి పాయసము చెప్పుకూడలోఁ బెట్టి యాతిథ్యమిచ్చిన కారణమున నాతఁడు మరణించిన పిదప స్వర్లోకమునందియు వేఁడి పాయసము తోలు తిత్తిలోని దనుభవింపవలసివచ్చెను. ఆతఁడు మొఱవెట్టఁగా నింద్రుఁడు కర్మఫలమనుభవింపకతీరదని యొకకథ చెప్పెను.

మంటిముద్ద యోగికిఁ బెట్టినస్త్రీ కథ

ఒకస్త్రీ భిక్షుకువచ్చిన యోగిఁ గామించి యెడలు తెలియక యొక మంటిముద్ద నతనికి దానముచేయును. దాని ఫలితముగా నామె మరణించిన పిదప స్వర్గమునకేఁగి యొకమంటికొండఁ దినవలసివచ్చును. ఆమె యార్తయై యింద్రునిఁ బ్రార్థింపఁగా నాతఁడు గరుణించి యొకజన్మము నిచ్చును. ఆజన్మమున నామె స్త్రీయైపుట్టి యొకయోగిచేఁ దరణోపాయ మెఱిఁగి వారవనితరీతి మెలఁగుచుః బతివ్రతయైయుండి తన్నుదూషించు వారికిఁ దనపాపము పంచియిచ్చుచుండును.

చండాల దంపతుల చరిత్రము

ఇట్లుండ నొకనాఁ డొకచండాలాంగనభర్త యామెను దూషింపఁ బోవ నాచండాలాంగన యాతని ధిక్కరించును. అదివిని యాస్త్రీ చండాలాంగనకు మ్రొక్కి యామె చరిత్రముఁ దెలుపుమని ప్రార్థించును. అంతఁ జండాలాంగన యిట్లు చెప్పెను. తామిరువురుఁ బూర్వజన్మమున బ్రాహ్మణులై యుండి యొకనాఁడు భిక్షుకువచ్చిన యోగికి భుక్తశేషాన్నము భర్త్రనానతిఁ బెట్టఁ బోవ నాతఁడు వారు చండాలురై జన్మింపుఁడని శపించుటచే నట్లు పుట్టితిమనియు నాయోగిచెప్పిన శాపవిముక్తకాలమదియే యగుటఁ దరించితి మని చెప్పి యాదంపతులు వెడలిపోయిరి. విప్రకాంతయుఁ బాపవిముక్తయై పోయెను.

ఈకథచెప్పిన నాబ్రాహ్మణుఁడు తృప్తినందక జన్మాంతర మిమ్మని యింద్రునిఁ బ్రార్థింప నాతఁడు గరుణించును.

అతిథిపూజాప్రభావము

ఆబ్రాహ్మణుఁడు పునర్భవమున ననేకవిధముల నన్నమహాదానము చేసి యతిథిపూజాప్రభావముచేఁ బాపవిముక్తుఁడై స్వర్గతుల నందఁగనెను పిమ్మట సర్వటిభోజున కతిథిపూజావిధి వివరించుట కొకకథ చెప్పును.

పుష్పగంధి చరిత్రము

తొల్లి కళింగదేశమున పుండరీక పురాధిపతియగు సంపాతికి దుష్టగ్రహకూటమునఁ బుష్పగంధి యనుకూఁతు రుదయించును. ఆమెఁ బరిణయమైన యాతఁడు బ్రహ్మరాక్షసుని వాతఁబడునని బ్రాహ్మణులు చెప్పిరి. ఇట్లుండఁ బుష్పగంధి పెరిగి పెద్దదై పూఁదోట విహరించుతరి మాళవదేశాధిపుని కుమారుఁడు రత్నమండనుఁ డామెను వలచి యే యిక్కటులకైన సహింతునని వివాహమాడును. బ్రాహ్మణులు దీవనలిచ్చి, తమమాట వ్యర్థము కాదందురు. వివాహమైనతరువాత నొకనాఁడు రత్నమండనుఁడు పరిసరకాంతారమున నుండఁగా నొకబ్రహ్మరాక్షసుఁ డాతని మ్రింగఁబోవును. రత్నమండనుఁ డొకపరి గృహమున కేఁగి రాని మ్మని ప్రార్థించుచు నాతనికి గోవ్యాఘ్రముల కథఁ జెప్పెను.

గోవ్యాఘ్రసంవాదకథ

ఒకవిప్రుని గో వొకనాఁడడవిలో మేయుచుండఁగా నొక వ్యాఘ్రి మాగోవును మ్రింగఁగోరును. ఆగోవు దనబాలు నొకసారి చూచి వచ్చుటకుఁ బంపుమని ప్రార్థించును. వ్యాఘ్రి మెట్లునమ్ముట యని యొకకథః జెప్పును.

చాకితచేఁ జెఱుపఁబడిన మునికథ

ఒకముని యొకచోఁ దపస్సు చేయుచుండఁగా నొకచాకిత బలవంతముచేసి వానితో రమించును. ఆముని పశ్చాత్తాపడియుఁ దత్కారణమునఁ బునర్భవమున నొకపందియై జన్మించును. ఐనను దనభక్తిభావము విడువనికారణమున నీచజన్మముపై రోఁతఁగలిగి పందిజన్మము కలుగకపూర్వమే తన శిష్యుఁబిలిచి తా నొకపందికి జన్మింపఁగనే గుర్తుఁ దెలిసి వెంటనే చంపివేయుమని చెప్పియుంచెను. అట్లాతని శిష్యుఁడు చేయఁ

జూడ దేహవాసన కలిగిన యాపందిరూపియగు ముని ప్రాణములపైఁ గల తీఁపిచేఁ జంపవలదని కోరి యట్లే యుండెను. తుదకు విష్ణుమూర్తి యాతనికిఁ బ్రత్యక్షమై యుత్తమలోక మొసఁగెను. అట్టి మునీశ్వరుఁడే పందియైపుట్టికూడ చావ నిచ్ఛగింపలేదు. నీవు తిరిగివత్తువా యనఁగా గో వొకకథ చెప్పును.

సత్యవాక్యమహాత్మ్యము (మదనరేఖ కథ)

పూర్వము మగధదేశాధీశుఁడగు శంబరునకు మదనరేఖ యను కూఁతురును బావకలోముఁడను కొడుకును గలరు. వారిరువు రొక గురువునొద్ద విద్యాభ్యాసవ్రతు లయియుండఁగా నొకనాఁ డాగురు పుత్రుఁ డొంటరిగనున్నపుడు మదనరేఖను గలియఁగోరెను. ఆమె యెన్ని చెప్పినను వినక యాతఁడు మూర్ఛపోఁగా మదనరేఖ బ్రహ్మ హత్యాదోషము కలుగునని భయపడి తనవివాహమైనపిదప భర్త నొప్పించి యాతనికోర్కి దీర్తునని యూరడించెను. కొంతకాలమున కామె తంత్రి యను రాకుమారుని వివాహమై ప్రథమసంగమము నాఁటిరాత్రి తనగురుపుత్రున కిచ్చిన వాగ్దానముచెప్పి యట్లు చేసి వచ్చెదననఁగాఁ దుదకాతఁ డంగీకరించును. గురుపుత్రునికడ కేఁగుచుండ దారిలో నొక రాక్షసుఁ డామెను మ్రింగఁబూనును. ఆమె యచంచలయై గురుపుత్రుని కోర్కి దీర్చివచ్చెదనని యాతని నొడంబఱచి పోవును. గురుపుత్రుఁడా మెరులువీడి యామె సత్యవాక్యపాలనమున కాశీర్వదించి పంపును. ఈసంగతివిని యారాక్షసుఁడును బశ్చాత్తప్తుఁడై యామె పాదములఁ బడ వారి సత్యనిష్ఠకు విష్ణువు ప్రత్యక్షమై వరము లొసంగును. మదనరేఖ చిరకాలము భర్తతో సుఖించి పరమపదము చేరును.

పావకలోముని చరిత్రము

పులి యామదనరేఖ సోదరునికథఁ జెప్పుమన గోవు చెప్పును. పావ కలోముఁడు కుంభియను కంసాలివానితో నజపతునగరంబున కరిగి మత్స్య యంత్రము నేసి యనుమతి యనునాతని కూఁతునందియుండఁగా వనమున మాయోపాయమున వారిని విడఁదీసి తానా యనుమతిఁ గొనిపోవుచుండ నొక బ్రహ్మరాక్షసుఁడు కుంభిఁ బఱిమి యనుమతి నెత్తుకొనిపోవును.

పావకలోముఁడు తుద కాగాత్రుసునిఁ జంపి యనుమతిఁ దెచ్చుచుండఁగాఁ గుంభి మరల మాయోపాయమున నామెఁ దీసికొని యజవత్సుని కడ కేఁగి తానే మత్స్యయంత్రము నేసితినని చెప్పును. అనుమతి యంగీకరింపక పోవుటచే వివాహము చేయకుండఁ దండ్రి యడ్డయుంచును. ఒకనాఁడు పావకలోముఁడు నిజనగరమున నీవిషయమొక యోగినిచే విని రాఁగాఁ గుంభి వాని కాలుచేతులు నఱికించెను. చేరువతోఁట వాఁడొకఁ డాతనిఁ బెంచుచుండఁగాఁ బార్వతీ పరమేశ్వరులువచ్చి వలసినప్పు డాతనికిఁ గాలు చేతులు వచ్చునని యంతర్హితులగుదురు. అనుమతి తల్లితోఁగూడ నటకువచ్చి యాతఁడే తనభర్తయని తెలుపును. తుదకుఁ బావకలోముఁడే యామెభర్తయని యందఱు అంగీకరింతురు. అపుడు సంతసించి యుభయులకు వివాహముచేయుదురు. కుంభినిఁ గరుణించి పావకలోముఁడు చంపనీయక యూరువెడలఁ గొట్టుట కంగీకరించును. అనుమతి తల్లి యల్లుఁడు కాలుసేతులు లేనివాఁడని విచారింపఁగా నజవత్సుఁడు విధికృతము తప్పింపవీలులేదని సుశీల యనుకన్యకాచరిత్రము నామెకుఁ జెప్పును.

సుశీలచరిత్రము

సౌవీరాధిపతికూఁతురు సుశీల యనునామెను దన మేనల్లునకిచ్చి పెండ్లిచేతునని తండ్రియుఁ దన యన్నకొడుకునకిచ్చెదనని తల్లియు విరోధించిరి. విష్ణుమహేశ్వరు లొకనాఁ డీవిషయమెఱిఁగి యందెవరికామె భార్యయగునని బ్రహ్మనడుగుదురు. వారిరువురకుఁగాక యొక పిచ్చుకుంటునకామె భార్యయగుననిచెప్ప విష్ణువది పరీక్షింపనెంచి గరుడునిఁ బంపి యాపిచ్చుకుంటును సముద్రమునకవతల నొక వనమున విడియించును. తుదకు గరుడుఁ డొక బోనపుటిక నాతనికడ విడువ నందు సుశీల దాఁచఁబడియుండి తానుజూచిన యాపిచ్చుకుఁటునే పరిణయమగును. త్రిమూర్తులుఁ బ్రత్యక్షమై వారికి వరము లొసఁగుదురు.

తరువాతఁ బావకలోముఁ డిచ్ఛించి కాలుసేతులందఁగా నందఱు నానందింతురు.

ఈకథ విని వ్యాఘ్రిముంపఁగా గోవు గృహమునకేఁగి పుత్త్రుఁదనిపి తిరిగిరాఁగా వ్యాఘ్రి మాగోవు సత్యవాక్యపరిపాలన కానందించి చంపక విడుచును. విష్ణుమూర్తి ప్రత్యక్షమై వరములిచ్చును.

రత్నమండనుఁ డీకథలు చెప్పఁగా బ్రహ్మరాక్షసుఁ డంగీకరించును. రత్నమండనుఁ డింటికేఁగి సత్యవాక్యము దప్పక తిరిగి బ్రహ్మరాక్షసుని కడకేగఁ బుష్పగంధి బుద్ధికుశలతచే భర్తను సంరక్షించును. ఇట్లు బ్రాహ్మణాశీర్వచనముచే నాతఁడు రక్షింపఁబడుట సర్వటి భోజునకుఁ దెల్పును. మఱియు నన్నదానప్రభావముఁ దెల్పునొక కథ చెప్పును.

అన్నదానపరుఁడగు విప్రుఁడు, నాతని వదినెల కథ

ఒక బ్రాహ్మణునకు ముగ్గురుకొడుకులు కలరు. వారిలోఁ దృతీయుఁడు నిరతాన్నప్రదాత. తలిదండ్రులు చనిపోయినతరువాత సోదరులు కలిసియుందురు. తృతీయుని కీర్తి విని యాతనివదినెలు భర్తలకు నూరిపోసి వేరుకాఁపురము లేర్పరింతురు. ఐనను, దృతీయుఁ డన్నదానపరుఁడై కీర్తిగాంచును. అన్నలిరువురు నైశ్వర్యహీనులై దరిద్రులగుదురు.

ఆవిప్రుఁ డొకనాఁ డన్నదానఫలమును జెప్పుమని యతిథుల నడుగఁగా వారు చెప్పలేక కాశీయన్నపూర్ణయే చెప్పఁగల్గునందురు. అంత నాతఁడు కాశీయాత్రకు బయలుదేఱి భార్యకు హితము చెప్పుచు నల్పాహార మతిథుల కిడరాదని యొకకథ చెప్పును. తరువాత నాతఁడు కాశి కేఁగ విష్ణుమూర్తి యాతనిభార్యఁ బరీక్షింపనెంచి వృద్ధబ్రాహ్మణరూపమున రాఁగా నింటనున్న కొలఁదిబియ్యమువండి యాతనికిడఁ గొందఱు సద్బ్రాహ్మణులువత్తురు. వారి కామె చేటతో యిసుక చెరిగి వండఁగా నన్నమగును. అది వారికిఁ బెట్టును. విష్ణువు స్వస్వరూపమునఁ బ్రత్యక్షమై యనేకవరము లొసఁగిపోవును.

వ్యాధునికథ

ఆవిప్రుఁడు కాశికేఁగుచు దారిలో నొకచర్మకారుంగని యాతఁడు తనను గంగకు జ్ఞాపకముచేయుమన నట్లేయని వెడలును. కాశిలో గంగనుగని యాతఁ డన్నదానఫలమును జెప్పుమన నొక రాజశిశువు చెప్పఁగలదని యామె యాతనిఁబంపును. ఆతఁడొక యరణ్యమునఁ బోవుచుండఁగా దారితప్పును. ఒక వ్యాధుఁ డాదరించి యాతనికిఁ బప్పులుఁ బెట్టి యాదరించును. నాఁటిరేయి వ్యాధుఁడు పులివాతఁబడి

మరణించును. ఆతఁడే తా నా బ్రాహ్మణునకుఁ జేసిన యతిథిపూజా ప్రభావమున రాజకుమారుఁడై జన్మించి యా విషయ మా బ్రాహ్మణున కెఱింగించును. ఆ విప్రుఁడు తిరిగి గంగయొద్దకువచ్చి యొక మాదిగవాఁ డామె నడిగె ననిచెప్పి యాతనివృత్తాంతముఁ దెల్పుఁడనును. గంగ చెప్పును.

మాదిగవానికథ

తొల్లి యొక కర్కటి బిడ్డలఁ గాంచి యందొక బిడ్డనికి గంగా ప్రభావము మాటలసందర్భమున నుగ్గడింప నాతఁడు కుతూహలియై గంగాస్నానమున కేఁగుచుండ దారిలో నొక ఖగము వానిఁదినివేయును. ఆ కర్కటిబాలుఁడే మఱుజన్మమున నొకయావుదూడయైపుట్టి యాతరు వాతిజన్మమున వంజరుఁడనురాజకుమారుఁడై జన్మించును. పూర్వజన్మ లబ్ధమగు గంగాస్నాన కుతూహలమున నతఁడేఁగ నాతనితండ్రి పుత్ర వ్యామోహముచే మరణించును. అట్లాతని కొకశాపముఁగలదు. వంజరుఁడు బ్రాహ్మణవచనముల నింటికివచ్చి పితృక్రియలు నెఱవేర్చి తపోవృత్తినుండును. ఇంద్రునిపంపున బ్రహ్మయు నారదుఁడువచ్చి మాయోపాయమున వంజరుని గంగను భూమికిఁ దెచ్చునట్లు తపముచేయఁజెప్పి వెడలిపోవుదురు. వంజరుఁ డీశ్వరునిగుఱించి తపముచేసి విష్ణునిఁగొల్చి గరుత్మంతుని వాహనముగాఁ గొని గంగను భూమికిఁ దెచ్చును. ఇట్లు కృతకృత్యుఁడై రాజర్షియైయున్న వంజరుఁడు తీర్చినతగవునకుఁ గినిసి కొందఱీతని శపింతురు ఆశాపకారణమున నీతఁ డొకస్త్రీకి పతియై, తోఁబుట్టువై శిశువై పెరుగును. ఈతనిభార్య శాపమూలమున నీతఁడు మాదిగవాఁడై జన్మించును. భార్యయు నీతని ననుసరించును. ఇట్లు చండాలురైన వంజరదంపతులనే యన్నదానపరుఁడగు బ్రాహ్మణుఁడు చూచును. అంత వంజరదంపతులు శాపవిముక్తినంది ముక్తినందుదురు.

ఇది విని విప్రుఁడును దనగ్రామమునకేఁగి భార్యతో సుఖముండును. అని సప్తటిసిద్ధుఁడు భోజున కన్నదానమాహాత్మ్యముఁ దెల్పును. పిమ్మట నాతఁడు భోజుని దృష్టిపఱుప నాతనియింట వ్రతభంగముకాన ట్లన్నము దిని యథేచ్ఛముగాఁ జనును. భోజుఁడు పుత్త్రపౌత్త్రాభివృద్ధిగా రాజ్య

మేలి విఖ్యాతిగాంచును. అని దత్తాత్రేయమహర్షి మహానకుఁజెప్పి వెడలిపోయెను.

కావుననే,

"సూత్రకథ భోజరాజ చ
రిత్రము యానడుమ ధర్మరీతుల్ నీతుల్
చిత్రకథలై తలిర్పఁగ
శ్రోత్రసుఖముగా నొనర్పఁ జొప్పడియుండున్.

అని యనంతామాత్యుఁడే తెలుపుకొనియున్నాఁడు. ఆకారణమున నీకావ్యము వస్త్వైక్యము కలిగి యన్వర్థనామభాజకమైనది.

కథాసంవిధానము - నవీనత

భోజరాజీయమును గవి 'నూతనం బయ్యుఁ బురాతనకృతు లట్ల సంతతశ్రవ్యమై జరగు ననియు' 'వివిధకథానూత్నరత్నభూషణాభిరాము మనియు 'నుదాత్త సుకృత భోగ విశ్రుత సునీతిపథాయత్తంబై క్రొత్తగదే' యనియుఁ జెప్పికొనియున్నాఁడు. అగుట నిందలి కథాభాగములు నూతనకల్పితము లేకాని పురాతనములు కానట్లు స్పష్టము.

కాని కొన్ని కథాభాగములు పురాణకథానుకరణములై కావ్యప్రాశస్త్యమునకుఁ గొంతకారణభూతమైనవి. భారతమునందలి సదా బ్రహ్మచారి, నిత్యోపవాసి యనువాని నిర్వచనము ననుసరించి యిందుఁ గడునిపుణతతో నగస్త్యవసిష్ఠులకథ వివరింపఁబడినది. పావకలోముఁడు మత్స్యయంత్రము నేసి యనుమతింపఁదిన కథాభాగము మత్స్యయంత్రమునేసి ద్రౌపదిఁ బరిణయమైన భారతార్జున కథానుకరణముగ నున్నది. ఉత్తమగుణవిరాజితుఁ డగుపావకలోముఁడు కాలుసేతులు నఱుకఁబడిన కథ సారంగధరకథను బోలి యున్నది. పందిజన్మము నెత్తిన మునికథ ముని లేడియైపుట్టిన భారతోపాఖ్యానమున కనుకరణముగాఁ దోఁచును. వంజరుఁడుగంగను భూమికిఁ దెచ్చినకథ గౌతముఁడు జాహ్నవిని భువికిఁదెచ్చినకథ కనుకరణము. ఇట్లే కొన్ని కథాభాగములకు మాత్రము పురాణ కథానుకరణములు కానవచ్చు చున్నవి. మిగిలిన కథా భాగములు నీకథాభాగమున కొనర్చిన మార్పులు నద్భుతములై

యనంతామాత్యు నద్వితీయ కథా సంవిధాన చతురతను వేనోళ్లఁ జాటుచున్నవి.

మహా ప్రతిభాకల్పితము లగు నిందలి కథాభాగములు 'ప్రశస్త ధర్మోపదేశము' లగుట విశేషములకెల్ల విశేషము. ఇందేకథాభాగ మరసినను మహా ధర్మప్రతిపాదకమై సునీతిపథాయత్తమై పాఠకమాన సముల నానందముగ్ధములనుగాఁ జేయుచుండుట యనంతామాత్యుని కావ్యపరమార్థదృక్పథమును వ్యక్తీకరించుచున్నది. రోగభూయిష్ఠుఁడగు మహానిచత్రము, మాధుకరప్రభావమును గుఱించిన దుష్టసతి, సత్పతి కథ, యోగికి మంటిముద్దపెట్టిన యామె చరిత్ర, సుశీల చండాల దంపతులచరిత్రము మున్నగుకథలు "అవశ్య మను భోక్తవ్యం కృతంకర్మ శుభాశుభ" మ్మను నార్యోక్తికిఁ దార్కాణములై యలరారుచున్నవి. పుష్పగంధిచరిత్ర, మదనరేఖమహత్త్వము, అనుమతి ప్రభావము మున్నగుకథలు పరమ పాతివ్రత్యప్రభావమును వేనోళ్ల శ్లాఘించుచున్నవి. మఱియు, నతిథి పూజాప్రభావము, సత్యవాక్యపరిపాలనామహత్త్వము, నన్నదానమాహాత్మ్యము మున్నగు సద్ధర్మముల యుత్కృష్టత యద్భుతముగా నుద్ఘోషింపఁబడినది. ఇట్లు దాన ధర్మ సత్యముల ప్రభావ మనంతముగా వివరింపఁబడినట్లే యధర్మము, నన్యాయము, నసూయ మున్నగుదుర్గుణము లెట్టి యిక్కట్టులఁ గొనితెచ్చినవియుఁ దెలుపుటకు - కుంభిచరిత్రము, విప్రుని వదినెలకథ మున్నగునవి సాక్షీభూతము లగుచున్నవి. అన్నిటికన్న మిన్నగా మహారాక్షసుని హృదయము, మహాక్రూర మగు వ్యాఘ్రిముమానసము, మహాకామాంధుని మనస్సు మార్చివేసి మహోన్నతపరివర్తనమును గొని తెచ్చిన సత్యవాక్యవిజయ మీకావ్యమున నద్వితీయముగా నద్భుతముగాఁ గొనియాడఁబడినది. గోవ్యాఘ్రసంవాదకథ, పాపకలోముని చరిత్రము, 'పుష్పగంధివృత్తాంతము నాచంద్రార్కముగా నాంధ్రసారస్వతమునకు జీవము నీయఁగలవు.

ఇట్టి మహనీయకథాసుధామధుర మగుటచేతనే భోజరాజీయము నందలి కథా భాగములు శ్రీకృష్ణదేవరాయలు, పింగళి సూరనార్యుఁడు మున్నగు మహాకవులే యనుకరించియున్నారు. ఆముక్తమాల్యద

యందలి మాలదాసరికథ భోజరాజీయమునందలి మదనరేఖకథ కనుకరణము. పింగళి సూరనార్యుని కళాపూర్ణోదయము పూర్వకథానిధానమే యైనను భోజరాజీయమునఁ గలప్రతి కథా భాగవిలసిత ధర్మోపదేశము, నైతికసంపత్తి యందెల్లెడలఁ గానరాదు. భోజరాజీయము నందలి యన్నదానపరుఁ డగు విప్రునకన్న దానమాహాత్మ్యమపుడు పుట్టిన బాలుఁడే చెప్పిన కథకుఁ గళాపూర్ణోదయమందలి మధురలాలసబాల్యవృత్తాంతము ననుకరణమే యనవచ్చును. పాండురంగమాహాత్మ్యమునందలి సుశీలోపాఖ్యాన మనేక విషయముల భోజరాజీయమందలి యన్నదానపరుఁ డగువిప్రునిభార్యకథ కనుకరణముగాఁ దోఁపకమానదు. ఇట్లే యింక ననేకులగు నితర కవులు నందలి కథాభాగముల మహనీయత కానందించియే తచ్ఛాయలు దమ కావ్యములందుఁ జొనిపియుండిరన్న భోజరాజీయోత్కృష్టతఁ జాటుటే యగును.

కవిత్వము : ప్రాశస్త్యము

అనంతామాత్యుని కవిత్వ మతి మృదుమధుర మనియు నుత్తమ కవిత్వమునకుఁగల ప్రతిభావ్యుత్పత్తులు, నుత్తమశైలికిఁగల మాధుర్యము, నర్థబోధకత, మున్నగు నెల్లవానిచే నద్భుతముగాఁ విరాజిల్లుచున్నదనియుఁ జెప్పుటలో నతిశయోక్తి లేదు. ఇతఁడు పూర్వ సత్కవి విధేయుఁడగుట నటనటఁ గవిత్రయముననే కాక తదితర పురాతనకవి వర్యుల కవిత్వానుకరణములు గానవచ్చుచున్నవి. ఉదాహరణమునకుఁ గొన్నిమాత్రమే యిటఁ జూపుచున్నాను:

"నుతజలపూరితంబు లగు నూతులు నూఱిటికంటె సూనృత
వ్రత! యొక బావి మేలు మఱి బావులునూఱిటికంటె నొక్కసత్క్రతు వది మేలు తత్క్రతు శతంబునకంటె సుతుండు మేలు త
త్సుతశతకంబుకంటె నొకసూనృతవాక్యము మేలు చూడఁగన్."

(భార. ఆది. ౪-౯౩)

అనునన్నయ భారతపద్యమును;

"శతకూపాధిక దీర్ఘిక
శతవాప్యధికంబుఁ గ్రతువు శతయజ్ఞ సము

న్నతుఁ డొక్కసుతుఁడు దత్సుత
శతకంబున కెక్కు డొక్కసతోక్తి నృపా."

(భోజరాజీయము. ౬. ౯౨.)

అని చక్కఁగ సంక్షేపించినాఁడు.

ధర్మోపదేశమునఁ దిక్కనశైలికనుకరణము :

"మమకారంబు నహంకా
రము సంసారానుబంధ రజ్జువు లని చి
త్తముల వివర్జింతురు సం
యము లీవును సడుపుమా! తదాచారంబున్."

ఇట్టి వనేకము లున్నవి. మఱియుఁ దిక్కన నిర్వచనోత్తర రామాయణము నందలి కుసుమాపచయవర్ణనము ననేకపద్యముల ననుకరించినాఁడు. ఉదాహరణమున కొక్కటి.

సీ. చిగురాకుఁ గెంగేలి చెలిమి యొనర్పంగ
మవ్వంపులేఁ బోదల్ మలచిపట్టి
వెలిచేతి నఖపంక్తి గిఱికొని చెన్నొంద
నెగయుదీప్తుల విరులినుమడింపఁ
గురులు గన్నవమీఁద నెరసిన నెమ్మొగ
మడ్డముంకించి చూపలవరించి
తనుగెంపు గడచని దళములు సడలఁ బు
వ్వులు కోయనొల్లక తొలఁగనెత్తి
గీ. ...చతురముగనోర్తు పుష్పాచయముచేసె. (నిర్వ. ౮. ౩౮.)

"తరుణీరత్నము పువ్వుఁదీఁగె యొకచేతన్ వంచి పాదాగ్రముల్
ధరణిన్ మోఁపి యొకింతనిక్కి తనుమధ్యం బొప్పఁగన్ దివ్యయ
స్ఫురణంబారఁ గుచంబులుబ్బ నయనంబుల్ విచ్చిలీలన్ ముఖాం
బురుహంబెత్తి యొకర్తుఁగోసె నెలమిన్ బుష్పంబులత్తోఁటలోన్.

(భోజరాజీయము. ౩. ౧౭౦.)

ఈపద్యము తిక్కన పద్యమునకు మెఱుఁగుగా నున్నది.

> ఒకసహకారశాఖతుదనొాలఁ బెనంగొనియున్న పువ్వుఁ దీఁ
> గకుఁ దనహస్త మెత్తుటయుఁ గ్రక్కున లేఁజిగురంచుఁ గోకిలం
> బొకటి రయంబునం గదియ నుల్కిపడంకుచుఁ బాతె నొక్కబా
> లకి తనబోఁటితోడ నబలా! యిది కాటుకతీఁగె పొమ్మనన్.
>
> (భోజరా. ౩. ౧౭౫.)

ఈపద్యము నాచనసోముని యుత్తరహరివంశపద్యమునకు (ఉ. హరి. ౫. ౫౨.) ననుకరణము. ఇఁక యొఱ్ఱనకవిత్వమున కనుకరణము.

> "కీర్తి విడువఁజాలఁ గీర్తితో మెలఁగంగఁ
> జావు వచ్చెనేని జత్తుఁగాని
> జగములోన నెల్ల నడికంటెఁ జావుమే
> లనఁగఁ బరగుమాట యనఘ వినవె." (భార. ఆర. ౭. ౨౯౩.)

> "పుడమి నపప్రథ యగునెడఁ
> బడఁతికి దేహంబు విడువఁ బాడియకాదే
> నడికంటెఁ జావు మేలను
> నొడువు పురాతనముగాక నూతనపదమే."
>
> (భోజరా. ౭. ౧౫౬.)

కేయూరబాహుచరిత్రము నందలి:

> "నందనుండు వనము నల్లిల్లు నిధి సుర
> గృహము చెఱువు మేలు కృతి యనంగ
> జగతి వెలయు సప్తసంతానములు. (కేయూర. ౧. ౮.)

అనుపద్యము నీక్రిందిపద్యము బోలి యున్నది.

> "సుతుఁడు నిధియు వనముఁ గృతియు నల్లిల్లును
> గుడియుఁ జెఱువు ననఁగఁ బుడమియందు
> సంస్తుతింపఁబరగు సప్తసంతానముల్. (భోజరా. ౨. ౨౦౪.)

అనంతామాత్యునకు సమకాలికుడైన జక్కన విక్రమార్కచరిత్రము నందలి యీక్రింది పద్యమునకు భోజరాజీయము నందలి పద్య మనుకరణ మనుట విస్పష్టము

"చెప్పఁదలంచు సిగ్గు దనుఁజెప్పఁగనీమికి సంచలించుఁ దాఁ
జెప్పెడుమాట యెవ్వరికిఁ జెప్పకుమీ యనఁజూచు నంతటం
జెప్పకయుండరాదు మఱిచెప్పఁగ రాదని కొంకు నెమ్మెయిం
జెప్పకపోదు పొమ్మనుచుఁ జిత్తమునూల్కొనఁ జేసి యిట్లనున్."

(విక్ర. 3. ౧౫.)

"చెప్పఁగఁ జూచి సిగ్గుపడుఁ జెప్పఁగఁ జెప్పక యున్నఁదీరదేఁ
జెప్పెదఁగాకయంచుఁ దెగి చెప్పఁదలంచు నిదేమిమాటగాఁ
జెప్పుదుఁ జెప్పినం బలియుఁ జిత్తమునం గలుషించునో పరుల్
చెప్పెడువార్త కాదనుచుఁ జెప్పఁగఁబూనును జెప్పఁగాదనున్."

(భోజరా. ౪. ౨౫౯.)

ఇట్లింకను బూర్వకవుల యనుకరణములు చూపవచ్చును. అప్పకవి చెప్పినట్లు 'పూర్వకవి వాక్ప్రయోగదక్షత' కవికుండవలసిన లక్షణములలో నొకటి. ఆలక్షణ మనంతామాత్యునకుఁ గలదనుటకుఁ బూర్వోదాహృతపద్యములు చాలును.

అనంతామాత్యుఁడు పూర్వకవుల ననుకరించినట్లే యనంతామాత్యు ననుకరించినతరువాతి కవులును గలరు. అందుఁ బ్రసిద్ధులలోఁ బింగళి సూరనార్యుఁ డొకఁడు.

"మగఁడెఱుఁగవలయుఁ గాదే
మగువ యెఱుఁగవలయుఁ గాక మనుగడ తెఱఁ గ
మ్మగువయు మగఁడును వెలిగా
జగమున సంసార మెట్లు జరగును జెపుఁడీ."

(భోజరా. ౬. ౧౨౬.)

"కాంతుఁ డుచితజ్ఞుఁ డైనను
గాంతకు సిగ్గువడఁ జెల్లుఁగాక కటకటా!
కాంతుఁడు సిబ్బితికాఁడై
కాంతయు నల్లైన నెట్లు కాఁపుర మింకన్." (కళా. ౪. ౬౬.)

ఈ యుభయపద్యములకుఁ జాలపోలికలు గలవు కదా!

"అక్కట మోసపోయితి ననర్ఘమణీఖని చేతి కందియుం
దక్కకపోయిన ట్లతఁడు దాఁ జనుదెంచియు దున్నిపోయె....
(భోజరా. ౨. ౧౩౬)

"శ్రీయుతమైన దివ్యమణి చేతికి నబ్బఁగఁబాఱవైచి త
చ్ఛాయ యొకింతయున్కిఁగని చాలఁగ్రహించితి గాజుపూసకై.
(కళా. ౮. ౨౮.)

ఇది పైదానికి మెఱుఁగు. ఇట్టి యనుకరణము లితరకవుల వనేకము లున్నవి. విస్తరభీతి నింత విరమించితిని.

అనంతామాత్యుఁ డటు కవిత్రయాదులకుఁ దరువాతివాఁడు నిటు ప్రసిద్ధిగన్న ప్రబంధకవులకుఁ బూర్వుఁడు నైనకారణమున నీతనివర్ణనములును బ్రయోగములును బరిశీలనార్హములు. ఈతనికావ్యమున నష్టాదశ వర్ణనములు నొప్పారుచున్నవి. అందద్భుతవర్ణనములఁ గ్వాచిత్కముగఁ జేరుకొందను. పురవర్ణనమున ధారానగరవర్ణన మత్యంతప్రతిభాయుతము.

"సారకవీంద్ర చాతకవిశాల హిరణ్మయ వృష్టిధార ని
స్సార దరిద్ర భార తరుషండ విలాసకుఠారధార సం
సార కృశానుతప్తజనశైత్య కరామృతధార గాక యా
ధార తలంప నన్యవసుధారమణీశ పురోపమానమే.
(భోజరా. ౨.౮౫)

౨. ౧౧, ౭. ౮౮ మున్నచోట్ల గంగానదీవర్ణనము విరాజిల్లుచున్నది. ౧. ౧౧౦ యందు హేమకూట వర్ణనము, ౩. ౧౪౯, ౧౮౩ లయందు ఋతువర్ణనమును జేయఁబడియున్నవి. పలుతావుల సూర్యచంద్రవర్ణనము లుండుటచే నొకచోట యద్వితీయముగా విపులముగా వర్ణించి మఱియొకచో నద్భుతముగ నొకకందపద్యమున వర్ణించుట కాననగును. ఇది యనంతామాత్యుని వర్ణనావైశిష్ట్యము:

"జక్కవ లలరఁ జకోరము
లుక్కఱఁ గమలములు విరియ నొగిఁగైరవముల్
స్రుక్క సమస్తజనంబులు
మ్రొక్క దిశలు వెలుఁగ భాస్కరుఁడు పొడతెంచెన్." (౧. ౧౩౨)

౩. ౧౮౮, ౧౮౯ మున్నగుస్థలముల జలక్రీడయు, ౩. ౧౬౮ మొదలగు సందుల నుద్యానవనము, ౧. ౧౧౮ లో మధుక్రీడ, ౪. ౧౦౯, ౧౧౦ లలో రతిక్రీడ, ౩. ౨౧౩, ౨౫౫ మొదలగుతావుల విరహము, ౪. ౯౯లో వివాహము, ౬. ౩౧౮ మొదలగుపట్ల పుత్రోదయము, ౬. ౨౧౨, ౨౦౫ గలచోటుల యాత్రయు, ౫. ౧౧౮ లో యుద్ధము, ౩. ౧౯౪, ౫. ౭౬, ౭ ౧౨౦, ౧౨౮ మున్నగుచోట్ల ద్యూతము, ౨. ౫౨, ౫౩, ౫౪ మున్నగుస్థలముల రాజవర్ణనము నద్భుతముగా వర్ణింపఁబడినవి. నీతివర్ణన మెల్లెడల నద్భుతముగా ద్యోతకమగుచుండును.

"ఆడకు మసత్యభాషలు
కూడకు గొఱగానివానిఁ గొంకక యొరులె
గ్గాడిన నెదురుత్తర మీఁ
జూడకు విని వినని వానిచొప్పునఁ జనుమీ." (౬. ౩౧)

ఇంతసులభముగనే నీతివర్ణనము విలసిల్లుచున్నది.

శైలి: వైశిష్ట్యము

గానమాధుర్యము నర్థసౌలభ్యము నవరసోచితపదప్రయోగము సహజగాంభీర్యము, మార్దవము, ఔపదేశికసంపత్ప్రకటనయోగ్యత మున్నగు నుత్తమశైలికిఁగల సద్గుణము లీభోజరాజీయమున విరాజిల్లుచుండుటే యిందలి వైశిష్ట్యము. ఇందలి ప్రతిపద్యము నేదో యొకసుగుణము గలదనుట స్వభావోక్తి. కావుననే యామూలాగ్రముగ నొకే విధమున మృదుమధురముగనున్న భోజరాజీయమందలిశైలి పట్టువడిన యాంధ్రకవిపుంగవు లల్పసంఖ్యాకులే కలరని పలువుర యభిప్రాయము. అనంతామాత్యుని పైశైలీప్రాభవమున కొక్కొక్కదాని కొకటిరెం డుదాహరణములఁ జూపుదును.

"చూతనవీనపల్లవము శుద్ధసువర్ణపునీటఁ దోఁచి కం
జాతరవంబుపైఁ గలయఁ జల్లి మెఱుంగులఁ దోమితోమి..."
(౩. ౧౪౭)

"ఆలోలాక్షీలలాట వక్త్రసదృశత్వాకాంక్షఁ జంద్రుండు దా
బాలత్వంబు వహించి చూచియు నొగిం బ్రౌఢత్వముం బొందియుఁ

బోలంజాలక జాలిపొంది వగలంబో ల్పేది లోఁగుందెఁ గా
కాలోకింపఁ దదీయబింబము కురంగాకారముం గూరునే."
(౩. ౧౪౭)

"ఆలోలమందానిలాధూతలతమాడ్కి..." (౭.౧౦౯)
మున్నగుపద్యములందలి గానమాధుర్య మనుభవరసికు లెఱుఁగుదురు.

అర్థసౌలభ్యమునకుఁ గావ్యమంతయు నుదాహరణమే యన్న నతిశయోక్తి కాదు.

"దేవర పెట్టినచోటం
గావలియుండుదు మొకించుకయు నాలస్యం
బేవంకను లేదు ధరి
త్రీవర! కడు మోసపోయితిమి విను నిన్నన్."

"ఏమిద్దై వికంబో యెఱుఁగ మెవ్వారును
జూచ్చి వెళ్ళి నట్టి చొప్పు లేదు." (౨. ౧౨౬, ౧౨౭)

"ఇటు తగునయ్య? విప్రుఁడ వహీనగుణాఢ్యుఁడ వీవు నే
మిఁటి కిటువంటి దౌష్ట్యము? శమించునె మజ్జనకుండు విన్నఁ? ద
క్కటిజను లేమియందురు? మదిఁ గాంక్షయె గల్గిన నగ్నిసాక్షిగాఁ
జిటికెనవట్టి కాక వృథసేయుట ధర్మమె కన్యకాత్వమున్." (౮.౨౨౩)

మున్నగు పద్యము లరఁటిపండొలిచి చేతి కందిచ్చినట్లున్నవి.

నవరసోచిత మగుశైలి కీక్రిందిపద్యములు చూడవచ్చును. శృంగారమునకు ౮. ౧౦౯, ౨౪౬; ౭. ౧ ౮ మున్నగుపట్టులు తార్కాణములు. కరుణరసమునకు

"పిడుఁ గడిచినక్రియ నీలెం
బొడిచినగతి గుండె వగిలి భూస్థలిమీఁదన్
బడి పొరలుఁ దన్నుఁ గొను ను
గ్గడువుగఁ గన్నీరునించు గడగడవడఁకున్."

'ఓ'యనుఁ 'దల్లీ! నీవెట
పోయెద' వను 'నన్ను డించి పులివాత బడన్

బోయెదవే?' యనుఁ 'జెల్లం
బో!' యను 'నింకేటిబ్రతుకు పోనాకు' ననున్. (౬. ౪౩, ౪౪)

మున్నగు తావులు కఠినహృదయునైనను గరఁగించివేయును. మఱియు ౧. ౧౦౪ న బీభత్సము, ౫. ౧౧౭లో వీరరసము, ౪. ౫౭, ౭. ౬౯ లలో హాస్యము, ౫. ౨౩౨, ౬. ౩౧౫ లలో రౌద్రము, ౬. ౧౧౧, ౨౪౭ లలో భయానకము, ౧. ౧౩౭; ౨. ౧౧౩; ౩. ౨౪, మున్నగు తావుల నద్భుతరసము వెల్లివిరియునపు డందలిశైలి యోంతయుఁ దత్తదను గుణముగా విరాజిల్లుచున్నవి. ఇఁక శాంతరసముఁ జూపుపట్లు-మావళుఁడు దత్తాత్రేయునిప్రవర్తనమునకు మోసపోవక యభీష్టసిద్ధి పొందుటయు, మదనరేఖ బ్రహ్మరాక్షసునికడఁ బ్రశాంతముతో మాటాడి యాతనిహృదయమును గరఁగించుటయు,గోవు వ్యాఘ్రమునకు బెదరక చూపిన శాంత కరుణములును నద్భుతముగా నున్నవి.

అనంతామాత్యునిశైలికి సహజగాంభీర్యము కలదు. ఎట్టిపట్టుల నైఘఁ దడవుకొనుట కాని కృత్రిమపునడక కాని యాతనిపద్యములకు లేవు. ప్రతిపద్యమును సహజధారాపూర్వకమైనదే:

"యాగంబుల నగుఫలమును
యోగంబులవలన నగుసమున్నతియును నా
నాగమ విహితార్చలనగు
భోగము శ్రీరంగసేవఁ బొలుపుగ నెగడున్." (౧. ౧౭౧)

"ఆనృపాలపుత్రి యాదటఁ గైసేసి
యతనుపాలి కరుగు రతియ పోలె
నరిగి యరిగి మున్ను గురుతనూజునితోడఁ
బల్కినట్టి కడిఁది బాసఁ దలఁచి." (౪. ౨౫౨)

"ఉన్నతశారదాభ్రరుచినొప్పెడు మేను తటిద్వ్రజాకృతిం
జెన్నెసలారు కెంజడలు చేనొకవీణెయు మర్త్యకోటికిం
గన్నుల పండువై మెఱయఁగా దివి నుండి తపఃప్రభావ సం
పన్నుఁడు వచ్చె నారదుఁ డభంగుఁడు వంజరుఁడున్నచోటికిన్."

"గాఢనీహారంబు గప్పినఁ దప్పునే (౬. ౩౯౪.)

మార్తాండబింబ విస్ఫూర్తి పెంపు." (౭. ౨౦౬)

మున్నగు పలుతావు లిందులకు సాక్షీభూతములు.

అనంతామాత్యుని పదము లొక్కొక్కప్పు డతిమృదువులై కుసుమ పేశలములుగా నుండును.

"పెదవులు గదలెం గదలవు
రదనంబులు గానవచ్చె రానుపాటిఁ
మృదు వచనరచన లెసఁగఁగ
ముదిత యతని హృదయకమలముం గరఁగించెన్." (౫. ౧౬౬)

"తావిఁగొనని పుష్పదామంబు విధమునఁ
జిమ్ముఁబడని మావిచిగురు భంగిఁ
ద్రావఁబడని నవసుధాధార పగిదిని
జెలువఁ జూడ సురతచిహ్న లేదు." (౫. 3౨౭)

"రతిఁ జేసిన కరకమలము
చతురత మతి మఱవకుండఁ జతురాననుఁ డీ
సతిఁ జేసె ననఁగఁ జక్కని
యతివ యొకతె గలదు బ్రాహ్మణాన్వయ మందున్." (3. ౬౪.)

పై పద్యములందలి ప్రతిపదమును మృదుమధురమే కదా!

ఇఁక నౌపదేశికసంపత్ప్రకటనయోగ్యతకు శైలికి ప్రత్యక్ష ప్రబోధకత (Directness of appeal) యావశ్యకము. అది యీక్రింది పద్యములందే కాక పలుతావుల వెల్లివిరియుచున్నది.

"నమ్మఁదగదు పరుల నమ్మినే నేజాతి
వానినైన నమ్మవచ్చుఁ గాని
స్వర్ణకారకుండు సర్వ జగద్ద్రోహి
కాన వాని నమ్మఁగాదు తెలిసి." (౫. ౧౭౯.)

మఱియుఁ బులి కాహారముగాఁబోవు గోవు బిడ్డకిట్లు బోధించును.

"ఆడకు మసత్యభాషలు
కూడకు గొఱగాని వానిఁ గొంకక యొరు లె

గ్గాడిన నెదురుత్తర మీఁ
జూడకు విని వినని వాని చొప్పునఁ జనుమీ."

"ఒంటిఁ జరింపకు పొలమున
నింటికిఁ గడు ప్రొద్దు గలుగ నేతెంచుచు రా
వెంటఁ బడి పోడుచు గోవుల
జంటఁ జనకు క్రయ్యఁబడకు సందడి యగుచోన్." (౬.౩౧, ౩౨.)

ఈవిధముగా భోజరాజీయమునందలి శైలి యుత్తమోత్తమముగా నెన్నఁబడుచున్నది. మఱియు నీకావ్యమునఁగల సామెతలు సాంప్రదాయికములు కావ్యౌదాత్త్యమునకుఁ గారణభూతములైనవి.

సామెతలు: సాంప్రదాయికములు

భోజరాజీయమునఁ గానవచ్చు సామెతలలో ముఖ్యమైనవివి. దుక్కొద్దు దేశాంతరమరిగినట్లు, పెన్నిధిఁగన్న పేద, మును కన్నుల కొద వినవలవంత పిదప వీనులకుఁ జోఁకినట్లు, పనివడి వెదకం జనవలసిన సొమ్ము దాన చనుదెంచిన చాడ్పున, ముల్లుముంటఁగొనిపుచ్చక రోఁకటఁ బుచ్చవచ్చునా ? చచ్చునంతటి కలఁగన్న మేలుకొనియే యుండవలె, నుడుము నడిఁకియున్న నడుఁకునె బడెపెట్లు, పులియున్న పొదరింటి పొంతఁ జనుట, తలియఁబెట్టిన యశనముఁ ద్రోచి పిదపఁ గుడిచెద నను పాఁడు బేల, చెప్పెడువారు చెప్పిన వినియెడు వారికి వివేకము వలదా? గడివోయినపువ్వులు రసికుఁడగు వాఁడు ముడుచునా?, కుడుఁకఁబెట్టి కంచ మాఱడిఁగొనుట, మూఁగవాని యెదుట ముక్కు బఱట రాని చందము, పులిమీసల నుయ్యేల లూఁగినట్లు, ఆవగింజంత భూతిపూయు వానికి గుమ్మడికాయయంత వెట్టి గలదు, సడికంటె జావు మేలు, గ్రుడ్లు తినుటయే కాక గూడెక్కి కూసినట్లు, పులికిఁ బుట్టినకూన వేఁడిపులు మేయదు, గోరప్రాయఁగ నేత్రైనట్లు, తెవులు దీరినఁ జాలుఁగాక వెజ్జు కామదేవుండు కావలయునే!, వేసరినవాఁడు వెలుఁగు మీఁద వేసీళ్లు చల్లినట్లు. ఇందువచ్చు సాంప్రదాయికములు లేక నానుడులు: అఱికాలు తడి గాకుండ, మందు కడిగినను, కాయోపఁడోఁకలరూపు చెప్పుము, అగ్నిసాక్షిగాఁ జిటికెనవట్టు, నాతులమాటలు వడగండ్లగుండ్లు, కడళ్ల

మొ త్తములు, భిన్న ఘటతోయములు, పూసగ్రుచ్చిన భంగి, పోనున్నది పోకమానదు, కాదుకూడదను, పోయివచ్చు, కన్నకడుపు, కానికిఁ గైకొనక, తల్లిమఱుఁగుబిడ్డ, "చులుకన జలరుహజంతువు చులుకన తృణకణము దూది చుల్కన యిలనెగయు ధూళిచుల్కన చులుకన మఱి తల్లిలేని సుతుఁడు," పూరిమేపు, తలపువ్వులు వాడకుండ, గోళ్లు మీటుకొను, ఏపనికైనను బొడ్డు పంపలేకపోవుట, చీమచిటుకన్నను, మాటికి మాటికి మాటలేటికి, చెక్కడివినఁ బాలు వడుచు, కన్నులు దెఱవనిశిశువు, మున్నగునవి.

వ్యాకరణ చ్ఛందో విశేషములు

అనంతామాత్యుఁడీభోజరాజీయమునఁ జాలవఱకుఁ గవిత్రయ నియమానుసారముగనే పోయియున్నాఁడు. కవిత్రయమునకు వలెనే ధర్మవాచక మగు 'సహాయ' పదమును వాడియున్నాఁడు, యథేచ్ఛ, నిరాశ, సంసర్గ మున్నగు పదములు చరిత్రాదులలోఁ జేరినవనియెంచి కాఁబోలు యథేచ్ఛముగా ప్రయోగించినాఁడు. చిన్నయసూరి వ్యాకరణ విరుద్ధమయిన చేయుధాతువు మీఁది చేతురూపము బహుధా యిందుఁ గాననగుచున్నది. 'పుష్పకోమలి' యని రెండు మూఁడు చోట్లఁగలదు. ఇది వ్యాకరణ విరుద్ధ మగుటచేతను నిర్ధారకస్థానముల లేక పోవుట చేతను సరియగు రూపమైన 'పుష్పకోమల' గా సవరించియున్నాను. ఇట్లే 'అర్ధరాత్రి' యని ప్రయోగించినచోట్లను ఛందోభంగము లేకుండుటచే నర్ధరాత్రమని దిద్దినాను. షష్ఠీవిభక్తియందు నగాగమ లోపము పలుతావుల నిందుఁ గానవచ్చుచున్నది. రౌతుకెరఁగు, మందు కడుగు మున్నగునవి. ౪. ౧౦౧ లో 'హేమాపాత్రము' లని నిరంకుశప్రయోగము గానవచ్చుచున్నది. 'విను' ధాతువుపై విందుము అనురూపమునకు 'విందుము' అనిరూపము రెండుమూఁడుచోట్ల ప్రాసస్థానములఁ బ్రయోగింపఁబడినది. ఇంతకుమించి వ్యాకరణవిషయమునఁ జెప్పవలసిన దింకేమియును లేదు.

ఇఁక ఛందోవిషయమున లోపము లత్యల్పములు. విశేషములు నంతగాఁ గానరావు. ఇమ్ముగ, క్రమ్మరి, మోదమ్మున అను వానితో అంబిక అని ప్రాసము నుపయోగించినాఁడు. అంబికను అమ్మికయను

రూపము గ్రాహ్యమే యగుట (చూ ఆంధ్రభాషార్ణవము ౧. ౪౦) నట్లు సవరించితిని. అలికులవర్ణ సున్నత రథాంకృతచారుసుపర్ణ' (౨. ౨౫) లోఁ బైస్థలమున యతిభ్రంశము కానవచ్చుచున్నది. దీనికి వేఱు పాఠమేమియు లభింపలేదు. ౫. ౮౫ లో లేవకమున్ననీ వితని దేవి వధింపు' మని యున్నది. ఇందు యతిభ్రంశముగాన వచ్చుటచే 'దేవి' కి బదులు 'లేమ' యని సవరించితిని. అటులనే ౧. ౭ లో 'ఏకపుంభోక్తయైన శ్రుతు లన్నియు' ననియున్నది. ఇచ్చట 'శ్రుతులెల్లను' అని సవరించితిని. ఇవి తప్ప యింతకు మించిన లోపము లేమియును నిందులేవు.

భోజరాజీయమున నితరగ్రంథముల నెచ్చటను గానరాని కొన్ని పదములు ప్రయోగింపఁబడినవి. బాలికి, బిట్టబిట్టు, బిట్టుబిళ్లు మున్నగునవందుఁగొన్ని, బాలకి యను కన్నడపద మొకటికలదు. దాని ననుసరించి బాలిక యను నర్థమున బాలికి యనుపదము గ్రహించుటకీక్రింది ప్రయోగము ప్రామాణికము.

“............బా,
లకి తనబోటి తోడ నబలా! యింది కాటుకతీఁగె పొమ్మనన్.(౩. ౧౭౫)

కాని, శబ్దరత్నాకరకర్త యేలనో యీపదము గ్రహింపనేలేదు. నిర్ధారకము కాకపోయినను బాలకి యని శ్రీనాథుఁడును క్రీడాభిరామముననఁ బ్రయోగించియున్నాఁడు.

ఇఁక బిట్టబిట్టు యనఁగా బిట్టు కామ్రేడిత రూపమని యీ ప్రయోగమే (భోజరా. ౪. ౩౨౯) శబ్దరత్నాకరమున నీయఁబడినది బిట్టుబిళ్లు బిళ్లున కామ్రేడితరూపమని శబ్దరత్నాకరమునఁగలదు. దానికిని భోజరాజీయమునే యుదాహరించినాఁడు. ఈపైపదము లిఁక యేముఖ్యగ్రంథములందును గానరావు.

భోజరాజీయ ప్రయోగముల ప్రామాణికత విషయములో నాలుగైదుశబ్దము లిట విమర్శనీయములు. ఎలనాగ, తోఁకొను, పూట, బ్రాతి—ఈ శబ్దములు సానుస్వారములా నిరనుస్వారములా యనుటకు భోజరాజీయమున నిర్ధారక ప్రయోగము లున్నవి.

“రోగమున కోడి ప్రాణ
త్యాగము సేయుటకుఁ దెంపు దలకొను మదితో
నాగౌతమి కరుగుచు నెల
నాగను బొడగంటి నొకవనస్పతి పొంతన్.” (౧. ౧౨౩)

ఇది యెలనాగ నిరనుస్వార మనుటకు నిర్ధారక మగుటచే తను సానుస్వార మనుట కాధారము లేనిఘంటువున నీయఁబడని కారణమునను భోజరాజీయ మందెల్లెడల నీపదము నిరనుస్వారముగనే గ్రహింపఁబడినది.

తోఁకొను సానుస్వార మనుటకు.

“త్రోఁకొని పోయినంత నొక త్రొయ్యలి యయ్యెలనాగనప్డు పే
రాఁకలిగొన్న బెబ్బులిరయంబునఁ గృష్ణమృగార్భకంబుపై
వీకయెలర్పఁ బెల్లడరి ప్రేయగతిన్ మరుఁదుగ్రుఁడై ననుం
దాఁకిన మూర్ఛ నొందితిని దగ్ధయునీవలఁగిప్డు తేఱితిన్. (౩.౨౨౩.)

“తేఁకువ యలరఁగ నీగతిఁ
దోఁకొని చని చదల రత్నతోరణ దీప్తుల్
ప్రాఁకెడు ఘనగృహముల న
మ్మూఁకలు విడియించె రాజముఖ్యుండెలమిన్.” (౪. ౮౪.)

“ఆఁకొనివచ్చిన విప్రులఁ
దాఁకింపక యశన మిడుము తత్పరమతి న
బ్బ్రాఁకలి సేయకు కుడువం
దోఁకొని రాపర్వమగు తిథుల మనవారిన్.” (౬. ౧౬౧.)

వీని ననుసరించియుఁ జిన్నయసూరి నిఘంటువుననుసరించియు, మఱియుఁ గేయూరబాహుచరిత్రము నందలి

“త్రోఁకొని వచ్చినిం దోలుతఁ దోయజషండము దన్ను తియ్య నీ
రేఁకటవోవఁ గ్రోలి దరి నిమ్మగు చెట్టులనీడ నుండఁగాఁ
బ్రోకలు గట్టి వారిఖగముల్ తమముందఱఁ బెట్టుమీలఁ బే
రాఁకలి యల్లఁ దీర్చుకొని యచ్చట వద్దిన రాత్రముండుచున్.
(౩. ౮౭.)

అను ప్రయోగము ననుసరించియుఁ దోఁకొను సానుస్వారమగుట నీభోజరాజీయ మందెల్లెడల నట్ల సవరించితిని. ఈసందర్భమున శబ్దరత్నాకరము సూర్యరాయాంధ్రనిఘంటువు నిచ్చియున్న భారతప్రయోగము నిర్ధారకము కాదనియు నాస్థలముననే పాఠభేదములు కలవనియుఁ జిన్నయసూరి దాఁకొని యనుపాఠముఁజూపి తోఁకొను సానుస్వారముగాఁ గైకొనియుండుట నానిర్ణయమునకుఁ బ్రబలోపకారియనియు గ్రహింపవలసియున్నది.

పూట సానుస్వారమని నైఘంటికుల యభిప్రాయము. కాని దానికిఁ గవిత్రయ నిర్ధారకప్రయోగములు లేవు. కావునఁ బ్రాచీనులలో నొక్క భోజరాజీయముననే యిది నిరనుస్వారమని యీక్రిందిప్రయోగము దెల్పుచున్నది.

"ఏటికి వేగిరపడ నీ
పూట నిచట నిలిచి తేపు పోవఁగరాదే
మాటలఁ దప్పితి తెరు వి
చ్చోటికి నాయుడకుఁ బడియెఁ జుమ్మది యనినన్." (ఆ. ౨౮౧)

కాని భోజరాజీయమున కర్వాచీనములైన రామాభ్యుదయము రాజవాహనవిజయముల నీపదము సానుస్వారమనుటకు నిర్ధారకముగా నున్నది. ఐన, ననంతామాత్యునిదృష్టిలో 'పూట' నిరనుస్వారమగుట నిందట్లే సవరింపఁబడినది.

ప్రాతి సానుస్వారమన్న శబ్దరత్నాకరము దోషదూషితమనుటకు భారతప్రయోగములే కలవు. దానికిఁ దోడు భోజరాజీయమందలి యీ పద్యమొకటి!

"నూతుల దరులను లోఁతగు
పాతఁటి కసవులను నెట్టి పచ్చికయున్నన్
ప్రాతిపడి మేయఁబోకుము
మూతి నిడకు ముగ్రసత్త్వములు గలనీటన్." (ఆ. 3౫.)

ఈపైఁజూపిన వన్నియు భోజరాజీయము పరమప్రామాణికమనుటకుఁ జాలును. ఇంక ననేకాధారములు కలవు.

పాఠపరిశీలనము : చిన్నయసూరి

ఈభోజరాజీయపాఠపరిశీలనమునఁ జిన్నయసూరి చక్కని ప్రయోగములు కొన్ని సేకరించితిని. అందుఁ బ్రధానములగు పట్టులు నాలుగైదు చూపుదును. ౬. ౧౩౩ లో శకటరేఫ సాధురేఫ సాంకర్యముగల ప్రాసమున్నది. ఇందుఁదక్క—దుకె భోజరాజీయమం దిట్టి సాంకర్యములేదు. దానికి 'మాఁ,తో రొదగొట్టు' అనుచోటఁ 'దా, దూలులుపల్కు' నను చిన్నయసూరిపాఠ మీసాంకర్యమునకు వ్యతిరేకముగఁ గనఁబడినది. కావున నాపాఠమే గ్రహించితిని. ౭. ౧౦౮ లో 'నవ్వుచు, యవ్వనలక్ష్మి' యను ప్రాసముకలదు. యవ్వనము వ్యాకరణ విరుద్ధము. దానికి చిన్నయసూరి పాఠములలో 'నావుడు, యావనలక్ష్మి, ఊవిళులూరు, ఈవిధము' అని యున్నది. కావున దానినే నే గ్రహించితిని. ౫. ౨౦౧ లోఁ గూడ 'అ' 'ఁ' సాంకర్యమున్నది. దానికిని 'చేరుట' యను నాల్గవపాదమున 'చీఱుట' యను చిన్నయసూరి పాఠము లభించినది. దీనినే సూర్యరాయాంధ్రనిఘంటువుసైతము గ్రహించినది. కాన. నేనును గైకొంటిని. మఱికొన్నిచోట్లఁ గొంత సరసముగానున్న చిన్నయసూరి పాఠములను పుటక్రిందఁ జూపితిని. అట్లే శబ్దరత్నాకరపాఠములనుసైతము కొన్ని గ్రహించి కొన్నిటిఁ గ్రిందఁ జూపితిని. సందర్భశుద్ధిలేనిపాఠముల నెల్ల విడిచిపుచ్చి నాకు లభ్యములైన మంచిపాఠము లెల్లఁ గైకొంటిని. చిన్నయసూరివైనను శబ్దరత్నాకరమునందలివైనను గొన్నితావుల నసందర్భములుగాఁ దోఁచినవెల్లఁ ద్యజించి నేను సరిచేసిన ప్రతిష్ఠలమునను దగిన యాధారములఁ జూచియే యట్లొనర్చితిని. వాని నెల్ల నిటఁ బేర్కొనుట కవకాశము లేమి విడిచిపుచ్చితిని.

అనంతామాత్యుని యితరకృతులు

అనంతామాత్యుని యితరకృతులు మన కింతవఱకు లభ్యమైనవి రెండు కలవు. అవి రెండును ఛందోదర్పణము, రసాభరణము నను లక్షణగ్రంథమును. రసాభరణము నాంధ్రసాహిత్యపరిషత్తువారును, ఛందోదర్పణమును విపులమగు పీఠికతో శ్రీ వావిళ్ల రామస్వామి శాస్త్రులవారును బ్రకటించియున్నారు. అనంతామాత్యుని గ్రంథము లన్నియు స్వతంత్రములేకాని దేనికి ననువాదములుగావు. రసాభరణ

మునఁ బ్రథమాశ్వాసమున స్థాయిభావములకు లక్ష్యలక్షణములు విభావానుభావ సాత్త్వికభావలక్షణములు శృంగారాదినవరసముల కుదాహరణములు నిచ్చియున్నాఁడు. ద్వితీయాశ్వాసమున నాలంబనోద్దీప నాదుల లక్షణములు మున్నగునవి తెలిపి యష్టవిధసాత్త్వికభావము లకు ముప్పదిమూఁడు సంచారిభావములకు సోదాహరణముగా లక్షణ ములఁ దెల్పినాఁడు. తృతీయ చతుర్థాశ్వాసముల విప్రలంభ శృంగార మును నితరవిధములను విస్పష్టముగాను, నాయికానాయకులఁ గూర్చియుఁ దెల్పినాఁడు. ఇఁక ఛందోదర్పణము చక్కని ఛందో గ్రంథము.

ఉపసంహారము

అనంతామాత్యుని భోజరాజీయ మాంధ్రసారస్వతమున వెలసిన యుత్తమగ్రంథములలో నొకటి. ఇందలి ధర్మోపదేశము పరమప్రశస్తము. ఈవిషయమున నీకావ్య మద్వితీయమే యనుట కెట్టి సందియమును లేదు. ఆభ్యంతర లీనమైన కవితాపరిపాకమునఁ జక్కని ప్రతిభావ్యుత్ప త్తులు లీనమై కావ్యగౌరవము నినుమడింపఁ జేసినవి. అందుచే ననంతా మాత్యుఁడు దన కావ్యాంతమునఁ గోరినట్లు:

"అఖిల జగత్సేవ్యమై భూమిపై నహో
బలము దా నెందాఁక వెలయుచుండు
నాతీర్థమందుఁ బ్రఖ్యాతమై భవనాశ
నీ నది యెందాఁక నెగడుచుండు
నా మహానదిపొంత నత్యంతపూజ్యమై
గరుడాద్రి యెందాఁకఁ గదలకుండు
నయ్యద్రి శిఖరంబు నందును నెందాఁక
శ్రీనృసింహస్వామి స్థిరతనుండు
నస్మదీయకృతియు నందాఁక సంతత
శ్రావ్యమై సమస్త సభలయందు
విస్తరిల్లుఁగాత వివిధ కథానూత్న
రత్నభూషణాభిరామ మగుచు."

భోజరాజీయ మాచంద్రతారకముగా నాంధ్రసారస్వతము నలరించు ననుట కెట్టిసందియమును లేదు. ఈ సత్కావ్యరత్నమును సర్వాంగ సుందరముగాఁ దిరిగి ముద్రించుతలంపున దీనిని సంపాదించి భూమిక వ్రాయ నాకమితప్రోత్సాహము నొసఁగి యాదరించిన భాషోద్ధారక బ్రహ్మశ్రీ వావిళ్ల వేంకటేశ్వరశాస్త్రి గారికి నేనెంతయుఁ గృతజ్ఞుఁడను. శ్రీవావిళ్ల వా రాంధ్రభాషాయోష కొనర్చుచున్న మహాసేవఁ గొని యాడఁ జూచుట సూర్యభగవానుని దీపముతోఁ జూపుటే యగునని మనవి చేయుచున్నాను. శ్రీ వేంకటేశ్వరుఁడు శ్రీవేంకటేశ్వరశాస్త్రి వర్యున కాయురారోగ్యభాగ్యము లొసంగి యాచంద్రార్క మాంధ్ర భాషాయోష కనుంగు పుత్త్రు లనుమహాఖ్యాతి నొసంగుఁగాక !

కాకినాడ.
20-10-'44

ఇట్లు విన్నవించు బుధజన విధేయుఁడు,
బులుసు వేంకటేశ్వర్లు, బి. ఏ.

విషయసూచిక

విషయము. పద్యము

ప్రథమాశ్వాసము

1 ఇష్టదేవతాస్తుతి ... 1
2 పూర్వకవిస్తుతి ... 4
3 స్వవంశాభివర్ణనము ... 12
4 షష్ఠ్యంతములు ... 80
5 కథాప్రారంభము ... 85
6 మహానందపు మహీపతిచరిత్ర ... 88
7 గౌతమీదేవి మహానందునకుఁ బ్రత్యక్షమగుట ... 100
8 దత్తాత్రేయదర్శనము ... 112
9 దత్తాత్రేయుఁడు మహానందునకుఁగల కుష్ఠరోగమును బోఁగొట్టుట ... 135
10 శ్రీరంగాదిక్షేత్ర మహిమాభివర్ణనము ... 149

ద్వితీయాశ్వాసము

11 ప్రయాగప్రభావము ... 2
12 భోజుని జన్మకారణము ... 27
13 భోజునిరాజ్యపాలనము ... 44
14 భోజునకు సిద్ధదర్శనమగుట ... 63
15 సిద్ధుని తనపురంబునకు భోజుఁడు పిలుచుకొని వెళ్లుట ... 81
16 సూర్యాస్తమయచంద్రోదయవర్ణనములు ... 98
17 సర్పటి భోజునింటఁజేసిన చిత్రకార్యము ... 114
18 సూర్యోదయవర్ణనము ... 115
19 భోజుఁడు సర్పటినిబిలిపించుటకుఁ జేసినయుక్తి ... 139
20 సర్పటి భోజునిశపించుట ... 164
21 సర్పటి వారస్త్రీవలన ధూమవేధివిద్యను మోసముచే గ్రహించుట ... 169
22 భోజునిశాపవిమోచనము ... 214

తృతీయాశ్వాసము

23 భోజుఁడు సర్పటిని తనయింటభిక్ష సేయుమనికోరఁగాఁ దననియమంబుఁ జెప్పుట 4
24 నిరాహారి, సదాబ్రహ్మచారి, వీరలమహిమము ... 9
25 మాధుకరప్రభావమునుగుఱించినదుష్టపతి సత్పతి వీరలచరిత్రము ... 33
26 యోగికి వేఁడిమైనపాయసదానంబొసంగినందులకుఁ గలఫలము ... 45
27 మట్టిముద్దను యోగికింబెట్టినందువలనఁ గల్గినఫలము ... 63
28 చండాల దంపతుల చరిత్రము ... 97
29 అతిథిపూజాప్రభావము ... 121

విషయము.		పద్యము.
30 పుష్పగంధిచరిత్రము	...	127
31 వనవిహారము	...	166
32 పుష్పగంధి రత్నమండనుని మోహించుట	...	190
చతుర్థాశ్వాసము		
33 పుష్పగంధి రత్నమండనుల విరహము	...	6
34 మూషకవనితావృత్తాంతము	...	16
35 పుష్పగంధి వివాహప్రయత్నము	...	30
36 పురోహితులు పుష్పగంధి యదృష్టముఁ దెల్పుట	...	36
37 బ్రాహ్మణాశీర్వచనప్రభావము	...	49
38 పుష్పగంధి రత్నమండనుల వివాహము	...	83
39 రత్నమండనుఁడు వనవిహారంబు సేయుచుండ బ్రహ్మరాక్షసుఁడు మ్రింగవచ్చుట		114
40 గోవ్యాఘ్రసంవాదప్రారంభము	...	129
41 చాకిత మునితపంబుఁ జెఱుచుట	...	143
42 ముని పందిజన్మంబునొందుట	...	168
43 పందిరూపుఁడగుమునికి భగవత్ప్రత్యక్షము	...	189
44 సత్యవాక్యమాహాత్మ్యము	...	216
45 గురుపుత్త్రుండు మదనరేఖను మోహించుట	...	223
46 మదనరేఖగురుపుత్త్రు నిదగ్ధఁ జేసినప్రతిన నెరవేర్పభర్తయనుజ్ఞఁబడయుట		238
47 బ్రహ్మరాక్షసుఁడు మదనరేఖను బట్టుకొనుట	...	287
48 మదనరేఖకుఁ దత్పతికి శ్రీహరి ప్రత్యక్షమయి వరంబులొసంగుట	...	342
పంచమాశ్వాసము		
49 పావకలోముని చరిత్రము	...	4
50 పావకలోముఁడు హంసయంత్రముచేసి యనుమతీదేవిని బరిణయంబగుట		27
51 మిత్త్రుఁడగు కంసాలికుంభి పావకలోముని మోసముచేసి అనుమతీదేవి నపహరింప యత్నింపరాక్షసుఁడామెను హరించుట	...	34
52 పావకలోముఁడు తనభార్యంగానక విలపించుట	...	54
53 పావకలోముఁడు గుహను బ్రవేశించుట	...	72
54 గుహయందలిస్త్రీలు రాక్షసునికథను పావకలోమునకుఁ జెప్పుట	...	79
55 పావకలోమ రాక్షసస్త్రీ సంవాదము	...	110
56 రాక్షసవధఁజేసి పావకలోముఁడనుమతిని జూచుట	...	117
57 కుంభి యనుమతిని హరించుట	...	125
58 పావకలోముఁడు గుహవెలువడి తనపట్టణముఁ జేరుట	...	154
59 యోగినీవర్ణనము	...	163

విషయము. పద్యము.

60 కుంభి పావకలోమునికాళ్లు నఱికించుట ... 181
61 పావకలోమునకుఁ బార్వతీపరమేశ్వరులు ప్రత్యక్షమగుట ... 195
62 పావకలోమునికిఁ బెంపుడుతల్లిహితముపదేశించుట కోమలభాస్కరునికథ 209
63 కంసాలి శాంభునిభార్యనపహరించుట ... 241
64 శాంభుఁడు కంసాలిని వధించి తనభార్యం గైకొనుట ... 261
65 అనుమతీదేవిస్థితి ... 266
66 అనుమతి పావకలోమునిగాంచి యతనిఁ బొందుట ... 287
67 అజవక్షుఁడు పావకలోముని దెలిసికొని కుంభిని వెడలఁగొట్టుట ... 313
68 సుశీలయనుకన్యకాచరిత్రము ... 326
69 సుశీల యిచ్చకుంటును బెండ్లియగుట ... 341
70 త్రిమూర్తులు వారిరువురకు వరమిచ్చుట ... 356
71 పావకలోముని నిజస్థితిఁ దెలిసి యజవక్షుఁడు సంతోషించుట ... 330

షష్ఠాశ్వాసము

72 గోవు ప్రతిజ్ఞచేసి పులిని వీడ్కొని కొడుకుదగ్గఱ కేఁగుట ... 10
73 పుత్రునకు గోవుహితోపదేశముచేయుట ... 25
74 గోవును బులి చంపక విడిచిపెట్టుట ... 61
75 శ్రీవిష్ణువు ప్రత్యక్షమై వరములిచ్చుట ... 73
76 రత్నమండనుని తలిదండ్రులశోకము ... 85
77 రత్నమండనుఁడు సత్యవ్రతంబును దప్పకుండుట ... 110
78 బ్రహ్మరాక్షసుని నోటినుండి తనభర్తను బుష్పగంధి విడిపించుట ... 114
79 అన్నదానపరుఁడగు విప్రునివదినెలు తమకాంతులకు దుర్బోధనముచేయుట 121
80 విప్రుఁడును నతనియన్నలు వేఱుకాపురముచేయుట ... 141
81 విప్రుఁడు కాశికిఁబోవుచుఁ దనభార్యకుహితముఁ జెప్పుట ... 160
82 అల్పాహారముఁ బెట్టుట దోషమనుటకుఁ దగినకథ ... 165
83 భగవంతుఁడు విప్రస్త్రీనిబరీక్షించుట ... 186
84 వరములను శ్రీవిష్ణువు విప్రస్త్రీకిచ్చుట ... 199
85 విప్రుఁడు శ్రీవిశాలాక్షీదర్శనముచేయుట ... 220
86 విప్రునకు వ్యాధుఁడాతిథ్యమిచ్చుట ... 228
87 రాజశిశువు బ్రాహ్మణునకన్నదానమహిమము జెప్పుట ... 256
88 విప్రునకు గంగ చెప్పిన మాదిగవానిచరిత్ర ... 266
89 ఐంద్రకాయకథ ... 272
90 కర్కటబాలుఁడు గంగాయాత్ర చేయఁబోవుచుఁ జచ్చుట ... 399
91 ఐంద్రకాయజన్మములు ... 313

విషయము.		పద్యము.
92 వంజరునిగంగాయాత్ర	...	330
93 పుత్రశోకమునఁ గుందుమనిబ్రాహ్మణుఁడు చెంచెతకుశాప మిచ్చుట	...	345
94 పితృమరణంబువిని వంజరుఁడు తనపురంబునకువచ్చుట	...	365
95 ఇంద్రుఁడు వంజరునితపోభంగముచేయ నారదునింబంపుట	...	380
96 మాయాసిత్రదత్తుఁడు గంగను భూమికిఁ దెప్పింపుమని వంజరునిఁగోరుట		405
సప్తమాశ్వాసము		
97 వంజరుఁడీశ్వరునిగూర్చితపముచేయుట	...	6
98 వంజరుఁడు విష్ణువును బ్రార్థించి గరుత్మంతుని వాహనముగాఁబొందుట		23
99 వంజరునివెంట గంగానదిభూమికివచ్చుట	...	38
100 గరుత్మంతుఁడా రాజుకు వాహనమగుటకు హేతువు	...	54
101 వంజరుఁడు వేశ్యవిషయక మగుతగవుఁ దీర్చుట	...	80
102 వంజరునకు శాపముకలుగుట	...	90
103 వంజరుఁడు రాజపుత్రినిగాంధర్వంబునఁ బెండ్లియగుట	...	115
104 వంజరుఁడు వేశ్యతో జూదమాడుట	...	120
105 వంజరునిభార్యను పేదరాలు తనయింటికిఁ బిలుచుకొనిపోవుట	...	140
106 వంజరుఁడు వేశ్యయిల్లుచేరుట	...	144
107 వంజరసతీప్రాణత్యాగము	...	155
108 వంజరదంపతులును, వేశ్యయుఁజచ్చి మఱలబ్రదుకుట	...	163
109 వంజరదంపతు లన్యోన్యము శాపమును బెట్టుకొనుట	...	172
110 విప్రాదిశాపంబున వంజరుఁడు శిశువగుట	...	175
111 వంజరదంపతులు చండాలులగుట	...	193
112 విప్రసందర్శనంబున వంజరదంపతులు శాపవిముక్తినొంది ముక్తినొందుట		202
113 విప్రుఁడుకాశినుండి తనగ్రామమునకువచ్చి తనపత్నితో సుఖించుట		227
114 భోజునియింట సర్పటిభిక్షఁగొనుట	...	237
115 దత్తాత్రేయుఁడు మహునకు భోజునిమాహాత్మ్యము వర్ణించుట	...	242
116 ఉపసంహారము.	...	253

శ్రీ

భోజరాజీయము

ప్రథమాశ్వాసము

శ్రీరమణీపయోధరపరిస్ఫుటకుంకుమఫాలభాగక
స్తూరిక లిప్తకేళిగతిఁ జొక్కినభంగి నురంబునందుఁ బ్ర
స్ఫారితరత్నలాంఛన విభాయుగళంబు దలిర్ప నొప్పుల
క్ష్మీరమణుండహోబలనృసింహుఁడు మాకుఁ బ్రసన్నుఁ డయ్యెడున్. 1

చ. శ్రుతితతు లుద్భవించినవిశుద్ధగృహంబు లనంగఁ జాలి వా
క్సతికి నివాసభూము లనఁగాఁ దగి యెవ్వని మోముఁదమ్ము లం
చితగతి నొప్పు నట్టిసరసీరుహసంభవుఁ డిచ్చుఁగాత మ
త్కృతికిఁ జిరాయువు న్విమలకీర్తియు సజ్జనరంజకత్వమున్. 2

చ. ఒకదెస మాతృభావమును నొక్కదెసం బితృభావముం సమాం
శకముగఁ దాల్చి యోగిజనసంతతి గన్గొను నంతరంగదృ
ష్టికి గురియై తపస్వులకుఁ జేరువచుట్ట మనంగ భక్తరా
జికి నఱచేతిసొమ్మగు శశిస్ఫుటమౌళిఁ దలంతు శంకరున్. 3

ఉ. విఘ్నము లెల్లఁ బాసి పృథివిం భవనీరధి పేర్మి గుల్భసం
దఘ్నము చేసి నిల్తు రుచితస్థితి నెవ్వనిభృత్యు లట్టి దుః
ఖఘ్నుఁడు షణ్ముఖప్రథమగర్భుఁడు భద్రగజాస్యుఁ డైనయా
విఘ్నవిభుండు మత్కృతికి వేడుకతోడ సహాయుఁ డయ్యెడున్. 4

ఉ. ఏసతిలావు లేక నరు లెవ్వరు నోరు మెదల్ప లేరు ప
ద్మాసనవాసుదేవనిటలాక్షులు లోనుగ నాత్రివిష్టపా
వాసులు పుట్టుఁ బేరుఁ జెలువంబును నేరికి దాఁప రట్టివా
ణీసతి మన్ముఖాబ్జమున నిల్చి విశేషవరంబు లీవుతన్. 5

ఉ. శ్రీకర మైనరామకథఁ జెప్పి కృతార్థులఁ గా నొనర్చె భూ
లోకమువారి నేఋషి త్రిలోకములుం బొగడంగ నట్టియ
స్తోకవచోభిరాముఁడు విశుద్ధతపోనిధి వాదికుఁడు వా
ల్మీకిమునీంద్రుఁ డెప్పుడుఁ దలంపక నామదిలోన నుండెడున్. 6

ఉ. ఏకముఁ బ్రోక యైన శ్రుతు లెల్లను నేర్పున నేర్పరించి సూ
త్రాకృతు లొప్పఁ దీర్చి యితిహాసపురాణచయంబు లోలి న
య్యైకరణిం బ్రబోధపదప్రార్థ్యములై వెలయన్ రచించె న
వ్యాకులబుద్ధి నేపురుషుఁ డట్టిపరాశరసూనుఁ గొల్చెదన్. 7

చ. వివిధపదానుయోజనఁ బ్రవీణుఁడు దండి సమంచితార్థగౌ
రవమునఁ బెద్ద భారవి ధురంధరుఁ డయ్యుపమాకవిత్వస
త్ప్రవణతఁ గాళిదాసు త్రివిధంబున మాఘుఁడు మేటి నాఁగ ని
ట్లవనిఁ బొగడ్త కెక్కినమహాకవులం బ్రణుతింతు నాఢ్యులన్. 8

ఉ. నన్నయభట్టుఁ దిక్కకవినాయకు భాస్కరు రంగనాథుఁ బే
ర్కొన్నిక కెక్కినట్టియమరేశ్వరు నెఱ్ఱయమంత్రి నాదిగాఁ
జన్నకవీంద్రులన్ నవరసస్ఫుటవాణు లనంగ ధాత్రిలో
నున్నకవీంద్రులం దలఁతు నుల్ల మెలర్పఁగ వాగ్విభూతికిన్. 9

సీ. ఏమహాత్ములచేత నీజగత్త్రయము నాప్యాయితం బయ్యె నయ్యమృతకరుని
చేఁ బోలె వైద్యులచేతఁ బోలె సురక్షితం బయ్యె నాత్మరత్నములచేతఁ
బోలె నలంకృతిఁ బొరసెఁ బాత్రిత మయ్యెఁ బుణ్యతీర్థముచేతఁ బోలె నట్టి
వైష్ణవప్రవరుల వైనతేయు గజేంద్రు శేషుఁ బావని నంబరీషు ధ్రువుని

తే. బలి విభీషణుఁ బ్రహ్లాదుఁ బాండవేయుఁ,బుండరీకు వేదవ్యాసుఁ బుత్రు భీష్ము
నారదునిఁ బరాశరుని శౌనకుని భృగుని,విదురు నక్రూరు గోపాలవితతిఁ దలఁతు. 10

సీ. భూనభోహరిదంతపూరితనుతకీర్తిశాలి తిర్వెంగళచక్రవర్తి
సకలసాత్త్వికశుకప్రకరసత్ఫలపూర్ణసహకార మళఘురిచక్రవర్తి
ఘనతరాజ్ఞానాంధకారవిఖండనచండాంశుఁ డౌబళచక్రవర్తి
నానార్థిజనచాతకానూనధనవృష్టిజలదంబు శ్రీదేవచక్రవర్తి

తే. యనఁగ శ్రుతిచతుష్టయములో నెనయఁ నట్టి,యగ్రజులతోడఁ బుట్టినయస్మదీయ
గురునిఁ దిరుమల నల్లానువరతనూజుఁ, దలఁతు గోవిందచక్రవర్తులఁ బ్రియమున. 11

వ. అని యిష్టదేవతానమస్కారంబును విద్వజ్జనాభివాదనంబును భాగవతసంకీర్తనం
బును గురుచరణస్మరణంబునుం జేసి వాణీవరప్రసాదలబ్ధవాగ్విభవుండనై కృతి

యొనర్ప నుద్యోగించి తత్కృతిలక్ష్మికి ముఖమండనంబుగా నస్మదీయవంశప్ర
శంస యొనర్చెద నది యెట్టి దనిన. 12

సీ. శ్రీరమ్యుఁ డగునాది నారాయణునినాభిఁ బోలుపార విరిదమ్మిపువ్వు పొడమె
నాపువ్వులోఁ బుట్టు నఖిలలోకంబులు పుట్టింపఁ జాలెడు ప్రోడపుట్టె
యాపుట్టి మోముల నామ్నాయవితతితో నావిర్భవించె విప్రాన్వయంబు
నాయన్వయంబున నతివృద్ధాచారసమృద్ధులు పెక్కండ్రు ఋషులు పుట్టి
ఆ. రట్టిఋషులలోన నధికతపోవిశేషుండు వేదశాస్త్రశోభితుండు
ఘనుఁడు సూనృతైకధనుఁడు కౌండిన్యము, నీశ్వరుండు మెఱసె విశ్వనుతుఁడు. 13

శా. ఆకౌండిన్యమునీంద్రవంశమున దుగ్ధాంభోధిసంజాతుఁడై
రాకాచంద్రుఁ డెలర్చుమాడ్కి నుపధారంభైకసంరంభుఁ డ
స్తోకానందుఁడు నందనార్యుఁడు ప్రసిద్ధిం దయ్యె నార్యప్రియం
డాకారస్మరుఁ డచ్యుతాంఘ్రికమలధ్యానానురక్తుం డిలన్. 14

ఉ. నందితశిష్టలోకుఁ డగునందనమంత్రికి లక్కమాంబకున్
నందను లుద్భవించిరి జనార్దనశంకరనిర్విభేదు లా
నందమయాత్ము లాదిమునినాయక సత్యుఁడు సత్యమంత్రియున్
మందరశైలధీరుఁ డనమాచుఁడు మంత్రిపురాంతకార్యుఁడున్. 15

వ. అం దగ్రసంభవుండు. 16

ఉ. సత్యవచోవిలాసుఁడు ప్రశస్తయశోవిభవాభిరాముఁ డా
దిత్యసమప్రకాశుఁడు సుధీజనచిత్తసరోజమిత్రుఁ డౌ
చిత్యపరుండు సర్వజనచిత్తవిదుం డన మంత్రికోటిలో
సత్యనమంత్రి యొప్పె నుడుసంఘములోపలఁ జంద్రుకైవడిన్. 17

ఉ. సత్యముతో నహింస విలసద్గతిఁ గూడి చరించుచాడ్పునన్
సత్యనమంత్రిఁ గూడి గుణశాలిని తాతమ నిత్యనిర్మలా
పత్యసమేతయై నిఖిలబంధుజనంబులకుం బ్రమోదసం
పత్త్యుదయైకహేతు వయి ప్రస్తుతికెక్కె ధరాతలంబునన్. 18

క. అతనికి నయ్యతివకు న, ప్రతిమమనోదారు లరయ భాసురకవితా
చతురుఁడుబయ్యనయునుమతి,యుతుఁడగునందనయుసత్ప్రియుఁడుతిక్కనయున్. 19

వ. ఆసత్యనామాత్యుననుసంభవుండు. 20

సీ. మారాంబ కెన యైనమారాంబ పత్నిగాఁ గనియె నార్వుర వంశకరుల సుతుల
నిశ్చలధ్యానైకనిష్ఠాగరిష్ఠుఁడై షణ్మాసములు పురశ్చరణ చేసి

మావంశజులయింటిమార్జాలమున కైన నరకంబు లేకుండ వరము వడసెఁ
గడఁగి పునస్మాతృగర్భంబు సొరకుండఁ బ్రతిన గైకొని బ్రహ్మపదముఁ బొందె

ఆ. వనిన నతనికీర్తి యఖిలదిక్తటములఁ, గప్పుకొనుట వేఱ చెప్ప నేల
విపులపుణ్యుసనుఁ ద్రిపురాంతకబ్రహ్మఁ, బోలఁ గలరె యితరపురుషు లెల్ల. 21

ఉ. నిత్యులు తత్తనూభవు లనింద్యులు దేవనయుం సురేశ్వరా
మాత్యసముండు నందనయు మాన్యుఁడు కొమ్మనయుం గుణాఢ్యుఁ డా
దిత్యవిభుండు నాశ్రితవిధేయుఁడు మాచనయుం బ్రశస్తసా
హిత్యుఁడు తిక్కధీమణియు నెన్నిక కెక్కిరి బంధుకోటిలోన్. 22

సీ. ఆసత్యనామాత్యునగ్రసూనుఁడు పయోనిధిగభీరుఁడు గదానిపుణుఁ డధిక
తేజుఁ డాశ్రితకల్పభూజుఁ డుత్కటకృపారసపూర్ణహృదయుఁ డరాతిభయద
బాహాఢ్యుఁ డసహాయసాహసుం డంగనాజనభద్రుఁ డభినవమనసిజాతుఁ
డాశాంతవిశ్రాంతయశుఁ డార్తరక్షితదక్షుఁ డున్నతవక్షుఁ డక్షరాది

ఆ. విద్యలందుఁ జతురుఁ డుద్యద్గుణశ్రేష్ఠుఁ,డనుపమానవిభవుఁ డమితపుణ్యుఁ
డనఁగ నెగడె భైరవామాత్యచంద్రుండు, రాజసభలయందుఁ బూజ వడసి. 23

చ. క్షితిఁ గ్రతుకర్తృతామహిమ చేకొని పచమవేద మైనభా
రతముఁ దెనుంగుబాస నభిరామముగా రచియించినట్టియు
న్నతచరితుండు తిక్కకవినాయకుఁ డాదట మెచ్చ భవ్యభా
రతి యనఁ బేరు గన్నకవిరత్నము బయ్యనమంత్రి యల్పుఁడే. 24

చ. శరధిసుత న్వరించుజలజాతవిలోచనుమాడ్కి శీతభూ
ధరజఁ బరిగ్రహించుహిమధామకళాధరుపోల్కి సద్గుణా
భరణపవిత్రమూర్తిఁ గులపాలిక నాఁ దగుప్రోలమాంబికన్
బరిణయ మయ్యె నెయ్యమున బయ్యచమూపతి వైభవోన్నతిన్. 25

క. పతిభక్తి నరుంధతి సూనృతమతి భారతి జగద్గుణితసౌభాగ్య
స్థితి రతి శాశ్వతవిభవా, యతి శ్రీసతి యనఁగఁ బ్రోలమాంబిక వెలసెన్. 26

చ. గుణయుతు లవ్వధూవరులకున్ జనియించిరి త్రేత రామల
క్ష్మణు లయి పుట్టి ద్వాపరయుగంబుతుదిం దగ రామకృష్ణులై
గణనకు నెక్కి యీకలియుగంబున ని ట్లుదయించె లోకర
క్షణుఁ డగువిష్ణుదేవుఁ డన గంగనమంత్రియు ముమ్మడన్నయున్. 27

వ. ఆగంగనామాత్యుగుణవిశేషంబు లెట్టి వనిన. 28

సీ. దుగ్ధాబ్ధిలోపలితోయజాక్షుల మేలుకనిపి తీరంబున నునుపకున్న
హరుకంఠమున నున్నగరళానలముకప్పు విరియ నౌషధము త్రావింపకున్న
నిందుబింబములోనియిఱ్ఱికి దీమంబు చూపి వెల్వఱిచి పోఁ జోఁపకున్న
శీరపాణికి నీలిచీరమీఁదిప్రియంబు మాన్పి వెల్లలు గట్ట మరపకున్న
తే. నితనికీర్తికి సరి చెప్ప నెట్లు వచ్చు, ననఁగఁ బొగడొందు బయ్యదండాధినాథు
కూర్మిపుత్త్రుండు కౌండిన్యకులపవిత్రుఁ, డగసంభవనిభుఁ డైనగంగవిభుఁడు. 29

క. సోముఁడు రోహిణి నధిక,ప్రేమమున వరించుక్రియ గభీరాదిగుణ
శ్రీమహిమకీర్తి శోభిలి, కామాంబ వరించె మంత్రిగంగన ప్రీతిన్. 30

క. ఆదంపతులకు హృదయాహ్లాదకరులు సుతులు పెద్దనార్యుఁడు సుగుణా
మోదిఘనుఁ డప్పలన్నయుఁ, బ్రాదుర్భావంబు నొంది పరఁగిరి పేర్మిన్. 31

వ. ఇట్టిసంతానంబువలన వెలయుగంగనామాత్యుననుసంభవుండు. 32

చ. కడిమిఁ గిరీటి దానమునఁ గర్ణుఁడు భోగమున న్సురేంద్రుఁ డే
కుక్కడువిభవంబునన్ హరి యకుంఠితబుద్ధిఁ బురందరేభ్యుఁ డు
గ్గడు వగుధీరతన్ సురనగప్రవరుం డనఁ బ్రోలమాంబము
మ్మడి బెడఁగొందె రూపమహిమ న్స్మరుముమ్మడియై జగంబునన్. 33

సీ. పితృబుద్ధి వదలక పేర్చి యచ్యుతుసేవ యనిశంబు చేయుఁ బ్రహ్లాదుఁ డనఁగ
నగ్రజన్మునితోడ విగ్రహింపక శౌరి శరణు చొచ్చినవిభీషణుఁ డనంగ
బ్రభుత యెన్నఁడుఁ గోలుపడక సద్భక్తి నుపేంద్రుఁ బూజించుబలీంద్రుఁ డనఁగ
వైవాహికక్రియావైభవం బుడుగక బిసరుహాక్షునిఁ గొల్చుభీష్ముఁ డనఁగ
ఆ. నితరమతములందు హృదయంబు చొనుపక, యొగిఁ దదేకనిష్ఠ యుల్లసిల్లఁ
బరమభాగవతవిభాసితుండై యొప్పెఁ, బ్రోలమాంబసుతుఁడు ముమ్మవిభుఁడు. 34

క. ఆముమ్మడిప్రెగ్గడ శ్రీ,రాముఁడు సీతను వరించుక్రమమున సుగుణ
స్తోమాభిరామ సమితకృ,పామండిత నెఱ్ఱమాంబఁ బరిణయ మయ్యెన్. 35

సీ. పతిభక్తినిరతిని సతి యరుంధతిఁ బోల్పఁ దగు ననుమాట వ్యర్థంబు గాదు
సత్యవాక్ప్రౌఢిని సతి సరస్వతికంటె నెఱవాది యనుమాట కుఱుచ గాదు
సౌభాగ్యగరిమను సతి రతిదేవితోఁ బురుడించు ననుమాట బొంకు గాదు
సంపదపేర్మిని సతి శ్రీసతికి సదృక్షం బనుమాట సంశయము గాదు
ఆ. అనిన నితరసతుల కలవియె సతతవి, శ్రాణనక్రియాధురీణవాస్తుఁ
డైనముమ్మడీంద్రునర్ధాంగలక్ష్మి నా, నతిశయిల్లునెఱ్ఱమాంబఁ బోల. 36

క. ఆరమణీరమణులకుఁ బ్రభ,భారమ్యుఁడు తిక్కవిభుఁడు ప్రకటితకాంతి
స్ఫారుఁడు సింగనయును నను, వారలు పుట్టి రిలఁ బువ్వువంతులమాడ్కిన్. 37

వ. అయ్యిరువురయందు నగ్రసంభవుండు. 38

సీ. సత్యభాషణమును సాధుపోషణమును సహజభూషణముగా జరుగువాఁడు
నార్తరక్షణము దయార్ద్రవీక్షణము సుదాత్తలక్షణముగాఁ దనరువాఁడు
సుకృతభావనమును సుకవిసేవనమును నిత్యజీవనముగా నెగడువాఁడు
విష్ణుకీర్తనమును విమలవర్తనమును విహితవర్తనముగా వెలయువాఁడు
ఆ. వాఁడె చూడఁ డనుచు వసుధాజనంబులు, ప్రస్తుతింప నొప్పు భవ్యచరితుఁ
డుభయకులపవిత్రుఁ డురుకీర్తిధవళిత, దిక్కుఁ డెఱ్ఱమాంబతిక్కవిభుఁడు. 39

సీ. విలసితం బగుకృష్ణవేణిమలాపహారిణి భీమరథీనా ధరిత్రియందుఁ
దనరునదీత్రయాంతర్వేది యగుపావనక్షేత్ర మన శోభనముల కెల్ల
ధర నివాసం బగుపెరుమగూరపురంబునందు విద్వజ్జనానంద మైన
జీవనస్థితిచేతఁ జెన్నొంది వంశకర్తృత్వసంపత్తిఁ బ్రభుత్వ మొంది
తే. నెమ్మి ప్రత్యక్షపరమపద మ్మనంగ, నొప్పు శ్రీకాకుళంబున నొడయఁ డైన
యంధ్రవల్లభహరిసేవ నలరుచుండుఁ, బెక్కుభంగుల ముమ్మడితిక్క విభుఁడు. 40

చ. చిరతరశోభనుం డగువసిష్ఠమునీశ్వరుఁ డయ్యరుంధతిం
బరిణయమై గృహస్థగణభాసితుఁడై వెలుఁ గొందుమాడ్కిఁ గా
తరపరిరక్షణానవరతవ్రతశీలుఁడు తిక్కమంత్రిశే
ఖరుఁడు వివాహ మయ్యె గుణగౌరవశోభిని మల్లమాంబికన్. 41

సీ. శ్రీవత్సగోత్రాబ్ధిశీతాంశుఁ డగునక్కదండాధినాథుఁ డీతరుణితండ్రి
లావణ్యగుణపుణ్యలక్షణాన్విత యైనయక్కమాంబిక యీలతాంగితల్లి
చిరకీర్తినిరతులు చిట్టనమంత్రియు నయ్యలార్యుఁడు నాతి కగ్రజన్ము
లన్యూతాంఘ్రిసరోరుహార్చనారతుఁడు దమ్మనమంత్రి యీయింతియనుఁగుఁదమ్ముఁ
తే. డనఘుఁ డగుకోటకరుణాకరార్యుఁ డనఘ, సుండు ముదునూరి పెద్దవిభుండు నివ్వ
ధూమణికిఁ గూర్మి గలమేనమామ లనిన, మగువ లెనయె తిక్కనమంత్రి మల్లమకును.

సీ. ఈయింతి ప్రియభాష లెల్లపెద్దలకును బరమానురాగసంపాదకములు
నీయింతిహస్తాబ్జ మెల్లబంధువులకు లలితకల్పద్రుమఫలితశాఖ
యీయింతివర్తనం బెల్లయింతులకుఁ బతివ్రతాచారోపదేశకర్త
యీయింతిమందిరం బిందిరాదేవికి సతతమనోజ్ఞవిశ్రామభూమి
ఆ. యనఁగ సకలశోభనావాసదేశమై, యఖిలకులవధూజనావతంస
మగుచు వెలసెఁ దిక్కనామాత్యవిభుదేవి, మల్లమాంబ లోక మెల్లఁ బొగడ. 43

సీ. ఈగృహస్థుని కీర్తియిల్లాలు గలుగుట ప్రాగ్భవార్జితపుణ్యఫలము గాదె
యీపతివ్రత కీర్తిహృదయేశుఁ డబ్బుట వరికింప ఘనతపఃఫలము గాదె

యీమహాప్రభువున కిట్టిసజ్జనురాలు గలుగుట సంసారఫలము గాదె
యీపుణ్యకాంతకు నిట్టిధర్మక్రియాపరుఁడు గల్గుట దానఫలము గాదె

ఆ. యనఁగ మహిఁ బరస్పరానుకూలత్వంబు, మిక్కుటముగ మంత్రి తిక్కవిభుఁడు
మల్లమాంబికయును మహనీయజీవన, సౌఖ్యవార్ధిఁ గేళి సలుపుచుండ. 44

మ. అరిషడ్వర్గముఁ దూలఁ దోలి ధరలో నైశ్వర్యషడ్వర్గ మీ
వరుసన్ భాగ్యభవ మొందె నాఁగ సుతషడ్వర్గంబు జన్మించెఁ ద
త్పురుషస్త్రీతిలకంబులందు ఘనసంతోషంబు తద్బాంధవో
త్కరముల్ పొందఁ సమగ్రసంపద నిజాగారంబునం జెందఁగన్. 45

వ. వా రెవ్వ రంటేని. 46

ఉ. భూనుతకీర్తి మమ్మడివిభుండు మదగ్రజుఁ డేను వైష్ణవ
ధ్యానసమాహితాత్ముఁడ ననంతసమాఖ్యుఁడ నాదుతమ్ము ల
జ్ఞానవిదూరు లక్కనయు సత్కవి చిట్టనయున్ వివేకవి
ద్యానిధి రామచంద్రుఁడు నుదారుఁడు లక్ష్మణనామధేయుఁడున్. 47

క. ఈయార్వురు నొక్కొక్కఁడు, వేయిండ్లకు మొదలు గాఁగ వెలయుదు రని కా
దే యాఱువేలపే రిడి, రీయన్వయమునకు నేవ్య మెఱిఁగినపెద్దల్. 48

వ. ఇట్టిసంతానలతావితానంబునకు మూలకందం బనం దగుతిక్కనామాత్యునకు సంభ
వుండు. 49

చ. బలమున నాహలాయుధుఁ డపారపరాక్రమలీలయందుఁ గే
వలమృగరాజు రూపవిభవంబున వాసవసూతి నీతికౌ
శలమున నయ్యుగంధరుఁడు సత్యవిరూఢిని ధర్మజుండు నా
నిల నలి కెక్కె మమ్మరథిసీశ్వరుసింగన బంధుకోటిలోన్. 50

వ. అతనియతివ యెట్టి దనిన. 51

సీ. రమణీయ మైనభారద్వాజగోత్రవర్ధనుఁడు సింగనమంత్రి తనకుఁ దండ్రి
యఖిలసంపదలకు నావాసభూమి నాఁ దగునన్నమాంబిక తనకుఁ దల్లి
ఘనుఁడు నారనమంత్రియును గదాకుశలుండు మారనార్యుండును నుహితమూర్తి
సింగధీమణియును ననంగసన్నిభుఁడు మాచనమంత్రియును సర్వసన్నుతుండు

తే. పల్లభన్నయు నన్నఁగలవారు తనకు, ననుఁగుఁదమ్ములుఁ దా నాభళాంబ యనఁగ
నలరునయ్యింతి తనకు నిల్లాలు గాఁగ, మహితగుణశాలి సింగనమంత్రి వెలసె. 52

ఉ. ఆతనినందనుల్ హరిపదాబ్జరతుం డగుసింగమంత్రి ని
స్ఫీతుఁడు చిట్టయన్నయును గభీరగుణాఢ్యుఁడు మమ్మడన్న ప్ర

ఖ్యాతుఁడు సింగశౌరి ఘనుఁ డౌ తిరువెంగళసింగరన్న నా
నాతతసచ్చరిత్రముల నన్వయపావను లైరి మేదినిన్. 53

వ. ఇట్టి పుత్రరత్నంబులచేత నలంకృతుం డగుసింగనమంత్రి సౌమిత్రియుం బోలెఁ దనకు ననవరతప్రీతి గావింప నస్మదీయజనకుం డగుతిక్కనామాత్యచంద్రుఁడు రామచంద్రుఁడునుం బోలె ధీరోదాత్తగుణోత్తరుండై మెఱయుచుండు. 54

ఆ. దేవతాన్వయంబు దేవేంద్రుచేఁ బోలె, మహితపుణ్యుఁ డైనమనువుచేత
క్షత్త్రకులము వోలెఁ గౌండిన్యగోత్రంబు, వెలసెఁ దిక్కమంత్రివిభునిచేత. 55

వ. మఱియు నవ్వంశంబు హరివంశంబునుం బోలె గోత్రోద్ధరణాద్యచ్యుతవ్యాపారసారంబును రామకటాక్షంబునుం బోలె జనకతనయాంతర్గతానురాగరసపోషణంబును ధనంజయాంకపీఠంబునుంబోలె సుభద్రాధిష్ఠితంబును జంద్రబింబంబునుం బోలెఁ గువలయానందకరంబును సూర్యగతియునుం బోలె ననుదినాభ్యుదయోపశోభితంబును నారాయణునినాభికమలంబునుం బోలె శతానందసుందరంబును గంగాప్రవాహంబునుం బోలె శుద్ధజీవనసమృద్ధంబును సరోవరంబునుం బోలెఁ గమలావాసభాసురంబును ఛందోలక్షణంబునుం బోలె సమవృత్తాధికారయుక్తంబును వీణావిశేషంబునుం బోలె నానాగుణగణనీయంబును సురతరునికరంబునుం బోలె సంతానవంతంబును నగుచు సంబంధిబంధువ్రజవలన నదనదీసముదయవిహారాకరం బగుసాగరంబును మిత్త్రలోకంబువలనఁ గేకినికరాలోకనకుతూహలకారణం బగుజీమూతజాతంబును బౌహ్యవర్గంబువలన బహువిహగసమాశ్రయం బగుఫలితతరుమండమండలంబును సముచితసంభావితకవితావిశారదులవలన మదభృంగసంఘానుషక్తం బగుపుష్పవాటంబును సతతసమాగతాతిథిజనంబులవలన నదితిసుతసంకులం బగునమృతరసోపేతభోగమంటపంబును ననుకరింపుచు నుండు. 56

క. ఏతద్వంశపయోనిధి, శీతాంశుఁడ బుధచకోరచిత్తప్రియుఁడన్
పీతకళంకుండఁ గళో, పేతుఁడ నిర్ధూతదురితపృథుతిమిరుండన్. 57

క. నరహరిచరణసరోజ, స్మరణామృతపానసతతసంతుష్టాంతః
కరణుఁడ సంతతవాణీ, వరప్రసాదానులబ్ధవాగ్విభవుండన్. 58

క. శ్రీయువతీకారుణ్యా, రసాయత్తకటాక్షవీక్షణాపాదితసు
శ్రేయస్కుఁడఁ గవినికరవి, ధేయుండ ననంతనామధేయుండ జగతిన్. 59

సీ. సకలవిద్యలయందుఁ జర్చింపఁ గవిత యుక్తక్లుప్త మం ద్రది నిత్యకీర్తికొఱకు
నర్థాప్తికొఱకు నావ్యవహారలక్షణం బెఱిఁగెడుకొఱకు ననేకవిధము

లగునమంగళముల హరియించుకొఱకు నుచితనిత్యసౌఖ్యసంసిద్ధికొఱకు
నొనరఁ గాంతాసమ్మితోపదేశంబునఁ బ్రీతిమై హిత మాచరించుకొఱకు

ఆ. నయ్యెఁ గానఁ బెద్ద లాచరించెద రంచు, నేర్పుకొలఁదిఁ గృతి యొనర్పఁ బూని
యస్మదీయకృతికి నధిపతిఁ గావింప, నర్హుఁ డెవ్వఁ డొక్కొ యని తలంచి. 60

క. మనమునఁ దలపోయుచు నటు, గనుమోడ్చినవేళ యొక్కఘనతరతేజో
ధనుఁ డస్మత్స్వప్నంబున, ననుకంపాయత్తచిత్తుఁడై పొడచూపెన్. 61

సీ. ఆభవ్యుఁ డఖిలచరాచరాంతర్గతుం డైనయాదిమవిష్ణుఁ డని యెఱింగి
యాదేవుదివ్యభవ్యావతారంబుల నిట్టి యద్భుతమూర్తి యెద్దియొక్కొ
యని చూచుచో మందహాసచంద్రిక గల్గుసింహవక్త్రంబునఁ జెలువ మైన
మనుజదేహంబును మహితాంకతలమున నక్షీణసంపత్కటాక్షరుచులఁ

ఆ. దనరుకాంతయును సుధాధామరుగ్ధామ, సమము లైనశంఖచక్రములును
దివ్యమాల్యములును దివ్యాంబరంబులు, దివ్యభూషణములుఁ దేజరిల్ల. 62

క. ఆమూర్తికి నీమూర్తికి, నేమివిభేదం బనంగ నింపగురూప
శ్రీమహిమఁ దనరి మన్గురుఁ, డామూర్తిన కడిసి యుండి యాదర మెసఁగన్. 63

ఆ. "ఇందు రమ్ము వత్స యేను నీమీఁదికృ, పాతిశయము పేర్మి నరుగుదెంచి
నాఁడ" ననుచుఁ బిలిచి న న్నాదరించి ప్రహర్షవార్ధి నోలలార్చి యపుడు. 64

చ. అదె జగదేకవంద్యుఁ డగు నాదినృసింహునిదివ్యరూపసం
పదఁ గనుఁగొంటి సర్వసులభుఁ బుగ నీకృతిలక్ష్మికి న్వరుం
డొదవె ఫలించె నీతలఁపు యోగ్యుఁడవైతి యశోవిభూతి క
య్యుదధివరేణ్యుచాడ్పున మహోన్నతజీవనవైభవంబునన్. 65

ఉ. కావున నిమ్మహాత్ము నవిఖండితతేజుఁ గృపావిధేయు భ
క్తావనశీలుఁ బావనతరాంఘ్రిసరోరుహజాతదేవతా
శైవలినీకు నాకలితచక్రు నహోబలతీర్థనాయకున్
శ్రీవనితాధినాథుఁ బతిఁ జేయుము నీకృతికిన్ లసన్మతిన్." 66

వ. అని యుపదేశించె నంత నమ్మహామూర్తియుం దదనురూపంబు లగుమధురాలాపం
బుల నన్ను గారవించె నంతన మేలుకని యేను బెద్దయుం బ్రొద్దు తదీయధ్యానా
నందనిష్పందం బగుడెందంబుతో ననన్యసులభం బగునప్పరమసౌఖ్యంబు ననుభవించి
"నృసింహా! యిది యంతయు నీకృపావిశేషంబుగా నిశ్చయించి నీమహానుభావంబు
భావించి. 67

సీ. వేదంబు లేదేవుపాదాబ్జములయందు ననిశంబు మ్రోయు నయ్యలులభంగి
నలువ యేదేవునినాభిసరోవరంబున నంబుపక్షులపోల్కిఁ జదువు

శేషుఁ డీదేవునిచెవిఁ జేరి యాప్తవర్గము వోలెఁ బరమార్థసమితిఁ బల్కు
నింద్రాదిదేవత లేదేవుఁ గైవార మొనరింతు రవ్వంశజులభంగి.

ఆ. నట్టిదేవదేవు నఖిలాండనాయకు, నాదివిభు నహోబలాధినాథు
వరదుఁ బరమపురుషు శరణాగతత్రాణు, వరునిఁ బ్రస్తుతింప నోరులవశమె. 68

వ. అట్లు గావున. 69

చ. వెలయఁగఁ దొంటిపెద్దలకవిత్వము వోలె రుచించు నొక్కొ యేఁ
బలికెడుమాత్ర కావ్యరసభావము లైనను భూమిఁ దల్లిదం
డ్రులకు నిజాగ్రసూనులపటుప్రచురోక్తులకంటెఁ జిన్నబి
డ్డలవెడతొక్కుఁబల్కులు దృఢం బగుముద్దుల నీన కుండునే. 70

వ. అనిన నీవగజగద్గురుత్వం బుపలక్షించి మఱియును. 71

చ. సదయుఁ డహోబలేశుఁడు ప్రసన్నగుణాఢ్యుఁ డనాథనాథుఁ డై
చదువులకుం గరంగఁడు నిజం బగుభక్తిరసోక్తిఁ బోలె మున్
జదివినభార్గవాదులకు సన్నిధి చేసెనె దైత్యజాతుఁ డ
య్యదన సమస్తమందుఁ గలఁ డంటకు దృష్టము చూపిన ట్లొగిన్. 72

క. ఇది సార మిది యసారం, బిది యల్పము ఘన మిది యనక యొదుగు దానై
పొదలుటఁ దెలుపఁడె దితిసుత, సదనస్తంభమున నెల్లజగములు నెఱుఁగన్. 73

ఉ. పోఁడిగ నెందునుం గలఁడు పొమ్మనుదాసునిజిహ్వనుండియో
వేఁడి రమావిభుం డనెడివీఱిఁడి దైత్యునిదృష్టినుండియో
వాఁ డిపు డ్రేయం నింక నని పాపిఁ గంబమునందు నుండియో
వాఁ డటు లుద్భవించుట యనం దగుసర్వగతాత్ముఁ డల్పుఁడే. 74

సీ. మశకపిపీలికామక్షికాప్రభృతులై చరియించునజ్ఞానజంతువులకుఁ
దృణగుల్మభూరుహదృషదాదికంబులై చనుజడస్థావరజాతమునకు
నపవర్గసుఖసిద్ధి యఱచేతిధన మన్నఁ దెలివియు భక్తియుఁ గలుగునట్టి
జనులకు గమనాగమనశూన్య మగునాఖ్యగతి బ్రాతి యిది యాయగణ్యపుణ్య

ఆ. తీర్థసేవన వినుతింపఁ బెంపారు నత్యుత్తమ మయి మహి నహోబలాఖ్య
తీర్థ మిట్టిమేటితీర్థమునకుఁ గర్త, యగునృసింహుమహిమ యడుగ నేల. 75

క. కనుఁగొనిన నధిక సుకృతము, వినినం గల్మషహరంబు వెలయఁగఁ జిత్తం
బునఁ దలఁప మేలు నేకుఱఁ, జనదే హరి నాశ్రయింప సత్పురుషులకున్. 76

వ. అని పురాణవేదు లగునాదిపురుషులు చెప్పినపుణ్యవచనంబులు మున్ను విని యుండి
కిం జేసి నిశ్చింతుడనై. 77

సీ. నూతనం బయ్యుఁ బురాతనకృతులట్ల సంతతశ్రవ్యమై జరుగు ననియు
నాదిరాజసమానుఁ డగుభోజభూపతిచరిత మీకవితాప్రసంగ మనియు
నిందుఁ జెప్పెడికథ లిన్నియుఁ బోలఁ బ్రశస్తధర్మోపదేశంబు లనియు
నఖిలజగన్నాథుఁ డగునహోబలనాథుఁ డీపుణ్యకృతికి నధీశుఁ డనియుఁ
ఆ. బృథివి నెల్లజనులు ప్రియభక్తిఁ జా, టింతు రనియు నూఱటిల్లి యేనుఁ
బరమసౌఖ్య మైనభవదాభిముఖ్యంబు, నెమ్మిఁ బడసి యధికనిష్ఠతోడ. 78

సీ. వర్ణితప్రహ్లాదవాక్యజయస్తంభ మగుమహాస్తంభంబునందు వెడలి
సురసిద్ధఖేచరవరయోగిహృద్ధ్యేయ మగుమహోజ్జ్వలకాయ మమరఁ దాల్చి
భూరిదానవవంశపూర్ణతటాకంబుకట్ట నాఁ దగుదైత్యుపొట్ట వ్రచ్చి
శిష్టజనప్రజాభీష్టదానసమర్థ మగునహోబలతీర్థమందు నిలిచి
తే. యవని నాబాలగోపాల మగుసమస్త, జీవులకు నండబడి యైనదేవభూజ
మయ్యె నే దేవుఁ డట్టిమహానుభావు, నాదినరసింహదేవుని నాశ్రయించి. 79

షష్ఠ్యంతములు

క. అనితరసదృశమహాత్మున, కనిమిషవంద్యునకు బుధజనారాధ్యునకున్
వినమితసుత్రామునకును, ఘనతరకలిదోషతిమిరకమలాప్తునకున్. 80

క. వినతాసుతగమనునకును, మనసిజజనకునకు నబ్ధిమందిరునకుఁ బా
వనతరమూర్తికి నమ్మని, మనస్సరోజాంచితభ్రమరవర్యునకున్. 81

క. తామరసోదరునకు ను, ద్దామభుజావీర్యనిర్జితప్రతిభటపూ
ర్వామరునకు నజరామర, తామహిమాస్పదునకును బుధప్రతిమునకున్. 82

క. భవనాశనీనదీతీరవిహారోత్సుకునకు నిందిరానన కేళీ
ప్రవణునకును యోగానం, దవినిర్మలమూర్తికిని సుధామయమతికిన్. 83

క. శ్రీదేవీవరునకుఁ బ్రహ్లాదవచనపాలమోదితాత్మునకు జగ
న్మోదావహకారణునకు, నాదినృసింహున కహోబలాధీశునకున్. 84

వ. అఖిలజగద్ధితావతారుండ వగునీకు విన్నపంబు సేయువిధంబుగా నే నొనర్పంబూనిన
కథాప్రసంగం బవధరింపుము. 85

క. సూత్రకథ భోజరాజచ, రిత్రమయా నడుమ ధర్మరీతులు నీతుల్
చిత్రకథలై తలిర్పఁగ శ్రోత్రసుఖముగా నొనర్పఁ జొప్పడి యుండున్. 86

వ. అదియెట్లను దత్తాత్రేయమునీంద్రుండు వక్తయు మహానందనుకాంభోజమహీశుండు
శ్రోతయుంగా నధిగతవిద్యాసమాజుం డగుభోజుండు పూర్వజన్మంబున బ్రాహ్మ
ణుండై యుండి దారిద్ర్యభారంబు తోరం బగుటవలన సంభవించినవిరక్తి కారణం
బుగాఁ దీర్థయాత్ర సేయుచుఁ బ్రయాగయందు నిష్టకామ్యసిద్ధి పొంది శరీరవిసర్జ

నంబు చేసి సజ్జనప్రియుండై పుట్టి లాటదేశంబునందు ధారానగరంబున కధీశ్వరుండై రాజ్యంబు సేయుచు నొకనాఁడు మృగయావినోదార్థంబు వనంబునకుం జని యందు సర్పటి యను నొక్కసిద్ధపుంగవుం గని తనపట్టణంబునకుఁ దోడ్కొని వచ్చుటయు వాఁ డట్లు చనుదెంచి యొక్కరాత్రి రహస్యవృత్తిం దనప్రభావంబు తెలుపం దలంచి పంచలోహమయంబై యొప్పు నప్పుడమిఱేనికోలువు చవికెం దనచేతధూమవేధి యనునౌషధంబుచేత శుద్ధసువర్ణంబు గావించి యొండేనియుంబోవుటయు మఱునాఁ డవ్విధంబు చూచి యాయద్భుతకర్మంబు సర్పటికృతం బని యతని వెదకించి కానక యొక్కకృతకమతంబున నాకర్షించి భోజుండు ధూమవేధి దా నపహరించుటయు నతండు కోపించి శాపం బిచ్చుటయుఁ దదీయప్రార్థనంబున శాపంబుఁ గ్రమ్మఱించుటయుఁ దదనంతరంబుభోజననిమిత్తంబున భోజసర్పటులకు సంవాదవశంబున వివిధపుణ్యకథాప్రసంగంబులు పుట్టుటయు ననువృత్తాంతంబులం గలిగి యిక్కావ్యంబు సర్వజనాకర్ణనీయంబై భోజరాజీయం బను పేరం బరగుఁ దత్ప్రారంభం బెట్టి దనిన. 87

క. మహితసముజ్జ్వలతేజుఁడు, విహితాచారైకరతుఁ డు వీరవినోద
స్పృహుఁడుబహుకార్యదక్షుఁడు, మహుఁడవుకాంభోజరాజు మహిఁ గడునొప్పెన్.

శా. అంభోరాశిగభీరుఁ డూర్జితయశోహారుండు ధర్మక్రియా
రంభస్వాంతుఁడు నీతిమంతుఁ డసిధారాతీర్థనిర్ముక్తసం
రంభారాతిబలుండు భూరిబలుఁడై రాజ్యంబు చేసె న్మహిం
గాంభోజక్షితినాథుఁ డున్నతబహుత్సాహాధుఁ డత్యున్నతిన్. 89

క. ఆనరపతిరాజ్యంబున, మానవు లందఱును ధర్మమార్గప్రవణుల్
దానత్యాగపరాయణు, లానందరసార్ద్రచిత్తు లధికధనాఢ్యుల్. 90

క. నరు లడిగినట్లు వానలు, గురియుచు సస్యములు పండుఁ గోలఁదికిమిగులన్
సురభులు ఘనముగఁ బిదుకును, ధరణిఁ బ్రజావృద్ధి తనరుఁ దద్రాజ్యమునన్. 91

వ. ఇట్లు సకలజనానురాగం బగురాజ్యంబు నిరంతరభూజ్యంబై చెల్లుచుండఁ బెద్దకాలంబు సనుటయుఁ బురాకృతకర్మంబు కారణంబుగా నప్పుడమిఱేనిమేన నతినికృష్టం బగు కుష్ఠరోగంబు ప్రవేశించిన. 92

ఉ. రాజుల మంచు లావునఁ బురాకృతకర్మముఁ ద్రోవఁ దీర దే
యోజను మున్ శుభాశుభము లొందక యంచు విరించి యత్తఱిన్
భూజనకోటికిం దెలుపఁ బూనెనొకో యన నేమి చెప్పఁ గాం
భోజనరేంద్రుఁ డాతెవులు పోవఁగఁ ద్రోవఁగ లేఁడ యేమిటన్. 93

వ. అ ట్లుండి యుండి. 94

ఉ. "అక్కట యేమి చేయుదు మహౌషధ సేవల దేవసేవలన్
దక్కక యీమహారుజ వృథాపరితాపముఁ బొంద నేల నే
నిక్కడ నుండి చేయుపని యెయ్యది గౌతమి కేఁగి యందులోఁ
స్రుక్కక మేను వైతు మఱి రోగము గీగము మాను నంతటన్." 95

క. అని తలఁచి తనదుతలఁ పె, వ్వనికిఁ బ్రకాశింప కుండ వసుధాపరిపా
లనమునకుఁ దనతనుజ, న్ముని నునిచి నిగూఢమార్గమున వెలువడియెన్. 96

వ. ఇట్లు కృతనిశ్చయుండై యరుగుదెంచునారాజు రాకఁ దనదివ్యజ్ఞానంబున నెఱింగి యమ్మహానది యాత్మగతంబున. 97

ఉ. "ఈతఁడు నన్నుఁ జొచ్చి తన హేయపుదేహము నుజ్జగించి ప్ర
ఖ్యాతిగ నూర్ధ్వలోకములు గాంచుటకుం జనుదెంచుచున్నవాఁ
డీతని కుష్ఠగంధము సహించుట దుష్కర మేమిభంగిఁ బో
ద్రోతునొకో యితండు కడుదూరమునంద తొలంగునట్లుగన్." 98

క. అని తలఁచి తగునుపాయము, గని మునిభామినివిధంబు గైకొని శీఘ్రం
బున నతఁడు వచ్చుమార్గం, బున కెదురుగ నొక్కమ్రానిపొంత వసించెన్. 99

వ. అయ్యవసరంబున. 100

క. స్రుక్కిన యంగుళములు దళ, మెక్కిన దేహము గాంతి యెడలినమొగముల్
[1]మక్కినచెవులును ముడిఁగిన, ముక్కును నై వచ్చి మహుఁడు ముద్దియఁ గనియెన్.

చ. కని మునిభామ గాఁ దలఁచి గ్రక్కునఁ జేరి నమస్కరించి మో
డ్చినకరయుగ్మము న్నుదుటఁ జేర్చిన నావనితాలలామ దీ
వన లొకకొన్ని యిచ్చి "బుధవత్సల యెచ్చట నుండి వచ్చి తే
పని కెట పోయె దీవు పరిపాటిగఁ జెప్పుము నాకు" నావుడున్. 102

వ. "ఏను గాంభోజదేశంబుననుండి వచ్చితి నాపోయెడిపని యే మని చెప్పుదుఁ దల్లి! తొల్లి మహా మహీభారధౌరేయుండనై యుండునప్పుడు సకలజనంబులకు దృష్టిప్రియంబై యుండునట్టినాగట్టియొడలి కిట్టికట్టిఁడిరోగంబు దైవకృతంబున సంభవించిన. 103

చ. కడుకొని కామినీజనుల కౌఁగిట నే మని యుండువాఁడ నా
కొడుకులఁ బొత్తునం గుడువఁ గొంకక యేమని పిల్చువాఁడ నా
యెడ కరుదెంచుసేవకుల కే మని యేఁ గొలు విచ్చువాఁడ నే
కడ చనువాఁడ నేది కడగా నిటు వేగెడువాఁడ ధీరతన్. 104

చ. అని మది రోఁత పుట్టుడు రయంబున గౌతమి కేఁగి యందులోఁ
దనువు తొలఁగువాఁడనయి తత్పరతం జనుచున్నవాఁడ నే"

---

1. మొక్కినచెవులును మునిఁగిన, ముక్కును (శ. ర. పా.)

ననవుడు "నమ్మచెల్ల' తను వాఱిసిఁ బుచ్చుట ధర్మమార్గమే
జనహితులైనరాజు లిటు చచ్చిన మెత్తురె శాస్త్రకోవిదుల్. 105

చ. అదియును గాక పూర్వకృత మైనయఘంబులు వ్యాధిరూపమై
పొదివినఁ దాను గైకొనక పోవునె చచ్చినఁ గర్మశేషమై
వదలక క్రమ్మఱం దగిలి వచ్చుట సిద్ధ ముపాయయుక్తిమై
మెదలినఁ గీడు తప్పుఁ దుది మే లొదవున్ విను నిక్క మెంతయున్. 106

వ. కావున నీ కొక్క యుపాయంబు చెప్పెద సకలజనవిధేయుం డగు నారాయణదేవుండు దత్తాత్రేయుం డను నామధేయంబుతో హేమకూటశైలంబున నున్నవాఁ డందుఁ జనిన నీకోర్కి సఫలం బగు నయ్యోగీశ్వరేశ్వరుండును మనుష్యులకు దృష్టిగోచరుండు గాఁ డతనిఁ గనుటకై యొక్కమంత్రంబు చెప్పెద నది యనుష్ఠించునప్పుడు గౌతమియందు దర్శనస్పర్శనాదుల వర్జింప వలయు నట్లు చేయనివాఁ డీమంత్రంబు పనిచేయ"దని చెప్పి యెప్పుడు నతండు తన్నుఁ దవవకుండునట్టివైరాగ్యంబు పుట్టించి యొకమంత్రం బుపదేశించి యతని మరలించి గౌతమి యథేచ్ఛం జనియె నది యట్లు కాదె. 107

క. ఉత్తము లాశ్రితులఁ గృపా, యత్తతఁ జేపట్టి ప్రోతు రటు గాకున్నన్
రిత్త చనఁ జేయ రొండుని,మిత్తంబున నైన బ్రతుకు మెయిఁ గొనఁ జేర్తుర్. 108

వ. అట్లు గౌతమిచేత నివర్తితుం డయి పోయి. 109

ఉ. సానుపరాగవస్త్రముఁ బ్రశస్తఫలాన్వితవృక్షవాటికా
నూనసువర్ణభూషణము నూర్జితపుష్పసమంచితాగ్రసం
హీనమణివ్రజాంచితము నిష్టసమాహితసింహపీఠమున్
బీనధిస్థితాబ్జహితబింబకిరీటము హేమకూటమున్. 110

చ. కని మహిఁ దగ్గిరిం గదిసి క్రమ్మెడునశ్రులు నిర్ఝరంబులై
తనర మహీభృదాఖ్య యుచితంబుగ నున్నతమూర్తితోఁ బ్రతి
ధ్వనికరణిన్ సుభాషితరవంబు చెలంగ నిజాంగరోగవే
దన మది డిగ్గఁ ద్రావి నడదాల్చినచుట్టపుఁగొండయో యనన్. 111

ఆ. అట్లు గదిసి యాతఁ డాపర్వతాగ్రంబు, నందు నొక్కరమ్య మైనచోట
విపులనిష్ఠతోడఁ దప మాచరింపంగ, మెచ్చి కృతకవేష మచ్చుపడఁగ. 112

ఉ. విల్లును నమ్ములుం గలము వేడుకఁ గైకొని సారమేయముల్
వెల్లుగఁ దోడ రాఁగ నతిభీషణమూర్తి వహించి యమ్మహీ
వల్లభుఁ డున్నచోటికి నవారణమై ననసూయపట్టి గ
ర్జిల్లుచు వచ్చెఁ గ్రూరుఁ డగుచెంచును బోలి మహోదయంబునన్, 113

చ. ఇటు చనుదెంచువానిఁ గని యాతఁడ పో మునిభామ నాకు న
క్కటికముతోడఁ జెప్పినయఖండితతేజుఁ డితండు నన్నుఁ గా
చుటకుఁ బ్రసన్నబుద్ధిఁ బొడచూపెఁ గృతార్థుఁడ నైతి నంచు నా
దట నెదు రేఁగఁ జూచుటయుఁ దా నటు క్రమ్మఱఁ బాఱెఁ గానకున్. 114

ఉ. పాఱఁగ నమ్మహీపతియుఁ బాయక తోడన పాఱెఁ బాఱి న
క్కాఱడవిం గిరాతపతి కాఁపుర ముండెడుపల్లె సొచ్చి పె
న్గోఱునుభంగి మాంసములు మెక్కుచు నబ్బంటిగ మ్రింగుచుండ నై
వాఱెడుభక్తి నత్రిసుతు నిష్టముగా మదిలోఁ దలంచుచున్. 115

వ. విసిగింపక కదియంబోయి దండప్రణామంబు చేసిన నతండు దన్నుఁ గైకొనక శబరాలయంబు వెలువడి పఱవం దొణంగిన. 116

ఉ. "ఎచ్చటికేఁగెదం కిట మునీశ్వర యేను దోన వత్తు నీ
వెచ్చినచోన యొత్తు నను జూడఁ గదే కృప నంచు" నాత్మలోఁ
బొచ్చెము లేనిభక్తి నృపపుంగవుఁడుం బఱతెంచుచుండఁగా
వచ్చి మునీంద్రుఁ డంత్యజులవాడ విశృంఖలవృత్తిఁ జొచ్చినన్. 117

వ. అందుండి సురాపానశీలు రగుచండాలు రనేకు లెదురువచ్చి తోడ్కొని పోయి హృద్యం బగుమద్యభాండంబు చూపుటయు నయ్యంత్యజులకు మొదటివాఁడై తదీయోచితకర్మంబులు నడపుచుండ నతనిచరిత్రంబులు చూచి రోయక మహాం డమ్మహామునిచరణాంబుజంబులు తనశిరంబు సోఁకునట్లుగాఁ బ్రణమిల్లిన నున్మత్తునిభంగి మత్తాలాపంబులు పలుకుచు నట పోయి పర్వతాగ్రం బెక్కిన నతండును దోడన యెక్కి యక్కపటవేషధారి నిట్లని స్తుతియించె. 118

చ. "తిమిరము గప్పిన న్నిఖిలదిక్కుల సిదగుమంచు పర్వి చి
త్తములకు భ్రాంతిఁ జేయుదువు దృశ్యము మిథ్యయుఁ గానలేక భూ
తములు భవాబ్ధిలోఁ బడుఁ బదంపడి నీకృపఁ జేసి ఘోరసం
తమసముఁ బాసి నిర్మలపదంబున సౌఖ్యముఁ బొందు నచ్యుతా! 119

క. చేరువ నుండియు నెక్కుడు, దూరంబై యుండు దఖిలదుష్టాత్ములకున్
దూరమున నుండియును గడు, చేరువయై యుండు దతివిశిష్టాత్ములకున్. 120

ఆ. దండిమీన వైతి తాఁబేల వైతి సూకరమ వైతి నరమృగంబ వైతి
వశ్వకంధరుండ వైతి నీభావ మేభావ మని తలంతుఁ బద్మనాభ! 121

క. ఇచ్చటఁ గిరాతవేషం, బచ్చుగ ధరియించి తంత్యజాకారతకుం
జొచ్చితి నీ విట్లైనను, బొచ్చెముగాఁ దలఁప బుద్ధి పుట్టదు నాకున్. 122

ఉ. అత్రిమహామునీశ్వరుతపోవనిజాతసత్ఫలంబు దే
వత్రయమాత గాఁగఁ జెలువం బగునయ్యనసూయ సెయ్యపుం
బుత్రుఁడు తోయజాతభవభూతగణేశులతోఁ దఁబుట్టు దాఁ
జిత్రచరిత్రుఁ డంచు నినుఁ జెప్పుదు రార్యులు యోగిపుంగవా! 123

వ. నీవార్తశరణ్యుం డగుదత్తాత్రేయమునీశ్వరుండవు గావే" యని బహుప్రకారంబులఁ
బ్రస్తుతించునతనివాగ్జాలంబునకుఁ జాల రంజిల్లి యమ్మునీంద్రుండు. 124

ఉ. కందును గుందు లేనిశశికాంతి వహించినసెమ్మొగంబుతోఁ
జెందొవజేకులం జులకచేయుజటావళితో సముద్యదిం
దిందిరబృందముం దెగడుదేహముతో సితపద్మపత్త్రరే
ఖం దనరారునవ్వెడఁదకన్నులఁ దోఁచుకృపారసంబుతోన్. 125

వ. నిజరూపంబు చూపి "యోరీ నీవు నాకందువలయు ట్లెఱింగి" యనిన నతండు భయభక్తి
సంభ్రమంబులు ముప్పిరిగొనుచుండఁ బ్రణామంబులు చేసి "దేవా! విన్నవించెద నవ
ధరింపు" మని యిట్లనియె. 126

క. "రోగమున కోడి ప్రాణ, త్యాగము సేయుటకుఁ దెంపు దలకొనుమదితో
నాగౌతమి కరుగుచు నెల,నాగను బొడగంటి నొకవనస్పతిపొంతన్. 127

క. కని ప్రణమిల్లిన నయ్యం,గన నావృత్తాంత మడిగి కడు వగచి తపో
ధనవంద్య నిన్నుఁ జెప్పెనఁ, బనివిని నీకృపకు నేడు పాత్త్రుఁడ నైతిన్. 128

వ. ఆయవ్వ యెవ్వ రగుటయు నెఱుంగ" ననవుడు దత్తాత్రేయుండు తనయోగదృష్టి
వలన నది గౌతమి యగుటయు నితనిపాపంబులు భరియింప నోపక యిట్లు చేసె
ననియు నెఱింగి యాతని నూఱడించి "యేను బ్రతిదివసంబును బ్రాతరుచితకృత్యం
బులు ప్రయాగయందుఁ జేయుదు మాధ్యాహ్నికానుష్ఠానంబులు హేమకూటపర్వ
తంబున ననుష్ఠింతు నిశాసమయకృత్యంబులు శ్రీరంగధామంబున నొనరింతు నిది
నాకు నియమంబై చెల్లు నీత్రిస్థానంబులును నాకు నతిప్రీతికరంబు లయి యుండు
నట్లు కావున నింతప్రొద్దు శ్రీరంగంబునకుం జని రేపకడవచ్చి నిన్ను రోగవిముక్తుం
జేయుదు నావచ్చునంతకు నిచ్చోటన యుండు" మని విజయంచేసిన. 129

క. ఆరాత్రి మహుఁడు తనదు,ర్వారదురితలతలు రే పవశ్యము దెగు నం
చారూఢిఁ గౌతుకము మదిఁ, గూరఁగ నిద్రించె నచటఁ గుశలత్వమునన్. 130

వ. మఱియుఁ బ్రభాతసమయం బగుటయు నమ్మహీపతికి నద్దివసంబున సంభవించుశరీర
నైర్మల్యంబు సూచించుచందంబున నంధకారంబు విరిసె నతనియంతర్గతానురాగంబు
దీపించురూపం బెఱింగించు తెఱంగునఁ బ్రాగ్దిశాభాగంబునఁ గెంజాయ పొడమెఁ
దదనంతరంబ. 131

క. జక్కవ లలరఁ జకోరము, లుక్కఱఁ గమలములు విరియ నొగిఁ గైరవముల్
సొక్కఁ సమస్తజనంబులు, మ్రొక్కఁ దిశలు వెలుఁగ భాస్కరుఁడు పొడతెంచెన్.

వ. అప్పు డప్పుడమిఱేఁడు యథోచితకృతప్రాతరనుష్ఠానుండై యమ్మునిశ్రేష్ఠునకు నెదురు
సూచుచుండె నంత. 133

క. తొలునాఁ డవ్విభు నచ్చో, నిలిపి చనినయోగిరూపసీరజనాభుం
డెలమి దళుకొత్త లక్ష్మీ, లలనాసహశయనకేళిలాలసగతులన్. 134

చ. వెలఁగుచు రంగధామమును జెంది విభావరి పుచ్చి వేఁకువన్
వెడలి ప్రయాగ కేఁగి సురనిమ్నగయందుఁ బ్రభాతకృత్యముల్
సలిపి నృపాలుపాలికిఁ దలంచినమాత్రన వచ్చెఁ గ్రేపుపై
నొలసినమక్కువన్ సురభి యుద్దవడిం బఱతెంచుచాడ్పునన్. 135

వ. ఇట్లు చనుదెంచి యతనియవయవంబులయందుఁ దనపాదరేణువు చమరి యరోగ
దేహుండవు గ మ్మని యనుగ్రహించిన. 136

క. తొడిగినకుప్పస మూడ్చిన, వడువున నారాజుమేన వసియించినయా
కడిఁదిరుజ లెల్లఁ బాసిన, నొడ లొప్పె సువర్ణభాతి నుజ్జ్వల మగుచున్. 137

చ. కమలము నాచు వెల్వడి వికాసము నొందినయట్లు మించుట
ద్దము తెర పుచ్చినట్టులు సుధాకరబింబము కందు వాసిన
ట్లమరినకాంతి నొప్పె విగతామయభావ మెలర్ప నమ్మహీ
రమణునిసెమ్మొగంబు రుచిరం బగునేత్రమరీచు లొప్పఁగన్. 138

క. తనమేను తాఁ గనుంగొని, మనమున నాశ్చర్యరసనిమగ్నుం డగుచున్
జనపతి ప్రహృష్టమతి న,మ్మునిపతికి బహుప్రణామములు దగఁ జేసెన్. 139

వ. అప్పు డమ్మునీంద్రుండు. 140

ఆ. "అడుగు మింక నెట్టియభిలాష" యనిన "నా, కింతకంటెఁ గోర్కి యేమి గలదు
స్వామి! యీకథాప్రసంగంబు వినువారు, నిరయరహితు లగుచు నెగడనిమ్ము." 141

వ అని జగద్ధితలబ్ధవరుండై యాభూవరుండు. 142

ఉ. "ఓమునినాథచంద్ర! కరుణోర్జితచిత్త! త్వదీయదర్శనం
బేమి యొనర్ప లేదు కడ యెవ్వరుఁ గానఁగ లేరు నీమహా
త్మ్యామృతవార్ధి కే ననఁగ నల్పుఁడ నెంతటివాఁడ నార్తర
క్షామణి వీవు నీకు సరిగల్గునె యెన్నఁడు నేజగంబునన్. 143

ఆ. ఏను వెనుక రాఁగ నేఁగుచో నప్పుడు, చోరఁగరానియిండ్లు చొచ్చి తీవు
భవ్యమూర్తి యైనబ్రాహ్మణాదైవంబ, వట్లు చేయ నేల" యనిన నగుచు. 144

ఉ. "నన్ను దృఢంబుగా నెఱిఁగినాఁడవు నాకుఁ బ్రవేశభూములై
యున్నగృహంబు లేల తెలివొందవు? భూవర! చెంచుపల్లెయుం
బన్నగ నంత్యజవ్రజముపట్టును నాశ్రమభూము లందుఁ గాఁ
పున్నజను ల్మను ల్లదుపయు క్తములు న్నిను మర్త్యభోజ్యముల్. 145

క. ఆమాయలచేఁ బ్రమియక, నీమనము ప్రబోధవీథి నిలుచుటఁ గాదే
యీమేలు గలిగె గౌతమి, యామహితహితోపదేశ మఫలం బగునే. 146

వ. కృతార్థుండ వైతి వా"మ్మనిన నతండు మఱియు నిట్లనియె. 147

ఉ. "నీవు జగన్నివాసుఁడవు నీకు సమస్తము నొక్కరూప యి
ట్లైవిలసిల్లుచుండియుఁ బ్రియంబు ప్రయాగము హేమకూటముం
తా వగురంగధామము నవం గలతావులు మూఁడు నంటి ల
క్ష్మీవర! యందుఁ జొప్పడువిశేషము నాకు నుపన్యసింపవే." 148

క. అనవుడు దత్తాత్రేయుఁడు, "జనవర! శ్రీరంగమహిమ సర్వము నీకుం
ముకు వినిపించెద నేర్పున, విను" మని యిట్లనియెఁ గరము వేడుకతోడన్. 149

ఉ. "ఆదికి నాది యైనపరమాత్మునినాభిసరోజమందుఁ గ
ల్పాదిఁ జతుర్ముఖుం డుదితుఁ డై శిశుభావముతో నుపక్రమం
బేది విమూఢునట్లు మది నెంతయు భీతిలు చున్నచోటఁ బ
ద్మోదరుఁ డంచ యై యతని యుమ్మలికంబు హరించువేడుకన్. 150

క. హరిశబ్దసముంచితముగఁ, బరువడిఁ దనుఁ జెప్పి చెప్పెఁ బ్రణవము మఱి య
ప్పరమార్థము సాధనముగ, విరించి సంధించె నఖిలవేదార్థములున్. 151

మ. కర మర్థిం హరిశబ్దపూర్వ మగునోంకారంబు జిహ్వాగ్రగో
చరమై యొప్ప నొనర్చు నెవ్వఁ డతఁ డాశ్చర్యంబు సంధిల్లఁగా
హరియించుం బహుజన్మసంచితసమస్తాఘౌఘముం సత్క్రియా
కరణాదిం బ్రభవించువిఘ్నములఁ నుగ్రద్వేషదోషంబులన్. 152

వ. అమ్మహామంత్రజపవిశేషంబున సమస్తభువనప్రపంచంబును సృజియించి యజుండును స్వతఃప్రకాశం బగుసత్యలోకంబు నిజావాసదేశంబుగా నుండి యుండి యథాకాలజనితం బగువిమలవిజ్ఞానంబునం జేసి నిహపరసాధనం బగునిత్యారాధనంబునకు నొక్క దివ్యమంగళవిగ్రహంబు వలయు నని యూహించి. 153

సీ. హరియురస్స్థలమునం దాదిభూషణములై తోఁచుసన్మణియుం బద్మమణియును
నముచిసూదనున కుత్తమవాహనంబులై కర మొప్పు వెల్లనికరియుం హరియు

నెవ్వ రే మడిగిన నిచ్చుశీలము గలపాఁడిగోవును వృషపంచకంబు
సురపితృ శ్రేణికిఁ బరితుష్టి గావించుమధురామృతము చంద్రమండలంబు

గీ. కలిగె నెందేని భువనవిఖ్యాతి యెసఁగ, నట్టిదుగ్ధాబ్ధితలమున కరుగుదెంచి
యధికతరనిష్ఠతోఁ దప మాచరించెఁ, గమలగర్భుఁడు విష్ణుఁ జిత్తమున నిలిపి. 154

చ. అతనితపోమహత్త్వమున కచ్యుతుఁ డెంతయు మెచ్చి కూర్మమై
వితతపయోధివీథి ఘనవీచులతోఁ దల చూపుచున్ శ్రుతి
ద్వితయసుఖాస్పదంబు లగుతిన్ననిమాటల గారవించి యో
చతురుఁడ! నీకు నెద్దియు నసాధ్యమె యేఁ గలుగంగ నెప్పుడున్. 155

చ. అనిన నతండు దిగ్గన నిజాంబకము ల్వికసింపఁ బ్రీతుఁడై
కనుఁగొనునప్డు వజ్రభయకంపితమై మును వార్ధి సొచ్చి దాఁ
గినపెనుగొండ దా నెదిరికిం జనుదెంచినభంగి నొప్పు నా
ఘనతరకచ్ఛపాంగహరిఁ గాంచి కరంబులు మోడ్చి యిట్లనున్. 156

ఉ. "ఆదియుగంబునందు నిను హంసముగాఁ గనుఁగొంటి నశ్వకం
ఠోదితమూర్తివై పిదప నొప్పితి మత్స్యతనూవిలాసివై
వేదము లుద్ధరించి తరవిందదళేక్షణ! యిప్డు కూర్మమై
నీదృశలీలలం బరగు నిట్టిభవన్నిజరూప మెట్టిదో. 157

క. ఆరూపము నిచ్చలుఁ జేయారఁగఁ బూజించునట్టియాసక్తి మదిం
గూరినది చూపవయ్య! సరోరుహదళనయన! నీకు మ్రొక్కెద భక్తిన్." 158

చ. అనవుడుఁ గూర్మరూపహరి యాతని కిట్లని యానతిచ్చె నో
వనరుహగర్భ! భక్తజనవత్సలభావ మెలర్ప నేను దా
ల్చినయవతారరూపము లచింత్యము లర్చ్యము లగ్రకీర్త్యముల్
వినవె శ్రుతిప్రపంచములు వేమఱు నిట్టుల చాటి చెప్పెడున్. 159

క. కడుపార నామిషము గొని, యుడుగక తలఁచియును జూచియుం బోదివియు నె
ప్పుడుఁ బ్రోచుచుండుఁ బిల్లల, నడరఁగఁ గమఠమును ఝషము నయ్యండజమున్.

వ. అట్లు గావున. 161

తే. తలఁచి రక్షింతు నను నాత్మఁ దలఁచువారిఁ, జూచి రక్షింతు ననుఁగోరి చూచువారిఁ
గదిసి రక్షింతు నను భక్తిఁ గదియువారిఁ, గమఠమత్స్యమరాళరూపములు దాల్చి.

మ. జనసత్త్వాదిగుణాంబులం గలుగునశ్వం బాజిలో నుగ్రశా
త్రవకోటిన్ గెలిపించి యాశ్వికు నిజస్థానంబు నొందించు మా
డ్కిన్ విషాదాస్పదమైనసంసృతి హయగ్రీవుండనై వెల్వరిం
తు వెసన్ నాపయిఁ జిత్త మున్నతనిఁ జెత్తు న్మత్పదప్రాప్తికిన్. 163

వ. కావున నస్మదీయావతారభేదంబులందు భేదబుద్ధి సేయక నన్నేకాఁ దలఁచి సేవించుసత్పురుషుండు గలిగెనేని వానియోగక్షేమంబు నాదియకా విచారించి యనుసంధింపుదు నది యెట్లంటేని నీవు నా దగుదివ్యరూపనిరీక్షణం బపేక్షించి తది పరమదుర్లభంబు తదేకనిష్ఠుండవై యింకనుం గొంతకాలంబు తపం బాచరింపు మనుటయు నతం డవ్విధంబునఁ దపంబు చేయుచుండ ననేకదివ్యవర్షంబులు చనుటయు నొక్కనాఁడు. 164

ఉ. మంగళతూర్యముల్ సెలఁగ మానితరత్నసువర్ణదీధితుల్
నింగియు నేలయుం దిశలు నిండఁగఁ బర్వ ఫణీంద్రబంధురో
త్తుంగవిశాలతల్పమునఁ దోఁచురమారమణీశుతోడ శ్రీ
రంగసమాఖ్యఁ బ్రస్ఫుటతరం బగుమంటప మద్భుతాకృతిన్. 165

క. దివిజులు సేవింప మునిప్రవరులు గొనియాడఁ గిన్నరప్రముఖులగీ
తవితానంబులు చెలఁగఁగ, యువతీకరచామరంబు లొప్పఁగఁ బొలయన్. 166

ఆ. అవతరించి యతనియగ్రభాగంబున, నిలువ నాతఁ డప్పనేత్రములకు
నవవికాస మొదవఁ బ్రవిమలజ్ఞానసం, భరితచిత్తుఁ డగుచు భక్తితోడ. 167

ఉ. పెక్కుప్రదక్షిణంబులును బెక్కుప్రణామములుం గ్రమంబుతోఁ
బెక్కుప్రశంసలుం బెరయఁ బెద్దయుఁ బ్రొద్దు ప్రమోదలీలఁ బెం
పెక్కువిరించిఁ జూచి కమలేక్షణుఁ డిట్లని యానతిచ్చె "నీ
మ్రొక్కుల కెల్ల నెల్ల యగుమూర్తిఁ జుమీ ననుఁ జూడు వేడుకన్. 168

క. నినుఁ బుట్టించితి నాభీ, వనరుహమున నిన్నుఁ బ్రోవ వచ్చితి నిపు డేఁ
బునరావృత్తిరహితమై, చనునస్మత్పదము నీకు సమకూర్తుఁ దుదిన్. 169

వ. ఇమ్మహామంటపం బస్మదీయసంకల్పంబునం జేసి స్వయంవ్యక్తంబై రమాసమేతుండ నగునాకు నిరవధికసుఖశయనయోగ్యంబై వైకుంఠపురంబునందుఁ బెద్దగాలంబుండి యిప్పుడు నీతపోవృక్షంబునకుఁ బరిపక్వఫలంబై యొదవెఁ గృతార్థుండవుగమ్ము పొ" మ్మనిన మహాప్రసాదం బనుచు మదభృంగసంగతం బగుకనకకమలంబునుం బోలె జగన్నాథసనాథం బైనయాదివ్యభవనంబు నిజలోకంబునకుం గొనిపోయి విరజానదీతీరంబున నిలిపి యాబ్రహ్మఋషిసమన్వితుండై పూజింపం దేజరిల్లుచుండెఁ గొం డొకకాలంబునకు నిక్ష్వాకుమహీనాథునకుఁ దపోలబ్ధం బయి మధ్యమలోకమండనం బగునయోధ్యాపట్టణంబున సరయూపాంత సకలజనసేవ్యంబై మెఱయుచుండె మఱికొండొకకాలంబునకు రఘుకులాబ్ధిచంద్రుం డగురామచంద్రుం డొసంగ దానవాన్వయభూషణుం డగువిభీషణుండు లంకానగరంబునకుం గొనిపోవునప్పుడు ధర్మ

వర్మ యనుచోళభూపతిచేత సంప్రార్థితంబై యుభయకావేరీమధ్యంబునఁ జంద్ర
పుష్కరిణీతటంబున సుప్రతిష్ఠితం బయ్యె నాభవ్యతీర్థం బఖిలతీర్థంబులకు నగ్ర
గణ్యంబు గావున నాశ్రీరంగశాయిం గొలుచువేడుకఁ జతుర్ముఖప్రముఖనిఖిలబృం
దారకులును దివస్పతిప్రభృతిదిక్పతులును సనకసనందనాదియోగీశ్వరులును వసిష్ఠ
వాలఖిల్యాదిమహామునీంద్రులును నంద వసియించి యుండుదురు నేను దద్గరిష్ఠ
గోష్ఠిఁ బ్రొద్దు పుచ్చుటకు నచ్చటికి నరిగి సుఖరాత్రి చేయుందు. 170

క. యాగంబుల నగుఫలమును, యోగంబులవలన నగుసమున్నతియును నా
నాగమవిహితార్చల నగు, భోగము శ్రీరంగసేవఁ బొలుపుగ నెగడున్. 171

ఆ. అఖిలతీర్థఫలము నంతవంతం బగుఁ, గాని రంగధామగామి యైన
యతని కొదవు నపునరావృత్తిసౌఖ్యంబు, దీనిఁ బోల వితరతీర్థతతులు. 172

వ. మఱియు హేమకూటమహత్త్వంబు చెప్పెద దత్తావధానుండవై యాకర్ణింపుము.

చ. అజునకుఁ బైఁడికొండయును సుధాంశుకళాకమనీయమౌళికిన్
రజతనగంబుఁ బోలె ననురాగ మొనర్ప మదీయబుద్ధికిన్
సుజనవరేణ్య వెండియును జాతుము విందుముగాని యిట్టి య
క్కజ మగుపర్వతంబు మఱి గల్గదు సుమ్ము ధరాతలంబునన్. 174

క. తక్కటి నెలవులకంటెను, నొక్కటి లక్షయును గోటియును గుణితములై
యెక్కుడుఫల మొసఁగుట నీ, చక్కటి కెచ్చోటివారుఁ జనుదెంతు రొగిన్. 173

చ. అసురుల కోడియోడి విబుధావళి వేసరి సంగరాంగణో
ల్లసితజయంబు గోరి మొదల న్నను నేగిరియందుఁ గాంచి రే
నొసఁగితిఁ దన్మనోరథము నొప్పుగ నేగిరి నట్టియిప్పుడా
నసులభ మైనయుగ్గిరి ఘనస్తుతిపాత్రము గాదె భూవరా! 176

క. హరిహరవిరించు లేకోదరు లయి పుట్టుటకుఁ దాన తానక మగుని
ర్భరవైచిత్రి కలదె పెఱ, గిరులకు నీ హేమకూటగిరికిం దక్కన్. 177

క. కావున నీపర్వతముప్రభావము వర్ణింప వశమె బ్రహ్మాదులకున్
నీ వింక వినుము చెప్పెద, భూవల్లభ! నీ ప్రయాగభూరిగుణంబుల్. 178

చ. అతులితభక్తి యొప్పఁగఁ బ్రయాగజలంబులఁ గ్రుంకునట్టిసు
వ్రతుఁడు పురాకృతాఘనికరంబులు సర్వముఁ బాఱఁ దోలు ట
ద్భుతమె ప్రయాగ యంచుఁ బెఱతోయములందు మునింగ నేనియున్
క్షితి నతినిర్మలుం డగుట సిద్ధ మతండు ధరాతలేశ్వరా. 179

చ. వెలయఁ బ్రయాగయందు నొకవిప్రున కన్నముఁ బెట్టి రేని న
య్యలఘుఫలంబు కోటిగుణమై యొదవుం గ్రతు వాచరించినన్

దలఁగొని యాగభాగములు తార భుజించుచుఁ గుతూహలంబునం
దొలఁగక దివ్యతేజములతోఁ జనుదెంతురు వేల్పు లందఱున్. 180

చ. పరఁగఁ బ్రయాగమాఘముద్విపక్షమునందుఁ బ్రహృష్టచిత్తుఁడై
పరువడిఁ దీర్థమాడుఘనపావనమూర్తి పునర్భవంబులం
బొరయఁడు వానివంశమునఁ బూర్వుల కెల్లను సంభవించు న
చ్చెరువుగ నాకలోకసుఖసిద్ధి యనేకసహస్రవర్షముల్. 181

క. అచ్చుగఁ బ్రయాగలోపల, విచ్చలవిడిఁ దనదుమేను విడిచినమనుజుం
డొచ్చెల్ల యేమి చెప్పుదుఁ, జెచ్చెరఁ గను నిష్టకామ్యసిద్ధి ధరిత్రిన్.” 182

చ. అనవుడు నానరేంద్రుఁడు ప్రియంబున నిట్లను నమ్మునీంద్రుతో
నొనరఁ “బ్రయాగ యందు మృతినొందినమానవుఁ డిష్టకామ్యముల్
గను నని యానతిచ్చి తనఘా! యిటమున్న ప్రయాగయందు నీ
యనువునఁ గన్నవారు గలరయ్య! జగంబున నెవ్వరేనియున్? 183

వ. అని తదీయనిదర్శనాకర్ణనకౌతుకాయత్తచిత్తుండై యడిగిన. 184

చ. మృగనరవక్త్రవిగ్రహవిమిశ్రసముజ్జ్వల! విస్ఫురత్త్రయీ
నగశిఖరానిరూఢ! భువనత్రయపావనతత్పరోల్లస
త్సుగుణగరిష్ఠ! దానవనిషూదన! శిష్టజనాభినందనా
నుగనుతివాక్యపూజితమనోజ్ఞ పదద్వయ! వైష్ణవప్రియా! 185

క. యోగీంద్రహృదయమందిర, భోగీశ్వరభోగశయన! భూగగనదిశా
భోగపరిపూర్ణ తేజ! ద, యాగుణమణిభూష! నిర్జితాశ్రితదోషా! 186

మాలిని. సజలజలదవర్ణా! సంతతానందపూర్ణా!
త్రిజగదభయకర్తా! దిత్యపత్యైకహర్తా!
వృజినవనకుఠారా! వీరశృంగారసారా!
సుజనగణహృదీశా! సూర్యకోటిప్రకాశా! 187

గద్యము. ఇది వాణీవరప్రసాదలబ్ధవాగ్వైభవ తిక్కనామాత్యసంభవ సుకవిజనవిధేయ అనంతయనామధేయప్రణీతం బైనభోజరాజీయం బనుకావ్యంబునందు ననుక్రమణికయు మహుం డనుకాంభోజమహీశ్వరుండు దత్తాత్రేయమునీశ్వరు నాశ్రయించి రోగవిముక్తుం డగుటయు నతనివలన శ్రీరంగమాహాత్మ్యంబును హేమకూట పర్వతప్రభావంబును బ్రయాగమహిమయు ననుపుణ్యకథాకథనంబు లాకర్ణించుటయుఁ నన్నది ప్రథమాశ్వాసము.

శ్రీ

భోజరాజీయము

ద్వితీయాశ్వాసము

శ్రీనారీనయనచకో
రానందసుధాంశుబింబ హరిదశ్వసహ
స్రానూనతేజ నిర్జర
సేనాసంసేవ్యమాన శ్రీనరసింహా. 1

ఆ. అవధరింపు దేవ భవదీయదివ్యాంశ, జనితుఁ డైనయత్రిసంభవుండు
నిజపదాబ్జరేణునిర్మలదేహుఁడై, తనరుమహుని కిట్టు లనియెఁ బ్రీతి. 2

తే. "అధిప! చెప్పెద వినుము ప్రయాగమరణ, మిష్టకామ్యసిద్ధిద మగు టెల్లఁ దొల్లి
వేదవేదాంగతత్త్వసంవేది యొక్క, విప్రవర్యుఁడు గలఁడు పవిత్రయుతుఁడు. 3

చ. ధనరహితుండు పుత్త్రసముదాయసమేతుఁ డుపాయశూన్యవ
ర్తనుఁ డరయంగ నాద్విజుఁడు తత్ప్రియభామయు బుద్ధిహీన జీ
వన మొనరింప నేర దిలు వాడ నెఱుంగదు భాండశుద్ధి లే
దనిశముఁ బోరుచుండుఁ దదుపాత్తపురాకృతకర్మమో యనన్. 4

తే. ఆతఁడు దిరుగని యూరును నతని చేత, నడుగఁ బడనిమానవుఁడును నతని చొరని
తోఁటయేని జాడలేదు మందునకు నైన, నగవు గా దిది నిక్క మానట్టునందు. 5

క. ఆలిని బిడ్డలఁ బ్రోచుట, కై లాఘవవృత్తి కగ్గమై నిర్ధనతా
ఖిలపయోధి మునుంగుచుఁ, దేలుచు దరిదాపు లేక తిరుగుచు నుండెన్. 6

వ. ఇట్లు సర్వశూన్యం బగుదారిద్ర్యదైన్యంబు సైరింపం జాలక సంసారంబువలనవిసివి
పంకనిర్మగ్నం బగుగోవునుం బోలె నమ్మహీదేవుండు తన్ను సముద్ధరింప దిక్కెవ్వరు
లేక దుఃఖంబునఁ గృశశరీరుండై యుండఁ గొండొకకాలంబు సనుటయు నొక్క
నాఁడు తనమనంబున నిట్లని చింతించె. 7

ఉ. "ఓలి గృహస్థధర్మముల నుండెడువానికి గ్రాసవాసముల్
చాలఁగఁ గల్గి పుత్త్రులఁ గళత్రము సౌఖ్యము నొంద బాధువుల్

మే లన నార్యకోటి మది మెచ్చఁగ నుండుట యుక్తి గాక యే
చాలును లేక యీచెనఁటిజాలిఁ బడం బని యేమి చెప్పుమా. 8

తే. కుడిచి కట్టినయునికిగా కిడుమఁబడుచు, నింట ని ట్లున్నఁ బురుషార్థ మేమి కలదు?
కడఁగి యిహమైనఁ బరమైనఁ గాక తాన, యూరకుండుట నరునకుఁ బౌరుషంబె?

ఉ. లావు గలంతకాలముఁ దొలంగక తాల్చితిఁ బెక్కుభంగులన్
జీవనభార మిప్డు ముదిసెం దల'' యంచుఁ బరోక్షసాధనా
భావము నెమ్మదిం దలఁచి భవ్యపథంబున నిశ్చితాత్ముఁడై
యావసుధామరుం డరిగె నయ్యఘనాశిని యైనకాశికిన్. 10

మ. కనియె న్విప్రుఁడు సర్వలోకహితవిఖ్యాతం జగన్మాతఁ బా
వనవాఃపూరతరంగసంఘనినదధ్వస్తాఖిలస్వాంతికా
వనిజంతువ్రజపాపభారమురజిద్వామాంఘ్రిజన్ ఫాలదృ
ఙ్మనజాటధ్వజ గర్వితాంబునిధిసంగన్ గంగ నుద్యన్మతిన్. 11

క. కని యానందించుచు మ్రొక్కిన కేలు లలాటవీథిఁ జేర్చి వచోగుం
భన మెసఁగఁ బ్రస్తుతించుచుఁ, దనరఁ గృతస్నానుఁ డయ్యెఁ దత్పుణ్యానదిన్. 12

మ. అతఁ డర్థిం దదనంతరంబ తలఁచెన్ హారామరాహారశో
భితవర్ణున్ జగదంతపూర్ణమహిమున్ బృందారకారాధ్యునిన్
జతురాస్యప్రణుతాంఘ్రిపద్మయుగళున్ జంద్రార్ధమౌళిన్ శివా
న్వితవామాంగు ననంగదర్పదమనున్ విశ్వేశ్వరున్ శంకరున్. 13

ఉ. నిచ్చలు గంగకుం జని వినిర్మలవారిఁ బవిత్రగాత్రుఁడై
వచ్చి శివాలయంబులును వైష్ణవధామములుం గ్రమంబునన్
జొచ్చి నమస్కరించుచును సువ్రతశీలుఁ డనంగఁ గాశిలో
మచ్చిక యుల్లసిల్లఁ బలుమాఱును బెద్దలయిండ్ల కేఁగుచున్. 14

వ. ఇట్లు పుణ్యతీర్థంబునఁ గొన్నిదినంబు లుండి యొక్కనాఁడు. 15

సీ. ప్రాణాంతికావస్థఁ బడినయప్పుడు గాని కలుగదు సిద్ధి యీకాశియందు
నంత చేయఁగఁ గల్గనవి తోలుచీరలుఁ బునుకపేరును జటాభూతిధార
ణంబులు భిక్షాటనముఁ గపాలపుఁగోర భూతసంగతి ప్రేతభూమియునికి
యివి యేల నాకు దుక్కొద్దు దేశాంతర మరిగిన ట్లగును నిట్లైతి నేని

ఆ. హీనదశకు నోడి యిలుడించి పరదేశ,మునకు నిట్లు వచ్చియును సపార
విభవ మొందకున్న వృథ గాదె యనుబుద్ధి, నాతఁ డచటు వాసి యరిగె ననఘ. 16

ఉ. వేగమ యేఁగి కాంచెఁ బృథివీసురముఖ్యుఁ డశేషయోగిసం
యోగము లోకకల్మషవియోగముఁ జారుతరంగమాలికా
భోగసముత్థితాంబుకణపూర్ణసమీరణపాలితాష్టది
గ్భాగము సన్మునీంద్రపరికల్పితయాగము నాప్రయాగమున్. 17

వ. కని కరంబులు మొగిచి యిట్లని స్తుతించె 18

తే. ఉర్విపై నశ్వమేధ యజ్ఞగర్వ ముడిపి, బ్రహ్మహత్యాపరుం డనుభయము వాపి
యొసఁగు సుకృతికిఁ బాపికి నొక్కగతియ, యన్యతీర్థములెనయె ప్రయాగమునకు. 19

చ. అవె దివిజాపగాజలము లల్లవె యాయమునాజలంబు లా
ధవళతయు న్వినీలతయుఁ దార్కొని చూడ్కికి వేడ్క చేసె మా
ధవసదనాంగణం బగుటఁ దత్పరిచారిక లర్థిఁ జందన
ద్రవమునఁ గ్రొత్తకస్తురిని దక్కక రేకలు పెట్టిరో యనన్. 20

చ. పొరిఁబొరి నీమహానదులఁ బుట్టెడుబుద్బుదఫేనపుంజవి
స్ఫురితతరంగమాలికలు చూడఁగఁ గన్నులపండు వయ్యె శ్రీ
ధరవిభవంబు చూడఁ బ్రమదంబున వచ్చిన యప్సరోంగనల్
కరకుశలత్వము ల్నెఱపఁ గైకొని పెట్టినముగ్గులో యనన్. 21

క. గంగాయమునలవిమలత, రంగంబులు ధవళచామరంబులు నసితో
త్తుంగబహుబర్హనివహము, సంగజజనకునకు వైచున ట్లొప్పెఁ గడున్. 22

చ. కలకల మొప్ప నంబువిహగంబులు గూడి చెలంగుటల్ మహో
జ్జ్వలహరికీర్తనంబులుగ సంఘటితోత్కటవీచికాచయం
బులు పటహాళిగా నదులు పొంపిరివోయెఁ బ్రయాగమాధవుం
గొలువఁగ వచ్చుభాగవతకోటుల పోలె ససంభ్రమంబునన్. 23

వ. అని గంగాయమునలసాంగత్యవిశేషంబులు గొనియాడుచు నందుఁ గృతస్నానుం
డై యాద్విజుండు. 24

చ. అళికులవర్ణు నున్నతరథాకృతిచారుసుకర్ణు నిందిరా
లలితకుచోపగూహనసులక్షితవక్షుఁ బయోరుహాక్షు నా
కలితఘనప్రతాపుఁ ద్రిజగన్నుతరూపు నిజాంఘ్రిజాపగా
మలసలిలోద్వహాస్ఫురదుమాధవుఁ గొల్చెఁ బ్రయాగమాధవున్. 25

ఉ. చూపులు విష్ణుమూర్తులకు సొమ్ముగ జిహ్వలు విష్ణుమూర్తి యా
లాపసుఖంబుఁ జెందఁగఁ దలంపులు విష్ణుమహత్త్వచింతకుం
బైపడుచుండ నిట్టు లగుభాగవతోత్తమకోటిచే జగ
ద్దీపిత మైనయవ్విమలతీర్థమునం దతఁ డుండె వేడుకన్. 26

వ. ఇట్లుండి యవ్విప్రుం డొక్కనాఁ డెప్పటియట్ల గంగాస్నానంబు సేయఁ నప్పు
డొక్కవనితాచతుష్టయం బచ్చటికి వచ్చి మరణోద్యోగంబున సంకల్పంబు
చెప్పుకొనుచుండిన నతం డద్భుతాయత్తచిత్తుండై కనుంగొనుచుండె నంత. 27

చ. కనకపుఁగుప్పలున్ మణినికాయములున్ ధనధాన్యరాసులున్
వినుతగజాశ్వసంఘములు విశ్రుతగోమహిషాదికంబులున్
దన కధికంబుగాఁ గలిగి దాతయు భోక్తయు నైనవాఁడు నా
కనయము భర్త గావలయు నం చొకభామిని కోరె వేడుకన్. 28

చ. తనవదనంబు వాక్సతికిఁ దానకమై చెలువొందఁ దన్నుఁ జూ
చినజను లందఱుం గవిత చెప్ప సమస్తకళాకలాపముల్
దనవశమై తలిర్ప నుచితజ్ఞుఁ డనంగఁ బొగడ్త కెక్కువాఁ
డనయము భర్త గావలయు నం చొకభామిని కోరె వేడుకన్. 29

చ. అనుపమసంపదాఢ్యుఁడును నంచితనిర్మలకోమలాంగుఁడున్
ఘనకవితారసోదయవికాసితచిత్తుఁడునై సమస్తభూ
జనపరిరక్షణక్షమతఁ జాలఁగ నొప్పి ధరిత్రి నేలువాఁ
డనయము భర్త గావలయు నం చొకభామిని కోరె వేడుకన్. 30

చ. కనకశలాకవోని తనుకాంతియుఁ బున్నమచంద్రుఁ బోలు నా
ననవిభవంబుఁ బద్మముల నవ్వుపరిస్ఫుటనేత్రరోచులున్
దన కమరంగ భావభవతంత్రములందుఁ బ్రవీణుఁ డైనవాఁ
డనయము భర్త గావలయు నం చొకభామిని కోరె వేడుకన్. 31

వ. ఇవ్విధంబునఁ బునర్భవానుభవంబు గోరి. 32

చ. తలకొని నాగకన్యకలు తత్తటినీతటి కేఁగుదెంచి వి
చ్చలవిడిఁ గేలి సల్పి నిజసద్మముఁ గ్రమ్మఱఁ జొచ్చుభంగిఁ దే
రెలమి దలిర్ప నానలువు రిందునిభాస్యలు నాస్యమండలం
బులు వికసింప నయ్యుదధిపూరమునందు మునింగి రిమ్ములన్. 33

ఉ. అంతయుఁ జూచి విప్రుఁడు ప్రియంబున నేనును నిట్లు చేసి యీ
కాంతలు నాకళత్రములు గాఁగ నభీష్టసుఖోపభోగముల్
గాంతు ధరిత్రిలో నని యకంపితచిత్తసరోజుఁడై యనా
ద్యంతుఁ బ్రయాగమాధవుఁ గృపాబ్ధిఁ దలంచి నమస్కరించుచున్. 34

సీ. దారిద్ర్యభూతంబు తనుఁ బాసి పోవు నీయుదకపూరము చొచ్చియున్న పనియుఁ
బెద్దకాలము మేనఁ బెరిగినపాపపంకము లిందు మునుఁగక కరఁగ పనియు

నిది శుద్ధజలరాశి యిందులో వెదకినఁ గోర్కిముత్యములు చేకూరు ననియు
నిందు డిందిననల్వురింతుల వెదలించి గుటిలేనికోర్కిఁ గైకొందు ననియు

ఆ. నిట్లు తెగువ చేసె నీవిప్రుఁ డని కొని, యాడునట్లు గాఁగ నతఁడు మునిఁగెఁ
జటులదురితతిమిరపటలప్రచండమార్తాండ మగుప్రయాగగుండమందు. 35

ఉ. అంతఁ బ్రయాగమాధవుఁ డనంతదయానిధి పద్మవాసినీ
కాంతుఁడు వారికోర్కి యొసఁగంగఁ దదీయవరోపలబ్ధి య
త్యంతనిరూఢమై నెగడునట్లుగ విప్రుఁడు సూర్యకాంతభూ
కాంతునియందుఁ బద్మవతి గాదిలిపల్లిగఁ బుట్టె మేదినిన్. 36

క. అవనితలు నొక్కొకవసుధావల్లభునందు సముచితం బగుప్రాదు
ర్భావము నొందిరి భాగ్య, శ్రీ విలసితరూపములు ప్రసిద్ధికి నెక్కన్. 37

వ. ఇట్లు పుట్టి యాద్విజుండు భోజుం డను పేరఁ బ్రసిద్ధుం డయ్యె నంగనారత్నం
బులు నలువురును సుగంధి పద్మగంధి కనకవతి చంద్రప్రభ లనునన్వర్థనామంబు
లతో నతనికి భార్య లైరి. ఇవ్విధంబున నతండు వివిధవిభవవిలసితుండును నత్యంత
రూపసంపన్నుండును సకలకళాప్రవీణుండును నై లాటదేశంబునందు ధారానగరం
బున కధీశ్వరుండై యనేకవర్షంబులు రాజ్యంబు చేసె నట్లుగావునఁ బ్రయాగతీర్థం
బిష్టకామ్యసిద్ధిప్రదం బని పలికితి" నని చెప్పిన. 38

చ. "విమలవిచార నీవలన వింటిఁ బ్రయాగమహత్త్వ మెల్లఁ ద
త్సముదితపూర్ణపుణ్యఫలజన్ముఁడు భోజవిభుండు భూమి యే
క్రమమున నేలె వాఁ డటులు రాజ్యము సేయుదినంబులన్ విశే
ష మొకటి యెద్దియేనియుఁను సమ్మనినాయక! రూఢి కెక్కెనే." 39

చ. అనవుడు నానృపాలునకు నామహనీయవివేకశీలుఁ డి
ట్లను "మును భోజుఁ డాదినృపులట్టుల రాజ్యము చేసె వానివ
ర్తనము నుతింప నల్వురకరంబె మహిం జతురుత్తరంబు గాఁ
దనరినమష్టివిద్యలు నతం డెఱిఁగింపక కల్గ వేరికిన్. 40

చ. తనుఁ గనుఁగొన్నవారు కవితాఘను లాదురు తద్విశేష మెం
తని గుటిపెట్టవచ్చు మనుజాధిప! యిన్నిటికంటె నెక్కుడిం
క నొకటి చెప్పెద న్విను మఖండితయై యొకవిద్య చేరె నా
తనికి సమస్తభూజనకదంబము ప్రస్తుతి చేయునట్లుగన్. 41

వ. అది యెయ్యది యంటేని. 42

ఆ. మనుజు లెల్లవిద్యలను జొచ్చి సాధింపఁ, గలరు కాని లోహకులము నెల్లఁ
బసిఁడి జేయువిద్య పడయ లే రెవ్వరు, నట్టివిద్య భోజుఁ డభ్యసించె. 43

వ. కావున నక్షేమవిశేషంబులకు నకరం డాశ్రయం బగుట వేఱ చెప్ప నేల యతనిచరిత్రంబు రామచరిత్రంబునుం బోలెఁ బరమపవిత్రంబై యొప్పు నతనికీర్తిలతాలవాలంబునకు నాలవాలం బగుధారానగరంబుమహిమ. 44

ఉ. సారకవీంద్రచాతకవిశాలహిరణ్మయవృష్టిధార ని
స్సారదరిద్రభారతరుషండవిలాసకుఠారధార సం
సారకృశానుతప్తజనశైత్యకరామృతధార గాక యా
ధార దలంప నన్యవసుధారమణీశపురోపమాన మే. 45

చ. కడఁగి రసాతలంబు భుజగంబులు వెల్వడి వచ్చి కొమ్మలం
బడగలు విచ్చి యాడునెడఁ బంకజమిత్త్రుఁడు రాహుశంకఁ బె
ల్లడరెడుభీతితో నరద మట్టును నిట్టును దోలు నిమ్నముం
బొడవును నేమి చెప్ప నను బొల్చు నగడ్తయుఁ గోటయుం బురిన్. 46

సీ. ఆచారమున బ్రహ్మ నైనను నోడించి పఱపంగఁ జాలుసద్బ్రాహ్మణులును
బరశురాముని నైనఁ బ్రధనవైముఖ్యంబు నొందింపఁ జాలురాజోత్తములును
నలకాధిపతితోడ నైన మచ్చరికించి కొన నమ్మఁ గలమేటికోమటులును
జట్టుపై నైన రాజనమును బెఱుకును గావింపఁ గలమహాకర్షకులును
తే. మదపుటేనుంగుతో నైన మాఱుపెనఁగి, విఱుగఁ దోలంగ నోపెడువీరవరులుఁ
గడఁగి విజితేంద్రియుల నైనఁ గరఁగఁ జేయు, జారసతులును నప్పురిఁ జాలఁ గలరు.

చ. సురపతిదంతిసంతతియొ సూర్యునివాజులపాగయ్యో పోరిం
బోరి నలకామధేనువునఁ బుట్టినక్రేపులతోయమో యనం
బరువడి నొప్పు నప్పురమభద్రగజంబుల పెల్లునుల్లస
త్తురగచయంబు పెంపు నవిదూషితగోనికరంబుపేర్మియున్. 48

క. మొగి నాఱును దొమ్మిదియును, నగురసములఁ గలుగుబహుపదార్థంబులు బ్రా
తిగఁ జవి గొననినరుం డా, నగరంబున మందు కడిగినం జొప్పడు నే. 49

ఉ. కైపద మిచ్చువారలును గ్రక్కునఁ బద్యము చెప్పువారలున్
రూపితసంస్కృతాదిపదరూఢి యెలర్ప మహాప్రబంధముల్
వే పొసఁగంగఁ బల్కి పృథివిం బ్రథితంబుగఁ జేయువారు ధా
రాపురమందె కాక కలరా మఱి తక్కినపట్టణంబులన్. 50

వ. మఱియు నప్పురంబు మేరుశిఖరిశిఖరోచ్ఛేదంబులు దెచ్చి కైలాసనగోత్తుంగశృంగంబులం గీలించినట్లు. కనకకలశశోభితంబు లగుసుధాధవళసౌధంబులవలనను గామగమనంబు లగుదివ్యవిమానంబులు గూర్చి భూలోకంబునం బ్రతిష్ఠించినట్లు

నానాముఖవాస్తులక్షణలక్షితంబులయి సముచితోపకరణబహుళంబు లగుగృహంబులవలనను భూగర్భనిక్షిప్తంబు లగునిధానంబులను సాధించి సకలజనగోచరంబులుగా నాచరించినట్లు సమస్తవస్తుభరితంబు లగువిపణివీథులవలనను విరహిజనమనోమథనుం డగుమదనునకుఁ గ్రొత్త లగునాయుధంబులు సమకూర్చి యిచ్చు సేవానిపుణిక లట్లు పౌరజనమనోహారిణు లగుపువ్వులావికలవలనను గానరూపవిశారద యగుశారద బహుపురుషరూపంబుల దీపించునట్లు మధురచిత్రాదివివిధావధానకవితాప్రవీణు లగుసుకవిజనంబులవలనను మేఘవాహనశిబిదధీచ్యాదులు క్రమ్మఱజన్మించిన ట్లనవరతదానశీలు రగువదాన్యులవలనను గారణజన్మంబులం గలకిన్నరమిథునంబునట్లు సమరూపవయోవిలాసచాతుర్యంబుల యొరపునెరపువిటవిటీ యుగ్మంబులవలనను ననంతుండు సురభూజబీజంబులు సంగ్రహించి దుగ్ధసముద్రంబు క్రయ్యొత్తున నారుపోసి యథాకాలోత్పాటనపాటవం బెసంగ నిటదెచ్చి కస్తూరికాకరీషపూరితంబు లగుపాదుల నిడి యమృతజలసేచనంబులం బ్రోది చేసినం బూవులవింటివాఁడు కావలి యున్నట్టు సతతసురభికుసుమవిసరంబుల నతిమధురరసభరితఫలనివహంబులఁ గలిగి నిత్యనవీనంబులగుతరులతావితానంబులవలనను మన్మథగాయత్రికిం బ్రణవోచ్చారణంబు చేయువిధంబున నాగగనపర్యంతంబుగాఁ జెలంగుకలకంఠధ్వనులను బలికి పలికింపక యలుకలు దీఱ వని ప్రణయకలహంబులఁ బరాఙ్ముఖులగు దంపతులకు హితోపదేశంబు సేయువిధంబున విచ్చలవిడిం బెచ్చు పెరిగి పలుకుకలికిరాచిలుకలకలకలంబులం జేసి యభిరామంబు లగునారామంబులవలనను రంగత్తరంగరంగవల్లికలను భ్రమద్భ్రమరధూమశ్యామంబు లగుపరిభాగంబులం గలుగునుత్ఫుల్లహల్లకప్రదీపంబులను నరుణకిరణకుంచికానిపాటితకవాటంబు లయి సరససౌరభసంవాసితంబు లగువికచకమలగేహంబులను లక్ష్మీసమాగమోత్సవాలంకృతి నతిశయిల్లునట్లు మధుమధురశీతలంబు లగుజలంబులం బరిపూర్ణంబు లగుదీర్ఘికలవలనను బ్రభాతసమయంబున నింటింటికి విందుచెప్ప వచ్చుబంధుజనంబున ట్లానందస్పర్శ గావించుచు మందమందగమనంబునం బొలయుమలయానిలంబులవలనను నపారవిభవోదారం బగునలకానగరంబు నధఃకరించి యమరావతికంటె నధికంబై పరమపదంబుకోఁ దమ యన నన్యపురసామాన్యంబై యొప్పునప్పురంబున కధీశ్వరుండు. 51

క. భోజుఁడు ప్రసన్నవచనాం, భోజుఁడు నిఖిలార్థికల్పభూజుఁడు విలస
త్తేజుఁడు సంభృతసుకవిస, మాజుఁడు రూపాదిజితరమాజుఁడు జగతిన్. 52

సీ. అమరమహీజంబు లైదును నైదుభూతములుగాఁ గూర్చి దేహము సృజించి
యతనుఁడై చరియించునంగజు ప్రాణంబు నెమ్మిఁ బ్రాణంబుగా నిర్వహించి

యదితికి దేవేంద్రుఁ డావిర్భవించినపుణ్యంపుఁబ్రొద్దునఁ బుట్టు వొసఁగి
భారతి దాదియై గారవం బారఁ బోషించునట్లుగ నియమించెఁ గాక

ఆ. నలినభవుఁడు కానినాఁ డిట్టిక్షితరణం, బిట్టిరూపమహిమ మిట్టివిభవ
మిట్టివిద్య యితని కెట్లు గల్గె ననంగ, భూమిఁ బ్రణుతి కెక్కె భోజరాజు. 53

క. బలిరాజ్యము రామమహీ, తలపతిరాజ్యంబు ధర్మతనయునిరాజ్యం
బిల నెట్టి దట్ల భోజుని, సలిలతరాజ్యంబు సర్వసౌఖ్యములందున్. 54

క. భ్రాజితమణిభూషాంబర, రాజివలన సమవిభావిరాజితు లగుటన్
భోజునియోలగమునఁ గవి, రాజుల రాజులను దెలియ రా దెవ్వరికిన్. 55

క. ఆపృథివీపతిధర్మం, బే పాటియు కాని యాతఁ డేలెడుధరలో
నేపట్టునఁ బొడగానము, యూపస్తంభములు లేనియూ రొకచోటన్. 56

చ. చతురత నీతిపెంపునఁ బ్రసన్నత నున్నతవిద్యలందు ధీ
రత సుకుమారతన్ సుకవిరాజసమాజసమాశ్రయక్రమా
ద్భుతరతిఁ గాంతిఁ దేజమున ధూతకళంకత నెన్ని చూడఁగా
నితఁ డొకరుండ పో నృపుల కెక్కుడు నాఁ దగు భోజుఁ డెప్పుడున్. 57

చ. జనవర ! భోజుఁ డట్లఖిలసమ్మతుఁడై ధర యెల్ల నేలుచున్
విను మొకనాఁడు [illegible]నగుణవిశ్రుతుఁ డాధరణీతలేశ్వరుం
డనుపమసత్వశాలి మృగయారతిఁ గాననభూమి కేఁగి కాం
చనరసలిప్తపుంఖశరసంహతిఁ గ్రూరమృగాళిఁ గూల్చుచున్. 58

క. తురగజవంబున మృగములఁ, బొరిగొని తమకమున నలపు పుట్టినయంతః
కరణముతో నతిదూరము, నరుగ నరుగ నెదుర నొకమహాటవిలోనన్. 59

తే. అఖిలవిపినంబులకుఁ దన్న యాధిపత్యమునకుఁ బట్టంబు గట్టిన యపువు ద్రోఁపఁ
దరువితానంబులో నెల్లఁ దాన యతిని, గూఢమై యొప్పు నొక్కన్యగ్రోధతరువు. 60

సీ. ఈమఱ్ఱియాకుఁగో యేకార్ణవమునాఁడు శేషాహిశాయికి సెజ్జయయ్యె
నీమఱ్ఱిమొదలనొకో మహాదేవుఁ డేకాగ్రచిత్తంబున నతిశయిల్లు
నీమఱ్ఱిభావమొకో మృగాంకుని మేనఁ బ్రతిబింబరూపమై పాయకుండు
నీమఱ్ఱిమీఁదనొకో మున్ను గజకచ్ఛపములతో లంఘించెఁ బక్షివిభుఁడు

ఆ. నిట్టిమఱ్ఱి యుండ నీద్వీపమును వటద్వీప మనక యేమి తెలివియొక్కొ
తొంటిపెద్ద లెల్లఁ దొడఁగి జంబూద్వీప, మనిరి నాఁగ నొప్పె నక్కుజంబు. 61

సీ. దిక్పాలపురములతెరు వేల యడుగ నీశాఖిశాఖలవెంటఁ జనఁగ రాదె
యంబరస్థల మెంత యన నేల యీమ్రానుఘనవిశాలత చూచికొనఁగ రాదె

యుడుమండలం బెంత పొడవౌనో యన నేల యీభూజ మెక్కిన నెఱుఁగ రాదె
యవని యేమిట నిల్చె నన నేల యీమ్రాన దిగినయూడలు చూచి తెలియరాదె
తే. యననఁగ నాశ్చర్యధుర్యమై యఖిలమృగస, మాజమాశ్రితచ్ఛాయమైయమరియుండుఁ
బక్షిపక్షచ్ఛదాఘాతపాతఫలస, హస్రవర్షోద్భటంబు మహావటంబు. 62

క. ఆయుర్వీరుహశిఖర, చ్ఛాయ పథశ్రాంతి దీర్ప సరభసమున భూ
నాయకుఁడు సుఖాసీనుం, డై యుండి తదీయవిభవ మిటు గనుఁగొనుచున్. 63

చ. బలితపుశాఖయందుఁ బదపద్మయుగంబుఁ బెనంచి పార్శ్వశా
ఖలఁ గరకాండముల్ సాఁచి కన్నులు మోడ్చి యధోముఖుండుఁడై
తలఁకొని వ్రేలుచున్న యొకతాపసుఁ గాంచె విభూతిభూషణో
జ్జ్వలుఁ డగువాని భోజనృపసత్తముఁ డావటభూరుహంబుపైన్. 64

చ. కని యితఁ డెవ్వఁ డొక్కొ యిటుగాఁ గత మెయ్యదియొక్కొ పిల్చినం
గినియక పల్కునొక్కొ పలికించెదఁ గా కనుమాన మేల యి
మ్మునివరు నంచు హస్తములు మోడ్చి శిరంబునఁ జేర్చి భోజుఁ డా
నన మొకయింత యెత్తి నయనద్యుతిసంపద యొప్ప నిట్లనున్. 65

క. వటతరుశాఖాలంబిత, పటుతరచరణ మగు మీతపశ్చరణము దు
ర్ఘటనము మీ రెవ్వరు మీ,కటాక్షలాభంబు నాకుఁ గానఁగ వలయున్. 66

వ. అనిన నతండు వినియుం విననియట్లుండిన. 67

ఉ. భోజుఁ డదేమియొక్కొ మునిపుంగవుఁ డేఁ బిలువంగఁ బల్కఁ డీ
భూజముమహోన్నతిం బలుకు పొందదొ వీనుల నిట్లుగాక తా
నేజగడంబు నొల్లక తదేకమతిం దప మాచరించువాఁ
డై జనభాష లేమి విన నంచు గణింపఁడొ యంచు నిట్లనున్. 68

క. 'అన్యుఁడఁ గాను భవాదృశ, మాన్యుఁడ భోజుఁ డను పేర మహిఁ బరగినరా
జన్యుఁడ ననుఁ జూడఁ గదే, ధన్యుఁడ నయ్యెద' ననిన నతఁడు ప్రీతుండై. 69

వ. కను విచ్చి చూచి యి ట్లనియె. 70

తే. 'అధిపవెలయునాశ్రమస్థుల కందఱకును, విను గృహస్థాశ్రమమువాఁడె వెలయనాఁత
యట్టిగృహమేధులకుఁ గీడు పుట్టకుండఁ, గాచుకర్తలు రాజులు గారె యరయ. 71

క. ఏతన్మాత్రమహీపతి, వే తగవును ధర్మమును నహింసారతియున్
నీతియు నవఁ గలయీగుణ,జాతము నీయందు గాదె శాశ్వత మయ్యెన్. 72

క. ఏకచ్ఛత్రముగా భూ,లోకము పాలింపు బంధులోకముఁ గరుణాం
జేకొని ప్రోవుము సజ్జన,లోకము మన్నింపు శత్రులోకవిదారీ. 73

శా. నీ బాహాపరిరక్షణంబునఁ గదా నిర్విఘ్నులై మాతపం
బేబాధం బడ కిట్లు చెల్లుట ధరాధీశా! గిరీశుం డ్రిలో
కీబంధుం గరుణారసార్ద్రహృదయుం గీర్వాణవంద్యుల్ దృఢ
ప్రాబల్యంబునఁ బట్టి యేఁ దప మొనర్పం గంటి నిశ్శంకతన్. 74

క. నీవును నీమంత్రులు నా, నావిధసుభటులును నేఁడు నాయింటికి ని
ట్లీవేళ నతిథు లయితిరి, గావున నాతిథ్య మిచటఁ గైకొన వలయున్.' 75

చ. అని తరుశాఖ డిగ్గి యతఁ డాతని నల్లనఁ జేర వచ్చినన్
గనుఁగొని భక్తిపూర్వకము గాఁగఁ బ్రణామ మొనర్చి మోడ్పుఁగే
లొనరఁగ 'నోమునీంద్ర! భవదుజ్జ్వలనామ మెఱుంగఁ జెప్పవే'
యనవుడుఁ బిన్ననవ్వు వదనాబ్జమునన్ బొడమంగ ని ట్లనున్. 76

క. 'ఒక పేరును నొకయూరును, నొకకులమును ననఁగఁ గలదె యోగీశ్వరజా
తికి నైనను బాఁపఁగ నేటికి సర్పటి యండ్రు న న్నొడికముగఁ బెద్దల్.' 77

చ. అని యుచితప్రసంగముల నానరనాథునిఁ బ్రీతుఁ జేసి యా
తనిమది కద్భుతం బొదవ దాఁచినచోటిపదార్థసంఘముల్
గొని చవులెంచునట్లు మునికుంజరుఁ డాక్షణమందె తెచ్చె న
య్యనిమిషధేనుసంస్మరణమం దొదఁగూడిన యట్టిభోజ్యముల్. 78

క. అట్టివె కావె తపస్వుల, కెట్టిపదార్థములు బ్రాతియే నిస్పృహులై
యిట్టుండుదు రట్టుండుదు, రెట్టుండినవారి నోరుల కేమన వచ్చున్. 79

వ. ఇట్లు సద్యస్సంకల్పితంబు లగునభిమతాహారంబులు దెచ్చి యారాజునకు నమాత్య
భృత్యసమస్తసైన్యంబునకుఁ దృప్తి గావించిన నారాత్రి యందు యుండి మఱు
నాఁడు. 80

క. తెలతెలవాఱఁగ భూపతి, వల నొప్పఁగఁ బ్రాతరుచితవర్తనములు వే
సలుపుచు సర్పటి కి ట్లను, 'వలయును మత్పురికి రా నవశ్యము మీరల్.' 81

వ. అని ప్రార్థించి పలికిన నానరేంద్రునకు న మ్మునీంద్రుం డి ట్లనియె. 82

తే. 'అధిప! మాబోఁటితపసుల కడవినుండి కూరగాయలు నమలుచు ఘోర
తపము సేయుచు నునికి యుక్తంబు గాక, చెలఁగి నగరప్రవేశంబు సేయ నగునె?'

క. నావుడు సర్పటితో నతఁ, 'డీవిధమున నాన తిత్తురే మీరు మదీ
యావాసం బిది వే రొక, తావే యి ట్లవధరింపుఁడా తెలియంగన్. 84

క. ఏ మీశిష్యుఁడఁ గానే, నామీఁది కృపాతిశయమునం జనుదేరం
గా మీకుఁ జనదె సందియ, మేమిటి?' కని పలుక నాతఁ డెంతయుఁ బ్రీతిన్. 85

ఆ. 'మేలు గాక పోదఁడు మీమాట లేనిటఁ, ద్రోపు చేయఁ జాల మీపురమున
కరుగుదెంతు' ననిన నాఁ గాక యని గంధ, సింధురాధిరూఢుఁ జేసె నతని. 86

క. దివిజగణంబులు గొలువఁగ, ధవళాశ్వము నెక్కి చయశతక్రతుగతి న
య్యవనీశ్వరుండు వివిధావనీశులు గొలువ నుత్తమాశ్వము నెక్కెన్. 87

వ. ఇట్లు సర్వటిం దోడ్కొని చని త్ర్యంబకసఖుం డగుకుబేరుండునుం బోలె నాధీరుండు వివిధవిభవోదారుం డగుచు నిరంతరాలంకారసారం బగుధారానగరంబు ప్రవేశించునప్పుడు. 88

చ. అలసవిలాసలీల నొక యంగన నెచ్చెలిమూఁపుమీఁదఁ గో
మలకర మూఁది యౌవనితమాటున మోము సగంబు తోఁపఁ బూ
విలుతునిదీమమో యనఁగ విభ్రమసంపద సొంపెలర్పఁగాఁ
బులకితగాత్రయై నిలిచి భోజమహీపతిఁ జూచె వేడుకన్. 89

సీ. కక్షభాగముల నఖవ్రణంబులమీఁదఁ గుచకుంభదీప్తులు గొనలుసాఁగఁ
దనరుకంఠమున దంతక్షతంబులమీఁద హారామలప్రభ లలమికొనఁగ
సురుచిరాధరబింబచుంబనముద్రపై మందహాసద్యుతి మాటుకలయ
ఫాలస్థలంబునఁ బరగులేఁజెమటపై నలకాగ్రసంచయ మంటికొనఁగ
తే. సురతతంత్రంబునందుఁ బ్రసూనశరుని, నెలమిఁ జరితార్థుఁ గావించి యేఁగుదెంచి
నేత్రయుగమున రాగంబు నివ్వటిలఁగ, భోజవిభుఁజూచె నొక్కపయోజనయన.

చ. ఒకసతి నాముఖం బమరునో యిది యొప్పునో చూడుఁ డంచు వే
డుకపడి యెల్లవారికిఁ గడుం రథసంబునఁ జూపవచ్చిన
ట్లొకముకురంబు చేతఁ జెలువొందెడునట్లుగఁ దాల్చి రాజవీ
థికిఁ జనుదెంచి భోజజగతీపతిఁ జూచెఁ బ్రియం బెలర్పఁగన్. 91

చ. అలరుపటీరశైలపవనాహతిఁ బయ్యెదకొంగు జాఱఁ గుం
తలములు చిక్కు జీఱువడఁ దద్దయు సంభ్రమ ముల్లసిల్లఁ జూ
డ్కులు దళుకొత్త నెచ్చెలులకుం దలమీఱి యొకర్తు వచ్చి వి
చ్చలవిడిఁ జూచె భోజనృపచంద్రుని భోగజితామరేంద్రునిన్. 92

ఉ. ఈతఁడు రూపసంపద సమేంద్రతనూజునిఁ బోలు నంచుఁ బ్ర
ఖ్యాతిగఁ జెప్పఁగా వినఁటినిఁ గాంచుటమేలని వచ్చెఁ గాక యీ
రీతివధూటు లెందుఁ గలరే యని చూపఱు పిచ్చలింపఁగా
నాతుక యోర్తు భోజనరనాయకుఁ జూడఁగ వచ్చెఁ జెచ్చెరన్. 93

సీ. భూచక్రమునఁ గలరాచబిడ్డల కెల్లఁ దిలకమై పుట్టినచెలువుఁ డితఁడె
కర్ణాదిదాతలకథ లెల్ల మఱపించి పేరు గాంచినదానశూరుఁ డితఁడె
సారంబు లగుచతుష్షష్టివిద్యలకును దాన తానక మగుధన్యుఁ డితఁడె
తనమోముఁ జూచినజనుల కెల్లఁ గవిత్వసరణిఁ జేకుఱఁ జేయుచతురుఁ డితఁడె
తే. నిఖిలరాజన్యమకుటమణిప్రభావిభూషితాంఘ్రిపద్ముఁ డగుభోజుఁ డితఁడె
యనుచుఁ గొనియాడుపౌరులహర్షభాష, లంబునిధిఘోషమునకంటె నతిశయిల్లె.

వ. ఇట్లు సమస్తజనంబులకు నయనపర్వంబు నిర్వహించుచుండ జని యేనుఁగు మొగసాల చొచ్చి యానరేంద్రుం డఖిలపరివారంబును నుచితప్రకారంబున వీడుకొల్పి సర్పటి నొక్కవీడుపట్టున విడియింపన్న నతనికి నర్హసత్కారంబు లాచరింపను నాప్తజనంబుల నియమించి యశ్వావతరణంబుచేసి యంతర్గృహంబునకు నరుగు నవసరంబున. 95

సీ. మదనుదీమంబులకదుపులై తోఁతెంచుగతిఁ బ్రీతిఁ గొందఱు కమలముఖులు
పసిఁడిపళ్లెరములఁ బంచవర్ణాక్షతప్రతతిఁ బద్మాకృతిఁ బరగఁదీర్చి
కర్ణికాకారము లాహారిద్రాకర్దమాదనంబున జ్యోతు లమర నిల్పి
రోలి నన్నింట సన్నేయఘృతంబుల నించి వెలఁదిపట్టున వత్తు లలవరించి
తే. యందుఁ బవమానబంధుని నావహించి, రథసమునఁ దెచ్చి కక్ష్యాంతరమున నిలిపి
యందముగ నివాళించి రయ్యవనిపతికిఁ, జారుకంకణముల ఝణత్కార మెసఁగ.

వ. అంత నమ్మహీకాంతుం డంతఃపురంబున కరిగి మజ్జనభోజనాదులు సలిపి యథావిహారంబుల దినశేషంబు గడపి తదనంతరంబున. 97

ఉ. శేఁగి చకోరదంపతులఁ బ్రేల్చినకల్మషపంక మిందులోఁ
దోఁగినఁ గాని పాయ దని తోయజబాంధవుఁ డిట్లు చేసెనో
నాఁగఁ బ్రశాంతి నొంది కిరణంబులవేఁడిమి దక్కి శైత్యముల్
గాఁగ రథాంగము ల్బెదరఁగా నపరాంబుధిఁ జొచ్చెఁ జెచ్చెరన్. 98

సీ. దిననాథమిత్త్రుఁ డేతెంచిన నపరదిగ్రమణిఁ జెందినమనోరాగ మనఁగఁ
గమనీయచక్రవాకద్వయాంగములఁ జొచ్చినవియోగానలకీల లనఁగఁ
జరమాచలాగ్రభూజములపైఁ బ్రాఁకినవిద్రుమలతాతతి యనఁగఁ
బశ్చిమాబ్ధీశునిప్రాసాదతలమున దీపించునునుఁజొపు తెర యనంగఁ
తే. గీరముఖభాతిఁ బుష్పితకింశుకంబుపగిదిఁ జాతపోతాంకురప్రతతిభంగి
నలరి పడమటిదెస యొప్పె నంతకంత, కధిక మగుచు సంధ్యారాగ మతిశయిల్ల.

క. సురభూరుహకుసుమంబులు, పోరిఁ బోరిఁ గానఁబడుభంగిఁ బొడమఁ దొడంగెన్
దరతరమ తారకంబులు, సోరిదిఁ బరార్భకులు ప్రేళ్ళఁ జూపుచుఁ జెలఁగన్. 100

సీ. లోకపాలోన్నతప్రాకారములయందు మృగమదపంకంబు మేదిరో కొ
వలయంపుఁ గొండపై నలరుతమాలంపుఁదీఁగె లెడలను సాఁగె నొకొ
యమునామహానది యన్నిచోట్లను ముంచి యడుమ్మార్గమున నిట్టపాడిచె నొకొ
యఖిలలోకంబులు నంజనచ్ఛాయగాఁ బద్మసంభవుఁ డచ్చుపఱచె నొకొ
ఆ. యనఁగ మిఱ్ఱుఁ బల్ల మని యేరుపఱుపరా,నట్టిభంగి మిగుల దట్ట మగుచు
జారచోరనికరసంచారహేతువై, యొదవె నంధకార ముర్వియందు. 101

వ ఇట్లు తమోవిజృంభణంబు చెల్లునవసరంబున నప్పురంబు గృహదీపంబులవలనను కరదీపికానికరంబులవలనను జేసి మహానాగంబులశిరోభాగంబులం దోఁచు రత్నదీధితులవలన శోభిల్లుపాతాళకుహరంబునుం బోలె నుండునంత. 102

సీ. ప్రాగ్దిశాభామిని పశ్చిమాంగనచేతి కందిచ్చు నిద్దంపుటద్ద మనఁగ
పడిఁ జకోరంబులపడ దీర్ప నమృతంబు నిలిపినపటకంపుఁగలశ యనఁగ
విరహులపై దండువెడలుమన్మథునకుఁ బట్టినధవళాతపత్ర మనఁగ
నమరేంద్రరక్షితం బగుసుధాకలశంబుమీఁదఁ బొంపిరిగొన్న మీఁగ డనఁగ
ఆ. దిమిర మడఁగఁ గుముదసమితి విజృంభింపఁ, గమలవనము లెల్లఁ గన్నుమూయ
సకలలోకములకు సంతాప మేపారఁ, దూర్పువలనఁ దోఁచెఁ దుహినకరుఁడు. 103

క. అతుహినకరకరావళి, యాతతనక్షత్రయుక్తమై బుద్బుదసం
ఘాతయుతం బగుదివిజన,దీతోయము వెలి యనఁగ దీపించుటయున్. 104

క. జగ మెల్లఁ బాలఁ దోఁగిన, పగిదిఁ బటీరమునఁ గలయఁ బ్రామినభంగిన్
గగనసరిత్సైకంబున, నిగిడించినయట్లు నెగడె నిర్మలభాతిన్. 105

సీ. కొండ లెల్లను వెండికొండఁ బోలెఁగఁ గామదమనుండు ప్రమథబృందంబుఁ బిలువ
జలము లన్నియు దుగ్ధజలధిఁ బోలెఁగఁ జక్రపాణి యెచ్చటనైనఁ బవ్వళింప
సతు లందఱును సరస్వతిఁ బోలఁగను బ్రహ్మ పరికించి మఱి తనభామ నెఱుఁగ
దంతు లన్నియు నభ్రదంతిఁ బోలెఁగ వజ్రి తనదంతికందువ తప్పి తిరుగ
ఆ. దెసలఁ గలయఁ బర్వి వసుమతీతల మెల్ల, నిండి యాకసమున నివ్వటిల్లి
తారహారహీరధవళమై చంద్రికా,జాల ముల్లసిల్లె జగమునందు. 106

సీ. నునులేఁతవెన్నెలకొనలు మెల్లనఁ ద్రుంచి పిల్లతండమునకుఁ బెట్టునవియుఁ
జవియైనవెన్నెల చంచులఁ గబళించి యింపారఁ బ్రియుల కందిచ్చునవియుఁ
గడఁగి యింతటఁ గాని వడదేర దనుభంగిఁ దనర వెన్నెలవెల్లి మునుఁగునవియుఁ
బగలింటియాఁకలి పాయఁ బైఁబైఁబడి ముదురువెన్నెల గ్రోలి పొదలునవియుఁ
తే. కడుపునిండినఁ గసికాటుకఱచునవియుఁ,గూడియొండొంటితోఁ జెరలాడునవియు
నగుచు వెన్నెల తమసొమ్మె యనినయట్లు,కోరి చరియించెఁ జదలఁ జకోరచయము.

శా. ఆవేళ న్వివిధాశ్రితవ్రజచకోరానందుఁడై విస్ఫుర
ద్భావుండై విలసత్కళాకలితుఁడై భంగీకృతారాతిభూ
పావష్టంభతమస్కుఁడై కువలయాహ్లాదప్రదుండై యశః
శ్రీవిభ్రాజితచంద్రికుం డయి తనర్చెన్ భోజరా జున్నతిన్. 108

సీ. సంగీతవిద్యాప్రశస్తమానసులతోఁ గూడి వినోదించుఁ గొంతదడవు
సాహిత్యవిద్యావిశారదాత్మకులతోఁ గూడి వినోదించుఁ గొంతదడవు
నృత్తవిద్యాకళాయత్తచిత్తులతోడఁ గూడి వినోదించుఁ గొంతదడవు
వాద్యవిద్యానిరవద్యభావకులతోఁ గూడి వినోదించుఁ గొంతదడవు
ఆ. శబ్దశాస్త్రమంత్రశాస్త్రధనుశ్శాస్త్ర, తురగశాస్త్రవిదులతోడిగోష్ఠి
నడుపుఁ గొంతతడవు నయశాస్త్ర వేదులఁ, గూడి మాటలాడుఁ గొంతదడవు. 109

చ. దళమగుహంసతూలనిజతల్పమునందు నిజప్రియాంగనా
లలితకుచోపగూహనముల న్మధురాధరపానలీలలం
దలకొని యంగము ల్పులకితంబులుగా సుఖియించు నవ్విభుం
డెలమిదలిర్పఁ గొంతతడ విక్షుశరాసనుఁ గ్రేణి సేయుచున్. 110

వ. మఱియు నెవ్వేళ నెయ్యది కర్తవ్యం బట్టికృత్యం బప్రమత్తుండై యొనర్చు నప్పు
డమితేనికి నిమిషార్ధంబును నిరర్థకం బయి పోవ దిట్లు నిశాసమయధర్మంబులు
చెల్లుచుండ నక్కడ సర్పటిసిద్ధుండు. 111

క. నను నీతఁడు వేడుకపడి, కొనివచ్చెను వీనితోడిగోష్ఠికిఁ దగులై
యునికి తగ దితని కొకమే, లొనరించి యథేచ్ఛఁ జనుట యుక్తము నాకున్. 112

వ. అని తలంచి పంచలోహకల్పితం బగునతనికొలువుచవికె సువర్ణంబు గావించుటకు
నం దున్నదీపశిఖపయి నొక్కయావధం బెవ్వరు నెఱుంగకుండునట్లుగా వైచి
యథేచ్ఛం జనియె. 113

తే. అంత గృహదీపతతి కుంకు సంబరమునఁ, దనరునక్షత్రపంక్తియుఁ దరతరంబ
వెలరుపాఱుచు వచ్చె నుర్వీరుహములఁ, బక్షులు గలకలంబునఁ బలుకఁ దొడఁగె.

సీ. సర్పటిచే నొండొనర్పంగఁబడినమహాద్భుతక్రియ చూడ నరుగుదెందు
నిద్ర చాలింపుఁడు నెలఁతలకౌఁగిళ్ళ మెల్లన వదలుండు మేనులందుఁ
బొడమినఘర్మాంబుపూరంబు లన్నియు నిడ పోవఁ జల్లెద నీక్షణంబ
యివ్వేళ నొడలికి హిత మగుశ్లోకంబులాల మనుభవింపుఁడు మేలుకనుఁడు ప్రీతి
ఆ. ననుచుఁ దెలుప వచ్చునట్లు వాతాయన, పథమునందు నడ్డపాటు లేక
తగిలి గృహగృహంబు తప్పక ప్రత్యూష, మారుతంబు వీచె మలసి మలసి. 115

క. అప్పుడు తూరుపుదిక్కున, విప్పినచెంగావివలువవిధమున రాగం
బొప్పఁగఁ బ్రభాతసమయము, చొప్పడియె రథాంగములకు సొంపుగ నంతన్. 116

సీ. ప్రాగ్దిశాసతిపాణిపల్లవంబునఁ నుండి తోఁచుమాణిక్యకందుక మనంగఁ
గైసేయువేళ నాఖండలాంగనమ్రోల రాజిల్లురత్నదర్పణ మనంగ
నిర్జరనాగంబు నిటలస్థలంబునఁ దీర్చినసిందూరతిలక మనఁగఁ
జక్రవాకములకు శాంతిగా వెలిచి ప్రజ్వలించినవహ్నిపటల మనఁగ
తే. నుదయరాగ సంపద బింబ మొప్పమిగుల, నఖిలదిక్కులఁ దనతేజ మతిశయిల్ల
నెల్లవిప్రులునర్ఘ్యంబులెత్తిమ్రొక్క, భానుఁడుదయించెఁద్రైలోక్యబాంధుఁడగుచు. 117

వ. ఇట్లు సూర్యోదయం బగునంతకంటె ముందర. 118

ఉ. మంగళపాఠకధ్వనులు మాగధగీతులు వందిబృంద ము
ప్పొంగి యొనర్చుసంస్తుతులుఁ బూర్ణపయోధిరవంబుచాడ్పునన్
సంగతమై శ్రుతిద్వితయసౌఖ్య మొసర్పఁగఁ జేర్చి భూమిభృ
త్పుంగవుఁ డార్యసమ్మతుఁడు భోజుఁడు మేల్కనియెం బ్రియంబునన్. 119

క. అతఁ డట్లు మేలుకని యచ్యుతు సంస్మృతియందుఁ దగిలి శుభలక్షణల
క్షితము లగునిజకరాంభోజతలంబులు చూచుచుండుసమయమునందున్. 120

చ. వనధికిఁ బుట్టెనొండె హిమవద్గిరికిం బ్రభవించెఁ గాని యీ
ఘనకుచ యన్యసంజనిత కా దనఁగాఁ దగుకాంత యోర్తు కాం
చనమయపాత్రికన్ సురభిచందనపుష్పఫలాదివస్తువుల్
గొని చనుదెంచి చూపుమెఱుఁగు ల్వెదచల్లుచు మ్రోల నిల్చినన్. 121

వ. భాగ్యదేవతాయత్తంబు లగునర్థంబు లాత్మాయత్తంబులు గావించునట్లు భక్ష్యంబు
లగుతదీయద్రవ్యంబు లంగీకరించి యారాజశేఖరుండు. 122

సీ. పాదపద్మంబులఁ బసిఁడిపావలు మెట్టి సముచితమందయానమున వెడలి
శౌచియై వార్చి సుస్థలమునఁ బ్రాఙ్ముఖుండుగ సుఖాసీనుఁడై పుణ్యకాష్ఠ
మున దంతధావనం బొనర మౌనస్థుఁడై చేసి సుస్నాతుఁడై శిఖియం ధౌత
వస్త్రంబు నుత్తరావాసంబు గోపికాచందనంబును దన కంద మొంద
ఆ. నాచరించె వైదికాచారవిధు లెల్ల, దాన మొసఁగె విప్రతతులఁ బిలిచి
భూమిధాన్యరత్నహేమగోమహిషాశ్వవస్త్రభూషణాదివస్తుచయము. 123

ఉ. అంతఁ బ్రసూనగంధవివిధాభరణాదులు దాల్చి యమ్మహీ
కాంతుఁడు రాజచిహ్నలఁ బొగడ్త వహించి సమస్తమంత్రి సా
మంతపురోహితాప్తభటమండలి గొల్వఁగ వేత్రహస్తు లం
తంతనఁ జూచి పాయుఁ డనుసట్టియెలుంగులు నింగి ముట్టఁగన్. 124

వ. భూలోకపాలనలాలసుం డగు త్రిదశపాలుండునుం బోలె నమ్మహీపాలుండు వివిధ విభవవిశాలుం డగుచుఁ గక్ష్యాంతరంబులు గడచి కొలువుకూటంబునకు నరుగునవసరంబున నిద్దఱుభృత్యు లెదురువచ్చి భయభక్తియుక్తంబు లగుచిత్తంబు లుత్తలపడుచుండఁ బ్రణామంబు లాచరించి యి ట్లని విన్నవించిరి. 125

క. 'దేవర పెట్టినచోటం, గావలి యుండుదు మొకించుకయు నాలస్యం
బేవంకను లేదు ధరిత్రీవర! కడు మోసపోయితిమి విను నిన్నన్. 126

ఆ. ఏమి దైవికంబొ యెఱుఁగ మెవ్వారును, జొచ్చి వెళ్ళినట్టిచొప్పు లేదు
పంచలోహమయవిభాసితం బగుమన, యనుఁగు మేడ పసిఁడి యయ్యె' ననిన. 127

క. 'వింటిమి మాచేఁ గ్రొత్తలు, కంటిమె లోహంబు లెందుఁ గనక మగుట య
య్యింటికి నిట్టిమహిమ యెటు, వంటిమహాత్మునిచేత వర్తిల్లెనొకో!' 128

వ. అని పలుకుచుం దన మేనును బరిజనంబుల మేనులును గలయ నవలోకించి 129

క పసుపున నానినచీరలు, ముసుఁగుపడినయట్లు దేహములఁ బీతరుచుల్
పొసఁగినయవి కనకగృహము, పసిమియె కాకున్నె యని నృపతి వెఱఁగందెన్. 130

వ. ఇట్లు వెఱఁగందుచుఁ బోయి. 131

సీ. కుంభినిఁ బగిలించుకొని మీఁది కుబ్బినపృథునిధానంబులవ్రేక మనఁగ
ఘనసమీరణహతిఁ దునిసి మేదినిఁ బడి చెన్నొందు హేమాద్రిశిఖర మనఁగఁ
ఖర్వవైభవము చూడ నర్రుదెంచి శ్రీకంఠసఖుఁ డుర్వి నిడినపుష్పక మనంగఁ
గామరూపము పేర్మి గలవైనతేయఁడు చేకొన్నమూర్తివిశేష మనఁగ

ఆ. సకలదిశలయందు సంపంగి రేకులు, చల్లినట్లు తనవిశాలకాంతి
చాల నెసఁగ నొప్పుసౌవర్ణగేహంబుఁ, జూచి భోజవిభుఁడు చోద్య మంది. 132

చ. 'ఇది కడునద్భుతం బిచట నెవ్వఁడొకో యిటు చేసి పోయె స
మ్మదమున నొక్కదివ్యుఁడు విమానగతుం డయి వచ్చి యిచ్చమై
నది యిట డించి యాచవికె యాదటఁ దాఁ గొనిపోయె నొక్కొ యె
య్యదికత మొక్కొ హేమమయమై యిటు లుండుట యొక్కరాత్రిలోన్'. 133

చ. అని తలపోసి యాచవికెయందు వెలుంగుప్రదీపవహ్నియుం
గనుఁగొని సర్పటిం దలఁచి కంటి నతం డిటు ధూమవేధిచే
ననువుగఁ జేసినట్టిపరమాద్భుతకృత్యము గాఁగ నోపు నా
యన యెటు పోయెనో వెదకుఁడా యని భోజుఁడు సంభ్రమంబుతోన్. 134

క. తనపరమాప్తులఁ బంచినఁ, జని పుర మంతయును వెదకి సర్పటి నెచ్చో
టను గానక క్రమ్మఱి వచ్చినఁ బశ్చాత్తాపతప్తచిత్తుం డగుచున్. 135

ఉ. 'అక్కట! మోసపోయితి ననర్ఘ్యమణీఖని చేతి కందియుం
దక్కక పోయిన ట్లతఁడు దాఁ జనుదెంచియు దుస్సిపోయె నిం
కెక్కడఁ గందు? నప్పురుషుఁ డెక్కడఁ బోయెనొ? యేమి చేయుదుం!
గ్రక్కునఁ బోవరన్న ముచు గాంచిన యవ్వటశాఖియొద్దకున్.' 136

క. నావుడుఁ దద్భటనికరం, బావటశాఖి(ప్రకము)పికడ కేఁగి యంతయుఁ గలయం
గా వెదకి వచ్చి 'యోపృథివీవర! కాన' మని విన్నవించి యరిగినన్. 137

ఉ. ఆతఁడు దాను నిచ్చటికి నాదటతోఁ జనుదెంచునట్టిప్ర
ఖ్యాతపుమార్గ మేమిగతిఁ గల్గునొకో యని చింత చేసి యా
భూతలనాయకుండు తనబుద్ధి నుపాయ మొకండు గాంచి య
జ్ఞాతవిధంబునందు నది సాధ్యము చేయఁ దలంచి నేర్పునన్. 138

ఆ. 'శబ్దభేది గలదు చర్చింప భోజభూ, పాలునగర' మనుచుఁ బట్టణమునఁ
జాటఁ బంచె నంత సకలదేశముల న, వ్వార్త మించె నెల్లవారలకును. 139

సీ. అట్లు కర్ణాకర్ణి నవ్వార్త విని భూమిఁ గలసిద్ధు లెల్ల నయ్యలఘువిద్యఁ
బరికించు వేడుక నరుదెంచుచుండంగ నవనీశ్వరుండు రహస్యవృత్తి
నప్పైఁడిమేడ దా విప్పించి యొక్కొక్క ప్రతికి నూఱును వేయిప్రతులు గాఁగఁ
గప్పుర లాతంబు ఘనకమండలువులు మొదలుగా నన్నియుఁ మున్న చేసి

ఆ. యితరు లెఱుఁగకుండ నిది యెవ్వ రేమి దెచ్చినను వానిఁ బుచ్చుకొని తొలంగ
వైచి యిచ్చుఁ దనసువర్ణకల్పితములు, బొంకు నిక్క మయ్యె భోజమతము. 140

క. వారును దమ తెచ్చినయవి, బోరనఁ దనవిద్యవలన భోజుం డిచ్చెం
గారవముఁ జేసి మాకిం, పారఁగ నిచ్చె నని సుముఖులై చనుచుండన్. 141

తే. తీర్థముల కేఁగున ట్లెల్లదేశములజ, నంబులును భోజవిభునిఁ బ్రియంబుతోడఁ
జూడ నరుగంగ నర్పటి చోద్య మంది, నెమ్మి నిట్లని తలఁచుఁ జిత్తమ్మునందు. 142

చ. 'వెలయఁగ శబ్దభేది యనువిద్య జగంబున భోజరాజుచేఁ
గలదఁట వాఁడెపో నృపనికాయము కెల్లను మేటి వానిచేఁ
గలుగుట యేను ము న్నెఱుఁగఁ గాని యెఱింగినఁ బుచ్చుకొందు నాఁ
డేమి దలిర్ప నప్పురికి నేఁగినయప్పుడ మిత్త్రభావనన్. 143

ఆ. ఇంక నైన నచటి కేఁగి యానరనాథ, చంద్రుచేత నున్నశబ్దభేదిఁ
బుచ్చుకొనఁగ వలయుఁ బోలుపార నాచేత, నున్నధూమవేధి యొసఁగి యైన. 144

ఉ. తక్కవజాతియందు వనితామణి యున్నను నీచమర్త్యునం
దెక్కువవిద్య చొప్పడిన నెంగిలిచోట సువర్ణ మబ్బినన్

దక్కక పెన్విషంబున సుధారస ముండిన గ్రాహ్యమంద్రు వాఁ
డొక్కమనుష్యమాత్రుఁడె మహోన్నతుఁ డున్నతరాజపూజ్యుఁడున్. 145

వ. అదియునుంగాక. 146

చ. గురునకు సేవ చేయుట తగుం దగువిద్యఁ బరిగ్రహింపఁగా
నరుదుగ నర్థ మిచ్చి పడయం దగు నొండె సువిద్య యిచ్చి వి
స్తరముగఁ విద్యఁగైకొనుట దా నొకపక్షము మూఁడురీతులం
బరగుట దక్క నాలవ నుపాయము లే దని చెప్పు శాస్త్రముల్. 147

క. కావున నాతనిచేఁ గొనఁ, గా వచ్చును నిట్లు నాదుఘనవిద్యయు నా
భూవరున కొసఁగ వచ్చును, బోవలయును భోజరాజపురమున' కనుచున్. 148

క. కతిపయదినములనాఁటికి, నతఁడును బ్రచ్ఛన్నమూర్తియై తగ భోజ
క్షితిపతిసమ్ముఖ మగుటయు, నతఁ డాతనిఁ జూచి ప్రముదితాననుఁ డగుచున్. 149

ఆ. ఎదురు లేచి కరము లెత్తి నమస్కృతి, యాచరించి యున్నతాసనంబుఁ
బెట్టఁ బనుప నతఁడు ప్రీతుఁడై దీవన, లిచ్చి భోజపతికి నెలమి మిగుల. 150

వ. ఆసీనుం డగుటయు నమ్మహీపతియుం నిజసింహాసనస్థుండై సగౌరవంబుగా నిట్లనియె.

ఉ. 'ఎచ్చటనుండి రాక యిట కెచ్చటి కేఁగుట? సూర్యు లెవ్వ రే
నిచ్చట మా కొనర్చుపని యెయ్యది? పుణ్యుఁడ నైతి నేను మీ
వచ్చుటఁజేసి' నావుడు నవస్మితచారుముఖారవిందుఁడై
యచ్చుగ నాతఁ డానృపతియాననపద్మముఁ జూచి యి ట్లనున్. 152

తే. 'అది వేఁటమై వచ్చి మీ రల్లనాఁడు, మట్టికడ నన్నుఁ బొడగని మాటలాడి
పరగఁ దోఁకొని రారె మీపట్టణమున, కేను సర్పటి యనువాఁడ నెఱుఁగవయ్య. 153

వ. మీకుఁ జెప్పక పోవుటంజేసి నాఁటికొలంత వాపికొన వచ్చితి' ననిన నన్నరేం
ద్రుండు పెన్నిధిఁ గన్న పేదయుం బోలె నత్యంతసంతుష్టాంతరంగుండై పునఃపు
నఃప్రణామంబు చేసి యిట్లను 'నీశ్వరేచ్ఛగదా! దీని కేది కొలంత? నామీఁదికారు
ణ్యంబునఁ గ్రమ్మఱ నిట్లు వచ్చుటంజేసి నామనోరథంబు సఫలం బయ్యె' నని యనే
కవిధంబుల నూఱడించిన నాసర్పటియు నతనిగుణవిశేషంబులు గొనియాడి యిట్ల
నియె. 154

చ. 'తిరిగితిఁ బెక్కుదేశములు దేవ! భవత్సముఁ డైన మేదినీ
శ్వరుఁ బొడగాన నీకు వశవర్తిని నై విలసిల్లునట్టిభా
సుర మగుశబ్దభేది యనుచోద్యపువిద్య తదీయలక్షణం
బరయఁగ వేఁడియేను బ్రియ మారఁగ వచ్చితి నిందు భూవరా! 155

క. అలనాఁడును నీవిద్యా, జలనిధి లోఁ దెలియఁగ లేక చపలాత్ముఁడనై
తొలఁగితి నే నటులుండఁగ, వలదే రాజ నను వాఁడు వసుమతిలోనన్. 156

క. సిద్ధులలోపల నెల్ల బ్రసిద్ధుఁడు సర్పటి యనంగఁ జేయుఁడు నను స
ద్బుద్ధి గలదేని నాకుఁ బ్రవృద్ధం బగు శబ్దభేది విద్య యొసఁగుమా. 157

క. ఏను నిచ్చెద నీకు న, నూనం బగు ధూమవేధి యొప్పఁగ' ననినన్
'గానిండు మీరు పెద్దలు, గానఁ దొలుత నాకు నొసఁగఁగా వలయుఁ జుఁడీ! 158

క. మఱి నాకన్న తెలుంగున, నెఱిఁగించెద నాదువిద్య యేర్పడ' ననినన్
వెఱఁ గేది భోజభూపతి, కఱిముఱి దనవిద్య చెప్పి యతఁ డిట్లనియెన్. 159

ఉ. 'చెప్పితి నాదువిద్య యర చేయక నీదగువిద్య యేర్పడం
జెప్పుము నాకు' నావుడును జెన్నగు మోమునఁ గొంతవింతన
వ్వొప్పఁగ భోజుఁ డిట్టు లను 'నొచ్చెల నే నొకవిద్యవాఁడనే
తప్పఁగఁ జిత్తగింపకుఁడు తద్విధ మే నెఱుఁగ న్మునీశ్వరా!' 160

క. అనిన విని 'యేటిమాటలు, ఘనతర మగు శబ్దభేది గలుగుట లేదే
జననాథ! మున్ను నీచే,' నన వుడు విని భోజుఁ డిట్టు లను నాతనితోన్. 161

ఉ. 'మించగువిద్య భోజునకు మేదినిపైఁ గలదన్న శబ్ద మొ
క్కించుక నీదువీనుల వహించినమాత్రన సోమనంబు వే
ధించుటఁ జేసి యిందుఁ జనుదెంచితి గావున శబ్దభేది నా
నంచిత మైనవార్త గల దంతియ కాని యెఱుంగ నెద్దియున్. 162

ఉ. నావుడు 'నిట్లు పల్కఁ దగునా? ధరణీశులు మీరు సిద్ధవం
శావళివార మేము నిజ మాడుము చాలును విద్య లేనివా
రీవిధి నెల్లవారలకు నిత్తురె కాంచనకల్పితంబు లే
లా వెడమాట లీచెనఁటిలాగున మాకును గోప మయ్యెడిన్.' 163

వ. అని ఘట్టించి పలుకునప్పు డుక్కఱుదపసికడకన్నులం బొడము కెంపు గని
కంపించుచు నమ్మహీనాథుండు చేతులు మొగిచి 'నాకు మీచేతిధూమవేధి సిద్ధించు
టకు నిట్టికపటోపాయంబు చేసితి నాతప్పు మన్నింప వలయు' ననుచు మదకుంభి
కుంభస్థలస్పర్శనకర్కశంబు లగుతనహస్తంబుల నతనిపాదంబులు పట్టుకొనఁబోవు
టయు నతండు కోపంబు డింప నోపక యడిచిపడుచుఁ దొలంగి యంతంత నిలిచి
యిట్లనియె. 164

క. 'రాజ వని నిన్ను నమ్మితి, భోజుఁడు ధర్మాత్ముఁ డనుట బొంకయ్యెఁ గదే
యోజ చెడ నిట్లు చేఁత ప్రయోజనమే వలయు ననిన నొసఁగనె నీకున్. 165

ఉ. నన్నడకించి యొద్దరితనంబున నాదగువిద్య నీవు గై
కొన్న సహింప నేర్తునె తగుం దగు లెస్స విచారమయ్యెఁ బో
మున్నటు మేలు మేలనఁగ మూర్ఖుఁడవై ధనకాంక్షఁ గాదె యీ
పిన్నతనంబు చేసి తిది పెద్దలు మెత్తురె రాజధర్మమే! 166

వ. కావున నీవు చేసినయపరాధంబువలం జేసి నీ వనపత్యుండవు గ' మ్మని శపియించె.''

చ. అనవుడు నమ్మహుండు వినయానతుఁడై మునినాథుతోడ ని
ట్లను "ముచు సిద్ధు లెవ్వరును నారయ సర్వటిథింగి మోసపో
యినవిధ మెన్నఁడు న్వినమదేమినిమిత్తమొకో యతండు చే
సినకపటప్రసంగమునఁ జిక్కుట!" నావుడు నాతఁ డిట్లనున్. 168

వ "దీని కొక్క-కారణంబు కల దాకర్ణింపుము చెప్పెద. 169

సీ. తమ్మిలోరేకులు తరుణరంభామృదుస్తంభంబు లున్నతసైకతంబు
మండితమృగరాజమధ్యప్రదేశంబు లాలితనవమృణాళద్వయంబు
మదమత్తభద్రసామజకుంభయుగళంబు మహితశంఖంబు క్రొమ్మావిచిగురు
కుందుఁ గందును లేనికుముదాప్తబింబంబు కవ గూడి యాడెడుగండుమీలు

తే. ననఁగ నఖకాళ్ళఁ బెందొడ లలఘుజఘన, మలఁతికౌదీఁగె కెంగేలు వలుఁదచన్ను
లబ్జు కెమ్మోవి నెమ్మొగ మక్షియుగము, వరుస నొప్పారునొకవారవనిత గలదు.

క. ఆవనిత యొక్క-నాఁ డొక, దేవాలయమునకు నరిగి దేవుఁడు తన కా
భావంబునఁ బొడచూపిన కైవడి నొకసిద్ధుఁ డుండఁ గాఁ బొడగనియెన్. 171

క. కని ప్రణమిల్లిన నాతఁడు, తనతో భాషింప కున్నఁ దాఁ దొలఁగక శం
భుఁగిఁ బురుమథితుఁ మదుగం, జనుదెంచినరతియొపోలె సన్నిధి నుండెన్. 172

ఉ. మానుగ హస్తము ల్మోగిచి మండితవృత్తి ఘనస్తనాంగభా
రానతయో యనంగ వినయానత యై నయనాబ్జరోచులన్
మానక యమ్మహాత్ముచరణంబులమీఁదన సంచలింప న
మ్మానిని భక్తిసంభరితమానసయై యటు గొల్చి యుండఁగన్. 173

క. ధ్యానానంతరమునఁ బర, మానందవిజృంభితాత్ముఁడై సిద్ధుఁడు 'బా
లా! నీ వెవ్వరిదానవు? నీనాథుం డెవ్వఁ?డేల నిలిచితి విచటన్?' 174

వ. నావుడు నాసిద్ధునకు నమ్మగువ యిట్లను 'నేను వేశ్యాధర్మంబునఁ జరియించుదాన నిమ్మహాదేవునకు నమస్కరింప వచ్చి యిచ్చట మిమ్ముఁ గని దండప్రణామంబు చేసి మీకటాక్షం బపేక్షించి యున్నదాన' ననవుడు నతండు ప్రీతుండై చేరం బిలిచి నొసలు నిండ విభూతి పెట్టి దీవించిన 'నయ్యా! మదీయావాసంబునకు విచ్చేయ వలయు' నని యచ్చెలువ ప్రార్థించిన. 175

క. 'ఊరు చోరనొల్ల నేను శ్రీ,వారాధనతత్పరుండ నై నెలఁ బదిసా
ర్లీరమ్యం బగుదేవా, గారంబున నుండు వేడ్క గదిరెడు నాకున్. 176

ఉ. బాలకి పొమ్ము' నావుడుఁ దపస్విపదాబ్జయుగంబుమీఁద నీ
లాలకజాలము ల్నెరయ నాయలికుంతల సాఁగి మ్రొక్కి క్రొ
వ్వాలినకన్నెఱుంగుల నివాళి యొనర్చి రతీశమత్తశుం
డాలమునోజ బింకపునడల్ బెడఁ గొందఁగ నేఁగి భక్తితోన్. 177

క. నాఁడు మొదలుకొని యాపూఁ,బోఁడి యనారతముఁ దెచ్చి భోజన మిడఁగా
నేఁడొక్కటి చనునంతకు వాఁ డక్కడ నుండు నుచితవర్తనలమెయిన్. 178

వ. అంత నతం డక్కాంతతో నొక్కనాఁ డేకాంతంబున నిట్లను 'నేను నీతాత్పర్యం
బునకు మెచ్చితి నీకొక్కచోద్యం బగువిద్య యిచ్చెదం గొను'మని యనుగ్ర
హించి. 179

ఆ. ఔషధములు చెప్పి యవి గూర్చువిధమును, జెప్పి దీపవహ్నిశిఖలమీఁద
వైవ ధూమవేధవలన లోహంబులు, హేమ మగు తెఱంగు లెఱుఁగఁ జెప్పి. 180

క. సిద్ధుఁడు చనుటయు నింతి ప్ర,బుద్ధచరిత్ర యగు తోడఁబుట్టినసతి కా
శుద్ధి యెఱిఁగించి యౌషధ,సిద్ధి పడయుపనికిఁ జింత చేయుచుఁ దమలోన్. 181

ఉ. కన్నులు లేనివాఁ డొకఁడు గల్గినఁ జాలు నతండు నూరఁగా
నిన్నియు మార్ప వచ్చు నొరులెవ్వరు దీని నెఱుంగ కుండఁ బ్ర
చ్ఛన్నపుఁ జేఁతభంగి సువిచారము సుమ్మని యొక్కరాత్రి యా
సన్నముఖాబ్జలై మిగులఁ జప్పుడు గానిరహస్యభాషలన్. 182

క. ఆలోచింపఁగ సర్పటి, యాలో భిక్షమున కరిగి యాపలుకులు దా
నాలించి దానికిం దగు,కీలు విచారించి మగిడెఁ గృత్రిమభంగిన్. 183

క. మఱునాఁడు విగతచక్షుని, తెఱఁగున నొకపంచఁ జేరి దీనత దోఁపం
గొఱమాలినయొక పెంచిక, యఱచేతం బట్టికొని నతాననుఁ డగుచున్. 184

తే. 'కపటిఁ జూడన్న యిటునటుఁ గదలలేని,వాఁడఁ జూడన్న యోభాగ్యవంతులార!
పుణ్యసతులార! నన్నుఁ గారుణ్యబుద్ధి, నరసియుదరాగ్ని యార్పుఁడీ'యనుచునుండ.

క. ఆప్పొలఁతి చూచి నయనము,*లొప్పెడు చెలువంబువలెను నున్నవి యిది యే
చొప్పొ కానం డట యితఁ, డప్పా యిట వచ్చి చూడు మని చూపుటయున్. 186

క. చూచి యితం డగుఁ బో మన, చూచినపని కనుచు వానిచూపులసత్వం
బేచందమొ యని తెలియం, జూచుటకయి పెంచిలో నశుద్ధము కలియన్. 187

ఉ. వైచినఁ బ్రత్యయార్థముగ వాఁ డతిప్రీతి భుజింపఁ బోయినన్
జూచి కరంబు పట్టుకొని శుద్ధము కన్నులు చెడ్డవాఁడ కాఁ

---

*ఒప్పెడు కర్ణికలువోలె నున్నవి యిదియే చొప్పొకొ......(చి. సి. పా.)

జూచుచుఁ జెట్టఁ బట్టుకొని స్రుక్కక యింటికిఁ దెచ్చి నవ్వుచున్
వాచవు లైనభోజ్యములు వానికిఁ బెట్టుచు నేర్పెలర్పఁగన్. 188

ఆ. వలయుఁ మందు లెల్ల వానిచే నూరింప, నతఁడు తోడుతోన యన్నిక్రియలు
నెఱిఁగి యొక్కనాఁడు తెఱవసమ్ముఖమున, నిలిచి నేత్రరుచులు నివ్వటిలఁగ. 189

ఉ. 'సింధురయాన! యేను నిటఁ జెంది కృతార్థుఁడ నైతి నన్ను నీ
బంధునిగాఁ దలంచి యిటు లన్నియుఁ జూపఁగ నీప్రసాదసం
బంధము పేర్మిఁ జేసి పరిపాటి నెఱింగితి ధూమవేధి యే
నంధుఁడఁ గాను సిద్ధుఁడఁ జుమమ్మ! వధూమణి! పోయివచ్చెదన్.' 190

క. అనవుడు సిగ్గును గోపంబును మదిఁ బెనఁగొనఁగ 'మోసపోయితిన కదా!
నను నితఁ డిట్లు ప్రమోషిం, చిన దాసికి మాఱు చేయఁ జెల్లదె' యనుచున్. 191

ఉ. చేతులు మోడ్చి నిల్చి తనచిత్తము నైక్యము చేసి "మద్గురుం
డాతతసత్యశాలి యగు టారయ నిక్కము యయ్యె నేఁటి నే
రీతి నితండు నన్నొరఁగి రిత్తకు రిత్త గ్రహించె విద్య యీ
రీతినె మోస పోయెదు ధరిత్రి నితం'డని పల్కె నల్కతోన్. 192

క. అది కారణముగ సర్వటి, విదితంబుగ మోసపోయె విను"మని సతతా
భ్యుదయుఁడు దత్తాత్రేయుఁడు, మొదలిటి కారణము తెల్లముగఁ జెప్పటయున్. 193

చ. విని మహుఁ డమ్మునీంద్రునకు వేడుక నంజలి చేసి "యోకృపా
వననిధి! నీముఖంబున నవారణమై వినఁ గంటి శ్రోత్రరం
జన మొనరింపఁ జాలెడు ప్రసంగము లప్పుడు సిద్ధుఁ డల్లి భో
జనృపతిఁ దా శపించి మఱి శాపవిముక్తి యొనర్చెనే తుదిన్?" 194

చ. అనవుడు "శాంతి నొందుటకు నారయ నెట్టిఫలంబు మీరు స
జ్జనులు గదయ్య కోపము ప్రసాదము గల్గుట యెప్పుఁ గాక కా
దన నితరుండు చాలఁడె మహాపురుషా! యనపత్యుఁ డైనవాఁ
డొనరఁగ నూర్ధ్వలోకముల యుక్తుఁడు గాఁ డని చెప్పు శాస్త్రముల్. 195

ఉ. పాండువిభుండు సన్మునులపజ్జఁ జనం జన నమ్మునీంద్రు లిం
దుండి యపుత్రవంతులకు నొందఁగ రా దివి దివ్యభూము లీ
వుండుము నావుడున్ మగిడి యుల్లము డిల్లము చెంద నవ్విభుం
డొండొకధర్మమార్గమున నొప్పుగ సంతతి నిర్వహింపఁడే. 196

ఉ. కాన మనుష్యు లూర్ధ్వగతి గాంచుటకుం దగుసాధనంబు సం
తానమ యట్టిసంతతియ తప్పునయేని ధనంబు లేల నా

కీనిఖిలావనీభరము నేల శరీరసుఖంబు లేల నీ
తోన చరింప వత్తు నను దోడ్కొని పొమ్మని ముట్టఁ బల్కినన్. 197

చ. 'ఇటు తగునయ్య భోజజగతీశ్వర! పీరుఁడ వీవు నీకు నిం
తటిపనికై కలంగు టుచితంబె విచారము దక్కు' మంచు స
ర్వటి పలుకంగ నించుకయుఁ బాయనియంతరచింతతోన మి
క్కుటముగ నమ్మహీవిభుఁడు గొందల మందుచు వెచ్చ నూర్చుచున్. 198

వ. ఉండె నప్పుడు సర్వటి. 199

చ. 'వలవనిదుఃఖ మేల? జగద్వల్లభ! మర్త్యుఁడు దానధర్మముల్
సలుపఁగ నూర్ధ్వలోకములు సాధ్యము గా వెటు కన్నబిడ్డలే
పొలుపుగఁ దన్ను సద్గతికిఁ బుత్తురె? యీ వెడబుద్ధు లేల? నా
పలుకు దృఢంబుగా వినుము పార్థివశేఖర! లెమ్ము నెమ్మితోన్.' 200

క. అనవుడు 'మీయట్టిమహాత్మున కెవ్వరు వలదు గాక మునుకొని గృహధ
ర్మనిరూఢుఁడ నగునాకుం, దనయులు వలదయ్య రిత్తతర్కము లేలా? 201

క. ఆరయ సంసారమునకు, దారాపత్యములు గావె తగునంగము లిం
పార నవి లేనిపురుషుని, పే రెవ్వఁ డెఱుంగు వానిపెంపేమిటికిన్? 202

ఆ. దివియ లేనిగృహము తెఱఁగున సంతాన, రహితుఁ డైనవాని బ్రతుకు చూడఁ
గడు నిరర్థకంబు గాదె? నావుడు నతఁ, డతనితోడ నిట్టు లనియె నధిప. 203

ఆ. 'సుతుఁడు నిధియుఁ వనముఁ గృతియు నల్లిల్లును
గుడియుఁ జెఱువు ననఁగఁ బుడమియందు
సంస్తుతింపఁ బరగు సప్తసంతానముల్
గలవు కీర్తిసుకృతకారణములు. 204

తే. తొలుత నిందులోఁ బుత్త్రుండు తొలఁగెనేని
నున్నయాఱును నొక మొనఁగఁజాల
వధిప యిన్నింటిలోపల నధికమరయఁ
గృతియ చూ నిత్యకీర్తికి గతియుఁ గాన. 205

క. తొల్లిటిపెద్దలచరితలు, తెల్లంబుగ నేఁడు మనకుఁ దెలిగుంట ధరణీ
వల్లభ! యిటు వినుమా! విల, సిల్లుకృతులవలన నగుట సిద్ధము గాదే. 206

ఉ. ఆర్వురుచక్రవర్తులుఁ బదార్వురురాజులు నేటివారలే?
యుర్వి బహుప్రకారముల నొప్పుగఁ బాలన చేయరే? గుణా
ఖర్వులు వారలుం జనిరి కాదె? తదీయ యశంబు లెల్లెడం
బర్వుట సత్కవీంద్రఘన భాషితసత్కృతిమూలమే కదా. 207

క. కర్త యొనరించుధర్మము, కీర్తికి నాస్పదము ధర్మకీర్తులు ఘనవి
స్ఫూర్తికిఁ గారణ ముజ్జ్వల, మూర్తివి సుకృతివియ చుమ్ము మూఁడుజగములన్. 208

క. కావునఁ గృతు లొనరింపం,గా విద్వజ్జనులఁ బెంపు గారవ మెసఁగన్
దేవాలయములఁ జెఱువులుఁ, గావింపుము ధనము లిమ్ము కడు పేదలకున్. 209

క. భూసురులఁ బెండ్లి చేయుము, భూసురముగ నెల్లచోట్ల ఫలవృక్షంబుల్
వేసరక పెట్టఁ బనుపుము, చేసెద మనువారి కేమి చెల్లదు చెపుమా!' 210

చ. అనవుడు భోజుఁ డిట్టు లను 'నక్కట! భూజను లెల్లవారలున్
దనయులముద్దుఁజేఁతల సుధారసపానము చేసినట్లు నె
మ్మన మలరంగ సౌఖ్యరసమగ్నులుగాఁ గనుఁగొంచు ముచ్చటల్
దనుకగ నెవ్విధంబున నలందురు చుండెదువాఁడ? జెప్పుమా!' 211

ఉ. నావుడుఁ 'బుత్రమోహము ఘనంబుగ నున్నది రాజుడెందమం
దేవిధిఁ దేర్చువాఁడ నతఁ డే మని తేర్చిన దేర దక్కటా
నావచనం బమోఘ మయినం దగ నొక్క తెఱంగు చేసి యీ
భూవిభు కాంక్షఁ దీర్తు' నని బుద్ధి దలంచుచు సిద్ధుఁ డిట్లనున్. 212

క. 'ఓరాజ నాదువాక్యం, బేమాపున బొంకుఁ బొరయ దీవును సంతా
నారూఢి బుద్ధి వదలఁగ, నేరవు విను మొకవిధంబు నీ కొనరింతున్. 213

క. నీవు గదా యిప్పుడు నా,చే విద్యాసంగ్రహంబు చేసితి కపట
ప్రావీణ్యంబున నిది నీ,చే వినువారలకు బాపు చేయక యుండున్. 214

సీ. ఉర్వీశ! వినుము విద్యోపదేశము చేయుంవాఁడు తండ్రియుఁ గొనువాఁడు సుతుఁడు
నని చెప్పుదురు పెద్ద లటుగాన నీకు నేతన్మూల మైనసంతానకరణి
లే కుండునది నెపంబై కాని శాపంబుతుది డిందు పడఁగ నేరదు తదీయ
దోషంబువలన ముక్తుఁడవుగా నొందుపాయము లేదు గాన నీయనువు నెనయఁ

తే. దగ విచారించి చేసితి దానఁ జేసి, పుత్రవంతుఁడ వగుము పవిత్రచరిత్ర!
యోడ కుండుము నీ' వని యూఱడించి, మనుజవిభుతోడ సర్పటి యనియె మఱియు.

సీ. 'బొంకెడుపురుషునిఁ బొంద నొల్లదు లక్ష్మి తొల్లింటిసిరియును దొలఁగి పోవు
బ్రహ్మహత్యాదిపాపము లెన్నియైనను నిల నసత్యంబుతో నెత్తు రావు
మద్యపానము చేయ మరగినాతనికంటెఁ గీడు సు మ్మనృతంబు లాడువాఁడె
యూర్ధ్వలోకముత్రోవ యుడిగించి యధమలోకప్రాప్తి గావించుఁ గల్లతనము

ఆ. కాన నింతనుండి మానవేశ్వర నీవు, నిత్యసత్యనిష్ఠ నెఱపుమయ్య
సత్యమందె నిలుచు సర్వలోకములు స,త్యవ్రతంబుకంటెఁ దపము లేదు. 216

క. ఇప్పుడు నీకును నాకును, జొప్పడినవివాదమునకు శోకింపకు నీ
తప్పున నైనది గా దిది, యప్పరమేశ్వరుఁడు మూల మఖిలంబునకున్.' 217

క. అని బోధింప నతఁడు దన, మనమున శరత్కాలసరసిమాడ్కిఁ బ్రసన్న
త్వనిరూఢంబుగ నాతనిఁ, గనుఁగొని యి ట్లనియె వినయగౌరవ మెసఁగన్.

క. 'మీకరుణఁ జేసి వంధ్యత, లేక మదీయోదరము ఫలించినఁ జాలున్
నా కంతియ పదివేలు ని,రాకులమతి, నైతి' ననియె" నని చెప్పుటయున్. 219

క. ఆకర్ణించి మహుండు "ప్ర,భాకరసమతేజ! నీకృపం బుణ్యాకర్షల్
నాకు విన నయ్యె భోజుం, డేకరణిం జనించె సిద్ధుఁ డేమైఁ జనియెన్!" 220

వ. అని తదనంతరకథాకర్ణనోత్సుకుం డయి యడిగిన. 221

చ. సరసిజనాభ! భక్తజనసంచితపుణ్యఫలప్రదాన! వా
గ్వరనుతపాదపంకజ! జగన్నివహాభయదానభూమ! మం
దరగిరిమూలమండిత! రథాయితచారుఖగాన్వయేశ! శం
కరరమణీసదాస్మరణకారణనిర్మలనామశోభితా! 222

క. గర్వితహిరణ్యకశిపువ, పుర్విదళనకరణఘననిపుణనఖనికరా
పూర్వాయుధ! కరసంభృత, సర్వాయుధ! దురితతిమిరచండమయూఖా! 223

మత్తకోకిల. నీలనీరదచారుకోమలనిర్మలాంగ! విజృంభితా
ఖీలదానవమానమర్దన! భీమనక్రగృహీతశుం
డాలభీతినిరాస! ఘోరకుఠారలూనసమస్తభూ
పాలకానన! సన్మునీశ్వరపాలనా! నరకేసరీ! 224

గద్యము. ఇది శ్రీ వాణీవరప్రసాదలబ్ధవాగ్వైభవ తిక్కనామాత్యసంభవ సుకవిజనవిధేయ అనంతయనామధేయ ప్రణీతం బైనభోజరాజీయం బను కావ్యంబునందు విప్రుండు దారిద్ర్యనిర్వేదనంబునఁ దీర్థయాత్రానిరతుం డగుటయుఁ గాశికాదర్శనంబును బ్రయాగతీర్థాభిగమనంబును జతుర్థలవాజలప్రవేశంబును దదనుగమనంబున విప్రుండు భోజుండై పుట్టుటయు మృగయావిహారంబును సర్పటిపరీక్షణంబును దదాగమనంబును లోహగృహంబునకు సువర్ణత్వంబు ప్రాప్తం బగుటయుఁ గృతకమంత్రప్రకటనంబును సర్పటిపునరాగమనంబును ధూమవేధివిద్యాహరణంబును వారాంగనోపాఖ్యానంబును సంతానవిషయం బై భోజసర్పటులయుష్ఠానులాపంబును నన్నది ద్వితీయాశ్వాసము.

శ్రీ

భోజరాజీయము

తృతీయాశ్వాసము

శ్రీరమణీకుచకుంకుమ
సారారుణవిపులవక్ష! జలజదళాక్షా!
మారశతకోటిసుభగశ
రీర! నిగమగిరివిహార! శ్రీనరసింహా! 1

వ. అవధరింపుము దత్తాత్రేయమునీంద్రుం డన్నరేంద్రున కిట్లనియె. 2

ఆ. "అట్లు నిష్కళంకుఁ డైన భోజుఁ డనఘ! యాఁ, గొంటి రీనిరర్థగోష్ఠిఁ దగిలి
యాఁగింప కుండ లే రింతతడవు బాలురును యోగివరులు సరియ కాన. 3

క. ఇంతకు మీకోడం ద్రోన,రింతురు భోజనము నాకుఁ బ్రియ మయ్యెడు మీ
బంతిఁ బ్రసాదము గొనఁగా, నంతఃపురమునకుఁ బోద మరుదెం" డనియెన్. 4

క. అతఁ డట్లు తన్నుఁ బిల్చుడు, నతఁ డిట్లను నతనితోడ "నయ్యా! నీయా
నతి యిది యిట్టిద యగు మద్వ్రతపద్ధతి వినుము చెప్పెదం దెలియంగన్. 5

ఉ. చేయుదుఁ బంచభిక్ష యిటు చేయుట నానియమంబు మీరు వి
చ్చేయుఁడు వేళ యయ్యెను భుజింపఁగ' నావుడు భోజుఁ డిట్లనున్
'బాయక దీన మీకు వ్రతభంగము గా దిది యేకభిక్షగాఁ
జేయుఁడు నేఁడు మాచనవుఁ జేకొని మద్గృహమందు' నావుడున్. 6

తే. 'పంచభిక్షయు నాహారపరత లేక, యునికియును నొక్కరూప కావున నరేంద్ర!
వ్రతము పూనితి గురునాజ్ఞ వదల రాదు, వలదు పొం' డని సిద్ధుండు పలుకుటయును.

తే. ఎచట మీరెఱుఁగనిధర్మ మేమి గలదు, వినుఁడు మీతోడ మాటాడ వెఱతుఁ గాని
పూని యొండుల ప్రార్థన భోజనంబు, సదుపవాసంబుగాఁ జెప్పు శాస్త్రచయము. 8

క. ఈయర్థంబున కొకకథ, మీయట్టిమహాత్ము లర్థిమెయిఁ జెప్ప మునీం
ద్రా! యేను వింటిఁ దదభి,ప్రాయ మవధరింపు విన్నపం బొనరింతున్. 9

క. అనఘుఁడు వసిష్ఠముని ప్రతి,దినమును దగ నగ్నిహోత్రదేవార్పణముల్
మును చేసి యరుంధతిచేఁ, బనుపు నగస్త్యునకు భిక్ష పరమప్రీతిన్. 10

ఉ. గౌతమియవ్వలం దపము పైకొని చేయుచు నున్నకుంభసం
జాతున కివ్విధంబున నజస్రముఁ దత్సతి భిక్ష దేరఁ బ్ర
ఖ్యాతిగ నన్నవర్జ మగునట్టివ్రతం బొనరించు చుండియున్
ప్రీతమనస్కుఁడై పరిహరింప కతండు భుజించు నిచ్చలున్. 11

క. ఎప్పటియట్టుల యొకనాఁ, డప్పొలఁతి యగస్త్యమునికి నాదట నన్నం
బొప్పఁ గొనిపోవ నే మఱి, చెప్పుదుఁ గట్టెదుట భయదజృంభణ మెసఁగన్. 12

శా. గంగాభోగవతీతరంగిణుల కైక్యప్రీతిఁ గావించున
బ్భంగిర బొంగుచు నేల గ్రొచ్చికొనుచుం బాథోనిధుల్ రెంటికిన్
సాంగత్యం బొనరింపఁ జూచుగతిఁ బార్శ్వవ్యాపకం బై బృహ
ద్భంగశ్రేణిపరంపరాక్రమణ మొప్పం బాఱునగ్గౌతమిన్. 13

చ. కనుఁగొని యయ్యరుంధతి ఖగప్రకరంబున కైన నిమ్మహా
ధుని యవిలంఘనీయ మయి తోఁచుచు నున్నది మర్త్యు లెవ్విధం
బునఁ దరియింపఁ జాలుదురు బుద్ధిఁ దలంపఁగ మర్త్యులందు నం
గనలవశంబె యిప్పని యగమ్యము పొమ్మని భీతి నొందుచున్. 14

క. వెసఁ దిరిగి వచ్చి యాపు,ణ్యసతీతిలకంబు పతికి నమ్ర యగుచు వె
క్కస మెసఁగఁ జెప్పెను నదీ,ప్రసరరవగభీరఘోరపాథోరయమున్. 15

వ. ఇట్లు చెప్పి వివర్ణవదన యగుచు నున్నయన్నలినవదనవదనం బవలోకించి చిఱు
నవ్వు నవ్వుచు నవ్వసిష్ఠుండు. 16

క 'పడఁతుక! నీ వేమియు భయ,పడకు సదా బ్రహ్మచారిపనుపున నే నో
క్కెడ కేఁగెదఁ దెరు విమ్మని, యడుగుము పొమ్మనినఁ 'బోయి యట్ల యడిగినన్. 17

ఆ. ఆన వైచినట్లు పూని మంత్రప్రయో,గంబు చేసినట్లు కట్టినట్లు
నిట్టవొడిచి యెదురఁ దొట్టినవాహిని, యిపుర జలము వాఱె నిసుక దోఁప. 18

క. ఆతెఱపి నబల చనుటయు, నాతతముగఁ దొంటియట్ల యానది పాఱెన్
నాతి యట కరిగి యన్నం, బాతపసికిఁ బెట్టి మరలునవసరమందున్. 19

క. అనుమానింపుచు నాతనిఁ గనుఁగొని 'యోతండ్రి! నేఁడు గౌతమి దర్పం
బున మిన్ను ముట్టిపాఱెడిఁ, జననేర నుపాయ మొకటి చయ్యనఁ జెపుమా! 20

చ. అనవుడుఁ దల్లి! నీ విచట కాదటతోఁ జనుదెంచునప్పు డే
యనువున వచ్చి తన్నఁ బతి యాడినచందము నట్లు పల్కినం
దన కది త్రోవ యిచ్చుటయుఁ దా నటు దాఁటినయాక్షణంబ వా
హిని గడుఁ బొంగి పాఱుటయు నేర్పడఁ జెప్పిన నయ్యగస్త్యుఁడున్. 21

ఉ. ఆరమణీలలామకుఁ బ్రియంబునఁ జేతులు మోడ్చి 'సద్గుణా
ధారచరిత్ర! యింతియ కదా యిది యెంతటికార్య మానదిం
జేరఁగఁ బోయి యిట్లనుము చెప్పెద నే నొకమార్గము న్నిరా
హారున కోదనం బిడుటకై చని క్రమ్మఱ యేను బోయెదన్. 22

క. తెరు విమ్మని యటు లనుగుము, సరభసగతి నుదక మిరుదెసలఁ బాయఁ గడుం
బరువునఁ బోవఁగ నయ్యెడుఁ, దరుణీ! యరుగు మఱి కాలు తడి గాకుండన్.' 23

క. అనిన వసిష్ఠుఁడు మున్నె, ట్లనుటకుఁ దోడిదియు నొక్క యాశ్చర్యము పొ
మ్మని తలఁచుచు గౌతమికిం, జని యట్టుల పల్క నది వెసం దెరు విచ్చెన్. 24

సీ. ఆమార్గమునఁ బ్రీతి నరుదెంచి ప్రాణేశుఁ డగువసిష్ఠునిఁ గాంచి యతని యడుగుఁ
దమ్ములు తనదుమస్తకము సోఁకఁగ మ్రొక్కి ప్రాంజలియై నిల్చి భక్తితోడఁ
బడఁతి యిట్లని విన్నపము చేసె 'మీవాక్యగతి విన్నయప్పుడు గౌతమీమ
హానది తెరు విచ్చె నట పోయి క్రమ్మఱి వచ్చుచో నమ్మునివరునిఁ జూచి
ఆ. యేఱు నేఁడు నిండి పాఱుచున్నది నాకుఁ, జన నుపాయ మెద్ది యనిన నాతఁ
డేమి యనియె వింటిరే తొల్లి యెన్నఁడు, విననియద్భుతములు వింటి నేఁడు.' 25

వ. అని పలికి తా నిటు మరలి వచ్చునప్పు డగస్త్యుండు గౌతమితోఁ బల్కు మన్న తెఱంగును నట్ల పలికిన నానది తొంటియట్ల తెరు విచ్చుటయును జెప్పి యప్పొలంతి 'యనఘా! నాయందుం గడుపార నూర్వురుకొడుకులం బడసినయట్టినీవు సదా బ్రహ్మచారి ననుటయుఁ మీపంపున నేను నిచ్చలుం గొనిపోయి పెట్టినట్టిమృష్టాన్నంబు తుష్టిగా ననుభవించుచున్నయమ్ముని దాను నిరాహారుఁడ ననుటయు నతివిరుద్ధంబులై యున్నయవి మీమాయ లెవ్వరికి నెఱుంగ నగు నైనను నాచనవు చెఱుపక యీరెండుతెఱంగులు నాకుం దెలియ నానతీయ వలయు' ననిన విని నవ్వుచు వసిష్ఠుం డిట్లనియె. 26

సీ. 'అశనాభిరతి లేక యటవీస్థలంబున నియతతపోనిష్ఠ నెఱపుచుండ
గృహధర్మనిరతులు కొనివచ్చి భక్తిపూర్వకముగాఁ దగ సమర్పణము చేయు
నన్నపానాదుల నాసక్తుఁడై కొనునతఁడు నిరాహారుఁ డండ్రు బుధులు
ధర్మమార్గమున సంతతి యుపార్జింప సమాన్వయంబున వివాహంబు వడసి
తే. మనసుతమకంబు లే కాత్మవనితయందుఁ, బూని ఋతుకాలమందునఁ గానితిథులు
పరిహరించి యథోచితభంగిఁ గేలి, సలుపువాఁడు సదా బ్రహ్మచారి యండ్రు. 27

క. కావున నమ్మునిమాటకు, నావచనంబునకుఁ గారణం బిది కంటే
నావుడు సవినయభాషల, నావనితారత్న మిట్టు లనుఁ బ్రాంజలియై. 28

ఉ. 'ఇట్టిది ధర్మసూక్ష్మ మిది యెవ్వ రెఱుంగుదు? రింత యొప్పునే
యిట్టిమహానుభావమును నిట్టిచరిత్రము నీక యొప్పు ని
ట్టట్టని తేటి చూడ నమరాదులకుం దరమయ్యె నేఁడు నా
పుట్టు కృతార్థతం బొరసె భూరిభవద్వచనామృతంబునన్.' 29

తే. అనియె నటుగాన నీవును నయ్యగస్త్యమునివిధంబున నాదు ప్రార్థనముఁ గరుణ
నవధరించుట కర్తవ్య మనిన నతఁడు, భోజవిభుఁ జూచి యానానాంభోజ మలర. 30

క. 'అది యట్టిద యగుసైనను, విదితంబుగఁ బంచభిక్ష విడువక కొనుచా
రది యుండిగి యేకభిక్షకు, మదిఁ జొరుపుదురయ్య యెంత మచ్చిక లైనన్.' 31

క. అనవుడు నవ్విభుఁ డిట్లను, 'ననఘా! భిక్షాశనంబ యత్యంతముగాఁ
గొనియాడెద రం దయ్యెడు, వినుతవిశేషంబు నాకు వినిపింపుఁ డొగిన్.' 32

సీ. అనిన నిట్లనుసిద్ధుఁ 'డధిప! భిక్షాశి నిరాహారుఁ డని చెప్పు నాగమంబు
లది యప్రతిగ్రహం బై చెల్లు నె ట్లన్న దృష్టంబు చెప్పెదఁ దెలియ వినుము
నయమునఁ బువ్వు మేమియుఁ గందకుండంగ మధుసంగ్రహము చేయుమధుకరంబు
కరణి గృహస్థు లెవ్వరును వేసరకుండ నపరాహ్ణసమయంబునందు జేయు

తే. భిక్ష మాధుకరం బను పేరఁ బరగుఁ, గాన నది భూమి నప్రతిగ్రహము నయ్యె
నది నిరాహారసంకాశ మదియుఁ గాక, యొకవిశేషంబు చెప్పెద నొనర వినుము. 33

క. ఈనియమంబున భిక్షయు,మానుగఁ గొనుపరమయోగిమహిమలు చెప్పం
గా నేల యతని కిడునది, దా నొక్కటి కోటిఫలము తప్పదు గృహికిన్. 34

వ. ఏతదర్థప్రతిపాదకం బగునొక్కయితిహాసంబు గలదు చెప్పెద నాకర్ణింపుము. 35

క. కలఁ డొకవిప్రుఁడు హరిహర, జలజాసనపాదకమలసతతధ్యానా
కలితాత్ముఁ డుత్తముఁడు నిర్మలచిత్తుఁడు ధర్మకర్మరతుఁడు ధరిత్రిన్. 36

సీ. ఆవిప్రుసుదతి యనాచారములప్రోక యుగ్రకర్మంబులయునికిపట్టు
దుర్గుణంబులపెంట దుశ్శీలములకు తా నవివేకముల కెల్ల నాస్పదంబు
కలహంబులకు మూలకందంబు బొంకులపుట్ట ప్రల్లదములపుట్టినిల్లు
క్రూరత్వములచోటు కుటిలత్వపోలము లోభంబులనెలవు గర్వంబునిక్క

తే. యిరుగుపొరుగులవారి నింటింటివారి, సూడుకొనఁ దిట్టి మఱి కాని కూడు గుడువ
దతిథి వచ్చిన నొకపట్టెఁ డశన మిడదు, కడఁగి బలియును భిక్షంబుఁ గడపుచుండు. 37

సీ. ఎందేని యొక్కనాఁ డెల్లవారును జూడ నతఁడు నిక్కంబ గృహస్థుఁ డనుచు
గ్రాసంబు వేఁడినఁ గడపంగ నేరక యింటికిఁ గొనిపోవ నెదురు వచ్చి
యాతనిదోరతనం బాఱడిఁ బోవ నోరికి వచ్చిన ట్లెల్ల రేఁగి తిట్టి
మెడ పట్టి ముంగిలి వెడలంగ ద్రొబ్బిన జూచి గ్రాసార్థియుం జోద్య మంది

ఆ. 'యింతలెస్స యగునె యిల్లాలి మోజ యే, నెందుఁ జూచి యెఱుఁగ నిట్టినీచ
నకట యొందుచోట నడుఁగ వేళయుఁ దప్పె, నే మొనర్తు?' ననుచు నేఁగె మగుడి.

క. ఆవెడఁగువనితకతమున, దేవాతిథిపూజనములు దిరముగఁ జేయం
గా నెరవు లేక విప్రుఁడు, దా వెక్కసపడుచు నుండుఁ దద్దయు వంతన్. 39

సీ. కస్తూరికీ నెఱుఁ గాంతి గల్పింపక నలుపుగాఁ జేసిననలినభవుఁడు
భూరిసౌరభమైనపువ్వుంబు నోరికిఁ, జవి పుట్టఁ జేయనిభువనకర్త
చూడ శోభితమైనశుద్ధహేమమునకుఁ బరిమళం బొసఁగనిపద్మయోని
నిలువెల్లఁ దియ్యనై చెలువొందుచెఱకునఁ బండు పుట్టింపనిబ్రహ్మదేవుఁ

ఆ. డిట్టివిప్రవరుని కిట్టియాచారవం,తునకు నిట్టిదురితదూరమతికిఁ
దలఁపుకొలఁదియంద మెలఁగుచుండెడునట్టి, భామఁ గూర్ప కుండు టేమియరిది. 40

క. అని తనుఁ బుట్టించినస్రష్టను దూఱెడునట్లు గా నసంగతవృత్తిం
బనుపడి యుండుచు నొకనాఁ, డెనయఁగ నవ్వనిత నీళ్ళ కేఁగిన తెఱపిన్. 41

చ. అఱువుదుకుప్పసం బమర నొఁదలఁ దాలిక లైనవెండ్రుకల్
తఱుచుగఁ దూలియాడ దవుదవ్వుల గన్గొని సారమేయముల్
మొఱఁగఁగఁ బౌరబాలకులు మూఁకలు గట్టి పిఱుంద రాఁగ వేఁ
దుఱుకొని వచ్చువానిక్రియ దూఁగుచు వచ్చె నొకండు భిక్షుకున్. 42

ఆ. అతనిఁ జూచి విప్రుఁ డతులితజ్ఞానసం,పన్నహృదయుఁ డైనపరమయోగి
యనుచుఁ గడప నోడి తనభార్య రాకుండ, నిలిచి నాల్గుదెసలు నిక్కి చూచి. 43

క. ఇలు సొచ్చి సకలభాండం,బులు శోధింపంగ నొక్కమూలదెసను దొం
తులసందిఁ గ్రమ్మరించిన, సలసల మను వేఁడిపాయసముఁ గనుఁగొనియెన్. 44

క. కని తొంగి చూచి చేఁ బెట్టినఁ బొక్కెడు దర్వి యాకుటిల యెచ్చటఁ దాఁ
చెనొ యోగి వచ్చి తడ వయ్యెను భిక్షము పెట్టవలయు నేక్రియ నైనన్. 45

ఆ. అనుచు నాల్గుదెసలు నరసిన నది సమ,కూడ కున్నఁ జెప్పుగూడ యొకటి
తెచ్చి దానఁ దిగిచి తిగిచి మూఁకుటఁ బోసి, పెట్టె బాయసంబు భిక్షుకునకు. 46

ఉ. ఈకరణిం దపోధనున కేర్పడ భిక్షముఁ బెట్టి పుచ్చి యా
డాకిని వచ్చునో యని వడంకుచు మూసి తొలంగి నిర్వికా
రాకృతి నూర కుండు నెడ నంగన వచ్చి సతోయభాండమున్
వాకిట డించి లోనికడవ ల్వివరంబుగఁ బాఱఁ జూచుచున్. 47

ఆ. పాడువ యిల్లు సొరఁగఁబోలుఁ బొమ్మని యిట్టు, నట్టుఁ జూచి మనసు పట్ట లేక
దర్వి యరసి మున్ను దాఁచిపోయినచోట,నున్న నూరకుండె నుడుకు మాలి. 48

వ. మఱికొంతకాలంబునకు విధివశంబున నాదంపతులు మృతు లగుటయుం గాలకింక
రులు దానిం బట్టి కట్టికొని పోయి పతిప్రతికూలార్హదండనంబుల దండించుచుండి
రిట దేవదూత లతనిం దోడ్కొని పోయి దేవలోకంబునం బెట్టిన నతం డచ్చట
నుండి క్షుత్పీడితుండై యాహారంబు వేఁడిన. 49

ఆ. తోలుపాయ వఱచి తోరంపురాశిగాఁ, బోయఁబడిన వేఁడిపాయసంబు
దనరఁ జూపి 'దీని ననుభవింపుము భూసు, రాగ్రగణ్య!' యనిన నతఁడు రోసి. 50

తే. 'అకట నా కిట్టికష్టదుష్టాన్నభుక్తి, యొసఁగ నేనేమి చేసితి నొక్కొ దివిజు
లింత యవినీతిచేతురె యెఱిఁగియెఱిఁగి, యతిథియగునన్నుఁ దగదె పూజితునిఁజేయ.

క. నా కున్న నిట్టికష్టపు, నాకము నా కేమి సేయ న న్నీయెడకుం
దే కున్న నేమి కడపట, నీకట్టిఁడితనము సేయ నేటికిఁ దనకున్. 52

ఆ. ఉదరవహ్నిచేత నురియుచుండెదఁ గాని, చూడఁ గడఁగి యిట్టికూడుఁ గుడువ
నొల్ల' ననిన నమరవల్లభుకడ కేఁగి, దేవదూత లతని తెఱఁగు చెప్ప. 53

క. విని విప్రునిఁ దనయెదిరికిఁ, గొనిరా నియమించి చిత్రగుప్తుని దెసఁ గ
న్గొని యింద్రుఁ 'డితఁడు మును చేసినదానఫలంబుఁగోలఁది చెపుమా' యనినన్. 54

చ. కవిలియ విప్పి చూచి 'యనఘా! యితఁ డన్వయధర్మకర్మముల్
దవిలి యొనర్చెఁ గాని మఱి దానము లెవ్వియుఁ జేయఁ డొక్క నాఁ
డుదిద యెఱుంగ కుండ నొకయోగికి భిక్షము తోలుగూడఁ జేఁ
దివిచిన వేఁడిపాయసముఁ దెచ్చి రయంబునఁ బెట్టెఁ గావునన్. 55

క. ఒక్కటి కోటిగుణంబుగ, నెక్కటి నీతోలుపాయ నిప్పాయస మి
ట్లిక్కడ భుజింపవలయును, బెక్కేఁడు లితండు దేవబృందలలామా!' 56

మ. అని ధర్మజ్ఞుఁడు చిత్రగుప్తుఁడు యథార్థాలాపసంశీలుఁ డిం
ద్రునితోడ న్వినిపించెఁ గావున మహాత్ముం డైనయోగీంద్రునం
దు నివేదించినయర్థ మత్యధికమై తోఁచున్ ఫలం బిచ్చుచో
ననఘా! యోగి యనంగ దైవ మన వేఱా యెందు నెట్లుండినన్. 57

ఆ. బాలలీల సలుపు నోలి నున్మత్తసం, చరణ మియ్యకొనుఁ బిశాచరీతి
నొందియుండుఁ బరమయోగి విరక్తుఁడై, యతనిఁ దెలియ నేర రన్యజనులు. 58

క. కరచరణాద్యవయవయుత, శరీరధారి యని మనుజసామాన్యునిగాఁ
బరికింపఁ జనదు యోగిం, బరతత్త్వముగాఁ దలంచి ప్రార్థింపఁ దగున్. 59

క. కావున యోగికి నిడునది, భూవర కోట్యధికఫలదముగఁ జెప్పఁ జుమీ
యీ వేదార్థము లెందను, నావృదు భోజుండు సిద్ధునకుఁ బ్రాంజలియై. 60

క. యోగీంద్రసమర్పితభిక్షాగుణగౌరవము నీముఖంబున వింటిన్
యోగీశ్వరవర! విప్రుం, డేగతిఁ జరియించెఁ జెప్పవే దేర్పడ నాకున్. 61

ఆ. చిత్రగుప్తుఁ డట్లు చెప్పిన విని విప్రవరునితోడ సమరవరుఁడు పలికె
'నవని నెంత చేసె నంతయు నిచ్చోట, ననుభవింప వలయు నజునికైన. 62

వ. కావున నీ కిది యనుభవింపక పోవ'దనిన నమ్మహీదేవుండు 'దేవా! యే నిట్టియనుభవం బొల్లనొండుచోట నునుపు' మనిన నతం డతనిచలగ్రహత్వం బుడుపుటకునై యి ట్లని పలికె 'నీవు తొల్లి మేనం జేసినదానఫలంబు మఱి లేదు గావున నీ కింక నిటు లొండం బని లేదు ప్రాప్తవ్యం బనుభవనీయం బగుటఁ దెలుపుచున్న యితిహాసంబు గలదు తెలియ విను' మని యి ట్లనియె. 63

క. రతిఁ జేసినకరకమలము, చతురత మఱి మఱపకుండఁ జతురాననుఁ డీ
సతిఁ జేసె ననఁగఁ జక్కని,యతివ యొకతె గలదు బ్రాహ్మణాన్వయమందున్. 64

క. ఆ నెలఁతభాగ్య మెట్టిదొ, కాని ప్రవాసైకవృత్తిఁ గాంతుఁడు చనినం
దా నుండెఁ బుట్టినింట మనోనిగ్రహమునకు నెల్లనుం గుదు రగుచున్. 65

వ. అట్లుండ నొక్కనాఁ డురూపజితరతీశ్వరుం డగు నొక్కయోగీశ్వరుం డీశ్వరుండపోలె వచ్చి భిక్షం బడిగిన నతనిరూపాతిశయంబునం దనసయనంబు లనిమిషంబులై నిగుడ మగుడింప నేరక వెఱఁగుపడి యుండె నంత నతం డయ్యతివ కి ట్లనియె. 66

క. భిక్షానిరతుల నెన్నఁడు, వీక్షింపవె తొల్లి యింతవెఱఁ గేటికిఁ బ
ద్మాక్షీ! కలిగినఁ బెట్టుము, భిక్షము లే కున్నఁ గడపు పెక్కేమిటికిన్. 67

క. అనవుడు మును గన్నుల కొద, వినయవ్వలవంత పిదప వీనులకుం జో
క్కె ననఁగఁ దన్మధురోక్తులు, విని తనుఁ దా నెఱుఁగ లేనిస్మృతి పేర్మిన్. 68

ఉ. నిట్టకనిల్వనం గలఁగి నేత్రయుగంబున బాష్పపూరముల్
దొట్టఁగ ఘర్మతోయములతోఁ బులకాంకురజాల మెల్లెడం
బుట్టఁగఁ దొల్లియిల్లలుకఁ బూని యొనర్చినమంటిముద్ద దాఁ
బెట్టెఁ దదీయపాత్ర నది భిక్షయకాఁ గొనిపోయె సిద్ధుఁడున్. 69

ఆ. అట్ల కాదె మన్మథాంధులు సంధులు, నెదిరిఁ దన్నుఁ గాన నెట్లు నేర్తు
రట్లు సిద్ధుఁ డరుగ నమ్ముగ్ధ మృతిఁ బొందె, విరహవహ్నిచేత వెచ్చి వెచ్చి. 70

సీ. ఆరీతి మృతిఁ బొంది యానాతి మత్పురి కరుదెంచి యుదరాగ్ని యధిక మైన
వాపోవుచుండ నివ్వనిత కెయ్యది ప్రాప్త మని చిత్రగుప్తుని నప్డు డేము
పిలిపించి యడిగిన నెలమిఁ బుణ్యాపుణ్యవిదుఁ డోలిఁ గవిలియ విప్పి చూచి
యొకమంటిముద్ద యోగికి భిక్షగాఁ బెట్టు నది కోటిగుణితమై యొదవెఁ గానఁ

ఆ. దదనురూపభుక్తి తరుణికిఁ గైకొన, వలయు ననినకర్మవశము గాదె
యట్ల సేయఁ గాక యనిన మత్కింకరుం, డొక్కమంటికుప్ప యొనరఁ జూపి. 71

చ. 'ఇలపయి నెల్లవారలు ననేకవిధంబుల దానధర్మముల్
సలుపఁగ నీకు నిట్టికువిచారము పుట్టుట యేమిపాపమో
వెలఁది! పురాకృతం బనుభవింపక పోవునె పొమ్ము' నావుడున్
దలఁకి మదీయసన్నిధికిఁ దాఁ బఱతెంచి కృతప్రణామయై. 72

క. 'మన్నింపు మమరవల్లభ!, మ న్నిటు భక్షించునట్టిమనుజులు గలరే
యన్నముఁ బెట్టింపు' మనుచుఁ, గన్నీ రొలుకంగ నున్నఁ గరుణ దలిర్పన్. 73

క. 'ఇది చేసినకర్మము బెట్టిదమై యున్నయది దీన డిందు పఱుప రా
దుదరాగ్ని చిత్రగుప్తుఁడ, పదిలంబుగఁ జూడవయ్య పత్రిక లెల్లన్.' 74

చ. అనవుడుఁ జూచి 'యాతరుణి యారయ నొండొకదాన ముర్విఁ జే
సినయది లేదు మీకొకటి చెప్పెద మృణ్మయభిక్ష పెట్టు నా
డొనరఁగ నందులోఁ గలసి యుండెఁ జుఁడీ యవగింజ దానఁ గ
ల్గినసుకృతంబు మీరు పరికింపుఁడు' నావుడు నవ్వధూటికిన్. 75

క. ఒకదివసము యవపిండియు, నొకనెల మృత్తికయుఁ గాఁగ నొసఁగిన నది కొం
డొక డలిసి కర్మఫల మా, ప్రకారమున ననుభవించె బహుకాలంబున్. 76

వ. అప్పుడు నమ్మంటికుప్ప గరిగంటి గా నుండినం జూచి వెఱఁగుపడి యాలేమ మా
సమ్ముఖంబునకు వచ్చి ముచ్చిరుచు నిట్లని విన్నవించె. 77

క. 'తనచేసినకర్మంబును, దనవండినకూడు నెవ్విధంబున నైనం
దనకు ననుభవింపక పోవునె నావిన్నపము విని యవును గా దనుఁడా. 78

క. నెఱిగొండలు గువ్వలచే, నఱుగునె యీమంటిదిబ్బ యది నాచేతం
దఱుగునె నానాఁటికిఁ గ్రమ్మఱఁ బెరుఁగుచు నున్న దేమిమాయయొ యెఱుఁగన్.

క. ఉడుగక యీభవమున నిది, కడతేర భుజింప నోపఁ గ్రమ్మఱ వత్తుం
గడమ భుజింపఁగఁ దండ్రీ!, యెడ యి మ్మొక జన్మ' మనిన నే నిచ్చుటయున్. 80

చ. ధరణికి నేఁగియొక్కవసుధాసురవర్యునియింటఁ బుట్టి సు
స్థిరముగ శైశవక్రియలు చెల్లినమీఁద వివాహమై తలో
దరి దనపుట్టినింట నుచితస్థితి నుండఁగ నొక్కనాఁడు వి
స్ఫురితతపోధనాఢ్యుఁ డొకపుణ్యుఁడు భిక్షకు నేఁగుదెంచినన్. 81

క. మడ్డునకుఁ బోయున ట్లొక, త్రెడ్డేఁ దుదుకుపాయసంబుఁ దెచ్చి యతనిచే
నిడ్డ నడిచిపడి కనలెడి, గ్రుడ్డులఁ బలియుంగఁ దఱటి కొని కనుఁగొనుచున్. 82

సీ. 'అక్కట మున్ను నీ వాచరించినయట్టిపాపంబు చాలదె పంకజాక్షి!
నాచేయి మండంగ నీచందమున వేఁడిపాయసం బీపత్త్రభాజనమున
వైవంగఁ బాడియె నీ వేమి సేయుదు నైజమై చెల్లెనీయోజ నీకు'
ననుచు దూఱఁ బలికి యాతాపసోత్తముం డరిగిన నింతి యచ్చెరువునొంది
ఆ. 'యేమిపాప మొక్కొ యేఁ దొల్లి చేసితి, నిమ్మహానుభావుఁ డిట్లు పలికె'
ననుచుఁ దత్తఱించి మనసు పట్టఁగలేక, యాతఁ డున్నయెడకు నరుగుదెంచి. 83

ఉ. అల్లనఁ జేరి మ్రొక్కి వినయానతయై 'మునినాథ! యేను నీ
చెల్లెలఁ జుమ్ము నన్నుఁ గృప సేయుము నాయపరాధసంచయం
బెల్ల సహింపు మే నబల నొకటిదానఁ గ్రియావిహీననై
తొల్లి యొనర్చినట్టిఘనదోషము దా నది యెట్టిదో కదే. 84

ఉ. అప్పుడు నీవు నాయెదుర నాడినమాటకు దేహ మంతయుం
నిప్పుల బ్రుంగిన ట్లయిన నిల్వఁగ నోపక యిందు వచ్చియుం
దెప్పిఱకున్న దాన భవదీయవచోమృతవారిధారచేఁ
దొప్పఁగఁ దోఁచి నన్నుఁ బరితోషితమానసఁ గా నొనర్పవే.' 85

క. అనవుఁడు నది తొలుబామున, నొనరించినకర్మగతియు నొగిఁ బరలోకం
బునఁ బడినపాటుఁ దజ్జన్మనిమిత్తము భావికరణమతిఁ జెప్పుటయున్. 86

క. వడవడ వడఁకుచుఁ గ్రమ్మఱ, నడుగులపైవ్రాలి 'యోమహామతి! యే ని
క్కడ కర్మశేష మెక్కడ, వెడలింపఁగదయ్య దురితవిషనిధివలనన్.' 87

చ. అనవుఁడు 'నింతి! నే నొకయుపాయము చెప్పెద నీకుఁ జూడఁ బో
లిన తెఱఁ గైనఁ గోమలి! చలింపక చేయుము జారకాంతచూ
పునఁ దగ వన్నె వెట్టుకొని పోయి విలోచనరోచు లొప్పఁగాఁ
గనుఁగొనుచుండు మీ వశీలకాముకులుం బ్రియ మందునట్లుగన్. 88

చ. నినుఁ గని యెవ్వఁడేని మది నెయ్య మెలర్పఁగఁ గోరి చేర వ
చ్చిన దృఢచిత్తవై నెపము చెప్పి తొలంగుము లోను గాకు చి
క్కిన నది తొంటికంటెఁ గడుఁ గీడగుఁ గావున మోసపోకుమీ
యెనయఁగ నిట్లు నీవు చరియింపఁగ లోకములోనిదూషకుల్. 89

క. మానక నిను దూషింపుచు, మానిని నిను ముద్దఁ జేసి మన్ను గొనంగా
నానాఁటికి నానీచుల,చే నది యంతయును బోవుఁ జెడి పుడికిళ్లన్. 90

క. అట్టిద కాదె దురాత్ములు, డిట్టుట సజ్జనులు దమకు దీవన లని చే
పట్టుదురు దురితములఁ బోఁగొట్టుటకు నుపాయ మిది యగుట విని యునికిన్. 91

క. నమ్ము మిది తగునుపాయము, బ్రాహ్మణుఁడు నూరు వెడలి పోయి నిజేచ్ఛన్
త్రిమ్మరు తెఱఁగునఁ దత్సతి, త్రిమ్మరియెను నెల్లవారుఁ దెగడెడునటుగాన్. 92

క. ఒకయేకాంతపుగృహమున, నొకరుండును మర్మ మెఱుఁగ కుండునటులుగాఁ
గృకలాసమువిధమునఁ బ్రొద్దొకచాయఁ జరించుచుండె నొకనగరమునన్. 93

సీ. పగ లెల్లఁ గైసేసి పట్టణం బంతయుఁ దిరుగుఁ బువ్విలుకానిదీమ మనఁగ
విటకోటిఁ బొడగని వెడనవ్వు నవ్వుచుఁ గన్ను లార్చుచుఁ జఱుంగవ యొకింత
దోఁపఁ బయ్యెదకొంగు దొలఁగఁ గమ్మద్యుతు లలరంగ నిలుచు నొయ్యారమెసఁగ
నొకఁ డాస పడి చేర నొకనిచేరువ నిల్చి తుది నొందు చేయక దుస్సిపోవు
ఆ. నంత ప్రొద్దు గ్రుంక నవ్వేష ముడిగి సుస్నాతయై శివార్చనం బొనర్చి
యొక్క ప్రొద్దు గుడిచి యుల్లంబుఁ దనభర్తయందు నిలిపి నిద్ర నొందు నబల. 94

క. ఇవ్విధమునఁ బ్రతిదినమును, నవ్వెలఁది చరింపఁ గొంద ఱతిదూషకులై
అవ్వెలు సేయుచు నోరులఁ, గ్రొవ్వునఁ బాపంబు పంచికొందురు వరుసన్. 95

క. తమచేసినదుష్కృతసుకృతము లొగిఁ దా రనుభవించెదరు గాక నిమి
త్తము లేక తడవు టది యుక్తము గాదని కొంద ఱెల్లఁ దడవరు దానిన్. 96

వ. అంత నొక్కనాఁ డొక్కమాదిగ తనసుదతియుం దానునుం బదత్రాణంబులు గొంచుఁ జనుదెంచునప్పు డప్పడంతి నెదురం గని యాచర్మకారాంగన దవ్వుదవ్వులం దెరువు దొలంగి నిల్చినం జూచి వాఁ డి ట్లనియె. 97

చ. 'వలవనిభీతి యేల తగువారలకుం దెరు విచ్చు టొప్పుఁ గా
కలయక నేఁడు నాఁ డనక యబ్బినచోటన యెవ్వఁ డైనఁ గా
సులు పది సూపునేని మది సుక్కకు వానికిఁ దక్కినట్లు వి
చ్చలవిడి నుండునీయధమజాతి దలంపఁగ విప్రకాంతయే!' 98

చ. అనినఁ గరారవిందముల నాసతి వీనుల మూసికొంచు 'ని
ట్లను టుచితంబె? యొడ్లఁ జెడ నాడినఁ బెద్దఱికంబు వచ్చునే?
విను మది గాక కొంద ఱవివేకులు నిందలు చేసి చేసి యీ
వనితకు భోజ్య మైనత్రిదివస్థితమృణ్మయరాశి యంతయున్.' 99

క. పంచుకొనఁగ శేషించిన, యించుకబూడిదయుఁ జెఱుప నేటికి నది భ
క్షించుతలంపున నే యిటు, వంచింపక పలికె'దనుచు పడి భర్త్సించెన్. 100

క. ఆమాటలు విని యాద్విజ, కామిని యీవనిత యెట్లుగా నెఱిఁగె నొకో
భూమి ననన్యవిదిత మగు, నామర్మం బనుచు నెమ్మనము వెఱఁగందన్. 101

ఉ. 'అంగజమాతవో మఱి గజాననమాతవొ కాక నీవు మా
తంగివె యోలతాంగి ననుఁ దప్పక చూడుము నీవు నీకృపా

పొంగమరీచు లొప్పఁ' నని ప్రస్తుతి సేయుచుఁ జేర వచ్చి య
య్యంగనపాదపద్మయుగళాంతికమేదినిఁ జాఁగి మ్రొక్కఁగన్. 102

చ. తొలఁగఁ గదమ్మ నాకు నిటు దోసముఁ గట్టకు మమ్మ యింత మ్రొ
క్కలమిది యేటికమ్మ కొఱగానికులంబునఁ బుట్టినట్టినా
వలనఁ బ్రయోజనం బొకటి వచ్చునె చెప్పఁగదమ్మ నీకుఁ జె
ప్పులు వలలేని నిచ్చెదము పోరునఁ గైకొనవమ్మ' నావుడున్. 103

ఆ. 'నీవు నాదుభాగ్యదేవత వనికాని, యొందుగాఁ దలంప నుల్లమందు
మగువ యిట్లు పల్కఁ దగునమ్మ నను గావ, వలదె' యనుచు విప్రవనిత యపుడు.

క. దిగ్గన లేచి కరాబ్జపు, మొగ్గలు దననుదుటిమీఁద మోపి 'లతాంగీ!
యొగ్గుగఁ జూడకు నీవెఁ, యొగ్గము నామాట' కని ప్రియోక్తులు దనరన్. 105

క. 'నాపాప మెల్లఁ బొలిసెనొ, యేపారఁగఁ గర్మశేష మించుక గలదో
రూపించి చెప్పు' మనవుడు, నాపడఁతుక సస్మితాననాంబుజ యగుచున్. 106

చ. వెరవరి వీవు నీ కనుభవింపఁగఁ బాలిదిగైనవృత్తికో
త్కరము సశేషమావకనికాయమునం దగఁ బంచిపెట్టి తె
వ్వరు సరి నీకు నోతరుణీ! వంశపవిత్రము నీచరిత్ర మ
చ్చెరువు దలంప నీవిభునిఁ జెంది సుఖింపుము పొమ్ము నెమ్మదిన్.' 107

వ. అనిన నవ్విప్రకాంత విస్మయాక్రాంత యగుచు నక్కాంతతో మఱియు నిట్లనియెఁ
'దల్లి దేవరహస్యంబు లెఱుఁగునట్టిమహానుభావంబునకు నిట్టిహీనజన్మం బనురూపంబు
గాదు నీ వెవ్వ రెఱిఁగింపు' మనిన నదియుఁ దనమగనిం జూపి యి ట్లనియె. 108

క. 'అక్క! విను మాతఁడు ము,న్నొక్క మహీదేవుఁ డతనియుల్ల మలర నే
నెక్కుడువేడుక మెలఁగుదు, నిక్కపుసహధర్మచారిణిత్వము పేర్మిన్. 109

క. వితతతపోనియమంబులఁ, బ్రతిదివసముఁ గందమూలఫలముల నాస
క్తత భుజియించుచు నుచితా, యతవిస్మృతపర్ణగృహములం దుండు నెడన్. 110

మ. ఒకనాఁ డేమని చెప్ప మాగృహమునం దొప్పార నైమిత్తికం
బకలంకంబుగఁ జేసి విప్రులకు నాహారం బపూపాజ్యపూ
ర్వకమై తద్దయుఁ దృప్తిగాఁగ మన సారం బెట్టి యట్లున్నచో
నొకయోగీంద్రుఁడు వచ్చె భిక్షకు మహాయోగ్యుండు మాయింటికిన్. 111

ఉ. వచ్చిన నేను భిక్ష యిడువాంఛఁ జనం బతి నన్నుఁ జూచి యీ
వచ్చినవాఁడు దా మలినవస్త్రుఁడు దేహము చూడ రోఁత వీఁ
డెచ్చటిబీదయో యితని కేటికి భిక్షము భుక్తశేషముల్
దెచ్చి విదల్పరాదె యని తిట్టిన గావున నోడి వానికిన్. 112

క. ఎంగిలి పెట్టిన' ననలము, భంగి నతఁడు మండి 'యోరిపాఱుఁడ! నాకీ
యంగన భిక్షము పెట్టఁగ, నెంగిలి పెట్టు మని చెప్పితే గర్వమునన్. 113

శా. ఏలా యింత వృథాభిమానము క్రియాహీనుండవై నావిధం
బాలోకింపక యెగ్గు చేసి తిట నీయాచారము న్నీదువా
గ్జాలంబు న్మఱి నీతపోమహిమయుం జర్చింప నీపాటియే
నీలా గంతయుఁ గంటి నంత్యజుఁడవై నీ వుండు మిద్ధాత్రిలోన్. 114

క. నీచెప్పినట్ల చేసిన, యీచపలయు నీపిఱుంద నెడపక భవదీ
యాచరణమునకు ననుగుణ, యై చరియింపంగ వలయు' నని పల్కుటయున్. 115

ఉ. కంపము నొంది యే నతనికాళ్ళపయిం బడి 'యోమునీంద్ర! మ
న్నింపు శతాపరాధులము నీ విటు లల్గుట భూతధాత్రిలో
నిం పగునీర నగ్ని యుదయించుట కాదె తలంప నిట్టి పే
యంపుభరంబు దా నుడుగునట్టియుపాయము మాకొనర్పవే'. 116

సీ. అనవుడు 'వినుము మింతి యజ్ఞాతధర్మంబు సలుపుచు భూమివారలకుఁ జూడ
నిది దుశ్చరిత్ర నా నెవ్వతె చరియించు నట్టిబ్రాహ్మణి మీకు నగ్గ మైనఁ
గని నీవు దొలఁగ నేకాంతుఁ డక్కాంత నెగ్గులు పల్క నీవు తద్గుణ మెఱింగి
తగవు గాదని పూని మగనిఁ గోపింప నమ్మగువయుం నిటుఁ జేరి మాటలాడ
ఆ. నపుడు శాపమోక్ష మగుఁ బొమ్ము నీదుభావమునఁ బూర్వజన్మవర్తనములు
నుత్తములచరిత్ర లొగిఁ గాంచుతెలివియుఁ, గల్గు' ననియె నతఁడు గరుణతోడ.

ఉ. కావున నిన్నుఁ జూచి కడఁగంటిమి మాదురితాబ్ధి కంచు సం
భావన చేసి యావనిత భర్తయుఁ దాను నిషిద్ధభావముల్
పోవఁగఁ బ్రోచి శుద్ధమగుపూర్వపుమేనులు దాల్చి నెమ్మదిం
బోవఁగ విప్రకాంతయును బోయె నకల్మషవృత్తి నింటికిన్. 118

వ. అటుగావునఁ బురాకృతకర్మఫలం బవశ్యభోక్తవ్యంబు గావున రోసినం బోవ దని
యెంతచెప్పిన నవ్విప్రుం డియ్యకొనక దేవవిభుంజూచి 'దేవా! నాకుఁ బునర్జన్మంబు
ప్రసాదింపుము నీచిత్తంబునకు మెచ్చు వచ్చునట్టిదానధర్మంబులు సలిపి గతకల్మ
షుండనై వచ్చి యిచ్చోటన యుండెద' నని విన్నవించినం గరుణించి యింద్రుఁ
డతని కట్ల యొసంగిన. 119

చ. ఇల నతఁ డుద్భవించి దనయిచ్చకు వచ్చువధూటిఁ బెండ్లియై
వెలయఁగ నన్నపానములు విప్రముఖంబున భూతతృప్తిగా
నలువడఁ బెట్టుచుం గ్రతువు లాదట జేయుచుఁ బంచపూజలుం
బొలుపుగ నాగమోక్తవిధిఁ బూని యొనర్చుచుఁ బెక్కుభంగులన్. 120

క. గతకల్మషుఁడై విప్రుఁడు, శతవర్షము లుర్వి నుండి స్వర్గగతుండై
శతమన్యునికొలువున నిస్సితసౌఖ్యము లందుచుండెఁ జిరకాలంబున్. 121

క. కావున గృహికి నవశ్యము, సూవె యతిథిపూజ యట్టిసుకృతక్రియకుం
దావలము భార్య యది సద్భావసరణి మెలఁగకున్నఁ దప్పు నఖిలమున్. 122

క. ఆవిప్రుఁడు తొలుబామున, నేవిధులం బడియె భార్య యిచ్చకు రామిన్
భూవర యది యనుకూల, స్త్రీవలనఁ గదయ్య కనియెఁ జిరసౌఖ్యంబుల్.' 123

వ. అని సర్పటిసిద్ధుండు చెప్పినయితిహాసంబు విని భోజనరేంద్రుండు ముకుళీకృత కరారవిందుం డగుచు నిట్లనియె 'నట్లకాదె గృహిణి సహధర్మచారిణియగుట యదదను కూలత లేక యేకార్యంబులు నేల సిద్ధించు నది యట్లుండె గృహపతికి నతిథిం గడపుట యతినింద్యంబుగా విందు నిది యేమిచందం బానతి' మ్మనిన నతం డతని కిట్లనియె 'మనుష్యుండు పుట్టినగోలె నిడుములం బడి గడించినయొడమి పుడమిఁజేఁ డలిగి గడియదడవులోన నొడగొలుగొన శక్తుండగునట్ల గృహాగతుం డగునతిథి తిరస్కృతుండై యతనిపూర్వార్జితసుకృతంబు లన్నియు నపహరింపం జాలు నట్లుగావున. 124

క. మానుగ గృహి మధ్యాహ్న, స్నానముఁ జేసినది మొదలు సద్ధర్మరతిం
దా నశనము గొనునది తుద, గా నతిథికిఁ బెట్టవలయుఁ గాదు గుడువఁగన్. 125

క. వినుము విశేషించియుఁ గురు, షునిభోజనవేళ నతిథి క్షుత్పీడితుఁడై
చనుదెంచి గ్రాస మడిగినఁ, దనముందటియశన మైనఁ దగు నొసఁగంగన్. 126

క. ఈసదృశార్థమునకు నితి, హాస మొకటి గలదు విను నృపాగ్రేసర పృ
థ్వీపతిముఖతిలకంబు న, దీసంయుత మగుకళింగ దేశమునందున్. 127

సీ. పుండరీకం బనుపుర మొప్పు నప్పురంబున కధీశ్వరుఁడు ప్రభూతయశుఁడు
సంపాతి యనురాజు సద్గుణశీలుఁ డాచారవంతుఁడు నిత్యసత్యధనుఁడు
చర్చింప శ్రీరామచంద్రుతో నెనవచ్చు నితరులతరము గా దతనిఁ బోల
నట్టిభూతలనాథునర్ధాంగశోభిని వర్ణితరూపలావణ్యసదన

ఆ. చంద్రరేఖ యనఁగ జానకిఁ బోలు న, ప్పడఁతి వంధ్య యగుడుఁ బార్థివేంద్రుఁ
డధికనిష్ఠ నభవు నర్చించి సంతాన, మడిగె నవ్విభుండు నట్ల యొసఁగె. 128

క. పరమేశ్వరుఁ డట్లొసఁగిన, వరప్రసాదమునఁ జేసి వసుధాధిపశే
ఖరుఁ డగుసంపాతివలనఁ, గరమొప్పఁగఁ జంద్రరేఖ గర్భిణి యయ్యెన్. 129

క. తెఱవకుఁ గుచమండలమును, మఱి పిఱుఁదును ఘనము చేసి మధ్యమ నతుఁ బే
దఱిక మొసఁగు నని యజు నం, దఱు దూఱుట మాఱెఁ జాలు డాల్చుటవలనన్.

సీ. పాలిండ్లు నల్లన పాలిండ్లయై చాల బలిసెఁ జూచుకములు నలుపు లెక్కె
వళులు స్రుక్కులు విచ్చె వెలసె నాభీరంధ్రి మాఱు గప్పారుచుఁ దోర మయ్యె
గండదర్పణములఁ బాండురచ్ఛవి దోఁచె నధరపల్లవరాగ మల్ప మయ్యెఁ
దలఁపు కోరికలకు నెలవయ్యె జిహ్వకు నరుచి వాటిల్లె దేహంబు డస్సె
ఆ. గమన మలస మయ్యెఁ గైసేయుంపనులందు, జాడ్య మొదవె నుదరసంప్రవృద్ధ
గర్భభారవహనగౌరవంబునఁ జేసి, పద్మనామనగరభర్తసతికి. 131

వ. అంత నవమాసంబులుఁ బరిపూర్ణం బగుటయు నొక్కపుణ్యదివసంబునందు 132

క. విమలపయోనిధివీచీ, సముచిత యగులక్ష్మిపోలె సౌందర్యాద్యు
త్తమలక్షణలక్షితయై, కుమారి యుదయించె రాచకోమలి కెలమిన్. 133

క. సుతయుదయవేళ నయ్యెడు, వితతశుభాశుభము లెఱుఁగ వేఁడి ధరిత్రీ
పతి యడిగినఁ జెప్పెఁ బురోహితుఁడు గ్రహస్థానములు నిరీక్షించి త్రగన్. 134

ఉ. 'ఇప్పటివేళ చూడ మనుజేశ్వర! తక్కినగండదోషముల్
చెప్పఁగ లేవు భావిఫలచిహ్న మొకం డటు చిత్తగింపుఁడా
యిప్పడఁతిం గరగ్రహణ మెవ్వఁడు చేసె నతండు లేఁడగుం
దప్పదు బ్రహ్మరాక్షసుకతంబునఁ దొమ్మిదినాళ్ళనాఁటికిన్.' 135

క. అని చెప్పినఁ గర్ణద్వయ, మును జూఁడినచంద మైన మూర్ఛాగతుఁడై
జనవిభుఁడు కొంతతడవునకు నొకించుక తెలిసి యెలుఁగు కుత్తుకదగులన్. 136

ఉ. 'పట్టపురాజ నంచు నొడఁబాటులు దప్పను భూజనంబులన్
గట్టియుఁ గొట్టియున్ బహుముఖంబుల నర్థము గూడఁబెట్ట నే
పట్టున నర్థులం గడప బ్రాహ్మణపీడల కొగ్గు సేయ నేఁ
బుట్టి ప్రబుద్ధశామహిమఁ బొందినపోలె నొనర్పఁ బాపముల్. 137

క. క్రతువులు మొదలగు వేదవ్రతములు దగఁ జేయునపుడు వసులోభమునన్
మతిచెడి తద్దక్షిణ లతిహీనము సేయ గురుల నవమానింపన్. 138

క. సేవకులకు ముదు చేసిన, జీవితములు చెఱుప లావు చేసినవానిన్
జేవ చెడనాడ విధి నా, కీవిధిఁ బ్రతికూలుఁ డగుట కెయ్యది కతమో 139

సీ. కొడుకు పుట్టెడు నని కొండంతయాసతో నుండంగఁ దుదిఁ గూఁతు రుద్భవించె
నది యైనఁ గన్నులయెదుర నెమ్మది నున్న నుల్లంబు గొండొకయూఱడిల్లుఁ
బరమేశుఁ డిదియును బట్టక పోఁజేసె నట్టినందనయింగి యరయ నెద్ది
సంతతి లేనినాఁ డింత యొఱుఁగము కడపట దుఃఖంబు గట్టెఁ దెచ్చి

ఆ. యేమి చేయువాఁడ!నిమ్మహోదురవస్థ, సెట్టిభంగి నపనయించువాఁడ!'
ననుచు వగవఁ దొడఁగె నారాజపుంగవుఁ, డరులకైన నాత్మ నదలు వొడమ. 140

క. అంతయుఁ గనుఁగొని విప్రులు, 'వింతలె భూజనుల కరయ విధికృతములు మీ
రింతటిపనికై యేలొకొ, చింతించెద'రనినఁ దనదుచిత్తములోనన్. 141

ఉ. మిక్కుట మైనశోకము శమింపక పేర్చిన వెచ్చనూర్పుచుం
జెక్కుటఁ బాణిపల్లవము చేర్చి కనుంగవ బాష్పపూరముల్
స్రుక్కుచు గ్రమ్ముదేర ధరణీపతి తద్దయుఁ విహ్వలించినన్
దక్కక విప్రవర్గముఁ బ్రధానచయంబును భృత్యకోటియున్. 142

క. 'తనయోత్సవసమయం బిది, జననాయక! నీకు శోకసమయమె వగవం
బని లేదు లెమ్ము శీఘ్రం,బున నడుపుము జాతకర్మములు సకలంబున్. 143

ఉ. ఇంకొకనాఁడు వచ్చుపని కిప్పుడ యింత దలంక నేల? మీ
వంకఁ గృపావిధేయుఁ డగువాఁ డొకపుణ్యుఁడు గల్గనేని న
య్యంకిలి దీర్పకున్నె'యని యందఱుఁ జెప్పినఁ జింత దక్కి యా
పంకజపట్టణాధిపుఁడు బాలకుఁ జూచి కృతార్థకృత్యుఁడై. 144

క. పదియును రెండును దినముల, తుదిగృహశుద్ధి యొనరించెఁ దోరణములఁ బెం
పొదవెడుకలుపదమును నం, బుదములక్రియఁ జూడ నొప్పెఁ బురిలో నెల్లన్. 145

వ. ఇట్లు పట్టణం బలంకృతంబు సేయించి భూసురాశీర్వాదంబులతోఁ బుణ్యాహంబు చేసి పుష్పగంధి యనునామకరణం బిడి పాఠకుల నపారదక్షిణలను గోభూహిరణ్యాదానంబులనుఁ బరితృప్తులం జేసి యిష్టాన్నంబు లొసంగి సుఖం బుండునంత దాదులు పెనుప నానాఁటికి శైశవవినోదంబులం దల్లిదండ్రులకు ముద్దుసూపుచు నా పుష్పగంధి రూపవిలాసవిభ్రమంబుల జిగి దళుకొత్తఁ బెరిగి చెలికత్తియలం గూడి బొమ్మపెండ్లిండ్లు సేయుచు నంతఃపురోపవనవృక్షంబులకు రక్షకంబు లగునట్టి పను లనుసంధింపుచు భాగ్యప్రదంబు లగునోములు నోముచు మఱియు వివిధవిహారంబులు సల్పుచుండం గొండొకకాలంబు సనుటయు నొక్కనాఁడు. 146

ఉ. చూతనవీనపల్లవము శుద్ధసువర్ణపునీటఁ దోఁచి కం
జాతరజంబుపైఁ గలయఁ జల్లి మెఱుంగులఁ దోమి తోమి ల
క్ష్మీతనయుండు వేడ్కపడి చేసినపుత్తడిబొమ్మ నాఁగ నా
భూతలనాథుసన్నిధికిఁ బుత్త్రిక వచ్చె సఖీసమేతయై. 147

ఉ. వచ్చినఁ జూచి హర్షరసవార్ధితరంగల నోలలాడుచుం
జెచ్చెరఁ గౌఁగిలించుకొని చెన్నగుమోమున మోముఁ జేర్చుచుం

దెచ్చి నిజాంకమం దునిచి తిన్ననిమాటల గారవింపుచుఁ
ముచ్చటవోవఁ జూచెఁ దనముద్దులపట్టిఁ బయోరుహాననన్. 148

ఉ. అనన మెత్తి కన్గొనిన నాసభ యంతయు దృష్టిరీతిచే
చీనివహంబుచే మునిఁగి చేడ్పడునో యనుభీతిఁ బోలె ల
జ్జానతయై కరాగ్రవివిధాభరణంబులు చూచుచుండఁ బ
ద్మాననయుం గటాక్షరుచు లాదట నొక్కొకమాటు పర్వఁగన్. 149

క. గౌరియు సిరియు నిజాంకవి, హారిణు లగునట్టి హిమనగాబ్ధులభంగిన్
ధీరత్వగభీరత్వము, లారంగా విభుఁడు మెఱసె నాత్మజతోడన్. 150

వ ఇట్లు నిజపుత్రీలాలనలాలసుండగుచు నమ్మహీనాథుండు కొండొకతడవు వినోదించి
తద్వయోరూపంబులకు ననురూపంబు లగువిద్యావిలాసంబులభ్యసింపనియోగించిన.

ఉ. భారతి యొండె నొండె నలపార్వతి గాని తలంచి చూడ నీ
నీరజనేత్ర యొక్కధరణీపతిపుత్రికమాత్ర గాదు వో
ధారుణి నంచు సజ్జనకదంబము మెచ్చఁగ సాక్షిభూత్రయై
చేరి గురుండు చెప్ప నతిశీఘ్రము మెలర్ప గ్రహించె నేర్పునన్. 152

క. పాటయు జమఘురు వ్రాఁతయు, నాటయు వాద్యంబు నాది యగువిద్యలకున్
మేటి యని పొగడఁ దగియెదు, పాటిగఁ దా నభ్యసించె బాలిక పేర్మిన్. 153

వ. అంత నొక్కనాఁడు దనకూఁతు విద్యావిశేషంబులకు సంతోషంబు నొంది గాఢా
లింగనంబుచేసి మస్తకంబు మూర్కొనుచుం దొడపైఁ బెట్టుకొని యిత్తన్వి నెవ్వ
రికి నిత్త మని చంద్రరేఖ నడిగిన నయ్యింతి నయనారవిందంబులందు బాష్పబిందు
వులు గ్రమ్మ గద్గదిక నెలుంగు వెడలక తల వంచికొనియున్న నరేంద్రుండును దన
మనంబున నెఱింగి. 154

ఉ పెంపు దలిర్ప నీతరుణి పెండిలి చేసితి మేని నల్లునిం
జంపును బ్రహ్మరాక్షసుఁడు చాలము తద్దురవస్థ యేము వీ
క్షింపఁగ నింక మానుఁ బరికింపఁ దనూభవయుం దనూజుఁడున్
సొంపెసలారఁగా నిదియ చుమ్మని నిశ్చితవృత్తి నుండఁగన్. 155

సీ. బాలికజఘనంబు ప్రబలెఁ దోరంబుగ వెడవిల్తునేకాంతవేది యనఁగ
నెలనాగనూగారు నేర్పడి కడునొప్పెఁ బంచబాణునిమీఁటుపడగ యనఁగ
ముదితలేజన్నులు మొన లెత్తి బలసె నంగజుఁ డేలుమేటిదుర్గము లనంగఁ
గన్నియ నిడువాలుఁ గన్నులు మెఱుఁ గెక్కె నతనునిక్రొవ్వాఁడియమ్ము లనఁగ

ఆ. నలినవనదపు మెఱసె రతిరాజుసాధన, గతులనంగ విమలకమలనేత్ర
పలుకు లమరె భావభవుమంత్రసారంబు, లనఁగ నాఁడునాఁటి కంద మగుచు. 156

శా. ఆలోలాక్షిలలాటవక్త్రసదృశత్వాకాంక్షఁ జంద్రుండు దా
బాలత్వంబు వహించి చూచియు నొగిం బ్రౌఢత్వముం బొందియుం
బోలం జాలక జాలి పొంది పగలం బొల్పేది లోఁ గుందెఁ గా
కాలోకింపఁ దదీయబింబము కురంగాకారముం గూరుచే. 157

క. ఆనయనము లానునుఁగురు, లానగు మొగ మామృదూక్తు లాగాంభీర్యం
బానడుపు లావిలాసము, లానెలఁతకె యొప్పు నొరుల కలవడ వెందున్. 158

తే. అంత నత్యంతరూపసత్కాంతులందుఁ, బువ్వుఁబిల్లానిఁ బ్రోచునాపుష్పగంధి
జవ్వనముతోన నిలఁ గలయవ్వనంబు, లెలమి బొందఁ వసంత మిట్లే గుదెంచె. 159

క. జర యుడిపి మాఁకుఁ గ్రమ్మఱఁ, దరుణత్వం బొసఁగు మనుచు ధరణీదేవిన్
బోరిఁబోరిఁ బూజించిన క్రియఁ, దరమిడి కారాకు రాల్చెఁ దరుచయ మెల్లన్. 160

ఉ. పల్లవితక్షమాజములు బంధురకోరకితద్రుమంబులుం
బెల్లగుపుష్పితక్షితిజబృందములు న్వనభూములందు శో
భిల్లె బ్రసూనసాయకుఁ డభీష్టవిహార మొనర్పవచ్చుచో
నుల్లములందు వేడ్క లిగురొత్త వసంతు నలంకరించినన్. 161

ఉ. కాయజనాయకుం డలరుగద్దియ యెక్కె వసంతవేళ సుం
డో యిల నెల్లవారలుఁ దదుత్సవసంపదసొంపు చూడ రం
డో యెలనాగలం దొఱఁగి యొంటిఁ జరింపకుఁ డోవిటాలి యం
చాయతరీతిఁ జాటునటు లామనిఁ గూయఁ దొడంగెఁ గోయిలల్. 162

క. తరమిడి పువ్వులగుత్తులఁ, జొరిగెడిమకరందరసము తోయంబుగఁ ద
త్తరులతలు చల్లులాడెడుఁ, దరుణవిటీవిటులు వోలెఁ దత్సమయమునన్. 163

చ. అవిరళగంధవాహనికరాహతి నొక్కొకచోట్లఁ బుప్పరే
ణువు లెగయంగ నప్పుడు మనోభవుఁ డశ్వము, దోలుచో ఖురో
ద్ధృతధరణీపరాగములు పర్వె నొకో యని యెల్లవారలుం
దివిరి నుతింప నొప్పు జగతి న్వనభూములఁ గొన్నిచోటులన్. 164

ఉ. ఝుమ్మని మ్రోయుమ్రోఁతఁ గడుఁగొత్తసుఖం బగుగర్జ చాడ్పుగాఁ
దుమ్మెదతండముల్ బెరసి తోయదరీతిఁ జరింపఁ జూపులం
గమ్మనితేనియల్ దొరుగఁగా జినుకు ల్పవి సోగ లెత్తి మో
దమ్మున నాడుఁ గేకిసముదాయము కాంతివిలాస మొప్పఁగన్. 165

ఉ. ఎక్కడఁ జూచినం జిలుక లెయ్యెడఁ జూచినఁ గోకిలమ్ము లే
చక్కటిఁ జూచినన్ సమదషట్పదసంఘము లెందుఁ జూచినం
జొక్కపుకోరికల్ బుతువుసొంపు నుతింప వశంబె పువ్వుఁదే
రెక్కినపంచసాయకుఁడ యెద్దెసఁ జూచిన నవ్వనంబునన్. 166

ఉ. అట్టివసంతవేళఁ గుసుమాపచయోత్సుకబుద్ధి నెమ్మదిం
బుట్టఁగఁ బుష్పగంధి తనబోంటులుఁ దానును బ్రాగ్ఘచంద్రుతోఁ
బుట్టినయట్టికాంతి గలముద్దుమొగంబు నెలర్ప నంచెలుక్
మట్టెలు దట్టమై చెలఁగ మందగతిం జని యవ్వనంబునన్. 167

ఉ. కంతునిపూజ సేయుఁదము కాంచనపుష్పచయంబు లీవు సే
వంతులు నీవు నీవు విరవాదులు పొన్నలు నీవు నీవు వా
సంతిక లీవు గొజ్జఁగులు చంపకమంజరు లీవు దెమ్ము మా
వంతు సరోరుహంబు లని వావిరిఁ గోయఁ దొణంగి రందఱున్. 168

సీ. మెట్టుచోఁ నడుగులదట్టంపుఁగెంజాయఁ బ్రాంతదేశంబులు పల్లవింప
వీచుచోఁ గరములవిద్రుమచ్ఛాయలు రెండుపక్కియలను నిండి నెఱయఁ
జూచుచోఁ గన్నులచొక్కంపుఁదళుకులు గళుకులై ముందటఁ గలయఁబొలయఁ
బలుకుచోఁ గంభీరపదనిస్వనంబులు కోకిలస్వనములఁ గూడఁ బిలువఁ
తే. గదిసి తోతెంచుకామాంధకార మనఁగ, వలుఁదకుమ్ముడి వెనుకకుఁ జెలువొనర్పఁ
గమలదళగంధి యగుపుష్పగంధి యొక్క, తెఱఁగు బువ్వులుగోసెను దేజమెసఁగ.

మ. తరుణీరత్నము పువ్వుఁదీగె యొకచేత న్వంచి పాదాగ్రముల్
ధరణిన్ మోపి యొకింత నిక్కి తనుమధ్యం బొప్పఁ గక్షద్వయ
స్ఫురణం బారఁ గుచంబు లుబ్బ నయనంబు ల్విచ్చి లీల న్ముఖాం
బురుహం బెత్తి యొకర్తు గోసె నెలమిన్ బుష్పంబు లత్తోఁటలోన్. 170

క. రుచిరేందువదన యొక్కతె, కుచపరిధానంబు నిండఁ గోసెఁ బ్రసూన
ప్రచయము దనహృదయేశ్వరు, నుచితస్థితిఁ బూజచేసె నొక్కొ యనంగన్.

తే. బాలఁతియొక్కతెసంపెఁగపువ్వుఁగోసి, మూర్కొనియెఁగామినులఘ్రాణములకునదిస
దృశమనసత్కవీంద్రోక్తి తెలుపఁ బూని, యొక్కొ యిటు చేసెననిజాణలుల్లసిల్ల.

చ. ఒకసతి యిక్షుదండమును నొప్పుగుచాపముగా నొనర్చి దా
నికిఁ బువుఁదీగె నారి యిడి నెమ్మి దలిర్పఁ బ్రసూనబాణపం
చకము ధరించి కామపరిచారికవోలెఁ జరించెఁ దద్వనాం
తికచరవిప్రయోగులమది న్బెదరూనఁగ నంతకంతకున్. 173

ఉ. అప్పు డొకర్తు గొన్నివిరు లాదటతో నఱచేతఁ బట్టి యే
నప్పుడు గోయుచోటఁ దెలుపై యిటు లిప్పుడు రక్తవర్ణమై
చొప్పడు టేమి చిత్ర మనుచుం జెలికత్తెల కెల్లఁ జూపెఁ బైఁ
గప్పినపాణిపల్లవముకాంతికతంబున భ్రాంతి యెత్తినన్. 174

చ. ఒకసహకారశాఖతుద నోలిఁ బెనంగొనియున్నపువ్వుఁ దీఁ
గకుఁ దనహస్త మెత్తుటయుఁ గ్రక్కున లేఁజిగు రంచుఁ గోకిలం
బొకటి రయంబునం గదియ నుల్కి వడంకుచుఁ బాఱె నొక్కబా
లకి తనబోఁటితోడ నబలా యిది కాటుకతీఁగె పొమ్మనన్. 175

చ. కుసుమపుగుత్తి చూచి యొకకోమలి దగ్గఱి కోయఁ బోయినన్
బసిఁబడియందు నున్నమధుపంబులు వచ్చి ముఖంబుతావికిన్
ముసరఁగఁ జోఁపి చోఁపి పెను మ్రోఁతలతో నవి దట్టమైన వె
క్కసపడి పాఱుదెంచెఁ జెలికత్తియ లందఱుఁ జూచి నవ్వఁగన్. 176

సీ. 'తరళాక్షి! చూచితె తరళాక్షిరోచులు చల్లక పూవ దీచంపకంబు
కలకంఠి! చూచితె గండూషమద్యంబు పోయక పూవ దీపొగడమ్రాను
బింబోష్ఠి! చూచితె బిగియఁగఁ గౌఁగిట బెరయక పూవ దీకురువకంబు
బాలకి! చూచితె పదతాడనప్రీతి లేకున్నఁ బూవ దశోకతరువు
ఆ. గాన సతులయందుఁ గలసౌఖ్య మెఱుఁగని,నరుఁడు మ్రాను గాక ధరణిమీఁద
నబల! యివ్వి మ్రాఁకు లనవచ్చునే' యని, చెలికిఁ జూపి చెప్పెఁ జెలువ యొర్తు.

చ. ఇలఁ బులినంబుకంటె ఘన మీజఘనం బని చూపుభంగి నూ
రులు వెడలంగఁ దోఁపఁగను రూఢిగ నంబర మెత్తి లీలమైఁ
గొలనికి డిగ్గి యబ్జములు గోయఁ గరాబ్జము సాఁచి యందులో
పలఁ దనచేతినీడఁ గని పట్టఁగఁ బోవుఁ బయోజవిస్మృతిన్. 178

ఆ. తొంటిమొలక నొక్కతొయ్యలి చనుకట్టు,గట్టు టొప్ప రాత్రు లిట్టునట్టు
విచ్చిపోవకుండ నచ్చక్రవాకులఁ, బట్టి మరుఁడు లంకెఁ బెట్టె ననఁగ. 179

క. కలువలుఁ జెంగలువలు వి, చ్చలవిడి నొడినిండఁ గోసెఁ జయ్యన నొకకో
మలి మృగమదకుంకుమములఁ, దొలఁచినమరుసాయకములు దొన నిడ్డక్రియన్. 180

సీ. ఆపొన్నపూఁదేనె లాని యన్నెక్కినఁ గదలనేరని తేఁటికదుపుచేత
నెఱక లొండొంటిపై గిఱిపి రతిశ్రాంతిఁ బడియున్నభృంగదంపతులచేతఁ
గమ్మపుప్పొడి గ్రోలి కడలేనిఝుంబ్బన మిన్నంట మ్రోయుతుమ్మెదలచేతఁ
ఫొలివోనిమరువంపుఁగలికల నెత్తావిఁ దవిలి సోలెడుషట్పదములచేత

ఆ. మిగుల నంద మగుచు మీనాంకుఁ డేయక, దాఁచి యున్న బాణతతులువోలె
తమ్మివిరులు గొనెఁ దరుణి యొక్కతె కుచ, చక్రవాకరేఖ జాతి పఱఁగ. 181

వ. ఇట్లు పుష్పాపచయాపదేశంబున నారామ లారామం బంతయుఁ దమమయంబుగా
విహరించి సరసాలాపంబులు నెఱయ మెఱయుచుండఁ గ్రమక్రమంబున. 182

ఉ. నీరధిఁ గాలకూటము జనించినయ ట్లురువెంచె గ్రీష్మ మి
ద్ధారుణిఁ గృత్తివాసుఁ డది దాఁ గబళింపఁ గడంగుభంగి నే
పారెఁ బయోదవేళ సుర లంతట సంతస మందినట్టు లం
భోరుహజృంభణం బమరఁ బొల్చె శరత్సమయంబు పెంపునన్. 183

ఉ. వేలుపుటేటిఫేనములు వెన్నునిపొక్కిటితమ్మిరేకు లా
శాలలనాదుకూల మృదుసంవృతసంచలసంచయంబు ది
క్పాలకబాలకేళిపరికల్పితశుభ్రమరుత్పతాకికా
జాలము నాఁగ నొప్పె విలసద్ఘనశారదనీరదావలుల్. 184

క. మడుఁగులు బావులు కొలఁకులు, వడివెట్టినయమృతరసమువడువున నిండా
రెడునిర్మలజలములచేఁ, గడురమ్యంబులయి జగతిఁ గడుఁ బొగడందెన్. 185

వ. అయ్యవసరంబున. 186

క. సలిలవిహారక్రియలకుఁ, దలకొనుమదితోడ నృపసుతారత్నము నె
చ్చెలిపిండుతోడ నాపు, వ్విలుతునిదీపంబు వోలె వెలువడి యొకచోన్. 187

చ. చిగురులపెంపుఁ గ్రొన్ననలచెన్నును బువ్వులసొంపు నై కడుం
బొగడఁగ నొప్పుశాఖల నభోవలయంబు నతిక్రమించి మిం
చగుతరువాటికాతటమునందు మహాత్ములచిత్తవృత్తియ
ట్లొగిఁ గడుస్వచ్ఛ మైనకొల నొక్కటి చేరి మహాముదంబునన్. 188

సీ. తొలిఁదొలిఁ జొర నోడుచెలువలచిత్తముఁ దెలిపి యాటలకు మైకొలిపి కొలిపి
యోలోల యని లీల నొర్తొర్తుఁ బేర్కొని పరువడి చెయ్యాక పాఱి పాఱి
యాదట నితరేతరాస్యపద్మములపైఁ గరయంత్రధారలు పఱపి పఱపి
వికచపద్మపరాగవిసరంబు పుచ్చి చేసాఁచి యొండొరులపైఁ జల్లి చల్లి
ఆ. జలజసక్తమధుపములఁ జోపి చోపి రాయంచపదుపుఁ బట్టఁ బొంచి పొంచి
దరులఁ జెంది చెంది ధవళాయతాక్షు లక్కొలన నట్లు కేలి సలిపి రంత. 189

ఉ. మాళవనందభూపతికుమారుఁడు సద్గుణమండనుండు నాఁ
జాలినరత్నమండనుఁడు సత్యసమన్వితుఁ డేగుదెంచె వా
తూలసమానయానముఁ గొడికుమారులుఁ దాను సింహశా
ర్దూలభయంకగాటవుల దూఱుచు నేర్పున వేఁటకున్. 190

ఆ. అరుగుదేరఁ జేరి నారాజనందనుఁ, గూఁడి పాఱ లేక తోడిసఖులు
నిలిచి రంబగమున నిగుడుభానునిఁ గూచి, యరుగ లేనిగ్రహచయంబునట్ల. 191

క. ఇవ్విధమున నరవఱ దవు, దవ్వుల దిగఁబడఁగ నింద్రదత్తుఁ డనువాఁ
డవ్విభునిఁ గూడి నెయ్యము, నివ్వటిలఁగ నడచెఁ దోడునీడయపోలెన్. 192

వ. అప్పుడు. 193

ఆ. డేగవేఁటయందు డెందంబు నిలిపి గో,పాలవేష ముడిగి తాలకేతు
సహితుఁడై ధరిత్రి విహరింపఁ జొచ్చిన, నందసుతునిఁ బోలె నందసుతుఁడు. 194

క. అనుచరుఁడుఁ దాను నేక్రియ, విన విస్మయ మైనయట్టివేఁటలతమకం
బున నిడి సమ మిది విషమం, బనక చనుచుఁ గనియె నమ్మహాపుర మెదురన్. 195

చ. కని 'యిది యేపురంబు చెలికాఁడ మహోన్నతవప్రశాఖియై
ఘనసదనాభిశోభి యయి కంధరబంధురహర్మ్యరమ్యమై
యొనరెడుఁ గంచియో మధురయో మిథిలాపురమో విదర్భయో
తనరునయోధ్యయో శ్రుతిహితంబుగఁ జెప్పుము నాకు' నావుడున్. 196

ఉ. అతఁడు రత్నమండపున కాదట నిట్లని చెప్పె నప్డు 'ప్ర
ఖ్యాతిగ నీవు పేర్కొనినయట్టివి యెద్దియుఁ గాదు సుమ్ము సం
పాతి యనంగ నొక్కనరపాలకుప్రోలిది దీనిపేరు వి
న్నా తగఁ బుండరీకము రమాసదనం బిది శబ్దతుల్యతన్. 197

క. ఈరాజు ధర్మవర్తనుఁ, డీరాజ్యములోనిప్రజలు నిందఱు విహితా
చారైకరతులు దురితవి, దూరు లనుచు నెపుడుఁ జెప్పుదురు సత్పురుషుల్.' 198

వ. అని యింద్రదత్తుండు చెప్పునప్పలుకులు విని రాజసుతుండు ప్రీతిచేతస్కుం
డగుచుఁ జని చని తనచేతిడేగ నొక్కమహీరుహంబుపై నున్నవిహంగంబునకు
వైచిన. 199

ఉ. ఉవ్వయమోహితతో నెదు రెఱుంగనిపేఁకఁ బరాక్రమించుచో
నవ్విహగంబు తద్ఘనతరారుణదారుణనేత్రరోచులన్
నివ్వెఱఁగంది కాల్కొనఁగ నేరక మేదినిఁ గూలెఁ గూలినం
జివ్వనఁ దేలిపోయి యొకచెట్టున వ్రాలెఁ గరంబు దవ్వులన్. 200

క. ఆడేగ యట్లు వ్రాలిన, వేడుక నవ్వనమునందు విలసితలీలం
గ్రీడించుబాలికాజన,చూడామణి పుష్పగంధి చూచి కడంకన్. 201

క. పట్టెదను డేగ ననుచును, నిట్టలమునఁ జెలుల మొఱఁగి యీక్షణరోచుల్
దట్టములై ముందట వెద,వెట్టినటులు గలయఁ బొలయఁ బెద్దయుఁ బ్రీతిన్. 202

క. అడుగులఁ జప్పుడు గాకుం, డెడునట్లుగఁ గదియఁ బోయి డేగా యిదె నం
జుడు గొమ్మని యొకయెలమా, మిడిచిగు రటు చూపుచుండె మెలఁతుక యంతన్.

క. అచ్చపుఁదమకంబునఁ దన, నెచ్చెలి నచ్చోన డించి నృపతితనూజుం
డచ్చెలువ లున్నతోఁటకు, వచ్చెం దనడేగ యెందు వ్రాలెనొ యనుచున్. 204

ఉ. వచ్చి యతండు చూచెఁ జెలువంబులప్రోక విలాసలక్ష్మికిం
జొచ్చినయిల్లు సౌఖ్యములచోటు వికాసముతానకంబు క
న్నిచ్చలమంకిపట్టు కుసుమేషునికారముజన్మభూమి నా
నచ్చగుపుష్పగంధిఁ జపలాయతనేత్రఁ బయోరుహాననన్. 205

క. ఆతరుణీమణియును నృప, సూతితనూవిలసనాతిశోభాసక్తుం
డై తనమాడ్కి నిగుడఁ బ్రస్ఫీతగతిం దోఁచెఁ గుడ్యచిత్రముభంగిన్. 206

చ. ఇరువురచూపులుం దనకు నింపగుతూపులు గాఁగఁ జేర్చి యొం
డొరువులమర్మముల్ గలఁగ నాఁటఁ జొదనిహస్తలాఘవ
స్ఫురణ మెలర్ప శంబరనిషూదనుఁ డార్చుచుఁ బింజపింజతో
నొరయ నిరంతరంబుగ మహోద్ధతుఁడై తెగి యేసె నత్తఱిన్. 207

క. కోరుదు రొండొరుఁ గదియఁగఁ, గోరుదు రితరేతరోపగూహనసుఖముం
గోరుదు రన్యోన్యాధర, సారసుధారుచులు దనివి సనఁ గ్రోలంగన్. 208

క. ఇట్లయ్యిరువురుఁ దమలో, నట్లుపడనికోర్కు లక్కజంబుగ సఖు లీ
చిట్లెఱిఁగినఁ గార్యము తుది, నెట్లగునో యనుచు నుండ నింతటిలోనన్. 209

చ. కనుఁగొని పుష్పగంధిచెలికత్తియ మాలిని వేగ నొక్కయం
గన చనుదెంచి యిద్దఱముఖంబులఁ దోఁచుమనోవికారముల్
తనమది నిశ్చయించి క్రియ దప్పదె యింకిట యేనుపేక్ష చే
సిన నని యాసరోజముఖిఁ జేరి ప్రియోక్తుల గారవించుచున్. 210

ఆ. 'తరుణి!మనము వచ్చి జడవయ్యె నాటలు, చాలవమ్మ ప్రొద్దు వ్రాలె మిగుల
నీకు నెదురుచూచు నృపసతీతిలకంబు, పాలి కరుగ నింకఁ బోడి గాదె.' 211

తే. అనిన నయ్యింతి సిగ్గున నవనతాస్య, యయ్యొ నేమి సేయుదు నల్లయవనినాథ
తనయుఁడిందుఁ బ్రవేశించెననుచుఁ దనదు,హృదయమావయస్యకుఁజూపునదియపోలె.

వ. మఱియు నత్తెఱవ తత్సమయసముచితోక్తులు పలుకుచుఁ గైదండ యిచ్చి యమ్మ
చ్చెకంటి నచ్చోటు గదల్చి తెచ్చునప్పు డచ్చెలువుండు పచ్చవిల్తు నచ్చవిరితూ
పులచే నొచ్చి వెచ్చనూర్చుచుం గూర్చుండంబడి పైపై నివ్వటిల్లునెవ్వగల నొగిలి
మూర్ఛిల్లె నాపుష్పగంధియుం గొంతవవ్వరిగి యరిగి మనోజాతశరస్ఫూర్తయై సోలి
వ్రాలె నంత. 213

క. అక్కట మనోజవేదనఁ, జిక్కెఁ భవత్సఖుఁడు వానిఁ జేకొను మనున
ట్లొక్కటఁ బలికెడుశుకములఁ, దక్కకఁ గనుఁగొనుచు నింద్రదత్తుఁడు వచ్చెన్. 214

ఆ. వచ్చి యతఁడు మునికిఁ గ్రచ్చఱఁ జూచి డెందమునఁ గొందలంబు దలకొనంగ
'రాకుమారతిలక!హారత్నమండన!, యెట్లు సంభవించె నిట్టియెడరు?'. 215

వ. అని పలికి మఱియును. 216

క. 'పాము గలదో కాదేఁ బెను, గాము గలదో యదియుఁ గాక క్షత్త్రియకులజుం
డీమెయిఁ బొలిసినఁ గయికొని, యేమేనియుఁ జేయుంభూత మిచ్చటఁ గలదో. 217

ఉ. ఇయ్యవనీశనందనున కిప్పుడ యీదురవస్థ రాఁ గతం
బెయ్యది యొక్కొ?యే నితని నేక్రియఁ జేకొని తేర్తునొక్కొ? నా
కియ్యెడ నిష్టకృత్యమున కెవ్వఁడు దోడ్పడఁ గల్గువాఁడొకో?
దయ్యమ!యేమి *చేతు'నని తల్లడ మందుచుఁ జేరి యిట్లనున్. 218

క. 'ధీరోదాత్తగుణోత్తర!, యోరాజకుమార!నీకు నుచితమె యిట్లీ
దారుణతామసభావముఁ, గూరి వృథాఖేదమునకుఁ గుఱియై యుండన్. 219

చ. ఫణిమయపాశజాలములపాల్పడి యారణశయ్య నున్నరా
వణరిపునిగ్రహం బుడుప వచ్చినయవ్వినతాతనూజుల
క్షణమున నున్నడేగదెసఁ గన్గొను నీమనోవికారకా
రణ మెఱిఁగింపు మాకు వివరంబుగ సర్వముఁ జక్క చేసెదన్.' 220

చ. అనుచు సఖుండు పల్కుటయు నంకిలి దేఱినచిత్తవృత్తితోఁ
గను తెఱవం దలంచి యధికంబుగఁ గ్రమ్మెడుబాష్పవారితో
నెనసినఱెప్ప లెత్తుటయు నెత్తి సుఖాసనుఁ జేసి కన్నుల
ల్లన నఱచేత నొత్తి వికలంబగు హారము చక్కఁ ద్రోయుచున్. 221

వ. తత్సమీపపుష్పితలతాలవాలంబున మకరందబిందుసంవాసితంబు లగునంబువులు కర
పుటంబులం దెచ్చి యందిచ్చి ముఖప్రక్షాళనంబు చేయించి యాతని నవలోకించి.

క. 'నీ కిట్టికడిఁదిదుర్దశ, రాకకుఁ గత మేమి?' యనిన రాజతనూజుం
డాకర్ణింపు'మిచట నొక, కోకిలశుకవాణిఁ బువ్వుఁగోమలఁ గంటిన్. 223

సీ. చిగురుటాకులలోనిజిగిఁ గూర్చి యాబాలయఱకాళ్ళఁ జేతుల నలఁదిరొక్కొ
పసిడితీఁగెలమీఁదిప్రభ దెచ్చి యాకాంత మెయిఁదీఁగె యంతట మేదిరొక్కొ
చంద్రబింబముకాంతి సవరించి యాలేమమోమున నునుపుగాఁ దోమిరొక్కొ
క్రొమ్మెఱుంగులమించు గొని వచ్చి యాయింతికలికికన్నులఁ గీలుకొలిపిరొక్కొ

* 'చేతు'ననునది లక్షణవిరుద్ధము. 'చేసెదని' యని మార్చిన సరిపోవును.

ఆ. యనఁగ సవతులేని యభినవాకారంబుతోడఁ జెలులఁ గూడి యాడుచుండెఁ
జామ యొర్తు మరుని సామ్రాజ్యలక్ష్మియ, పోలె దానిఁ జూచి చేలుపడితి. 224

ఉ. ఆమదిరాక్షి నేత్రరుచు లావనజాననముద్దునవ్వు లా
భామినిమందమందమృదుభాషితరీతులు డెందమందుఁ జే
రామనియై తనర్చుటయు నంగజు చేతినిశాతసాయక
స్తోమముభంగిఁ గెందలిరుజొంపము నాకొదవించెఁ గంపమున్. 225

ఉ. తోఁకొని పోయె నంత నొకతొయ్యలి యయ్యెలనాగ నప్డు పే
రాఁకలి గొన్నబెబ్బులి రయంబునఁ గృష్ణమృగార్భకంబుపై
వీఁక యెలర్పఁ బెల్లడరి వ్రేయుఁగతిన్ మరుఁ డుగ్రుఁడై నను౦
దాఁకిన మూర్ఛ నొందితిని దద్దయు నీవలనిష్ఠ తేఱితిన్. 226

క. అని యిట్లేర్పడఁ జెప్పిన, విని యతఁ డిట్లనియె నొక్కవెలఁదికిఁ గా నె
మ్మన మింత నెగులు పఱుపఁగఁ, జను నే నీయట్టిధైర్యసంపన్నునకున్.' 227

చ. అనవుడు 'నేమి చెప్పుదు వయస్యుఁడ! భానుఁడు తూర్పుఁగొండ యె
క్కిన మఱి యేటిచీఁకటులు కేశవనామము జిహ్వ నుచ్చరిం
చినతుది నేటిపాపములు చిత్తజుపుత్తడిగ్రేణి సేయున
వ్వనితకటాక్షదీధితులు వ్రాలినమీఁదట నేటిధైర్యముల్. 228

చ. విను మటు లుండె నాహృదయవేదన మానుప నోపుదేని నా
కనుఁగవ గెంపొనర్చు సితకంజనిభేక్షణ నాలతాంగిఁ దో
డ్కొని చనుదెమ్ము తే ననువుఁ గూడనిపక్షమునందు నన్ను ర
మ్మనినను వచ్చెదం బిలువు మక్కడికార్య మెఱింగి చయ్యనన్.' 229

చ. అనుటయు నింద్రదత్తుఁడు నరాధిపనందను నంద యుంచి యేఁ
జని యిటు వచ్చునంతకు విచారము నీమదిఁ జేర నీకు మ
వ్వనితకు నీకు నిప్పుడ యవశ్యముఁ బొం దొనరింతు నంచుఁ జ
య్యనఁ జనుదెంచె నాసరసిజానన లేఁగినచొప్పు వెంబడిన్. 230

సీ. ఈరీతిఁ జనుదెంచి యెదురుకట్లను నొక్కమాధవీవనలతామంటపంబు
క్రింద నందఱుఁ గూడి కిసలయశయ్యపైఁ బూఁబోఁడి నునిచి కప్పురపుధూళి
యఱకాళ్ళఁ దోముచు నఖిలాంగకములందుఁ బాటించి చందనపంక మలఁది
పదను డించినచోటఁ బన్నీరు చల్లుచుఁ గదళీదళంబులఁ గదిసి విసరి

ఆ. తరుణిమేన విరహతాప మగ్గల మైనఁ, గాము సోముఁ గమ్మగాలి నళులఁ
బికము శుకముఁ బేరుపేరఁ బ్రార్థింపుచు, సంభ్రమించుచున్న సఖులఁ గనిరి. 231

మ. కని 'మీ రెవ్వరు? మీలతాంగి కిచటన్ గామజ్వరం బేమిటన్
జనియించెన్? శిశిరోపచారములచే శాంతంబు గాదో కదే
వనితారత్నములార! చెప్పుఁ డనినన్ వామాక్షు లారాజనం
దనమిత్రు న్వెసఁ జేర వచ్చి విగళద్బాష్పేక్షణాంభోజలై. 232

క. 'అన్నా! యే మని చెప్పుదు, మిన్నగరము రాజుకూఁతు రీవిరహిణి యు
ద్భిన్నసరోజానన యీ, కన్నియపే రమరుఁ బుష్పగంధి యనంగన్. 233

ఉ. ఈసతి కేము నెచ్చెలుల మీయెలకోఁటకు వచ్చి నిచ్చలో
ల్లాసవిలాసహాసము లెలర్పఁగ వేడ్కలు సల్పుచుండఁగా
నాసమయంబునందు నొక డయ్యలరమ్ములు నిక్షుదండ బా
ణాసనముం దొలంగ నిడి యంగజుఁ డొంటియ వచ్చుచాడ్పునన్. 234

మ. మిగులం జక్కనివాఁడు కాంచనరుచిన్ మేదించిన ట్లంగకాం
తిఁ గడుం బొల్పగువాఁడు యౌవనమదోద్రేకంబునం దద్దయుం
జిగి సొంపారెడువాఁడు మాకడకు వచ్చెన్ డేగ వేఁటాడుచున్
జిగురుంబోఁడియు వానిఁ జూచి తగిలెన్ జెప్పంగ నింకేటికిన్. 235

క. ఆక న్నెఱింగి యచ్చట, నీకన్నియ నుండ నీక యిట తెచ్చితి మా
రాకొమరుఁ డెందుఁ బోయెనొ, వీకున నిది మూర్ఛవోయె విరహాతురతన్. 236

ఉ. అప్పుడు తల్లడిల్లి చిగురాకులసజ్జకుఁ దెచ్చి బాలకుం
బప్పొడి రక్షగా నొసల బొట్టిడుచు న్మకరందబిందువుల్
చిప్పిలుపువ్వుమంజరులు చెక్కుల నొత్తుచు ధౌతవస్త్రముల్
గప్పుచుఁ జందనంపుటుదకంబు పయిం జిలికించుచుండఁగన్. 237

క. మిక్కుటమై విరహానల, మక్కన్నియదేహ మెల్ల నెరియింపఁగఁ బూఁ
బక్కెర గలశుకతురగము, నెక్కినవెడవింటిరాతు కెరఁగితి మాత్రిన్. 238

క. తక్కటివారుబలములకును, మ్రొక్కితి మే మిటను నెవ్వరును సుముఖులుగా
రెక్కడఁజొత్తు మనఘ! నీ, వెక్కడివాఁడ? విట యెచటి కేఁగెద?' వనినన్. 239

క. 'మీపువ్వుగంధినెయ్యపుఁ, జూపులకును లెప్ప మైనసుకుమారవపు
శ్శ్రీపెంపునఁ దనరినవాఁ, ధాపతిసుతుసఖుఁడ నింద్రదత్తాహ్వయుఁడన్. 240

చ. అతఁడును బుష్పగంధిలలితాకృతిజాలమునందుఁ దద్దయున్
ధృతి యెడలంగ మన్న్యముగతిన్ గడు లోఁబడి పంచబాణబా
ధితుఁ డగు టేను జూచి తగఁ దేలుచు మీ కెఱిఁగింప నేఁగుదెం
చితి నిట మీఁదికృత్య మది చెప్పఁగ నేటికి మీ కెఱుంగదే.' 241

క. అనవుడుఁ బనివడి వెదకం, జనవలసినసొమ్ము దాన చవుదెంచినచా
డ్పున విన నబ్బె నితనిముఖమున నికార్యంబు మూలముట్టుగ ననుచున్. 242

చ. రయమున నేఁగి యాసతులు రాజతనూజకు నత్తెఱంగు ని
శ్చయముగఁ జెప్ప ము న్నసమసాయక సాయకపఙ్క్తి చేత నొ
చ్చియుఁ నొకకొంత యూఱడిలుచిత్తముతో నటు లేచి తా నతి
ప్రియమున నింద్రదత్తుఁ బిలిపించి తదాననదర్శనంబునన్. 243

క. రోగికి సుహృదులఁ గన్గొనఁగా గుణ మెట్టి దగు నట్టికైవడిఁ జేతో
రాగ మెలర్పఁగ నుసిఁకి, సాగోతులు ప్రీతి నొంచి యాతనితోడన్. 244

ఉ. 'తమ్ముఁడ! నీవు వచ్చినకతమ్మున మాహృదయమ్ములోనితా
ప మ్మొకకొంత డిందుపడి ప్రాణము నిల్చె భవత్సఖుండు సే
మమ్మున నున్నవాఁడె? యొక మాటయిన న్మముఁ జిత్తగింపునో
నెమ్మది డేగవేఁటకును నెక్కొనుచిత్తముతోఁ జరించునో?' 245

క. అనవుడు 'నాతనివేఁటల, పని యిట యింకేమి చెప్ప భావజుఁ డీభా
మిని దీమముగఁ జూపి య,తనిఁ గైకొని వేఁటలాడెఁ దద్దయుఁ గడిమిన్. 246

క. అంతటఁ బోవక మరుఁడు, కాంతారత్నంబు నతఁడు గారణముగ ని
ట్లింతకుఁ దెచ్చె నెఱుంగవె, కొంతవిచారంబు వలవొకో మీకైనన్. 247

క. తొలిఁదొలి రోగనిదానము, దెలియక యౌషధము వేయఁ దివిరెడువెడవ
జ్జులు వోలెఁ దొడఁగి యీతొ, య్యలి నేమిటికన్ను యింత యలజడి పఱుపన్.'

ఉ. నావుడు నింద్రదత్తువచనంబుల నయ్యెలనాఁగ లట్ల కా
దే విరహజ్వరంబు కడ లేఱునె యీచలిమందులందు నిం
దీవరనేత్ర చందములు దేవికి మున్నెఱిఁగింపకుండినం
బోవునె ముల్లు ముంటఁ గొని పుచ్చక రోఁకటఁ బుచ్చవచ్చునే. 249

వ. అని తలంచి. 250

క. 'వినవలయు నతనిరాష్ట్ర మ,తనిపట్టణ మతనితల్లిదండ్రులపే ర్లా
తనిధామ మతనిప్రియభా, మినియభిధానంబు మాకు మేలుగఁ జెపుమా!' 251

చ. అనిన నతండు 'మాళవసమాహ్వయదేశము వానిదేశ మా
తనినగరంబురత్నపురి దాని కధీశ్వరుఁ డైననందుఁ డా
తనిజనకుండు తల్లి ప్రియనితంబిని యంబిక వానితల్లి వాఁ
డనఘుఁడు రత్నమందనసమాఖ్యుఁడు పెండిలి లేదు' నావుడున్. 252

క. ఒండొరులఁ జూచి యానన, మండలములఁ దెలివి యొలయ మాకన్నియ కా
తండు వరుండగుఁ బరువడి, రండని కార్యోక్తిమై మరల్చిరి వానిన్. 253

ఆ. అంతఁ దనదుకోర్కి యబ్బినయట్లకా, నెమ్మి నుల్లసిల్లునృపతనూజఁ
గొంచుఁ బురికి నరుగుదెంచి రయ్యింతులు, సనియె నతఁడు నధిపతనయుకడకు 254

చ. చనునెడ నంగజన్మశరసంహతిచేఁ బడి బాలుఁ డింద్రద
త్తున కభిలాషతో నెదురుత్రోవలు చూచుచుఁ గమ్మగాలిసో
కునకుఁ జలించుచుం గుసుమకోరకము ల్గని తల్లడించుచుం
దనరురసాలపల్లవవితానము చూచి కలంగఁ బొఱుచున్. 255

క. నానాభంగుల నిటు విరహానలపరితప్తచిత్తుఁ డగునట్టిధరి
త్రీనాథసూతిపాలికిఁ, దా నరుగఁగ నతఁడు దవ్వదవ్వులఁ గనుచున్. 256

క. 'వచ్చెం బో నానెయ్యుఁడు, తెచ్చెనొకో మంచివార్త తేకున్నట్లే
నచ్చిఱుతనగవు మొగమున, నచ్చుపడుట కెద్ది హేతు వన వచ్చునొకో.' 257

క. అని మది నూహించుచు భూతనయాన్వేషణము చేసి తనయెదిరికి వ
చ్చినకపివీరుని గాంచిన, యినకులజుఁడ పోలెఁ దలఁపు లీరిక లెత్తన్. 258

క. మెలపున నెదురుగఁ జని ప్రస్ఖలితవచనరచన యొసఁగఁ 'గాయో పండో
కలరూపు చెప్పు' మనవుడు, 'ఫలియించును గోర్కి పాఱఁబట్టుము వగలన్. 259

క. సంపాతినృపతిసతియై, పెంపారెడుచంద్రరేఖప్రియసుత దనపే
రింపారఁ బుష్పగంధి ను,తింపన తగుఁ జుమ్ము మహిఁ దదీయగుణంబుల్. 260

సీ. అయింతి నీకు నిల్లాలు గాఁ దగుఁ జిత్తగింపు నామాట లంగీకరించి
యబల నీవార్త విన్నప్పుడ నిజదేహజనితవియోగాగ్ని బొనుఁగుపఱిచెఁ
దదనురూపంబుగాఁ దత్సఖీజనములు నీయూరుఁ బేరును నెమ్మి నడిగి
రడిగి యాతఁ డొడయఁ డగు మాన్యపాత్మజ కని కార్యగతి దేరనాడి నన్ను
ఆ. మరల బనిచి రేను నరుగుదెంచితి నింకఁ, జింత దక్కి యాలతాంతగంధి
నఖిలబంధుచయము ననుమతింపఁగఁ బెండ్లి, యగుదు గాక వేడ్క లగ్గలింప.' 261

క. అని యాతనిచిత్తము బోరన నూల్కొనఁ బల్కి నిజపురంబునకుం దో
డ్కొని చనియె నింద్రదత్తుం," డని సర్పటి చెప్పె ననిన నత్యుత్సుకుఁ డై. 262

క. "భోజుఁడు మఱి యే మనియె మ,హాజనసుతచరణ సిద్ధుఁ డతనికి మఱి యే
యోజ వినిపించె నవిరళ, మై జరగెను తత్కథామహాలత" యనినన్. 263

చ. అనుపమదివ్యతేజ! దివిజార్చితపాదసరోజ! దైత్యభం
జన!భువనైకరంజన! కృశానుశశాంకకుశేశయాప్తలో
చన! ఘనదుఃఖమోచన! ప్రసన్ననృసింహవపుర్విలాస! వే
దనగనివాస! భక్తజనతాపరితోషణ! దోషభీషణా ! 264

క. భవనీరధిబడబానల!, భవగహనాసహ్య దావపావక! దృప్య
ద్భవసామజకంఠీరవ, భవనిబిడతమోనిరాసభాస్కరమూర్తీ ! 265

వనమయూరము. నీలజలదాసితవినిర్మలశరీరా!, తాళతరుసప్తకవిదారణవిచారా!
కాళియమహాభుజగగర్వపరిహారా!, కాలసదృశోగ్రమధుకైటభవిదారా! 266

గద్యము. ఇది వాణీవరప్రసాదలబ్ధవాగ్వైభవ తిక్కనామాత్యసంభవ సుకవిజనవిధేయ
అనంతయనామధేయప్రణీతం బైనభోజరాజీయం బనుకావ్యంబునందు భోజన
నిమిత్తంబున భోజసర్వజ్ఞులసంవాదంబును వసిష్ఠాగస్త్యోపాఖ్యానం
బును భిక్షాన్నప్రశంసయు యోగిదత్తభిక్షావిశేషంబును నతిథి
పూజావిధియును దదుదాహరణంబుగా బుష్పగంధి
కథ విస్తరించుటయు నన్నది తృతీయాశ్వాసము.

శ్రీ

భోజరాజీయము

చతుర్థాశ్వాసము

శ్రీనాథ! సురక్షితనిఖి
లానాథ! దయామయాంతరంగ! శివవా
ణీనాథసంగ! వీర
శ్రీనిర్జితదైత్యరంహా! శ్రీనరసింహా! 1

వ. అవధరింపుము. 2

క. ఆమహునకు నాత్రేయమ, హాముని యిట్లనియె "భోజుం డట్టులు సిద్ధ
స్వామి తగం జెప్పుకథలు మ, నోమోదము గాఢముగ వినుచు నిట్లనియెన్. 3

ఆ. 'ఇంద్రదత్తుం డానరేంద్రపుత్రునిం గొంచుం, బురికి నరుగం దెల్పితిరి తదుత్త
రప్రసంగ మేమి క్రమమున వర్తిల్లె, నంతవట్టుం దెలియ నానతిమ్ము'. 4

క. నావుడు సర్పటి యిట్లను, 'భూవర! విను మట్లు రాజపుత్రుఁడు చనినన్
భావజుచేఁతలఁ గోరిక, తీవ లొదవఁ బుష్పగంధి ధృతిచెడి తనలోన్. 5

సీ. 'చూచినప్పుడ రాజసుతునిపాలికి నన్నుం జేరంగ నీదయ్యెం జెనఁటిసిగ్గు
నతఁడైనఁ దనలోనియభిలాష మెఱిఁగించి కదిసి కౌఁగిట జేర్పఁ గానఁ డయ్యె
నచట నొకింతసేపైన నిల్వఁగ నీక మాలిని నన్నేల మరలఁ దెచ్చెఁ
దలవోరి యతఁ డింద్రదత్తునిఁ బుత్తేర నేమాటయును జెప్ప నెఱుఁగనైతిఁ

ఆ. గాముశరమువాఁడి కైరవాప్తునివేఁడి, పికముకూఁత తేఁటిపిండుమ్రోఁత
యంతకంత కడరి యెంత గావించునో, యే మి చేయుదాన నెద్ది తెఱఁగు'. 6

మ. అని చింతించు మనోభవజ్వరముచే నశ్రాంతము న్వేఁగు హు
మ్మని నిట్టూర్పు నిగుడ్చుఁ గన్నుఁగవ బాష్పాంభఃకణంబు లక్కాడు
న్నినుచు న్మాలిని లోనుగాఁ గలుగునా నెయ్యంపుఁబూ*బోండ్లు దగ్
గని భీతిల్లఁగ నంతకంతకుఁ దనూకార్శ్యంబు సంధిల్లఁగన్. 7

వ. అక్కడ. 8

క. రమణీరమణులఁ గూర్చిన, సమదుఃఖం బనుట కేమి సందియ మన నా
రమణిరమణీయరూపము, మమతం దలపోయుచుండి మఱి దనలోనన్. 9

---

* బూఁబోణులం, గని భీతిల్లును.

సీ. 'కామిని నామీఁదఁ బ్రేమంబు గల్గినఁ గనుఁగొన్నయప్పుడ కదియకున్నె
మును నన్ను నట్లు చూచినతీపు మాపు లంతన త్రిప్పి యచ్చోటు తలఁగి చనునె
యటుపోయి నాయంతరంగంబుఁ గోలఁది విచారించి చూడక యూరకున్నె
యిన్నియు నననేల యే నాత్మసఖుఁ బంపఁ దివిరి కందువకు నే తేరకున్నె
ఆ. తఱిమి నన్ను నింద్రదత్తుఁ డచ్చటు వాపి, తెచ్చుకొఱకుఁ గొన్నియిచ్చమాట
లాడఁబోలుఁగాక యని తథ్యమగునె య,వ్వెలఁదిఁ బొంద నాకుఁగలుగునొక్కొ.' 10

చ. అని తలపోసి చిత్తమున నత్తనుమధ్యతనూవిలాసముల్
పెనఁగొని వంతఁ జేగు దురపిల్లుచుఁ గనుంగవబాష్పపూరముల్
ఘనముగ నించు నూర్పు సెడగాడ్పులు వెల్లు నిగుడ్చు నాసతీ
జనతిలకంబు లేనిపెఱసౌఖ్యము లేటికి నొల్లఁ బొమ్మనున్. 11

వ. ఇవ్విధంబున నహోరాత్రంబు లాహారనిద్ర లెఱుంగక వియోగతాపంబునం బరిత
పించురత్నమండనకుమారు నాకారంబు చూచి యతని బోధించుటకు నయ్యింద్ర
దత్తుం డిట్లనియె. 12

క. 'కటకట యొకతరుణికిఁ గా, నిటు పటుతరదుఃఖవహ్ని నెరియుట నీయం
తటిచటులవిక్రమాత్యు, ద్భటనటనాటోపమతికిఁ బాడియె చెప్పుమా. 13

క. మేలై వచ్చిన మెత్తురు, కాలవశతఁ జేసి కీడు గదిరిన నతని
గేలి యొనర్చుచుఁ బోదురు, నాలిసతులమాట లంత నమ్మఁ గలదే. 14

క. ఈయర్థము తెలిపెదను విను,మా యొకయితిహాస మొకమహాటవిలో న
త్యాయతసముదంచితశా,ఖాయుత మగునొక్కమఱ్ఱి గల దొకచోటన్. 15

వ. ఆవటవిటపియం దొక్కమూషకమిథునం బభిమతాహారవిహారసౌఖ్యంబు లనుభవిం
చుచు నట్లయుండఁ గొండొకకాలంబునకు నమ్మూషకవనిత గర్భిణియై ప్రసవసమ
యం బగుటయుం నప్పురుషమూషకంబు. 16

క. తొఱ్ఱలోపల నొకదెస నొక, యఱగా నొనరించి చిగురుటాకు లడుగునం
* బఱచిన నది గడుమెత్తని,పఱుపుగ నచ్చోట నాఁడుఁబట్టిం గనియెన్. 17

క. కని జనని నిందుఁబోదిగిటఁ, బెనుపఁగ నది గారవమునఁ బెరుగుచుఁ దఱితోఁ
గను దెఱచెఁ దనువు జననికిఁ, గనువేఁడుక గొలుప ధనముఁ గనుఁగొన్నక్రియన్. 18

వ. మఱియు నచ్చిఱుతయెలుక తనతొఱ్ఱలోనన యుండి వెలుపలికిఁ దనమూతి
సాఁపుచుం దల చూపి మరలం దిగుచుచు నర్ధశరీరంబు దోఁప నిగుడి మగుడుచుఁ
బుచ్ఛంబుం దక్కం దక్కటిశరీరం బంతయు బయలుపడ నించుకసేపు కంపంబు
నొందుచు నుండియుండి మఱచి తలఁచిన ట్లదరిపడి తిరిగి తొఱ్ఱ చొచ్చుచు వెండి

---

* దుఱిమి యొనరించి (చి. ని. పా.)

యు నుండలేక వెలువడి శాఖామార్గంబునఁ గొంతద వ్వరిగి పక్షరవంబులు కర్ణంబులు,సోఁకినం బెదరి కోటరద్వారంబునకుం బఱతెంచుచు నిట్లు శైశవక్రీడలు నడిపి తదనంతరంబ యెలప్రాయంబు సొచ్చుడు నూఁగుదోసపిందెగతి నందం బగుదేహంబును దరుణశాకినీమూలంబును బోలువాలంబును శాల్మలితూలకంబళంబువిధంబున నత్యంతమృదులం బగునుదరంబును నాఖుకర్ణిపర్ణంబులమాడ్కిఁ జెక్కించుకొని యున్నకర్ణంబులును నలంతిపూస లంటించినట్లు దనరుకనుఁగవయును నుచ్చింత పువ్వులలోని కేసరంబులక్రియ భాసురం బగు పలువరుసయుఁ దనవయోరూపంబున కనురూపంబు లగుచుండఁ జెలంగి సెలగొమ్మలెక్కి ప్రేలుచుఁ బలిష్ఠంబు లగుతిర్యక్శాఖలపైఁ ద్రుళ్ళిగింతలు వెట్టుచు నాకుజొంపంబులు సొచ్చి దాఁగుచు నిటు బహువిధంబుల విహరించుచుండు నమ్మూషకయోషం జూచి యొక్కమూషకతరుణపురుషుండు విషమాంతకకరుణుం డగుచుఁ జుఱచుఱ నామ్రాకు ప్రాఁకి వేగిరపడి చెరకిన నది కినుకతోడ. 19

చ. మద మొదవంగ మూషకకుమారసమూహము వెన్న సమ్మెలై
పొదకినవాల మార్చుచుఁ బ్రబుద్ధవిటుం డురుధైర్యమూలముల్
జెదరఁగఁ ద్రవ్వుగోళ్ళఁ గొని చెక్కిలి వ్రేసిన మూర్ఛవోయి తాఁ
గదలక యుండె కాముబడిగంటఁ దోడింబడి యున్నకైవడిన్. 20

క. భువి నట్లకాఁడె యువతియుఁ, గవితయు సహజప్రసంగగతి నొందినచోఁ
దివిరి కడు బల్మి చేసిన, నవి సరసత యుండిగి విరసమయి చను టరుదే. 21

వ. ఇట్లయ్యెలుకతొయ్యలి వ్రేటున నొమ్మువడియు సిగ్గువడనేరక యమ్మూషకకుమారుండు దానివెంట,విడువక తగులుచుండె నంత. 22

క. ఒకగృధ్ర మెండిపోయిన, యొకచర్మము గఱచికొనుచు నుడుపథమున రా
నొకభంగిఁ బ్రిదిలి పడి యది, యొకయెండినరిపటమీఁద నుండఁగ నెలుకన్. 23

చ. కనుఁగొని మూషకాంగన జగంబున నిట్టిపదార్థ మెన్నఁడుం
గనుఁగొని నేనెఱుంగ నెసకంబున నాకది తెచ్చి యిమ్ము నీ
మనమున నున్నకోరిక సమస్తము దీర్చెద నోపుదేనిఁ బో
మ్మనవుడు నట్లకాక యని యాత్మగతంబున నుబ్బెఁ బొంగఁగన్. 24

ఉ. బాలకి నన్నుఁ బిల్చి పనివంచెఁ గృతార్థుఁడ నైతి నంచు న
య్యాలరియెల్కగంతుగొనినంతనె తుత్తుము రయ్యెఁ గాష్ఠ మా
తోలును దానుఁ గూడ మును దూరపథాగతు లైనమానవుల్
లోలత వండికొన్నప్రాయిలోఁ బడి రూపఱఁ గాలె వ్రేల్మిడిన్. 25

ఉ. అప్పుడు వానిఁ జూచి యపహాస్యముఁ జేయుచు బాపు జాణ హో
తప్పుగఁ ద్రొక్కినం బడక తక్కె నె యెట్టిబలిష్ఠుఁడైన నీ
యొప్పున కా ననుం గవయ నుల్లమునం దమకించె దంచుఁ దా
నొప్పము లెన్నుచుం జనియె నుందురుబాలకి యట్లు గాపునన్. 26

క. రమణీజనముల దెసఁ గడుఁ, దమకించుట నీతి గాదు తత్త్వజ్ఞునకున్
దమకించి కాదె మూషక, మమలమతీ! యిట్లు పొలిసె నని చెప్పుటయున్. 27

ఉ. నవ్వుచు నింద్రదత్తువదనంబునఁ జూడ్కులు నిల్పి 'నీవు నాఁ
డవ్వనజాయతాక్షి హృదయంబున నాదెసఁ గూర్చు నంటి నేఁ
డవ్వచనంబు వో విడిచి యాడెదియాకథ చెప్పి తింక నే
నెవ్వరి నమ్మువాఁడ మది నీ విటు లాడుట మిత్త్రధర్మమే.' 28

చ. అనవుడు రత్నమండనుని యాననపద్మము చూచి 'నీకు నా
ఘనకుచ లోను గాదనుట కాదు కడుం దమకంబు లెస్సగా
దని యిటు లంటిఁ గాని మనుజాధిపనందన! నందధారుణీ
శున కెఱిఁగించి యాతనియు సూత్రము చేసెద నూరకుండుమా.' 29

వ. అని యూఱడించి యంతట నింద్రదత్తుండు మెల్లన యత్తెఱంగు నందనృపతికిం జెప్పిన నిప్పు ద్రొక్కిన ట్లదరిపడి కొడుకుకడకుం జనుదెంచి యొడ లంటి చూచి విరహజ్వరంబు భరం బగుటకుం గరంబు బెగడి పుత్త్రు నీక్షించి యి ట్లనియె. 30

క. 'నాపట్టి! యోనిధానమ!, యోపుణ్యపుఁ బ్రోక! యోమహోజ్జ్వలతేజో
రూపమ! యేఁ గలుగఁగ నీ, వీపగిదిఁ దపింప నేల యితరులభంగిన్. 31

చ. తలఁచిన నింద్రవహ్నియమదైత్యజలేశసమీరవిత్తపే
శులనగరంబులైన వెసఁ జొచ్చి కలంపుదు నీమనంబు ము
చ్చిలి కొనిచన్న యన్నెలఁతఁ జెచ్చెరఁ దోడ్కొని వత్తు నన్న భూ
స్థలిఁ బెఱయల్పదుర్గము లసాధ్యమె నాకరఖడ్గకేలికిన్. 32

క. ఇది యెంతటిపని చెప్పుము, మదవారణతురగరథసమాజోద్భటమై
కదలి నడతెంచునెడ నా, కెదు రెవ్వరు సంగరమున నిల్వ వసుమతిలోన్. 33

సీ. న న్నెదుర్కొని మున్ను వె న్నిచ్చి పాఱినకుకురుభూపతికంటెఁ గొంకణేంద్రు
కంటె మాగధుకంటెఁ గర్ణాటనృపుకంటెఁ బరగునేపాళభూపాలుకంటె
బంగాళవిభుకంటె బర్బరుకంటె నంధ్రక్షితీశ్వరుకంటె ద్రవిడుకంటె
సౌరాష్ట్రపతికంటె సంపాతి యెంతవాఁ డటుచూడు వానిసప్తాంగములును

ఆ. గెలుతు నశ్రమమున నెలఁతఁ దోఁకొని వచ్చి, యిత్తుఁ దనయ నీకుఁ జిత్త మలర
వగవకుండు' మనుచు నొగి నూఱడించి దర్పంబు మెఱయ సైన్యపతులఁ జూచి.

క. 'మీమీబలములఁ గూర్పుఁడి, భూమి యద్రువఁ బుండరీకపురపతిపై ను
ద్దామగతి నడుత' మనవుడు, నామాటకుఁ జంద్రవర్మ యనువిప్రుఁ డనున్. 35

ఉ. 'ఏను బురోహితుండ ధరణీశ్వర! యుక్త మెఱింగి నీకుఁ బెం
పూనఁగ విన్నవింపఁ దగు నోలి నుపాయచతుష్టయంబు నాఁ
గా నివి నీతివాక్యము జగంబున సామము వెండి భేదమున్
దానముఁ గోల్పకుండినఁగదా మఱి దండన మూర కేటికిన్.' 36

చ. అనవుడు సమ్మతించి విభుఁ డార్యులఁ బంపుడు వార లేఁగి యి
ట్లనిరి 'ఘనుండు మాళవనృపాగ్రణి నందుఁడు మద్విభుండు ద
త్తనయుండు రత్నమండనుఁ డుదారుఁడు వానికి నీదుకూర్మినం
దన నడుగంగ వచ్చితి ముదాత్తచరిత్ర! కళింగభూవరా!' 37

చ. అనిన నతండు నెమ్మనమునం దొగి మోదము ఖేదమున్ బెనం
గొనఁగఁ బురోహితుం బిలిచి 'కోమలిజన్మఫలంబు మీకుఁ దోఁ
చిన తెఱఁగంతయుం దెలియఁ జెప్పుఁడు వీరికి వీరు సమ్మతిం
చినయటులైన లెస్స యుఱ చేసిన దోషము వచ్చు' నావుడున్. 38

వ. అతం డక్కన్నియ జన్మించిననాఁ డప్పుడమిజేఁడు వినంగ నెట్లు చెప్పెనట్ల పెద్ది
దొరలతోడనుం జెప్పి ప్రియోక్తిగా నిట్లనియె. 39

ఉ. 'నందనరేంద్రనందనుఁడు నాయకుఁ డౌటకుఁ బుష్పగంధి త
త్సుందరి యౌటకుం బరమశోభనసంపద మద్గృహంబునం
బొందుటకుం బ్రమోదరససింధుతరంగల నోలలాడ మే
యుంచఱుఁ బాపజాలివిధి యిట్టియరిష్ట మొనర్పకుండినన్.' 40

క. అని పల్కిన 'నిది యల్పపుఁ, బనియె విచారించి చూడఁ బాడియ కాదే
యనుపుఁ డిదె పోయివచ్చెద,' మని జనపతితోడఁ జెప్పి రప్పెండ్లిదొరల్. 41

ఆ. మరలి పోయి నందధరణీశుతోడఁ జెప్పినఁ దలంకి యిట్టులనియె నాతఁ
'డద్ది రన్న చచ్చునంతటికల గన్న, నోలి మేలుకొనియె యుండవలయు. 42

ఉ. ఎక్కడిపుష్పగంధి మఱి యెక్కటిమత్సుతుఁ డేమి గాఁగ నీ
మక్కువ లుల్లసిల్లెఁ గొఱమాలినదైవము త్రిప్పి త్రిప్పి పెక్
జిక్కులఁ బెట్టె నే నెటులు చేయుదు దుఃఖము చూచి చూచి యా
దిక్కుటు లుండ నిండు సుగతిం బెఱచోటుల లేరె కన్నియల్.' 43

చ. అనవుడు రత్నమండనుఁ డనంగశిలీముఖపాతభీతుఁడై
జనకునిఁ జూచి 'తక్కటివిచారము లేటికిఁ బుష్పగంధికై
తను వెటు లైన నేమి వసుధం బెఱరాజతనూజ లేల య
య్యనిమిషనాథుపుత్రి యది యైనను నాహృదయంబు నిల్వనే. 44

సీ. ఆపద్మముఖిఁ బాసి యేపోఁడిమియు లేక పచ్చవిల్తునిచేతఁ జచ్చుకంటె
నిగ్రహం బేడ పాణిగ్రహోత్సవసౌఖ్య మావేవఁ దొలితొలి ననుభవింతు
నటమీఁద బ్రతుకు దైవాధీన మెట్లయ్యె నయ్యెఁ గా కేమి సేయంగ వచ్చుఁ
జావు లేకుండ నాజముచేత నాకుఁ దెచ్చినవారు గలరె యీసృష్టియందు
ఆ. నుడుము నడఁకి యున్న నడుఁకునె బడెపెట్టు, వీరలెల్ల నీతివిదులు గారె
దూరభీతిఁ జేసి చేరువ నగుకీడు, తప్పఁద్రోచువెరవు చెప్పఁగలరె'. 45

చ. అని కడుఁ దెంపు చేసి సుతుఁ డాడినమాటకు మాఱు పల్కనే
రని మొగమోట నానృపతిరత్నము గొండొక వెచ్చనూర్పు నె
మ్మన మెరియంగ భూసురసమాజముఁ గన్గొని దీనభావ మా
ననమునఁ దోఁప మేనఁ జలనంబు గడుం బొదలంగ నిట్లనున్. 46

క. 'ఓవిప్రవర్యులార! మ, దావాసమునందుఁ జెందునశుభంబులఁ బోఁ
ద్రోవను సంతతశుభములు, గావింపను మీర కారె కర్తలు మాకున్. 47

ఉ. కావున మాకు సేమ మగుకార్యము నేర్పడఁ జెప్పుఁ' డన్న నా
భూమిబుధాగ్రగణ్యులు ప్రభూతమతిం దలపోసి చూచి 'దే
వా! వెఱఁగంద నేటికి భవత్తనయుండు గుణాధికుండు మా
దీవనఁ బెక్కువర్షములు తేజ మెలర్పఁగ జీవితుం డగున్. 48

వ. ఇతనివేడుక చెడకుండున ట్లనుసంధింపుదు గాక' యనిన నతం డిట్లను 'రోగి యపథ్య
భక్ష్యంబు లపేక్షించినఁ బెట్టవచ్చునె యెఱింగియుండియు నోఁతులేదు చొరమ
న్నట్లు చేసితి రేమనవచ్చు బ్రాహ్మణులు భోజనసహాయులుగాని కార్యసహాయులు
గారనుట తేటపఱచితి' రనినఁ దమమాట వితథంబు గాకుండ విప్రమాహాత్మ్యంబు
వినిపింపఁ దలంచి చంద్రశర్మ యి ట్లనియె. 49

ఆ. 'విను జనార్దనుండు విప్రవాక్యంబు చే, పట్టి నడుచు నెల్లపనులయందు
విప్రవాక్యమునకు వేదవాక్యమునకు, భేద మేమి లేదు మేదినీశ! 50

క. విప్రుఁడు సాక్షాద్దైవము, విప్రవచన మేల తప్పు విప్రాశీర్వా
దప్రాప్తి నొక్కనరుఁడుఁ, క్షిప్రమె యొకమృత్యుబాధ గెల్చుట వినవే. 51

క. ఆకర్ణింపుము చెప్పెద, నాకథ నేపాళదేశమందు నుదాత్త
శ్లోకుఁడు భద్రకుఁ డనునొక, భూకాంతాధిపుఁడు వేఁట వోయినచోటన్. 52

ఉ. చేరువఁ బక్షి పల్కె నృపశేఖరుఁ 'డిప్పులుఁ గేమి పల్కెఁ బొ
పారఁగఁ జెప్పుమా' నడిగె నాశకునజ్ఞుని వాఁడు చెప్పెఁ ద
త్కారణమయ్య! నీకుఁ బనిగా దొకశూద్రుఁడు కొండపూరికిన్
బోరనఁ బోవులోన మృతిఁ బొందుఁ బథంబున సర్పదష్టుఁడై 53

క. వాఁ డల్లవాఁడె పోయెడు, నేఁ డతనికి పీడువోలు నిజముగ నీ వా
పోఁడిమి చూచెద వే నొక,నాఁడో నిటు నిల్చి చూడు నరవరతిలకా!' 54

చ. అని యొక కాఁపుఁ జూపి యిటు లాడినపంతపుమాట లేర్పడ
న్విని ధరణీవిభుం డతనినిక్కముఁ గల్లయుఁ జూత మంచు నె
మ్మనమునఁ గౌతుకం బెసఁగ మంత్రులుఁ దాను నవ్వనంబులో
నెనసినచూతపోతముల నిం పగునీడ వసించి యుండఁగన్. 55

క. కొండొకతడవునకాఁతఁడు, కొండకసవుఁ జాలఁ గోసికొని రయమున నం
దుండి మరలి చనుదెంచుచు, నుండఁగ శకునజ్ఞుఁ జూచి యుల్లస మెసఁగన్. 56

క. 'చచ్చినవారలు గ్రమ్మఱ, వచ్చుట గడుచిత్ర మల్లవాఁ డదె కంటే
చచ్చినఁ బచ్చనికస విటు, దెచ్చుచు నున్నాఁడు వానితెఱఁ గేదియొకో. 57

సీ. చంపంగవచ్చినజమునిదూతలకు లంచము పెట్టి వచ్చెనో చావ నొల్లఁ
బొమ్మని మోఱకంబునఁ ద్రోచి వచ్చెనో యింటివారికిఁ జెప్ప కిచటఁ జచ్చి
నట్లైన గోపింతు రని చెప్ప వచ్చెనో వీని పెంజెమట నవ్విషము గరఁగి
వడిసెనో సర్వంబు వాతప్పిపోయెనో శకునంపుఁబలుకు లీసారి భ్రమసి
ఆ. తప్పఁ జెప్పెనో యితం డేమి విధమునఁ, బ్రతికి వచ్చె' ననినఁ 'బార్థివేంద్ర!
యవధరింపు మింత యణకింప నేల నీ, బంటుపంత' మనుచుఁ బలికె నతఁడు. 58

క. 'ఓకాఁప! యిందు' రమ్మని, పాకతమునఁ జేరఁబిలిచి శకునవిధిజ్ఞుం
డాకసవుకట్ట డించి య,నాకులమతి విచ్చి చూడ నప్పుడు నడుమన్. 59

*క. కక్కులకోడవలిపోలెం, జక్కఁగఁ దెగియున్న క్రూరసర్పమువదనం
బొక్కటి యుండఁగఁ గన్గొని, యక్కజముగఁ బతికిఁ జూపి యతఁ డిట్లనియెన్. 60

ఆ. వీనిఁ జంప వచ్చి విషధరం బీభంగి, తానె పొలిసిపోయె ధరణినాథ
చూడు మితఁ డిఁ కేమి సుకృతంబు చేసెనో, కాక దీనిబాఱిఁ గడచె నిట్లు. 61

క. అని యాకర్షకువదనముఁ, గనుఁగొని యోయన్న నీవు కసవుకుఁ బనుచోఁ
గనినవిశేషముఁ గలదే, యనవుడు వెడనవ్వు నవ్వి యతఁ డిట్లనియెన్. 62

*కక్కులకోడవలి పోలెన్. శ. ర. పా. కక్కులకోడవటి కాపయి. చి. ని పా. సూ. ని. పా.

ఆ. 'ఏము కాఁపువార మెద్దుల మే మెఱుఁగు,మము తండ్రి యల్లకొండచెంత
నడుచు బాపనయ్య నా కెదురయ్యెఁ దా, నూఁతకోల చేత నూఁదికొనుచు. 63

క. కనియొకజోహా ర్వెట్టిన, నను దీవించుచును బోయె నాకన్నడిగా
విను మిది యొక్కటి యెయ్యది,యును మఱి లే'దనిన నాకుఁ దుల్లము పొదలన్.

క. భద్రకునిఁ జూచి 'వింటే, శూద్రునివచనంబు సద్ద్విజునిదీవన నీ
రౌద్రభుజంగముచేలిగియు,పద్రవమునఁ బడక వీఁడు బ్రతుకుట కంటే. 65

ఉ. ఊరక గేలి చేసితి నృపోత్తమ! నాశకునంబు దప్పునే
వారిజసంభవుండు మును వ్రాసినవ్రాఁతయు వమ్ము సేయఁ గా
నేరుపుఁ గల్గి యుండు ధరణీసురకోటికి నెందుఁ గ్రొత్తయే
వారికృపావిశేషమున వచ్చినయాయువు సూవె వీనికిన్. 66

సీ. ఆదిశంభునితోడ వాదించి యఱకాలఁ గన్ను చూపించఁడె గౌతముండు
వైకుంఠనిలయునివక్షఃప్రదేశంబు తెగువమైఁ దన్నఁడె భృగుమునీంద్రుఁ
డంబుధిజల మెల్ల నఱచేతిలోనికిఁ గొనివచ్చి త్రాగఁడె కుంభజుండు
మార్తాండబింబంబునూఱుగా నుడువీథిఁ దనదండ మునుపఁడె ముని వసిష్ఠుఁ
తే. డింద్రుతోసాటిగాఁగఁ బక్షీంద్రుఁదొల్లి,సృజన సేయఁడెయావిశ్వసృజుఁడుగడఁగి
వాలి విప్రుల గెల్వ నెవ్వారికి నైన, నలవి గా దిది నిక్కువ మవనినాథ. 67

ఆ. అలమృకండుసుతున కల్పాయు వని మున్ను, వ్రాసె బ్రహ్మ యతనివ్రాఁత లెల్లఁ
జెంపు చేసి విప్రదీవన నతఁ డిట్టి,బ్రతుకు బ్రతికె వినవె పార్థివేంద్ర! 68

వ. కావున బ్రాహ్మణాశీర్వాదం బాసన్నమృత్యునివారణం'బనిన విని సంతోషించి 'యది యట్టిద కాదె! బ్రాహ్మణులు భూదేవతల కారె! వారివాక్యం బేల తప్పు' నని కొని యాడి భద్రకధరణిపాలుండు శకునజ్ఞునకుం బసదనం బొసంగి యథేచ్ఛం జనియె నాశూద్రుండును నాయుష్మంతుండై బ్రతికె నట్లగుటం జేసి. 69

ఆ. 'విప్రభక్తి గలఁడు వినుము నీతనయుఁ డా,తనికి ధర్మదేవతయ సహాయ
మొనరఁ గలదు గాని యొండు గానేర దీ,సంశయంబు విడువు జనవరేణ్య!' 70

వ. అనిన నవ్విప్రోత్తములమాట తనకొడుకుబ్రతుకువృద్ధికిం బూఁటగా మైకొనిరత్నపురాధీశుం డాపుండరీకపురాధీశుతో వియ్య మంద నియ్యకొనియె నయ్యవసరంబున.

సీ. 'మాతండ్రిచిత్త మేమాడ్కియో? మంత్రు లేమని విన్నవింతురో? ఘనులు భూసు
రోత్తము లేమందురో? సఖులు మద్బంధుజనులు నంతఃపురసతులుఁ జిత్త
ముల నెద్ది కర్తవ్యముగ విచారింతురో? హైవాహికోత్సవవైభవంబు
నాకు సిద్ధించునో? నడుమనె పోవునో? కటకటా! యోపుష్పగంధి! నేఁ డిఁ

ఆ. కేమి సేతు నీకు నేమన్మథునిచేతఁ, జిక్కువడితి' నంచుఁ జెక్కుభంగు
లందు వనరుచున్న యారాజనందను, వంత యాతయును బ్రశాంతమయ్యె. 72

సీ. అంత నెంతయు వేడ్క నమ్మహీకాంతుఁ డాధరణీశు పాలికిఁ దనదు దొరలఁ
గ్రమ్మఱఁ బనుప నక్కాళింగుఁ డిట్లను 'నిది యేమి చెప్పఁడా యెఱిఁగి యెఱిఁగి
తగునయ్య తనయట్టి తత్త్వజ్ఞునకు నిట్టిసాహసం బీయింతిజన్మఫలము
వినియును నిక్కార్యమున కిచ్చగించుట పులియున్న పొదరింటిపొంతఁ జనుట

ఆ. కీడు సర్పమున్న గృహమున నుండుట, దహనదహ్యమానదావవీథిఁ
దఱియఁబడుటగాదె యెఱుక లేదంద మే, మానవేశ్వరుండు మహితయశుఁడు.' 73

క. నావుడు 'మానరనాథుఁడు, కేవలపురుషుండె వాఁడు కీడొందుపనుల్
గావించునె మది బెదరంగా వల'దని చెప్పి దొరలు గైకొలుప్రటయున్. 74

క. విరహజ్వరోపశాంతికి, నిరుపమకళ్యాణకరణనిర్విఘ్నతకున్
హరిహరసూనుల వేఁడెదు, తరుణికి సంతోషరసము దైవాఱె మదిన్. 75

క. ఆవార్త విని ముదంబునఁ, బూవిల్తుని గెల్వఁగంటిఁ బొమ్మని నంద
త్క్ష్మావరపుత్రుఁడు జనకా, జ్ఞావశతఁ బ్రయాణభేరి చఱపం బనిచెన్. 76

చ. కలఁగెఁ బయోనిధుల్ గిరులు గంపము నొందెఁ జలించె భూమి ది
క్కులు వడఁకెన్ వియత్తలము గుబ్బటిలెన్ గ్రహతారకంబు లు
త్తలపడఁ జొచ్చె నచ్యుతపితామహశంభుబిడౌజు లాత్మకాం
తల నుపగూహనక్రియకుఁ దార్చిరి బెగ్గిలకుండ సాధ్వసిన్. 77

క. పురజనులును బరిజనులును, బరమోత్సవలీలఁ బొదవఁ బయనపుసిరిఁ బొం
పిరి వోవఁ గదలె నతఁ డం,బరచుంబిపతాకికాతపత్రము లమరన్. 78

ఉ. రాజతనూజసేనలభరంబున మేదిని యొడ్డగిల్లె నా
భూజము లెల్లఁ బెల్లొరగి పొల్పువహించె వివాహదర్శన
భ్రాజిమహాకుతూహలపరంపర లాత్మలయందు మిక్కుటం
బై జనియించినం గదలి యద్దెసఁ దోఁపఁ గణంగెనో యనన్. 79

క. క్షితిపతిసుతుసైన్యపదా, హతిరేణువు మిన్ను ముట్టె నాత్మీయులయు
న్నతిఁ గనుఁగొనిరండని భూ,సతి సురసంతతికిఁ జెప్పఁ జనియె ననంగన్. 80

క. అతని చమూనినదములకుఁ, బ్రతిధ్వనులు చెలఁగె నఖిలపర్వతములఁ ద
ద్వితతవివాహోత్సవసము, చితవాక్యము లెల్లచోటఁ జెలఁగె ననంగన్. 81

వ. ఇవ్విధమున నక్కుమారుం డపారవిభవోదారుండగుచు నరిగి కాంత్రం బగుపుండరీక
పురప్రాంతంబు చేరునవసరంబున, 82

చ. సదు లరుదేర నయ్యుదధినాథుఁడు వెన్నెలరేలు సమ్మదం
బొదవ నెదుర్కొనం గడఁగునోజ నృపాలతనూజసైన్యసం
పదలకుఁ బుండరీకపురభర్త సముజ్జ్వలసైన్యయుక్తుఁడై
యెదురుగ వచ్చి కూర్చుకొని యేఁగెఁ జెలంగఁగ హృద్యవాద్యముల్. 83

క. తేఁకువ యలరఁగ నీగతి, దోఁకొని చని చదల రత్నతోరణదీప్తుల్
ప్రాఁకెడుఘనగృహముల న,మ్మూఁకల విడియించె రాజముఖ్యుం డంతన్. 84

సీ. పుణ్యనిర్మలజలంబులను సుస్నాతుఁడై తడియొత్తి విమలవస్త్రములు దాల్చి
కస్తూరికామిశ్రగంధంబు మై నిండ నలఁది మాణిక్యమయంబు లైన
కంకణాంగదహారకర్ణావతంసాదికలితభూషణముల నలరఁ దొడిగి
యంచితసౌరభోదంచితకించిదుత్ఫుల్లనానావిధపుష్పదామ

ఆ. కములు దనరఁ బూని కళ్యాణచిహ్నలు, గొమరుమిగుల మంచుఁగొండయింటఁ
బరిణయముగ నరుగుపరమేశ్వరుండును, బోలె నొప్పె నానృపాలసుతుఁడు. 85

క. ముందరఁ బురోహితుండు పి,ఱుంద సచివుఁ డాయంధపుమెఱుంగులు మెఱయన్
గొందఱుభటు లిరుగెలఁకుల, దండడి నడతేర వందితతి నుతియింపన్. 86

క. భేరీజయఘంటాదిమ,హారావములును వసుంధరామరవిజయా
శీరుక్తసుశబ్దములును, గౌరీకళ్యాణవిభవగానధ్వనులున్. 87

ఉ. పౌరులసాధువాదములు బాంధవకోటిప్రమోదభాషలున్
వారవధూవిదూషకజనంబులనాగరికంపుమాటలుం
బేరడియై దిగంతములఁ బిక్కటిలంగ నపారవైభవో
దారత యుల్లసిల్లఁగ నతం డరుదెంచె వివాహవేదికన్. 88

ఉ. అప్పుడు బిట్టుబిఱ్ఱ విభుఁ డాతరుణిం గనుఁగొన్నఁ బువ్వుఁదే
రుప్పరవీథిఁ దోలుకొని యుగ్రగతిం బఱతెంచి కాముఁ డే
చొప్పునఁ జూపునో తనప్రసూనశరంబులవాఁడి యంచు వా
తప్పక చాటుపెట్టినవిధంబున నత్తెర యెత్తి రత్తఱిన్. 89

చ. ఫలములుఁ బుష్పజాతులును బ్రాలును నాదిగఁ బైఁడిపళ్యెరం
బులు నిసుపార నించుకొని పుణ్యసతీనివహంబు శోభనం
బలవడఁ బాడఁగాఁ గరతలాత్తపాత్రిక లొప్పఁ గొండ ఱు
మ్మలు లటు చేరి సేస లిడఁగాఁ జెలు వొందుచు నవ్వధూవరుల్. 90

క. ఉప్పొంగెడు వేడ్కలఁ గను,ఱెప్ప లిడక తృష్ణ లతిముతిం బైకొనఁగాఁ
దప్పక కనుఁగొన నబ్బుట, యెప్పుడో కో మాకు ననుచు నెదఁ గోరంగన్. 91

వ. తదుత్సవానందరసనిమగ్నం బగుతద్వియోగాగ్నిపుంజంబునుం బోలె శుభలగ్నో
దయసమయసూచకం బగుచు జలంబులందు మునుంగుతామ్రఘటికాపాత్ర నిరీ
క్షించి మంగళాశీర్వాదపురస్సరంబుగా సుముహూర్తం బనుచు మౌహూర్తికుండు
జయఘంటపై నక్షతలు చల్లిన. 92

ఉ. కంగున ఘంటపైఁ గొడుపు గ్రక్కున వైచుడుఁ దూర్యనాదముల్
నింగియు దిక్తటంబులును నిండఁగ విప్రులవేదనాద ము
ప్పొంగి చెలంగుచుండఁ దెర వుచ్చిన ముచ్చట వోవఁ జూచి ర
య్యంగజుఁ డార్వ నొండొరులయాననపద్మము లావధూవరుల్. 93

క. చల్లనవగొన్నచూపుల, పెల్లున నొండొరులవదనబింబంబులు తో
ఖిల్లై నెలజేఁటికదుప్పలఁ, జల్లికలం గలియువికచజలజములక్రియన్. 94

ఉ. అంతఁ బురోహితానుమతి నక్షతపాత్రలు సేరఁ దెర న
క్కాంతయుఁ గాంతుఁడున్ ముఖవికాసము లొప్పఁగ దోయిలించి య
త్యంతపుఁబ్రీతి నొండొరులయౌఁదలలం దలఁబ్రాలు వోసి రం
తంతకు మేనులందుఁ బులకాంకురజాలము లుల్లసిల్లఁగన్. 95

తే. పొలఁతి ప్రాణేశుతలఁబ్రాలు పోయునపుడు, సిగ్గు నెపమునఁ దనదుదోసిలియొకింత
తడవునకుఁగాని వదలదు తచ్ఛిరోజ, కరసరోజసంస్పర్శసౌఖ్యంబు మరిగి. 96

క. తలఁబ్రాలు వోయుచో నవి, తలవెండ్రుక లింత సోఁకి తనదగుబాహం
గుళములు దక్కఁటియంగం, బుల కెక్కఁటి సేయ రాజపుత్రుఁడు మెఱసెన్. 97

క. గుణమణియుత యగుసతిల,క్షణ మది ప్రాణేశ్వరునకు శాశ్వతసుఖకా
రణ మని యిటు చేసె ననఁగ, గుణమణియుతుఁ జేసె విభుఁడు కోమలి నంతన్. 98

చ. అతనుని గెల్తు నీసతి సహస్థితి గన్గొన నంచునో పురా
కృతసుకృతోపభోగకలికిం గుదు రీసతి యందునో యనా
గతఘనదుర్దశం దలఁగఁగా నెర నీసతి గాంచు నంచునో
యతఁ డిటు చేసె నాఁగఁ దరలేక్షణ హస్తముఁ బట్టెఁ బ్రీతితోన్. 99

వ. ఇవ్విధంబున నప్పల్లవపాణిం బాణిగ్రహణంబు చేసి శచీసమన్వితుం డగుశతక్ర
తుండునుం బోలె ననుపమతేజోవిశేషవిరాజితుం డగుచు నారాజసుతుండు మణి
కలితకనకాసనాసీనుండై సముచితప్రకారంబున హోమతంత్రంబుదీర్చి విప్రజనం
బులం దాంబూలాదిబహుధనసత్కారంబులఁ బరితృప్తులం జేసి తదాశీర్వచననిచయంబు
వడసి యుండునెడ నాదంపతులకు నుభయపక్షంబులబంధువులు నంబరాభర
ణాదుల నిచ్చిరి తదనంతరంబ. 100

శా. జామాతృప్రముఖప్రభూత్తమజనుల్ సంతృప్తులౌనట్లుగా
హేమాపాత్రములన్ జతుర్విధములై యింపారు నాహారముల్
ప్రేమాధిక్య మెలర్ప షడ్విధరసోపేతంబుగాఁ బెట్టె సు
త్రామానోకహవైభవం బెసఁగ నాధాత్రీశుఁ డత్యున్నతిన్. 101

ఉ. మీఱినయన్నశైలములమీఁద సమగ్రఘృతప్రవాహముల్
పాఱఁగ యానపాత్రములభంగి నపూపము లొప్పె నెవ్వరున్
మాఱిడనీక కందనియుమాత్రగఁ బాత్రలయందు నిండి దై
వాఱెఁ బదార్థసంఘములు ప్రాలిగ నవ్విభుపెండ్లియామె తన్. 102

వ. అయ్యవసరంబున. 103

తే. నేఁటిపట్టునఁ బగ లింత నిడివియైన, నంగనాలింగనోత్సవాభ్యర్థియైన
యానృపాత్మజుఁ డెట్లోర్చు ననుచు నర్కుఁ, డతని కవకాశమిచ్చినయట్లు గ్రుంకె.

క. దంపతులరాగరసములఁ బెంపొ మన్మథతమంబు పెంపో యనఁగా
సొం పగుసంధ్యారాగప, రంపరయును జీకువాలుఁ బ్రబ్బెఁ బయిపయిన్. 105

వ తదనంతరసమయంబున. 106

చ. జనజభవాండ మొప్పెఁ గలశంబువిధంబున నందులోన ను
జ్జ్వల మగుచంద్రికాపటలి సన్నుతి కెక్కెఁ బయఃప్రపూరమై
లలితకళాకలాపసదలంకృతచారుసుధామరీచి యిం
పులగని యై తనర్చెఁ, బయిఁ బొంపిరి గట్టినమీఁగడో యనన్. 107

క. ఆరాత్రి పుష్పగంధికి, గారవమున జలకమార్చి కైసేసి సఖుల్
కోరి నృపాత్మజు శయ్యా, గారమునకు దెచ్చి యతనిఁ గదియించుటయున్. 108

సీ. జలజాక్షిఁ దన్ను నచ్చెలులు పాన్పుమీఁద నునుచుచోఁ బెనఁగక పెనఁగుటయును
సెజ్జకువచ్చియుఁ జెలులు నవ్వెద రని మోమెత్తగా నోడుముగ్ధతనము
నొక్కొకపనివెంట నువిద లేఁగినఁ జిత్త మూటాడుచుండంగ నుండుటయును
జిట్టాటుచేఁతల సిగ్గు కీ లెడలించి పలికింప నల్లనఁ బలుకుటయును

తే. దనువు పులకింప నధరామృతంబుఁ గ్రోలి, కౌఁగిలించిన మర్మంబు కరఁగుటయును
దనకు నత్యంతసౌఖ్యప్రదంబు లగుచు, నలర సురతోత్సవాబ్ధి నోలాడెవిభుఁడు.

ఆ. ప్రథమరతమునందుఁ బంచసాయకతంత్ర, మంతవట్టుఁ దనకు నవగతముగ
నభ్యసించె ననఁగ నయ్యింతి భర్తచి, త్తంబు వట్టు బహువిధంబులందు. 110

ఆ. బాహ్యరతులఁ దొలుత బాలికిఁ గరఁగించి, కూటమందు గెలుపు గొందు ననుచుఁ
గదిసి విభుఁడు దాన కరఁగఁ జొచ్చుఁ బరస్పరానురాగమహిమ యడుగ నేల. 111

క. సమకాలసురతతంత్రము, శ్రమమునఁ గౌఁగిళ్ళ బిగియ జంపతులకరీ
రము లొప్పె నందుఁ గరఁగిన, కమనీయసువర్ణపుత్త్రికలచందమునన్. 112

వ. ఇట్లు లబ్ధమనోరథుఁడై యారత్నమండనుండు కతిపయదినంబులకు సంపాలినృపతిచేత సత్కృతుండై యపారవిభవం బారఁ బుష్పగంధినిం దోడ్కొని తనపట్టణంబున కరిగి నందమహారాజునకు నంబికాదేవికి నమస్కరించి యథాసుఖవిహారంబుల నుండియుండి యొక్కనాఁడు. 113

క. మారుఁడు రమ్యారామవి, హారంబున మెఱయుమాడ్కి నప్పురిసరకాం
తారమున కేఁగి ధీరో, దారుఁడు రాకొమరుఁ డేకతమున మెలంగన్. 114

ఉ. క్రూరపుఁజూపులు న్నిడుపకోఱలు నుగ్రపుమోము నెత్తుటం
జేరినకోరమీసములు బిట్టినవెండ్రుకలుం గృశత్వముం
గూరినదేహము న్వడఁదకుక్షియు ఘోరరవంబు గల్గియే
పారినబ్రహ్మరాక్షసుఁ డుదగ్రబలుం డొకఁ డవ్వనంబులోన్. 115

చ. ఉరుధరణీజశాఖపయినుండి ఘనధ్వనిఁ దన్నుఁ బిల్వ సుం
దరతరవక్త్ర మెత్తి వెసఁ దప్పక చూచి కుమారుఁ డాత్మన
చ్చెరువడి పుష్పగంధికయి చెప్పినయప్పలుకు ల్దలంచి 'యె
వ్వరికిని మీఱరా దజుఁడు వ్రాసినవ్రా' లనుమాట దప్పునే. 116

ఆ. అలతాంగిఁ బెండ్లియాడి తొమ్మిదిప్రొద్దు, లయ్యె నేఁటితోడ నది నిమిత్త
మై కదా భయంకరాకృతితోఁ బొడ,చూపె బ్రహ్మరాక్షసుండు నేఁడు. 117

క. అని కొండొక చింతింపఁగ, ననుమానం బేల నాకు నాహారముగా
నిను నియమించె నజుఁడు ర,మ్మని వెండియుఁ బిల్చె నాతఁ డాగ్రహ మెసఁగన్.

వ. ఇట్లు సెట్టుకొని పిల్చుచున్న బ్రహ్మరాక్షసునకు ధైర్యగుణమండనుం డగురత్నమండనుండు సవినయంబుగా నిట్లనియె 'నయ్యా! నీయానతి సేయఁజేసెద నాకొక్కవిన్నపంబు గలదది యాకర్ణింపుము. 119

సీ. ఏను బోయినజాడ యెఱుఁగక నాతల్లిదండ్రులు నెంతయుఁ దల్లడిలుచు
నుండుదురో నన్ను నోరంతప్రొద్దును నెత్తి పెంచినదాది యెంత వగచు
చుండునో నాచేయునుద్యోగముల కెల్ల ననుకూలుఁడై వచ్చునాప్తుఁ డింద్ర
దత్తుఁడు దా నెంత తలఁకునో నాకు దోసిలియొగ్గి యేసౌఖ్యములును లేక
ఆ. పుష్పగంధి యెంత పొగులునో యేఁ బోయి, వారి కెల్ల నుచితవచనరచనఁ
జేసి యూఱడించి శీఘ్రంబ వత్తు నీయాన నన్నుఁ బనుపు' మనిన నతఁడు. 120

తే. 'అవుర! పులిచేతఁ జిక్కినయతఁడు విడిచి, పోయి క్రమ్మఱ వచ్చుట బొంకు గాదె
తలియఁ బెట్టినయశనంబు తలఁగఁ ద్రోచి, పిదపఁ గుడిచెద ననువాఁడు బేలకాఁడె. 121

క. అది గాక నీవు చని వచ్చెద ననుటయుఁ బిదప నీవు చేరెద వని నే
వదలుటయు నయుక్తంబులు, చదురుఁడ వగుదేని రమ్ము చయ్యనఁ గదియన్'. 122

చ. అనవుడు 'నోమహాత్మ! యిటు లాడఁగ నేటికి నీదుసమ్ముఖం
బున నిటుపల్కి నాకు మఱి బొంకఁగ వచ్చునె సర్వజీవులం
దును మనుజత్వసిద్ధి గడుదుర్లభ మట్టిమనుష్యదేహ మె
త్తినతుదిఁ గల్లలాడి సుగతిచ్యుతి నొందుదునె యెట్టినీచుఁడున్. 123

ఉ. కావున నాకు బొంకు పలుకం బనిలేదు వృథా వినాశమై
పోవఁగ నున్నయీచెనఁటిబొంది భవాదృశు లైనపెద్ద లా
పోవఁగ నారగించుటకుఁ బూని సమర్పణ చేయరాదొకో'
నావుడు నాతఁ డుగ్రముగ నవ్వి 'యివేటికి నిన్నిమాటలున్. 124

క. ప్రత్యయపరిపాలకుఁ డగు, సత్యోత్తముఁ డెచటఁ గల్గు నప్పటిపనికై
సత్యోక్తులు పచరింపఁగ, సత్యాచారంబు మది ననాచార మగున్'. 125

వ. అనిన నతం డతని కి ట్లనియె. 126

క. 'మనుజుఁడ సత్సంగతి గల, మనుజేంద్రసుతుండఁ గల్ల మాటాడెదనే
మును తిర్యగ్జాతి యనం, జనుధేనువు సత్యనిష్ఠ సల్పుట వినవే'. 127

క. అనవుడు 'నాకథ యెట్టిది, వినవలయుం జెప్పు' మనిన 'విప్రవరేణ్యా!
విను' మనుచు రత్నమండనుఁ, డెనయంగా నప్పులితోడ నిట్లని చెప్పెన్. 128

సీ. 'ఒకవిప్రవర్యునిహోమధేనువు నిత్యసత్యవర్తిని సదాచారమూర్తి
కలహంబునకుఁ బోదు కలిగినంతనె తుష్టి నొందు సందడి కోర్చు నుఱ్ఱువేయ
దలవడు పిదుకుచో వరవృష్టిధారల చెలువునఁ జన్నులు చేఁపి కురియుఁ
దెవు లెఱుంగదు అొమ్ముతీవ్రసాలఁగఁ గల్గి కుదుమట్టమై చాలఁ గూడియుండు
తే. నిట్టిగోరత్న మొక్కనాఁ డేకతంబ, పోవు మేయుచు నుండ బెబ్బులి యొకండు
దానిఁ గనిపొంచియొకయెల్లదాఁచి వాలమువనిఁ దాటించుచును వ్రేయ నడరుటయును.

క. కళవళము లేక యోహో, నిలునిలు మని సురభి యిట్లనియెఁ జయ్యన న
ప్పులితో 'నా కొకవచన మీ, వలయును వివేకించి నాదు వాక్యము వినుమా'. 130

క. అనినఁ బులి గోవుపై నెత్తినకేలును భీషణాకృతియుఁ బటమున వ్రా
సినచిత్రరూపువిధంబున ఖచరుల కద్భుతంబు పొదలఁగ నుండెన్. 131

చ. పులియటె దీపనానలముపొంగున మ్రోఁగుచు నున్కియట్టె యి
మ్ముల నొకపాఁడిగో వపుడు ముందటికిం జనుదెంచునట్టె హో
నిలు మనినం బయిం బడక నిల్చి కనుంగొనునట్టెబాపురే
కలఁగక యీడుమాట లయకాలుని నైన శమింపఁ జేయదే. 132

వ. ఇట్లు నిల్చి యప్పుండరీకం బాఘేశువున కిట్లను 'నామిషార్థివై వచ్చి నన్నిట్లు
వారింపఁ గారణం బేమి? నీ వేమి చెప్పెదు?చెప్పు' మనిన నది దాని కిట్లనియె. 133

చ. 'మునుమును బుట్టె నాకు నొకముద్దులపట్టి యతండు పుట్టి యే
డెనిమిదినాళ్ళపాటి గలఁ డింతియ పూరియు మేయ నేరఁ డేఁ
జని కడుపారఁ జన్ గుడిపి చయ్యన వచ్చెద నన్నుఁ బోయి ర
మ్మని సుకృతంబు గట్టికొనవన్న దయాగుణ ముల్లసిల్లఁగన్'. 134

వ. అని వల్కుచుఁ దనలో నిట్లని విచారించుచు. 135

క. 'రేపు చను గుడిపి వచ్చితి, నేపున నందంద పరువు లిడి యంతటిలో
నాపుడిసెఁడు నఱిగినఁ గొడు, కేపాటులఁ బడునొ వాని కెయ్యది గతియో. 136

క. ఏ నట్టు నాకుచుండఁగఁ, దా నను నండ గొని చెవులు దాల వయిచుచున్
మే నెఱుఁగక యుండెడు నా, తూనకు నెవ్వారు దిక్కొకో యిటమీఁదన్. 137

సీ. నన్నుఁ గానక పోయి నాపుత్త్రుఁ డేయావుపొదుగైనఁ దొడుకంగఁ గుదిలికొనుచుఁ
గొమ్మున నదరంటఁ జిమ్మునో సుడిసిన నడ్డంబు దాఁకునో గొడ్డుటావు
లుగ్రమహోక్షంబు లొండొంటిఁ దొడరుచోఁ ద్రొక్కునో జఠరాగ్నిఁబొక్కిపడుచుఁ
బొరుగిండులకు నొంటిఁ బోవఁ గుక్కలు దోలికఱచునో గతిమాలి యఱచుకొనుచుఁ

ఆ. దిరిగి తిరిగి యధికదీనవక్త్రముతోడఁ, దోఁట దొడ్డి చొరఁగఁ దోలఁబోయి
పడుచుపైద వెంటఁబడి నొవ్వ నడుచునో, యేమి సేతు' నంచుఁ బ్రేముడించు. 138

వ. అంతఁ దనయంతరంగం బంత యెఱింగిన నప్పులి సంశయించునో యనుతత్తఱంబు
నం జిత్తం బొక్కింత చేసికొని వైవర్ణ్యంబు దోఁపనీక క్రమ్మఱ నమ్మొద విట్లనియె.

ఉ. 'గుమ్మెడుపాల నాసుతునకుం బరితృప్తి జనించుఁగాని మాం
సమ్ము సమస్తముం గొనక చాలదు నీయుదరాగ్ని కైన ని
క్కమ్ముగ నిందులోఁ బ్రథమకార్యవివర్గతి నీ వెఱుంగవే
పొమ్మన వన్న! వ్యాఘ్రకులభూషణ! చయ్యనఁ బోయివచ్చెదన్'. 140

చ. అనవుడుఁ బుండరీక మపహాస్యము చేసి 'యిదేమి గోవ! యి
ట్లనియెదు నన్ను బేల్పఱచి యాత్మజుఁ డున్నెడ కేఁగి సత్వరం

బునిఁ జనుదెంతు నంటి విధి వోలునె చెప్పెడువారు చెప్పినన్
వినియెడువారి కించుక వివేకము పుట్టునె యింత యేటికిన్. 141

ఆ. ఎట్టికష్టజంతు వేనియుఁ దేహంబు, విడుచుచోటఁ బెఱుఁగఁబడునకాదె
సమ్మతించి చావఁ జాలదు విను పురావృత్త మొకటి తెలుపు నిత్తెఱంగు. 142

వ. అది యెయ్యది యంటేని. 143

ఉ. ఒక్క మునీశ్వరుండు వరయోగపరాయణుఁ డుత్తమోత్తముం
డెక్కుడుభక్తితోడఁ బరమేశు జనార్దను విష్ణుదేవునిం
జక్కఁగ హృత్సరోజమునఁ దాల్చి తపం బొనరించుచున్న వాఁ
డొక్కదినంబునందు జప మొప్పుఁగఁ జేయుచు గంగలోపలన్. 144

సీ. సైకతస్థలమున. జారుపద్మాసనాసీనుఁడై నిశ్చలధ్యానకలిత
హృదయుఁడై యుండ నయ్యెడకుఁ జీరలుగుంజ నొక్కచాకితయుఁ దానొంటివచ్చి
యామునీశ్వరచంద్రు నందుఁ జూడ్కులు నిల్పి ధృతి దూల నాలుగుదెసలఁ జూచి
మఱి యెవ్వరును లేనితఱిఁ గామభూతంబు ఘూటింప నిటు నటుఁ గాళు లాడ

ఆ. మునికి నతనిఁ జేరఁ జని భక్తి గలయది, పోలెఁ దత్సమీపభూమియందుఁ
జక్క సాఁగి మ్రొక్కి సంభ్రమంబున లేచి. మొగిఁ గరాబ్జయుగము మోడ్చి పలికె.

క. 'ఓపుణ్యుఁడ! నిను వేఁడెద, నీపరమకృపాకటాక్షనిర్మలరోచుల్
నాపైఁ బొలయింపుము నీ, రూపముఁ గనుఁగొంటి మరునిరోషము గంటిన్.' 146

చ. అనవుడుఁ గర్ణరంధ్రముల నప్పలుకు ల్వెడ సోఁకి నెమ్మనం
బునకు నసహ్యమైనఁ బటుబుద్ధి హరిస్మరణంబు సేయుచుం
గనుఁగవ విచ్చి దానిదెసఁ గన్గొని యి ట్లని పల్కె నాతఁ 'డే
ననఘుఁడ సత్తసోధనుఁడ నర్హుఁడనే భవదీయకాంక్షకున్. 147

క. కాఁగానిమాట లాడెదు, రాఁ గూడదు నేఁ దపశ్చరణమై నుండం
గాఁ గోమలి యిటు నిల్వక, యేఁగుము మగనాలి కేల యీదుర్గుణముల్'. 148

క. అని విడనాడిన నమ్ముని, విని యంతటఁ బోక చాకివెలఁది 'కటకటా!
నినుఁ జూచి మరగి వచ్చిన, నన్నుఁ జేకొన కునికి నీకు న్యాయమె చెప్పుమా.' 149

క. అనవుడు 'జితకాములమై, వనమునఁ దప మాచరించువారము మముఁ జే
రిన నీకు నిందు నయ్యెడు, ననుభవ మేటిది తొలంగు' మని పల్కుటయున్. 150

వ. అతని కయ్యతివ యి ట్లనియె. 151

క. 'జితకాము లెట్టివారలు, క్షితిఁ బురుషార్థములు నాలుగిఁటివలనఁ ద
ద్గతకాము లైనవారలు, జితకాముల మనినఁ గాముచే నగఁబడరే. 152

వ. కావున నీకు జితకామత్వంబు సిద్ధింప దది యట్లుండనిమ్ము నీవలన సంతానంబు
వడయ వేఁడి నేఁ డిట్లు నిన్నుఁ గదియవచ్చినన న్నియ్యకొనక యెన్నిపోకలం
బోయెద' వనిన నమ్మునీంద్రుండు దాని కి ట్లనియె. 153

తే. 'అతివ!సంతానకాంక్ష నీయందుఁ గల్గె, నేని యొకవర మిచ్చెద నీవు వోయి
సురతతంత్రంబు సలుపునీపురుషునందుఁ, గులమువెలయింప నోపెడుకొడుకుగలుగు.

ఉ. అంతటఁ బోక నీవు మదనాతురబుద్ధివయేని నిట్లు న
న్నింత యలంపనేల విటు లెందఱు లే రటు వోయి తృష్ణ స
న్నంతకు నుండు పొ'మ్మనిన 'నంగజసన్నిభ! నిన్నుఁ బొంది యేఁ
గొంత కృతార్థ నౌదు నని కోరిన నీ విటులాడఁ గూడునే 155

క. జాలిఁ బడి విటుల వెదకఁగ, నే లంజెనె? యిట్లు నిన్ను నిటు తగిలిన ని
ల్లాలితన మెల్లఁ బోయెనె?, యేలా తరితీపు చేసి యిట్లుడికింపన్.' 156

క. అని చెనకుచు నది తనుడా, సిన ముని గోపించి యోసి 'చెడుగ!వెఱపు నూ
లి ననుఁ గదియంగ వచ్చెదు, మునుకొని యీమందె మేలమున కోర్వఁ జుమీ.' 157

వ. అని యమ్మునీంద్రుం డెంత జంకించినం బోక యబ్బోటి లజ్జాభయంబు లుజ్జగించి
వెండియు ని ట్లనియె. 158

చ. 'పురుషులు లేరె లోకమునఁ బుట్టరు గాక భవత్సమాను లో
చిరతరపుణ్య! నిన్ దగిలెఁ జిత్తము మిన్నక పోవఁ డింక శం
బరరిపుఁ డేమి సేతు మగపాడి దలంపవు భామ లేడ ని
ష్ఠురవచనంబు లేడ దయఁ జూడఁ గదే యిదె నీకు మ్రొక్కెదన్.' 159

చ. అని కృప పుట్టఁ బల్కుటయుఁ నమ్ముని దానిఁ బరిత్యజింపఁగాఁ
బొనరెడుఁబట్టిదోషమును బొందఁగ నయ్యెడుదోషము న్మనం
బునఁ దలపోసి కోర్కి వృథవోవఁగఁ జేసిన దోష మంచు లో
ఘనముగ నిశ్చయించి మదిఁ గందఁగ స్రుక్కునఁ గీలెఱుంగుచున్. 160

క తమకమునఁ దానె పైకొని, రమణి తనదుకోర్కి దీర్ప రతితంత్రప్రౌ
ఢిమ నెఱపె నమ్మునీంద్రుని, యమితతపస్సర్వ మెల్ల నాఱడిఁ బోవన్. 161

చ. అడవులు చొచ్చి నిస్పృహుల మంచుఁ దపోధనముద్రఁ దాల్చి నా
కడిమికి లోనుగాక తిరుగంబడి యుండిన నుండనిత్తునే
సుడివడ వ్రేతుఁ గాక యనుచు న్మదనుం డిటు చేసె నాఁగ న
ప్పడఁతిమునీంద్రునిష్ఠకు నపాయ మొనర్చి యథేచ్ఛ మేఁగినన్.. 162

క. కలలోపల నైనను నస్ఖలితం బగుబ్రహ్మచర్యకర్మము తప్పన్
దలఁకొని మఱి యొండేదియుఁ, దలఁపనితన కిట్టికష్టదశ వచ్చుటకున్. 163

వ. చిత్తంబున రోసి యత్తాపసోత్తముండు. 164

సీ. 'కటకటా! నాపూర్వకర్మ మీభంగిఁ దపోహాని గావించి పోయెనొక్కొ?
యెవ్వరు తానిచోటిది యందు నుండ నవ్వనిత యెక్కడనుండి వచ్చెనొక్కొ?
వచ్చుఁగా కేమి నావలన నయ్యింతికిఁ గామవైకృత మేల కలిగెనొక్కొ?
దానిదుర్భాషలు వీనుల వినియు నప్పుడ పోక యేల లోఁబడితినొక్కొ?

ఆ. యింక నేమి సేతు? నేగతిఁ బోదు? నా, కీదురంతదురిత మెట్టు వాయు?'
యనుచు గంగనీట నవగాహనము చేసి, వెడలి వచ్చి ముచ్చముడిఁగియుండె. 165

ఆ. అంత నతనిశిష్యుఁ డత్యంతభయభక్తి.హృదయుఁ డొక్కఁ డచటి కేఁగుదెంచి
గురునియునికి చూచి పురపురఁ బొక్కుచు, నతనివనట కేమి గతియొ యనుచు. 166

చ. తనువు వడంక నమ్మునిపదంబులకుం బ్రణమిల్లి నాతఁ డా
తనిఁ గని యమ్మహాత్ముఁ డనుతాపము నొందుచుఁ గన్నునీరు గ్రో
బ్బన వెడలంగ 'వత్స! యొకపాపపుఁజాకితచేత నాతపో
ధనతతిఁ గోలుపోయితిఁ గదా' యని చెప్పె నెలుంగు దొట్రిలన్. 167

వ. ఇట్లు చెప్పి యప్పాపంబున నతిజుగుప్సాకరం బగుసూకరంబై తాను జన్మింప
వలయుంట యెఱిఁగించి మఱియు నిట్లనియె. 168

ఆ. 'అపరాహ్ణజన్మమం దొక్కనిమిషార్ధ, మైన నిల్వ నోర్వ నట్టివేళ
నోప ననక యొక్కయుపకార మొనరింపు, వలయు నంతవట్టుఁ దెలియనిమ్ము 169

క. ఈపురి నున్నకిరాతుని, యాపందికి నుద్భవించునర్భకములలో
రూపింప బొల్లినొసలై, యేపారినపిల్లఁ జూచి యెఱుఁగుము నన్నున్. 170

క. అది జన్మించినయప్పుడె, మది ననుమానంబు లేక మడియింపుము పెం
పు దలిర్పఁగ నంతటితో, నదయుం డగురజుని చేత లవి తుద ముట్టున్.' 171

క. అనునప్పలుకులు వీనుల,కును నిశితాస్త్రంబులై నిగుడ మూర్ఛితుఁడై
ముని బోధింపఁగ నతఁ డొయ్యన తెప్పఱి బాష్పపూరితాంబకుఁ డగుచున్. 172

క. తలయూఁచి యాతఁ డిట్లను, 'నలఘుతపోమహిమయందు ననదృశుఁడవు నీ
తల యెక్కడ దుర్జన్మముఁ, దలఁకొను టెక్కడ దురాగతము లిట్టివియే. 173

ఆ. ఎట్టిభంగి నున్న నే నీకుఁ జెయ్యెత్తి, మ్రొక్కువాఁడఁ గాక మొక్కలమున
నీకు హింస సేయుఁనిష్ఠురక్రియ కియ్య, కొనఁగ నేర్తు నయ్య గురువరేణ్య!' 174

వ. అనిన నతం 'డిది నాకు హితంబు సేయుటగాన హింసగా విచారింపక కైకొమ్మనిన
చెట్టకేలకు నతం డియ్యకొనియె నయ్యతీంద్రుండును గొండొకకాలంబునకు వియో
గంబు నొంది యప్పందిగర్భంబునందు రజకాంగనాసంగమంబునం దనకు సంభ
వించినదురితంబు గారణంబుగాఁ బ్రవేశించి పెరుగుచుండె నంత 175

క. ఆవేటవానియింటికి, నావడు గనుదినముఁ జనుచు నక్షత లిడుచున్
దీవించుచుండ నొకనాఁ, డావిధమున కతఁడు ప్రీతుఁడై యి ట్లనియెన్. 176

క. 'ఓయయ్య! నీవు నిచ్చలు, నీయెడ కి ట్లరుగుదేర నేటికి నాచేఁ
బోయెడుపని యేమి వెసం, జేయుదు నది యెద్ది నాకుఁ జెప్పుము తెలియన్.' 177

క. అనవుడు 'విను నీగృహమున, నొనరఁగ నొకచూడిపంది యున్నది దానిం
గొని వచ్చి మద్గృహంబున, నునుప వలయుఁ గొన్నిదినము లొక్కమనసుతోన్.

క. అంతట నది యీనఁగఁ ద, త్సంతతిలో నొక్కపిల్లఁ జండికకు నివే
దింతు మఱి యున్న యన్నిటి, నెంతయు వెసఁ దెచ్చికొను మహీనవివేకా! 179

మ. ఇది నాకోరిక నిన్ను నొం దడుగ నాకీయావి యొక్కండును
బదివే లిచ్చినకంటె నెక్కుడుగ నే భావింతు నీ నోపుదే
సదయాంతర్గతవృత్తి' నన్న నతఁ 'డోస్వామి! యొనర్పంగరా
నిదియే యిప్పని యిందు కొ'మ్మనుచు దానిం దెచ్చి యొప్పించినన్. 180

తే. అరసికొనియుండ నొక్కనాఁ డవ్వరాహ, లలన యీనుచో నిటలస్థలమునఁబొల్చు
తెల్ల మచ్చతో నొకపోతుపిల్ల యూడి, పడఁగనిదియె పొమ్మని దాని నడువఁదలఁచి.

ఆ. గుదియ చేతఁ బట్టుకొని మొత్తఁ జేయాడ, కునికి గొంతదడవు కనికరమున
నుండి యుండి యూరకున్నఁ బోదని తెంపు, చేసి వ్రేయఁ బూని చేరుటయును.

క. 'ఓహో! నిలు నిలు వ్రేయకు, మైహికసౌఖ్యానుభవము లందెద నే నీ
దేహమునఁ గొన్నిదివసము, లాహారికృపఁ బరమపదము కరిగెదఁ బిదపన్.' 183

ఆ. అనియె నాతఁ డంత నద్భుతస్వాంతుఁడై, 'యిందుఁ గలుగుసౌఖ్య మేమి' యనిన
సకలజీవులకును సదృశంబు కాదె ఖేదంబు దుఃఖమును సుఖంబు' ననియె. 184

వ. అని యతండు మఱియు నిట్లనియె 'నట్లును గాక నీవు పుట్టినయప్పుడ వధియింప
వైతివి కొండొక తడవు చేసితివిగావున నాయీశరీరరక్షామోహంబు సంభవించె
నిఁక నేమిసేయ వచ్చు సంశయింపక పొ'మ్మనిన విధికృతంబు కదా యని నగుచును
నక్కిరాతు పాలికిం జని యీసారెకు నాతలంపు సిద్ధింపదయ్యె మఱి చూచుకొందము
గాని వాని నన్నిటి నీయింటికి దెచ్చుకొమ్మనుచు నతండు నిజేచ్ఛం జనియె నమ్ముని
యును వరాహరూపంబున నాదివరాహధ్యానపరవశుం డగుచు నచ్చోటనే యుండె
నట్లుండ నొక్కనాఁడు. 185

చ. పరమకృపావిధేయుఁడును భక్తజనప్రియుఁడున్ సమస్తదు
స్తరదురితాపహారియును దానవవైరియు నైనవిష్ణుఁ డా
దరమున నొక్క నాఁ డతని దాసుఁడు గావునఁ జిత్తశుద్ధిచో
పురయుతలంపునన్ శబరుఁడై చనుదెంచె యథోచితంబుగన్. 186

సీ. ఆబోయవాఁడును నాపిల్ల జట్టిగాఁ గొని పట్టుకొనిపోయి కొండచెంపఁ
జాపువాఁడై కత్తి సంధించుకొని 'నీకు నిష్టదైవం బెవ్వఁ డిప్పు డతనిఁ
దలఁపు' మావుడు 'నాకుఁ దామరసేక్షణుం డక్షీణకల్యాణుఁ డక్షరుండు
లక్ష్మీశుఁ డీశుండు సూక్ష్మదృగ్గోచరుం డచలుఁ డచింత్యుఁ డవ్యయుఁ డనంతుఁ
ఆ. డాదిదేవుఁ డభవుఁ డవ్యాసుదేవుఁడు, దైత్యదమనుఁ డిష్టదైవ' మనిన
'నౌర! యితనిడెందమందు నామీఁదితా, త్పర్యబుద్ధి చెదరఁ బాఱ' ననుచు. 187

సీ. అడుగునఁ బ్రభవించునాకాశగంగతోఁ గటి నందమగుపీతపటముతోడ
భూతప్రపంచంబు పుట్టించుశిశువుతోఁ దనరారునాభిపద్మంబుతోడఁ
బదునాల్గు జగములు భరియించుకుక్షితో సిరికి నాస్పద మైనయురముతోడఁ
గన్నులఁ దోలుకాముకరుణారసంబుతో సుప్రసన్నాననస్ఫూర్తితోడ
ఆ. వైనతేయు నెక్కి పరభూషణప్రభా, జాల మెసఁగ శంఖచక్రకలిత
హస్తుఁ డగుచు నభయహస్తంబుతోఁ బొడ, చూపి నిలిచె దనుజసూదనుండు. 188

వ. ఇవ్విధంబున సన్నిధి చేసి యతనివరాహదేహం బపనయించి బ్రాహ్మణశరీరం బొసఁ
గిన బిసరుహనేత్రుం జూచి యానందబాష్పాకులనేత్రుండును బులకితగాత్రుండును
నగుచు నవ్విప్రుండు సాష్టాంగదండప్రణామంబులు చేసి చేతులు మొగిచి యి
ట్లని స్తుతియించె. 189

సీ. 'దేవ! లక్ష్మీధామ! దేవ! గోకులధామ! దేవ! సాగరధామ! దేవ! కృష్ణ!
దేవ! భక్తిప్రద! దేవ! ముక్తిప్రద! దేవ! సర్వప్రద! దేవ! విజయ!
దేవ! వేదప్రియ! దేవ! నాదప్రియ! దేవ! భక్తప్రియ! దేవ! యచల!
దేవ! దామోదర! దేవ! లోకాదర! దేవ! పద్మోదర! దేవ! యజిత!
ఆ. దేవ! నిఖిలదురితతిమిరప్రభాకర!, దేవ! సకలయోగిభావనీయ!
దేవ! దివిజగణవిధేయ! దేవ! సమస్త, దనుజనికరవిపినఘనకుఠార!. 190

సీ. జయ! పుణ్యసూచన! జయ! దుఃఖమోచన! జయజయ! గోవింద! జయ! ముకుంద!
జయ! కృపారసపూర్ణ! జయ! పయోధరవర్ణ! జయజయ! మధువైరి! జయ! మురారి!
జయ! కంసదారణ! జయ! మోక్షకారణ! జయజయ! భువనేశ! జయ! రమేశ!
జయ! లోకపావన! జయ! భక్తజీవన! జయజయ! గుణసాంద్ర! జయ! సురేంద్ర!

తే. జయ! సరోరుహాభవపూజ్యచరణకమల! జయ! నిశాకరరవిబింబచారునయన!
జయ! దశగ్రీవఖండనచండశస్త్ర!, జయ! విభీషణరాజ్యసంస్థాపనాంక!. 191

క. ప్రస్తుతవిభవ! నమస్తే, దుస్తరదురితాంధకారదూర! నమస్తే
హాస్తిహృదయభయహరణ! నమస్తే' యని యిట్లు బహునమస్కృతు లొదవన్.

చ. గొనకొని ప్రస్తుతించుమునికుంజరుభక్తికి మెచ్చి కృష్ణుఁ డా
ననమున సుప్రసన్నత ఘనంబుగఁ దోఁపఁగ 'వత్స! యిందు ర'
మ్మని తనుఁ జేరఁ బిల్చి మృదుహస్తసరోజము మస్తకంబుపై
నునిచి 'యభీష్ట మైనవర మొక్కటి వేఁడుము నీకు నిచ్చెదన్.' 193

తే. అనిన 'నే నీకు దాసుండ నగుదు నట్టి, నీవు నామీఁద వాత్సల్యభావ మెసఁగ
నిట్లు ప్రత్యక్ష మగు టిది యింతకంటె, వరము నాకెద్దియూహింప వనజనయన!'

వ. మఱియు నప్పురాణపురుషుతో నప్పుణ్యపురుషుం డిట్లను 'దేవా! భవదీయదివ్యనామం
బులు సకృదుచ్చారణానల్పఫలావహంబు లట్లయ్యును దదేకాసక్తచిత్తుండ నగు
నాకుఁ గష్టజన్మంబు వాటిల్లునట్టిదురితం బేమికతంబునం బ్రాపించె నానతి' మ్మనిన
నవ్వాసుదేవుం డి ట్లనియె. 195

క. 'ఆదేవత లాదానవు, లాదిగఁ గలభూతకోటులం దెవ్వరికిన్
నాదాసులఁ జెనకఁగ రా, దేదురితము నేమి చేసి యేక్రియ నున్నన్. 196

వ. ఏ నొక్కవిశేషంబు చెప్పెద నాకర్ణింపుము. 197

ఉ. ఎవ్వఁడు నన్నుఁ గోరి భజియించుటకై మదిఁ గాంక్ష సేయు నే
నవ్విహితప్రయత్నమది యాఱడిఁ బోవ ననేకవిఘ్నముల్
నివ్వటిలంగఁ జేసి యతనిం గడుఁ గాసి యొనర్తు నేమిటన్
నివ్వెఱపాటు లేనిచిరనిష్ఠఁ గనుంగొని యాదరింపుదున్ 198

వ. ఏ నొనర్చువిఘ్నము లెయ్యవి యంటేని. 199

సీ. కామాతురునిఁ జేసి కారింతు నొండేని ధనహీనుఁ గావించి దైన్యపఱతుఁ
బుత్రమిత్త్రాదులఁ బొరిపొరిఁ బెడఁబాపి బహుదుఃఖములపాలుపఱతు నొండె
కుజనసంగతి కియ్యకొల్పుదు నొండె నత్యంతదూషకునిఁ గావింతు నొండె
వేదమార్గము దప్పి వేఱొండుమతములఁ జిత్తంబు చెదరిపోఁ *జేతు నొండె
తే. మఱియు నేవెంట నైనను మనసుఁ గలఁచి, యతులవైష్ణవధర్మంబునందుఁ జొరవ
యీకపోఁ ద్రోచుచుండుదు నెవ్వఁ డైన, నిందు సుడివడుఁ గాని నన్ జెందలేఁడు.

ఉ. కావున నీవు మచ్చరణకంజము గాంచితి భక్తి నూని యే
త్రోవలఁ బోనిసెమ్మనముతో నెడ త్రిప్పనిపూన్కితో జగ

* చేతు నను ప్రయోగ మసాధువు.

తాపవన మైనయీపరమధర్మముఁ గైకొని యంతరాయముల్
వావిరి నెన్ని వచ్చినను వానికిఁ జిక్కక పెక్కుభంగులన్. 201

క. నను సేవింపఁగ నేమిట, నిను భేదింపంగ లేక నీచపుజన్మం
బొనరించితి నట్లైనను, మనసు గలఁగి నన్నుఁ గొంత మఱతువొ యనుచున్. 202

ఉ. ఏమిటఁ జిక్కువైతి నను నేమఱ వెప్పుడు నట్ల కాదె యే
భూమిని నన్నుఁ గొల్చుఘనపుణ్యుఁ డవాంతరపీడఁ బొందినం
బా మఱి స్రుక్కి లోఁబడునె భద్రగజేంద్రము నుక్కుత్రాళ్లచే
నోమునినాథ! కట్టుపడి యుండునె యింకిట వేయునేటికిన్. 203

చ. ఇతరు లనేకజన్మముల నేనియుం నీఁగఁగలేనిపాపముల్
చతురుఁడు మత్పరాయణుఁడు సర్వము నొక్కభవంబునందె య
ద్భుతముగ నిస్తరించు మఱి పుట్టఁడు గాన ఋణాయమానమై
క్షితి నొకయించు కైన నఘశేషము నిల్పుట కోర్వకుండుటన్. 204

వ. అది యెట్లంటేని పెక్కుతరంబులనుండి పెరడిగొనుచు ననల్పం బగుచునప్పులు బలుపు గలవానిం జొచ్చి కొంచెపుధనంబున తీర్చునట్లు మదీయదాసుండును మత్సత్వంబునం జేసి జన్మాంతరసహస్రంబులం గల్గు నశేషదోషంబు క్షణంబు లోననె నిరవశేషంబు చేసి ధూమరహితం బగువహ్నియుంబోలి నిష్కళంకుండై తేజరిల్లుచుండు నిది నీయడిగినప్రశ్నంబునకు నుత్తరంబు నీవికఁ దడవు సేయక నావెంట వైకుంఠపురంబునకు రమ్మనుచు నమ్మహానుభావుండు పరిజనసేవ్యమానుండగుచు విజయం చేసెఁ దదనంతరంబ. 205

ఉ. మానితధర్మనిర్మితవిమానముపై బహుమాన మొప్ప న
మ్మానివరేణ్యుఁ డుల్లసితమానవతీకరచామరోత్థమం
దానిలలీల మెచ్చుచు వియచ్చరు లచ్చరపిండుతోఁ బ్రస
న్నాననులై యెదుర్కొనఁగ నబ్జభవాదులు సంస్తుతింపఁగన్. 206

క. సురలు సుమవృష్టి గురియఁగ, మొరయఁగ గంధర్వనియతి మురజంబులు కి
న్నరమిథునంబులు పాడఁగ, హరిపురమున కరిగె నాతఁ డధికప్రీతిన్. 207

చ. మునివరుఁ డట్టె జ్ఞానియటె మున్ను జగంబుల మేలుఁ గీడునుం
గనుఁగొనియున్నవాఁ డటె యకంపితచిత్తుఁడు నట్టె యట్టివాఁ
డును నొకదుష్టజన్మము కడుక్ సుఖదం బని యుండెఁ గాక నె
ట్టన మృతిఁ బొందువానికి నొడంబడ నోపెనె పల్కునట్లకాన్. 208

క. అటుగాన సురభి! విను నీ, వటు పోయి 'యుపాయయుక్తి నడకించితిఁబో
కుటిలనఖచటులదంష్ట్రోత్కటశార్దూలంబు' ననుచుఁ గౌతుక మెసఁగన్. 209

ఆ. గుండె నిమురుకొనుచుఁ గొడుకుపాలికి నేఁగి, కడుపునిండఁ జన్ను గుడిపి నీవు
నెమరు వెట్టుకొనుచు నెమ్మది నుండు గా, కిచటి కేల వచ్చె దెఱిఁగి యెఱిఁగి. 210

క. *పఱకలచొప్పయ చాలును, మఱచియుఁ దలపొలముదిక్కు మసలెడిపనికిన్
వెఱతు నని పిఱికితనమున, నెఱి విఱుగుదు గాక సత్యనిష్ఠఁ దలఁపుదే. 211

క. ఆఁకొని యఱచెడిఁ బ్రేవులు, నేఁకట వో నమలవలయు నీమాంసము న
ట్లాఁక యిడి యివ్విధంబునఁ, దేఁకువ చెడి పల్కఁ దగునె ధేనువ! నాతోన్'. 212

వ. అనిన నప్పుండరీకంబునకు వివేకంబు లేదుగదే యని శోకంబు నొందుచు నాగో
కులరత్నంబు తనమనంబున ని ట్లని విచారించు. 213

చ. 'నను నిది యెన్ని చెప్పినను నమ్మదు దీనిమనంబులోపలం
బనుపడియున్నసంశయము పాపక పోవఁగ రాదు పోక చి
క్కినఁ దనయుండు నావలన గీఱిన ప్రేముడిఁ బ్రాణబాధఁ గూ
రినఁ గడుదోష మేఁ బరిహరించుట యెట్లొకొ వీని నన్నిటిన్.' 214

వ. అని విచారింపుచు నావ్యాఘ్రంబునకు ధేను వి ట్లను 'నే నిన్ను నొకకొన్నివేష
భాషలం బ్రమోషించి యట పోయి క్రమ్మఱ రాకుండుదు నని నను నమ్మనేర విది
సాధులక్షణంబె? యే నసత్యవచనురాలనె? 215.

క. ఒకయితిహాసము చెప్పెద, నకలంకత వినుము సూనృతాత్ములచరితల్
సకలాఘక్షయకరములు, సుకృతనిధానములు కర్ణశోభితలీలల్. 216

వ. అయ్యితిహాసం బెట్టిదనిన మగధదేశంబునందు శంబరుండనునొక్క మహీపాలుండు
పెద్దకాలంబు తనకు సంతానంబు లేక భూదేవతల రప్పించి పుత్రకామేష్టి
సేయింప నయ్యగ్నికుండంబువలన నొక్కతేజోమూర్తి యగుకొడుకును నొక్క
యధికస్వరూపిణి యగుకూఁతురుం బుట్టిన నయ్యిద్దఱకుం గ్రమంబునఁ బావకలో
ముందును మదనరేఖయు ననునభిధానంబు లొనరించి పెనుపుచుండ. 217

ఉ. పున్నమచంద్రుతోడ సరిపోల్పఁగ నయ్యెడుమోము లొప్ప ను
ద్భిన్నసరోరుహంబులగలిం జెలువొందెడికన్ను లొప్ప సం
పన్నవిలాసలక్ష్ములకు బాసటయై తనురోచు లొప్ప న
య్యన్నయుఁ జెల్లెలు న్మెఱసి రయ్యెలప్రాయపుసోయగంబులన్. 218

వ. అంత నయ్యిరువురు తండ్రినియోగంబున విద్యాభ్యాసంబు సేయుచు. 219

చ సదమలయుక్తిఁ జేసి గురుసన్నిధిఁ బావకరోముఁ డోలిఁ బ్రాఁ
జదువులు ధర్మసంహితయు సామజశిక్షయు నశ్వశాస్త్రముం

---

* పఱకల మేఁతయె-పాఠాంతరము.

* పఱకడ పొలమే చాలును, మఱచియుఁ దలపొలము దిక్కు మసలెదు పనికిన్; పఱకడి మేఁతయె చాలును. అనియు చి. ని. పాఠాంతరము.

బోదలెడు నస్త్రసాధనయు భూపతినీతియు గానవిద్యయున్
మొదలగువిద్య లెల్లఁ దుదిముట్ట నెఱింగెఁ బరిస్ఫుటంబుగన్. 220

క. అతనిసహోదరి యగున, య్యతివయుఁ దగఁ గావ్యనాటకాలంకార
ప్రతతు లోగి నభ్యసించుచుఁ, జతురతమై నుండె నొక్కసమయమునందున్. 221

సీ. నూఁగారుదీఁగెకు నూతనాలవాలమై తనరారునాభిరంధ్రంబుఁ జూచి
సుభగత్వలక్ష్మికి సోపానమార్గమై రమణీయ మగువళిత్రయముఁ జూచి
యౌవనశబరుచే నమరుమారెడుపండ్లక్రియ నంద మగుకుచద్వయముఁ జూచి
ముఖచంద్రమండలంబునఁ దోఁచునమృతపూరముభంగి మధురాధరంబుఁ జూచి
తే. గురుతనూజుండు మనమునఁ గోర్కి నిగుడ, దోడిశిష్యుల నందఱ వీడుకొలిపి
వనిత నేకాంతమందిరంబునకుఁ దెచ్చి, కదియ వచ్చిన నది వానికళ లెఱింగి. 222

చ. 'ఇటు తగునయ్య! విప్రుఁడ వహీనగుణాఢ్యుఁడ వీవు నీకు నే
మిటి కిటువంటిదౌష్ట్యము శమించునె మజ్జనకుండు విన్నఁ ద
క్కటిజను లేమి యంద్రు మదిఁ గాంక్షయె కల్గిన నగ్నిసాక్షిగాఁ
జిటికెన వట్టి కాక వృథ సేయుట ధర్మమె కన్యకాత్వమున్. 223

క. పడఁతికిఁ గన్యాధర్మం, బెడలినఁ గొఱ యగునె వెండి యెవ్వరికైనం
గడివోయినపువ్వులు మఱి, ముడుచునె రసికుఁ డగువాఁ డమోఘవివేకా. 224

ఉ. కావున నీవు న న్గదియఁ గారణ మేమి తొలంగు' మన్న నా
భూవిబుధుండు 'నీవు నను బొందక పోయెద నన్న మైమెయిం
బోవఁగ నేల నిత్తు' నని పూని నృపాత్మజ నంటఁబట్టి వ
స్త్రావరణంబుఁ బుచ్చుటయు హస్తము చాఁచి విదల్చివైచుచున్. 225

చ. 'తలతల మంచివాఁడవు గదా! గురుపుత్త్రుఁడ వంచు నిన్ను నోఁ
బలుకక యున్న నీగతిని బాడి తొఱంగెదు చాలుఁ జాలు మా
టలపని యేల వేగిరపడం బనిలే దబలుండ! యింటివా
రల కెఱిఁగించి నీచెనఁటిరంతులు సర్వముఁ జక్కఁ జేసెదన్.' 226

క. అని పలికిన మఱి యేమియు, నన నేరక మోము వంచి యవ్విప్రుఁడు దాఁ
బెనువ్రేల నేల వ్రాయుచుఁ, దనకొంగుచు విడువకున్నఁ దత్సతి మఱియున్. 227

క. 'కొంగేటికి విడువుము మును, ముంగలి వెడలంగ వెఱతు ముగ్ధుఁడ! నీకీ
వెంగలితన మెట్లొదవె న, నంగవికృతి సూప నర్హమా నాయెదురన్.' 228

చ. అని కడుఁ దూలవోఁ బలుక నగ్గురుపుత్త్రుఁడు మూర్ఛ నొంది మే
దిని కొఱగంగ నవ్వనిత దిగ్గనఁ బట్టి నిజాంకపీఠ మా
తని కుపధానమై వెలయఁ దా నొనరించి మొగంబు చూచి ము
క్కునఁ బవనంబు లేమికి దిగుల్పడి కుత్తుక యంటి చూచుచున్. 229

క. 'అక్కట! నాగురుపుత్త్రుం, డెక్కటిఁ గోల్పడితి నెద్ది తెఱఁగో విప్రుం
డెక్కడి కెక్కడఁ దలఁచెను, దుష్కరణోన్మాద మింత తీవ్రం బగునే. 230

క. గురుపత్నిఁ జంద్రుఁ డమ్మని, పరపత్నిఁ ద్రివిష్టపైకవల్లభుఁడు పరా
శరుఁ డోడరేవుపడఁతిని, మరుగుటఁ గనువేఁదు ఇతరమర్త్యులవశమే. 231

తే. నాకుఁగా నీతఁ డిట మరణంబు నొందె, నేని నా కెంతపాపమో యిప్పు డితని
కోర్కి దీర్చితి నేని నాకులములోన, నెంత హీనత వచ్చునో యేమి సేతు. 232

వ. అని చింతించి యొక్కయుపాయంబు గావించి, 233

క. తోడ చఱచి పేరఁ బిల్చుచు, నొడికంబుగఁ గరసరోజ మురమున నిడుచున్
వెడఁగదలు తెప్పశోడగని, పడఁతుక యొకకొంత డిందుపడియెదువగలోన్. 234

క. 'అనఘా! యిది యెంతటిపని, విను నాదెస నీకు నింత వేడుక గలదేఁ
గను దెఱచి చక్కఁ జూడుము, మనలో మన కింత గలదె మతిహీనుఁడవై. 235

క. నవ్వితి వైనను గాకే, నివ్విధ మిట్లెఱుఁగుదును మహీసుర! విను నే
నొవ్వంబలికితిఁ గరుణను, ద వ్వగుపని సేయు నేను ధర్మేతరనే.' 236

చ. అనిన నతండు నావలన నాదరణంబు తలంచి యిట్లు పే
ర్కొనియెదు గంటి మంటి నని గొబ్బున గన్నులు విచ్చి చూచి పై
కొనఁగఁ దలంచినం గుసుమకోమల తత్తఱపాటులేని నె
మ్మనమున విప్రుఁ జూచి 'యిటు మానుము నీ కిఁక వేగ మేటికిన్. 237

క. ఏ నొక్కటి నిను వేఁడెద, దానిం గాదనక నీవుఁదలకొని చేయం
గా నోపిన విద్వద్వినుతా! నీచిత్తంబుఁ బట్టుదానఁ బ్రియమునన్.' 238

వ. అనిన నవ్విప్రుండు దమకించి. 239

క. 'ధనమైనఁ బ్రాణమైనను, వనజానన! యేను నీకు వంచింతునె యే
పని యైన నడుగు మిప్పుడ, యొనరించెద' నవిన నప్పయోరుహముఖియున్. 240

క. 'ధన మడుగఁ బ్రాణ మడుగ, న్విను పరిణయ మైనపిదప నే నీయెడకుం
జనుదెంచి కాని మత్ప్రియుఁ, డెనయఁగ నేఁ బొంద నాకు నీవర మీవే.' 241

చ. అనుటయుఁ 'బాపు బాపు నను నాసలపా లొనరించి నెమ్మదిం
జనువెర వె ట్లెఱింగితి విచారవిమూఢున కైన నీవు ప
ల్కినపలు కియ్యకో లగునె? లేమ! వనంబున జున్ను రేఁచి తి
య్యనిమధుపాన మొల్లక రయంబున నొందులపాలు సేయునే. 242

చ. అది యటు లుండె నీ విచటి కప్పుడు వచ్చెద నంటివో నినుం
గదలఁగ నిచ్చునే విభుఁడు కానిప్రసంగము లేల నీవు నా

తుది నఱలేక వచ్చుటకుఁ దొయ్యలి యెవ్వరు పూట యంతకుం
బదిలము నిల్వ లేను మరుబారికిఁ ద్రోవక నన్నుఁ గావవే. 243

క. అని గురుపుత్త్రుఁడు పలికిన, విని యానృపపుత్త్రి యింత వెఱ్ఱివి గలవే
యనుమాన మేల నీతోఁ, బనివడి యిటు పల్కఁబొంకఁ బాడియె నాకున్. 244

వ. అనిన నతం డయ్యింతి కిట్లనియె. 245

క. 'నుడివినయట్టులు దప్పక, నడుచుట యిది పిన్నపనియె నాతులమాటల్
వడగండ్లగుండ్లు జలనిధి, కడళ్ళ మొత్తములు భిన్నఘటతోయంబుల్. 246

ఆ. వర్షధార లెన్న వచ్చు గంగావాలు, కలు గణింప వచ్చు గగనవీథి
వెలుఁగుతారకములఁ గొలఁది వెట్టఁగ వచ్చుఁ, గాని సతులమనసుఁ గానరాదు. 247

క. యాదృచ్ఛికసురతంబును, జూదంబున గెల్వఁబడినసొమ్మును నుతో(క్రి)
శాదులు నప్పటికప్పుడ, కాదే మఱి దుస్సిపోవుఁ గాక నిలుచునే. 248

క. ఈవేళ తప్పిపోయిన, నావల నొకనాఁడు వత్తు ననునది నిజమే
నీ వెంత చెప్పినను మ, ద్భావము నమ్మ' దని యతఁడు దాఁ బల్కుటయున్. 249

సీ. 'నారాక సిద్ధము నమ్ము నీ' వని పెక్కుభంగుల శపథముల్ పలికి యబల
'విను మిదె యామ్నాయవిదుఁ డైనవిప్రుఁడు ధర్మప్రజార్థమై తగినకన్య
నరసి పెండిలియాడ నరుగుచో విఘ్నంబుఁ గావించుపాపానఁ బోవుదాన
నప్పుడు రాకున్న' నని పల్కఁ'బోఁబోలు' ననియె నాగురుపుత్త్రుఁ డట్ల పలికి
ఆ. యరిగె రాజపుత్త్రి మరుసాయకము గుఱిఁ, దూఱ నాఁటి తిరిగి దొనకు నేఁగు
నట్లు నిర్వికారయానంబుతోఁ గీర్తి, సదన మైనతండ్రిసదనమునకు. 250

వ. అంత నయ్యింతికిం దంత్రి యనురాజకుమారుండు వరుండై ప్రథమసంగమోత్సవ సముత్సుకం బగుమనంబున దూతికాజనంబులం బనుప వార లచ్చెలువం బిలువం బోయిన. 251

ఆ. ఆనృపాలపుత్త్రి యాదటఁ గైసేసి, యతనుపాలి కరుగురతియ పోలె
నరిగి యరిగి మున్ను గురుతనూజునితోడఁ, బల్కినట్టికడిఁదిబాసఁదలఁచి. 252

చ. మదిఁ దలపోసి' యాగురుకుమారునితో నలనాఁడు మత్పతిం
గదియుటకంటె మున్ను నినుఁ గానఁగ వచ్చెద నమ్ము మంటి నీ
యదన నితండు నన్నుఁగవయ న్గతుకంబునఁ బిల్వఁ బంచె నా
కదియుఁ నవశ్య మిప్పనియుం నర్హమ యెయ్యది యాచరింతునో. 253

సీ. విప్రుపాలికిఁ బోయి వేగ వచ్చెద నన్న నృపదూతికల నాకు నిల్పరాదు
మగనికోరికి దీర్చి మఱివత్తు నని యేను జనిన నసత్యదోషంబు వచ్చు

నీపూట దప్పించి యెల్లి చూచెద నన్నఁ బలివేడ్కఁ జెఱుచుట పాడిగాదు
పతితోన చెప్పి యీపని యొనర్చెద నన్న నెఱుఁగరా దాతనిహృదయసరణి

ఆ. ధర్మసూక్ష్మ మెవ్విధము దుర్బలప్రబ, లంబు లెఱిఁగి నిశ్చయంబుసేయు
వార లెవ్వ రిచట వ్రాత్రుచ్చి యొకరితోఁ, జెప్పరాదు త్రోపు సేయరాదు'. 254

వ. అని డోలాయమానమానస యగుచు నమ్మానవతి ధర్మస్థితికిం బతియనుమతియ ముఖ్యగతిగాఁ దనమతి నిశ్చయించి యంద యరుగుదెంచిన. 255

సీ. స్మరచాపముక్తమై చనుదెంచినట్టి మోహనసాయకంబొ యీవనజగంధి
వారుజాటముననుండి యరుగుదెంచినయట్టిచంద్రబింబమొకో యీజలజనయన
యంబరస్థలినుండి యరుగుదెంచిన యట్టిక్రొమ్మెఱుంగొక్కొ యీకోమలాంగి
యుద్యానతరులలోనుండి వచ్చినయట్టియెలదీఁగయొక్కొ యీయిగురుఁబోఁడి
తే. యనఁగ నత్యంతసౌకుమార్యమునఁ బేర్చి, చిత్తమున కింపు నింపునచ్చెలువఁ జూచి
నయనకరసంజ్ఞ నానరనాథతనయుఁ, డెగిచి తనపాన్పుమీఁదికిఁ దిగిచికొనియె. 256

క. పతితల్పంబున నిట్లా,సతి నిడి దూతికలు తొలఁగి చనిరి ప్రమోద
స్థితవదన లగుచు నొక్కొ,క్కతె నల్లనఁ బఱటికొనుచుఁ గదురభసమునన్. 257

తే. అంత నయ్యింతి తనయంతరంగమందు, నతఁడు తనుఁ బొందఁ బైపడునంతకంటె
మున్న యీమాట వినిపింప కున్నఁ గార్య, మనువు పఱచుట దుస్తర మని తలంచి.

ఉ. చెప్పఁగఁ జూచి సిగ్గువడుఁ జెప్పఁగఁ జెప్పకయున్నఁ దీర దేఁ
జెప్పెదఁ గాక యంచుఁ దగి చెప్పఁ దలంచు నిదేమి మాటగాఁ
జెప్పుదుఁ జెప్పినం బతియుఁ జిత్తమునం గలుషించునో పరుల్
చెప్పెడువార్త కా దనుచుఁ జెప్పఁగఁ బూనుచు జెప్పఁ గాదనున్. 259

క. అప్పడఁతి యివ్విధంబున, ముప్పిరిగొనుసంశయంపుముంపునఁ బతి కేఁ
జెప్పక యిది మఱియెవ్వరు, చెప్పెదరని చెప్పఁజూచుఁ జెప్పఁగ వెఱచున్. 260

ఆ. అట్ల కాదె ముగ్ధ యటె క్రొత్తపెండిలి, కూఁతు రట్టె మగఁడు లాఁతి యట్టె
యదియుఁ బ్రథమసంగమాసన్న వేళటె, సిగ్గుపేర్మి వేఱ చెప్పనేల. 261

క. అవి యన్నింటిని మిగులదె, భువి నెందును లేనియితరపురుషప్రారం
భవిచారము పతియెదురన, యవమానపుఁబనిని నాలు కాడునె తడవన్. 262

వ. ఇట్లు విచారించి యెట్టకేలకుఁ దెంపు చేసి. 263

క. సజ్జ దిగి దిగక నెగడెడు, లజ్జకడఁక యుజ్జగించి లంబాలకయై
యజ్జనపతి యెదుటను యో, షిజ్జనరత్న మిది యేమి చిత్రం బనఁగన్. 264

వ. సాష్టాంగనమస్కారంబు చేసి ముకుళితకరాంబుజయై యున్న యత్తెఱవ తెఱంగెఱుం గక వెఱఁగుపడి తనకెంగేలం బట్టి లేవనెత్తి యాలింగనంబు సేయుచుఁ దల్పం బుమీఁదికి రాఁ దిగిచి యతం డిట్లను 'మృగాక్షీ! యేను భవదీయలక్షణపరతంత్రుం డ నగుట యెఱుంగక కదా యిట్లు చేసితివి. 265

ఉ. ఏనుఁగు లశ్వముల్ సురభు లింతులు సద్భటకోటి రత్నసం
తానము ధాన్యహేమరజతంబులు వస్త్రము లాదిగా నిజా
ధీనము లైనవస్తువులు దేజ మెలర్పఁగ నీవశంబు కాఁ
బూని యొనర్తు నేపనికిఁ బుచ్చినఁ జెచ్చెర నిర్వహింపుదున్. 266

గీ. అడుగు' మనవుడు 'నితఁ డిట్టు లనుటయుఁపుడు, నాదుభాగ్యాతిశయమునఁ జొదకలిగె'
ననుచు హర్షించి యబ్బాల యానృపాల, తిలకుమీఁదఁ గటాక్షదీధితులు వొలయ.

వ. 'దేవా! యే నొక్కవిన్నపంబు చేసెద నదియుక్తం బైన నయుక్తం బైన నీ కనుగ్ర హింపక పోరా దవధరింపు' మని యతనిచిత్తంబునకుఁ గినుక వొడమకుండునట్లుగా నల్లనల్లనం జెవికిఁ జల్ల నగునట్లు మృదుభాషావిశేషంబుల నగ్గురుపుత్రు నభిలాష యుం దనదగుసరోషప్రతిభాషలకు నోడి యతండు వాతాహతభూజంబునోజ నేలం గూలుటయు నకారణంబున బ్రహ్మహత్య సిద్ధించె నే నేమి సేయుదు నని తల్లడించి యతని బోధించుటకునై తత్సమయసముచితవచనంబుల నుపచరింపం బెద్దయుం బ్రొద్దునకు నతండు దైవాధీనంబునం జైతన్యంబు నొంది క్రమ్మఱఁ దనలోఁబరిచర్య సేయందలంచినప్పు డప్పాపు దప్పింప నొండువెరవు దొరకొనమిఁ దా నట్లాడంబడి యెడపల్కినవిధంబునుం జెప్పి యప్పొలంతి మఱియు ని ట్లనియె. 268

సీ. 'సుదతి కన్యాత్వవిచ్యుతి పొందు టపకీర్తిగాని పత్యనుమతి నైనకర్మ
మట్లైన మేలని యే నప్పు డతనికిఁ బరిభావ చేసితిఁ బార్థివేంద్ర!
యిప్పు డాపరిభాషఁ దప్పిన దోషంబు ప్రాపించు నలి కైనపాతకంబు
పలిఁ బొందు నని చెప్పఁబడు నట్లుగావున వినిపింపవలసె నీవివర మెల్ల

తే. నింక నిటమీఁద నీచిత్త మెట్టులుండె, నటుల చేసెద నానతి' మ్మనిన నాతఁ
డుల్ల మత్యంతచింతాపయోధి మునుఁగ, శిరము గంపింపఁ జేసి యచ్చెరువు నొంది.

క. అతివలు సాహసకర్మిణు, లతిమాత్రము వారిబుద్ధి యట్లై యునికిం
జతురాననునకు నైనను, సతుల గెలువరాదు సహజసామర్థ్యమునన్. 270

క. ఎఱిఁగి యెఱిఁగి యొరుపాలికిఁ, దెఱవఁ బనుచుపనికి సమ్మతింపదు చిత్తం
బఱిముఱి లసత్యదోషము, పఱతెంచుట సిద్ధ మెట్లు పనుపక యున్నన్. 271

క. ఎయ్యది కర్తవ్యమొకో, యియ్యెడ నాలోచనమున కెవ్వఁ డొకో తో
డయ్యెడువాఁ డీకార్యము, వయ్యము గాకుండఁ జేయవలయు వెరవుతోన్. 272

చ. అని తలపోయుచుఁ భర్తకుఁ బ్రియంబున ని ట్లను 'నింత నీమనం
బున ననుమాన మేమిటికిఁ బుచ్చుఁ దలంచిన నన్నుఁ బోయిర
మ్మను మటు కాక నీవు వలదన్నను మానెద సత్యనిష్ఠతో
నెనయఁగ రాదు సుమ్ము మఱి యెన్ని తపంబులు నీజగంబునన్. 273

క. ధల మెల్లఁ బొలియునంతటి, పని పుట్టిన నాలి బిడ్డఁ బాసి నిరాశన్
జనునట్టి నెడరు పుట్టిన, జనుఁ డేమఱకుండ వలయు సత్యవ్రతమునన్. 274

క. తొల్లి హరిశ్చంద్రమహీ, వల్లభవల్లభుఁడు సత్యవాక్యము ధరణిం
జెల్లించె నతనివర్తన, మెల్లజగంబులఁ బ్రసిద్ధ మెఱుఁగమె కథలన్. 275

వ. అది యట్లుండె నింక నొక్కవిశేషంబు. 276

క. అతివలమాయలు పెక్కులు, పతుల మొఱఁగఁ దలఁచిరేని పట్టఁగ వశమే
పతిభక్తినిరత లగున, య్యతివలు కైకొనరు గాక యాదుర్గుణముల్. 277

క. పతి దన కేడుగడయగాఁ, బతియానతి మాఱఁ బూని పతిచిత్తం బే
గతి నుండు నట్ల మెలఁగెడు,సతి గల్గినఁ బుణ్యగతి సుసాధ్యము పతికిన్. 278

వ. ఇట్లు నడవక.

చ. పెనిమిటిఁ దిట్టుచున్ సతులఁ ద్రెల్పుచుఁ బందులు గీటుకొంచు స
జ్జనుల నిరాకరించుచు నసత్యము లాడుచుఁ గన్నవారితో
డన కలహించుచున్ జొరనితావులు చొచ్చుచు విందు వీడు వ
చ్చినఁ దలయంటఁ గట్టుకొని జిఱ్ఱునఁ జీఁదుచు బిట్టు మూల్గుచున్. 280

చ. తనకడుపార ముగ్గడిచి తా నొకనాఁడును గూటిపొంతఁ బో
వనియదివోలె మోము దిగవైచుచు నూరకె కాళ్లు లీడ్చుచున్
పనరుచు నింటివాకిటికి వచ్చినవారలముందటం దగం
బనివడి లేమి చెప్పుచు నభాగ్యుఁడు వీఁడని భర్త దూఱుచున్. 281

ఆ. భాండశుద్ధిలేక పరగ దేవాతిథి, పూజనములపొంతఁ బోక నీచ
వర్తనమున మెలఁగువనిత ప్రాణేశున, కుభయలోకహాని యొనరఁ జేయు. 282

క. కావునఁ బురుషుల కెందును, భూవల్లభ! మేలుఁ గీడుఁ బొందించుటకున్
భావింప ముఖ్య హేతువు, లావనితాజనుల కాక యన్యులు గలరే. 283

ఆ. అధిప నానిమిత్తమై నీకుఁ బాపంబు, సంభవించుపనికిఁ జాలఁ గాన
నింత చెప్పవలసె నింక నీతలఁ పెట్టి, దట్ల చేయుఁడాగ నానతిమ్ము.' 284

చ. అనవుడుఁ బాపభీతుఁ డగు నానరనాథుఁడు నాతిఁ జూచి 'నీ
కనితరసాధ్య మైనపరమార్థ వివేకము కల్మిఁ జేసి యె
ట్లనినను జెల్లు నీపలికినట్టుల పంతము దీర్చి రమ్ము పొ'
మ్మనుడు నమస్కరించి గృహ మల్లన వెల్వడి నిర్వికారతన్. 285

చ. అనిమిషకన్యయో దితిసుతాన్వయకన్యయొ వీథు చూడవ
చ్చినవనకన్యయో యనఁగఁ జెన్నెసలారుచు నిండి సాంద్రమై
ఘన మగుచీకటిం గుసుమగంధి నిజాభరణప్రభావలుల్
దన కటు త్రోవ చూపఁగ ముదంబున నొంటియె యేఁగుచుండఁగన్. 286

సీ. మింటికి నేలకు నొంటికంబము నిల్పిన ట్లూర్ధ్వకాయ మత్యద్భుతముగఁ
బరగుదిగ్భిత్తులపైఁ జేవదూల మెత్తినభంగిఁ జేబార యనువుపడఁగ
ఘనమేఘమున వానకాళ్ళు వ్రేలినమాడ్కి ముక్తకేశంబులు ముసుఁగుపడఁగ
నుఱుముచుఁ దళతళ మెఱచుచందంబున గర్జతో మిఱుమిట్లు కడలఁ ద్రోప
ఆ నంధకారమునకు నధిదైవమో యన, బొగ్గురాచి కలయఁ బూసినట్లు
నల్లచాయతోడ నాతికిఁ బొడచూపె, రాచవీథి నొక్కరాక్షసుండు. 287

క. ఆరాక్షసుఁ గట్గొనియును, నారాజీవాక్షి యంతరంగమునఁ బలిం
గోరి తలంచుచు వెఱవక, బోరనఁ జనుచుండ దనుజపుంగవుఁడు మదిన్. 288

క. వెఱఁగుపడి యెట్లొకో యిటు, వెఱవనిచందంబు దీనివిధ మేర్పడఁగా
నెఱుఁగ వలయు నని వెస డగ్గఱఁ జని వస్త్రాంచలంబు కరమునఁ బట్టెన్. 289

ఉ. పట్టిన నేమియుం దిగులుపాటు మదిం బొరయంగ నీక యా
కట్టెఁడిదైత్యుఁ జూచి 'యనఘా! తగువాఁడవు కావె నీవు నన్
బట్టుట ధర్మ మయ్య! పరభామఁ బతివ్రత నేను నన్నుఁ దోఁ
బుట్టువుగాఁ దలంచి వెసఁ బోవిడు మంకిలి సేయ నేటికిన్.' 290

ఆ. అసిన నాతఁ డప్పు డమ్ముగ్ధపలుకువి, దగ్ధభావ లద్భుతంబుఁ జేయ
నర్ధరాత్ర మెచటి కరుగుచున్నది దీని, వర్తనంబు దెలియ వలయు ననుచు. 291

ఉ. 'ఎవ్వరిదాన వీవు? కుల మెయ్యది? యెయ్యది నీదు పేరు? నీ
కెవ్వఁడు భర్త? యొంటి నిటు లెవ్వనియింటికి మధ్యరాత్ర మి
వెవ్వరుఁ గానకుండ వెస నేఁగెదు? నా కెఱిఁగింపు' మన్నఁ దా
నవ్వుచు నిర్వికారవదనంబున వానిమొగంబు చూచుచున్. 292

సీ. 'మాతండ్రి యంబిరుఁ డాతనిసతి యైనకుంభిని మాతల్లి గుణగరిష్ఠ
దైనపావకలోమఁ డన్న రాచకొలంబు మాయది నాపేరు మదనరేఖ

నాధర్త తంత్రిభూనాథుండు నేఁ జనుపనియంను జెప్పెద వినుము తెలియ'
నని తన్ను గురుపుత్రుఁ డాసించుటయుం వాని కపుడు దాఁ బల్కినశపథగతియు

ఆ. భర్తచే ననుజ్ఞ వడసి యిప్పుడు వానిఁ, గానఁబోవుచున్నదాన ననియు
విచ్చి చెప్పె వెలఁది విని దైత్యుఁ డి ట్లని, పలికె నతికఠోరభాష లెసఁగ. 293

ఉ. 'ఎక్కడిపేదపాఱుఁ డిల నెక్కడినీపరిభాష నేఁడు ని
న్నక్కడి కేఁగు మంచు వెలయాలినిఁ బోలె వివేకహీనుఁడై
తక్కక యేమిగాఁ బనిచెఁ దంత్రివిభుం డివి యట్లు లుండె నేఁ
జిక్కినవాఁడ నాఁకట భుజింపఁగ నిమ్ము భవచ్ఛరీరమున్.' 294

వ. అనిన విని బెదరు గదురనిమదితో నమ్మునిత యాయదయహృదయున కి ట్లనియె.

తే. 'కడఁగి యుదరాగ్నియార్చుటకంటె నెక్కు,డైనసుకృతంబుగలదయ్య యసురవర్య
యోర్చియుండు నీయాఁకలి దీర్చుదాన,నరిగి యిచ్చటనున్నట్ల తిరిగి వచ్చి.' 296

ఉ. నావుడు 'మేలుమే లబల! న న్నిట వెఱ్ఱులఁ బెట్టి నెమ్మదిం
బోవఁగఁ జూచె దీ వగునె బుద్ధివిహీనుఁడఁ గాను మోసపోఁ
బో విబుధు ల్పహోయ మయి పూని కడంగిన సంగరంబునన్
జేవ యడంచి పుత్తు నిను జెండి భుజింతును మాంసఖండముల్.' 297

క. అని దనుజుఁడు ధట్టించిన, వనజానన పల్కు 'నంతవాఁడవు గాదే
నిను నిప్పుడు గాదంటినె, విను యుక్తాయుక్తపదవివేకము వలదే. 298

క. అరయఁ బెద్దలు దుష్టా,హారము గొన రెట్టిచోట నవ్విప్రునితో
నారీతిఁ బల్కి బొంకిన, నీరోఁతశరీర మెట్టు లింపగుఁ జెపుమా. 299

ఉ. ఆతనిపాలి కేఁగి యనృతావ్యయదోషముఁ బొందకుండ సం
ప్రీతునిఁగా నొనర్చి సుచరిత్రత యొప్పఁగ నిందు వచ్చి ని
ష్పాతక మైనమే నొసఁగఁ బంచిన వేడ్కి భుజింతు గాక ధ
ర్మేతరునట్లు నీ కిచట నేటికి నిట్టివృథావివాదముల్.' 300

చ. అనవుడు దైత్యుఁ డి ట్లనియె 'నాడినయట్టుల చేయువారలుం
బనివడి మున్ను గొన్నటుల పైకొని యప్పులు దీర్చువారలుం
బొనరిన మేలుగీడులకుఁ బొంగక క్రుంగక యుండువారలున్
మనుజులలోన నుత్తము లమర్త్యులు మెత్తురు తచ్చరిత్రముల్. 301

ఆ. అట్టిమనుజు లుర్విఁ బుట్టరు పుట్టిన,యేని నెందుఁ దఱచు గానఁబడరు
వెల యెఱుఁగరాని విపులార్ఘరత్నము, లుదధియందు నొదిగియున్నయట్లు. 302

వ. కావున సూనృతవ్రతనిరతు లగుట దుర్లభం బదియును గాక. 303

క. బొంకుల కెల్లను మూలము, పంకజముఖు లట్టినిష్ఠుఁ బాటిగఁ గొనిరక్
గ్రుంకిడి యరుగుదు గాకే, వంక మరలి చూచి చేర వాలాయంబే,' 304

వ. అనినం జిఱునవ్వు నవ్వుచు నవ్వనిత యి ట్లనియె. 305

చ. 'ఒకఘటికాద్వయంబుపని కూరక యింతవిచార మేల? యిం
చుక యిటు నిల్చి నానిజము చూడు నిశాచర! భూమి తోయపా
వకపవనాంబరంబులు దివంబులు రాత్రులు సాక్షి సాదుమా
టకు నిది గాక నీమన సొడంబడ నే శపథంబు సేయుదున్.' 306

వ. అనిన నమ్మగువకు రక్కసుండు వెక్కసపడి యి ట్లనియె. 307

క. 'నడిరేయి నిదురముంపున, నొడ లెఱుఁగక యున్నయతని నుగ్రగతిం బై
పడి పొడుచుక్రూరనరుఁ డేఁ, గెడుగతి కేఁగెదు సుమీ మగిడి రా కున్నన్.' 308

చ. అనవుడు నట్ల కాక యని యాసతి విప్రునియింటి కేఁగి య
ల్లన నతఁ డొంటి యొన్కిఁ బదిలంబుగఁ జూచి సమీపమందు ని
ల్చినఁ గని బిట్టబిట్టః దనచిత్తము జల్లన మోముఁ దేఱికోఁ
గనుఁగొని 'యింతప్రొద్దిటకుఁ గామిని రాఁ గత మేమి?' నావుడున్. 309

క. 'విను మెఱిఁగి యెఱిఁగి నీ వి, ట్లనఘా! న న్నడుగ నేల యలనాఁటం గో
లెను నీకోర్కికి మీఁదె, త్తినవాయావనము నుద్ధృతిం గనుఁగొనవే.' 310

చ. అనవుడు నద్దిరన్న మగనాలవు రాజతనూజ నీవు మ
జ్జనకునిశిష్యురాలవు పొసంగునె యెంతకు నెత్తికొంటి యో
వనిత! నమశ్శివాయ తగువారలబిడ్డలు నిట్టినీచవ
ర్తనముల కియ్యకొందురు గదా యిటువంటివె పో ప్రమాదముల్. 311

క. కులహానియుఁ గులవృద్ధియుఁ, గులవనితలు మెలఁగునట్టికుచరిత్రములం
బొలు పగుసుచరిత్రములం, దలకొనుఁ గాక మఱియెవ్విధంబునఁ గల్గున్.' 312

చ. అనవుడు నవ్వధూటి హృదయంబునఁ గొండొక లజ్జ నొంది యీ
యన యొకశిష్టువోలె నిటు లాడెను వీనికి మాఱు పల్కకుం
డినఁ దగ దంచు ని ట్లనియె డెందము చందము నీకు నెట్లొకో
కనుఁగొన వల్లనాఁడు తమిగాంచి ప్రబుద్ధుఁడ వైతె యింతలోన్. 313

క. ఎఱుఁగనివారియెదుర బలె, నఱిముఱి మెఱమెచ్చుమాటలాడఁగ నేలా
నెఱవాది వగుదు నీలా, గెఱుఁగమె మునిముచ్చుఁదనము లేమిటి కింకన్.' 314

చ. అనిన నతండు 'నీవు మనుజాధిపనందన వెట్లు పల్కె న
న్నివనఁ గలవాఁడఁ గాక మఱి నీ కెదు రుత్తర మేనుఁ జెప్ప నే

ర్తునె యిట్టులైన మమ్ము నృపతుల్ తగువారలు సాదరించు టె
ల్లను వృథ గాదె నామదిఁ గలంపక పొమ్మని పల్కెఁ బల్కినన్. 315

క. విని యితఁ డెయ్యదియు నెఱుఁగనిముగ్ధుఁడు వోలెఁ బల్కెఁ గాఁ దొడఁగె మనం
బున నింతయేవ గల్గిన, నను మును బాసగొనఁ గారణం బేమి యొకో. 316

తే. కుక్క దగురూప మెక్కించుకొనినపిదప, మొఱుఁగకుండినఁ బోవ దిత్తఱి నితండు
తొడఁగి తా నొకధీరచిత్తుండ వోలె, నన్నుఁ జులుకఁ గాఁ బలుకుచు నున్నవాఁడు.

వ. నాఁటిభాషాపాశంబులం దగిలి యత్తగులు దీర్చుకొనవచ్చిన నిచ్చపలస్వాంతుం డెంతయు నెఱుంగఁ డయ్యె నే నింతయుదాసీనంబున కోర్తునే యెట్టివాఁడును నీసు పుట్టింపక కలంగఁడు కలంగినంగాని కార్యంబు తేల దని యూహించి వాని కవ్వనిత యి ట్లనియె. 318

సీ. 'సన్న్యస్తచిత్తులసంసర్గఁ గరకకాయలు కొన్ని సమలితో యంతకంత
కశనంబు దఱిఁగి దేహము క్రొవ్వు చెఱచితో యిల్లాలికన్నుల కింత వెఱతొ
యిటునటుఁ బోనని యేయింతికైనను బాసలు చేసితో బలిమిగాను
వీథులఁ దిరుగంగ వెసఁ దలారులు పట్టి కొజ్జాను జేసిరో సజ్జవారి

ఆ. యూర కేల నన్నుఁ జేర వింత విరక్తి, పరుఁడ వెట్లు నన్నుఁ బట్టి పెనఁగి
తల్లనాఁడు నాఁటియుల్లంబుపొగరు నేఁ, డెందుఁ బోయె మదనుఁ డేమి యయ్యె.

క. అటుగాక దుష్టనిగ్రహ, పటుబాహాబలుఁడు నాదుభర్త యగుట న
న్నిట నీవు గడియ నోడెదొ, కటకట మగతనము లేదుగా నీయందున్. 320

క. వెఱవకు మల్ప్రియునకు ని, త్తెఱఁ గెఱిఁగించి మఱియరుగుదెంచితి నీ వీ
పిఱికితన ముడిగి నను డ, గ్గఱుమా పోవలయు నాకుఁ గడుఁ దడ వయ్యెన్.' 321

ఉ. నావుడు సాధ్వీజుండు 'మును నా కటు చేసినబాస దప్పి కి
ట్లీవనజాక్షి వచ్చి తగ నిప్పుడు నెట్టుకొనం దొడంగె నే
నేవిధిఁ ద్రోచువాఁడఁ బరమేశ్వర ! మారవికార మెత్తి యా
త్రోవకుఁ జొచ్చితి న్మొదల దోసముగాఁ గొని యిప్పు డోడెదన్.' 322

చ. అనుచు నృపాలపుత్రిపదనాబ్జము గారవ మొప్పఁ జూచి 'మ
జ్జనకుఁడు నీగురుం డగుటఁ జామ సహోదరి వీవు నాకు నే
రనిపని చేసి నాఁ డటులు రాగ మెలర్పఁగ నిన్నుఁ గొంగు వ
ట్టినదురితంబువాయుటయె డెప్పర మైనది యంత చాలదే. 323

క. నీవంతము చెల్లించితి, నీపలికడ కేఁగు మింక నీసూనృతని
ష్ఠాపారీణత జగమున, దీపించుం గాక సంస్తుతికిఁ బట్టగుచున్.' 324

క. అని దీవించిన నవ్వుచు, వినయంబున మ్రొక్కి యతని వీడ్కొని వేడ్కన్
జనుదెంచె బాల యేలొకొ, చనిరాదని దనుజుఁ డాత్మ సంశయపడఁగన్. 325

వ. అట్లు చనుదెంచినయారాజపుత్రి నిర్వికారభావంబు నిరీక్షించి యారాక్షసుం
డి ట్లనియె. 326

ఆ. 'తావి గొననిపువ్వుదామంబువిధమునఁ, జిదుముఁ బడనిమావిచిగురు భంగిఁ
ద్రావఁబడనినవసుధాధారపగిదిని, దెలుపఁ జూడ సురతచిహ్న లేదు. 327

క. ఇతరు లెఱింగినఁ దిరిగితొ, యతఁ డచ్చట లేఁడొ నీవు నతనికి మాటల్
గలిగూడక యుండిన వచ్చితొ యంతయు నున్నరూపు చెపుమా నాకున్.' 328

వ. అనిన నయ్యసురకు నబ్జసరుహనేత్ర యిట్లను 'నీ విప్పుడు చెప్పిన యంతరాయంబు
లెయ్యవియు లేవు మద్భాగ్యనిమిత్తంబున నతనిచిత్తంబు ధర్మాయత్తం బగుటయు
నావెఱ్ఱి దిరిగి సహోదరింగా నన్ను మన్నించి మరలించిన నీయాఁకలితీర్చుటకు
నతిత్వరితంబున నిటకే తెంచితి. 329

గీ. ఇంకఁ దడవు సేయ నేటికి నసురేంద్ర!, జిహ్వా తృప్తితో భుజింతు గాక
నాశరీర' మనుచు నాతి యాతనిసమ్ముఖమున నిల్చె ముఖవికాస మెసఁగ. 330

క. నిలిచినఁ గని వెఱఁగందుచుఁ, దల యూఁచి కరాంగుళంబుఁ దనముక్కుపయిం
జెలువుగ నిడుకొని 'దానవకులమున నేఁ బుట్టి చెనఁటికుక్షికిఁ గాఁగన్. 331

ఉ. చంపితిఁ బెక్కుజంతువులఁ జాన! భవత్సము లైనసత్త్వవా
క్సంపదఁ గల్గువారిఁ బొడగాన దురాత్ముఁడ నైననాకు సి
ద్ధింపక యున్నె దుర్గతి సుదృష్టి యెలర్పఁగ శుద్ధదేహిఁ గా
వింపఁ గదమ్మ! నన్ను' నని వేగమ వ్రాలెఁ బదద్వయంబుపైన్. 332

వ. ఇట్లు వ్రాలిన. 333

క. 'అన్నన్న! యేలయిటువలె, నన్న! మిగులఁ బ్రొద్దు వోయె నాఁకొని కృశమై
యున్నాఁడ' వనుచు నెత్తెఁ బ్రసన్నవదన యగుచు హస్తజలజాగ్రమునన్.

క. ఎత్తిన లేచి కరద్వయ, మెత్తి లలాటమున మోపి యిందుముఖీ య
త్యుత్తమధర్మపథమునకు, నుత్తునిఁ గావించి కార్యయుక్తిఁ దెలుపవే. 334

క. విను నీసూనృతనిష్ఠయుం, ఘనుఁ డగునీమగనిపెంపుఁ గడపట నవ్వి
ప్రునివైరాగ్యంబును నా, మనమునకుఁ బ్రమోదరసనిమగ్నతఁ జేసెన్. 335

వ. కావున నాకు ధర్మోపదేశంబుచేసి పురాకృతదుష్కృతంబులకు నిష్కృతి గావింపు
మనిన నవ్వనిత యిట్లను 'నీవిప్పుడు క్షుత్పీడితుండవై యున్నవాఁడ వస్మదీయదే
హం బాహారంబుగాఁ గొని తృప్తుఁడవై మఱి నీ వెవ్వరిచేతనైనను నుపదేశంబు
గొనుము శరీరమాద్యంఖలు ధర్మసాధనం బనుట వినవే' యనినఁ జెవులు మూసికొని

యతండు 'తల్లీ! నీ విట్లానతిచ్చుట యుచితంబె భవత్సాన్నిధ్యంబు నాభాగ్యవిశేషం
బునం బొడమె నాయొక్క తీఁగె నుడివడకుండ నీవిమలవాక్యజాలం బనుప్రాఁకు వెట్టి
ప్రోదిసేయుదు గాక యుపేక్షించుట రక్షకులలక్షణంబె' యనిన నాదనుజేంద్రు
నకు మనుజేంద్రనందన యి ట్లనియె. 336

క. 'రక్కసు లెక్కడ ధర్మం, బెక్కడ దయయారి కరయ నేత్రోవ మనం
బెక్కడికి నీడ్చె నీడ్చిన, యక్కడి కరుగంగ నైన యట్లయ్యెఁ దుదిన్. 337

క. అది గాక ధర్మమార్గము, వదలక చనుబుద్ధి నీకు వాలాయంబై
యొదవిన నెట్టనఁ దగఁ జె,ప్పెద విను' మని చెప్పఁ దొడఁగె బింబోష్ఠి యొగిన్.'

ఉ. 'బొంకకు మెన్నఁడున్ దనుజపుంగవ! శాంతి వహించి యుండు మే
వంకను జీవబాధ లగువాని నొనర్పకు శౌచివై గతా
హంకరణుండవై ఘనదయామతివై విజితేంద్రియుండవై
పంకజనాభదివ్యపదపంకజభక్తిపరాయణుండవై. 339

ఉ. నెమ్మది నుండు నీకు నిది నేమ మిహంబుఁ బరంబుఁ గోరువా
రిమ్మహి నెవ్వరేనిఁ బరమేశు రమారమణీశు యోగిహృ
త్సమ్మతు సర్వలోకహితు సచ్చరితు న్మదిఁ గొల్వ రట్టివా
రెమ్మెయి నైనఁ గానఁ గలరే కలదే మఱి దిక్కు వారికిన్. 340

క. హరిభక్తివిరహితుం డగు, నరుఁ డసురాంశంబువాఁ డనంగను విందుర్
హరిభక్తి గల్గెనేని న,సుర యైనను దేవతాంశజుం డనఁ బరగున్. 341

వ. తొల్లి ప్రహ్లాదవిభీషణాదు లగునసురపుంగవులు హరిభక్తినిరతు లగుటం జేసి
యెంతెంత వా రైరి వా రిప్పుడు రాక్షసు లనవచ్చునె వైష్ణవధర్మంబునకు సాత్త్విక
గుణంబు ప్రధానం బగుఁ గాని కులంబు ప్రధానంబు గాదిది పరమరహస్యం బని
యుపదేశించి నాయొడఁబాటు చెల్లెఁ బొమ్మని మరలించి ఘుతని వీడ్కొని చూ
డ్కులు దళుకొత్త నత్తన్వి నిజేశుపాలికిం జనియె నయ్యసురయు నదిమొదలుగాఁ
గ్రూరకర్మంబులు విడిచి హరిచరణస్మరణంబ శరణంబుగాఁ దపంబు చేసి వైకుంఠ
ప్రాప్తుం డయ్యె నయ్యింతి యిట్లు సని తంత్రి భూనాథునకుఁ దనపోయివచ్చిన వృ
త్తాంతం బాతయుం జెప్పిన విని యతండు దనయతిసూనృతోక్తియు బ్రాహ్మ
ణునివిరక్తియు నసురవరునిభక్తియుం దలపోసి సంతోషించుచుండె నంత నయ్యురు
పురయంతః కరణశుద్ధికి మెచ్చి శ్రీవిభుండు. 342

సీ. ఉభయపార్శ్వంబుల నొగిఁ జంద్రబింబంబు సూర్యమండలమును శోభితముగ
నొక దొడ్డచక్కయు నొకయింద్రధనువును నేకదేశంబున నింపెలర్ప.

నిడుపారి వెడలుపై నెఱిఁ జుట్టి వచ్చినసౌదామనీసముచ్చయము దనరఁ
దనరున నీలాంబుదం బుర్వి కేలొకో చను దెంచె నన శంఖచక్రములును
తే. కౌస్తుభంబును వనమాలికయును మెఱయఁ, బీతవస్త్రంబుతోఁ బురుహూతనీల
కాంతిఁ దనువొప్ప నత్యంతకరుణ నంబు,జాక్షుఁ డాదంపతులకుఁ బ్రత్యక్షమయ్యె.

గీ. ఇట్లు ప్రత్యక్ష మగుటయు హృదయవీథు,లందు భయభక్తిసంభ్రమహర్ష రసము
లంతకంతకు నుప్పొంగ నవనతాంగు,లై నమస్కృతు లొదంద యాచరించి

చ. కరములు మోడ్చి హర్షపులకంబులప్రోవు లనూనగద్గద
స్వరములపుట్టినిం డ్లనఁ బ్రవర్ధిత బాష్పజలంబు కాలువల్
భరితవిలాసవల్లికలపాదులు నా నతిరమ్యమూర్తులై
పరగుచు నవ్వధూవరులు ప్రస్తుతి యి ట్లని చేసి రవ్విభున్. 345

సీ. 'ధూర్జటిమౌళికిఁ దొడ వైన పన్నీటియే యంఘ్రికలమునఁ బాఱె నేని
భువనైకకర్తయై పొల్చుబాలునిఁ గన్న వెలిదమ్మిబొడ్డున మొలిచె నేనిఁ
బరిగణింపఁగరాని బ్రహ్మాండనికరంబు నుదరదేశంబున నుండె నేని
సంపత్ప్రదంబులై సొంపారుచూడ్కులయలనాగ యురమున నిలిచె నేని
తే. ధ్రువు విభీషణుఁ బ్రహ్లాదు ద్రుపదపుత్త్రిఁ, గాచినట్టి ప్రభావంబు గల్గె నేని
గాక నినుఁ బోలువేల్పు లేలోకమందు, నూర కేల కల్గుదురు పయోరుహాక్ష! 346

క. నీకంటెఁ బరము లేదు వి,వేకింప ముకుంద! వేదవేద్యులు నీదీ
వ్యాకృతి ప్రతిదివసము నా,లోకింపుదు రంతరంగలోచన శక్తిన్. 347

క. నినుఁ దలఁప నెల్లదురితము,లునుఁ బొలియు దవానలంబులో వైచినమె
త్తనిదూది వోలె నిన్నుఁ, గనుఁగొన్నఫలంబు చెప్పఁగా నేల హరీ! 348

క. కోరికల కెల్ల నెక్కుడు, కోరిక యగు మోక్షలక్ష్మిఁ గోరక యైనం
జేరును భవదీయపదాం,భోరుహములు నమ్మియున్న బుధులకుఁ గృష్ణా!' 349

చ. అని కొనియాడుదంపతుల కాజగదేకగురుండు ప్రీతి ని
ట్లను 'మహి నేరికిం బడయ నబ్బనిసూనృతనిష్ఠ మీమనం
బునఁ జలియింప నున్కిఁ గృప పుట్టె వరం బొక టిత్తు వేఁడుఁ డీ'
రనిన మహాప్రసాద మని యచ్యుతలోకము వేఁడి రిమ్ములన్. 350

ఉ. వేఁడిన నట్ల కాక పృథివిం జిరకాల మభీష్టసౌఖ్యముల్
ప్రోడిగ మీరు గాంచి మఱి పొందెద రద్ధతి' నంచుఁ జెప్పి యా
వేఁడివెలుంగు లోలిఁ బదివేలసహస్రము లున్నభంగి నె
వ్వాఁడు వెలుంగు నట్టిబుధవత్సలుఁ డేఁగె నదృశ్యమూర్తియై. 351

క. ఆరమణీరమణులు నిం, పారఁగ బహువత్సరంబు లైహికసుఖముల్
గోరి యనుభవించి తుదిన్, జేరిరి హరియందు సుప్రసిద్ధము గాఁగన్. 352

ఉ. కావున సత్యవాక్యము జగంబున నెక్కుడవ యండ్రు సర్వధ
ర్మావళియందు నిట్టిసుమహత్త్వమునం గలసూక్ష్మధర్మ మేఁ
బ్రోవఁగఁ ద్రోతు నయ్య చెడఁ బొందికగాఁ గ్రియమాలి యంచు న
గ్గోవు ప్రియంబునం బులికిఁ గొంకక చెప్పినచంద మంతయున్. 353

చ. గొనకొని బ్రహ్మరాక్షసునకున్ మనుజేశ్వరనందనుండు చె
ప్పె ననుచు సిద్ధపుంగవుఁడు ప్రీతి జనింప నుపన్యసించె భో
జున కని యత్రిపుత్రుఁడు విశుద్ధచరిత్రుఁడు విస్తరించినన్
విని మహుఁ డంతరంగమున వేడుక తీఁగె లెలర్ప నిట్లనున్. 354

ఆ. "ఇంత యొప్పునయ్య యితిహాసచాతురి, శ్రుతిసుఖంబు నాత్మహితము నగుచు
జాదులును హరిప్రసాదంబు నైన నే, చంద మిదియు నట్టిచంద మయ్యె." 355

వ. అని కొనియాడి 'తదనంతరకథా ప్రసంగం బెట్టి'దని యడిగిన. 356

ఉ. కారణసింహవక్త్ర! యలికస్థితచారునిమీలితాక్ష! శృం
గారరసాధినాయక! యఘప్రకరాంధతమోనిరాసనీ
రేరుహమిత్ర! దానవసరీసృపభంగవిహంగరాజ! వృ
త్రారిముఖాష్టదిక్పతిసదార్చితపాదసరోరుహద్వయా! 357

క. అద్వంద్వ! యప్రతర్క్య! జగద్వంద్య యనాదినిధన! గర్వితదితిపు
త్రద్విపసింహకిశోర! నిమద్వరజదళాయతాక్ష! సన్మణివక్ష! 358

తోటకవృత్తము. ధరణీధర! నిర్జితదైత్యవరా!, శరణాగతరక్షణ! చారుగుణా!
సురయూథసమర్చిత! సూరియుతా!, పురుషోత్తమ! శాశ్వతపుణ్యతమా! 359

గద్యము. ఇది వాణీవరప్రసాదలబ్ధవాగ్విభవ తిక్కనామాత్య సంభవ సుకవిజనవిధేయ అనంతయనామధేయ ప్రణీతం బైనభోజరాజీయం బను కావ్యంబునందుఁ బుష్పగంధి రత్నమండనులవిరహతాపంబును మూషకోపాఖ్యానంబును బ్రాహ్మణమాహాత్మ్యంబును రత్నమండనువివాహంబును బ్రహ్మరాక్షసగ్రహణంబును గోవ్యాఘ్రసంవాదంబును రజకాంగనాసంగమంబును వరాహజన్మప్రాప్తియుఁ దన్నివృత్తియును మదనరేఖ సత్యవ్రతనిరతియుఁ దదుపదేశంబున దైత్యుండు ధర్మచిత్తుండై వైకుంఠప్రాప్తుం డగుటయు నన్నది చతుర్థాశ్వాసము.

113

శ్రీ

భోజరాజీయము

పంచమాశ్వాసము

శ్రీదేవీవక్త్రసరసిరు
హాదిత్య! సమస్తదేవతార్చితవిలస
త్పాదాంబుజ! శ్రీమత్తుల
సీదళదామాభిరామ! శ్రీనరసింహా! 1

వ. అవధరింపుము దత్తాత్రేయమునీశ్వరుం డానరేశ్వరున కిట్లనియె నట్లాభోజరాజు
నకు సర్పటిసిద్ధుండు వినిపింప రత్నమండకకథాలతకుం బాయుఁగాన యగుగోవ్యాఘ్ర
సంవాదంబునందు మదనరేఖచరిత్రం బిప్పుడు చెప్పంబడియెఁ దదనంతరప్రసంగం
బాకర్ణింపు మయ్యితిహాసంబు చెప్పి యప్పుశురత్నం బాపులివక్త్రంబు చూచి 'నీవు
'నన్ను నమ్మ కునికిం జేసి యిట్లు సత్యవ్రతోదాహరణంబు చేసితి నింక నేమి
సేయుదుఁ జెప్పు' మనిన. 2

చ. అనితరసాధ్యసత్త్వ మగునవ్వనసత్త్వము గోవుఁ జూచి యి
ట్లను 'నిపు డీవు చెప్పినమహామహిమం గలపుణ్యురాలికిన్
దనరఁగ నగ్రజన్ముఁ డగుధన్యుఁడు పావకలోముఁ డెట్టివ
ర్తనములవాఁడు? వానిసతి దా నది యెట్టిది? నాకు జెప్పుమా!' 3

చ. అనవుడుః జెప్పెద న్వినుము మృగాధిప పావకలోముతండ్రికిం
జనవరియైనమంత్రి జనసన్నుతుఁ డొక్కసువర్ణకారకుం
డనయము వానికిం దనయుఁడై గుణహీనుఁ డొకండు కుంభి నాఁ
జనునతఁ డగ్నిలోమునకు జానగుచిష్టసఖుండు మేదినిన్. 4

క. ఒకనాఁ డయ్యిరువురు నుదితకుతూహలవృత్తిఁ జేసి ధనువులు నస్త్ర
ప్రకరములు దాల్చి నగరాంతికవనవాటికలఁ గేళిఁ దేలుచు నుండన్. 5

క. హయములు గరులును రథసంచయమును వివిధాతపత్త్రచామరములు నై
పయనపుసిరి యుజ్జ్వలముగఁ, బయిఁ దెరువున నరుగుభూమిపాలశ్రేణిన్. 6

వ. కని తద్వనప్రాచీనోపాంతంబున నిల్చి సమీపవర్తు లగుజనంబులం బిలిచి 'వీర లెవ్వ?
రేపని కెట పోయెద? రెఱింగింపుఁ' డనిన వార లిట్లనిరి. 7

చ. 'వనధిగభీరుఁ డొక్కఁ డజవక్షుఁడు నాఁ గలఁ డాతఁ డున్కి నా
ట్యనగర మానరాధిపప్రియాంగన మేఖల దానికాఁతు పే
రనుమతి తత్స్వయంవర మహోత్సవనిరీక్షణకౌతుకంబునన్
జనియెద రిమ్మహీపతులు సైన్యసమన్వితులై రయంబునన్. 8

చ. అరయఁగ నెల్లి సూర్యునుదయంబుపయిన్ ఘటికాద్వయంబునం
బరిణయలగ్న మేతడవుఁ బట్టదు తద్విభవంబు చూచి వే
మరలఁగ వచ్చు మీరుచు గుమారవయస్కు లరివ్వనంబులోఁ
దిరుగఁగ నేమి సిద్ధి యరుదెం డిది యుక్తము గాదె' నావుడున్. 9

క. రాకొమరుఁడుఁ గుంభియుఁ నా, భూకాంతులతోడ నాట్యపురి కేఁగిరి భూ
లోకవిహారముఁ గోరి ది, వాకరశశధరులు గూడి వచ్చి రనంగన్. 10

వ. అప్పు డప్పురంబునందు. 11

సీ. వజ్రదీధితులు భాస్వద్ద్వారి పూరంబు భూషణోత్థితరజఃపుంజ మిసుక
ధవళనీలారుణాతపవారణములు సితాబ్జనీలోత్పలహల్లకములు
నింద్రనీలపుఁ జేరు లిందిందిరశ్రేణి శస్త్రాస్త్రరుచులు మత్స్యవ్రజంబుఁ
జలితచామరములు కలహంసములు మణిద్యుతులు రక్తాబ్జసంతతులు గాఁగ
తే. నెలమిఁ దత్స్వయంవరమున కేఁగుదెంచి, యున్న రాజన్యసమితిచే నొప్పు మిగిలి
యుండె నారాజమార్గంబు నిండుఁగొలని, భంగిఁ గలమంజులాలాపబహుల మగుచు.

వ. అయ్యవసరంబున. 13

సీ. అజవక్షుఁ డొకయంత్రహంసంబుఁ దెప్పించి యాహంసయుత ననర్ఘ్యరత్న
మయ మైనపదకంబు నయమునఁ గీలించి యొక సౌధవేదిపై నునిచి తనదు
తనయ శృంగారించి కొని వచ్చి యాపక్షిమీఁద నెక్కింప నామృదులహస్త
హస్తాబ్జమునఁ దారహారంబు శోభిల్ల నఖిలమర్త్యులకుఁ బ్రత్యక్ష మైన
ఆ. వాణివోనికీరవాణి: పీనశ్రోణి, నలినినీలవేణి నలరుఁబోణి
నట్టు లెత్తి చూచి రందఱుఁ దమతమ, నయనవిస్తృతు లాగి బయలుపడఁగ. 14

క. ఆవేళ నమ్మహీపతు, లీవనజదళాయతాక్షి యిఁక నెవని కగున్
భావింప నతఁడ తగుఁ బో, భావజసామ్రాజ్యపట్టభద్రుఁడు గాఁగన్. 15

క. అనువారు నవ్వధూమణి, తనక తనక యబ్బు ననుచుఁ దప్పరులైక
న్గొనువారు మనుజలోకం, బున కిచ్చెలువంబు క్రొత్త పొమ్మనువారున్. 16

వ. ఇత్తెఱంగునం దమతమచిత్తంబుల కెట్లు దోఁచె నట్ల పలుకుచున్న యన్నరనాథ
లోకంబు నాలోకించి సారాసారవివేకదక్షుం డగునజవక్షుండు సకలమహీభార

భరణసమర్థం బగు తనహస్తం బెత్తి కలకలంబు వారించి వారి కిట్లనియె. 17

ఉ. 'అంబరవీథి నీకృతకహంసిక వాఱఁగ దానికంఠభా
గంబునఁ బొల్చురత్నపదకం బొకదివ్యశరంబునందు లీ
లం బడినేసి యాక్షితితలంబుపయిం బడకుండఁ బాణిప
ద్మంబునఁ బట్టు నేనృపుఁ డతండు వరుం డగు మత్తనూజకున్.' 18

క. అని పలికినంత విప్రులు, మును పెట్టినపుణ్యలగ్నమున హంసం బా
వనితావతంస మగున, య్యనుమతి మోదికొని పాఱె నంబరవీథిన్. 19

చ. తడఁబడ నప్పు డొండొరులఁ దాఁకుచు దిగ్గన లేచి విండ్ల నె
క్కిడియెడువారు నెక్కిడక యేయఁ దొడంగెడువారు నెద్దియుం
దడవక విండు లెత్తి బెడిదంబుగ మీఁదికి వైచువారు సం
దడిఁ బడ లేక పాసి యుచితస్థితిఁ జూచుచు నుండువారలున్. 20

క. మిడుతలగతి సురగరువలిఁ, బొడమిన కారాకుగములపోలికి ఱెక్కల్
వడసినభుజగంబులకై, వడిఁ దఱుమఁగ నమ్ము లేయువారును దివికిన్. 21

చ. గొనకొని రాజు లేయుశరకోటి పరస్పరఘట్టనంబులం
దునుకలు ప్రక్కలీసెలు చిదుర్పలు తుత్తుమురై పడంగ నె
వ్వనికిని నిల్వరాక నలువంకలఁ బాఱెడువారు వారణం
బున దురగంబుఁ జాటుగొనఁ బోయెడువారును భీతచిత్తులై. 22

క. ఈతఱచుటంపగము లా, నాతిఁ దగులకుండ ము న్నొనర్చిన గేహీ
భూతరచన గడుమెఱసెం, బో తిరముగ ననుచు మెచ్చి పొగడెడువారున్. 23

క. వడి గల్గి హంసగతికిం, గడవఁ బఱచువారు నదియ గతిగా నాసల్
విడిచి తమతమపురంబుల, కెడపక చనువారుఁ దిరిగి యేసెడువారున్. 24

సీ. అజనత్ముఁ డేమిగా నఖిలభూపతుల రప్పించి మాయలు పన్ని చేలుపఱచె
నరపతుల్ సింహాసనస్థులై యుండఁగ నోలి నొక్కొక్కనియూరుఁ బేరుఁ
గులమును బలమునుఁ దెలియఁ జెప్పఁగఁ దనమనసు వచ్చినవాని మగువఁ గోరు
నిది స్వయంవరమార్గ మిటు సేయ నొల్లక యందఱ నడకించె నౌర వీఁడు

ఆ. వీనిఁ జుట్టుముట్టి వీనిప్రాణంబులు, గొనక పోవ మనుచుఁ గినియువారు
నింత సేయ నేల యిది రాచపాడిగా, దనుచుఁ బ్రాభవమున నరుగువారు. 25

వ. ఇవ్విధంబున నవ్వసుధేశు లందఱుం దమతమకన్నగతిం బోవనటఁ బోవుహంసం జూచి
రాచతనంబునకు నీచత రాకుండ నింతట నూహాపోహంబు నెఱపవలయు నని సముద

సామజగమనంబున సతి గడవం బోయి విక్రమాభిరాముం డగుపావకలోముండు.

సీ. ధనువుక్రిందటికొమ్ము ధరణిపై మోపి మీఁదటికొమ్ము వామహస్తమునఁ బట్టి
తత్తఱపడక తద్దండమధ్యంబు దక్షిణజానుకరములఁ జేసియొత్తి
యపసవ్యకరమున నయ్యెక్కుఁ గదియించి ప్రియమున నారి సారించి చూచి
ధరణియు నభము దిక్తటములు నొక్కటఁ దల్లడపడ గుణధ్వని యొనర్చి
తే. శరము సంధించి దృష్టి లక్ష్యమునఁ గూర్చి, సీలఁ బుచ్చినలీల నక్కీలు ప్రిదుల
నేసి నేలపైఁ బడకుండ నెయిది పట్టి, పక్షమునఁ దాల్చెఁ బదకంబు నాక్షణంబ.

క. ఆలీలావాంసమునకుఁ, గీ లప్పదకంబ యనఁగ క్షితితలమునకున్
వ్రాలె నది యతనిదృగ్రుచి, జాలంబున కింపుఁ బెంపుచాతుర్యగతిన్. 28

ఉ. అంబరవీథి నాఁడు ఝషయంత్రము నేసినక్రీడిఁ దొల్లి మో
దం బలర స్వరించుద్రుపదక్షితిపాత్మజభంగిఁ బ్రీతిపూ
ర్వంబున నగ్నిలోమజనవల్లభునిం దగఁ జేరి వానికం
ఠంబున వైచెఁ గాంతినిబిడం బగుహారము రాజపుత్రియున్. 29

గీ. అంత నక్కుంభి తనయాత్మ నింత లేసి, రాజు లిట్లైరి తనతరమా జయంబు
గొనఁగ వ్యర్థుఁడై పోయెఁ గాకనుచుఁ గొంత, తడవునకువచ్చె నారాజతనయుకడకు.

ఉ వచ్చి కృతఘ్నుఁ దష్టు నిడువాలికకన్నులు ముద్దుమోము నే
యొచ్చెము లేనిదేహలతయుం గలకోమలిఁ జూచి లోలుఁడై
యెచ్చట మోసపుత్తునొకో యీనృపపుత్రుని నెప్పుడొక్కొ యే
నిచ్చపలాక్షి నెత్తుకొని యేఁగుదు నా కిర వైనచోటికిన్. 31

క. అని యూహించుచు మిథ్యా, వినయంబును రిత్తనగవు వెడమ్రొక్కులపె
ల్లును దక్కరిమాటలతఱచును నాఱడిసంభ్రమంబుఁ జూపె సఖునకున్. 32

చ. అతఁ డవి కృత్రిమంబు లని యాత్మ నెఱుంగక నిత్యసౌహృద
స్థితిఁ జెలికానిఁ జూచి 'యిటు చేకుఱె నాకు ననర్ఘ్యరత్నశో
భిత మగునవ్విభూషణముఁ బ్రేమరసోదయహేతువైన యీ
యతివయుఁ' నంచుఁ జెప్పె దరహాస మెలర్పఁగ నెమ్మొగంబునన్. 33

క. చెప్పిన విని 'దేవా! నీ, కిప్పుడు రాఁ బ్రాప్త మైనయివి యెవ్వనికిం
దప్పింప వశమె బ్రాతిగఁ, జెప్పుదు నిఁకఁ గూర్చి యేమి చిత్రము చెపుమా.' 34

చ. అని కొనియాడి యిప్పు డితఁ డాదట నప్పురి కేఁగె నేనిఁ ద
జ్జనపతియుం బ్రధానులును సర్వజనంబులు వీనియూరుఁ జే

రు నెఱిఁగిపోదు రప్పు డొకరుండును నైకొనకుండు నన్ను మ
న్మనమున నున్న యిప్పని యొనర్చుటకు న్మఱి సందు లేదగున్. 35

క. అటుగాన యీకుమారునిఁ, గటిఁగాలకఁ జొప్పు దప్పఁ గొనిపోవక యుం
డుట కార్యము గా దనుచుం, జొటచొటఁ గన్నీరు దొరుఁగఁ జుట్టమపోలెన్. 36

ఉ. పావకలోముఁ జూచి పెనుఁబాటు మొగంబునఁ దోఁపఁ గుంభి శో
కావిలచిత్తునట్లు మెల పాఱఁగ నిట్లను 'రాచవారలుం
దేవులు నిందు నీవు చనుదెంచు టెఱుంగరు చెప్పి రాము వే
పోవకయున్న నెవ్వగలఁ బొందరె నీపొడగాన కుండుటన్. 37

క. కొలఁదిపడదు పెండిలివే,డ్కలతో నిట్టుంటి మేని కడుఁదడవౌనుక్
వెలికి వెలియఁ బోద మనుచుఁ, దొలఁగఁగఁ గొనిపోయెదంపతులఁ బెడత్రోవన్. 38

క. పులు లెలుఁగు లడవియేనుఁగు, లలరెడుసింహంబు లాది యగుమృగములచేఁ
దలచూపరానివిపినం,బుల నిట్లడంబు గాఁడిపోవఁగ నొకచోన్. 39

చ. అలివకు నీరువ ట్టయిన నంతరభేదకుఁ డౌటఁ గుంభి ద
త్పలినొక మ్రానినీడ నిడి శైత్యజలంబులు దెత్త మంచు భూ
పతిసుతు నొక్కదిక్కునకుఁ బంపుచుఁ దా నొకదిక్కు వోయె నా
కృతకమతంబు లెల్లఁ బరికింపఁగ నెన్నటి కింకఁ దక్కఁ బో. 40

ఆ. రాచకొడుకు తిరిగి రాకుండ మున్న నా, నేర్పు మెఱయ వలయు నీళ్ళపట్టు
దయ్యె మెఱుఁగు ననుచుఁ దా నెందుఁ బోవక, మగిడి వచ్చి కుంభి మగువతోడ. 41

ఉ. 'అల్లదె కంటె యొక్కజలజాకర మేమియు దవ్వు లేదు నీ
వల్లభుఁ డెంత ప్రొద్దునకు వచ్చునొ చెట్టులఁ జిక్కఁ గాని నీ
యుల్లము రాఁ జరించుటకు నోపెడునంతటివాఁడు గాఁడు నీ
వల్లన రమ్ము నావెనుక నచ్చటఁ జూపెదఁ బెక్కుతోయముల్.' 42

మ. అని గర్వోక్తులు పల్కి యాతరుణి నుగ్రారణ్యమార్గంబునం
గొనిపోవంగ 'నదేమి? కుంభి! యిట నాకుం ద్రావ నీ రెద్ది? యీ
యన యేపోకలఁ బోయెనో? తడవ వేలన్నా! కడుం దూర మి
ట్టు ననుం దెచ్చితి కల్లఁ జేసి' తనుచున్ డోలాయమానాకృతిన్. 43

క. అమ్ముగ్ధ సొలసి పల్కిన, 'నమ్మకు నీ రేమి భ్రాంతి యటు నాల్గడుగుల్
రమ్మా డస్సితి నన కధ్రి,వమ్ముగ నీమనసు పట్టువాఁడ లతాంగీ!' 44

క. అని కైదువుఁ బరిఁజించుచు, ననువరి గద్దరన్న కుంభి యని నీతిజ్ఞుల్
విని మెచ్చ వలదె పదకముఁ, గొనియె నతఁడు నాకు దీనిఁ గొను టనుచితమే. 45

తే. నాకు బాలకి రెండును నాఁచికొనిన, నేల పోనిత్తు నెట్లైనఁ బాలు గొందుఁ
గాక యని మల్లచఱచుచుఁ గసరుముట్టఁ, బలుకనక్కుంభిఁజూచి యాజలజనయన. 46

ఉ. గమ్మన కన్నునీ రొలుకఁగా నపు డిట్లనుఁ 'బాపకర్ముఁడా!
నమ్మితిఁ గాక నీ విటులు న న్నడకించుట యె ట్లెఱుంగుదుం
బొమ్మని యాతనిం దొలఁగఁ బుచ్చితి నీఖలపేరు చెప్పి నన్
బిమ్మటఁ దెచ్చి కాఱడవిఁ బెట్టితి నీకిది మిత్రధర్మమే?' 47

మ. అని శోకాకులచిత్తయై పలుకఁగా నక్కుంభి 'యేలమ్మ! న
వ్విన నీపిక్రియ నెగ్గుపట్టెదవు నే విశ్వాసిఁ జుమ్మమ్మ నీ
వనుమానింపక వేగ రమ్మనుచు మిథ్యాలాపము ల్పల్కఁగాఁ
గని యత్యుగ్రపురక్కసుం డొకఁడు వీఁక న్వచ్చె నచ్చోటికిన్. 48

ఉ. వచ్చి యనర్గళస్ఫురితవైర మెలర్పఁగఁ 'బోకు పోకు నీ
వెచ్చటి కేఁగె దింక నిను నిప్పుడ యుక్కడఁగింతు' నంచు వా
పుచ్చి యదల్చుచున్ గనపభూజమునం దనుజుండు వ్రేయఁగాఁ
జొచ్చినఁ గుంభి దా మరలి చూడక పాఱె మహారయంబునన్. 49

వ. అట్లు పాఱిన. 50

ఉ. పోటరులే నరుల్ బెదరిపోయినఁ బోయెను గాక వాఁడు నా
యోటకు వచ్చునో మిగులునో సతి వచ్చినఁ జాలు నల్పుఁ డే
కాటికిఁ బోయె నేమి యనుకైవడిఁ దా నటు పోక దైత్యుఁ డా
పాటలగంధి నెత్తుకొని పాఱె నభశ్చరుఁడై రయంబునన్. 51

ఉ. రావణుబారిఁ జిక్కినధరాసుతచాడ్పున భీతి నొంది వా
పోవుచుఁ బోవుచో నృపతిపుత్రునకుం దనపోక చెప్ప భూ
దేవికి లంచ మిచ్చినగతి న్సురవైరి యెఱుంగకుండ రా
జీవదళాక్షి యప్డు వయిచెం దనమైతొడవుల్ క్రమంబునన్. 52

సీ. అంతఁ బావకలోముఁ డటపోయి నిర్మలోదకపూర్ణమై యొప్పు నొకమహాత
టాకంబుఁ గని తనడప్పి యంతయుఁ బోవ జలపాన మొనరించి సరభసమున
నచ్ఛిద్రసరసీరుహచ్ఛదంబునఁ గొంత యుదకంబు నినిచి యయ్యువిద కనుచుఁ
గొనివచ్చి మున్ను దా నునిచిపోయినచోటఁ దరళాక్షిఁ గానక తల్లడించి

ఆ. దెసలు కలయఁ జూచి తిరిగి వచ్చియు లతా, కుజము లరసి యెల్లగుహలయందు
వెదకి యోలములు వివేకించి చఱుల భావించి గొల్లములకుఁ బంచె దృష్టి. 53

క. ఎందునుఁ గానక తద్దయు, వందురి యెలుఁగెత్తి పిలిచి 'వనజముఖి! నీ
వెందున్నదానవే!యీ, చందంబునఁ బిల్వఁ బల్కఁ జనదే నీకున్. 54

మ. ఉదకంబు ల్వెసఁ దేక యేఁ దడవుగా నున్నంతఁ గోపించి యె
క్కడెసం దాఁగితొ? నాదుచిత్త మరయంగా నీరము ల్దాఁటితో?
పొదలం బువ్వులు గోయఁ బోయితొ? మృగంబుల్ సంచరింపంగఁ జూ
చి దిగుల్వొచ్చి తొలంగఁ బాఱితొ? ననుం జింతింప వేలే మదిన్?' 55

వ. అని యనేకప్రకారంబులం బ్రలాపించి తన యరణ్యరోదనంబునకు నొండుగతి లే
కునికిం జేసి తన్నుం దా నుపశమించుకొని నాచెలికాఁడును రాఁడయ్యె నట పోయి
వానిం గూర్చుకొని కార్యాలోచనంబు సేయవలె నని యూహించి యారాజనంద
నుండు. 56

చ. పడఁతుకఁ గానలే కునికిఁ బాయని నెవ్వగఁ జేసి యెంతయుం
సుడివడి తాఁకుచుం దగులుచుం గడుదూరములందుఁ జొచ్చి పో
యెడు నెడఁ గుంభి వచ్చె నొడ లెల్లఁ జెమర్పఁగ ముల్లుకంపలం
బడి తలచీర చీరఁబడి పాఱినభావము దప్పకుండఁగన్. 57

ఉ. వచ్చిన 'నెంతద వ్వరిగి వచ్చెదొ నీళులు గానవో కదే
యిచ్చెల! నిన్నుఁ జూచి వగ నొందెదుఁ జిత్తము త్రావు' మంచు దాఁ
దెచ్చిననీళ్ళు వానికి నతిత్వరితంబునఁ బోసి 'చూచితో
యెచ్చటికేఁగెనో యబల యేఁ బొడగానను దొంటిచక్కటిన్.' 58

క. అని గద్గదకంఠంబున, వినిపించినఁ గుంభి దాను వికవిక నగుచుం
'గనుతిరుగలి గా కాసతి, మనపెట్టినచోట లేక మఱి యెం దరిగెన్. 59

ఉ. కందువ దప్పినాఁడ వతికాముకభావము నీకుఁ గల్మి నే
పొందు నెఱుంగవైతి వనభూములఁ గామిను లొంటిఁ బోదురే
మందవివేక! నీవు పదమా వెడమాటలు మాను నీకుఁ ద
త్సుందరిఁ దొంటిచోన తగఁ జూపెదఁ బాపెద నీమనోవ్యథన్.'' 60

క. అని యతని భ్రమయ నడపుచు, మును దత్సతి నిల్పి చనినభూజముకడకుం
గొనిపోవ నచట నది లే, కునికిఁ బునశ్శోకవహ్ని నుల్ల మెరియఁగన్. 61

ఉ. 'ఓచెలికాఁడ! నీవు నను నూరక తెచ్చితి గాక మున్ను నా
చూచినచోటు గాదె యిది చూడఁగఁ జాలక యాలతాంగిఁ బోఁ
ద్రోచెఁ బాపి విధాత' యని తూలెడుపావకలోమఁ జూచి యా
నీచమనంబులో నగుచు నిక్కము యాప్తుఁడ పోలె నిట్లనున్. 62

ఆ. 'ఇంక వగవ నేల యిది నానిమిత్తమై, వచ్చినట్టిదుర్వ్యవస్థ గాదె
యెలుఁతయొద్ద నిన్ను నిలిపి నీళ్ళకు నేను, బోనితప్పు గలిగె భూపతనయ! 63

ఆ. చిత్తగింపు మబల చేతప్పిపోయిన, యపుడె పోయెఁ గాక యడిచిపడిన
నెచటనుండి వచ్చు నీగతోదకసేతు,వులఁ బ్రయోజనంబు గలదె తండ్రి!' 64

చ. అనిన నతండు 'నీకు నిటు లాడుట యుక్తమె కుంభి! నాదునె
మ్మనమున మర్త్యులందును నమర్త్యులయందును నిట్టికాంత లే
దని తలపోతు నట్టిసుభగాకృతి యే మఱవంగ నేర్తునే
చని పరికింపఁగా వలయు శైలగుహాగహనాంతరంబులన్.' 65

క. అని యతఁడు వెదకఁ దొడఁగినఁ, గని కుంభియు నంతనంతఁ గా ళ్ళీడ్చుచుఁ బి
ల్చినఁ బదియేలుఁగల కొకమరి, మునుకుచు వలసియునునొల్ల ములుసను డెంచున్. 66

క. తనచేఁత నృపతిసుతుఁ డెఱిఁ, గినఁ బై వచ్చునని పుల్లగిలి పోఁ జూచున్
వనసత్త్వము లత్యుగ్రం, బున మెదలఁగఁ జూచి పాఱిపోవను వెఱచున్. 67

ఆ. అతనిఁ దిరిగి చూచి యకట నావెనువెంట, నితఁడు తిరిగి తిరిగి యెంత డస్సె
ననుచు నిల్చి చూచికొనుచుఁ బావకలోముఁ, డలివ వెదకుచుండె నడవులందు. 68

చ అరయఁగ దండకాటవిఁ బ్రియాంగనఁ గోల్పడి శోకతప్తుఁడై
తిరిగెడురాముఁ బోలె గణుతింపఁగఁ బావకలోముఁ డప్పు డ
ప్పురిసరవర్తియై పరగుపాపచరిత్రు సుమిత్రపుత్రుతో
సరి యిడ రాదు గాని సతి జానకితో నెనవచ్చు నెంతయున్. 69

వ. ఇట్లక్కుమారవరేణ్యుం డరణ్యమధ్యంబునం బరిభ్రమించుచు నొక్కయెడ నయ్యింతి యంతకమున్న దిగవైచిపోయినవిమలాభరణంబు లవ్వనలక్ష్మికిం గనకకుసుమోపహారంబు గావించినచందంబున నందంబై చాలుపడియుండ నొండొండ పుచ్చుకొని తనమనంబున ని ట్లని వితర్కించు. 70

క. శార్దూలాదిమృగంబులు, మర్దించిన నిచట రక్తమాత్రము వలదే
దుర్దముఁ డగుదనుజుఁ డొకఁడు,నిర్దయుఁడై యెత్తికొని చనియెఁ గా వలయున్.

క. అని యాందోళింపుచు నవ్వనితాభరణములచొప్పు విడువక చనుచుం
గనియె నెదురుకట్టుల నొక, ఘనగండశిలానిబద్ధగహ్వర మొకచోన్. 72

మ. కని యాగుండు దొలంగఁ ద్రోవఁగ నశక్యం బైన సుద్వక్త్రుఁడై
కనుఁగొం చుండఁగ నానగేంద్రముపయిం గప్పారి ధూమంబు దోఁ
చిన నాచక్కటి నెక్కి చూచుడును దచ్ఛిద్రంబులోఁ దవ్వులన్
వినిచెన్ మానవభాషణంబులు గడున్ విస్పష్టమై వీనులన్. 73

క. వినిచినఁ బావకలోముఁడు, మనమున నాశ్చర్య మంది మనుజులా పాతా
ళనివాసులా చూడవలయుఁ, నని తద్గమనేచ్ఛఁ ద్రోవ నరుగఁగ నొకచోన్. 74

ఉ. సన్నపుగండి యొక్కటి రసాతలమార్గము పోలె నిమ్నమై
యున్న నతండు కుంభి వెలి నుండఁగఁ దా నసహాయశూరుఁడై
మిన్నక యందుఁ జొచ్చి చని మేడలఁ జారునికేతనంబులం
జెన్నగునొక్కప్రోలు గని చేరఁగఁ బోవఁగ నందులోపలన్. 75

క. సరిలేనియంజి సొగటా, లరు దగుజూదంబు చెత్త మచ్చనగండ్లన్
దిరమగునోమనగుంటలు, సరసత మెయి నాడుచున్నసతులం గనియెన్. 76

మ. కని యానిష్పురుషంపుఁజోట నిటు లీకాంతాజనంబు ల్సుఖం
బున నేచింతయు లేక వేడ్కలు మదిం బొంగార నిట్లాడుచు
న్ననిమిత్తం బిది యేమియొక్కొ యనుచున్ భావించుచున్నంత నా
తనియేతెంచుట బిట్టుబిష్మ గని కాంత ల్విస్మయాక్రాంతలై. 77

క. లేచి యెదురేఁగి లోచన,రోచు లలర నతనితోఁ దరుణు లిట్లని 'రే
లా చనుదెంచితి వుగ్రని,శాచరుఁ డొకఁ డిచట నునికి చర్చింప వొకో. 78

క. నిన్న నొకతరుణి నిచటికి, నిన్నీచుఁడు దెచ్చి తొలఁగ నిడి నెమ్మదితో
నున్నాఁడు నిదురవోవుచు, గన్నుదెఱవఁ డాఱునెలలు గడచనకున్నన్. 79

తే. కలదు వీనికి నొకచమత్కార మనఘ!, యితరపురుషుఁ డిచ్చోటికి నేఁగుదెంచె
నేని యొకజాములోనన మాను నిదుర, వాఁడు వధియించు నెంతటివానినైన. 80

క. కావునఁ బదివేలైనను, నీ వీయెడఁ దడవుగాఁగ నిలువవలదు పొ
మ్మా వెస' ననవుడు నిట్లనుఁ, బావకలోముండు కార్యబంధురుఁ డగుచున్. 81

ఉ. 'చెచ్చెర నాకు నీవెఱపు చెప్పకుఁ డేను స్వయంవరంబునం
దెచ్చినకన్య నీయసుర దెచ్చె వెస న్ననుఁ గానకుండ నే
వచ్చితిఁ దన్నిమిత్తమయి వాని వధింపక రిత్తవోవ మీ
రిచ్చట నిట్టు లుండఁ గత మెయ్యది చెప్పుఁడ నాకు' నావుడున్. 82

ఉ. ఖేచరుఁడై నిశాచరుఁడు కేవలసాహసుఁ డొంటి వచ్చి మా
యాచణభావ మేర్పడఁ ద్రియామల నిద్రిత లైనరాజక
న్యాచయముం గ్రమక్రమమునం గొనివచ్చి దురాత్ముఁ డిందులో
నై చినవాఁడు తానటె వివాహము గాఁ గలఁడట్టె మీఁదటన్.' 83

క. అని తమతెఱఁ గంతయుఁ జెప్పి 'నరోత్తమ! యిందు వచ్చి పెక్కండ్రు నృపుల్
చని రిట మున్ను యమాలయ,మున కీదానవునిచేత బుద్ధిరహితులై. 84

ఉ. కావున బుద్ధిఁ జెప్పెదము గైకొనుమీ యసురాధముండు దా
లేవకమున్న నీ వితనిలేమ వధింపుము భార్య చచ్చినం
జేవ యడంగు నీ పటులు సేయక మార్కొని పోరితేని నా
దేవత లైన వీనిఁ గడతేర్పఁగ లేరు భుజాబలంబునన్.' 85

మ. అనినం బావకలో'ముఁ డాసతులమో మర్థి న్నిరీక్షించి మే
దినిఁ బ్రాణేశులు చచ్చినం గులసతుల్ తెంపారఁ బ్రాణంబు లి
చ్చినచోటు ల్గనుఁగొందుఁ గాని యెచటన్ సీమంతిను ల్భావఁ దో
డన తారుణ్యరతిఁ బొందువల్లభులఁ జూడ న్వింత లీవాక్యముల్. 86

ఉ. కూరిమిఁ జేసి వీఁడు తనకోమలి చచ్చినఁ జచ్చునంటి రా
కారణ మేదియేఁ గలదె గట్టిగ నా కెఱింగింపుఁ డన్న నం
భోరుహనేత్ర లి ట్లనిరి 'భూపతనూభవ! చిత్తగింపు మీ
క్రూరనిశాచరుండు మును ఘోరపుఁగానల వేటలాడుచున్. 87

క. తనచేత ప్రేటువడి యొక, వనకరి పాఱంగ వీఁడు వాతూలరయం
బున దానివెనుకఁ దగులుచుఁ, గనియె రతిక్రీడ సలుపుకపిదంపతులన్. 88

మ. కని యాచక్కటిఁ దేలిపో నొకబృహత్కాండంబుఁ దా నేసి చే
సిన నయ్యస్త్రము దీవ్రమై మృతి యొనర్చెన్ మర్కటస్త్రీకి దా
ని నిరీక్షించి తదీయభర్త విరహాగ్నిన్ వేగుచుం జెల్లఁబో
దనుజుం డి ట్లపకీర్తి గట్టుకొనునే దర్పంబు పెంపొందఁగన్. 89

క. మృగములు పదివే లుండఁగ, మృగయారతిసొంపు దెంపుమెయి నొకశాఖా
మృగవనితమీఁదఁ జూపుట, తగవే దీన నగుదొడ్డతన మేదియొకో. 90

ఆ. సురతవేళ నీనుచో నిద్రవోయెడు, నెడలఁ గ్రేపు చన్ను గుడుచుతఱిని
దప్పి వచ్చి నీరు ద్రావెడుచోటఁ గ్రూరంపు మృగము నైనఁ జంపరాదు. 91

ఆ. జిహ్వ కింపు గానిచేఁదుకాయలు ద్రెంప, నేల పాఱవైవ నేల పిదపఁ
గుడువఁ దినఁగ లేనిక్రోఁతిమాంసముతోడి, దేమి వేటలాడ నెడము లేదె. 92

వ. అని దూఱుచు నలుదిక్కులుఁ దిరిగి చూచుచు. 93

చ. తనులత యుచ్చి పోవ బెడిదంబుగఁ గొన్న నిజాస్త్రవేదనన్
వనచరకాంత బె ట్టులికి సాధునికౌఁగిలి వాసి కీచుకీ
చని కడు జమ్మరించుచు రయంబునఁ దత్తరుశాఖనుండి మే
దినిఁ బడి చచ్చుచో నసుర దేరకొనం గనుఁగొంచు నుండఁగన్. 94

ఉ. వానిమొగంబుఁ జూచి 'బలవంతపుఁబాపము దెచ్చుకొంటి వే
లా నగుఁబాటు కోర్చి యబలం బడనేసితి నీకు నేమి కీ
డేని యొనర్చెనే మృగయుం డెవ్వరు నిట్టియధర్మవృత్తికిం
బూనరు నీకు నీతలఁపు పుట్టుట చిత్రమురా నిశాచరా! 95

సీ. ఏఁ దపోధనుఁడ సీయింతి నాయింతి యిద్దఱము నీరూపముల్ నెఱయఁ దాల్చి
కేళి సల్పుచునున్నఁ గీ లెఱుంగక క్రియాహీనుండవై చావ నేసి తబల
నీపాపమునఁ జేసి నీపత్ని కాయంబుధమరణంబు రాఁగ నత్తరుణిచావు
విని నీవు దాసితోడనె కూడఁ బితృభర్తృసదనంబుఁ జేరు' మని శాప మిచ్చి
ఆ. వనితఁ దొడలమీఁద నునిచి నెమ్మొగము చూచుచు నితాంతదీనవచననిచయ
మెసఁగఁ బనవి పనవి యసువియోగము నొందె, వనచరాంగుఁ డైనమునివరుండు.

క. కావున వీనికి సతితోఁ, జావు నవశ్యంబు నీవు జాణఁడ వైతే:
గావింపు మవ్విధం' బని, వే వేగమ చెప్పి రంతవృత్తాంతంబున్. 97

ఉ. చెప్పిన నాఁడుఁగోఁతి దెగి చేసినపాతక మిట్లు సేయ కే
నిప్పుడు వీనిఁ దాఁకి వధియించెద నన్న నసాధ్య మంటిరే
చొప్పన గెల్తు వీని నెటు చూచిన దెప్పర మైన దిందులో
నెప్పని సేయఁ బాడియొకొ యెవ్వరుఁ గా దనకుండునట్లుగన్. 98

చ. అని తలపోయుచో నసుర కంతియ కాలము గాన దానిఁ జెం
దినకపిరూపసంయమిసతీవధపాపము ప్రేరకమ్ముగా
మనమునఁ దెంపు పుట్టుటయుం మారశరంబులపాలు చేసె మ
ద్వనితను వీఁడు వీనివనితం బడనేయక కోప మాఱునే. 99

మ. అని యాతాటకిమీఁద నట్లు రఘురామాకార మేపారఁ బా
వనుఁ డప్పావకలోమంఁ డాతనిగృహద్వారంబు వే చొచ్చి య
ద్దనుజుం జెందినభాగ్యదేవతక్రియం దస్వీసమూహంబుతో
ఘనసింహాసన మెక్కి యున్నయసురిం గన్నారఁగాఁ జూచుచున్. 100

చ. దనుజుఁడు మాయలాఁడు మృదుతల్పమునం బవళించి నిద్రవో
యినక్రియ నందఱ న్మొఱఁగి యిక్కడ నెమ్మది నున్నవాఁడు వా
ని నెలవు గంటి నన్నటులు నిష్ఠురబాణము నల్లది దానిహృ
ద్వనజము నాఁట నేసెఁ దెఱవామనినేత్రలు విచ్చి పాఱఁగన్. 101

ఉ. ఏసిన నింతి నొచ్చి నెలుఁ గెంతయు రాల్పడఁ గోపజృంభణం
జేసి ముఖాబ్జ మొప్పఁగ 'నిసీ! మగవాఁడవె నీవు నీదుబా

ణాసనము న్మహాస్త్రనిచయంబును గాల్పుము గొంచుఁబోయి నేఁ
జేసినతప్పు లేదు ననుఁ జెన్నఁటి! నీ విటు లేయఁ గూడునే. 102

తే. బ్రాహ్మణులు గోవు లతివ లర్భకులు పీర, లేమి త ప్పొనరించిన భూమియందు
శాస్త్రమతమునఁ దగినశిక్షయ యొనర్చు,టుచిత మగుఁగాని చంపఁగాదుగ్రగతిని.

ఉ. నాదెసఁ దప్పు చెప్పఁబడినం బదిలంపుఁబరీక్షమీఁద నాఁ
గా దనువాఁడు నామగఁడు గాక నరాధమ! నీవు కర్తవే
యీదురుపక్రమం బిచట నెవ్వరు నీ కుపదేశ మిచ్చి రే
లా దయ లేక యిందు నగులాథము చెప్పిరె యెద్ది యేనియున్. 104

క. వేడుక పుట్టినఁ జని నీ, యీడునృపాత్మజులతోడ నెక్కటికయ్యం
బాడఁగ రాదె పగఱపై, దాడి యిడఁగ రాదె బలవితానముతోడన్. 105

ఉ. ఓరిదురాత్మ! నీభుజబలోద్ధతి యింతటఁ దీఱదేని ని
ద్రారతుఁ డైనమత్పతిఁ దిరంబుగ మేల్కొనఁ జేసి వానితోఁ
బోరఁగ రాదె య ట్లిగురుఁబోఁడుల నేమఱిపాటఁ జంపినం
జేరును బెంపునుం గలదె పృథ్వి నెఱుంగవె వీరధర్మముల్. 106

క. అట యెట యేనియుఁ గొనిపోఁ, చటులాహవకేళి కేను శరచాపము లం
దుట యెదురు పడుట గని మఱి, యిటు చేసితొ కల్ల చేసి తేలా మాటల్.'

తే. అనిన నారాజనందనుం డల్ల నగుచు, 'నతివ! నినుఁ జేర వచ్చిన నడిచి పడియె
దన్యవనితలఁ జెఱదెచ్చునపుడు బుద్ధి, చెప్ప వలవదె నీభర్తఁ 'జేరి' యనియె. 108

సీ. కర్ణరంధ్రముల నీకరణి నసహ్యవాగింధనంబులు నిండ నిడుటఁ జేసి
యంతరంగంబున నంతటఁ గలయఁ బ్రవృద్ధమై మీఁదికి వెడలునట్టి
కోపాగ్నిశిఖలు పెక్కువగాఁగఁ దీక్ష్ణంపుఁజూపులు నిగుడ నసురవధూటి
విస్ఫులింగంబులవిధమునఁ జురచురఁ దాఁకుబిఁకంపుటదల్పు లెసఁగ

తే. నోరి పాపాత్మ! నన్ను నీ వూర కిట్లు, పొరిగొనుటఁ జేసి కరములుఁ జరణములును
నఱకఁబడియుండుఁ బొమ్ము నీకఱకు లెల్లఁ, జక్కనగు నంతదా' నని శాప మిచ్చె.

వ ఇట్లు శపించినం దపించుడెందంబుతో నృపనందనుం డసురసుందరికి. నభివంద
నంబు చేసి 'నాచేసినయపరాధంబు సహింపుము శాపావధి యెవ్విధంబున నగు నను
గ్రహింపు' మని ప్రార్థించినఁ బ్రసన్నచిత్తయై. 110

క. దనుజసతి యతని కి ట్లనుఁ, 'బొనరఁగ భువి కేఁగుదెంచి పుష్పాపచయం
బొనరించుగిరిజయడుగులు, నినుఁ జోఁకిననాఁడు శాపనివృత్తి గల్గున్.' 111

వ. అని మఱియు నతనిపశ్చాత్తాపంబు చూచి తదుపశమనార్థంబుగా నతని కి ట్లనియె.

క. 'నీ వేమి సేయు దిది మును, దేవాహితుఁ డైనమత్పితకి వానరనా
రీవధశాపనిమిత్తం, బై వచ్చినతీవ్రశాప మది వృథ యగునే. 113

క. బాణము పెఱుకుము తనువునఁ, బ్రాణంబులు నిలువ' ననిన రాసుతుఁ డదియున్
శోణితముగఁ బెఱుకఁగ నలి, వేణి తదుత్థితదురంతవేదనవలనన్. 114

వ సురసుర స్రుక్కుచు నాత్మగతంబున. 115

క. దానవవిభునంతఃపుర, మానిని యట యునికి దుర్గమస్థల మట య
చ్చో నట నరపాలధను, ర్జ్యానిర్గతబాణనిహతి యట బాపు విధీ. 116

క. అని తనచావున కెంతయుఁ, మనమున నాశ్చర్యపడుచు మ్రాఁగన్నిడుచుం
దనసఖు లాక్రందింపఁగ, దనుజాంగన ధర్మదేవతాపురి కేఁగెన్. 117

వ. అంత నప్పావకలోముండు తీవ్రధాముండునుం బోలెఁ బ్రతాపదీప్తుం డగుచు నచ్చోటు వాసి వచ్చి కుంభకర్ణుండువోలె నిద్రించియున్న యసురకు దీర్ఘనిద్ర గావింప బూని కదిసి యి ట్లున్న యుంకికిన వధియించుట పౌరుషంబుగా దని యమ దండంబు వోనియంఘ్రిదండంబున వానియెదురుఱొమ్ము దన్నినఁ దన్ను మైసఱచి మేల్కాని పినపాటిగా నల్లన నీల్గుచు వాఁ డవ్వలి ప్రక్కయైనఁ జూచి కోపంబునఁ జాపంబు విసరి వీఁపు వ్రేసిన నులికిపడి పెడచేతం గన్ను లుసిమికొనుచు లేచి కూర్చుండి తప్పక చూచి 'యోరీ! నీ వేయూరివాఁడ? విచటి కెట్లువచ్చితి? గుహాగేహాగోళంబున విశ్రమించి యున్నసింహంబుతోడఁ జెనకుసారంగంబుభంగి నానిదుర చెఱిచితి వింక నెందుఁ బోచ్చెద?' ననుచు దంష్ట్రాధరోష్ఠదష్టుం డగుచు జంకించిన నతం డేమియు శంకింపక 'నీవెడబింకంబు లేల? నిశావేళయందుఁ గొంద ఱిందుముఖులం దెచ్చి ముచ్చోదనంబున నిచ్చో ముచ్చమునింగి యున్న నిన్ను మెయిమెయి నుండ నిత్తునే చెండి వైతుం గా' కనియె నాకడిందిరక్కసుం డతనిదిట్టతనంబు చూచి 'నీదగువీరాలాపంబులకు మెచ్చు వచ్చెం బిన్నవైన నగుదు గాకేమి యనన్యభేదనం బగునాపుటభేదనంబు సొచ్చి వచ్చితి కావున నీ వెట్లు పల్కినం గా దనక వినియెదం గాక నీ వేమి యంధకాసురభయంకరుం డగుశంకరుండవో మధుకైటభమర్దనుం డగుజనార్దనుండవో వృత్రవినాశనుం డగుపాకశాసనుండవో తలమాటు చాలని మనుజబాలుండవు నీ వెంతవాఁడవు? కీపంతంబు చెల్లె నంతియు చాలుఁ గ్రమ్మఱి నెమ్మదిం బొమ్మంతట నీ క్రొవ్వరుగ దేని నాలావు చూచెదవు గాని మంచిబంటవై నిలువుము పరిజనబాలురం గూడి యుండవిండ్లు పట్టుకొని పిట్టలనేసి యాడెడు విధంబు గాదు నాతోడికయ్యంబున కియ్యకొనుట యసిముసలకుంతక్షురికాదులయందు నేయాయుధంబు నీకుం బరిచితంబై యుండు నది సవరించుకొని నాతో

డం దలపడుదు గాని రమ్మనియె నమ్మాటకు నమ్మేటివిల్కాఁడు వీఁడు నిరాయుధుండై యున్న నే నాయుధంబునకుం జొచ్చుట యుచ్చెం బని తలంచి 'యస్మదీయబాణోరగం బింతకమున్న నీప్రాణేశ్వరి ప్రాణవాయువులం గ్రోలి తృప్తినొంది యున్నయది నీతోడియుద్ధంబునకు నాబాహుదండంబు చాలు' లేది రమ్మనుచుం దనచేతివిల్లును నంపపొదులును నొకచో నిలువం జేర్చి భుజాస్ఫాలనంబు సేయుచుం బ్రతిఘటించినిల్చిన నతండడియ తనకుం గాలావధియని యెఱింగి పిఱుతివియకనివ్వటిలుకోపాటోపంబునం జేసి దిగ్గన లేచి కట్టాయితంబైవిక్రమోపక్రమణంబుశోభిల్ల మల్లసఱచికొనుచుం బఱతెంచి భీమసేనుంబొదవుసింహబలుండునుంబోలె నతనిపైఁ గవిసె నయ్యవసరంబున హస్తాహస్తింబోరుహస్తియుగంబుపగిదినొండొరులం దెరలం ద్రోచుచుఁ జిందఱ రేఁగినపొగరుటాఁబోతులరీతి నొండొరులభుజంబులువీఁకం దాఁకించుచు మసరుకవిసినవనలులాయంబులపోలికం జిఱ్ఱుముఱ్ఱాడుచు సరోషమేషంబులపరుసున విడిచివిడిచి తలపడుచు బిరుదుగలకోడిపుంజులవిధంబున నొండొరుల శిరంబుల కొడియుంచు మసగంబునకుఁ బెనంగుకోడమనాగులబాగున మేనులు సుట్టి నెట్టుకొని పెనంగుచు నుదకప్రవాహగతకాష్ఠయుగ్మంబుపగిది నందంద క్రిందుమీఁదై పొరలుచుఁ బాదబాహాచతుష్టయంబులు నుత్తమాంగద్వితయంబును గలశరీరం బొక్కటియకాని రెండుదేహంబు లని భేదింప సందు లేకుండునట్లుగా నంటఁ బట్టుకొని సమకాలపరిశ్రమంబునఁ గొండొకసేవు భూశయ్యపైఁ గన్ను మోడ్చుచు నాలోనన తెలిసి యదల్చుకొనుచుఁ బెలుచ నెగసి నిల్చుచు నోహటింపక దేహంబులు గొబ్బున నుబ్బించుకొని పిడుగు పిడుగుం దొడరువడువున బెడిదంబు లగు కడిందిపిడికిళ్ళకడిమి యడరించుచు నెక్కువతక్కువలు లేక యెక్కటి పోరు నమ్మేటిమగలయాటోపంబునకుం బాటిగా నస్త్రహస్తులై రేని రామరావణులప్రతాపంబులు చెప్ప నొప్పుగు గదాదండపాణులై రేని భీమదుర్యోధనులపరాక్రమంబులు పొగడం దగు నట్లు గాక సహజవైరంబులు విడువక కంసకంసాంతకులు క్రమ్మఱ జన్మించిరో శంబరశంబరాంతకులు పుట్టిరో యని యనుమానించునట్లుగా నసమానవయస్కు లయ్యును సమానబలులై పోరునెడ నధర్మవర్తి యగుటం జేసి యసురయుసుఱు తోడుతోడన తఱుగఁ దొడంగిన నక్కుమారకంఠీరవుం డకుంఠితసత్త్వంబున వానిఁ గ్రిందవైచుకొని జానుముష్టిఘట్టనంబులచేత నచేతనావస్థకుం దెచ్చి సత్త్వహీనం బగుమూషకంబు నెగురవైచి యాడుమార్జాలంబునుం బోలెఁ గొంతదడవు వీరవినోదంబు సలిపి యధికరోషంబున నాదోషకారిం గడకాలు వట్టి ఖేచరప్రీతిగా బడిసెవైచుచొప్పునం ద్రిప్పి చట్టమీఁదఁ జొనిపిముద్దవైచునట్లు చిదురు

పట్లై చెదరునట్లుగా నేలతో వైచి యఖర్వగర్వంబున నప్పర్వతంబు ప్రతిధ్వానభీ
కరఘోరం బగునట్లుగాఁ జేర్చి యార్చిన. 118

క. రక్కసుఁ డీబాలునిచేఁ, జిక్కెర మాకోర్కి నేఁడు సిద్ధించెర మా
మ్రొక్కెడుమ్రొక్కులు వేల్పుల, కెక్కెన యిన్నాళ్ళ కనుచు నింతులు ప్రీతిన్.

ఉ. గ్రక్కున నేఁగుదెంచి తనుఁ గాంచిన నందఱ నాదరించి యా
చక్కటి మున్ను దా నిడినచాపము నస్త్రసముచ్చయంబు నిం
పెక్కఁగఁ జేరి పుచ్చుకొని యెప్పుడొకో పతిఁ గాంతు నంచు నల్
దిక్కులుఁ జూచునయ్యనుమతిం గని పావకలోముఁ డిట్లనున్. 120

చ. 'తనులత వాడె మాసె ముఖదర్పణ మొప్పగుమీననేత్రముల్
ఘనవిరహాశ్రుపూరములఁ గాంతివిహీనత నొందె నూర్పుగా
డ్పును వెదచల్లుచున్నది కఠోరమనస్కుఁడు బ్రహ్మ వాని నే
మని యిట దూఱువాఁడ వినుమా!యిటు సేయుట మానినీమణీ! 121

క. అమృతమయుం డగుచంద్రుని, యమలతనువు నాఁడునాఁటి కఱుగం జెరుగం
గమలఁగఁ జేసినబ్రహ్మకు, రమణీ!ని న్నెట్లు సేయ రాకుండెడునే. 122

క. విను మది యట్లుండె నినుం, బనివడి కొనివచ్చినట్టిఫలము గుడువ న
ద్దనుజుఁడు గళత్రయుతముగఁ, జనియెను జముపురికి మద్భుజాప్రేరితుఁడై'. 123

వ అని యుపలాలించి తనతోడనె కూడ మంగళస్నానంబు సేయించి విమలాంబరా
భరణశోభితంబు గావించి గాఢాలింగనంబున నయ్యంగన నపగతక్లేశం జేసి. 124

చ. నరకునిఁ జంపి వానిసదనంబున నున్ననృపాలకన్యలం
దిరముగఁ దెచ్చుకృష్ణునిగతిన్ శిఖిలోముఁడుఁ దత్సతీతతిన్
వరుస నెలర్ప ముంద రజవత్సునికూఁతురు నిర్గమించినం
దరమునఁ గాచి యుండినప్రధానిసుతుండు మనోగతంబునన్. 125

మ. ఒకభంగిన్ నృపపుత్రుఁ గన్గొనఁగ నే నుగ్రాటవు ల్చొచ్చి యీ
సుకుమారిం గొనిపోవఁగా దనుజుఁ డచ్చో నన్నుఁ బోఁదోలి యు
త్సుకరీతిం గొనిపోయె దీనిఁ దుది మత్పూర్వార్జితోదాత్తస
త్సుకృతం బీక్రియఁ దెచ్చి యిచ్చెఁ దరుణీమాహామణిం గ్రమ్మఱన్. 126

క. అనుచుఁ దదీయద్వారం,బునఁ బెనుగు డొకటి ద్రోచి పూర్ణేందుముఖిం
గొనిపోయెఁగుంభి యపు డ,వ్వనితారత్నంబు శోకవహ్ని నెరియుచున్. 127

ఉ. ఈమనుజాధముండు నను నెయ్యెడ కీడ్చునొ వీని గెల్వ నా
కేమిమతంబు గల్గు నని యిచ్చఁ దలంచి యళీకహాసము

ల్లోమునఁ దోఁప ని ట్లనియె 'ముద్దియ చేకుఱె నీకుఁ గోర్కి ర
మ్మా! మన మెట్టు లున్నఁ బెఱమర్త్యు లెఱుంగరు చన్నసన్నయున్. 128

ఉ. కావున నీవు మజ్జనకుఁ గాంచి స్వయంవరలబ్ధ యయ్యె నా
కీవనజాక్షి యంచు జనులెల్ల నెఱుంగఁగ నన్నుఁ జూపి యా
భూవిభుమన్నన ల్గనుట బుద్ధియొ ముచ్చులు వోలె నొక్కెడన్
బోవుట మేలొ మత్పురికిఁ బోదము రమ్ము వికార మేటికిన్.' 129

వ. అని వెడ్డువెట్టిన నతండు జేల్పడి యట్లు చేసె నయ్యాజవక్షుండు మహాహర్షచక్షుం
డగుచు వానికి నున్నతాసనంబు వెట్టించి సభాసదులం గలయ నవలోకించి యి
ట్లనియె. 130

ఉ. 'వాలుమగ ల్మహామకుటవర్ధను లాఢ్యులు శస్త్రహస్తు ల
వ్వేళ నొకండు నాగగనవీథినిబాఱెడుహంసయక్కునన్
ప్రేలెడురత్నభూషణము వ్రేలను జూపఁగ లేక పాసి రీ
లాలితకీర్తి నిత్యశుభలక్షణుఁ డొక్కఁడు దక్క నందఱున్. 131

ఉ. వానికి నవ్వధూమణి వివాహము సేయ నుపక్రమింప న
మ్మానిని తండ్రిఁ జూచి 'వినుమా! యొకవిన్నప మప్పు డెవ్వరుం
బూని యొనర్పలేనిపని బోరనఁ దా నొనరించె మద్వరుం
డైనయతండు వేఱ యితఁ డాతనిఁ గొల్చినబంటు భూవరా!' 132

క. అని యప్పావకలోముఁడు. దనుఁ జేపట్టినది మొదలుఁ దా నచటికి వ
చ్చినయది తుదయుం గా దొరకొని యన్నియుఁ జెప్పెఁ బూసగ్రుచ్చినభంగిన్. 133

ఉ. చెప్పినఁ గూఁతుమాటలకుఁ జిత్తము ఘూర్ణిలఁ గుంభిదిక్క దాఁ
దప్పక మాచె భూపతి యతండు గరంబులు మోడ్చి 'దేవ! యేఁ
జెప్పెద విష్ణు నీతనయ చెప్పినమాటలజాడ యంతయుం
దప్పదు నన్నుఁ గాదనుటఁ దావినఁ బోలదు గాని యందులోన్. 134

క. మొదలం దను నేఁ బడసితిఁ, దుదిఁ దనుఁ గొనిపోయినట్టిదుష్టాసురునిం
గదనమున నేనె గెల్చితి, సుదతి భ్రమసెఁ గాని రాక్షసులమాయలచేన్. 135

చ అది మది నమ్మవే నచటి కల్పులు వోవఁగ లేరు సైన్యసం
పద మెఱయంగ నావెనుకఁ బార్థివశేఖర!నీవ రమ్ము చూ
పెదఁ గొనిపోయి యానెలవు భీషణమూర్తులు దైత్యు లాజికిం
గదిసిరయేని నాకుఁ బని గాదు సుమీ! మునుముట్టఁ జెప్పితిన్. 136

ఆ. సతులు ముగ్ధలైన జననాథ! మీరును, ముగ్ధులయ్యు యెట్టిమూఢులైనఁ
దగిలి యొల్లచేత తనచేతగాఁ జెప్ప, నయ్య రిత్తపంది యుంబు లేల?' 137

సీ. అనిన నయ్యజవక్త్రుఁ డనుమతి చూచి 'యీయనృతంబు లేమిగా ననియె?' దనియె
నబల 'యెయ్యది దృష్ట మనియెః దజ్జనకుండు కల్పితహంసికాగళసమర్పి
తాకల్ప మేమయ్యె?' ననియెఁ దత్సుత రాజు దిరిగి క్రమ్మఱ గుంభినిక్కు చూచె
మొగ మెత్తి కొండొక నగియె నాతఁడు 'దీని కేమి మోసము గదా భూమియందు
ఆ. నిట్టిపనులు పుట్టునే యుండెనేఁ జూపఁగాదె?' యనియె నృపతి కల్ల కోపఁ
బడక మాఱి నెచటఁ బడియెనో వెలఁ జెప్పఁ డనుచు నిన్నువాఁడ ననియెఁ గుంభి.

ఉ. నావుడు నయ్యసత్యవచనంబులకుం గలుషించి వీఁడు దో
షావిలమానసుం డెఱుఁగ రయ్యలు వీనిమనంబు వీనిదు
ర్భావము చూచుచున్కిఁ గడుపాపము సుమ్మని నేత్రపట్టె మా
భూవరపుత్రి దాల్చె నకఁ బొందఁగ బంధుజనంబు లాదఱున్. 139

మ. అజవక్త్రుం డిది పోలుఁ బోల దని కార్యాకార్యనిష్పత్తికిన్
నిజ మూహింప నశక్తుఁడై యపుడు వాని జంప నొంపు బరి
త్యజియింపన్ మది నోడి తద్దయు నివాతం బైనచో సద్భట
వ్రజముం దోయము చేసి యున్ప సుఖియై వర్తింపుచుండెం బురిన్. 140

వ. అంత నప్పావకలోముండు. 141

క. తలయెత్తి చూచి తనతో, య్యలిఁ గానక యెదుర నడ్డమై యున్నమహా
శిలఁ గని మది నద్భుతసం, చలములు దలకొనఁగ బహువిచారవివశుఁడై. 142

చ. 'దనుజునివంకవాఁ డొకఁడు దాఁ బగ నీఁగఁ దలంచి పొంచి యేఁ
జనుపథ మిట్లు చేసెనొకొ చంపెనొకో గుణశాలిఁ గుంభి నే
మనఁ గల దాసుమిత్త్రసుతుఁ డన్నపిఱుందఁ జరించునట్లు నా
వెనుకను వచ్చుచుండుఁ దిది వీఁడును నేమయి పోయెనో కదే?' 143

వ. అని యతని నుద్దేశించి మఱియును. 144

చ. కవలును బోలె నొప్పుచును గౌతుక మందఁగ నీస్వయంవరో
త్సవ మను పేరు చెప్పి కడుఁదవ్వుగఁ దెచ్చె కృపావిహీనుఁడై
తివిరి దురంతదుర్దశలఁ దెచ్చె విరించి భవద్వియోగసం
భవపరితాప మేమిగతిఁ బాయునొకో యని విహ్వలింపఁగన్. 145

ఉ. ఆతనియార్తిఁ జూచి. మనుజాధిపనందన లాదఱున్ మనః
ప్రీతిగఁ దద్గుణావళులు పేర్కొని యిట్లని పల్కి 'రేల యీ

రీతి నధీరున ట్లవధరించెదు తాల్మి వహించి లెమ్ము నీ
యాతతభాగ్యసంపదకు నడ్డము గల్గునె యెందు నెన్నఁడున్. 146

క. ఆపదలు గాఁపు లుండవు, మాపులకుఁ గులాద్రియట్లు చుట్టుకొనుఁ దుదిన్
రూ పేది విరిసి పోవు మ,హాపవనాహతపయోధరావలిభంగిన్. 147

వ. కావున నిశ్చింతుండవై మమ్మింతపట్టువారిని నీవారినకాఁ బరిపాలింపు' మనిన నీవేళ కిదియ కార్యం బనుచు నతం డంద యుండె నంత నొక్కనాఁ డొకకిరాతుండు వేటమెయి వచ్చి యచ్చేరువ మెలంగుచుండి మున్ను కుంభి యనుమతింబట్టి బలాత్కారంబునఁ దిగిచి తోఁకొనిపోవునప్పు డప్పుడంతికరంబునుండి యూడిపడి తత్ప్రాంతం బంతయుం దనమయంబకాఁ బ్రజ్వలించు నొక్క యనర్ఘరత్నంబు గని పుచ్చుకొని యాశాబద్ధుండై మఱియు నే మేమివిశేషంబులు గందునో యని పరికించుచు వాఁ డెదుర నగ్గుండు గని యెట్టకేలకుఁ దిరుగం ద్రోచి యామార్గంబున బిలంబు సొచ్చి చని ధనుర్ధరుం డగుపావకలోముం గని వెఱచి పఱవం దొడంగిన.

చ. కనుఁగొని వానిభీతి యుడుగ న్మృదురీతి నెలుంగు సూపి ర
క్కునఁ గదియంగ వచ్చి యిటకుం జనుదేరఁగ నేమి కారణం
బనవుడు నక్కిరాతుఁడు యథార్థము చెప్పుచుఁ జేరి మ్రొక్కి త
ద్ఘనమణి వాని కీయఁ దన కామినిరత్నముగా నెఱుంగుచున్. 149

చ. బోరిఁబోరి నొత్తుఁ గన్నులఁ గపోలయుగంబున నప్పళించుఁ జె
చ్చెర నధరప్రసక్తముగఁ జేయుఁ గళంబునఁ గూర్చు గోర్కిచే
నురమున నుచ్చుఁ దుడ్చుఁ గడునొప్ప మనోభవభూతశాంతికై
యరుదుగ రత్నపూస యఖిలాంగములం దిగ మోపుచాడ్పునన్. 150

క. 'ఓరత్నమ! నాఁ డాతరు,ణీరత్నము నన్నుఁ బాసి నీవిచటను నే
పారఁగ నుండితి వే మన, మారాజీవాక్షిఁ గందుమా యింక?' ననున్. 151

వ మఱియు ని ట్లని వితర్కించు. 152

క. అనితరసన్నిభ యగుమా,నిని నాకచ్చోట దొరక నేఁ దెచ్చెదుచో
ననుచితహేతుగుణంబులు, ఘనవిఘ్నచయంబు లగుట గానఁగ నయ్యెన్. 153

చ. అని తననాతిపోకకు నిరంతరచింత మునింగియు న్మనం
బునకును ధైర్య మూంచి పువుఁబోఁడుల కందఱకుం దగం బ్రసా
దనము దగంగ నిచ్చి వనితాసహితుండయి తత్పురస్సరం
బునఁ దనపట్టణంబునకుఁ బోయి ప్రణామ మొనర్చెఁ దండ్రికిన్. 154

వ. ఇట్లు ప్రణామ మొనర్చినకుమారుం గౌఁగిలించుకొని కరుణారసమిశ్రంబు లగు
నశ్రులు కన్నులం దొఱఁగ గద్గదకంఠుం డగుచు నతని కి ట్లనియె. 155

క. 'ఇన్నాళ్లు నిన్నుఁ గానక, కన్నులు గల్గియును లేనిగతి నుండితి నే
నన్నా! నీ కిటు సేయఁగఁ, జన్నె నీయట్టిసుగుణసంపన్నునకున్. 156

క. పోయెదువాఁడవు తదభిప్రాయ మెఱుఁగఁ జెప్పి పోవరాదే నీకై
రేయును బగలును జింతాతోయంబులు వెల్లివిరియఁ దోఁగితి పుత్రా! 157

చ. అది యటు లుండె దైవము దయం జనుదెంచితి చాలు నింక నా
బ్రదుకు ఫలించెఁ గుంభి యట రాఁ డెట పోయెఁ దనూజ! యప్సర
స్సదతుల బోలువీ రెచటిసుందరు? లిచ్చటి కెట్లు వచ్చి రే
మి దయను? జెప్పు' మన్నఁ దనమిత్త్రునిపోకకు వెచ్చ నూర్చుచున్. 158

క. అనుమతి ప్రసంగ మెయ్యెడి,యును దడవక గుహకుఁ జనుటయును నచ్చో నీ
వనితల గనుటయుఁ గుంభిని, ఘనగుహ వాకిటను నిలువఁగా నుంచుటయున్. 159

ఉ. చెప్పి 'నృపాల! యే నటులు చేసి గుహోద్గమనంబు సేయుచో
నప్పుడు మత్పదంబునకు నడ్డముగాఁ బెనుగుండు ద్రోచి యే
చొప్పుననొక్కొ యెవ్వఁడొకొ చొప్పడ నేమివిధంబొ యయ్యెనో
చెప్పఁగఁ జెట్ట లే నచటఁ జిక్కితిఁ గుంభియు నెందుఁ బోయెనో. 160

క. అచ్చోటఁ గొన్నిదివసము, లిచ్చెలువలు సేమ నుండ నీ యర్జునకుం
డచ్చటికి వచ్చి వెలువడఁ, దెచ్చిన వచ్చితిమి భాగధేయము పేర్మిన్.' 161

క. అని చెప్పి తదనుమతి నవ్వనజాక్షుల నందఱకు వివాహం బై నూ
తనమన్మథుఁ డనఁగ నతం డనుదినమును మదనకేలి నలరుచునుండెన్. 162

చ. దితిజవధూటిభావమునఁ ద్రెక్కొనుదుఃఖము లెల్లఁ బోవఁగా
నితనికి నైనదిక్కును నహీనదయామతిఁ జేసి మేనకా
సుతకును గల్గులాంఛనము చొప్పడఁగా ఘనయోగవైభవో
న్నతి నొకయోగికాంత నృపనందను పాలికి వచ్చె వేడుకన్. 163

సీ. బాలారుణద్యుతిఁ బరగుజక్కవలాగునఁ గావి బట్టలోఁ గుచము లమర
నంగజుతురగంబునంకవన్నెలభంగిఁ జెలువంబులై వ్రేలుఁ జెవులు మెఱయ
మరుఁ గన్నతల్లికి మందిరం బగుతమ్మివిరిలీల నెమ్మోము విలసితముగఁ
గాముఁ జంపినవేఁడికంటిక్రొవ్వడఁగించుచలిగంటిక్రియ ఫాలతిలక మమర

తే. నతనుఁ గ్రమ్మఱఁ బుట్టించునౌషధముల, చిప్ప నాఁగ భిక్షాపాత్ర యొప్పుమిగులఁ
జెలఁగి తన మ్రోల నిలిచినసిద్ధవనితఁ, జూచి నృపసూతి గొబ్బున లేచి మ్రొక్కి.

వ. అక్కాంతచేతం గృతాశీర్వచనుండై సబహుమానంబుగాఁ దెచ్చి కూర్చుండం బెట్టికొనిన. 165

క. పెదవులు గదలెం గదలవు, రదనంబులు గాన వచ్చె రా వనుపాటిన్
మృదువచనరచన లెసఁగఁగ, ముదిత యతనిహృదయకమలముం గరఁగించెన్. 166

వ. ఇవ్విధంబునం బూర్వరంగంబు లగుప్రసంగంబులు చెల్లెం దదవసరంబునఁ బావక లోముండు. 167

తే. 'ఎచటనుండి వచ్చి తిందుల?' కనిన న,య్యగ్నిలోమునకును ననియె వనిత
'సకలభూములందుఁ జరియింతు నే నిక్క,డక్కడనఁగఁ గలదె యొక్కచోటు.'

క. అన విని 'నీవు చరించుచుఁ, గనినట్టివి వింత లేమి గల?' వని యడుగఁగా
గను మట్టు లైనఁ జెప్పెద, నని యి ట్లని చెప్పెఁ దాపసాంగన ప్రీతిన్. 169

చ. అనుమతి నాఁగ నాట్యనగరాధిపుఁ డయ్యజవత్సుకూఁతురా
కనకలతాంగిఁ దత్కమలగంధిని మున్ను స్వయంవరోత్సవం
బున వరియించి వాతఁ డెట పోయిననో మఱి యొక్కఁ డేను బొ
మ్మని కొనివచ్చి తత్పితృసమక్షమున న్మదిరాక్షి నుంచినన్. 170

ఆ. వార లియ్యకొని వివాహంబు సేయ న,పక్రమింపఁ గొన్నివక్రభావ
లుచ్చరించి వీని నొల్ల వీఁ డెక్కడి, భర్త నాకు వీఁడు పాతకుండు. 171

క. నాపెరిమిటిఁ గనునంతకు, నీపాపాత్మునిఁ జూడ నే నిది మొదలం
జాపాలఁతి నేత్రపట్టం, బేపారఁగఁ గట్టియున్న దెవ్వఁడు పలియో. 172

ఆ. రాతిబొమ్మ కైనఁ జైతన్య మొనరించి, కరఁగఁ జేయ వచ్చుఁ గాని మఱియు
రమణిదైన యంతరంగంబు గరఁగింప, నంగభవున కైన నలవి గాదు.' 173

క. అని చెప్ప నాతపస్విని, విని రాజతనూభవుండు వెఱఁ గందుచు న
య్యనుమతి నెవ్వఁడొకో తోఁడ్కొని చని కడుదుఃఖపఱిచెఁ గుత్సితవృత్తిన్. 174

చ. అని తలపోసి స్వమనమునందు జనించువియోగశోక మ
వ్వనితకుఁ దోఁప నీక మృదువాక్యపురస్సరవస్తుసంపదల్
తనరఁగ నిచ్చి పంపి త్వరితంబున నయ్యజవత్సుప్రోలికిం
జని కఱియెన్ ద్వితీయనృపుచాడ్పున సద్భటకోటి గొల్వఁగన్. 175

ఆ. అందలంబుమీఁద నాతపత్త్రము వట్ట, వీరచామరములు వీవఁ గాను
నంబరానులేపనాకల్పదీప్తులఁ, దేజ మెసఁగ నరుగుదెంచువాని. 176

చ. కని యతఁ డెవ్వఁ డంచు నడుగం బ్రజ లయ్యజవత్సునల్లుఁ డం
చుచు దగఁ జెప్పఁగా నుఱక శ్రోత్రపుటంబులఁ జొన్ని తేరకోఁ

గనుఁగొని కుంభిగాఁ దెలిసి 'కానలలో నలసాఁడ యీదురా
త్ముని మృతుఁ గాఁ దలంచి పగఁ దూలితి నిట్లగు టెట్లెఱుంగుదున్., 177

క. ఈతఁడె నిట్టిగుణంబే, నాతివలనఁ గల్గెఁ గాన నాకిచట నప
ఖ్యాతి వడ దయ్యెఁ గాకీ, పాతకుఁ డిదె కంటె యెంతపనికిం దొడఁగెన్. 178

ఆ. నమ్మఁ దగదు పరుల నమ్మినే నేఁజాలి, వాని నైన నమ్మవచ్చుఁ గాని
స్వర్ణకారకుండు సర్వజగద్ద్రోహి, కాన వాని నమ్మఁ గాదు తెలిసి. 179

క. మాతండ్రి కిష్టసచివుం, డై తగఁ జరియించు నీదురాత్మకుజనకుం
డాతనికిఁ గలగుణమ గా, కీతని కొకగుణము వచ్చునే యని తలఁతున్. 180

ఉ. కావున మున్ను వీనికొఱగామి యెఱుంగక పెద్దఁ జేసి యే
తావున విశ్వసింతు నకటా తన కీమన సెట్లు పుట్టె నిం
కేవిధ మాచరింతు నని యిచ్చఁ దలంచుచు నుండఁ గుంభియుం
బావకలోముఁ గన్గొని సుపర్ణునిఁ గాంచినపాము కైవడిన్. 181

తే. తల్లడించుచుఁ బెదవులు దడపుకొనుచు, బిలము వల్వడఁ ద్రోవఁ జూపినదురాత్ముఁ
డెవ్వఁడొక్కొ యిచ్చోటికి నేమి గుడువ, వచ్చెఁ గ్రియమాలి వీఁ డంచు వెచ్చనూర్చి.

చ. హరహర మున్ను నాదగుమహాశ నిరాశముఁ జేసి లోకభీ
కరుఁ డగుదైత్యుఁ డడ్డపడి కామినిఁ దాఁ గొనిపోయెఁ గ్రమ్మఱన్
వెరపునఁ దెచ్చుకొంటి వెనువెంటనె వీఁ డిదె వచ్చె వీని నేఁ
బొరిగొనకున్న దక్క దనుబుద్ధి నిజాప్తులఁ బిల్చి యి ట్లనున్. 183

క. 'ఈతఁడు మాతండ్రిపగతుఁ, డీతనిఁ గొనిపోయి యూరి కెడ దవ్వగుచోఁ
జేతులఁ గాళ్ళును నఱకుం, డీతఁ డిచట నున్న మనకు నెగ్గొనరించున్.' 184

వ. అని యల్లన చెప్పి యప్పావకలోముం దనవ్రేలం జూపి పొండు పొం డని వారిం దఱిమినం బోయి యంటంబట్టి కట్టికొని పట్టణంబు వెడలంగొని పోయి దుష్కృతారంభి యగునక్కుంభి చెప్పినట్ల ఖండించి వైచిపోయిన. 185

క. బాపురే దైవము నన్నుల, శాపఫలము గుడుచుకొఱకు జనకుని సతులం
బాపి యిటు లొంటిఁ దెచ్చితె, శాపావధి యెవ్వరింక సమకొల్పెదరో. 186

వ. అని యక్కుమారుండు శోకించుచుండు నంత. 187

ఉ. చేరువతోఁటవాఁ డొకఁడు శీఘ్రగతిం జనుదెంచి వానియా
కారముఁ జూచి యాత్మ ననుకంప జనింపఁగ రక్త మంతయున్
బోరనఁ బాఱ నెత్తికొనిపోయి లతావృతశాఖినీడఁ ద
న్నా రెడుషణ్ణతల్పమున నల్లనఁ బెట్టి క్రమక్రమంబునన్. 188

ఆ. కాచి మందు వెట్టి కడుపార నశనంబు, దెచ్చి యిడుచునల్పదినము లందుఁ
బుండు లెల్ల మాన్చి పూఁదోఁటలోనన, యొక్కయిల్లు గట్టి యునిచె నతని. 189

చ. అతఁడు నతండు తండ్రియుఁ దదంగన తల్లియుఁ గాఁ దలంచుచున్
హితయుతబుద్ధి నవ్వన మనేకవిధంబులఁ గాచియుండు సం
తతకుసుమప్రవృద్ధిని లతాతతి ప్రస్తుతి కెక్క నీగతిం
గతిపయమాసము ల్వడలఁగాఁ గనుచాటు జనించెనో యనన్. 190

ఆ. ఆకసంబు చుక్క లర్కోదయంబున, కడఁగి రూపరేఖ లడఁగునట్లు
కొండతేనిఖూఁతు కుసుమాపచయకేళిఁ, బోవుఁ బ్రతిదినంబుఁ బువ్వులెల్ల. 191

ఉ. పోవఁగఁ జూచి మాలకరి భూపతనూభవుఁ జేరి 'పుత్ర! నీ
కావలి నెప్పుడు న్వెలితి గావు ప్రసూనము లానిమిత్తమై
జీవనభార మెల్ల నడచె న్మన కిప్పు డిదేమి పాపమో
పూ వనుపేరు మందు నకుఁ బోయినఁ జొప్పడ దివ్వనంబునన్. 192

వ. అని పల్కుచుం బోయిన నమ్మాట మఱవక మనంబునం బెట్టుకొనియుండి. 193

చ. పనివడి పుష్పచోరకులఁ బట్టుదు గట్టిగ నేఁటిరాత్రి యే
యనువున నైన నంచు నతఁ డల్లన నొక్కెడ డాఁగియున్నచో
ననిమిషకామిను ల్గొలువ నంబిక వచ్చె నిజాంఘ్రినూపుర
ధ్వను లెసఁగంగఁ బుష్పితలతల్ రభసంబున నెక్క కోయఁగన్. 194

ఆ. త్రొక్కియున్న తీఁగె ప్రక్కవాసిన జాఱి,పడియె గౌరి వానియొడలిమీఁదఁ
దత్పదాబ్జయుగము దాఁకి శాపము వీడి, వచ్చెఁ బాణిపాదవనరుహములు. 195

క. వచ్చిన నానృపపుత్రుఁడు, మ్రుచ్చఁదగులువడియె ననుచు ముద్దియయడుగుల్
గ్రచ్చుఱఁ బట్టిన భయపడి, యచ్చెలువ నిజేశు నీశు నభవుం దలఁచెన్. 196

చ. తలఁచిన నార్తరక్షకుఁడు దా నగు పేర్పడఁ జూపుమాడ్కిఁ జే
తుల డమరుత్రిశూలములతో నిటలంబున మోడ్పు ఱెప్పతో
గళమునఁ గప్పుతో ముఖవికాసముతోఁ దరుణేందు రేఖచేఁ
బొలు పగుమౌళితో నతివిభూతి మెయిం జనుదెంచె శంభుఁడున్. 197

వ. అంత నప్పావకలోముందు తనకరచరణంబులు వచ్చుటకు నచ్చెరువు నొందుచు నన్నితంబిని యఖిలజగదంబ యగునంబికగా నెఱింగి సంభ్రమించుచు దిగ్గన లేచి యవాఙ్మానసగోచరు లగుపార్వతీపరమేశ్వరులు దనకు దృష్టిగోచరు లగుటయుఁ బరమానందంబున సాష్టాంగదండంబులు సమర్పించి చేతులుమొగిడ్చి యిట్లని స్తుతియించె. 198

సీ. 'శమదమప్రభృతు లాచారముల్ గాఁ గలఘనతపోవీథులఁ గ్రాలువారు
యమనియమాదు లంగములు గాఁ గలయోగవిద్యలం దధికులై వెలయువారు
భయభక్తు లూఁతగాఁ బరగెడుదాస్యకర్మంబుపైఁ జిత్తంబు మరుపువారు
సత్యశౌచంబులు సత్సహాయంబుగాఁ బొలుచునిశ్చలబుద్ధి గలుగువారు
తే. నిన్నుఁ గనసేర రనెడుచో నెన్నిభవము, లందు నినుఁ గాన నేర్తురే యన్యజనులు
నిట్టినీమూర్తిఁ గనుఁగొంటి నిపుడు నాదు,భాగ్య మే మని చెప్పుదుఁ బార్వతీశ!

ఉ. నెయ్యపుఁగయ్య మైనతఱి నీవు హిమాద్రిజఁ దేర్పఁ బూని మే
నొయ్యన వంప జూటమున నుబ్బుమహానదిస్రోత కోడి యూ
తొయ్యలి దాన ము న్నొగి నెదుర్కొనఁ దేర్కొనరానివేడ్కతోఁ
జయ్యన నెత్తునీదునెఱజాణతనంబుఁదలంతు శంకరా! 200

ఉ. ఆఱుమొగంబు లాతఁడు మదాత్మజుఁ డాతని ముద్దు సేయఁగా
నాఱుమొగంబులు న్వలయు నంబిక యేను నీవుఁ గూడఁగా
నాఱుమొగంబులౌ నతి రయంబున రమ్మని నీవు నవ్వుచుం
జీఱుట యోగివర్యులకుఁ జింత్య మగున్ ముఖపంచకోజ్జ్వలా! 201

క. ఒకభాగమున సతీత్వము, నొకటఁ బతిత్వమును దాల్చియుండుట నిన్నుం
బ్రకృతిపురుషాత్మకుం డగు,సకలేశ్వరుఁ డంద్రు పరమసంయములు శివా!' 202

వ. అని మఱియు జయజయపూర్వశబ్దకంబుగా నయ్యాదిమదంపతుల దివ్యనామంబులు
పేర్కొని ప్రస్తుతించిన నమ్మహాదేవుండు ప్రసన్నభావుండై 'వత్సా! నీ కొక్కవ
రం బిచ్చెద వేఁడు' మనిన నతం డి ట్లనియె. 203

క. 'ఓ పార్వతీశ! పరమద, యాపర! నేఁడు నినుఁ జూడ నబ్బుటచే నా
పాపము సుకృతం బయ్యెను, శాపము వర మయ్యె జన్మసాఫల్యముగన్. 204

ఉ. కావున నింక నాకు నడుగ న్వర మెయ్యది మత్కరాంఘ్రిరా
జీవము లేను బొమ్మనినఁ జెచ్చెర రమ్మనినం గ్రమంబునం
బోవను రా నొసర్పుము ప్రభూతమతిన్ భవదీయభవ్యసం
సేవ యొనర్చుచోట ననుఁ జెందఁగఁ జేయకు మంతరాయముల్'. 205

క. నావుడు నీయడిగినటుల, కావించెద నుండు మనుచు గంగాధరుఁ డా
దేవియుఁ దాను నమరకాం, తావలి గొలువంగ రాజతాద్రికి నేఁగెన్. 206

క. ఆసమయంబునఁ బువ్వు ల్గోసి నృపాత్మజుఁడు దండలును నెత్తులుఁ గా
వేసఱక కట్టి కడు సం,తోసము నిప్పటిలఁ బొదివి తొలఁగఁగఁ బెట్టెన్. 207

ఉ. ఇన్నిదినంబు లంఘ్రికరహీనత నొందియు నిష్ఠఁ దా జగ
త్సన్నుత యైనపార్వతి ప్రసన్నతఁ బూర్ణత నొందె భాగ్యసం
పన్నుఁడు వో యితం డనుచుఁ బావకలోకముఁ జూడ వచ్చిన
ట్లున్నతపూర్వశైలశిఖరోపరిఁ దోఁచెఁ బయోజబంధుఁడున్. 208

వ. ఇట్లు సూర్యోదయం బగుటయుఁ బుష్పలావికుండు వచ్చునప్పు డప్పావకలోకముం డెప్పటియట్ల విగతకరచరణుం డై పడియుండి 'తండ్రీ! మనతోఁటపువ్వులు చోరులపాలు గాకుండ నేఁడు నాసంగడీలచేత నన్నియుం గోయించి యాయితంబు చేయించినవాఁడ నవిగో కొనిపొ'మ్మని చూపిన సంతోషించి నాయన్న! కంటిం బొమ్మని కొనియాడుచుఁ గొనిపోయె నిట్లు ప్రతిదినంబునుం గొనిపోవుచుండ నొక్కనాఁ డతనిభార్య వచ్చి వాత్సల్యం బెసంగ నవ్వసుధేశనందనుదగ్గఱఁ గూర్చుండి తల నివిరి యుపలాలించి మఱియు నిట్లనియె 209

సీ. 'సుతుఁడ! నీ వొక్కప్రొద్దుఁ జూడరా సెడలేదు మనయింట నెప్పుడుఁ బతులుగలవు
ప్రొద్దున నశనంబు పుత్తెంతుఁ గడుపారఁ గుడుతె దింపవు గదా గుడిసెలోన
నొడ లుమ్మలించిన నొకపూట వెలుపట నుండుమీ చనుదెంచి యూరుపోక
యన్న! నీమనికి మీయన్న దా నేతంటయును లేక నెమ్మది నున్నవాఁడు
ఆ. నాకు నీవె దిక్కు నాబుద్ధి వినుము నీ, సంగడీలలోన స్వర్ణకార
కుండు లేఁడుగా యతం డుండెనేని నేవంకనైనఁ గీడు వచ్చుఁజుమ్ము. 210

ఆ. అనినఁ 'దల్లి! వాఁడు మనుజుండు గాఁడే యునర్థుఁ డేల యయ్యె నాత్తశకును
నివ్విధంబు నాకు నెఱిఁగింపవే' యని, యడిగె నగ్నిలోముఁ డతివఁ జూచి. 211

చ. అడిగిన నవ్వధూటి 'తనయా! విను చెప్పెదఁ బెద్దవారిచే
నడరఁగ మున్ను విన్నయితిహాసము కోమలభాస్కరుం డనం
బడునతఁ డొక్కనాఁడు తనబాలసఖుండును దానుఁ గూడి పే
రడవిఁ జరించుచో రుధిర మగ్గిరినుండి స్రవించుచుండఁగన్. 212

క. ఈరక్త మిట్లు దొఱుఁగం, గారణ మేమియొకో తెలియఁ గన్గొనవలయున్
బోరనఁ బోదము రమ్మని, వారిరువురుఁ గొండ యెక్కి వచ్చుచు నెదురన్. 213

మ. కని రశ్వత్థకపిత్థబిల్వబదరీఖర్జూరపున్నాగచం
దనచించామ్రతమాలతాలవటహింతాలార్జునాశోకకాం
చనజంబీరకదంబనింబముఖవృక్షశ్రేణిచేఁ జూడ నొ
ప్పినబుష్యాశ్రమముఁ సశీతలజలోపేతాంబుజాగారమున్. 214

క. కని కదియం బోవునప్పుడు, వనమంతయు హోమధూమవాసితముగ నె
క్కొని వెల్గు భవ్యతేజం,బున శిష్యులు గొల్వ నున్నమునిం గౌండిన్యున్. 215

క. అల్లంత నెదురుకట్టుల, నుల్ల మలరం గాంచి భక్తియుక్తు లగుచు ను
త్ఫుల్లముఖాంబుజములు శో,భిల్ల నమస్కృతు లొనర్చి పేర్చినవేడ్కన్. 216

చ. కదియఁగఁ బోవ నప్పరమకారుణికోత్తముఁ డాదరించి 'నె
మ్మదిని భవత్సమాగతసముచితసౌఖ్యము మాకు నబ్బెటన్
సుదివస మయ్యె నేఁ' డనిన 'సూరిజనోత్తమ! యిట్టు లానతి
చ్చెదరు భవత్పదంబులకు శిష్యుల మంతియ కాక వింతయే.' 217

చ. అని యుచితప్రసంగముల నచ్చటఁ గొండొకసేపు నిల్చి 'యో
మునివర! యీమహాగిరిని మున్కొని పాఱెడురక్తధార యేఁ
గనుఁగొని తన్నిమిత్త మడుగం జనుదెంచి భవత్కటాక్షమున్
గని కృతకృత్యతం బొరయఁ గంటిఁ బురాకృతపుణ్యసంపదన్. 218

వ. కావునఁ దద్రక్తపూరం బట్లు కాఱుటకుం గారణం బెయ్యది చెప్పుం' డనిన నతని
కతం డి ట్లనియె. 219

సీ. 'కలదు విశాల నాఁ గమనీయ మగుప్రోలు రాజు దానికి శంబరక్షితీశుఁ
డత్యంతధార్మికుం డాతనిపుత్రుండు సౌందర్యవంతుండు శాంభుఁ డనఁగ
నెగడువాఁ డొకనాఁడు మృగయార్థ మడవికి నేతెంచి మృగముల నేసి యేసి
యలసి మదీయాశ్రమాగతుం డగుటయు నతనికి నన్నపానాదు లొసఁగ

ఆ. నతఁడు తృప్తిఁ బొంది కతిపయదివసముల్, చెంది యస్మదీయసేవ చేసి
యేది యిష్ట మనిన నిలఁ బరకాయప్ర,వేశవిద్య తనకు వేడ్క యనియె. 220

క. పృథివీపతిసుతుకోరిక, వృథ సేయక యే నొసంగి వీడ్కొలిపిన నా
ప్రథనపరాక్రముఁ డరుగుచుఁ, బృథుగహ్వర మొకటి గాంచి ప్రియపడి చొచ్చెన్.

ఉ. చొచ్చి చనంగ భోగవతిఁ బొప్పున నొప్పు స్రవంతి యుండఁగా
నచ్చటఁ గ్రుంకు వెట్టి వెస నవ్వలి కేఁగి బలీంద్రువీడు నా
నచ్చుగుప్రోలు గాంచి వెఱఁ గందుచు నం దొకపేదరాలియిల్
చెచ్చెరఁ జేరి యుండఁ జెవిఁ జెందె వధూమృదుగీతనాదముల్. 222

చ. విని తలయెత్తి చూచి పృథివీపతినందనుఁ 'డవ్వ! యివ్విధం
బునఁ జెలరేఁగి రాగరసపోషణ చూపెడుకీరవాణి యె
వ్వనిసతి నామ మెయ్యది ధ్రువంబుగ నా కెఱిఁగింపు' మన్న ని
ట్లనునది 'యిప్పురంబు వనజాసనుచేతఁ దపోబలంబునన్. 223

తే. వడసి విక్రమకేతుఁ డన్వాఁడిదియసుర, శుక్రశిష్యుండు సమరపరాక్రముండు
దనుజుఁ డనుమాట గాని సద్ధర్మరతుఁడు, వానియిల్లాలు చరితాభిధాన గలదు.

సీ. ఆయింతికూఁతు రీతాయంబు సేయుంలతాంగి యాంగిరస యనంగఁ బరగు
నిటమున్న పెండ్లి లే దిది రూపయౌవనోద్రేకంబు పెంపున న్వేఁగ లేక
చెలికత్తియలఁ గూడి పలుమాఱు నీరమ్యహర్మ్యంబుమీఁద నొయ్యార మెసఁగఁ
బాటల నాటలఁ బరిహాసరచనలఁ బూని వినోదించుఁ బ్రొద్దు పోక

ఆ. యనిన శాంభుఁ డంగజాధీనమానసుం, డగుచు దనుజతనుజయందుఁ గాంత
యగ్గలింప నెవ్వఁ డబ్బునొకో నాదు, కోర్కి దీర్పఁ జాలుగుణయుతుండు. 225

క. అని తలఁచునంత రుదిత, ధ్వని వినిపించె నొకచోట ధరణిపసుతుఁ డె
వ్వనియింటియేడ్పు లని యవ్వనిత నడుగ నదియుఁ జూచి వచ్చి యిటు లనెన్.

క. ఈపాడెదుపూఁబోఁడికి, రూపింపఁగ దాది యగుశరణి మృత యైనన్
వాపోయెద రనవుడు నతఁ, డీపరకాయప్రవేశ మెన్నటి కింకన్. 227

సీ. ఒకనికి నీవిద్య యొసఁగ నాతఁడు పోయి దాదిదేహంబునఁ దగ వసించి
మొదలింటి యట్టుల మెదలుచు నెరవుతో నామీఁదిప్రేమంబు నాఁటుకొలుప
నప్పుడేఁ గదిసి గాఢాలింగనాదుల నలరించి యాముగ్ధ నతివిదగ్ధఁ
గావించి నెయ్యంపుఁగయ్యంబు లాడవించి చయ్యనఁ దెలిసి ప్రసాదచిహ్నఁ

ఆ. గని సుఖాబ్ధిఁ దేలి కాక నామదిలోని, తృష్ణ యూర కేల తీఱు ననుచు
వనరి వనరి యొక్కస్వర్ణకారకుపొందు, గాంచి వాని కట్లఁ గఱపి పుచ్చెఁ. 228

చ. అతఁడును నేఁగి దాదియెడ లాదటఁ జొచ్చి యథోచితంబుగా
నతివకు నప్పటప్పటికి నానృపపుత్రునిరూపవైభవో
న్నతి వినిపించుచుండఁ గను దా వినుచుండఁగ దానిచిత్తమ
య్యతనునిచేత నోటుపడి యాటలఁ బాటలు వీటిఁ బోవఁగన్. 229

తే. గోర నేల వ్రాయుఁచును కన్నీరు నినుపఁ, బెరిగి యదియేఱుగాఁగను ధరణిఁబాఱె
నౌర గోర వ్రాయంగ నేఱయ్యె ననుచుఁ, బలుకు నానుడి యిదియని తెలుపునట్లు.

క. ఆయబలయున్కిఁ గని పర, కాయస్థుం డగుసువర్ణకారకుఁడు నిజో
పాయము తుదిముట్టె ననుచుఁ, బోయి యెఱిఁగించె రాజపుత్రున కెలమిన్. 231

చ. అతఁడును నవ్విధంబునకు నచ్చెరు వందుచు నవ్యరూపశో
భితుఁ డగునెయ్యునిం గదియఁ బిల్చి కవుంగిటఁ జేర్చి 'యన్న! నీ
కతమున మన్మథుఁ గెలువఁ గంటిఁ దదుత్తరకార్యసిద్ధి యే
గతి నొడఁగూడు నట్టిగతి గాంచి యొనర్పుము సౌమ్య' నావుడున్. 232

ఉ. చయ్యన దైత్యరాజసతిసన్నిధి కేఁగి భవత్తనూజ కే
దయ్యము సోఁకెనో మిగులఁ దాపము నొందుచు నాఁడునాఁటికిన్
దయ్యెఁ దొడంగె నావుడును దద్దయు భీతిలి సెజ్జ డిగ్గి తాఁ
బయ్యెదకొంగు జాఱఁ గచభారము వీడ మహారయంబునన్. 233

క. చని తనకూఁతుముఖాకృతి, గనుఁగొని యిది యొండు గాదు కామవికారం
బని తెలిసి సముచితోక్తులు, దనర ననునయించి మఱియుఁ దగ నిట్లనియెన్. 234

తే. 'సఖుల నైన ముందలయెత్తి చక్కఁ జూడ, నేర వభిమానశీలవు నీరజాక్షి!
యట్టి నీచూడ్కి యెవ్వని నైన నిపుడు, తగిలినట్టుల పొగిలెదుఁ దగునె తగుల.

వ. అంతియ కల్గనేని నింత చింతింప నేల నాతోడఁ జెప్పరాదే' యనిన నది లజ్జావనత వదనాబ్జయై కనికరించి దాదిదెస వీక్షించినం దద్దేహగతుం డగునతండు వాతప్పక యిట్లనియె 'మేము దాదుల మస్మదాదులమాట లాత విశ్వసించెద రెట్లు ప్రకారాంతరంబునం బరామర్శింప నవధరింపుదు గాక' యనిన 'నోహో! యిట్టు పలుకం దగునె తెవ్రులు దీఱినం జాలుఁ గాక వెజ్జు కామదేవుండు గావలయునె యదియుంనుం గాక నూఱునులకత్రాళ్ళ గూడి యొక్కమోకు గానేర్చునే మాకు నీకంటె నవశ్యు లెవ్వరు దీనివలన నాకు నవమానభారం బొక్కటియకాని తక్కటిభారంబు లెల్ల నీయదియె కావే' యనుచు దనుజమాత ప్రియంబులు చెప్పిన 'నింత చెప్ప నేల నవ్వుటాల కంటిం గాక నాకన్నంత చెప్ప కేల యుండుదు నిది యెవ్వరి యింటిశోభనంబు తల్లీ! యాకర్ణింపు' మని యారాజకుమారుం డప్పురంబునకు వచ్చుటయుం వానికి నమ్మగువ దగులువడుటయు నెఱింగించి మఱియును. 236

క. 'తల్లి గలఫలము కూఁతుకు, నుల్లము రంజిల్లఁ జేయ నోపెడివరునిం
దెల్లముగ నరసి తఱితో, నిల్లు నిలుప వలదె' యనుచు నేర్పడఁ జెప్పెన్. 237

క. చెప్పిన నది తనమగనికిఁ, జెప్పి నృపాత్మజుని రూపజితమనసిజునిన్
రప్పించి తనతనూభవ, నిప్పించినఁ గూడి యుండి రిరువురుఁ బ్రీతిన్. 238

క. తదనంతరంబ దాదిని, వదలి ప్రథమతనువు చొచ్చె వాఁడును మఱి కొ
న్నిదినంబులకు నతఁడు తన,ముదితం గొని జన్మదేశమునకుఁ బయనమై. 239

క. పోవఁగ నయ్యగసాలెయు, వావిరిఁ దోడరుగ నొక్కవనమధ్యమునన్
గేవల పక్వఫలంబుల, ప్రోవై యొకవెలగ యుండఁ బొడగని వేడ్కన్. 240

ఉ. భామిని గోరె నావెలగపండులు గోయ నుపాయ మేది యా
భూమిపనందనుండు దలపోసి పథంబునఁ జచ్చియున్న శా
ఖామృగమందుఁ జొచ్చి తమకంబున వృక్షము ప్రాఁకె నంతలో
నామచుజాధముం డతనియంగము సొచ్చి కృతఘ్నచిత్తుఁడై. 241

క. ఆకపి రాల్పఫలంబులు, పీకునఁ గొని వచ్చి యిచ్చి 'విమలాబ్జముఖి!
యీకానలలో మృగము ల,నేకంబులు గలవు మనకు నేలా తడయన్. 242

ఉ. పోదము రమ్ము రమ్మనుచుఁ బోల్తుకఁ దాఁ గొనిపోవ దాని నాఁ
గా దన లేక శాంభుఁడు జగంబునఁ దిట్టనిలిట్టు క్రోఁతియై
గాదిలిపల్లెఁ గోలుపడి కష్టదశం బడఁ బ్రాప్త మయ్యె ని
కేది తెఱంగొకో యనుచు నింతను నంతను గూడి పాఱఁగన్. 243

ఆ. అలివ క్రోఁతిఁ జూచు నతనిదిక్కుఁను జూచు, మర్మకర్మ మైనమాట యతని
యందుఁ గల్గ కునికి సందేహపడు నిశ్చ, యించ లేక మోసు వంచి నడచు. 244

వ. మఱియు నిట్లని వితర్కించు. 245

చ. తెరువున మమ్ముఁ గూడి చనుదెంచినమానవబాలుఁ డొక్కఁ డా
తరువులనీడ నప్పుడు ముదంబున నిద్రితుఁ డయ్యె వానిచొ
ప్పరయక వచ్చె నీతఁ డిది యారసి చూడఁగ నేమి మాయయో
నరపతి గాఁ డనంగ నగునా కనరాదు విచార మయ్యెడిన్. 246

క. కానిమ్ము పొమ్మది యెవరి, దైన శరీరంబు నృపతి యదియ కదా యే
మానినియు మగఁడు చచ్చిన,చో నాతని మేనితోన చొరదే వహ్నిన్. 247

వ. అదియునుంగాక యొక్కయితిహాసంబు గలదు. 248

సీ. మును బావమఱఁదు లిమ్ముల నంబికకు గండదల లీయ నిరువురతరుణు లపుడు
ప్రార్థింప నద్దేవి ప్రత్యక్షమై వీరిప్రాణంబు లిచ్చెదఁ బాసి యున్న
బొందులఁ దలలను బొందింపుఁ డనిన నాసతులు వీడ్వడఁ గూర్ప నతని నతని
సంజీవితులఁ జేసి చనియె నవ్విపరీతధర్మంబుఁ జూచి పెద్దలకుఁ జెప్పఁ
తే. దనువునకు నెల్ల శిరము ప్రధాన మనుచు, భర్తృముఖులఁ దత్సుతులకుఁ బతులఁ జేసి
రంతకంటెను నిది దేహ మంతవట్టు, తొంటియట్టుల యున్నది దోష మేమి. 249

క. శుద్ధపశువ యీనరుఁడు ని,షిద్ధసుఖము గల్గినపుడు చేకొనె నేనిన్
శుద్ధపశువు కా నరుఁడు ని,షిద్ధసుఖము గల్గినపుడు చేకొనఁ డేనిన్. 250

చ. అని నృపదేహధారి యగు నయ్యగసాలెను గూడి యుండె న
వ్వనిత వసుంధరాధిపుఁడు వానరదేహము నొందియు న్మదిన్
బనువడియున్న దైత్యసుతఁ బాయఁగఁ జాలక యుండు లెక్కఁ దాఁ
గనుఁగొనుచుండ వాఁ డతనిఁ గాంచి మనంబున భీతి పుట్టినన్. 251

క. కడు వలిగి యూరిలోపలి, పడుచుల రావించి యీ యబద్ధపుఁగ్రోఁతిన్
బడుకుల వైచుచు నిప్పుడ, వెడల నడిచి రండు నిలువ నిదుపకుఁ డిచటన్. 252

మ. అనిశన్ బొబ్బలు పెట్టుచుం దగులఁగా నాక్రోఁతి యింటింటికిం
జను గొందు ల్బొరఁ బోవు నొంటి చనినం జంకించుఁ బె న్మ్రాఁకఁ గ
న్గొని భీతిల్లు నగళ్ళ ప్రాఁకుఁ దరు లెక్కుం దిగ్గు నడ్డంబు వ
చ్చు నటుంచున్ మఱి వెక్కిరించుఁ గిఱుకించున్ డాగురించుం బోరిన్. 253

క. పొదగానము లే మర్కట, మదఁప నపుచు వెదకి వెదకి యలసినయెడ నె
క్కడనుండియేని గానం, బడుఁ గో యని యార్చి వెంటఁబడ వడి తొలఁగున్. 254

క. ఇవ్విధమునఁ ఖర మంతయును, నివ్వల నవ్వలను శేఁగి యెప్పటిరాల్గ
రువ్వంగ బెగడి రయమున, నవ్వనచర మేఁగె దట్ట మగుకానలకున్. 255

ఆ. అచటి నీరు ద్రాగి యారణ్యఫలముల, జాఠరాగ్నిఁ గొంత చక్కఁ జేసి
విరహావహ్నిచేత వెచ్చుచు నిట వచ్చి, యొక్కశుకశవంబు నొనరఁ గాంచి. 256

ఆ. అనరాధముండు వానరాకృతి నుంటి, నేని నన్నుఁ జూచి యెఱుఁగుః గాని
యితరరూప మైన నెఱుఁగఁడు పక్షినై, పోదు నపుచుఁ జిలుకబొంది సొచ్చి. 257

ఉ. మక్కువ యెట్టిదో తనదుమానినిఁ గన్నుల నైనఁ జూతు నం
చొక్కటఁ బాఱెఁ గీరతను వొంది వియద్గతి నాతఁ డప్పు డా
చక్కటిఁ బచ్చ తోరణముచాడ్పున నింద్రుశరాసనంబున
ట్లక్కజమై తనుద్యుతిచయంబు జనావలి కింపుఁ బెంపఁగన్. 258

క. అతనునరు నోడి శరణా, గతుఁడై తత్సేవఁగోరి కాఁకున్న మహీ
పతిసుతుఁ డీగతిఁ గీరా, కృతిఁ గైకొనియె నని బుధులు కీర్తింపంగన్. 259

చ. చెలఁగుచుఁ బాఱి తత్సదనసీమఁ జరింపుచు నుండ వాఁడు న
న్నెలఁతయుఁ బన్నిదంబునకు మేషములం దలపెట్టఁ జూచుచో
మెలఁతుకమేష మాఖలునిమేషముఁ దాఁకి వధించెఁ జూచి యొ
క్కలమున నాతఁ డాతగరుకాయము సొచ్చె జయాభిలాషియై 260

క. ఆతెఱపి గాంచి శాంభుఁడు, జాతిగఁ గీరత్వ ముడిగి శారీరస్థుం
డై తీవ్రఖడ్గమున నా,పాతకునిశిరంబు దునిమెఁ బాయనికినుకన్. 261

ఉ. అంతటఁ గోప మాఱక రయంబునఁ గాళ్ళను బట్టి వాని న
త్యంతబలంబున న్విసరి యంబరవీథికి వైచె వైచినం
గొంతుకక్రిందుగా నిచటికొండపయిం బడె నాఁటనుండియున్
వ్రంతలు గట్టి పాఱు రుధిరంబు వినిస్స్రుతి గైరికాకృతిన్. 262

క. ఆరక్తపూర ముడుగక, కారించుట మాన దవనిఁ గాలునిబంటుల్
ఘోర గలదె మిత్రద్రోహాగంభులు మునుఁగునట్టియఘవారిధికిన్, 263

క. అనిన విని కోమలార్కుఁడు, మునినాథునిచరణపద్మముల కెరఁగి ముదం
బున సఖుఁడుఁ దాను గ్రమ్మఱి, చనె నిది పూర్వోదితప్రసంగము కొడుకా! 264

సీ. కావునఁ గంసాలి కష్టుఁ డాతనితోడిచెలిమి గీడ్పఱచు నెవ్వాలనైనఁ
జెలులు చుట్టలు నాక చెఱుపఁగఁ జూచు నెవ్వని నైన నించుక వ్రణము గనిన
నన్న! నీ వెన్నఁడు నాజాతివానితోఁ బొత్తొనర్పకు వానిపొంతఁ జనకు
వాఁడ తాఁ బైకొని వచ్చెనేనియు నీవు గను విచ్చి చూడకు కదియ నీకు
తే. మనిన మున్నిది కుంభి చేసిన యనర్థ, మెఱిఁగి యిటు పల్కెనో బుద్ధిగఱపవలసి
చెప్పెనో యెట్లుచెప్పినఁ జెప్పెఁ గాక, నాకుఁ దార్కాణ యయ్యె నీనాతిపలుకు.'

క. అని తనకుఁ గుంభి యొనరిం, చినకీడు దలంచి వానిఁ జెఱుపక యిట్లుం
డిన నేపురుషార్థం బగు, నని యూహింపంగ మఱియు నది యిట్లనియెన్. 266

చ. 'మనపురి యేలు నాతనికుమారిక సజ్జనురాలు దానిపే
రనుమతి పేదసాదులకు నారసి యన్నము పెట్టుచుండు నో
తనయుఁడ! నాకు నవ్వనితధర్మ మొకండు గొఱంత లేదు న
న్ననుఁగొనఁ దల్లితోడుక్రియఁ గైకొని ముచ్చట లాడు నెప్పుడున్. 267

క. ఆవనితారత్నము మన, పూవులు గొనుఁ గాని యొండ్లపువ్వులదెసఁ బో
దేవేళ నైనఁ బ్రియపడి, రావించును దానివలన బ్రతికితిఁ జుమ్మీ!' 268

క. అనిన విని దీనివెరవున, ననుసంధింప నగుఁ గార్య మన్యోపాయం
బున సాధ్యము గా దని య,వ్వనజాననఁ జేరఁ బిల్చి వాఁ డిట్లనియెన్. 269

ఉ. 'పంతము పల్కెద న్వినుము పార్థివపుత్త్రికి నాదుమాట యొ
క్కింతయు వీనులం జొనుపు మింతెయ చాలును మున్ను నీకుఁ దా
నెంత ప్రియంబు సేయు నది యిన్మడి ముమ్మడి యైనఁ గాని నీ
వింతటనుండి నాపలుకు లెన్నఁడుఁ బాటి యొనర్పకుండుమా!' 270

ఆ. అనిన 'సద్దిరన్న! యది మాట గాదు నీ, వెవ్వ రాలతాంగి యెవ్వ రిట్లు
పలుకఁ దగునె యిందుఁ బ్రాపించులాభమెం, తైన నొల్లఁ జుమ్ము రన్న! వదుగ!'

వ. అనిన నతం 'డే నింత యవివేకినే? మనకుం గీడగుపనికి నిన్నేల పంపుదు? నేనుం
గొంచెంబ పలికితిం గాని యీప్రసంగంబు విన్న నది నీకు నతిప్రసాదంబుగాఁ
గట్టనిచ్చు మమ్మాటికి నామాటఁ ద్రోపుసేయక చేయవలయు' నని యొక్కసవరం
బిచ్చి యిది గొనిపొమ్మని యిట్లనియె. 272

క. 'కొనిపోయి నీవు వెఱవక, యనుమతి నేకాంతవేళ నల్లనఁ గదియం
జని కల దొకవిన్నప మని, మను చిత్తము సావధానముగఁ జేసి తుదిన్. 273

ఉ. ఎప్పటియట్ల పువ్వు లిడి యీసవరం బటు చూపు చూపినం
జెప్పెడిదేమి యారమణి చెడ్డధనం బది చేరినట్లుగా
నప్పుడు సంతసిల్లి యిది యవ్వల నెవ్వరు దెచ్చి రన్న నన్
జెప్పుము పోయి రాఁ దడవు సేయకుమీ ఫలసిద్ధి గల్గెడున్'. 274

వ. అనిన నది యట్ల చేసె నారాజనందన తనమనంబున నద్భుతశోకహర్షంబులు ముప్పిరిగొన ని ట్లని వితర్కించు. 275

క. 'ఇది నాతలసవరం బగు, నుదితార్కనిభుండు మత్ప్రియుండు ప్రియమున నాఁ
డిది దాన పుచ్చుకొనియెఁ దనదుసవరము నాకు నిచ్చె నచ్చినప్రేమన్. 276

మ. గహనాంతంబునఁ గుంభిఁ దోలి నను నాకాశాధ్వగుండై దురా
గ్రహబుద్ధిం గొనిపోయినట్టిదనుజుం గాంతాసమేతంబుగాఁ
బ్రహరించె న్విడిపించె నన్నుఁ దుది నప్పాపాత్ముచెద్దుల న్గటా
గుహలోఁ జిక్కె నతండు వెల్వడియెనొక్కో నాదుభాగ్యంబునన్. 277

క. వెలువడి వచ్చి యతం డీ, చెలువగృహము గూఢవృత్తిఁ జేరెనొ కాదే
నిల నీసవరం బీకో,మలితనయుఁ జేరు టేమి మార్గ మగునొకో. 278

వ. అని చింతించి యాయింతి యిట్లనియె. 279

క. 'ఆపాపఁడు నీతనుజుఁడొ, నీ పెంపుడుబిడ్డఁడో' యనిన నిట్లను 'ద
ల్లీ! పఱగడుపున బొంకఁగ, నోప నతనిఁ దెచ్చుకొంటి నొకచందమునన్. 280

క. పెంపుడుఁగొడు కైనంతనె, పెంపు దఱగ నెట్లు జగదభేద్యుఁడు కృష్ణుం
డింపారఁగ నందునకుం, బెంపుడుకొడు కగునొ కాఁడొ పెక్కేమిటికిన్. 281

ఉ. పెద్దయుఁ గాల మేచు మతు బిడ్డలఁ గానక పెక్కు నోము లే
ప్రొద్దును నోఁచి నోఁచి సురపూజ లొకప్పుడుఁ జేసి చేసి నే
నెద్దియుఁ గాన నైతిఁ దుది నేమి తపంబుననో యితండు నా
యొద్దకుఁ జేరె వానిఁ గని యూఱట గాంచితి మెల్లవెంటలన్. 282

ఉ. మమ్ము నతండు చేరినక్రమంబును జెప్పెద నంచుఁ గుంభి కో
పమ్మున వానిహస్తములఁ బాదములు న్నఱకించు టాదిగా
నమ్మదిరాక్షికిన్ వరుస నంతయుఁ జెప్పిన నన్నిలోముగా
నెమ్మది నిశ్చయించి చెమునే యిటు గార్యమహాత్రసంగతిన్. 283

క. కుంభి యఁట రాజుతెఱఁగున, దంభంబున మెలఁగఁ గటకటా! ఖండితుఁడై
కుంభినికొడు కఁట పొరలెడి, నంభోరుహభవుని నేర్పు లాఱడిఁ బోవన్. 284

క. అని మదిఁ బొగులుచు దానికిఁ, గను తనియఁగఁ గట్ట నిచ్చి 'కాంతా! విను నీ
తనయుఁడు సద్గుణశీలుఁ డ,తనిఁ జూడఁగ మాకు నెవ్విధంబున నబ్బున్'. 285

వ. అని పలికి తత్క్షణంబ. 286

ఉ. జాతరపేరు చెప్పి రథసంబునఁ దల్లిఁ గూఁ దాను గూడి యా
నాతుక త్రోవ మాపఁగ వనంబునకుం జని యగ్నిలోమపృ
థ్వీతలనాథు నవ్వికృతవేషిఁ గనుంగొని వృక్ష మెక్కి యిర్
చేతులు ప్రేల్చినట్టు లవశీకృతమానసయై వణంకుచున్. 287

ఉ. 'హా! జగదేకవీర! భవదంఘ్రికరాజ్యము లెందుఁ బోయె నే
రాజులు నోర్వ లేనిబలురక్కసు నోర్చినయట్టినీవు ని
స్తేజము నొంది యల్పునిగతిం గొఱమాలినక్రుక్కిమీఁద నీ
యోజ ననాథుపాటు వడ నోగిత మైతె మదీయవల్లభా! 288

క. ఘనసమరవిజయపటుగ, ర్వనిరూఢుని గాఁగ మున్ను వ్రాసినచే నె
ట్టన నిపుఁ బఱమొండెము గ,మ్మని వ్రాయఁగఁ జేతు లెట్టు లాడెనొ విధికిన్. 289

చ. కటకట! కుంభి నీకుఁ జెలికాఁ డని నీ వెనువెంటఁ ద్రిప్పఁగా
నిటువలె నయ్యె నింక నిటు లేటికి మాటలు నిన్నుఁ జూడఁ గాం
చుటఁ గృతకృత్య నైతి' ననుచున్ వెస దగ్గఱ నేఁగి వానిఁ గౌఁ
గిటఁ గదియింపఁ దజ్జనని క్లేశము నొందుచుఁ జేరి యిట్లనున్. 290

క. 'అమ్మమ్మ! యేల భ్రమసితి, యిమ్మనుజాధముఁడు వీఁడు నెక్కడిమగఁడే
యుమ్మలిక యుడిగి రమ్మా, కొమ్మ! వినినయెనేనిఁ గుంభి కోపించుఁ జుమీ'. 291

ఆ. అనినఁ దల్లిఁ జూచి యరయిక లేనిరా,జ్యంబు గాక పాపజాతి యైన
కుంభిఁ బెద్దఁ జేసికొని యుత్తమక్షత్ర,వంశజాతు నితని వదలఁ దగునె. 292

క. నీమగని యుపేక్షఁ గదా, నామగనికి నింత పుట్టె నాఁ డాతనితో
నేమంటి నేను జెప్పిన, నామాటలు నమ్మఁ డయ్యె నను జాకించెన్. 293

క. నావచనము తెలియఁ గప్పుడు, నీ వెఱుఁగవె కల్లతోను నిజ మోపునె పా
పావేశితుఁ డగుకుంభికిఁ, దా వెఱచి గదమ్మ రాజు ధర్మము వదలెన్. 294

క. మర్యాద లేనిరాజ్యము, నార్యజనులు లేనిసభయు నద నైనతఱిన్
గార్యముఁ గొననిసచివుచా,తుర్యమ్మును వ్యర్థ మండ్రు తొల్లిటిపెద్దల్. 295

క. పో నున్నఁ బోక మానునె, రా నున్నది మున్ను నాపురాకృత మిట్టుల్
కానున్న దేల తప్పును, నే నెవ్వరి నింక నెగ్గు లెన్నఁగ నేలా! 296

క. నా కింక నితనితోడిద, లోకము నీ వరుగు' మనిన లోలాక్షి మదిన్
శోకించుచుఁ జని చెప్పె మహీకాంతున కంతవట్టు నేకాంతమునన్. 297

ఉ చెప్పిన నమ్మహీశ్వరుఁడు 'ఛీ! కొఱమాలినమొండివాని కే
చొప్పునఁ జిక్కెనో తరుణి చుట్టలతోఁ దలవంపు చేసె నా
చెప్పినమాట మఱి సరకు సేయక కుంభిఁ దొఱంగి యుండఁగాఁ
ద్రిప్పి విధాతృఁ డీదెసకుఁ దెచ్చెనె మెచ్చనివారిముందటన్. 298

క. ఇప్పని యుక్తము గాదని, యప్పడుచుకు బుద్ధి చెప్పె యదలుప కున్నన్
ముప్పగు' నని యడిచిపడుచు, నప్పుడ చని కూఁతుతోడ నజపత్సుఁ డనున్. 299

ఉ 'ఆడిక దెచ్చుకొంటి తగునమ్మ! తనూభవ! యిట్టులైన నీ
తోడికుమారికల్ నగరె? ఘాతకళంకుని గుంభి నొల్ల కీ
మ్రోడున కీవు గూర్చు టిది మోసము గాదె తలంచి చూడ నా
తోడు మదీయబుద్ధి విను దుఃఖము గట్టకు మాకు ముప్పునన్. 300

ఆ. అనినఁ దండ్రిఁ జూచి యనుమతి యి ట్లను, 'నేటిమాట లాడె దెఱుక మాలి
నీకుఁ గుంభి గాని నాకు వాఁ డయ్యమే, ధ్యంబులోని క్రిమివిధంబు సుమ్ము. 301

క. ఈరాజకుమారుఁడు దనుఁ, గారవమునఁ జెరుపఁ జేరి గడుఁ గ్రొవ్వి కడే
వారక వాఁ డిటు చేసెను, మీరీమొన లెఱుఁగ రిదియె మీఁదువిమర్శల్. 302

క. మీతో నాఁడును జెప్పనె, పాతకుఁ, డగుకుంభిమాట పాటిగఁ గొని మీ
రాతని నుపేక్ష చేసితి, రాతఁడు నఱికించె నితని నన్యాయమునన్. 303

తే. రాష్ట్రమున నైనపాపంబు రాజుఁ బొందు, క్షితిపుపాపంబునతిపురోహితుని బొందు
మగువ చేసినపాపంబు మగనిఁ బొందు, శిష్యపాపంబు గురుఁ బొందు సృష్టియందు.

ఉ. కావున వాఁడు చేసినయఘంబు భవత్కృత మయ్యె నింక నే
లా విరసోక్తు లూరక తొలంగుము భర్తయ సూవె భార్యకున్
దైవము వెట్టివాఁ డయినఁ దామసుఁ డైనను నంగహీనుఁ డై
చేవ యడంగి యున్న నిరసింతురె భర్తఁ బతివ్రతాజనుల్.' 305

క. అని తన్నుఁ దూలఁ బల్కిన, యనుమతిమాటలకుఁ గలఁగి యజవత్సుఁడు ము
న్నును నిది యిట్టులు పల్కెని, తనివలనం దెలియవలయుఁ దత్కథ యనుచున్.

ఉ. అవ్విభుఁ డగ్నిలోమఁ గడియం జని తేకువ యుల్లసిల్ల 'నీ
వెవ్వఁడ వన్న? నీజనకుఁ డెవ్వఁడు? మత్పురి నున్నకుంభి దా
నెవ్వఁడు? నీకు నీవనిత యే మగుఁ? జెప్పఁ గదన్న! కాన లే
కివ్విధిఁ జిక్కు దుల్పెద మనేకదినంబులనుండి నావుడున్. 307

వ. తనపేరు తాను జెప్పవలసె నని విషాదంబు నొందియుం గాలస్వభావంబు గదా
యేమి సేయ వచ్చు నని తలంచి యి ట్లనియె. 308

క. 'పావకలోముఁడ నే నో,భూవర! యంభీరనృపతిపుత్త్రుఁడ నస్మ
త్సేవకుఁడు కుంభి యనుమతి, నావనిత స్వయంవరంబునం బడసితి నేన్.' 309

క. అని తనకు కుంభి యొనరిం, చిన ద్రోహము లెల్లఁ దెలియఁ జెప్పిన విని య
జ్జననాయకుఁ డాకష్టుని, గొనిరం డని పనిచె సుభటకోటిఁ గినుకతోన్. 310

చ. పనిచినఁ గాలకింకరులభంగి రయంబున నేఁగి ముచ్చుఁ బ
ట్టినక్రియఁ జుట్టుముట్టి 'చెనఁటీ! చెడుకాలము వచ్చె నీకు ర
మ్మని వెసఁ బట్టి తెచ్చిన నరాధిపుఁ డాతనిఁ జూచి 'చెల్లురా!
కనికరమేది యీప్రభువుకాళులఁ జేతులు నిట్లు సేయుదే.' 311

మ. అనినన్ 'శత్త్రుఁడు వీఁడు నాకు మృతుఁ జేయం జాల కిట్లేను జే
సినఁ దప్పా? ననుఁ బట్టి తెచ్చి సభలో సిగ్గంత్రయుం బుచ్చె దే
మనవచ్చున్ నృపు లెందు ముగ్ధులు గదా యజ్ఞానినే నేను స
జ్జనులన్ ద్రోహములేక చేయుపనికిన్ సైరింతునే యెన్నఁడున్.' 312

క. అని యాడి నడచుకుంభిం, గనుఁగొని కోపించి రాజు కడఁ జన 'క్రూరీ!
నిను నంతవానిఁ జేసిన, జనపతిసుతుఁ డితఁడు నోరు సావదె యింకన్. 313

క. నీ వెంత రోసి యాడినఁ, బో విడుతుమె నిన్నుఁ బట్టి పొరిగొందుము గా
కీవదరుటలఱుపు లిం కీ,తావున వెల సేయ వేమిటను గెల్చెదురా? 314

తే. చావుకల నైన నించుక సత్యవాక్య, ముగ్గడింపుర నీ వన్న నూరకుండె
*గారుడికుచేతఁ జిక్కిన ఘనతరోర, గంబుచాడ్పున ముఖరికాసంబు దఱిగి. 315

సీ. అప్పుడు గొంద ఱీయన్యాయశీలునిఁ బట్టి కొఱ్ఱెక్కింపఁ బాడి యండ్రు
కొంద ఱీతని సందుసందులు చక్కఁగా బాడిద నఱకింపఁ బాడి యండ్రు
కొంద ఱీతనికండ లందంద దిగఁజెక్కి భక్షింపు మని పెట్టఁ బాడి యండ్రు
కొంద ఱీక్రనిఁ దలక్రిందుగాఁ గట్టించి పైచర్మ మొలిపించఁ బాడి యండ్రు
ఆ. కొంద ఱితనిఁ బచ్చిగుదియల మోఁదించఁ,బాడి యగు డ్రు మఱియు బహువిధములఁ
బలుకుపౌరజనులకలకలం బుడిపి యం,భీరసుతుఁడు కుంభిఁ జేరఁ బిలిచి. 316

క. 'తమ్ముఁడ! యేమియు వెఱవకు, నమ్ముము ప్రాణమున కలుగ నాదెస నపరా
ధ మ్మేమి కలిగె బొంకక, యిమ్మనుజాధిపునియెదుర నేర్పడఁ జెపుమా.' 317

తే. అనిన 'సర్వాపరాధి నే నధిపతనయ!, నీవు పుణ్యాత్ముఁడవు నీకుఁ దప్పు
మోప నే నెంతవాఁడ నాపాపమునకుఁ, గడమ లేదంచుఁ జాఁగిలఁబడియెఁ గుంభి.

---

* గరుడునకుఁ జిక్కినట్టియా... చి. ని. షా.

క. కనుఁగొని యజవత్సునితో, ననుమతి 'యిదె మాఁడు నీకు నల్లుఁడ' నని వ
చ్చినద్రోహిమాట నిక్కం, బని నసుఁ గోపించి తిప్పుదైనఁ జలిసెనే? 319

క. అనవుడు ముడివడుబొమ్మలుఁ, గనలెడుకన్నులును నదరుకటములు నెగఁబా
ఱినమీసలునై యతఁ డి, ట్లను భటులం గుంభిఁ జూపి యౌఁడు గఱచుచున్. 320

సీ. 'ఈపాపకర్ముని నిప్పుడ కొనిపోయి భూరివెంటులు చుట్టి పురముచుట్టుఁ
ద్రిప్పి తోఁకొని వచ్చి తెకతెక నుడికెడి యుక్కుకంబముతోడ నొత్తిపట్టుఁ
డినుపరాగోలల నిఱికించి యంతతో నన్యకాంతోపగూహనసుఖంబు
పైఁబడి కోరినఫలము చేసేఁతన మనసారఁ గన్గొను' నని నతని
ఆ. తెగువఁ జూచి యనుమతీవల్లభుఁడు 'వీని, నిట్లు సేయకున్న నేమి దప్పె?
ధరణిపతులు చేయుదండనంబునకంటెఁ, దక్కువయ్యె జమునిదండనంబు. 321

సీ. చేసినపుణ్యంబు చెడు మాఱు పల్కిన నండ్రు పెద్దలు వీనియఘము కొంత
వెలితిగా నల్పశిక్షలు చేసి యది పంచికొన నేల? యింతియ కోప మైన
వీని మాదేశంబు వెడలఁ దోలింపు చంపంగ నీ నని నమ్మఁ బల్కినాఁడ'
ననిన నట్టిద కార్య మని యజవత్సుఁడు శ్వానపాదాకృతిగా నురంబుఁ
ఆ. గాల్చి వీథు లెల్లఁ గలయంగఁ ద్రిప్పి పో, ననుపుఁ డనుచు సర్వజనులఁ బనిచె
వారు నట్లు చేసి వచ్చి ర ట్లగుటఁ గంసాలజాతివాఁడు చాలఁ గీడు. 322

ఉ. అంతఁ బతివ్రతాగుణమహత్త్వముఁ జూచి సురల్ ప్రమోదిత
స్వాంతత యొప్పఁ గ్రొవ్విరులవాన గురించిరి భూమిమీఁద ది
గ్దంతిసమానబాహుబలగర్వితుఁ డాశిఖిలోముమీఁద ని
శ్చింతులునై కనుంగొని రశేషజనంబులు నవ్విశేషమున్. 323

తే. అప్పు డజవత్సుఁ డిరువుర నందలములమీఁద నెక్కించుకొని యప్రమేయవిభవ
మొనరఁ గొనిపోయి యొక పుణ్యదినమునందుఁ, బెండ్లి సేయుఁడు నిశ్చలప్రేమతోడ.

క. అనుమతి పావకలోముని, యనుమతిఁ జరియింపుచుండె నట యొకనాఁ డ
జ్జనపతిసతిసుత నల్లునిఁ, గనుఁగొని కన్నీరు దొఱుఁగఁ గాఁ బతితోడన్. 325

క. ఎల్లకుమారికలును దమవల్లభుల ననంతరూపవంతులఁ గన్నుల్
చల్లఁగఁ జూతురు దీనికిఁ, జెల్లం బో యిట్టిమగఁడు చేకుఱె ననఁగన్. 326

సీ. అజవత్సుఁ డతివ కి ట్లను 'విధికృతము దప్పింప నెవ్వరు లేరు పృథివియందు
నెట్టన్నఁ జెప్పెద నితిహాస మొక్కటి సౌవీరమేదినీశ్వరుకుమారి
యతులితసౌభాగ్యవతి సుశీల యనంగఁ బరగుఁ దత్సతి పెండ్లి ప్రాయ మైనఁ
జెలియలికొడుకు కీఁ దలఁచు నాతఁడు దనయన్నపుత్రున కిత్త మను వధూటి

తే. యిట్లు తమలోన జగడించి యింతి సెఱుఁగ,నీక మేనల్లునికి నిచ్చునిచ్చు నాతఁ
డతనిరప్పించియితరగేహమునఁబెట్టె,నదియుఁదనయన్నసుతుందెచ్చి యట్లయునిచె.

క. హరిహరవిరించు లయ్యవ,సరమున నాకాశవీథిఁ జనిచని యచ్చో
నిరువురఁ గని యిక్కన్యకు, వరుఁ డిం దెవ్వఁ డని శివుఁడు వనజజు నడిగెన్.

చ. అడిగినఁ బద్మజుండు దరహాసవిలాసముఖారవిందుఁ డై
'యుడుపతిజూట! యీతరుణి యొడ్డులపా లగుఁగాని యిందులో
నడరఁగ నబ్బ దెవ్వనికి' నన్న మహాద్భుతచిత్తుఁ డౌచు 'నీ
పడఁతుక యింక నేనరునిపా లగు నాతని మాకుఁ జూపుమా.' 329

ఆ. అనిన నూరిలోన నెనుపోతుపై నెక్కి, వచ్చుచున్న యొక్కపిచ్చుగుంటుఁ
జూపి యితఁడు సుమ్ము సుదతికి మగఁ డన్న, నగుచు విష్ణుదేవు మొగముఁ జూచి.

క. 'వింటి కదా నీతనయుని, కొంటెతనము వీరి మాని కుటిలాలక న
క్కుంటునకు నిత్తు రఁట యిటు,వంటివిపో పెక్కునోళ్ళవారల మాటల్.' 331

క. అనినఁ జతుర్వదనుం డిట్లను 'రమ్మా! పంచవదన! యనృతంబులు ప
ల్కునె బ్రహ్మ నన్నెఱుంగవె, విను మిది కొంకైన నీకు వితిగినవాఁడన్.' 332

క. అనిన నిది నిజమొ కల్లయొ, కనుఁగొందము గాని నీదుగరుడునిచే న
వ్వనధి యవ్వల నీపంగుని విడిపింపు మని చెప్పె గోవిందునితోన్. 333

క. చెప్పిన నది యట్టే యగుఁ, దప్పు దితనిసృష్టిచిత్రితాసైపుణ మే
చొప్పు పరికింత మనుచు, నప్పక్షిప్రభునిఁ బనిచె హరియును బ్రీతిన్. 334

క. పనిచిన మహాప్రసాదం, బని యతఁ డాక్షణమ వార్ధి యవ్వల నొకకా
ననమధ్యంబున నైచె న,తని వాఁడును నచట నుండి దైన్యం బెసఁగన్. 335

ఆ. ఎంతప్రొద్దు కైన నే నాఱుగృహముల, కేఁగి పుణ్యకాంత లిడినకూడుఁ
గూరఁ గడుపుఁ బ్రోచుకొనుచున్నకవటి ని,చ్చోటి కేల తెచ్చె మేటిఖగము. 336

ఉ. తెచ్చిన నేమి సర్వజగతీభరణక్షముఁ డైన యచ్యుతుం
డచ్చుగ నెల్లజీవులకు నారసి యన్నము వెట్టుచుండు నే
నిచ్చట నొంటి నున్నతఱి నేల తలంపఁడు జాఠరాగ్నిచే
వెచ్చుచు నున్ననన్నుఁ దగవే తన కింత యుపేక్ష సేయఁగన్. 337

క. అని కడు నాక్రోశించున,తనిహృదయము నెగు లెఱింగి దామోదరుఁ డా
తనియాఁకలి దీర్పవనా, వినతాసుత నీకుఁ బోదువే పొ మ్మనినన్. 338

వ. అతం డరిగి పరికించుచు నప్పురంబున రాజసదనాభ్యంతరంబున ఘృతపాయసాపూపాదివివిధభోజ్యంబులం గలబోనకావడి యొకటిం గని దానింగొనిపోయి యాపిచ్చుకుంటుమోలి నిడి నీ వీయశనంబు భక్షింపు మనుచుం బల్కి పక్షీశ్వరుండు క్రమ్మఱి పోయిన నతండును. 339

ఆ. బోనపుటికఁ దెఱవఁ బుష్పాస్త్రుభూదిలోని, మోహనాస్త్ర మనఁగ ముగ్ధ యొకతె
యందులోన నుండి మందస్మితానన, ద్యుతులు దృఙ్మరీచితతులు పెరయ. 340

క. గ్రక్కున వెలువడి తనచేఁ, జుక్కలగుదివోలె నున్నసురుచిరహారం
బక్కడిపియుఱుత వైచుచుఁ, దక్కక చేతండ్లఁబ్రాలు తలపైఁ బోసెన్. 341

ఆ. అంతఁ బోక కాంచనాపాత్రమునఁ బెక్కు,రుచులు గల్గుభోజ్యనిచయ మిడినఁ
గంటి మంటి ననుచుఁగడుపారఁ గుడిచి య,వ్వనితఁ జూచి యిట్టు లనియెనతఁడు.

క. 'ఏ నెవ్వరు! నీ వెవ్వరు, మానిని! యిటు సేయు టేమి మత?' మనవుడు న
బ్జానన యి ట్లనుఁ జెప్పెద, వీను లలర 'వినుము నాదువృత్తాంతంబున్. 343

సీ. మాతండ్రి సౌవీరమండలాధీశుఁ డాతని పేరు ధాత మాతల్లి పేరు
ధాత్రి నన్నారాజు తనతోడఁబుట్టినయతివపుత్రున కిత్త మనిన నీక
తనయగ్రజునితనూజున కిత్తు నని పూని కై సేసి నాచేత సేసఁబ్రాలు
నీముత్తియపుఁబేరు నిచ్చి యీబోనపుట్టికఁ జేరి తెఱచుఁ గౌతుక మెలర్ప

ఆ. నెవ్వఁ డతఁడు నీకు హృదయేశుఁ డతని వ,రింపు మని రహస్యరీతి నిట్లు
పనిచె నతనిపేడుకట్టుకు' నిది నాప్ర,సంగ మనిన సాత్మఁ బొంగి యతఁడు. 344

క. అవ్వల నెయ్యది తలఁపఁగ, నివ్వల నెట్లయ్యెఁ గార్య మిట్టిద సుమ్మీ
యవ్విధి యెవ్విధిఁ బఱచిన, నెవ్వరికిని దొలఁగ రామి యెఱుఁగఁగ వచ్చెన్. 345

చ. చరణవిహీనుఁ డట్టె ఘనసాగరభీకరవీచికాసము
త్కరపరిఘాంత మైననడుగడ్డకు వచ్చి నిజోదరాగ్ని చే
నెరియుచు నున్నయట్టితుది నెవ్వరికిం బడయంగరానిసుం
దరి యిది పత్ని యయ్యెడిని దైవముచేఁతల కడ్డ మున్నదే. 346

వ. అని తలంచి యతండు యాదృచ్ఛికప్రాప్తవిపత్సంపదల కచ్చెరుపందుచుండె నంత
నిక్కడ. 347

ఆ. లగ్నవేళ యైనలలనాలలామంబు, నరసి కాన కానరాధినాథుఁ
డింతిమీఁదఁ గినిసి యెచ్చోట దాఁచితి, పాపఁ దెచ్చి నాకుఁ జూపు మనిన. 348

క. గరుడుఁడు గొనిపోవుట య,త్తరుణి యెఱుఁగుఁ గానఁ దనకు దప్పించుకొనన్
వెరవు దలఁచి యతనిముఖాం,బురుహముఁ గోపించి చూచి బొమముడి వడఁకన్.

క. 'భూవల్లభ! నాకూఁతుకు, నీ వేమిటిదాన వనుచు నిష్ఠురభాషల్
నీ వల్లవాఁడు పలికితి, కావున నది మొదలుదానిగతి యే నెఱుఁగన్. 350

క. అలసి మగఁడని యున్నెడ, నాలిపలుకు సరకుసేయఁ డట తా మగఁడే
యాలే మఱి వానికి నది, జాలిం బడనేల పట్టిసామ్యంబునకున్. 351

క. నీ వెఱుఁగవె నీజీవన, మేవారికి నిన్ను వాలయింపఁగ నేలా
నీ వట నీపుత్రిక యట, యేవిధి యట బొమ్ము మమ్ము నేలా తడపన్'. 352

క. అని దగ్గఱి మాటాడిన, విని మార్పలుకంగ లేక విఘటితకార్యుం
డును విగతోపాయుండునై, చనియె నతఁడు సతుల గెల్వ శక్యమె యెందున్.

క. ముద్దియ చేతప్పి చనిన, నెద్దియుఁ జేయునది లేక యెల్లరు నగఁగా
నిద్దఱు పెండిలికొడుకులు, ప్రొద్దు గలుగ నూరు వెడలిపోయిరి లజ్జన్. 354

ఉ. అవ్విధ మంతయుం గని మురాంతకుఁ డంబుజగర్భుఁ జూచి వీ
రెవ్వరితోడఁ జెప్ప కిటు లేఁగెద రన్నఁ జతుర్ముఖుంబులక్
నవ్వుచు 'నోమహాత్మ! నృపనందన నీభటుఁ జేరె నింక వా
రెవ్వరివారలై నిలుతు రిచ్చట నొచ్చెము గాదె యుండినన్'. 355

మ. అనినన్ వింటి గదా పినాకి మనతో నబ్జాసనుం డప్పుడా
డినమాటల్ నిజ మయ్యె మెచ్చఁదగుఁ జుండీ యంచు విష్ణుండు ప
ల్కె నటే నాతనిఁ జూడఁ బోద మని పల్కెన్ ఫాలనేత్రుండు రం
డనియెం బద్మజుఁ డట్లు మువ్వురును నుద్యత్ప్రీతి సంధిల్లఁగన్. 356

వ. బ్రాహ్మణరూపంబులు గైకొని పోయి యాదంపతులపరస్పరానురాగంబును వారు దమకు నొనరించునతిథిసత్కారంబును జూచి మెచ్చి తమనిజరూపంబులు చూపి విష్ణుదేవుండు వానికి నున్నతపదంబులతోన పదంబు లొసంగె బ్రహ్మదేవుండు దానికి నైదువతనంబు చాల నిచ్చె మహాదేవుండు వానికిఁ బరమజ్ఞానంబు ప్రసాదించె నట్లు వరంబు లిచ్చి వైనతేయుచేత నయ్యీరువుర సౌవీరనగరంబునకుం బనిచి చతుర్ముఖుచాతుర్యంబు గొనియాడుచు నతని వీడ్కొని మురాంతకపురాంతకులు యథేచ్ఛం జనిరి సుశీలయుం దనపోయివచ్చిన తెఱంగు తల్లిదండ్రులకుఁ జెప్పి తన మగనిం జూపిన సంతోషించి ధాత్రుభూనాథుండు వానికి దండనాయకపట్టంబు గట్టిన నింద్రసేనాధిపతియైన సేనాని తెఱంగున మెఱయుచుండె నట్లు గావున. 357

చ. వగవకు బ్రహ్మకల్పిత మవారిత మెందును నన్న నిట్టను
న్నగుప సుశీల భర్తకు జనార్దనశంభుసరోజగర్భుల
చ్చగ వర మిచ్చిన ట్లితనిఁ జూచి మదిం గృప వుట్ట వార లీ
జగమున లేరొకో కడు నసాధ్యమొకో యిది యంచు నుడఁగగన్. 358

వ. అవ్విధంబుఁ జూచి భోపజ్ఞుం డగుపావకలోముండు వీరి నింక వగపింప నేల సకల జనంబులమనంబులఁ బరికించుటకు నిన్నిదినంబులు నిట్లుండితి నింతట నానిజరూపంబు చూపవలయు. 359

చ. అని యిటు లున్నయుంత్కన నిజాంఘ్రికరద్వితయంబు లొప్పఁగా . . . .
ననుపమలీల నొప్పి యతఁ డత్తకు మామకుఁ జేతు లెత్తి మ్రొ

క్కినఁ బరమాద్భుతంబు మదిఁ గీలుకొనంగను జెక్కుఁ జీవనల్
మునుకొని యిచ్చి కోర్కి తుద ముట్టెఁ గదే యని సంభ్రమించుచున్. 360

క. అజవత్ముఁ డతని కి ట్లను, 'నిజస్వరూపంబుఁ దెలియ నేరము గడు న
క్కజ మైనది నీచందము, భుజచరణాగ్రంబు లెట్లు పొడమెను నీకున్. 361

క. నరుఁ డనఁగరాదు నినుఁ గిన్నరుఁడవో యక్షుఁడవో త్రిదివనాథుఁడవో సుధా
కరుఁడవో మరుఁడవో నీ వెవ్వరు నా కెఱిఁగింపు మనిన వాఁ డి ట్లనియెన్ 362

చ. 'నరుఁడనె కాని నేను నరనాయక! యన్యుఁడఁ గాను నీకుఁ జె
చ్చెర నిదె సర్వముం దెలియఁ జెప్పెద వి' న్మని చెప్పె నమ్మహీ
శ్వరతనయుండు దైత్యపతిశాపముచందము శాపమోక్షముం
బొరసినలాగు నన్నిదినముల్ నిజరూపము చూప కున్కియున్. 363

వ. ఇట్లు చెప్పిన. 364

మ. అజవత్ముం డలరెం దదీయసతి యాహ్లాదించెఁ దద్బాంధవ
వ్రజ మానందముఁ బొందె భృత్యతతి భావప్రీతి సంధిల్లె న
క్కజ మారాజతనూజభాగ్య మనుచుం గైవారము ల్చేసె ని
ట్టిజగద్ద్రోహి గలండె కుంభి యని తిట్టెం బౌరలోకంబు దాన్. 365

క. ఒడలు పులకింపఁ గన్నుల, నడరఁగ బాష్పములు వదన మలరఁగఁ గోర్కుల్
గడలుకొనఁగ ననుమతి యప్పుడ పెన్నిధిగన్న పేదపోలిక మెఱసెన్. 366

వ. ఇట్లు తత్సతీద్వితీయుండై యతండు రతిసమేతుం డగుమీనకేతుండునుంబోలెఁ బొలుపొందుచు సాట్యనగరంబునంద కొన్నిదినంబు లుండి యొక్కనాఁడు తన మామచేత ననుజ్ఞాతుండై భార్యయుం దాను నిజపురం బగుదివిజపురంబునకుం జని యంభీరమహారాజునకుం గుంభినీమహాదేవికిం దండప్రణామంబు చేసి యనుమతిం జూపిన నారాజపుంగవుండు నిజాంతరంగం బాశ్చర్యతరంగంబుగా నతని కిట్లనియె.

ఉ. 'ఏలర ముద్దుకూన! నను నెప్పుడుఁ గన్న మొఱంగి పోయె ద
వ్వేలుపుటింతులట్టియరవిందదళాక్షుల మున్నుఁ దెచ్చి తీ
బాలిక తెచ్చి తిప్పు డిదె భావజుదేవియుఁ బోనిదాని నీ
లీల దలంప నచ్చెరువు లేమల: గందువఁ బెట్టి తెచ్చెదే.' 368

క. అనిన నతఁ డింక దాఁపఁగఁ, బని లే దంతయును జెప్పఁబడు నని చెప్పెన్
మును గుంభియుఁ దాను నటు, చను టాదిగఁ గల్గుతత్ప్రసంగము లెల్లన్. 369

ఉ. చెప్పినఁ గుంభిచేఁతలకుఁ జిత్తమునం గలుషించి వాఁడు నీ
కెప్పుడు నాప్తుఁ డంచు తుది నింత యొనర్చెనె వేయుఁ జెప్పినం

దప్పానె జాతిదోషము ప్రధానిపదంబున నిల్పినాఁడ మా
త్రిపురితండ్రి నిం కతనిఁ ద్రిప్పకయుండిన హాని పుట్టదే. 370

క. అని యతనిగృహంబునఁ గల, ధనధాన్యాదు లగువస్తుతతు లన్నియుం జే
కొని పదహీనునిఁ జేసినఁ, జని యాలును దాను నొక్కజనపదమందున్. 371

ఆ. కుడువఁ గూడు కట్టుకొనఁ గోకయును లేని, యధమవృత్తి నుండి రట్ల కాదె
గుణవిహీనుఁ డైనకొడుకుచే నాపద, దనక కున్నె తల్లిదండ్రులకును. 372

వ. ఇవ్విధంబున వాని నపగతతేజుం జేసి యారాజు గుణధాముం డగుపావకలోము భూమిపాలనంబునకు నభిషేకంబు చేసి తాను దపోవనంబునకుం జనిన నతండు సింహాసనస్థుండై దుష్టజననిగ్రహంబును శిష్టజనానుగ్రహంబును దనకు నిత్యకృత్యంబులుగా ననేకవర్షంబులు రాజ్యంబు చేసి పూజ్యం బగుశివసాయుజ్యంబు పడసె నని యప్పుణురత్నంబు పుండరీకంబునకుం జెప్పె నని. 373

ఆ. బ్రహ్మరాక్షసునకు రత్నమండనుఁడు చె, ప్పుట యుపన్యసించె భోజపతికి
సిద్ధుఁ డంచు నిట్లు చెప్పిన విని తద,నంతరప్రసంగ మడుగుటయును. 374

చ. ప్రణమదశేషకల్మషపరాగనిరాసపయఃప్రపూర! మా
ర్గణగణనిర్గతానలశిఖాపరిశోషితసింధురాజ! భీ
షణదశవక్త్రవక్త్రజలజవ్రజచంద్ర! సమస్తలోకర
క్షణపటువీక్షణస్ఫురణ! గర్వితదానవమానమర్దనా! 375

క. దుగ్ధాబ్ధిశయన! యదుకుల, దుగ్ధాంభోరాశిచంద్ర! దుగ్ధమరాళ
స్నిగ్ధయశ! యశోదాస్తన, దుగ్ధప్రియ! గోపసదనదుగ్ధసుచోరా! 376

భుజంగప్రయాతము.

రమాహృత్సరోజాత రాజీవమిత్త్రా!, తమాలాతసీపుష్పధా మాబ్జనాభా!
యమాసంతతస్తోత్రయోగ్యాభిధానా, సముద్యత్ఖగాధీశశైలాగ్రధామా! 377

గద్యము. ఇది వాణీవరప్రసాదలబ్ధవాగ్వైభవ తిక్కనామాత్యసంభవ సుకవిజనవిధేయ అనంతయ నామధేయప్రణీతం బైనభోజరాజీయం బనుకావ్యంబునందు వ్యాఘ్రంబునకు ధేనువు పావకలోముచరితం బుపన్యసించుటయుఁ దదనంతరవ్యాపకంబు లైనశాంభోపాఖ్యానంబును బంగుండు రాజకన్యాసంగమం బగుట చెప్పంబడుటయు నన్నది పంచమాశ్వాసము.

శ్రీ

భోజరాజీయము

షష్ఠాశ్వాసము

యువతీమృదువచనర
సాయనపరిపూర్ణకర్ణ! శశినిభవర్ణా!
మాయాతీత! సువర్ణ
స్తేయాద్యంహోవిఘాత! శ్రీనరసింహా! 1

వ. అవధరింపు మమ్మహామతి యమ్మహీపతి కి ట్లనియె నట్లు రత్నమండనుండు చెప్ప గోవ్యాఘ్రసంవాదకథావిశేషంబునఁ బావకలోమచరిత్రంబు విని 'చిత్రకాయం బేటు వోయె నక్కథ విని బ్రహ్మరాక్షసుం డేమి చేసె నెఱింగింపు' మని భోజుం డడిగిన సర్వటి యి ట్లని చెప్పె నాప్రసంగంబు విని. 2

క. తా నెఱిఁగినకథ చెప్పితిఁ, బోనీకుండెడునె యింకఁ బులి యని మదిలో
నూనినసంతసమున నా, ధేనువు దాఁ జనవు మెఱసి ధృతి ని ట్లనియెన్. 3

క. 'పావకలోమునిచరితము, భావ మలర వింటి వింకఁ బనుపుము నన్నున్
రా వలయుఁ దిరిగి వేగమ,' నావుడుఁ బులి గోవుఁ జూచి నగి యి ట్లనియెన్. 4

క. 'ఏమిటికి నెట్టుకొనియెదు, నీమాటల నాకుఁ గడుపు నిండునె పుత్ర
వ్యామోహ మేల విడువవు, నాముందటఁ బ్రిదుల వచ్చునా నీ కింకన్. 5

ఆ. అకట నీవు నన్ను నడకించి పోఁ జూచె, దేను మోసపోను గాని గోవ !
యడవిలోన నున్నయంత నె పులి యింత, యెఱుక లేని దయ్యె నే తలంప.' 6

ఉ. నావుడు ని ట్లనుం గపిల 'నావచనంబు లనర్థకంబులే ?
నీవు వివేకశీలుఁడవు నీ కిటు లాడుట యుక్తమే? ననుం
బోవిడు మంట ని న్నొఱఁగి పోవుటకే? పదివేలు చెప్పినన్
భూవలయంబులోఁ బలికి బొంకుటయుం బ్రతుకే తలంపఁగన్. 7

తే. ఆడి తిరిగినఁ జండాలుఁ డండ్రు గాని, కులము చండాలుఁ డైనను గొఱఁత లేదు
బొంక కున్నఁ జండాలుఁడె పో ధరిత్రిఁ, బూజ్యుఁ డనుమాట వినవయ్య! పులులరాజ!. 8

ఉ. అచ్చటి కేఁగి మత్సుతుని నర్థిఁ గనుంగొని కుక్షి నిండఁ జ
న్నిచ్చి మనంబునం బొదలు నేకటిఁ బాపి శరీర మంతయున్
ముచ్చట వోవ దువ్వి తగుబుద్ధులు చెప్పి కృతార్థనై వెసన్
వచ్చెదఁ గాదు కూడ దనిన న్మతి యడ్డము చెప్ప నేర్తునే. 9

తే. అతిథిసత్కారమునకంటె నధిక మైన, ఫలము లే దండ్రు పెద్ద లీపట్టునందు
నీవ యతిథివి నాకు ని న్నిచట డించి, పోయి రాకున్నఁ బాపంబు పొరయకున్నె. 10

ఆ. కన్నకడుపు గానఁ గడుఁ బిన్న గాన నే, నతనిఁ బాసి దూర మరుగునట్టి
వేళ గాన వాని వీక్షించి రాకున్న, వగపు మాన దనిన వదల వైతి. 11

క. నీ కిష్ట మైనఁ జాలుం, గాకట్టులు సేయు' మనినఁ గారుణ్యరసో
ద్రేకంబై తనచిత్తము, వే కరఁగుడుఁ బుండరీకవిభుఁ డి ట్లనియెన్. 12

చ. 'కొడుకుఁ దలంచి నీవు గడుఁ గొందల మందఁగఁ జూచి గోవ! ని
న్విడిచిన నాఁకటం దనువు నిల్వదు నాకు గృహంబు కేఁగి యే
తడవుకుఁ గాని రావొ శపథంబులు పల్కక నమ్మఁజాల' నా
వుడుఁ బులిఁ జూచి గోవు 'వినవో మదిలో నసుమాన మేటికిన్. 13

సీ. ఇంటికి నేఁగి నే నిచటికి రాకున్న వెలఁదులసంసర్గ విడువలేని
యతి వోవుగతికి మధ్యస్థుల మని కూడి పాడి చెప్పెడిచోటఁ బక్షపాత
మతిఁ బల్కునాతనిగతికి నిల్లడసొమ్ము నడగోలు గని ద్రోచునతనిగతికి
జట్టియుఁ బెండ్లియు సంఘటించినచోట విరియఁ దన్నినదుష్టనరునిగతికి
తే. మిత్త్రుఁడై పొత్తు గుడిచి యమిత్త్రభావ, మాచరించి లో నిచ్చినయతనిగతికి
గోవు లుపవాస ముండంగఁ గుడిచినతని,గతికిఁ జనుదాన శార్దూలగణవరేణ్య! 14

ఉ. గోవులఁ దప్పు లేకయును గొట్టిన తిట్టినయాత్రఁ డేగతిం
బోవుఁ బరాంగనారతికిఁ బొంచినపాతకుఁ డెందుఁ జొచ్చు మున్
జీవిత మంది రాచపని చేయక పాఱినపంద యేఁగు నే
త్రోవున కిన్నిచోట్లను బడం గలదాన నసత్య మాడినన్. 15

ఉ. ప్రల్లద మాడి పెద్దలకు బాధ యొనర్చునతండు తండ్రికిం
దల్లికి మాఱు పల్కెడునతండును నాఁకొని వచ్చి యొద్దచే
నుల్ల మెలర్ప మేయఁ జనుచున్నవృషంబు నదల్చునాతఁడుం
ద్రెళ్ళెడునట్టిదుర్గతులఁ ద్రెళ్ళుదు నే నిటురాక తక్కినన్. 16

క. ఇల విప్రులకు నసేవ్య, స్థల మొసఁగెడునతఁడు పూర్వదత్తము లగువృ
త్తులు ద్రోచునతఁడుఁ జనుపద, ములు నా కగుఁ బోయి వేగమున రాకున్నన్. 17

సీ. అపరాహ్ణవేళయం దతిథి యాఁకొని వచ్చి యడిగినఁ బెట్టక కడపువాని
గతికి నర్థాపేక్షఁ గన్నియం గొనిపోయి ముసలికి నిచ్చుతామసునిగతికిఁ
బాపంబు లేకయె పత్నిఁ బరిత్యజించినవానిగతికి నాశ్రితచయంబు
గ్రాసంబు లేక దుఃఖముల నొందఁగ నసద్వ్యయ మాచరించినవానిగతికి
తే. ధారవోసినధన మీక తత్ప్రతిగ్ర, హీతఁ బలుమాఱు నడిగించుదాతగతికి
బోవుదాన నింటికిని నేఁ బోయి మరలి, రాక తక్కితి నేఁ బుండరీకవర్య!' 18

క. అని శపథంబులు పలికిన, విని వ్యాఘ్రము 'నీవు ధర్మవిదురాలవు నీ
కెన యెవ్వరు ధేనువ! యే, నిను నమ్మితిఁ బోయి ర'మ్మనినఁ బటుబుద్ధిన్. 19

చ. పులికిఁ బ్రదక్షిణించి తలఁపుం బలుకుల్ సదృశంబు గాఁగ న
స్ఖలితవిలాసయాన మెసఁగం బురికేఁగెఁ జతుస్స్తనంబులుం
బలసి పొదుంగు ప్రేఁగు పఱుపంగ గభీరరవంబుతోడ వీ
థుల నడయాడుబాలకులు దోరపుభీతిఁ దొలంగి పాఱఁగన్. 20

ఉ. ఆయతరీతిఁ దద్ధ్వని రసాయనమై చెవి సోఁక నప్పు డం
బే యనుచుం బ్రతిస్వనము పెల్లుగఁ జూపుచుఁ బాఱి ధేనువుల్
డాయఁగఁ బోయి వేడుక నొడల్గదలింపుచు వాలమార్చుచుం
బాయక గుప్పుచుం గుడిచె బాలవృషంబు నిజాంశదుగ్ధముల్. 21

తే. కొడుకు చను గ్రోలుచున్నంతదడవుఁ దల్లి, యడుగు దిరుగక కదలక యన్యచిత్త
గాక పై నీఁగ సోఁకినఁ గదల కుండె, నెమ్మిఁ బాషాణధేనువు నిలిపినట్లు. 22

చ. కనుఁగొని యప్పు డాగృహిణి కౌతుక మందుచు వచ్చి తద్ఘన
స్తనముల చాయఁ జేతికలశం బటు సాఁచిన దాని నిండెఁ బొ
మ్మని కొనియాడ నర్హ మగునట్లుగ నుఱ్ఱును దాయి లేక చ
య్యనఁ బితికెన్ సుధాసమసమంచితసారపయఃప్రపూరముల్. 23

వ. అయ్యవసరంబున- 24

సీ. పొట్టపొంగునఁ దల్లిపొది వాసి వీథికిఁ బాఱి క్రమ్మఱఁ బెద్దపరువుతోడఁ
దలయెత్తి చూచుచుఁ బలుమాఱుఁ దనుఁ దల్లి పిలువంగ నిటునటుఁ బొలసియాడు
నిలమీఁద మో మిడి యే మేని మూర్కొను. బసివెట్టికొనుచుఁ దత్పార్శ్వమందు
నంతంతఁ బసిబిడ్డ లడ్డంబు సుడిసిన జంకించి మిన్నంటఁ జౌకళించు
తే నిట్లు శైశవక్రీడల నెసఁగుచున్న, కొడుకుదెసఁ జూచి కన్నీరు గ్రుక్కుకొనుచుఁ
'గటకటా! యిట్టినెత్తురుఁగందు నిచట, వైచి పోవంగ వలసెనే నీచగతికి. 25

ఆ. తల్లి లరుగుదేరఁ దనయాడుకోడెలు, సదమలానురక్తి నెదురువాఱఁ
దాను గూడ పాఱి తనమాతృహీనతఁ, దెలిసి బిడ్డఁ డంతదలఁగకున్నె?' 26

వ. అని శోకించుచు మఱియు ను. 27

ఉ. 'ఏఁ దనుఁ బాసి పోవుతెఱఁ గెద్దియుఁ గానఁడు వీఁడు నెమ్మదిం
దాఁ దిరుగం దొడంగెఁ బులి తద్దయు నాఁకొని యోర్వలేక నా
మీఁద నసత్యదోష మిడి మిన్నక పోవునొ యింక నాకు ని
చ్చోఁ దడయంగ రా' దనుచు సూనుని దగ్గఱి ధేను విట్లనున్. 28

క. 'నిన్నుఁ గని యిన్నిదినములు, చ న్నిచ్చితి నేను ఋణవశంబున నిఁక నీ
వెన్నఁడు నన్నుఁ దలంపకు, మన్న! మమత్వంబు విడువు మన్న! మనమునన్. 29

క. మమకారంబు నహంకా,రము సంసారానుబంధరజ్జువు లని చి
త్తముల వివర్జింతురు సం, యము లీవును నడుపుమా తదాచారంబున్. 30

క. ఆడకు మసత్యభాషలు, కూడకు గొఱగానివానిఁ గొంకక యొరు లె
గ్గాడిన నెదు రుత్తర మీఁ, జూడకు విని విననివాని చొప్పునఁ జనుమీ. 31

క. ఒంటి చరింపకు శాలమున, నింటికిఁ గడుప్రొద్దు గలుగ నేతెంచుచు రా
వెంటఁబడి పొడుచుగోవుల, జంటఁ జనకు క్రయ్యఁబడకు సందడి యగుచోన్. 32

క. అంగజకేళికిఁ దివిరెడు, పుంగవులను మసరు కవిసి పోరాడకు వీఁ
కం గాలు ద్రవ్వువృషభము,లం గదియకు తెవులుగొంటులం గూడకుమీ. 33

క. తోడుకు దినఁ బోవుపసరము, బడిఁ బోకుము తురగ గార్దభద్విరదాదుల్
నడచుపథంబున కడ్డము, సుడియకు దుర్జనులు మెలఁగుచో నిలువకుమీ. 34

క. నూతులదరులను లోఁతగు, పాతటికసవులను నెట్టిపచ్చిక యున్నన్
బ్రాలిపడి మేయఁబోకుము, మూతి నిడకు ముగ్రసత్త్వములు గలనీటన్. 35

క. ఏను గలిగి యుండఁగ నె,వ్వానికి నిను ముద్దుసేయ వాలాయ మగున్
గాని యిటమీఁద నెవ్వఁడుఁ, గానికిఁ గైకొనక చుల్కగాఁ జూచుఁ జుమీ. 36

క. చులుకన జలరుహతంతువు, చులుకన తృణకణము దూది చుల్కన సుమ్మీ
యిల నెగయుధూళి చుల్కన, చులుకన మఱి తల్లి లేనిసుతుఁడు కుమారా! 37

ఉ. కావున నిట్టిలాఘవము గానుపకుండఁ బ్రభుత్వముల్ గుణ
శ్రీ వెలయంగ సజ్జనులఁ జెంది తదీయహితోపదేశముల్
స్వీ విమలాంతరంగమున నిల్పుము కాని నిరర్థగోష్ఠికిం
బోవకు మయ్య దుర్గములఁ బొందకు మయ్య వివేకహీనతన్.' 38

చ. అని తగ బుద్ధిఁ జెప్పెడునిజాంబఁ గనుంగొని తత్తనూజుఁ డి
ట్లను 'నిది యేమి తల్లి! యిటు లాడెదు విప్రుఁడు నిన్ను నర్థకాం
క్ష నొకని కమ్మెనో తనదుగాదిలిపుత్త్రికి నీఁ దలంచెనో
యొనయఁగఁ బుణ్యకాలమున నెవ్వరి కేనియు ధారవోసెనో! 39

ఉ. నీ వెట పోయె దేను నట నీవెతుకం జనుదేరఁ జాలనే
గోవును గ్రేపుఁ దల్లి మఱుఁగుల్గ నొసర్చువివేకహీనుఁ డే
తావునఁ గల్గునే? కటకటా! నను డించి యథేష్ట బుద్ధిమైఁ
బోవుతలంపు నీ కెటులు పుట్టె విచారము చాలదో కదే.' 40

వ. అనినఁ గ్రేపుమాటలకు మిక్కుటం బగునక్కటికంబు మనంబునం బొడమ నగ్గో
విట్లనియె. 41

క. 'ఇవ్విప్రవరేణ్యుఁడు నను, నెవ్వరికిని నొసఁగఁ డేన యేఁగెద వినుమం'
చవ్వివరము సర్వంబును, నవ్వత్సముతోడఁ జెప్ప నది కడుభీతిన్. 42

క. పిడుఁగడిచినక్రియ నీటెం, బొడిచినగతి గుండె పగిలి భూస్థలిమీఁదన్
బడి పొరలుఁ దన్నుకొను ను, గ్గడువుగఁ గన్నీరు నించు గడగడ వడఁకున్. 43

క. 'ఛీ' యనుఁ 'దల్లీ! నీ వెట, పోయెద?' వను 'నన్ను డించి పులివాతఁ బడన్
బోయెదవే?' యనుఁ 'జెల్లం, బో?' యను 'నింకేటి బ్రతుకుపో నాకు' ననున్. 44

క. ఇవ్విధమున శోకింపఁగ, నవ్వత్సశిరంబుమీఁద నానన మిడి 'నీ
వెవ్వరికిఁ గాఁగ వగచెద, వివ్వలవనిజాలిపడఁగ నేటికిః బుత్రా! 45

చ. అరుదుగ సత్యవాక్యము సహాయముగాఁ బులిచేనివక్త్రగ
హ్వార మను పెద్దత్రోవను రయంబున స్వర్గసుఖంబుఁ జూఱకో
నరుగుచు నున్నదాన నిది హర్షము నొందెడువేళ గాక దు
స్తర మగుశోకముం బొరయుదానికిఁ గారణ మేమి చెప్పుమా. 46

క. పుట్టినపిమ్మటఁ జావును, గట్టి వృథా మరణ మొందుకంటె బుధులకున్
దట్ట మగుకీర్తిసుకృతము, లిట్టులముగఁ గల్గుచావు లింపులు గావే. 47

ఉ. శోకము దక్కి లెమ్ము గుణశోభిత! నీ' వనఁ దల్లివాక్యముల్
సైకొని తత్తనూభవుఁడు కంపము నొందుచు లేచి 'యక్కటా!
గోకులభూష! నీకు సమకూరెడుశాశ్వతపుణ్యలోకముల్
నాకు నగమ్యదేశములె? నన్నును దోఁకొనిపొమ్ము' నావుడున్. 48

క. 'సంతతి యెడతెగినంతన, నెంతటిపుణ్యాగతు లైన నెడతెగు నని సి
ద్ధాంతము విను నాత్మజుఁడ!, చింతింపకు మొక్కతెలివి చెప్పెద నీకున్. 49

క. సుతుఁడు మహిఁ దల్లిదండ్రులఁ, బ్రతిదినమును బ్రోచు నన్నపానాదులచే
మృతు లైనపిదపఁ బితృదే, వతపూజలఁ జేసి వారి వదలక ప్రోచున్. 50

ఉ. కావునఁ బుత్రజన్మము జగంబున భుక్తికి నిత్యముక్తికిం
ధావల మండ్రు నిన్నుఁ గని ధన్యత నొందితి మత్పవిత్రవం

శావళి నీకతంబున నిరంతరమై కొనసాఁగెనేని నా
దేవనివాస మాది యగుదివ్యపదంబులు నాకుఁ జేకుఱున్. 51

ఆ. ఇంకఁ బెఱఁగ వలవ దిచట నేఁ దడసిన, నచట ననృతదోష మావహిల్లు
దాన జేసి యగు నధమలోక మంత సేయంగ నేల పనుపవయ్య నన్ను.' 52

చ. అని యిటు లెట్టకేలకు నిజాత్మజశోకదవాగ్నికీల లో
య్యన వచనాంబువర్షమున నాఱఁగఁ జేయుచు దాని నచ్చటం
గొనకొని యుండఁగా నిలిపి కూరిమితోఁ బులి యున్నయట్టియ
వ్వనమునకుం రయం బెసఁగ వచ్చుచు నుండఁగ నంత నక్కడన్. 53

వ. అప్పులి యిట్లని వితర్కించు. 54

క. 'పాటి గలదె పసరమునకు, ప్రేటలనిం గదిసినపుడె విఱువక నేన
మ్మాటల బేలుపడితి మొగ, మోట దరిద్రత్వమునకు నొగిఁ బొత్తయ్యెన్. 55

క. తా నొకనిజమరిపోలెం, బూని పలికెఁ బెక్కుశపథములు కడపటఁ దాఁ
గానియదివోలె వాఁకొని, యే నిచ్చట నునికిఁ దలప దెటువోయెనొకో. 56

క. పోఁ దడవు లేదొ క్రమ్మఱి, రాఁ దడ వది లేదొ యీసురభి యణకించెం
మీఁ దెఱుఁగ నైతి నటమట, నీఁదించి యథేచ్ఛఁ జనియె నింకే మందున్. 57

క. పులిచేతఁ జిక్కి యొకయి, మ్ముల విడివడిపోయి దానిముందటి కేగో
వులు మరలి వచ్చు నేలా, తలపోఁతలు నొరికండ తప్పెం దప్పెన్. 58

క. ఏ దానితోడిచలమున, నేదివసమున నైన నొక్కయెడ నడరి గళ
చ్ఛేదము సేయక యూరక, పోదునె యిటు గాక యున్నఁ బులినే నేవున్.' 59

చ. అని యుదరాగ్నిచేఁ బరవశాత్మకయై ధృతిమాలి నెమ్మనం
బునఁ దలపోయుచున్నపులిముందటి కప్పుడు వచ్చి నిల్చెనో
యనఁగ మహాద్భుతం బగురయంబునఁ దాఁ బఱతెంచి ధేను వి
ట్లను 'నిది ప్రొద్దుదాఁకఁ గడునాఁకొని యే క్రియ నుండితో కదే. 60

ఆ. ఇంత తాల్మి లేక యిల నిట్టిసుకృతంబు, లెట్లు సంభవించు నేరికైన
నీనిమిత్తమై కదా నాతనూజుని, బుజ్జగింపఁ గంటిఁ బురికి నేఁగి. 61

క. నామన సొక్కటి యయ్యెను, నీమనసారంగ భుజింపు నీకే సధిక
ప్రేమమున సమర్పించితి, నామే నిదె పుణ్యగతికి ననుఁ బుచ్చవనా.' 62

ఆ. అనిన దానితెగువ కద్భుతస్వాంతుఁడై, పుండరీక 'మేను బుట్టి పెరిగి
యింతవాఁడ నైతి నింత నిష్కపటుల, నిట్టిధీరమతుల నెఱుఁగ నేను. 63

ఉ. ఇట్టిమహానుభావులకు హింస యొనర్చి దురంతపాపముల్
గట్టికొనంగఁ జాల మఱి కల్గదె మాంసము లొండుచోట? నీ
పుట్టువునందు నన్ను మును పుట్టఁగఁ జేసినయట్టిదైవ మీ
పట్టునఁ బూరి మేపెడినె? ప్రాణము లింకనె పోవుచున్న వే?' 64

మ. అని యాధేనువుఁ జూచి 'నీవిమలసత్యప్రౌఢికిన్ మెచ్చు వ
చ్చె నినుం జంపఁగఁ జాల నీదుతల గాచెన్ ధర్మ మీప్రొద్దు పో
మ్ము నిజావాసము చేర నీసఖులు సమ్మోదంబునుం బొంద నీ
తనయుం దత్యనురాగముం బొరయఁ జిత్తప్రీతి మై నొందఁగన్.' 65

వ. అనిన నప్పులికి న మ్మొదవి ట్లనియె. 66

క. 'మెత్తనిమనసే నాయది, యొత్తి యిటులు చూడ నేల యోపుణ్యుఁడ? నే
నిత్తనువు నీకు మును వాగ్దత్తము చేసినది కాదె కథ లేమిటికిన్. 67

ఆ. చనువు చెఱుప వైతి నను బోయి రానిచ్చి, తదియ చాలుఁగాక యుదరవహ్ని
వేగుచున్న నిన్ను విడిచి యే మని పోదు, గెలుచునంతదాఁకఁ గలదె పాడి. 68

సీ. ఉదరాగ్ని పెల్లున నొడలెల్ల శుష్కమై వాతెఱ వరువట్లు వట్టఁ దొడఁగె
సకలేంద్రియంబులు వికలభావంబు చేకొనియె వీఁపున నంటుకొనియెఁ గడుపు
ప్రాణంబు లాతురపడఁ జొచ్చె నిట్లూరకుండుదే ప్రొద్దు భానుండు గ్రుంకెఁ
బగలింటియుపవాసభారంబు దీఱ మద్రక్తమాంసముల నక్తమ్ము సేయు

ఆ. మంతఁ బుణ్యురాలనై యేను దివ్యవి, మానయానమున నమానమహిమ
తనర నిన్నుఁ దలఁచుకొనుచు నెమ్మదిఁ బోదు, నూర్ధ్వలోకమునకు నోమృగేంద్ర!'

క. అని గంగడోలు బిగియఁగఁ, దనమెడ యెత్తుకొని కపిల దగ్గఱఁ జనుదెం
చినఁ జూచి పుండరీకము, వెనువెనుకకె పోవుఁ గాని విఱువదు దానిన్. 70

సీ. 'కుడువంగ' రమ్మని తొడరి చుట్టముఁ బిల్వ 'నాఁకలి గా దొల్ల' నుచుఁ బెనఁగు
నతఁడును బోలె నాతతశోభనాంగియై తనరు నాధేనురత్నంబు దన్ను
భక్షింపు మని పట్టుపఱుప సద్యోజ్ఞానశాలియై పరగుశార్దూలవిభుఁడు
దా నొల్ల నని పల్కఁ దమలోన నొకకొంతదడవు ముహుర్భాషితంబు లిట్లు

ఆ. జరుగుచుండ గోవుసత్యవాక్శుద్ధికిఁ, బులికృపాసమగ్రబుద్ధికిని బ్ర
సన్నులైరి సురలు సాధువాదము లుల్ల, సిల్లె గగనవీథి నెల్లయెడల. 71

వ. అయ్యవసరంబున. 72

సీ. పులిచేత నలుకుడు పడియున్న యెుఱకలు మగుడఁ గాంచినమేరునగ మనంగఁ
బవనుచేఁ దూలక ప్రకటప్రభావంబు పడసిన మేచకాభ్రం బనంగఁ

బొలసి యదృశ్యమై పోవక శృంగారమిశ్రమై యున్న క్రొమ్మెఱుఁగనంగ
నుడువీథిఁ జరియించు టుడిగి భూలోకంబుఁ జూడ వచ్చినదొడ్డచుక్క యనఁగ

ఆ. వైనతేయుఁ డలర వానిపైఁ దనదివ్య, కాయ మమర మణియుఁ గౌస్తుభంబు
నురమునందు నొరయ మురవైరి ప్రత్యక్ష, మయ్యె ధేనువునకు వ్యాఘ్రమునకు. 73

వ. ఆదివ్యరూపంబుఁ గన్గొని యత్యాహ్లాదంబునం బొదలుహృదయంబులతోన మ్మొదవును
నప్పులికయును నప్పురుషోత్తము చరణసరసిజంబులు తమశిరంబుల ధరియించిన నప్పు
డవ్విహగవాహనుండు త్రివాహను డైనట్లుండె నవ్విశేషంబు చూచి యనిమిష
లిట్లని స్తుతియించిరి. 74

చ. 'కలువలఁ దమ్ములన్ సమవికాసము నొందఁగఁ జేయుక్రాలుఁగ
న్నులు గలనీకుఁ బొన్పువు మనోజ్ఞరథంబును నాగతద్విరో
ధు లయిననీకు నారయఁ జతుర్భుజ! చేయఁగ రాదె గోవునుం
బులియును శత్రుభావములఁ బోనిడి మైత్రి యొనర్చునట్లుగన్. 75

క. దైవం బాదిగఁ దిర్య, గ్జీవులు తుది గాఁగఁ గలయశేషము నీయా
జ్ఞావిలసితవర్తనములు, గావే నీమహిమఁ దెలియఁగలరే యితరుల్.' 76

వ. అని కొనియాడుచుండి రంత నయ్యనంతుండుఁ దద్గోవ్యాఘ్రంబులఁ గారుణ్యదృష్టి
నీక్షించి 'మీసచ్చరిత్రంబులకు మెచ్చితిం దైలోక్యవరం బిచ్చెద వేఁడుం' డనినవి
'దేవా! భవద్దివ్యలోకంబు మాకుఁ బ్రసాదింపవలె' నని ప్రార్థించిన. 77

క. ఇచ్చితి ననుచుం జనియె వి, యచ్చరతతి పొగడ విష్ణుఁ డవియును జనియెన్
జెచ్చెరఁ దమతమ నెలవుల, కచ్చుగఁ దుది నొదవెఁ గోర్కు లయ్యిరువురకున్. 78

వ. ఈగోవ్యాఘ్రసంవాదంబు విన్న నరులు మృగపన్నగాదిబాధలం బొరయరు
వెన్నుండు వారికిం బ్రసన్నుం డగు' నని చెప్పి మఱియును. 79

క. పసరం బం ద్రు, వివేకము, పస చాలనినీచు నట్టిపసరమ కాదే
వసుధపయి సత్యవాక్యం, బసదృశముగ నిర్వహించె' నని కడుఁ బ్రీతిన్. 80

ఉ. మానుగ రత్నమండనకుమారుఁడు పల్కఁడు బ్రహ్మరాక్షసుం
డానరనాథపుత్రువదనాబ్జము చూచి 'యటేనిఁ బొమ్ము ము
న్నీనిజ మే నెఱుంగ నిట నిక్కము రా నొకమాట పల్కు మి
చ్చో నుదరాగ్ని నేను గడుశోషిల కుండఁగ రమ్ము గ్రమ్మఱన్.' 81

వ అనిన విని యతం 'డేమి పల్కుఁదు?' ననిన వాఁ డి ట్లనియె. 82

క. 'కుడువఁ దొడఁగునెడ నాఁకటఁ, గడుఁ దూలుచు నతిథి వచ్చి గ్రాస మడిగినం
గడపునకఁడు పడుపాటులఁ, బడుదు నసము పోయి మరలఁ బడి రాకున్నన్.' 83

ఉ. నావుడు నట్లు పల్కుచుఁ బ్రణామ మొనర్చి పురంబు కేఁగి నం
దావనినాథుతోడ నతఁ డంతయుఁ జెప్పినఁ దల్లడిల్లుచుం
'దైవము! యెంత చేసి తిది తప్పఁగఁ ద్రోయ నుపాయ మెద్ది వి
ప్రావళిమాటలుం జెనఁటి యయ్యెను కార్యము తప్పెనో కదే. 84

చ. పిలువుఁడు చంద్రశర్మ' నని భీతి యెలర్పఁగఁ బిల్వఁ బంచి 'యో
యలఘుఁడ! పుష్పగంధియుదయంబుఫలం బిదె తాఁకె' నంచు మూ
ర్ఛిలిన నతండు శైత్యజలసేచన నాతని సేదఁ దేర్చి 'బె
గ్గిలకు నృపాల నేఁ డితనికిం గ్రహముల్ శుభదంబు లన్నియున్.' 85

చ. అనవుడు 'మున్ను మీవచన మాదట నమ్మి కదయ్య! యట్లు చే
సినఁ దుది నింత పుట్టె నరసేయక చెప్పఁగదయ్య! నాఁడు న
జ్జనపతిచేత నాతనికి సత్యనిరూఢి యెఱింగి యుండియుం
జన దని మాన్పలేని యఱజాలికి శోకము నేఁడు పెద్దయే.' 86

చ. అని తనుఁ దాన దూఱుకొను నాత్మజు గౌఁగిటఁ జేర్చు బాష్పముల్
నినుచుఁ 'దనూజ! నీ దయిననిద్దపుమేనికి నెట్టిపాట్లొకో'
యనుఁ దల యూఁచు 'బాపు విధియా' యను 'నితనుఁ దెచ్చితే' యనున్
'వనరుహసంభవుండు మును వ్రాసినవ్రాఁతలు దప్పునే' యనున్. 87

సీ. 'అదె కంటె భవదంబ యంబికలోనుగాఁ గల్గునంతఃపురాంగనలవంత
మనబంధుజనులయమ్మలికంబు వీక్షించితే చూచితే నన్నుఁ దేటపడఁగ
మమ్ము నందఱ శోక మగ్నులఁ గావించి యరుగంగఁ బాడియే యన్న! నీకు
నందుఁ బోవక మాను మాబ్రహ్మరాక్షసుం డేమి గోరినఁ దెచ్చి యిత్తుఁ గాని
ఆ. నిన్నుఁ బనుపఁ జాల నీవు నాయొద్దనె, యుండ వన్న!' యను 'నితండు లేని
పిదప నాకు నేటిబ్రదుకు?' కనుఁ 'బుత్రశోకం బెంత పొమ్ము మిగులఁ గడిఁది' యనును. 88

క. ఇవ్విధమునఁ బలవింపఁగ, నవ్వేళ నవ్వినటు దానవద్యుతులు గదుర్
నివ్వటిల రత్నముండపుఁ, డవ్వసుధాధిపునితోడ నలరుచుఁ బల్కున్. 89

ఉ. 'ధీరత లేనివాని క్రియఁ దేజము పెంపఱ ని ట్లలందురం
గారణ మేమి యస్థిరము గాదె తలంప శరీర మిట్టిచో
నూరకపోవుకంటె నొకయోగ్యుఁడు కోరి భుజించు టొప్పదే
కోరినఁ బాపు నేఁ బలికిఁ బొంకఁగఁ జాల నృపాలశేఖరా! 90

తే. కులము వెలముంపఁ బుట్టినకొడుకు కొడుకు, గాక కులనాశనుఁడు కొడుకా తలంప
వసుధ నేకల్మషము లేనివంశమునకుఁ, గల్మషముఁ బొందఁ జేయ యుక్తంబె నాకు.

క. శతకూపాధిక దీర్ఘిక, శతవాప్యధికంబు క్రతువు శతయజ్ఞసము
న్నతుఁ డొక్కసుతుఁడు దత్సుత, శతకంబున కెక్కు డొక్కసత్యోక్తి నృపా.

వ. కావున నీకు నస్మాదృశు లైనకొడుకుల నెందఱ నైనం బడయవచ్చుఁ గాని సకల
జగదుద్ధారకం బగుసత్యవ్రతంబు ఘటియింప వచ్చునే న న్నింక నంకిలి సేయక
నిష్కళంకచిత్తుండవై యుండు మేఁ బనివినియెద' ననిన నజ్జనవిభుండు. 93

క. పొమ్మనఁగ మనసు రాక మొగమ్మటు దిగవైచి పలుక గద్దించిన కం
ఠమ్ము గడుగద్గదంబుగఁ, బిమ్మటి గొనుఁ గన్నునీరు వెల్లిగ నించున్. 94

ఉ. అంతట రత్నమండనుఁ 'డహర్పతి పశ్చిమదిగ్ధరాధర
ప్రాంతము కేఁగెనేనిఁ దనపంతము దప్పు నసత్యవాదినై
యంతకుప్రోలి కేఁగి బహుయాతనలం బడఁ జాల' నంచు భూ
కాంతునిఁ దాన వీడుకొని క్రక్కున నంబికఁ జేరి యి ట్లనున్. 95

తే. 'తొయ్యలికిఁదల్లిదండ్రులుఁ దోడఁబుట్టుగులును సుతులును గారు సు మ్మలఘుచరిత!
పతియె యిహలోకమందును బరమునందు, గాఢసౌఖ్యంబు లొసఁగెడుకర్తసుమ్ము 96

వ. కావున నీరాజోత్తమునిచిత్తంబునకు వచ్చునట్లుగా మెలంగు మమ్మ!' యని చెప్పుచు
నచ్చోటు వాసి యట పోయి. 97

ఉ. నవ్వుచుఁ బుష్పగంధివదనంబు గనుంగొని 'యోలతాంగి! ము
న్నెవ్వఁడు చెప్పె నీవు జనియించిన నాఁటిఫలంబు నేఁడు నా
కవ్విధ మంతపట్టు నిజ మయ్యె మహాపురుషుండు వానికై
యవ్వనభూమి కేఁగెద రయంబునఁ బొమ్మను చెప్ప వచ్చితిన్.' 98

చ. అనిన 'ననిష్టము ల్గని యుపాయబలంబునఁ ద్రోచుఁ గాక స
జ్జనుఁ డధముండువోలెఁ గనుసన్నను జావ నుపక్రమించునే
విను నృపనందనుండవు వివేకివి చక్కనివాఁడ వార్తయా
వనుఁడవు నేఁడు నీకుఁ దగవా యిటు పల్కఁగ నాదుసన్నిధిన్.' 99

వ. అని పుష్పగంధి పలికిన నారాజనందనుం డిట్లనియె. 100

క. 'ఇదె వచ్చెదఁ జన నిమ్మని, సదమలమతి, బలికినాఁడ శపథ మతని కే
మొదలనె బొంకెదు బ్రతుకును, బ్రదుకే పూఁబోఁడి! వక్రభాష లుడుగుమా.' 101

క. అనవుడు 'నేమని పల్కితి, వినవలయుం జెప్పు' మనియె వెలఁది యతం డా
తనితోడఁ దాను మును పల్కినశపథక్రమము దానికిఁ వినిపించెన్. 102

క. విని నృపకన్యారత్నము, తనమదిఁ దలపోసి చూచి దానికి నొక కీ
ల్గనియెను బుద్ధి చతుర్గుణ, మనుట సతులయందు నిశ్చితార్థ మనంగన్. 103

వ. ఇట్లు గని యయ్యుపాయంబువలనఁ దనమగనియపాయంబు పాయు నని నిశ్చ
యించి. 104

ఉ. 'ఓమ్ము నృపాలపుత్ర! తలపువ్వులు వాడక యుండ నెమ్మదిన్
రమ్మనుపుష్పగంధివచనంబులకుం దరహాసభాసురా
స్యమ్మలరంగ నాతఁడు వెసం జనుచుండఁగఁ బౌరకాంత లో
'యమ్మరో! చూచితే యతనియాలికి నారయ నెట్టిగుండెయో. 105

ఆ. రోగయుంతుఁడు గాఁడు రూపహీనుఁడు గాఁడు, వృద్ధు గాఁడు దుర్వివేకి గాఁడు
పడయరానిరాచపట్టి నేమని పుచ్చె, బ్రహ్మరాక్షసునకు భక్షణముగ.' 106

క. అనువారు 'తల్లిదండ్రులు, మునుకొని చెప్పంగ వినియు మొఱకుండై వ
చ్చినపిదప నిల్పఁగను నం,గన వశమా చనినఁ జనియెఁ గా' కనువారున్. 107

క. నాఁ డెల్లవారు 'నీపూఁ,బోఁడి పలదు మాను మనఁగ బుయిలోడక తాఁ
దూఁడరియై తఱియఁబడిన,వాఁ డితనికి నేఁడు వగవ వల' దనువారున్. 108

సీ. 'పుట్టినప్పుడె యింత పుట్టు మీఁదట నని యిట్టు చెప్పితె పురోహితులరాజ!
యిదె సుమ్ము నాపుత్రియుదయంబుఫల మని తప్పక చెప్పితే ధర్మనిరత!
మూలంబు వినియును మొగ మిచ్చుమాటల కేల దేల్పడితి భూపాలతిలక!
కడిఁదిమృత్యువు పుష్పగంధియై చనుదెంచి నీమన్ని గొనియె నే నృపతనూజ!'

ఆ. యనుచు నల్లబ్రాహ్మణునిఁ బుండరీకాధి,పతిని నందవిభుని నతనిసుతునిఁ
బేరు గ్రుచ్చి పలుకువారు 'వా రేమి సే,యుందురు ప్రాప్త' మనుచు నుండువారు.

వ. ఇత్తెఱంగునం బెక్కండ్రు పెక్కువిధంబులం బలుకుచుండ నారత్నమండనుండు వివాహగమనోన్ముఖుండునుం బోలె సుముఖుం డయ్యును నింద్రదత్తప్రముఖులగు సఖుల వీడ్కొలిపి చంద్రశర్మాదు లగు మేదినీసురులకు నమస్కరించి నిలిపి తదాశీర్వాదంబులు తోడుగా నొక్కరుండును వెడలి యరుగునప్పు డప్పురంబు కౌసల్యానందనుం దరణ్యప్రవేశంబు సేయ నరుగునప్పటియయోధ్యాపురంబునుం బోలి యుండె నప్పు డాపుష్పగంధియుఁ దనయుపాయంబు నెరపంబూని వానివెనుక నె యొక్కతెయుం నింత నంత నరుగుచుండె నంత నిక్కడ నమ్మహాపురుషుండు 110

చ. 'అదె యపరాబ్ధిఁ గ్రుంకె నినుఁ డాఁకలి మిక్కుట మయ్యె నాకు వాఁ
డిదె యరుదెంతు నంచుఁ జని యిప్పుడుఁ జేరఁడు రాక తక్కినం
జ్ఛిదులఁగ నీక రాజును బురిం గలమర్త్యుల నెల్లఁ బట్టి మ్రిం
గుదు' ననుచుండ నయ్యెడకు గొబ్బున వచ్చె నృపాలపుత్రుఁడున్. 111

ఉ. వచ్చిన నమ్మహోత్కటుఁడును వానిఁ దత్తరుశాఖ డిగ్గి వే
వచ్చి నృపాత్మజుం గదిసి వానిశిరోరుహరాజి యొక్కచేఁ
జెచ్చెరఁ జుట్టి పట్టి యొకచే మొగ మెత్తి గళంబుచాయకుం
దెచ్చె మొగంబు దంష్ట్రికలు దీటుచు నుత్కటసంభ్రమంబునన్. 112

వ. అంత నయ్యతివ తనపతిప్రాణభయంబు తప్పింప నిదియ యవసరంబని యూహించి.

క. 'భిక్షాం దేహి' యనుచుఁ గమ, లాక్షి యతనియెదుర నిల్చి హస్తము లెత్తన్
వీక్షించి యతఁడు 'నీ కే, భిక్ష' మనినఁ 'బెట్టు పురుషభిక్షం' బనినన్. 114

చ. విని యతఁ డాత్మఁ జోద్యపడి వీఁ డిటఁ గ్రమ్మఱ వచ్చునట్లుగాఁ
బనిపడి యేను గొన్నపరిభాషయె నాకు మరల్చి యివ్విధం
బున నను గెల్చె నీసతి ప్రబుద్ధులు లే రనవచ్చునయ్య భూ
మి ననుచు నాతని న్విడిచె మెచ్చి నుతించిరి ముచ్చరిక్ సురల్. 115

వ. అయ్యవసరంబున. 116

సీ. అదె ప్రభాకరబింబ మది ప్రభాకరబింబ మైన రాతిరి యేల కానవచ్చు
నదె చంద్రమండలం బది చంద్రమండలం బైనఁ గలంకంబు గానఁ బడదె
యదె రోహణాచలం బది రోహణాచలం బేని వియద్వీథి నేల మెలఁగు
నదె తటిత్సముదయం బది తటిత్సముదయం బేని నదృశ్యమై యేఁగకున్నె

ఆ. యనుచు జనులు విస్మయము నొందఁ దనదివ్య, తేజ మఖిలదిశలఁ దీటుకొనఁగ
మహికి నేఁగుదెంచె మహనీయుమై భవ, స్థాన మైనవరవిమాన మొకటి. 117

వ. అప్పుడు బ్రహ్మరాక్షసుండు తనవికృతరూపంబు విడిచి దేవరూపంబు గైకొని 'మీ నిమిత్తంబై కదా నాకుఁ బుణ్యలోకంబులు సిద్ధించె' నని యారత్నమండనపుష్పగంధుల దీవించుచు నద్దివ్యవిమానం బెక్కి యప్సరోగణంబులు గొలువ నింద్రసభకుం జనియె నవ్వధూవరు లిరువురు నిజపురంబునకుం జని నందమహీనాథునకు బంధుయూథంబునకు దమగమనాగమనంబులక్రమంబు చెప్పిన విస్మితులై వీని కిది పునర్జన్మంబు పొమ్మని వీఁ డెవ్వరిచేతను దిట్టువడనికాలంబునకు నిట్టియాపద తరియించె నని పరమానందంబునుం బొంది విప్రవాక్యంబు నిక్కంబుగదే యని కొనియాడుచుండి రటు గావున. 118

క. కుడుపుకటి నతిథి గ్రాసం, బడిగినఁ దనకుడువఁదొడఁగునశనం బైనన్
వడినొసఁగంగా వలయుట, యడర మహాపురుషుచేత నభినుత మయ్యెన్. 119

చ. అనవుడు భోజుఁ 'డిట్టియితిహాసము నే నెఱుఁగంగ నేర నిం
కనొకటి నాకు నిన్నడుగఁగా వలయుఁన్ గృహమేధి కర్హపుం

అని సదనాగతాతిథిసపర్యయు కా తెలివొందెఁ జిత్త మో
మునివర! యందుఁ గల్గు ఫలము న్వివరింపఁ గదయ్య' నావుడున్. 120

క. 'భోజనృపా! విను మతిథికి, భోజన మిడునతని కొదవుపుణ్యమహిమ యం
భోజభవుఁ డైన నెఱుఁగఁడు, నాజగమున నింత నంత నా నెచ్చోటన్. 121

సీ. ఈయర్థమున కొక్కయితిహాస మేను జెప్పెద నొక్కవిప్రుఁడు సదమలాత్ముఁ
డతనికి ముగ్వురు సుతు లుత్తములు వారు పితృమాతృభక్తులై పేర్చి యుందు
రగ్రజన్ములఁ గొల్తు రనుజు లగ్రజులును ననుజులఁ బాటింతు రనుదినంబు
నందులో జిన్నవాఁ డతిధర్మశీలుఁడై విప్రుల కశనంబు వెలయఁ బెట్టు

ఆ. నట్లు జరుగుచుండ నమ్మేలు చూడఁ జాలక విధాత దుదిఁ గలంచె ననఁగఁ
గతిపయాబ్దములకు మృతుఁడయ్యె నవ్విప్రుఁ, డతనియతివ తోన యనుగమించె.

క. తల్లియుఁ దండ్రియు నీక్రియఁ, జెల్లినఁ బరలోకవిధులు చేసినతుది న
య్యిల్లు చెడకుండఁ దమలో, నుల్లమలరఁ గలసి మెలసి యుండిరి కొడుకుల్. 123

క. అప్పుడు నయ్యనుజన్ముఁడు, తప్పక యతిథులకు నన్నదానము వినయం
బొప్పఁగ నిడు నది గారణ, మెప్పుడు సిరి గదల దతనియింట నృపాలా! 124

వ. ఇట్లు జరుగుచుండ నొక్కనాఁ డాతనివది నెలుఁదమమఱఁది ప్రియవాదితనంబుచూచి కనుకుట్టుఁదనంబున నతనిధర్మంబునకు విఘ్నంబు గావింపఁ దలంచి తమపురుషు లం జేరి సఖేదంబుగా ని ట్లనిరి. 125

ఉ. 'అత్తకు నేము మార్పులుక మాయమచిత్తములోనివారమై
వత్తుము పెద్దవారు గలవారికి నన్నియుఁ జెల్లుఁగాక నేఁ
డిత్తఱి మమ్ముఁ బుచ్చి పని యెవ్వరు గొందురు మిమ్ముఁ జూచి నో
రెత్తఁగ నోడి యేపలుకు లెన్నఁడుఁ జెప్ప మెఱింగి యుండియున్. 126

క. ఇంతట నెఱిఁగెద రొండే, నంతట నెఱిఁగెదరు గాక యని యుండఁగ మీ
రెంతట నెఱుఁగరు ప్రతికెడు, పంతమె యిది మీకు నేము పగవారలమే. 127

క. ఒకనాఁ డైనను మాతో, నొకయాలోచనముఁ జేయ కూరక మోమె
త్తికొనుచుఁ బోదురు మీ రాంఁ, డ్రకు మగలకు నిట్టివేఱడంబులు గలవే. 128

క. మగఁ డెఱుఁగ వలయుఁ గాదే, మగువ యెఱుఁగ వలయుఁ గాకమనుగడ తెఱఁగ
మ్మగువయు మగఁడును వెలిగా, జగమున సంసార మెట్లు జరగును జెపుఁడీ'. 129

వ. అని పలికి తమతోడికోడలిం బ్రసంగించి. 130

క. 'పని పంప నెఱతు మాబిడ, పని యెప్పుడు చేసి చేసి పాయవడితి మె
వ్వనిరాజ్య మని యెఱుంగదు, తనచేతఁ దోఁడు మమ్ముఁ దప్పులు పట్టున్. 131

క. తా మాకు సత్త్ర యైనది, యామఱందియుం మాకు మాయయై వర్తించు
నే మయ్యెరువురచేతను, బాములఁ బడలేము *నాతిపాపులభంగిన్. 132

ఉ. పాఱుల పేరు చెప్పుకొని బానెఁడుపప్పును బాయసంబు నై
దాఱుపసంట్లవంటకము నాజ్యముఁ గమ్మనికూరగాయలున్
జాఱులు దించు వారసతిచొప్పున గోళ్ళకు మీఁటుకొంచుఁ †మా
తో రొదగొట్టు నీదగరతోఁ బడఁజాలము వేయి చెప్పినన్. 133

ఉ. ఏతరిలాగు మానఁ డతఁ డెవ్వరి నైనను బిల్చి పెట్టు మీ
రాతని కొక్కమాటయును నడ్డము చెప్పఁగ లేరు జీవనం
బీతెఱఁ గైన నేమి గల దింతయు నిప్పుడు గాసి కాదె మీ
రాతనితోడియంశమున కర్హులు గారె విచార మేటికిన్. 134

క. తనగడన లేదు మీ తెచ్చిన యవి తోడ్తోన వ్యయముచేసెడి నింకీ
తనితోడిపొత్తు పదివేలును వచ్చె మనకు విభక్తులును గావలయున్. 135

క. కాకున్నను జీవనరుచి, మీకుఁ గలుగునంతదాఁక మీపెట్టినచో
నేకరణి నైన నుండెద, మీకష్టులఁ బడఁగఁ జాల మెన్నాళ్ళైనన్. 136

ఉ. ఉమ్మడి సొమ్ము గానఁ దనయోపినయంతయుఁ జన్ని వంకల
న్నెమ్మదిఁ బాఱఁ జల్లుచును నీల్గెడుఁ దాన ప్రదాత నంచు ని
క్కమ్ముగ వేఱు పడ్డతుదిఁ గనఁగ రాదె యతండు పొందులా
భమ్ముల కెల్ల మూల మనుపాటిగ నాలును దాను నుండఁగన్. 137

క. తనయాలును దానును గుడు, వను గట్టను నిట్టియీయవస్థలఁ బడ నే
మును మీరును నటె చాలుం, దనిసితి మిబ్రతుకుపట్టు దయ్యె మెఱుంగన్'. 138

క. అనవుడు 'నది యట్టిద యగు', నని యొండొరుమోము చూచి యన్నయుఁ దమ్ముం
డును నైకమత్యమై తమ, యనుజుని వేర్పెట్టఁదలఁచి రట్టిద కాదే. 139

తే. అన్నదమ్ములు దమలోనఁ జిన్న పెద్ద, వరుస లెఱిఁగి యథోచితవర్తనముల
మెలఁగుచుండుట తమయాండ్రసొలపుమాట, లోలిఁ జెవిఁబడ్డవిమ్మట నేల జరుగు.

వ. ఇట్లు కృతనిశ్చయులై యొక్కసమయంబున నాద్విజులు నిజానుజుం బిలిచి దేశ
కాలవిశేషోపన్యాసంబు మొదలుగా సముచితప్రసంగంబులు తొలుత సలిపి తద
నంతరంబ యి ట్లనిరి. 141

ఉ. 'ముందటిభంగి గాదు కడుమూర్ఖతనంబులు పెద్దయింటిలో
నిందటిరోజయుం జెఱుచు నేసని కైనను బొడ్డు వంప లే

---

* పా:—నారిపాపులభంగిన్. † దా, మాఱులుపల్కు.

దండుకుఁ దోడు చీమ చిటుకన్నను వాదుకు వచ్చుచుండు నీ
సుందరిలాగు లేవలనఁ జూచిన లెస్సలు గావు తమ్ముఁడా! 142

క. నీవును మనకలిమి యెఱుఁగు, దేవారికి నైనఁ బెట్టు టిదిబుద్ధియె నీ
కావిద్య వెన్న తోడిది, గావున వల దన్న మానఁగా నేర్చెదవే. 143

సీ. చుట్టాలు దలలెత్తి చూడంగ మనలోన జగడించుచుండుట తగవు గాదు
చెప్పెద నొకబుద్ధి చెవియుఁ జెక్కు నెఱుంగకుండఁ బైతృక మైనయొడమె గలది
పంచి యిచ్చెదము నీపా లేర్పడినమీఁదఁ బిలిచి యెవ్వరికైనఁ బెట్టుకొనుము
నీవును నీయాలు నెమ్మదిఁ గడుపారఁ గుడువుఁడు కట్టుఁడు తొడుఁగుఁ డిట్లు
ఆ. గాక యన్న మేము కడిపెండుబిడ్డల, వార మెట్లు బ్రతుకువార మనుజ!
నీ వెఱుంగ కుండ నేవంత నైనను, గలుగిరశ్మి గలదె తెలుపు మాకు.' 144

చ. అనవుడుఁ జిన్నఁబోయి యతఁ డానన మించుక వంచి వీర లి
ట్లనుట మహీసురావలికి నన్నము వెట్టుట మాన్పఁ గాదె యే
మనినను మానఁ జాల నని యాత్మఁ దలంచుచు వారిమోము గ
న్గొని యొకకొంతసేపటికిఁ గొంకక బింకముతోడ నిట్లనున్. 145

ఉ. 'ఇంతకుమున్ను నావలన నేయపరాధము లైనఁ గంటిరే
యింతటిలోనివారలు కదే మహి మీరును నన్ను మున్ను మ
న్నింతురు గాన మీకతన నిల్చితిఁ గా దనునంత గగ్గె నే
మంతన మేల వే ఱిదుఁడి మాటికి మాటికి మాటలేటికిన్. 146

క. ఎప్పుడు సహజన్ము లగుట, దప్పెదునే వేఱు వడుట తప్పె మున్నీ
చొప్పిలఁ గలదియ కాదే, యిప్పుడు నిర్ణయము సేయుఁ డీ' రని పల్కెన్. 147

వ. ఇట్లు తమలో సంవాదించి యయ్యన్నదమ్ములు ముగ్వురు విభక్తులై పిన్నాతని నొంటిచేసి పెద్దవా రిద్దఱు నొద్దికరై కలసి యుండి రట్లుండియుఁ గుటుంబ భారంబునందు బ్రుంగుడుపడి దానమానంబుకందువ లరసికొని తిరుగనేపోయెంగాని పరోపకారంబునకు నవకాశంబు లేదయ్యె నతం డొంటి యయ్యును దొంటియట్ల తనపట్టిన వ్రతంబు వదలక యన్నదానంబు సేయుచుండె నంతనా పెద్దవారియందు.

చ. శిశువులు కూడు కూ డనుచుఁ జిందఱ వందఱ సేయ నాఁడువా
రశనము లేక క్రొవ్వుచెడి యంటలు గట్టి చరించుచుండ దు
ర్దశలకు నెల్ల మూల మయి తా రొకయప్పుడు నీరెలుంగుతో
మశకము లట్లు తూలుచు సమర్థుల మోముల వ్రేలుచుండఁగన్. 149

తే. పిన్న యయ్యును గుణములఁ బెద్ద గాన, వానిజీవన మేమియుఁ హీనపడక
యుండె నయ్యున్కి గన్గొని గుండె లెల్లఁ, గుళ్ళుచుండంగ వదిసెలు కుంది కుంది.

చ. మగలమొగంబు చూచి యణుమాత్రయుఁ జేదఱికంబు లేక ఖ్యా
తిగ మనుచున్నవాఁడు భవదీయకనిష్ఠుఁడు వానిఁ బట్టిపా
లు గొనఁగ రాదె మున్నతఁడు లోన నడంపఁగఁ బోలు సొమ్ము మీ
కగపడ కున్న రాజునకు నైన మొఱో యని చెప్పఁ జాలరే. 151

వ. అని పల్కుచు నతనియలివ నుద్దేశించి యాకన్నులకల్కికి ధన మెట్టు గూడెనే యని గుసగుసలు వోవుచుండుదు రీకుటిలప్రసంగంబు లెఱుంగ కతండు సౌజన్య ధనుండుగావున విశేషతిథులయందు సపుత్రకళత్రంబుగాఁదనయగ్రజద్వితయంబు రావించి తనపంక్తి నశనంబు వెట్టుచుండు నమ్మగువయు మగనిమనసులోనిదయై మెలంగుచుండు బ్రాహ్మణోత్తములు ప్రతిదినంబును నతనిగృహంబున నాహారంబు గొని దీవించుచుం బోదు రిట్లు చెల్లుచుండ నొక్కనాఁ డాగృహస్థునితో గృహిణి యి ట్లనియె. 152

క. 'మీ రెల్లప్పుడు విప్రసమారాధనతత్పరాత్ములయి వారల కా
హారములు పెట్టుచుండుదు, రారయ నందు నగుసిద్ధి యది యెద్దియొకో.' 153

క. అనవుడుఁ 'దత్ఫల మింతింతని యేనును మున్ను విన్నయది లే దబలా!
నను నీ విపు డడిగితి గావునఁ జెప్పెద విప్రపుంగవులు రానిమ్మా.' 154

చ అని తనయింటి కద్దివసమం దరుదెంచినవిప్రజాతి క
య్యనఘుఁడు షడ్రసాన్వితము లైనపదార్థచయంబుతోడ భో
జన మిడి వారు తృప్తులయి చల్లనినీడ వసించి యుండ న
వ్వనితయుఁ దాను వారలకు వందన మొప్పఁగఁ జేసి యి ట్లనున్. 155

క. 'ఊహించి మాకు నొకసం, దేహము వాపుటకు నరుగుదెంచితిమి మహో
త్సాహమున విప్రవర్యుల, కాహారము వెట్టుసుకృత మది యెట్టిదియో. 156

క. మా కేర్పడ నానతి యీ, రే కృపతో' ననుడు వార లిందఱు మది నా
లోకించి కొలఁది గానక, మూకత్వము దాల్చి రపుడు మూఢులభంగిన్. 157

ఊ. వారలఁ జూచి 'విప్రు లిటువంటిమహాత్ములు మీ రెఱుంగరే
యూరక యుండు టేతెలివి యుక్తివిహీనులభంగి' నావుడు
న్వారలలోన మేటి యగువాఁ డొకవిప్రుఁడు 'విప్రజాతి నా
హారము పెట్టినట్టిఫల మన్న యెఱుంగరు భూసురోత్తమా! 158

చ. వరదుఁడు కాశికాపురనివాసుఁడు నాఁ దగువిశ్వనాథుఁ డే
తరుణి వరించు నట్టిహిమధామనిభానన శీతసానుమ
ద్వరజ యెఱుంగుఁ బొమ్మనిన వాఁ డది తీర్థము స్వార్థముం గదా
యరిగెద నంచు గ్రక్కునఁ బ్రయాణము గైకొని భార్య కిట్లనున్. 159

క. 'కాశికి నేఁగెద నని పరదేశం బనుతలఁపు నీమదిం జొనుపకు మ
క్లేశగతిఁ దిరిగి వచ్చెద, నోశశధరవదన! యోడకుండుము నెమ్మిన్. 160

క. ఆఁకొని వచ్చినవిప్రులఁ, దాఁకింపక యశన మిడుము తత్పరమతి న
ట్టాఁకలి సేయకు కుడువం, దోఁకొని రా పర్వ మగుతిథుల మనవారిన్.' 161

వ. అనిన విని 'యన్నియుం మీరు చెప్పినట్ల చేసెద నది యట్లుండనిండు. 162

క. సోలయక యన్నం బిడుమీ, జలజభవాన్వయుల కనుట చాలదె యట్టాఁ
కలి సేయకు మని యేలా, పలికితి'రని యడుగ సతికిఁ బతి యిట్లనియెన్. 163

శా. 'ఆహారాధిక మైన మందు నిలలో నయ్యగ్నిదేవుండు స్వ
ల్పాహారంబున మందు విప్రుఁడు మనుష్యశ్రేణిచే నాఁటఁ ద
త్స్వాహాధీశునిమంట భూసురశిఖిం జల్లార్పఁగా లేరు హ
వ్యాహారాదులు దానఁ బో పొలియు నల్పాన్నప్రదుం డెయ్యెడన్. 164

వ. కావున గృహస్థుం డతిథికి నల్పాశనంబిడుట యొప్ప దీప్రసంగంబున నొక్కయితి
హాసంబు గలదు చెప్పెద నాకర్ణింపుము. 165

ఉ. తొల్లి నృపాలుఁ డొక్కఁడు చతుర్జలరాశిపరీతభూతలం
బెల్లను ధర్మమార్గమున నేలినవాఁడు యథోక్తదక్షిణల్
పెల్లుగ నిచ్చి యాగములు పెక్కు లొనర్చినవాఁడు ధీజనో
త్ఫుల్లసరోజమిత్త్రు లగుపుత్త్రులఁ గాంచినవాఁడు నల్వురన్. 166

క. ఎన్నఁడును రోగ మాతని, యున్నూరను లేదు వానియొడ లొప్పుఁ బదా
ర్వన్నెపసిఁడిచందమ్మునఁ, గన్నులు వెలిదమ్మివిరులగతిఁ జెలువొందున్. 167

వ. ఇట్లు రాజపుంగవుండు జగదేకసుందరుండై రాజ్యంబు సేయుచుండఁ గొంతకాలంబు
చనినపిదప జరాభారంబు తోరం బగుటయు. 168

ఆ. కలయ నరసె వెండ్రుకలు స్రుక్కెఁ జర్మంబు,వీఁపు వంగె బొమలు వ్రేలఁబడియెఁ
గన్ను లనువు దప్పెఁ గదలె దంతంబులు, కణఁక లడఁగె శిరము వడఁకఁ దొడఁగె.

వ. మఱియు నమ్మన్నుజేనికి మజ్జనభోజనాదివ్యవహారసంచారంబును శయనాసనా
ద్యారోహణావతరణంబునుం బరాయత్తం బై కాని పరగ నేరనిపాటిగా నపాటవంబు
పొటిల్లె నంత. 170

క. అదురవస్థకు నోర్వక, 'యో దైవమ! మరణ మేల యొసఁగవె' యనుచున్
వేదించునృపతియొద్దకు, నాదరమతి నారదుఁడు రయమ్మున వచ్చెన్. 171

ఉ. ఆతనిరాక భృత్యనిచయం బెఱిఁగింప నెఱింగి భక్తితోఁ
జేతులు మోడ్చి 'యోభువనసేవిత! వార్ధికదుఃఖ మేదఁ బ్ర
స్ఫీతగతిం ద్రివిష్టపముఁ జెందెడుమార్గముఁ జెప్పు' మన్న నా
భూతలనాథుఁ జూచి మునిపుంగవుఁ 'డొక్కమతంబు చెప్పెదన్. 172

క. అవనీసురులకు నన్నం, బవనీశా! పెట్టు నెవ్వఁ డట్టాఁకలిగా
నవనిపయి నతఁడు పద్మో, ద్భవుఁ డైనను బొలియుఁ జుమ్ము తత్క్షణమాత్రన్. 173

చ. వలసిన నీవు నోధరణివల్లభ! యట్టుల చేయుం' మంచు నా
జలజభవాత్మజుం డరిగెఁ జయ్యన నానరనాథుఁడట్ల వి
చ్చలవిడిఁ జేయుచు న్మఱియుఁ జావక యుండె ననేకవత్సరం
బులు మునివాక్యముల్ వృథయ పోయెఁ గదే యని యుగ్గడించుచున్. 174

ఆ. క్రమ్మఱంగఁ బద్మగర్భసంభవుఁ డేఁగు, దెంచె నంతఁ గొన్నిదివసములకు
నతనిఁ జేరి పల్కె నవనీశుఁ 'డయ్యా! మీ, చెప్పినట్ల యేను జేసి చేసి. 175

క. వేసరితిఁ జావు రాదట, చేసెడి దేమి?' యని పలుకఁ జిఱునవ్వు ముఖో
ల్లాసముఁ జేయఁగ నిట్లను, నాసంయమివర్యుఁ డతని కాదర మెసఁగన్. 176

"శ్లో. యస్యస్మృత్యాచ నామోక్త్యా, తపోయజ్ఞక్రియాదిషు
న్యూనం సంపూర్ణతాం యాతి, సద్యో వందే త మచ్యుతమ్." 177

క. ఇమ్మంత్రపఠనశక్తిఁ ద,పమ్ములు యజ్ఞములు మొదలు బహువిధవిధుల
బమ్మినకొఱఁతలు పరిపూ, ర్ణమ్మగు నది నీదువాక్కునకుఁ దేవు గదా!' 178

క. అనినఁ బఠింపుదు ననియెను, జనపతి విని 'విష్ణుమంత్రసామర్థ్యము ద
ప్పునె యదియె సువ్వె తద్దో,షనివృత్తి యొనర్చు దానఁ జా వేల యగున్. 179

ఆ. హరుఁడు విషము మ్రింగునప్పుడు నామత్రయము జపించి కాదె యమరుఁ డయ్యె
నందులోన మొదలి దగునచ్యుతాఖ్య నీజిహ్వ నుండె జముఁడు చేరఁ గలఁడె. 180

వ. అగ్నిస్తంభనంబు పట్టుకొని మద్దు దివిచిన ట్లయ్యె నయ్యా! నీవు చేసినచేఁత' యని
పలికిన నవ్వసుధేశునకు ముదిమి యింత యసహ్యంబు గదే యని మనంబునఁగృప
పుట్టి యతనికి మగుడఁ బ్రాయంబు ప్రసాదించి విరించిసుతుండు విజయంబు చేసె
నట్లగుటం జేసి విష్ణుపరాయణత్వంబును సత్పురుషసందర్శనంబును నేమేమి మేలొనర్చు
నని చెప్పి విప్రుండు వెండియు ని ట్లనియె. 181

ఆ. అతఁడు మంత్రశక్తి నసిఁ బోయెఁ గాక కాఁకున్న మృత్యుబాధ నొందకున్నె
కాన కుడువఁబెట్టి కంచ మాఱడిఁ గొను, కంటె మిగులఁ బాతకంబు లేదు.' 182

క. అని చెప్పి యాతఁ డరిగిన, వనితారత్నంబు విప్రవరులకు నన్నం
బనుదినము పెట్టుచుండఁగఁ, గని విష్ణుఁడు దానిచిత్తగతి యరయంగన్. 183

క. సర్వదరిద్రతఁ జేసిన, నుర్వీసురకాంత యేమియును బెదరక దాఁ
బూర్వగతి దప్పకుండ న, ఖర్వాశనపాకయత్న కౌతుకవృత్తిన్. 184

ఆ. గాదె తెఱచి చూచి కలబియ్య మన్నియుఁ, దెగిన నందుఁ జొచ్చి తిరుగువారఁ
దుడిచి నులిపి యొక్కదోసెఁ డుండినఁ దెచ్చి, వారిజాక్షి వండి వారమోపె. 185

మ. హరి యవ్వేళఁ బతివ్రతాహృదయసారాసారసంశోధకుం
ధరలో నిట్టివిధంబువా రగుట తథ్యం బంచు సూచించున
ట్లురుపీడాపరితప్తదేహుఁ డయి నిట్టూర్పుల్ జనింపంగ దు
స్తరయానంబునఁ గోల యూఁత గొనుచున్ దా వచ్చె నచ్చోటికిన్. 186

వ. ఇట్లు వచ్చి కూర్చుండంబడి కంఠగతప్రాణుండు వోలెం దద్గృహభిత్తి నొత్తిగిలి యున్న యన్నీరజనాభుకపటవేషంబు చూచి కేవలవిప్రుండు గా వగచి యితం డెంతదవ్వులనుండి వచ్చెనో కదే కడు డస్సియున్నవాఁ డని తత్తఱించుచు నతని యడుగులు గడిగి తాలవృంతానిలంబున సేద దేర్చి 'తండ్రీ! నీ వెవ్వ రెందుండి వచ్చి తెటపోయె దేమి యిచ్చ' యనిన నతం డయ్యతివ కిట్లనియె. 187

సీ. 'ఒకచోటఁ గాదు నాయునికి యెచ్చట నైన నుండుదుఁ జుమ్మ నాథుండ నేను
ననుఁ బ్రీతి నిందు రమ్మని పట్టెఁ డశనంబు పెట్టుధర్మప్రాణి పుట్టునొక్కొ
యని యెందుఁ జరియించు నతివ నేఁటిప్రయాణమున మహాతపముచే ముట్టఁబడితి
నేమి సేయుదు నింక నీయస్థిరపుదేహ మెట్టు గా నున్నదో యీయవస్థ
ఆ. కేది గతియొ నాకు నేఁడయు నిచ్చఁగా,' ననుచు మాటమాట కధరపుటము
దడుపుకొనుచు డస్సి పడుచు సొరగ్గుతోఁ, జెప్పె దైన్యరసము చిప్పిలంగ. 188

క. విని కరుణాయత్తం బగు, తనచిత్తమునందు నతని దైవము గాఁగన్
గొని త్రైలాభ్యంగాదులఁ, దనుశోషణ ముడిపి భక్తి దైవాఱంగన్. 189

క. 'కడు నాఁకొంటిరి లెం'డని, వడిఁ గదళీదళము పఱచి వనితారత్నం
బొడికముగఁ గూడుగూరలు, నిడునంత ననేకవిప్రు లేతెంచుటయున్. 190

వ. అప్పు డప్పిప్రరూపశోభితుం డగువిష్ణుం డవ్విప్రవనితం జూచి యి ట్లను 'మీ రన్నదానంబు సేయుదు రని విని యిందు వచ్చి నెట్టిబాఁడ నైతి నాదేహం బడిచి

పడియెదు నీచేసినయన్నం బల్పం బీవచ్చినమహానుభావులం జూచితి గదా వీరల దీపనాగ్నులు దావాగ్నిబడబాగ్నులకంటె నతిశయించి యున్నయవి నీ వేమిట నార్చెదవు చెప్పు' మనిన నవ్వనిత 'తండ్రీ! నీప్రసాదంబున నన్నియుం సమకూరెడుం గాక కొంచెపడియెదునే వారిపని కింత చింతింప నేల మీ రారగింపుఁ' డనిన నతం డి ట్లనియె. 191

క. 'క్షుత్పీడితులై వచ్చిన, సత్పురుషులఁ గనియుఁ గుడువఁ జాఁగునె హస్తం
బుత్పలలోచన! న న్నిటు, తాత్పర్యవిహీనుఁ జేయు దా యిచ్చోటన్.' 192

క. అని యఱచేతనె యాపో, శనముం బట్టుకొనియున్న చలమరిఁ గని య
వ్వనిత చలింపని నెమ్మన,మున విప్రుల కర్ఘ్యపాద్యములు దగ నిచ్చెన్. 193

చ. అసదృశలీల నవ్వనిత యంబుఘటావళిక్రింద నున్నయ
య్యిసు కటు చేటలం జెరిగి యిం పగుబియ్యము చేసి వేడ్కతో
నెసరులఁ బోసి వండి వెర వేర్పడ నయ్యశనంబు భూదివౌ
కసులకుఁ బెట్టెఁ గ ద్దనిసి గ్రక్కున నాఁకలి దీఱునట్లుగన్. 194

క. శ్రీలి నిట్టిది కాదె పతివ్రత లెటు గమ్మనినఁ గాదు వారికి నలదై
వతమునకు వేఱు గలదే, పతివ్రతామహిమ కెద్ది ప్రతి యూహింపన్. 195

సీ. ఉదయపర్వత మెక్కకుండ భానునిఁ ద్రొల్లి వారించినది పతివ్రతయ కాదె
హరిహరాబ్జజుల మువ్వురఁ దనూజులఁ జేసి వాలినయది పతివ్రతయ కాదె
జముఁ బట్టి మగనిప్రాణము మామకన్నులు రావించినది పతివ్రతయ కాదె
ప్రజలెల్ల మ్రొక్కంగఁ బతిఁ గూడి వినువీథి వర్తించినది పతివ్రతయ కాదె
ఆ. సత్యశౌచములకు జన్మదేశము పతివ్రతయ కాదె శాస్త్రమతమునందుఁ
గాన మహిఁ బతివ్రతానుభావము పేర్మి, నభినుతింపఁ గలరె యన్యజనులు. 196

వ. ఇట్లు పతివ్రతాతిలకం బావిప్రసమూహంబునకు నాహారంబు వెట్టిన. 197

ఉ. ఆసతిచిత్తశుద్ధికి నసాకులబుద్ధికి మెచ్చి విష్ణుఁ డ
బ్జాసనుఁ గన్నతమ్మికి నిజాలయమై చెలువొందు నాభితో
శ్రీసతి కున్కిపట్టనఁగఁ జెన్నగువక్షముతోఁ గృపామృతా
వాసకటాక్షశోభి యగువక్త్రముతోఁ బొడచూపె నయ్యెడన్. 198

తే. అట్లు పొడచూపి 'యతివ! నీయంతరంగ, మరయుఁ దలఁపున వచ్చి నీయందు నేమి
కొఱఁతయును గానలేనైతి గుణగరిష్ఠ, రాల వీవు నిన్నితరులు పోలఁగలరె. 199

క. మెచ్చితి నీ కే నొక వర, మిచ్చెద వేఁడు' మని యానతిచ్చె విభుఁడు 'మీ
రిచ్చువర మెందుఁ బోయెదుఁ, నచ్చపుఁగృప నారగింపుఁ' డనియె వనితయున్. 200

మ. అనిన 'విష్ణుఁడఁ గాని మానవుఁడఁగా నబ్జాక్షీ! ప్రార్థమా
త్రుఁడఁగాఁ జూచితి నన్ను' నావుడును జేతుల్ మోడ్చి యాసాధ్వి యి
ట్లను 'నభ్యాగతు లెల్ల విష్ణులని యే నన్నంబు వెట్టంగఁ గై
కొనుచు న్నేఁ డిటు లానతిచ్చె దిది నీకున్ ధర్మమే నాయెడన్. 201

క. అన్నము పెట్టెడునతఁడును, నన్నము గొనియెడునతండు నయ్యన్నము నో
యన్నా! నీదుస్వరూపము, యన్న మఱియు నీవు గానియదియుం గలదే. 202

చ. అదియును గాక లేమి ఘనమై గృహకృత్యము సాఁగకున్నచో
ముదుకదనంబు వైచికొని మూర్ఛ మునుంగుచు వచ్చి యుంగిటం
జదికిలఁబడ్డయప్పుడ నిజంబుగ నీదగుదివ్యమాయగా
మదిఁ గని యున్నదాన మఱి మాటలు సేర్తునె నీదుసన్నిధిన్. 203

ఆ. ఆరగింపవయ్య కూరలు చల్ల నా,రంగ జాడ్యపడు ప్రసంగ మేమి
నీవు గుడువ కున్న నీవిప్రవర్యులుఁ, గుడువ రింతచేయఁ గూడునయ్య.' 204

క. నావుడు నవ్విభుఁడు యశో,దావాసమునందు శబరిమాలయమునఁ గుం
తీవరగృహమునఁ బోలెం, గేవలహర్షమున నారగించెఁ దనివిగన్. 205

చ. అరుదుగ నవ్విశేషమున నాధరణీసురకాంతముంగిటం
గురిసె సువర్ణవృష్టి యఘకుంజరయూథవిభంజనోగ్రకే
సరి యగునాజనార్దనుఁడు సాధ్విఁ గనుంగొని 'యింక నేనియు
న్వర మొక టిత్తు వేఁడుము ధ్రువంబుగ' నావుడు నింతి యిట్లనున్. 206

చ. 'అతిథిముఖంబునందు భవదర్చన నిచ్చలుఁ జేయుం నట్టిస
న్మతియును శక్తియుం బడసి మానసదుర్లభ మైననీదుస
ద్గతి మదిఁ గాంచునట్టిఘనగౌరవముం గృపసేయుం దేవ! మ
త్పతికిఁ గళత్రపుత్రసహితంబు సుఖస్థితి నుండునట్లుగన్'. 207

వ. అని వేఁడిన నట్ల యిచ్చి యచ్యుతుం డంతర్హితుం డయ్యె నయ్యేలనాగయుం బ్రతిదినంబు నతిథిపూజ గావించుచు భర్తృభాషితంబు చొప్పునఁ దప్పక విశేషతిథులం దమబావలను దోడికోడండ్రను వారిబిడ్డలను రావించి యశనంబు వెట్టుచు వసుమతియపోలెం దాల్మి గలిగి మెలంగుచుండె నంత నక్కాంతమగఁ డత్యంత దూరం బరిగి యొక్కనాఁడు పదత్రాణార్థం బొక్కచర్మకారకసదనంబుచక్కటికిం జనిన నతం డిట్లనియె. 208

క. 'ఎందుండి రాక మీ రిట, కెందుల కేకార్యమునకు నేఁగెద రది నా
కుం దెలియఁ జెప్పుఁ' డనవుఁడు మందస్మితలలితవదనమండలుఁ డగుచున్. 209

చ. 'తిరముగ దక్షిణాంబునిధితీరమునం దొకయూరనుండి యేఁ
బరఁగఁగ నొక్కసంశయము పాపుకొనం జనుచున్నవాఁడ శం
కరగిరిజానివాస మగుకాశికి' నావుడు 'నట్లయేని నో
పురుషవరేణ్య! నేఁడు గడుఁ బుణ్యుఁడ వైతిఁ ద్వదీయసేవనన్. 210

క. అడరఁగ నే నాజాహ్నవి, నడిగితి నని చెప్పి నాకు నయ్యుత్తర మే
ర్పడఁ జెప్పుమయ్య యే నీ,యడుగులకెరఁగెద మహీసురాన్వయతిలకా!' 211

చ. అనవుడు విప్రుఁ డియ్యకొని యచ్చటు వాసి క్రమప్రయాణఖే
లన మమరంగ సోమశకలద్యుతిశోభిజటాకలాపరం
జనుఁ డగుపార్వతీశుప్రియసద్మము నాఁ దగుకాశికిన్ ముదం
బునఁ జని జాహ్నవీసలిలపూరము చొచ్చి పవిత్రగాత్రుఁడై. 212

శా. ఈశానుం బరమేశు ఫాలనయనున్ హేలాజితానంగు గౌ
రీశుం గేశవతల్పభూషణుఁ ద్రిలోకేశు న్వియత్కేశు న
తేజోదంచితు భుక్తిముక్తిఫలదున్ గీర్వాణనిర్వాహకుం
గాశీనాయకు విశ్వనాథుఁ గొలిచెం గారుణ్యపుణ్యాకృతిన్. 213

క. పరదారగమనపాతక,హారునకుఁ బ్రణమిల్లి బ్రహ్మహత్యాహరణే
శ్వరుఁ బూజించి యగస్త్యే,శ్వరుఁ గొనియాడి యచలేశు వలగొని మ్రొక్కెన్.

సీ. కరమర్థిఁ బాతాళగరళేశ్వరునిఁ జూచె నన్నపూర్ణేశ్వరు నాశ్రయించె
మొగిని బరాబ్జముఖు ముక్తీశు భజియించె యవిముక్తనాయకు నభినుతించెఁ
బాపసంహారలింగరూపంబుఁ గాంచె మహాపాతకధ్వంసి ననుసరించెఁ
బంచవక్త్రేశ్వరుభవనంబు చొచ్చెఁ బరాశరేశ్వరునకుఁ బ్రణతుఁ డయ్యెఁ
తే. బరశురామేశు సోమేశు భార్గవేశుఁ, బుత్రకామేశు భీమేశు వృత్రసంహ
రేశు విజయేశు నలకూబరేశుఁ దుంబు, రేశు సేవించె నాదివిఘ్నేశుఁ గొలిచె. 215

క. పంచమహాపాతకగజ, పంచాననుఁ డైనదండపాణిమహేశుం
బాంచాలి భానువిష్ణు నుదంచితతాత్పర్యమున నతఁడు దర్శించెన్. 216

క. ఆకాశగంగకును భూ,లోకపథము సూపి శిష్టలోకాభినుత
శ్లోకుం డైనభగీరథ, భూకాంతుఁడు గొల్చుశివునిఁ బొడగని మ్రొక్కెన్. 217

క. కనియెఁ ద్రిలోచనలింగము, ననలేశు నుపాస్తి చేసె నవ్వరుణేశుం
గొనియాడె మహామాయకు, వినయవినమితోత్తమాంగవిలసితుఁ డయ్యెన్. 218

వ. మఱియు నాకాశీనగరమునందు యోగపీఠారూఢ యగువిశాలాక్షి కామాక్షి మహా
దుర్గి వనదుర్గి మంగళగౌరి చిత్రఘంటాదేవి కాళికాదేవి మొదలుగాఁ గలుగుశక్తి

స్థానంబులును లోలార్క వృద్ధార్క సాంబాదిత్యమయూఖాదిత్యపురస్సరం బగు సౌరస్థానంబులును నాదికేశవబిందుమాధవజగన్నాథబలభద్రులు లోనుగాఁ గల్గు వైష్ణవస్థానంబులును గమతేశ్వర భర్తృహరీశ్వర నీలకంఠేశ్వర త్రిలోకేశ్వర మాతంగేశ్వర మణికర్ణికేశ్వర గంగాసీసంగమేశ్వర మల్లికార్జునత్రిపురమల్లికార్జునామృతలింగకేదారలింగప్రధానంబు లగుశివలింగస్థానంబులును భగీరథాశ్వమేధమణికర్ణికామైత్రావరుణపంచనదీపిప్పలికాతీర్థసహితంబు లగుభాగీరథీతీర్థవిశేషంబులును నమృతకుండ పితృకుండ కపాలమోచన పాపమోచన వృషభధ్వజ జంబుకేశ్వ రేష్టకామేశ్వర ఘంటాకర్ణేశ్వరేశ్వర గంగాప్రముఖంబు లగుపుష్కరిణీభేదంబులును ధర్మకూప హరిశ్చంద్రేశ్వరకూప వృద్ధకాకేశ్వరకూప కాలభైరవకూపప్రభృతు లగు పుణ్యకూపంబులు నాదిగాఁ గల్గునానావిధదివ్యప్రదేశంబులు నిరీక్షించి కాలభైరవ భూతభైరవుల నుపాసించి తదనంతరంబ. 219

ఉ. బొందులు వేఱు గాని తలపోయఁగఁ బ్రాణము లేక మండ్రిలం
గొందఱు లేఁతమాట లవి కూరిమిపట్టున నంచుఁ బ్రాణముల్
బొందులు నేకమై రనఁగఁ బో ల్పగుశంకరుని న్భవాని న
స్పందితభక్తిమైఁ గదిసి బ్రాహ్మణపుంగవుఁ డానతాంగుఁడై. 220

ఆ. అచట గొన్నిదినము లతఁ డాభవానిఁ బ్రార్థించుచుండఁ దద్గరిష్ఠనిష్ఠఁ
జూచి మెచ్చి తనదుశోభనాకృతిఁ జూపి, గౌరి యొక్కనాఁడు కరుణతోడ. 221

క. 'ఓవిప్రుఁడ! నీ వేపని,కై వచ్చితి చెప్పు' మనిన నతఁ డి ట్లనుఁ 'ద
ల్లీ! విను మే నొకధర్మము, నీవలనం దెలియ వచ్చి నీకృపఁ గంటిన్. 222

ఉ. ఈపురి నేఁడు నాఁ డనక యెప్పుడుఁ దప్పక యన్నదాన మే
రూపమునందు నైన నొకరుండును నాఁకొనకుండునట్లు గాఁ
దీపెసలారఁ బెట్టుదఁట దేవి! తదీయఫలంబు చెప్పుమా
యీపరమార్థనిర్ణయము నెవ్వరుఁ గానరు నీవు దక్కఁగన్. 223

క. *మా గేహమ్మునకును న,భ్యాగతులై కూడినట్టియవనిసురుల నే
నీగతి నడిగితి నెవ్వరు, నోగిరిజా! పల్కరై రయోగ్యులపోలెన్. 224

ఉ. వారలఁ జూచి యేను గరవారిరుహంబులు మోడ్చి నిల్చి మీ
రూరక నాదుప్రశ్నకు నిరుత్తరులై యిటు లుండ నేటికిన్
బోరనఁ జెప్పరే తెలియఁ బోలనిదే యిది నావుడు న్సుఖాం
భోరుహ మెత్తి యం దొకప్రబుద్ధుఁడు నాదెసఁ జూచి యి ట్లనున్. 225

* మాగృహమున కొకనాఁ డ,భ్యాగతుఁడై కూడినట్టి యవనీసురు నే,
నీగతినడిగిన నాతఁడు, నోగిరిజా! పల్కఁడయ్యె యోగ్యత లేమిన్. చి. ని. పా.

క. ఈయర్థ మితరు లెఱుఁగరు, కాయజరిపుదేవి యెఱుఁగుఁ గాశీపురికిం
బోయి తదీయవిశేషం, బాయంబికవలనఁ దెలియు మని పల్కుటయున్. 226

క. చనుదెంచితి నాకోర్కికి,ననురూపముగా భవద్వచోమృతపూరం
బున నిపుడు నావీనులు, సనకసనందాదియోగిజననుతచరితా!' 227

వ. అనిన నప్పరమేశ్వరి యతని కి ట్లనియె. 228

చ. 'ఎనయఁగ నన్నదానఫల మీశ్వరుఁ డొక్కఁడె యెఱుంగు నేరిగా
కనయము నొడ్డ నెఱుంగుదురె గట్టిగ నీకు వినంగ నిచ్ఛయే
ని నొకయుపాయ మే నిపుడు నీ కెఱిఁగించెదఁ జేసి చూడుమా
వనరుహసంభవాన్వయవివర్ధన! తేటపడున్ సమస్తమున్. 229

వ. ఆయుపాయం బెట్టిదనిన. 230

ఉ. వారణగంగ నాఁగ హిమవద్గిరిచేరువఁ జూడ నొప్పుఁ బెం
పారఁగ నొక్కపుణ్యనది యానదిప్రాంత ననంతవైభవ
స్ఫారత నొక్కప్రో లమరుఁ బన్నగ హేమవతంబు నాఁగ నం
గీరుఁడు నాఁగ నొక్కనృపకేసరి యప్పుర మేలు మేలుగన్. 231

క. ఆవసుధావల్లభునకు, దేవి యొకతె సుమతి నాఁగ ధృతిమతికాంతి
శ్రీవిలసద్గౌరవముల, తావై పతిభక్తిచే దృఢంబై మెఱయున్. 232

క. ఆదేవికి సంతతి మున్, లేదు పతియు నేకభామినీవ్రతుఁడై సం
పాదింపఁడు మఱి భార్యల, నాదంపతు లున్నయెడకు నరుగుము విప్రా! 233

క. అరిగి యథోచితవేళం, గర మనురాగమున వారిఁ గదిసి ధరిత్రీ
భరణక్షముఁ డొకతనయుఁడు, హరిసత్త్వుఁడు మీకుఁ బుట్టు నని చెప్పు తగన్. 234

ఆ. పుట్టినపుడ సజ్జముట్టుదు బెఱవారు, జనని యాది గాఁగ సకలజనులు
తొలఁగియుండినప్పుఁ దొలుత జూడఁగ నిచ్చి, సుతుని బిదప మీరు చూడుఁ డనుము.

చ. అని యొడఁబాటు చేసికొని యాశిశురత్నముఁ జేరి యేకతం
బున నడుగంగ వాఁడు దెలుపు న్విశదంబుగ నన్నదానశో
భనసుకృతంబుచొప్పనుచుఁ బార్వతి చెప్పిన నద్భుతాత్ముఁడై
'పనుపుము పోయి వచ్చెదఁ గృపారసమానస!' యంచుఁ జయ్యనన్. 236

చ. వలగొని మ్రొక్కి నేత్రకరవారిజసంజ్ఞల నాభవాని వీ
డ్కొలుపఁ బునఃప్రణామములు గోరి యొనర్చి 'భవత్కటాక్ష మె
వ్వలనను నాకు రక్ష' యనువాక్యముతోడఁ దదీయసద్మమున్
వెలువడి యొక్కరుండు కడువేడుక నుత్తరభూమి కేఁగుడున్. 237

శా. ఆవిప్రుం డొకచోటఁ జొచ్చి వని ఘోరారణ్యమార్గంబునం
దీవ ల్గాళ్ళను జుట్టఁ దొట్రుపడుచుం దిక్కేది విభ్రాంతుఁడై
పోవం బోవఁగ నొక్కబోయ గని యాపుణ్యాత్ముఁ డేయూరికిన్
బోవం బోయెదొ త్రోవఁ దప్పె నటుచుం బూర్ణానుకంపామతిన్. 238

ఉ. ఆతనిఁ జేరఁ బోయి 'వసుధామర! యేపురి కేఁగ దీవు ఖ
ద్యోతనుఁ డస్తపర్వతగతుం డగుచుండెఁ బథంబు దూర మీ
రీతి నరణ్యమధ్యమున రేయి చరింప వశంబె యెట్టిని
ర్భీతులకైన వన్యమృగబృందము మైమఱుఁ బోవ నిచ్చునే.' 239

క. అనవుడు నాబ్రాహ్మణుఁ డా, వనచరుతో 'నేను హేమవతపురమునకున్
జనుచుండి త్రోవ దప్పితి, నెనయఁగ నా త్రోవ చూపు మేఁగెద' ననినన్. 240

క. ఏటికి వేగిరపడ నీ, పూట నిచట నిలిచి రేపు పోవఁగ రాదే
మాటలఁ దప్పితి తెరు వి,చ్చోటికి నామడకుఁ బడియెఁ జుమ్మది' యనినన్. 241

చ. అని తనపోడుచేనికడ కాతనిఁ దోకొని బోయ యి
ట్లను 'నివె పొట్టికందులును నమ్ములు నున్నవి క్రొత్తకుండ లే
దనఘ! యుపాయ మెద్ది కడు నాఁకొని వచ్చినవాఁడ వీవు నీ
పనిచినయట్ల చేసెదఁ గృపామతి నానతి యిమ్ము' నావుడున్. 242

క. 'నీ సౌజన్యమున మదా,యాసము సర్వమును బాసె నంతియ చాలుం
గ్రాసేచ్ఛ లేదు నీవు వృ,థాసంకటపడకు సౌఖ్యతర మిది నాకున్.' 243

వ. అని యతని నూఱడించి యవ్విప్రుండు తనకలశోదకంబున సాయంకరణీయంబులు దీర్చి కూర్చుండు నెడ నక్కిరాతుండు రెండునొప్పల చాఱబియ్యంబును దేనెయుం దెచ్చి యిచ్చిన నవి భగవదర్పితంబు చేసి యుపయోగించి యాప్యాయనంబుగా నుదకంబు గొని కృతాచమనుండై పర్ణతల్పంబున నుపక్రమించిన. 244

క. 'క్రూరమృగంబులు గల యీ, ఘోరాటవి నిచట నిద్రఁ గూరుట గొఱగా
దీరును మత్సతియును బొడ,వారినమంచెపయి నుండుఁ' డని యెక్కించెన్. 245

వ. ఇట్లెక్కించి యక్కిరాతుండు. 246

ఉ. తా నొకవిల్లు నమ్ములును దాల్చి ముదంబున నిద్ర గాచి యా
చేనికి దుష్టసత్త్వములు చేరకయుండ నదల్చుచుండ న
చ్చో నరుణోదయం బగుట చూచి యొకించుక కన్ను మోడ్చె నా
లోనన యొక్క బెబ్బులి విలోలత వచ్చి వధించె నాతనిన్. 247

క. అప్పులి గవిసినయప్పటి, చప్పుడు విని యక్కిరాతసతి మేల్కని వా
తప్పక యొక్కశరంబునఁ, జెప్పు నరిది గాఁగ దానిజీవము గొనియెన్. 248

శా. ఆవిప్రుండును నప్డు బిట్టులికి యత్యాకంపముం బొంది వా
పోవం జొచ్చె లతాంగి వెన్నఁటి విప్రుం దేర్చెఁ బద్మప్రియుం
డావార్తల్విని వచ్చినట్లు కరసంఘాగ్రంబునం జీకటుల్
పోవం ద్రోచుచుఁ దోఁచె నాదిమదిశాభూమీధ్రశృంగంబునన్. 249

క. అక్కరణిఁ దరణి యాకస, మెక్కినఁ దెలు పెక్కె దిక్కు లిందీవరముల్
ద్రుక్కె విలసిల్లెఁ దమ్ములు, జక్కవపులుఁగులకు విరహజవ్యథ వాసెన్. 250

ఉ. అంతఁ గిరాతకాంత పగ నంపెడువిప్రునిఁ జూచి 'తండ్రి! యే
నింతకు నోఁచి యుండ నిది యేరికి వశ్యమె తప్పఁ ద్రోవ ని
శ్చింతత నేఁగుఁ డాతపముచేఁ గడుఁ జిక్కెద రింకనైన న
ల్లంతనె పోవుత్రోపలె యుదగ్రమహోగ్రమృగప్రకీర్ణముల్.' 251

చ. అనిన నతండు 'నాకుఁ దగవా! యిటువంటి పరోపకారి నెం
దునుఁ బొడగాన నీతఁడు మృతుం డగుటేఁ గనుఁగొంటిఁ జూచి యే
మని చనువాఁడ మిన్నక యథాపరతంత్రము సేయ' కంచుఁ బే
ర్చిన కృపతోడఁ జేయఁ బనిచెన్ దహనక్రియ వానిమేనికిన్. 252

క. వనితయు నప్పుడు పతితో, ననుగమనము చేయఁ బూని యావిప్రుని న
వ్వనభూమి వెడలునంతకు, ననిపి మరలి వచ్చి చేయునదియై నిల్చెన్. 253

వ. అతండును దాని నూరార్చి 'నీ నేర్పువిధంబున నితనికిం బరలోకక్రియలు నిర్వ
ర్తింపుము నాకుం బోవలయు' ననిన నవ్విప్రుమాటకు నబ్బోటి యిట్లనుఁ 'దండ్రీ!
నీ వీయరణ్యమార్గంబులు మున్నెఱుంగవు నిన్ననిపి వచ్చెదం బద' మని ధనురస్త్ర
పాణి యగుచు నాసుశ్రోణి యతనిం దోడ్కొనిపోయి గతాగతజనంబులవలన
నిరంతరసంకులం బగుహేమవతపురంబు తెరువు చూపి యతని వీడ్కొని వచ్చి
పచ్యమానుం డగుచున్నతనభర్తం జూచి 'యే నిట వచ్చెద నిలువు' మని సస్మితంబు
గాఁ బల్కుచు నయ్యగ్నియందుఁ బ్రవేశించె నంత నక్కడ. 254

ఉ. హేమవతాభిధానపురి కేఁగి మహీసురుఁ డానృపాలమా
డామణితో రహస్యపుటెడ న్మును పార్వతి చెప్పినట్లు చే
తోముద మొప్పఁగాఁ బలికి ధూతకళంకతఁ గొన్నిమాసముల్
సోమకళాధరాలయము సొచ్చి జపం బొనరించుచుండఁగన్. 255

ఉ. పుట్టెఁ దనూజుఁ డానృపతిపుంగవు దేవికిఁ బుణ్యవేళ న
ప్పుట్టునఁ దత్తఱించుచును బాటి యథోచితభంగి నేఁగి 'మా

దుట్టమ! కన్ను విచ్చి నను జూడుము చెప్పుము విప్రజాలికిం
బెట్టినయన్నదానమునఁ జేర్చుఫలం బని వేఁడె విప్రుఁడున్. 256

చ. కలకల నవ్వుచున్ శిశుశిఖామణి యిట్లని చెప్పె నప్డు 'వి
ప్రులకుఁ బ్రయత్నపూర్వముగ భోజన మిడ్డఫలంబు చెప్ప నా
యలవియె మీ రెఱుంగరె యనంతఫలప్రద మన్నదాన మేఁ
దెలుపఁగ నేల వేఱె యొకదృష్టము చెప్పెదఁ జిత్తగింపుఁడా. 257

ఉ. మీ రలనాఁడు పంకరుహమిత్త్రుఁడు పశ్చిమవార్ధి లోనికిం
జేరెడువేళ మద్గృహము చేరినఁ బెట్టితి నింతదేనియం
జేరెఁడుచాఱబియ్యమును జిత్త మెలర్పఁగ దానఁ జేసి బ్రం
దారకరాజ్యతుల్య మగుధారుణి యేలుట కిట్లు పుట్టితిన్.' 258

వ. అని పలికి యర్భకుండు పూర్వజన్మంబునం దాను గిరాతుండై యుండిననాఁ డత
నికిఁ జేసినసత్కారంబుకొలందిఁ దెలిపి మఱియు నిట్లనియె. 'అయ్యా! యయ్యల్ప
దానంబువలన నాకిట్టియనల్పఫలంబు సిద్ధించె నీవు నిరంతరాన్నదానశీలుండవు నీ
కెంతటిఫలంబు గల్గునో యది యాపరమేశ్వరుండె యెఱుంగుం గాని యన్యు
లెఱుంగ లేరు నీవు విచ్చేయు' మనిన నాద్విజాతుండు ప్రీతుండై. 259

క. అంగిరుని దగ వీడ్కొని, యంగీకృతసుప్రయాణుఁడై ముక్తిపుర
ప్రాంగణ మగుకాశీపురి,కిం గర మనురాగమున మగిడి చనుదెంచెన్. 260

ఉ. క్రమ్మఱ నాథవానిపదకంజయుగంబు శిరంబు సోఁక మో
దమ్మునఁ జాఁగి మ్రొక్కి 'వనితాతిలకంబ! భవన్మతంబునం
గ్రమ్మఱ నేఁగి యాశిశుముఖంబున నే వినఁ గంటి నన్నదా
నమ్ముఫలం బగణ్య మని' నావుడుఁ బార్వతి ప్రీతి నిట్లనున్. 361

క. 'విను విప్రోత్తమ! నీవచ్చినపని సిద్ధించె నింకఁ జేరుము భవదీ
యనివాసమ్మునకు గృహస్థునకుఁ బ్రవాసైకవృత్తి దోషము సుమ్మీ. 262

క మఱి యాశ్రమస్థు లెల్లను, వఱలుగృహస్థాశ్రమంబువారిన కాసం
బఱ తెంతురు తమ దగునక్కఱ దీర్చుకొనంగ నొందుగతి లే కునికిన్. 263

చ. వ్రతులు గృహస్థువాకిటికి వచ్చి యథోచితపూజఁ గానరే
నతనిగృహస్థధర్మ మది యంతయు నిష్ఫల మండ్రు వెండి య
య్యతిథికృతాఘసంచయము లన్నియుం నాతనిఁ బొందుఁ దత్సమం
చితసుకృతంబు లయ్యతిథిఁ జెందుఁ జుమీ పరమార్థ మారయన్. 264

క. గృహపతి లేనిగృహం బది, గ్రహపతిరహిత మగుదినముగతి మధ్యంబై
మహిమ చెడి యుండుఁ గావున, బహుచింతాలతలఁ జిక్కువడక యరుగుమా.'

చ. అనవుడు నట్ల కాక యని యంబిక వీడ్కొని యాత్మభూమికిం
జనియెడువేడ్క నివ్వటిల జాహ్నవి దాఁటి మహీసురుండు నె
మ్మనమున నల్లయంత్యజునిమాట దలంచి యదేమిచంద మో
కనుఁగొని పోదు నంచు నెసకంబుగఁ గ్రమ్మఱ నిచ్చి యిట్లనున్. 266

క. 'ఓదేవి! వినుము ని న్నొక, మాదిగవాఁ డడిగె వానిమాటకుఁ గలదే
యేమైన నొక్కయుత్తర, మాదట నెఱిఁగింపు నాకు నరుగఁగ వలయున్.' 267

మ. అనినం గంగ నిజాంగదీప్తినిచయం బవ్వాహినీమధ్య మె
ల్ల నలిస్నిగ్ధముగా నొనర్ప నయనోల్లాసంబు మందస్మితా
ననకాంతిం బొదలింపఁ గంకణరవోన్మాదంబుతో హస్త మె
త్తి నయం బారఁగఁ బల్కె 'నోద్విజుఁడ! యర్థిన్ వింటి నీవాక్యముల్. 268

ఉ. శీలగుణోన్నతుం డమలచిత్తుఁడు మత్ప్రియసేవకుండు చం
డాలుఁ డనంగ రా దతిదృఢవ్రతుఁ డాతనికిన్ శుభంబె నా
మేలును జెప్పు మాతనికి మిత్రజ లోనగుపుణ్యవాహినీ
జాలముతోడ విశ్వపతిసన్నిధి నెమ్మిఁ బాయకుండుడున్. 269

మ. అని గంభీరరవంబునం బలుకుపుణ్యాకారిణిం బ్రీతిఁ గ
న్గొని విప్రుండు కరాబ్జము ల్మోగిచి 'నీకున్ మ్రొక్కెదన్ దేవి! యే
జనులుం గానరు నీదుదివ్యతను వస్మద్భాగధేయంబు పెం
పున నేఁ గంటి భవత్కటాక్ష మెలమిం బొందించె నాడెందమున్. 270

క. వాఁడును గేవలపురుషుఁడు, గాఁ డెవ్వఁడొ యంత్యజుండు గాఁ గత మే మో
పోఁడిగ వినవలయు నినున్, వేఁడెదఁ జెప్పు' మని జాహ్నవినిబ్రార్థించెన్. 271

వ. అట్లు ప్రార్థించి యడిగిన నమ్మహానది యతని కి ట్లనియెఁ 'దొల్లి గౌతమీసింధుసమీపంబున నొక్క పసులమంద యుండ నొక్కనాఁ డయ్యేటివెంట నీటివడిం బడి యొక్కగర్భిణి కర్కటివచ్చి యచ్చో నొక్కబొక్క గావించుకొని యుండుడు దానిమీఁద నచటిగోపాలుఁ డొక్కపాలకడవ యిడిన నది ప్రమాదంబునం బగిలి తత్ప్రదేశంబు జొబ్బిలం దడిసె నంత. 272

క. ఆకర్కటిగర్భమున న, నేకంబులు పుట్టెఁ బిల్ల లీనుచు మృతయై
పోక యది యేమికతమున, నో క్రమ్మఱ బ్రతికి యుండె నొగిఁ గర్కటియున్,

ఆ. అట్లు పుట్టి పిల్ల లాదుగ్ధపూరంబువలనఁ దోఁగి కమ్మ వలుచుచున్న
మంచిమృత్తికఁ దిన మఱికొన్నిదినముల, నంతవట్టు దెగిన నరుచి పుట్టె. 274

ఉ. అందొకయర్భకంబు దమయమ్మకు నిట్లను 'నాదుజిహ్వకే
చందమొ మున్నువోలెఁ జవి చాలదు మృత్తిక రోగ మెద్దియుం
బొందదు దీపనాగ్నియును బుట్టక మానుట లేదునాకయో
యిందఱికి ట్లమో తలఁప నేమి యుపద్రవమో తలంపఁగన్.' 275

చ. అనవుడుఁ బుత్రుతోడ దరహాస మెలర్పఁగ నెంద్రిలేమ యి
ట్లను 'వినవన్న! పట్టి! యిది యచ్చపుమంటిగుణంబు గాని తోఁ
చిన దొకదోష మేమియును జెప్పఁగఁ జొప్పడ దొక్కకారణం
బున రుచిపుట్టె యామిసిమిపోయినఁ గ్రొత్త యొనర్చె జిహ్వకున్'. 276

వ. అనియమ్మన్న మున్ను పయఃపూరంబువలన రుచిపారం బగుటఁ దెలిపి 'నీవు పుట్టిన కోలె నదియ సేవించి పెరిగితి గానఁ గేవలమృద్భక్షణం బెఱుంగ వట్లు గావున నీ కిప్పు డిది యరుచి పుట్టె' ననిన విని వెఱఁగుపడి యప్పిల్ల తల్లి కిట్లనియె. 277

క. 'పా లని చెప్పెద వది దా, నేలాగున నుండు దాన నెనసినయాజం
బాలం బింత మధుర మది, గ్రోలెడువారికిని జవులు గొఱఁతయె చెపుమా. 278

ఆ. పాలు లేనివానిబ్రతుకు నిరర్థంబు, పాలు గల్గువాఁడు చాల భోగి
పాలు మనకు నేయుపాయంబునందు సిద్ధించుఁ దల్లి నాకుఁ దెలుపు' మనిన. 279

క. 'సురలోకమునకు నమృతము, నరలోకంబునకుఁ బా లనఁగ నీరెండున్
సరిచేసె బ్రహ్మ యల్పుల,కరయంగాఁ దత్సుఖంబు లబ్బునె కొడుకా! 280

వ. అనిన నది మఱియు నిట్లనియె. 281

క. 'నరలోకం బెటువంటిది, సురలోకం బెట్టి దీవు చూచితె మనమం
దిరములపాటివి యౌనో, విరచితగతి నింతకంటె విస్తీర్ణములో. 282

క. అందుండెడువారికి మన,చందమొ రూపములు వేఱెచందమొ నా కా
చందము వివరింపు' మనిన, నందనుమాటలకుఁ దల్లి నవ్వుచుఁ బల్కెన్. 283

క. 'మన ముండెడుబొక్కలకును, మనకును నుపమేయమాత్రమా వారలభ
వ్యనివాసస్థలములుఁ దద్వినుతాకారములుఁ దెలియ విను మట్లయినన్. 284

క. నాక మనఁ బరగు దివిజుల, లోకములో మఱియు నూర్ధ్వలోకము మఱి భూ
లోక మనఁ బరగు మనుజుల, లోకము మన మిప్పు డున్నలోకము పుత్రా! 285

చ. చరణము లూరువు ల్జఘనచక్రము లానతనాభు లంచితో
దరములు పీనవక్షము లుదారభుజంబులు కంబుకంఠముల్

సురుచిరవక్త్రపద్మములు శోభితచక్షులు ఘ్రాణకర్ణముల్
శిరములుఁ గేశపాశములుఁ జెన్నగు మేనులవారు దేవతల్. 286

క. దేవతలకు విను మడిమియుఁ, జావును లే దెన్నఁడును బ్రశస్తగుణాఢ్యుల్
కావున విమానయానులు, నై విహరింపుదురు వా రుదాత్తప్రీతిన్. 287

క. జరయును రుజయును నరులకు, దొరకొనె నని కాని యాకృతులు దలఁపఁగ ని
ర్జరులట్ల నరులు వారికిఁ, గరితురగాందోళికలును ఘనవాహనముల్. 288

వ. కావున నట్టిప్రభావంబు లోకోత్కృష్టసుకృతవిశేషంబులం గాక యూర కెట్లు సిద్ధించు మనము పూర్వజన్మంబున దూరీకృతసుకృతుల మగుట నిట్టిదుష్టజన్మంబు వాటిల్లె' ననిన విని 'జననీ! నీ కిట్టిపరమజ్ఞానం బేమి విధంబునం గలిగె నెఱిఁగింపు' మనిన వాని కిట్లనియె. 289

శా. 'ఏ నాగౌతమిలోన నుండుచెడ నయ్యేటం గృతస్నానులై
నానాదేశసమాగతద్విజులు నానాధర్మము ల్చెప్పుచో
నానారీతులమాట లేను వినుట న్నా కిట్టియత్యుత్తమ
జ్ఞానం బబ్బెఁ బురాణగోష్ఠి కెనయే సౌఖ్యంబు లోకం బెవ్వియున్. 290

ఆ. అందుఁ గానరానియర్థంబు లే దిది, ధర్మఫణితి యిది యధర్మసరణి
యని యెఱుంగ వచ్చు నవివేకి కైనను, నదియ చూవె తలఁప నాత్మహితము. 291

మ. విను మయ్యుత్తమగోష్ఠియందుఁ గొడుకా! విశ్వంభరం గల్గు పు
ణ్యనదీతీర్థవిశేషముల్ తెలిసె నెన్నం బెద్ద యాగంగ త
ద్వినుతస్నానఫలంబునం గలుగుఁ జువ్వే పుణ్యలోకంబు లె
వ్వనికిం బొంద నశక్య మైనయవి దుర్వారప్రచారంబుగన్'. 292

క. అనవుడు 'భవదుపదేశంబున దల్లీ! నాకు వేడ్కపుట్టెడు నన్నుం
బనుపుము గంగాస్నానంబున కీదివసములు రిత్తవోవక యుండన్.' 293

ఉ. నావుడు 'నద్దిరన్న తగునా యిటు పల్కనరణ్యముల్ ఘన
గ్రావము లేఱు లూళ్ళు నగరంబులు నా బహుభంగు లైనయా
త్రోవల నేఁగ నీవశమె త్రొక్కవె గోమహిషాదికోగ్రస
త్త్వావళి గంగ యెక్కడ త్వదాలయ మెక్కడ వెఱ్ఱివాఁడవే. 294

చ. అది యటు లుండె నీశిశువు లందఱు నిం కిట వచ్చు వేసవిన్
బ్రదుకుట సన్న మాపడియపట్టున నీళ్ళను నింత గౌతమీ
నది మనప్రాంతపట్టు జతనంబున నచ్చటి కేఁగి యున్న నే
కొదవయు లేదు రం' డనుచు గొబ్బునఁ దోఁకొని పోయెఁ బిల్లలన్. 295

క. ఆపిల్ల లామహానది, నాపోవఁగ మధురతోయ మాని యథేచ్ఛ
వ్యాపారంబుల నుండఁగ, నేపారఁగఁ దత్తనూజుఁ డిట్లను మఱియున్. 296

ఉ. 'నీ కిది చాఁగి మ్రొక్కెద ననిందగుణాస్పదమూర్తి నేను గం
గాకమనీయతోయములఁ గాయము దొప్పఁగఁ దోఁచి యెత్తి య
స్తోకపురాకృతాఘములదొంతులు సర్వము గూలఁ దన్నుదుం
గాక భవత్తనూభవతఁ గాంచియు నిర్వ్యవసాయి నౌదునే. 297

క. నా తెగువకుఁ దగ నీవును, నోతల్లి! యనుజ్ఞ యొసఁగు మొయ్యనఁ జని సు
స్నాతుఁడనై మనయన్వయ, జాతులకును బుణ్యలోకసౌఖ్య మొనర్తున్.' 298

వ. అని నెట్టుకొని పల్కినం గర్కటి 'యక్కటా! యేమియు నెఱుంగనినావెట్టి తనకు గంగామాహాత్మ్యం బేల చెప్పి బేల నైతి' నని పశ్చాత్తాపంబు నొందుచు దాని కిట్లనియె. 299

క. 'యోగులుఁ గాశీప్రాణ,త్యాగులు నేమిగతి గాంతు రనురాగముతో
నాగతి వారిదివసంబున, నీగౌతమిఁ గ్రుంకువారి కేర్పడఁ గల్గున్. 300

క. ఈగౌతమి మును పుట్టెను, భాగీరథి పిదపఁ బుట్టె ఫల మొసఁగెడిచో
నీగౌతమియే యెక్కుఁడు, భాగీరథికంటె నండ్రు ప్రాజ్ఞులు పుత్రా! 301

క. అట్టిఘనపుణ్యవాహిని, నట్టింటనె యున్నయది మనకుఁ బెఱనదులం
బుట్టెడులాభం బెట్టిది, యెట్టి గదే భూమిఁ దిరుగ విడువు దురాశల్.' 302

చ. అనుడుఁ 'బథప్రయాస మది యల్పమె దూరపుఁ దీర్థమారయ
న్ఘనము సమీపతీర్థమునకంటె ననం బొగడొందు గౌతమిం
గనుఁగొనఁ గల్గె నేఁడు మఱి గంగయుఁ జూడఁగ నబ్బు టొప్పదే
జనని! కృతాంతరాయములు చాలుఁ జలంబొ ఫలంబొ చెప్పుమా.' 303

ఆ. అనినఁ గొడుకుమాట కడ్డంబు చెప్పంగ, నలవి గాక యుండి వెలఁది పలికెఁ
'దీర్థయాత్ర సేయఁ దివురువారల నడ్డ, పెట్టి పాప మేలి కట్టుకొందు. 304

ఉ. పిన్నవు గాన నీవలని ప్రేమము నా కధికంబు గాన నే
నిన్నియుఁ జెప్పి చూపి తుది నేమిటనుం గడ గాన నైతి ని
న్నెన్నఁడు చూతు నింక నెటు లేఁగెదవో పరభూములందు నాఁ
కొన్నఁ బథశ్రమంబు మదిఁ గూరిన నన్నుఁ దలంపుదో కదే. 305

ఉ. గంగకు నేఁగి నీసుతునిఁ గంటిమి నెమ్మది నున్నవాఁడు మా
సంగడి వచ్చి వచ్చి యొకచక్కటికిం బయనంబు చేసె నో.

యంగన నేఁట నెల్లిటను నాతఁడు వచ్చుఁ దలంకకుండు మం
చుం గర మర్థిఁ జెప్పునిజసూక్తులు వీనుల కెన్నఁ డబ్బునో. 306

ఆ. నీవు గంగ కేఁగి నిరపాయదేహివై, మరల వచ్చి తేని మనకులంబు
వారి కెల్లఁ దీర్ఘవాంఛ జనించుఁ బో, చిత్తవృత్తులందుఁ జిన్నివడుగ! 307

ఆ. పొమ్మనంగఁ జాలఁ బో కని మాన్పంగఁ, జాల నీకు నెట్లు పోలు నట్లు
చేయు' మనిన నతఁడు చిఱునవ్వు నవ్వుచు, మాతయడుగులకు నమస్కరించి. 308

క. తమ్ములఁ గౌఁగిటఁ జేర్చుచు, నెమ్మి యలర బుజ్జగించి నిలుపుచు నచ్చోఁ
ద్రిమ్మరుఘవదర్దురముల, సమ్మతిఁ గొని గౌతమికిఁ బ్రశస్తాంజలియై. 309

క. ఆనది వెడలి సమంచితయానంబునఁ గొంతనేల యరుగఁగ నొకచోఁ
మ్రానిపయినుండి చూచె మహానిష్ఠురమూర్తి యొకవిహంగము దానిన్. 310

క. చూచి పఱతెంచి యొడిసి యగోచరవేగమున నెత్తుకొనిపోయి సమీ
పాచలశిలపయిఁ దినియెన్, వాచవి కలరుచును వానినంజుడు వెలుచన్. 311

వ. ఇట్లు తిని యాఖగం బెగసి పోయె నాకర్కటికుమారుండును నట్లు మరణంబు నొంది గంగాయాత్రలు సేయువారలు విధివశంబున నడుమనె మృతిం బొందిరేని జన్మత్రయంబునఁ దద్దర్శనంబు సిద్ధించు ననుట సిద్ధంబు గావునఁ దదనుషంగంబుగా నొక్కమహీపాలుకీలారంబుగోవులలో నొక్కగోవుకడుపున జన్మించె నంత.

క. ఆరా జొకనాఁ డాకీలారమునకుఁ జూడ వచ్చి లావణ్యాతను
శ్రీరుచుల నొప్పి సింహకిశోరముక్రియ నున్నక్రేపుఁ జూచి ముదమునన్. 313

సీ. గోపాలకులతోడ భూపాలుఁ డిట్లను 'నిది కంటిరే తనయీఁడు కోడె
లకు లేనికాంతియుఁ బ్రకటితరూపసంపదయును మిక్కిలి యదటుఁ గలిగి
విషమలోచనుఁ డెక్కువృషభవల్లభునకు వాహ నే మవునొక్కొ వసుధమీఁద
నన మీఁటు గలిగి యున్నది దీని సాఁబోతుఁ గావింపఁ దగు వాలకదుపులోన

ఆ. నింక దీనితల్లి నెన్నఁడుఁ బిదుకకుఁ, డిదియ చన్ను గుడిచి బ్రదుకుఁ గాని'
యనిన వారలును మహాప్రసాద మ్మని, ప్రీతితోడ నట్ల పెనుపఁ బెరిగి. 314

సీ. చెలఁగి కాల్ద్రివ్విన నిల ప్రక్కలై భుజంగమరాజుతలలరత్నములు దొఁప
వెస ఱంకె వైచిన వసుధాధరేంద్రగహ్వరముల హరులు బిట్టదరిపడఁగఁ
గొమ్ములఁ గోరాడి చిమ్ముచోఁ నెగసినఘనగండశిలలు మేఘములు దాఁక
బీఁదఱ గొని పాఱుచోఁ దరుశ్రేణు లుద్ధురవాతహతి బోలెఁ దుమురు గాఁగ

ఆ. దనకు నెదురులేని ఘనసత్త్వసంపద, నలరి గోపికాచయంబులోని
గోపకృష్ణునట్లు గోరత్నములలోన, వృషభ మధికసౌఖ్యవృత్తిఁ బెరిగె. 315

క. కరువునఁ బోసినవిధమున, నరుడుగఁ దనరూప మెట్టి దట్టిద కాఁ ద
త్సురభులు గ్రేపుల నీనఁగ. బొరిఁబొరిఁ నేఁటేఁటఁ గదుపుపాదు పగుడెంచెన్ 316

క. ఈ తెఱఁగునఁ బెక్కేఁడులు, బ్రాతిగ భోగించి తనివి పదపడి వృషభం
బాతను వొకమృగపతికి న,నాతంకప్రీతి నొసఁగె నాహారముగన్. 317

క. మఱి కొంకణదేశంబున, నెఱసిన సితదత్తనామనృపతికి సుతుఁడై
గుఱి లేనిపరమగుణముల, వఱలెఁ దృతీయభవమందు వంజరుఁ డనఁగన్. 318

క. వంజరుఁ డఖిలాశ్రితశుక, పంజరుఁడు విరోధిభయదబాహాబలది
క్కుంజరుఁ డభిరామయశో,మంజరుఁ డన నొప్పె నతిసమంజసవృత్తిన్. 319

ఉ. ఆతని పెండ్లి సేయుటకు నై సితదత్తవిభుండు రాజక
న్యాతిలకంబులం దడవునప్పు డతండును దండ్రితోడ 'న
య్యా! తనుదోషము ల్వొలియునట్లుగ జాహ్నవి కేఁగి యందు సు
స్నాతుఁడ నై నినుం గొలువఁ జయ్యన వత్తును వేడ్క పుట్టెడున్.' 320

క. అనవుడు 'నే నెటు దలఁపఁగఁ, దనయుం డెటు దలఁచె బాపు దైవమ! యిం కే
మని పల్కెడు నీతఁడు పొసఁ,గనికోరికఁ గోరె నెట్లు గా నున్నదియో? 321

సీ. ఇల నెందుఁ దల్లిదండ్రులకు గారామారఁ బెరిఁగి నానాఁటికి గురులవలన
విద్య లన్నియుఁ నేర్చి విహితమార్గమున వివాహమై సంతానవంతుఁ డైన
తుదిఁ గదా మనుజుండు దూరతీర్థము లాడ నరుగుట తాపసవరులతోడి
సంసర్గ వ్రతములు సలుపుట యిది ధర్మపరిపాటి వీని నుపక్రమంబు
తే. గాఁగ నెవ్వఁడొకో వియద్గంగ మీఁద, వాంఛ పుట్టించె శైశవావస్థయందె'
యనుచుఁ దలపోసి నాదుప్రయత్న మెల్ల, నింక నెవ్వరి కని చేష్ట లెడలి యడలి.

వ. ఇంచుక సేపు విచారించి యానృపసత్తముండు దనకుమారోత్తముఁ దెసఁ గ్రమ్మఱ
నవలోకించి. 323

క. అక్కటిక మెసఁగ నిట్లనుఁ, 'జెక్కిడిచినఁ బాలు వడుచుచిన్నవడుగ! నీ
కెక్కడ గంగాస్నానం, బెక్కడ పసిబిడ్డ వేమి యెఱుఁగుదు చెపుమా. 324

క. విను మింతియ వలసిన బో,రన విప్రోత్తములఁ బనిచి రావించెదఁ బా
వన మగుగంగాతోయము, పనివడి నీయరుగునంతపని యున్నదియే.' 325

క. అని పుత్రస్నేహంబునఁ, దనుఁ బల్కినఁ దండ్రితో సతం డిట్లనుఁ 'బ్రా
గ్జననోదాత్తసుకృతవా,సన నూనినమానసాంబుజము వికసింపన్. 326

సీ. 'ధర్మకర్మము సేయుదాఁకికి నిది ప్రాయ మిది కాల మని వాలయింపఁ గలదె?
తనమోహినంతయుఁ దగిలి;యొనర్పంగ నట యబ్బినంతయు నబ్బఁ గాక

చేయార ధర్మంబు చేయఁ గాలము లేదె యనుచు నేమఱి యున్న నజునితలఁపు
తనచేతిలోనిదే ధర్మేచ్ఛ గలుగుట యల్పమే కలిగినయది నిరర్థ
ఆ. కంబు చేసికొనుట కర్తవ్యమే నేత్రహీనుఁ డైనయాతఁ డెట్టు లున్న
నుండెఁ గాక తనకు రెండుకన్నులు గల్గియుండి యంధునట్ల యుండఁ దగునె. 327

క. నీవెఱుఁగనిధర్మస్థితి, భూవర! మఱి కలదె నన్నుఁ బుచ్చుము త్రిజగ
త్పావని యగుగంగానది, కేవిఘ్నముఁ జేయ వలవ దిచ్చో' ననినన్. 328

క. 'అన్నన్న! యేల నీ కీ, పిన్నొదలికి నలవి గానిపెనుఁబోకలు నే
నున్నంతకాలమును నా, కన్నులెదుర నుండవన్న కథ లేమిటికిన్. 329

క. అని తన్ను నివారించిన, జనకునితో నతఁడు 'నన్నుఁ జన నీ కున్నం
జనవర! నీమీఁద నభోజన ముండుదు' ననుచు గంటసము లాడుటయున్. 330

సీ. ఏఁ దన్ను వల దని యెన్ని చెప్పిన మానఁ డని పంప నేఁడాది కాఱునెలల
కైనను గ్రమ్మఱ నరుదెంచు బలిమి నేఁ డడ్డపెట్టితి నేని నశన ముడిగి
వేగంబె ప్రాణము ల్విడుచు నీరెంటియందును వీనిఁ గాశికిఁ బనుచుపనియె
పొసఁగి యున్నది యని వసువస్త్రధాన్యాదికముగఁ బాథేయంబు గలుగ నొసఁగి
తే. పరిజనముల నుచితభంగిఁ దోడిడి కొంద, అవనిసురులఁ గూర్చి యవ్విభుండు
తనకుఁ బ్రణతుఁ డైనతనయుని నాశీర్వదించి వీడుకొలిపెఁ దెగువతోడ. 331

క. ఈవిధమునఁ దనుఁ బాసియుఁ, భావంబునఁ బాయ కున్నబాలునిరూప
శ్రీవిభవము పలుమఱు శో, కావేశమతిం దలంచు నశ్రులు నించున్. 332

క. నాయనుఁగుఁదనయుఁ డింతకు, నేయెడ కరుగు ననుఁ దొల్లి యెఱుఁగండు ప్రవా
సాయాసం బను నేనును, బోయెదఁ గా కనును గడచి పోకున్నె యనుచున్. 333

ఉ. ఆతనిక్షేమవార్త లనయంబున నా కెఱిఁగించుసద్గుణో
పేతుఁడు గల్గునొక్కొ యనుఁ బెద్దలు నెవ్వగ నొందుచుండ నీ
రీతిని దూరదేశము చరించుట గా దని త్రిప్పి తెచ్చి నా
చేతికి నిచ్చుసత్కృతచిత్తుఁడు చొప్పడఁడొక్కొ నేఁ డనున్. 334

క. ఇన్నాళ్ళెద్దియు నెఱుఁగము, క్రొన్నెలక్రియఁ గ్రాలుముద్దుకొడు కరిగిన నేఁ
డిన్నియును దోఁప వయ్యెడు, నెన్నఁ డతనిఁ గన్నులార నేఁ జూతు ననున్. 335

క. ఇవ్విధమునఁ దలపోయుచు, నివ్వటిలెడుపుత్త్రశోకనిష్ఠురవహ్నిన్
గ్రొవ్వు చెడ నెరసి జీవం, బవ్విభుఁడు దొఱంగె స్వజను లాక్రందింపన్. 336

తే. అనిన విప్రుండు గంగకుఁ దనకరాంబుజాతములు మోడ్చి 'యోతల్లి! యాతఁ డట్లు
పుత్త్రశోకంబుచే మృతిఁ బొంద నేమి, కారణము గల్గెఁ జెప్పవే కరుణ' ననిన.

వ. విని దరహసితాననయగుచు నమ్మహానది యమ్మహీదేవున కిట్లనియె. 338

క. 'తడ వయ్యె ననక చెప్పం, బడియె ననఘ! నీవు నన్నుఁ బ్రవ్యక్తముగా
నడిగెదు కావున విను మేర్పడఁ జెప్పెద నానృపాలుప్రారంభంబున్. 339

చ. కలఁ డొక బ్రాహ్మణోత్తముఁ డకంపితచిత్తుఁ డనేకవత్సరం
బులు పరమేశుఁ గూర్చి వనభూమిఁ దపోధనవృత్తి నున్నవాఁ
డలవడ నొక్కనాఁడు దనయాశ్రమమందు సుఖాసనస్థుఁడై
విలసితబుద్ధి నొక్కరుఁడును వేదము వేడుక నుగ్గడింపఁగన్. 340

సీ. నడుచుచో నూరులయొడికంపుమెఱుఁగులు సరిఁ బొఱుటాకులసంది నిగుడఁ
బులినస్థలంబులోఁ బురుడించుజఘనంబు వడిఁ జేదకొనుకు వడఁ గొనర్ప
నిభకుంభయుగళంబు నేపు దింపఁగఁ జాలుబిగువుఁజన్నులు క్రొత్తజిగిఁ దలిర్ప
విద్యుదంకురములు వెదచల్లువిధమునఁ గ్రాలుఁగన్నులఁ జూపుగములు పొలయఁ
తే. గ్రీడఁ బందికై తోడరినకృతకశబర, వనిత క్రీడార్థ మచటికి వచ్చె ననఁగ
వన్యశాకఫలార్థమై వచ్చె నొక్క, చెంచుటెలనాగ మైదీఁగె మించు దొలఁక. 341

క. అవ్వనజాననచూపులు, పువ్విలుతునితూపులై తపోధనుహృదయం
బవ్వలికి వెడల నాఁటిన, నవ్వేళ నతండు బ్రతుకు టద్భుతమయ్యెన్. 342

ఆ. అట్లు మరునిబారి కగ్గమై యాతాప, సోత్తముండు దానిచిత్తవృత్తి
యెఱుఁగ లేక కదిసి యంటిముట్టిఁ బైపడఁ, దరుణి కోపమున నదల్చి వైచె. 343

మ. 'అమితక్రోధులు నాదుబంధుజను లుద్యద్బాణబాణాసనా
దిమహాశస్త్రనిరూఢు లూర్జితమహోద్రిక్తాంగు లీకానన
ద్రుమవల్లీనిచయప్రదేశముల నెందుం దార యున్నారు వి
ప్ర! మదిన్నీ దగునాగడం బెఱిఁగినం బ్రాణంబు పోఁ జేయరే.' 344

ఆ. అనిన నొడుపు తప్పినట్టిసర్పమువోలె, నప్పు డంబకముల నిప్పు లురుల
దానియాననంబుఁ దప్పక చూచి 'దుర్గాతి! పొమ్ము మెచ్చ వైతి నన్ను. 345

ఉ. ఏ నిటుఁ గోరి డగ్గఱిన నిచ్చ యెఱుంగక రేఁచుకుక్కచం
దానఁ గఠోరభాషల నదల్చితి కావున నీవుఁ గుక్కవై
యూనినకిన్కతో మెఱుఁగుచుండు తపస్వులఁ జూచి యంతటం
గాని భవన్మనోమదవికారము పోదని యిచ్చె శాపమున్. 346

క. అటుగాన నాఁటఁ గోలెను, జటాభసితధారులైనసత్పురుషుల నె
చ్చటఁ గనినను శునకముశ్రుతి, పుటములు చీదఱలఁబోవ మునుకొని మొఱఁగున్.

వ. అట్టి దారుణశాపంబునకు భయంపడి యప్పుడంతి యతనిసమక్షంబున. 348

క. గడగడ వడఁకుచు నశ్రులు, వడియఁగఁ జేదోయి మొగిచి 'స్వామీ! కోపం
బుడుగుము శాపంబునకును, విడుమర యెన్నఁ డగుఁ జెప్పవే కృపతోడన్.' 349

చ. అనవుడు 'నీకు నేను దగ నంచుఁ గదా యిటు చేసి తింక నీ
శునకశరీరచిహ్నలకుఁ జూడఁగ నీ దగుగండుఁగుక్కతో
నెనయ సుఖించి గర్భము వహించి తనూభవుఁ గాంచి తన్మృతిం
గనలెడుశోకపావకశిఖావలిఁ గ్రాఁగక శాప మాఱునే.' 350

వ. అని యాతఁడు మఱియు నారసి కోపంబున శాపంబునకు నవధి చెప్పినవాఁడై యథేచ్ఛం జనియె నాచెంచులేమయు నసారం బగుసారమేయత్వంబు నొంది యెన్ని చెప్పినఁ జక్కటికి రానియవివేకిచిత్తంబువోనివక్రపుచ్ఛంబుతో లుబ్ధు నడిగి యలబ్ధమనోరథుం డగునర్థివిధంబునం జెవు లడఁచికొనుచు నెటయేనియుం దిరుగుచుఁ గఱవుకాలంబునాఁటిబడుగుచందంబునం గుడిచి వైచినపత్త్రభాజనంబులకుం గడిసి తద్గతోచ్ఛిష్టంబులం బొట్టఁ బ్రోచికొనుచు బహుజనద్వేషివిధంబున నింటింటికిం జని ఛీ యన మరలి పోవుచు దూషకువిధంబున నెవ్వరిం బొడగనినం దోలంగి తలయెత్తి వట్ట మొఱుఁగుచు నసూయాగ్రస్తువిధంబునఁ గులంబువారితోడన క్రోధించుచు వరువుడువిధంబునఁ గాముకులతో నెదురుపడం దాఁ గాట్లాడుచు నప్పుగొని తీర్పలేక కుతిలపడుగడుసరివానివిధంబున మైథునాంతరంబున నొండొంటి నంటుకొని సకలజనంబులకు నపహాసాస్పదం బైనసరియాఁక లుండుచు నిట్లు రోఁతల కెల్ల నూఁత లగుచేఁతలం గొంతకాలంబు గడపి గర్భిణియై యొక్కకొడుకుం గని సకలజనులుం జెగడ నిసర్గస్నేహంబున వానితోడం జెరలాడుచుండె నంత నొక్కనాఁడు 351

క. సితదత్తుఁ డడవిలోపలఁ, గతిపయపరివారుఁడై సుఖవ్యాపార
స్థితి నుండఁగఁ జోరులు దన, సుతులకుఁ దగ నెగ్గు సేయఁ జూతురొ యనుచున్.

క. ఉఱక యెదురేఁగి మూఁకకు, నుఱికి మొఱఁగుకొనుచు మిగుల నుగ్రాకృతియై
కఱవం బైకొనఁ బెల్కుఱి, పఱచిరి తద్భటులు రాజుపట్టునకుఁ బెలుచన్. 353

ఉ. ఆనరనాథుఁ డప్పు డచలాత్ముఁడై దల యెత్తి చూచి యీ
శ్వానము కేమి మూఁడె నని చాపము ద్రిప్పుచు నొత్తికొంచుఁ బోఁ
బో నొకచక్కటిం దనదుపుత్త్రునిఁ గూడినఁ జూచి రేఁగి యీ
కూనకునై కదా మొఱిఁగికొంచు మముం గఱవంగ వచ్చెడున్. 354

క. దీనిఁ బొరిగొనక యూరక, పో నని బాణంబుఁ దొడిగి భూపాలకుఁ డా
కూనఁ బడనేసెఁ దచ్ఛో, కానలమున నెరియుచుం దదంబ యిటు లనున్. 355

క. 'ఈకన్నులు దెఱవనిశిశు, వేకీ డొనరించె నీకు నిట నృపవర! నీ
వీకాన కేఁగుదెంచుట, నా కీశోకంబు గట్టనా నిర్దయతన్. 356

క. భువిఁ బుత్రస్నేహము మా, నవజాతికె కాక లేదె నరనాయక! మీఁ
దు విచారింపక చేసితి, తనిలెఁ గదా నీకు బెట్టినపు శాపము దాన్. 357

ఆ. భూప! నీవు నింకఁ బుత్రశోకమునను, జావు' మనుచుఁ దీవ్రశాప మిచ్చె
శునకవనిత యతఁడు విని యద్భుతస్వాంతుఁ, డగుచుఁ దిరిగి పోయె నాత్మపురికి.

క. పడపడి తచ్ఛునకాంగన, హృదయంబున శోకవహ్ని యొసఁగం బుత్రుం
బొదువుక కన్నుల నీర్లం, గదురఁగ ని ట్లనుచు వగవఁ గాఁ దొడఁగె నొగిన్. 359

సీ. 'అంటెనఁ గండెదునట్టినీ మెత్తనియొడలికిఁ జిచ్చుఱపిడుగువోని
నుగ్రాస్త్ర మెక్కడనుండి సంగ్రహ మయ్యె నాముగ్ధకూన! యేనరపతియును
విపినభూములు చొచ్చి వేఁట లాడెడుచోటఁ గ్రూరసత్త్వంబులఁ గూల్చుఁ గాక
యదయుఁడై తొడఁగి కుక్కురపోతముల కల్గుపాపకర్ముఁడు భూమిపైని గలఁడె

ఆ. యెవ్వ రెచట నున్న నే మని నే నూరకుండ నేర నైతి నుఱికి వారిఁ
గఱవఁబోయినంత వెఱపింపఁగాఁ బోయి, వెఱచినట్టు లయ్యె నుఱక నేఁడు'. 360

క. అని విలపించుచు వేఁదుఱు, గొని యూరక మొఱ్ఱవెట్టుకొనుచు వనం బె
ల్లను దిరిగి తిరిగి యొకచో, శునకము పడి చచ్చెఁ బుత్రశోకాతురతన్. 361

క. ఆదోషము గొని మునుఁగుటఁ, గాదే సితదత్తుఁ డట్లు కాయము దొఱఁగెన్
మేదిని నన్యాయరతుల, నాదైవం బేల చక్క నరుగఁగ నిచ్చున్'. 362

చ. అనవుడు విప్రుఁ డి ట్లనియె' నాతఁడు చచ్చినవార్త యేక్రియన్
వినియెను వంజరుండు విని వీటికి వచ్చెనొ రాక కాశికిం
జనియెనొ వానివర్తనముచందము నా కెఱిఁగింపు' మన్న ని
ట్లనుఁ దటినీలలామ యగునాదివిజాపగ శీతభావలన్. 363

క. 'సితదత్తుఁ డవ్విధంబున, మృతుఁ డగుటయు మంత్రివరులు భృత్యులును బురో
హితసామంతాదులు సమ్మతి నాలోచించి యైకమత్యం బెసఁగన్. 364

క. ఈవార్త చెప్పి వంజరు, నేవిధమున నైనఁ ద్రిప్పియిటతోడ్తేరం
గావలయు ననుచు ధరణీ, దేవతలం బనుప వా రతిత్వరితగతిన్. 365

ఉ. ఆతనిపాలి కేఁగి 'సుగుణాకర! నీజనకుండు నిర్జర
వ్రాతములోని కేఁగె మనరాజ్యము కెవ్వరు దిక్కు లేరు నీ
వీతఱిఁ దీర్థసేవ కిటు లేఁగుట నీతిపథంబె వైరిధా
త్రీతలనాథు లింకిట మదింపరె శీఘ్ర యొనర్ప కుండినన్. 366

ఉ. క్రమ్మఱ రమ్ము' నావుడుఁ బ్రకంపితుఁడై నృపసూతి శోకబా
ష్పమ్ములు గ్రమ్మ ని ట్లను 'నృపాలుఁడు నెమ్మదినుండి యుండి ప్రా

ణమ్ముల నుజ్జగించె ననినం గడు నద్భుత మయ్యె నేమి మా
గ్గమ్మున నింత పుట్టె వినఁగా వలయున్ వివరించి చెప్పఁడా? 367

క. అని పంజరుఁ డడిగిన ని, ట్లని 'రారాజు నిను వలువ దని చెప్పంగా
వినక యిటు లరుగుదెంచిన, నినుఁ దలఁచి తలంచి మేదినీవిభుఁ డీల్గెన్.' 368

క. అనిన విని 'యకట! నాకై, తనప్రాణము విడిచెఁ దండ్రి తత్పురి కే నే
గని వత్తు గంగ కరిగెద, నని వెల్వడి వచ్చి మగుడ నర్హం బగునే 369

సీ. మీ రేగుఁ డగ్నిసంస్కార మారాజోత్తమునకు సమంత్రకముగ నొనర్పఁ
డయ్యస్థినిచయంబు చయ్యనఁ బుత్తెందు గంగాజలంబులఁ గలిపి యతనిఁ
జిరతరమోక్షలక్ష్మీసమన్వితునిఁగా నొనరింతు నటు సేయకుంటినేని
నతనిపుణ్యోదరమందు జన్మించినయాబుణం బారక యేల తీఱు'

ఆ. ననిన వార లిట్టు లనిరి 'తండ్రిది చావు, వినియు వెనుక చేసి చనఁగ నగునె
యింత దొడ్డవాఁడ వేల వివేకహీనతకుఁ జొచ్చి' తనిన నతఁడు గినిసి 370

క. 'ఎక్కడిపితృమరణము మఱి, యెక్కడిరాజ్యంబు గంగ కేఁగెదుఁ గో మీ
రిక్కడ విఘ్నము చేసెద, రెక్కడిబ్రాహ్మణులు మరలుఁ డే రా నొల్లన్.' 371

వ. అని విడియ నాడిన నతనియాగ్రహంబునకు నిగ్రహపడక సామోపాయంబునఁ
గార్యంబు గొన వలయు నని యవ్విప్రు లి ట్లనిరి. 372

చ. 'అనఘ! కుమారచంద్ర! తగునయ్య! మదిం గలుషింప భూమి నెం
దును మనఁ జెప్పువాఁడ వగతుం డనుమాట ధ్రువంబు చేసెదే
విను మొకమాట చెప్పెదము వీనుల నించి ఘటించి చూడు మె
వ్వనికిఁ బురోహితోక్తి యనివార్యము కార్యము నిర్వహించుచోన్. 373

క. దేవర లేనిగుడియ్యు నర,దేవుఁడు లేనట్టివసుమతియు నశ్లాఘ్యం
బై వేగమె చెడిపోవుం, గావున నీ వుండియుండు దగవె యిటు సేయన్. 374

సీ మాతృవిహీనులమాడ్కి నేపఱి యున్న పౌరులమదిలోనిభయము వాయఁ
దెఱవాకిటికిఁ దొంచి తిరుగుశ్వానంబులగతి నున్నవైరులగర్వ మడఁగఁ
బ్రియురాక గోరెడుబింబోష్ఠిక్రియ నున్నరాజ్యలక్ష్మికి ననురాగ మెసఁగ
జవ మేది యున్న నాజ్ఞాచక్రమునకుఁ గ్రమ్మఱఁ బ్రవర్తనశక్తి నెఱపఁగలుగు

ఆ. నీ వుపగత మైననృపతిసింహాసనంబున వసించి మమ్ముఁ బ్రోవు మయ్య
యఖిలతీర్థఫలము నఱచేతిలోనిదె, వచ్చు సంశయింప వలదు నీవు. 375

క. సంకల్పభంగ మగు నని, శంకింపకు మానవులవశమె దైవికమై
యంకిలి పడియెడుపనులకు, సంకటపడు టదియు నొకవిచారమె చెపుమా! 376

సీ. ఏను ధర్మస్థితి యెఱుఁగనివారమే మా మాట నీకు నమ్మంగఁ దగదె
మీతండ్రి మమ్ము నేరీతి మన్నించు నీవును నట్లకాఁ గను గొనంగఁ దగదె
ప్రాయశ్చిత్తంబుగాఁ జేయుం బని దోష మడచింప నేల యీవలవనిఁ జోలి నీకు
సంతతి వలసిన సంతతి వడసి రాష్ట్రమునకుఁ బుత్త్రుఁ బట్టంబు గట్టి
తే. పిదపఁ బోయిన నడ్డపెట్టెదమె రాజపుత్త్ర!' నావుడు వీరు చెప్పుట హితంబు
గానఁ బోవుట గాదని కడఁకతోడఁ, గాశి కేఁదు రుండి కృతనమస్కారుఁ డగుచు.

క. 'క్రమ్మఱఁ బనివినియెదఁ జు, మ్మమ్మ! భవత్సేవ' కనుచు నచ్చపుభక్తిన్
మమ్మఁ దలంచుచు నాత్మపురమ్మునకుం జనియె వంజరప్రభుఁ డెలమిన్. 378

వ. ఇట్లు చని సితపత్త్రమహీభర్తకుఁ బితృకృత్యంబులు యథోచితంబుగా నొనర్చి యొక్క శుభదినంబునఁ బుణ్యనదీజలాభిషేచనపురస్సరంబుగాఁ బట్టంబు గట్టుకొని యప్రతిహతప్రతాపంబు దీపింప ననేకవర్షంబులు భూమి యేలుచు ధామిని యను కామినియందు నుగ్రలోచనుం డనునుదగ్రపరాక్రముం డగుకొడుకుం గని వాని మీఁద సకలసామ్రాజ్యభారంబును బెట్టి నన్ను దర్శించి తపోవనంబునకుం జని.

ఉ. వేసవికాల మాతపమువేఁడిమిఁ గాలినకాలమీఁదఁ బ
ద్మాసనలీలఁ గైకొనుచు నంబుదవేళ నుదానసాబ్జుఁడై
వేసట లేక ఘోరతరవృష్టికిఁ దోఁగుచు శీతకాల మా
యాసము నోర్చి వెన్మడుఁగులందు వసించుచుఁ బెక్కువర్షముల్. 380

ఉ. ఉగ్రతపంబు సేయఁ బురుహూతుఁడు తద్దయు భీతుఁడై మనో
నిగ్రహ మాపటిల్లఁ దననిర్జరరాజ్యము వోవు నీనరేం
ద్రాగ్రణిచేత నింక నని యచ్చరలేమలఁ బిల్చి మీరు ప్ర
త్యగ్రతనూవిలాసములు దక్కక చూపుఁడు వానిముందటన్. 381

క. ఆసందున మరుఁ డిక్షుశ, రాసన మందుకొని యలరుటమ్ములు పైపై
నేసి యతనితప మంతయుఁ, గాసిగ నొనరించుఁ బొందు గ్రక్కున ననుడున్. 382

వ. నిజకటాక్షజితజగత్త్రితయలయ్యును నయ్యతివ లతనితపఃప్రభావంబు తమకు నసాధ్యం బగుట యెఱింగి గర్వంబు దక్కి యిట్లనిరి. 333

ఉ 'దేవవరేణ్య! మావలనఁ దీరెడుకార్యము గాదు వంజర
క్ష్మావిభుఁ డుగ్రశాసనుఁడు గాని తలంపఁగ భూతలంబునం
గేవలరాజు గాఁ డచటికిం బనుపంపఁ దలంచితేని సం
భావన చేసి నారదునిఁ బంపు సమస్తము చక్కనయ్యెడున్'. 384

చ. అని యిటు లప్సరోవనిత లాడటఁ జెప్పిన సమ్మతించి య
మ్మునిపతిఁ గాంచి వజ్రి నృపముఖ్యుఁ డొనర్చుతపంబురీతియుం

దనమదిలోనిభీతియును దప్పక చెప్పి 'భవన్గురుండు నా
కనిమిషరాజ్య మిచ్చె నది యన్యుల కేర్పడకుండఁ జేయుమా.' 385

కం. అనిన నతఁ డతని కి ట్లను, 'విను మిది యెంతటిపని యని వెఱచెదవు విధిన్
బనుపుము నాతో నిప్పుడ, చని యాతని జేలుపఱతుఁ జయ్యన' ననుచున్. 386

కం. విధిఁ దోఁకొని చని నారదుఁ, డధికతపోవృత్తి నున్నయవనిపుహృదయాం
బుధిలోఁ దారసి వాసవుఁ, డధీరమతి గాక తనకు నాపద గలదే. 387

ఆ. తపము సేయ రాదె ధరణి నెవ్వరికిని, మూగవానికెదుట ముక్కు బఱట
రాని చంద మయ్యె రాజ్య మెవ్వని కెంత, యధిక మంతభీతి యడరుఁజుమ్ము. 388

ఆ. ఇతఁడు శివునిఁగూర్చి యేకాగ్రచిత్తుఁడై, యుగ్రతపము సేయుచున్నవాఁడు
హరుఁడు మెచ్చి తనకు వర మిత్తు ననిన దే,వేంద్రపదవి యాతఁ డేల యడుగు.

కం. అమరత్వము నింద్రత్వము, కమలభవత్వమును సరకుగాఁ గొన రత్యు
త్తమశివలోకానందప్రదము గోరెదుపరమశైవధర్మవిధిజ్ఞుల్ 390

ఉ. ఐనను నింద్రుతోడ మనుజాధిపుబుద్ధి గలంతు నంచు నా
తో నిట తెచ్చితి న్విధి నదోషపథంబున నొక్కకార్యముం
బూని యొనర్తు నంచుఁ దలపోసి జగద్ధితముగ్ స్వకార్యమున్
గా నొకత్రోవ చిత్తమునఁ గన్గొని యవ్విధితోడ ని ట్లనున్. 391

ఆ. 'ఏను వీనిచిత్త మెఱిఁగితి నింద్రపదంబు గోరి కా దితండు తపము
సేత శివునిగూర్చి చేయుచు నున్నాఁడు, వీనిఁ జెఱుపఁ బాడి యౌనె నీకు? 392

వ. అయినను నీతపంబు దేవేంద్రునిచిత్తంబునకు రాదు మనము పనివడి వచ్చియు నితని నిచ్చోటం గదల్పక పోవుట యెత్తు చాల దన్నింటికిం దగ నొక్కయుపాయంబు చెప్పెద నీ చేరువం బుణ్యనదులు లేవు గావున నీవంజరుం బనిచి యీశ్వరజటావిభూషణం బగుదివ్యతటిని నిటకుం దెచ్చెద దానం జేసి యతనికిం గీర్తిసుకృతంబులు గలుగు మనకార్యంబును సిద్ధించు నీవు సితదత్తనృపతి యాకృతి గైకొని యీ యంతరిక్షంబున నదృశ్యరూపంబున నుండు నే నితనిసమ్ముఖంబునకుం బోయి యిట్టివిధంబున సంభాషించి దానికి సాక్షిగా నిన్ను నాహ్వానంబు చేసెద నీ వప్పుడు వంజరునకు దృష్టిగోచరుండవై మేదినికిం డిగ్గి యిట్టిట్టివిధంబునం బల్కు'మని కఱపిన నియ్యకొని యాతం డట్ల యుండె నంత. 393

ఉ. ఉన్నతశారదాభ్రరుచి నొప్పెడు మేను తటిద్వ్రజాకృతిం
జెన్నెసలారుకెంజడలు చే నొకవీణెయు మర్త్యకోటికిం
గన్నులపండువై మెఱయఁగా దివినుండి తపఃప్రభావసం
పన్నుఁడు వచ్చె నారదుఁ డభంగుఁడు వంజరుఁ డున్నచోటికిన్. 394

ఉ. వచ్చిన నర్ఘ్యపాద్యములు వారిరి నిచ్చి నమస్కరించి 'మీ
వచ్చుటఁజేసి నేఁడు మునివల్లభ! పుణ్యుఁడ నైతి నేను మీ
వచ్చినకార్య మెయ్యది ధ్రువంబుగ నా కెఱుఁగంగ వచ్చునే
నచ్చన నానతిం' డనిన నాఋషి రాజతపస్వి కిట్లనున్. 395

చ. 'విను మొకనాఁడు దండధరువీటికి వేడ్కయ పోలె నేఁగి యా
తనిసదనంబునందు వచిత్రస్థితిఁ గొన్నిదినంబు లుండుచో
నను గని యేమి చెప్ప నయనంబుల బాష్పకణంబు లొల్కఁగాఁ
దనపడుపాటు లన్నియును దప్పక చెప్పె నొకండు దీనతన్. 396

క. నీ వెవ్వఁడ వని యడిగిన, నే వంజరుఁ గన్నతండ్రి నిల సితదత్త
త్మాంభుఃదనువాఁడ మదీయావస్థ యెఱుఁగఁ జెప్పు మయ్యా యతనికిన్.' 397

ఉ. ఇన్నిదినంబు లే నిచట నెవ్వరుఁ గాననిచోటఁ జిక్కి యో
యన్న దురంతఘోరనరకాదుల వేఁ గడు వేఁగుచున్నచో
నిన్ను మదీయభాగ్యమున నేఁడు గనుంగొన వచ్చె నాకు నీ
మన్ననఁజేసి నావెగులు మానక పో దని చాఁగి మ్రొక్కినన్. 398

ఉ. ఏ నిటు లంటి నీతనయుఁ డీస్థితి చెప్పిన నమ్ము నమ్మఁ డ
జ్ఞానులు భూమివాసులు నిజంబుగ గానరు గాన భానుమ
త్సూనునితోడఁ జెప్పి నినుఁ దోఁకొనిపోయెద నీవు వచ్చి నీ
సూనునితోడఁ జెప్పు మనుచుం గొని వచ్చితిఁ జూడు మాతనిన్. 399

క. అని మీఁదు చూచి 'సితదత్తనరేశ్వర!ర' మ్మనిన నతనియాకృతి దా
ల్చినవిధి చయ్యన వచ్చినఁ, గని ఘనశోకాగ్నిచే ముఖము డిల్లపడన్. 400

క. సాష్టాంగ మెఱఁగి వంజరుఁ, 'దష్టదిశావలయవలయితావనిఁ గనుసం
తుష్టిగ నేలినరాజవు, కష్టదశకుఁ బ్రాప్తమైతె కడపటఁ దండ్రీ!' 401

చ. అనుచు సబాష్పుఁడై నిలువ నాతనిఁ గౌఁగిటఁ జేర్చి 'పుత్ర! నీ
తనువిభవంబు గానక కదా మృతి వాటిలె నాఁడు నేఁడు నిన్
గనుఁగొనఁ గల్గె నాకు ఘనకారుణికోత్తముఁ డైనయిమ్మహా
మునికృప' నంచు మస్తకము మూర్కొని యి ట్లను దీనభాషలన్. 402

క. 'మును రాజ్యాంతము నరక, మ్మనుట యథార్థమ్ము కాని యనృతము గాదో
తనయ! విను మేను సర్వము, గనుఁగొంటిఁ గృతాంతభటనికాయము చేతన్. 403

క. జగమున నింతటిపుత్త్రుఁడు, తగఁ గల్గియు నాయవస్థ దఱఁగక యున్నన్
నగరే ప్రాజ్ఞు లపుత్త్ర, స్యగతిర్నాస్తి యనుచదువు చదివినఁ బుత్త్రా! 404

క. నాభాగ్య మెట్టిదో నిను, నీభంగిని దూఱవలసె నిప్పుడు నాకున్
శోధన మొనర్పఁ దలఁచిన, నోభవ్యచరిత్ర! చేయు మొకకార్యంబున్. 405

ఉ. ఈయెడ నాశరీర మిడి యేఁగెద శంకరుమౌళి నున్నయే
టీయెడ కేఁగుదెంచువెర వీ వొనరింపుము తజ్జలంబు మ
త్కాయము సోఁకఁ బుణ్యగతిఁ గాంచెద నిప్పనిసేఁత నాక కా
దీయెడ నున్నసన్మునుల కెల్లఁ బ్రియంబు సుమీ తనూభవా! 406

క. కావున నిప్పని మఱవక, కావింపుము బ్రతుకు పెద్ద కాలం బనుచున్
దీవించి కృత్రిమాంగముఁ, దావైచి యదృశ్యుఁ డగుచుఁ దద్వీథి చనియెన్. 407

ఉ. అంతట నమ్మునీంద్రుఁడును నానృపు వీడ్కొని యింద్రుపాలి క
త్యంతరయంబునం జని ముఖాబ్జమునం జిఱునవ్వు దోఁప 'వృ
త్రాంతక! యంతయుం బదిల మయ్యెఁ జుమీ మనకార్య మింక ని
శ్చింతత నుండు మీ' వనుచుఁ జెప్పె సమస్తము విస్తృతంబుగన్. 408

మహాస్రగ్ధర. విని దేవేంద్రుండు భాస్వద్విమలతరవిభావిస్ఫురన్నీరజోద్య
ద్ఘనరీతిం గన్ను లెల్లన్ వఱలఁ దనమనోవ్యాధికిన్ వీడుకోలి
చ్చి నిజాస్యాంభోరుహం బూర్జితతనువిలసచ్ఛ్రీకి నాధారమై యొ
ప్ప 'సమర్త్యేంద్రత్వ మిచ్చోఁ బనుపడుట భవద్బంధుసంపత్తిఁ గాదే. 409

క. కా కున్న నింతకార్యము, నా కెవ్వరు తీర్పఁ గలరు నారద! పుణ్య
శ్లోకుఁడవు నీవు నీకృప, నేకొఱఁతయు లేక జగము నేలుదు నింకన్.' 410

క. అని తను భాషించిన నయ్యనిమిషపతి వీడుకొని మహాముని ప్రీతిం
జనియె' నని గంగ చెప్పిన, విని విప్రుఁడు నెమ్మనమున విస్మితుఁ డయ్యెన్. 411

మ. అని సిద్ధుం డలభోజరాజునకు నిట్లైతిహ్యముం జెప్పె నం
చనసూయాతనయుండు చెప్పిన మహాం డానందముం బొంది మో
డ్చినకే లౌఁదలఁ జేర్చి నమ్రుఁ డయి "తండ్రీ! యేఁ గృతార్థుండ నై
తి నెఱింగింపఁ గదే తదుత్తరకథల్ తెల్లంబుగా" నావుడున్. 412

చ. త్రిభువనవంద్య! దానవసతీగళమంగళసూత్రభంగ! ది
గ్విభుసముదాయసేవిత! రవిద్విజరాజసునేత్ర! సర్వలో

క భరిత! యోగిహృద్విమలకంజమధువ్రత! సూర్యకోటి స
న్నిభ! యిభరాజరక్షణ! ఫణిద్విషదద్రినివాసభాసురా! 413

క. కరుణారసభరితాంతః, కరణా! సుకవీంద్రరచితకవితాచరణా!
శరణాగతజనభయహరి, వారణా!దివిజగణనుతతార్చితచరణా! 414

ఇంద్రవజ్రము. శ్రీరాజతల్పీకృతసింధురాజా!, స్వారాజనీలామలచారుదేహా!
గోరాజరాజానలగోవిలాసా!, శ్రీరాజపత్నీహిమసింహకీర్తీ! 415

గద్యము. ఇది వాణీవరప్రసాదలబ్ధవాగ్వైభవ తిక్కనామాత్యసంభవ సుకవిజనవిధేయ అనంతయనామధేయప్రణీతం బైనభోజరాజీయం బను కావ్యంబునందు గోవ్యాఘ్ర సంవాదకథావిశేషంబు విని బ్రహ్మరాక్షసుండు వసువ రత్నమండనుండు నిజపురంబునకుఁ బోయివచ్చుటయుఁ దదీయోపాయంబున నపాయంబు దరలుటయును నన్నదానఫలాకర్ణనార్థంబు బ్రాహ్మణుండు కాశీయాత్ర చేయుటయుఁ బలిప్రతామాహాత్మ్యంబును జర్మకారసంభాషణంబును భవానీసమాశ్రయంబును తదనుమతంబున విప్రపునరభిగమనంబును గిరాతదర్శనంబును శిశూపదేశంబును గంగావిప్రసంవాదంబును వంజరుజన్మత్రయప్రశ్నయుఁ దత్తపోవిఘ్నార్థంబు నారదుండు విధి నచ్చోటువాపి చని యింద్రు వీడ్కొని యథేచ్ఛం జనుటయును నన్నది షష్ఠాశ్వాసము.

శ్రీ

భోజరాజీయము

సప్తమాశ్వాసము

శ్రీ శ్రితవిపులోరస్స్థల!
యాశ్రితజనపారిజాత! యానందసుధా
మిశ్రితమానస! నిగమప
రిశ్రితఫలపాకరూప! శ్రీనరసింహా! 1

ఉ. ప్రీతి యెలర్పఁగా నవధరింపు భవద్విమలాంశజుండు వి
ఖ్యాతతపోమహాత్ముఁ డగు నత్రితనూభవుఁ డానతిచ్చు నా
భూతలనాథుతో నిటులు భోజవిభుం డడుగంగ సిద్ధుఁ డ
త్యాతతయుక్తిఁ జెప్పెను సముచితపుణ్యకథాప్రసంగముల్. 2

చ. వనరుహగర్భసంభవుఁడు వంజరుఁ దా నటు వేలు పుచ్చి యిం
ద్రునికడ కేఁగి యవ్విధము రూఢిగఁ జెప్పి యథేచ్ఛ మేఁగె నం
చనిమిషసింధురత్న మటు లాదటఁ జెప్పినఁ జోద్య మంది నె
మ్మనమున విప్రుఁ డప్డు వినుమా యటమీఁదటిగోష్ఠి చెప్పెదన్. 3

క. ఆవిప్రుఁడు కేలు మొగిచి, 'దేవీ! మఱి వంజరక్షితిపుఁ డేక్రియ గౌ
రీవల్లభుఁ బ్రార్థించి న,భోవాహిని నెట్లు తెచ్చె భూమికి?' ననినన్. 4

క. 'కంజభవాన్వయదీపక!, వంజరుచరితంబు భువనవర్ణ్యము విను నీ
కుం జెప్పెద' నని యాభవ, భంజని యిట్లనుచుఁ జెప్పె బ్రాహ్మణుతోడన్. 5

చ. 'గురునకు ముక్తిత్రోవ సమకూర్చెదఁ బొమ్మని పోయి క్రౌంచభి
ద్గురునకు మామయై పరగుకొండకు దక్షిణభాగమందు భా
సుర మగుపుణ్యదేశములు చొచ్చి తపం బొనరింపఁ జొచ్చె న
చ్చెరువడి యెల్లవారలును జేరి కనుంగొనుచుండునట్లుగన్. 6

సీ. నాతోడిసవతియై మాతండ్రిజడలలో నుప్పొంగుచదలేటియుబ్బు దఱఁగఁ
దొలిఁదొలి గౌతముం డలఘుతపశ్శక్తిఁ గొనిపోయె నుర్వికిఁ గొంతనీరు

మఱి భగీరథుఁ డనుమానవాధీశుండు గొనిచన్న నీటికి గొలఁది లేదు
ఇంకఁ జిక్కిననీటి నీవంజరత్షితీంద్రుఁడు గొనిపోయినఁ దొడుసు మాలి
ఆ. యుండ వచ్చు నీతఁ డొనరించుతపమున, కడ్డపడకు మని గణాధిపతికి
గౌరి బుద్ధి చెప్పెఁ గాక కాకున్న విఘ్నంబు కాదె యతనికార్య మనఁగ. 7

క. తొల్లిటితపసులకంటెను, బల్లిదుఁ డీతండె పో తపశ్శక్తి ననం
బెల్లగుదృఢనిష్ఠ సలుప, నుల్లంబున మెచ్చి శంభుఁ డొదవెడుకృపతోన్. 8

చ. ఉరగవిభూషణంబులును సుగ్రగజాసురచర్మవస్త్రముం
గరమున నొప్పుశూలమును గంఠముకప్పును ఫాలభాగముం
దరుదగుమోడ్పు ఱెప్పయును నౌదలగంగయు జూటకోటిపైఁ
బరగుశశాంకరేఖయును బ్రాలిగ నాతని మ్రోల నిల్చినన్. 9

చ. కనుఁగొని మేన నెల్లఁ బులకంబులు జాఁదుకొనంగఁ గన్నులన్
నిబుపులు గాఁగ బాష్పములు నివ్వటిలంగ బహుప్రమాణముల్
గొనకొని చేసి భక్తిరసగుంభన మొప్పఁ బ్రహృష్టగద్గద
స్వనమున వంజరుం డపుడు సంస్తుతి సేయఁ దొణంగె శంభునిన్. 10

లయవిభాతి. 'ఒడల నొకలేమయును జడలఁ బేను వెల్లియును
నడుగక వసింపఁ బెఱిపొడవులకు నెల్లం
బొడవనఁగ నొప్పు మెయిపొడవునకు భూతి దగు
తొడవుగ నొనర్చి బెడఁ గడరునిను భక్తిన్
విడువక తలంచునతఁ డెడపనివిముక్తిపురి
కొడయఁ డగు నంచు నదె తడఁబడక నేఁడున్
దొడఁగి శ్రుతి మ్రోయు నది పెడచెవులఁ బెట్టి చను
గడుసరికి నేని గతి కలదొకొ నుమేశా!

లయగ్రాహి.

వాచవులు లోసగుమఱేచవులు నేనటుల ద్రోచి కడుహృద్యమగులోచవికిబుద్ధిన్
వేచొనిపియూచవికి నేచవియుఁ బెట్టనిచూచికయికొన్నచవిఁ బ్రోచుభవదీయా
నీచకరుణామృతనిషేచనసుఖంబునకు వాచకముగాఁ బ్రథమసూచన యొనర్పం
జూచుగురుభాషణము నీచెవుల నింపరఁట గోచరమె నీమనసు నాచికొన రుద్రా!

లయహారి. జపములకుఁ జొరక మఱి తపములకుఁ జనక మదిఁ
గపటములు విడిచి నినుఁ గృపణులయి వేఁడన్

విపులతర మగుపరమకృప చిగురు నిగుడఁ బెం
పెసఁగఁ గ్రొవ్వి పాదుకొను కృపణముల
పొంకమలర దొడి పఱవ కపుడు నిజరూపం
బుపమలకు మిగిలి యతినిపుణగతిఁ బొరలు మృదు
లసితముల కెసఁగ నధికపుమహిమ చూపఁగ
సుపథ మగుసుగతి గని యపగతదురితు లగుదు
రపరిమితవిధములను త్రిపురదనుజారీ!' 13

క. అని బహుభంగులఁ బొగడెడి, జనపతికిఁ బ్రసన్నుఁడై భుజంగాభరణుం
డనుపమకరుణామృతమున, దనసినకనుదోయి మెఱయ ని ట్లని పల్కెన్. 14

ఉ. 'మెచ్చితి నీతపంబునకు మేలుగ నొక్కవరంబు వేఁడు మే
నిచ్చెద' నన్న నాతఁడు గిరీశున కి ట్లనుఁ గేలు మోడ్చి 'మీ
మెచ్చున కెంతవాఁడ నను మీపదభక్తులలోనఁ గూర్చి యీ
యచ్చున నానతిచ్చుభవదాదరణం బిది గోటి సేయదే. 15

చ. పితృహితబుద్ధిఁ జేసి భవభీకర మీశరమందు శాశ్వత
స్థితిఁ జెలువొందునుత్తమనది న్మహికిం గొనిపోవఁ గోరి వ
చ్చితి మిము నాశ్రయింపఁ గృప సేయుఁడు' నావుడు 'నట్ల కాక యి
చ్చితి' ననియెన్ శివుం డపుడు చెచ్చెర నే నిటు లంటి వానితోన్. 16

ఉ. 'ఓమనుజేంద్ర! నీవెనుక నుద్దవడిం బఱతెంచుదాన నీ
వామహనీయవేగమున కంకిలి సేయక తూఁగ నోపినం
గామితసిద్ధి పొందు దటు గాని తెఱం గది గల్గెనేని నే
భూమికిఁ జైన నేఁ దొలఁగి పోదుఁ జుమీ యిదె చాటి చెప్పెదన్.' 17

చ. అనవుడుఁ గేలు మోడ్చి వినయంబు నయంబును దోఁప నాతఁ డి
ట్లను 'నిటు పల్కఁ జేల జగదంబ! భవ ద్ఘనవేగ మెక్క? డేఁ
జనువిధ మెక్క? డి ట్లయినఁ జాలఁ జుమమ్మ! మదీయవాక్యముల్
విను మిపు డేను ని న్నొకటి వేఁడెద నెగ్గుగఁ బట్టకుండినన్. 18

వ. అది యెయ్యది యంటేని జవసత్త్వసంపన్నం బగు నొక్క వాహనంబు సమకూర్చు
కొని తదారూఢుండనై నిన్నుఁ గొలిచి వచ్చెద నీయొక్కచనువు నాకు నొసంగ
వలయు నట్లు సేయక యితరోపాయంబున మోస పుచ్చెద ననినఁ దల్లీ ! యేన కా
దీమూఁడులోకంబులయందు నిన్ను గెలువ నెవ్వండు గలండు. 19

ఉ. విష్ణుపదంబునం బొడమి విశ్వమునుం గబళింపఁ బూనున
క్కృష్ణునిమాయవోలెఁ బెనుపెల్లువయై చను దెంచునీదువ

ర్థిష్ణుత చూచి భ్రాంతు లయి దేవత లందఱుఁ దల్లడిల్లరే
విష్ణుపదీ! భవత్ప్రియుఁడు వీతభయుండు శివుండు తక్కఁగన్. 20

ఉ. కావున నీమహామహిమ గానఁగ నెవ్వరు నేర్తు రమ్మ నీ
జీవన మీజగత్త్రితయజీవచయంబులకుం దలంపఁగా
జీవన మిట్టినీవు ననుఁ జేకొని కాచుట పోల దమ్మ! నీ
సేవకకోటి కెన్నఁడును జెందఁగ లేవు కదమ్మ దుర్దశల్'. 21

వ. అని ప్రార్థించినం బ్రీతచేతస్క నగు నాచేత ననుజ్ఞాతుం డగుచు నమ్మహీనా
థుండు. 22

ఉ. అక్కడఁ బెక్కువత్సరము లవ్విభుఁ డర్థిఁ దపం బొనర్పఁగా
మెక్కినరిష్టిఁ జూచి మురవిద్విషుఁ డాతనికిం బ్రసన్నుఁడై
పొక్కిటితమ్మితోడ సిరిఁ బొందినవక్షముతోడ నాదరం
బెక్కినచూడ్కితోడ వర మీఁ బచరించినకేలుదమ్మితోన్. 23

వ. ఆదేవదేవుండు తనదివ్యరూపంబు చూపిన నతండు సర్వాంగాలింగితమహీతలం బగు
దండప్రణామంబు చేసి లేచి నిలిచి మోడ్పుఁగేలు ఫాలంబున మోపి యిట్లని
స్తుతియించె. 24

దండకము. 'శ్రీకామినీచారువృత్తస్తనాలింగితోరస్స్థలున్ శంఖచక్రప్రభాశోభిహస్త
ద్వయుం బీతవస్త్రావృతోద్యన్నితంబోజ్జ్వలున్ సంతతోజ్జృంభణాంభోజనాభ్యంత
రాళుం ద్రిలోకైకసంరక్షణాత్యంతదక్షున్ సరోజాక్షు నక్షీణసంపన్ను నిన్నుం
బ్రశంసించునన్నాలుకల్ నాలుకల్ నీచరిత్రంబు లాలించునాకర్ణముల్ కర్ణ
ముల్ నీశుభాకారముల్ చూచునానేత్రముల్ నేత్రముల్ నీమహాతత్త్వచింతాం
బుధిం దేలునచ్చిత్తముల్ చిత్తముల్ నీపదాంభోజసంసేవ రంజిల్లునాహస్తముల్
హస్తముల్ కాకఁ గున్న నందొందుమే లేమియున్ లేమి తెల్లంబు గాదే భవ
ద్భక్తిహీనాత్మకుల్ సేయునాచారముల్ ఘోరనీరాకరానేకవర్షంబులై యూషర
క్షేత్రనిక్షిప్తబీజంబులై భస్మమధ్యంబునం బెట్టుహవ్యంబులై యుగ్రకాంతార
వాటిం బ్రకాశించునక్కౌముదీసార్థమై పోవు సంచున్ బురాణార్థవేదుల్ యథా
వాదులై మాటికి న్మాటికి న్మాటి చెప్పంగ నవ్వాక్యము ల్వీనులం జేర్పఁ దా నొల్లక
జ్ఞానసాంద్రాంధకారంబులోఁ డింది నిస్సారసంసారకూపంబునం గూలి యాశాజ
లాంతర్నిమగ్నత్వముం బొంది నానాఘదుష్టాహిసందష్టులై నిర్గతప్రాణులై యాత
నాదేహులై కాలపాశంబు లత్యుత్కటక్లేశముం జేయఁ దల్కింకరాకృష్టకేశాగ్రు
లై దుర్గతిం ద్రెళ్లి ఫెళ్లింప దిక్కెవ్వరున్ లేక శోకానలజ్వాలలం ద్రేలుచుక్కా

ఫలం బెప్పఁగా నేల నీదాసదాసానుదాసత్వమున్ బూని దుష్కర్మముల్ వాసి సద్భక్తిచేఁ బూని చిత్తంబు వక్త్రంబు గాత్రంబు నాఁ గల్గునీమూఁడురూపంబులం బాపముల్ చెందఁగా నీక నీకందువల్ సద్గురూక్తిప్రశంసత్వనిష్ఠాగతిం గాంచి సేవించుపుణ్యుల్ త్రిలోకీశరణ్యుల్ వరేణ్యుల్ గదా వారిచారిత్రముల్ చెప్ప నప్పద్మజుం డోండె నాశేషుఁ డోండె సమర్థుండుగా కొండు మర్త్యుండుశక్తుండె నీదాసు లాదోషరాసుల్ సమస్తంబు విధ్వంసముల్ చేసి నిర్ధూతధూమాగ్నికీలం బులం బోలి వర్తిల్లు టొక్కండకా దాశ్రితశ్రేణినిం గర్మనిర్ముక్తులం జేసి భాసిల్లు చున్నారు తత్కారణంబై భవద్దాసమూలంబునం జేసి ధర్మార్థకామాపవర్గంబు లక్లేశమార్గంబునం బొందఁగా వచ్చుటల్ నాకుఁ దోఁచెన్ భవద్దివ్యపాదార విందంబు డెందంబునం గూర్చి యర్చింపఁగాఁ గల్గుసౌఖ్యంబు దా నెట్టిదో యేను మర్త్యుండ నజ్ఞానచిత్తుండ నిన్నుం బ్రశంసింప నుత్తుండఁగా నైన నీసత్కృపాదృ క్సుధాపూర మత్యంతమున్ దోరమై నాదెస న్వ్రాలుటం జేసి యే నిన్ను వర్ణించుచు న్నాఁడ నీవాఁడ నైనాఁడ నన్నింక నేవంకనుం బొచ్చెపోకుండ రక్షింపు రక్షింపు పక్షిధ్వజా! రక్షితాండప్రజా! యాదినారాయణా! భక్తసంరక్షణోపాయపారా యణా! సర్వలోకాధినాథా! రమాప్రాణనాథా! నమస్తే! నమస్తే! నమః' 25

వ. అని ప్రణుతించువంజరనృపాగ్రణిఁ జూచి సమస్తసత్కృపా
వననిధి యాజగన్నిధి నవస్మితవక్త్రసరోజ మొప్ప బో
రన నఖిలామరాభయకరం బగుతత్కర మెత్తి 'యిందు ర'
మ్మని తగఁ జేరఁ బిల్చి 'భవదాగమనార్థము చెప్పు' నావుడున్. 26

వ. ఆదేవోత్తమునకు నానరదేవోత్తముం డి ట్లనియె. 27

చ. 'సరసిజనాభ! యోనిగమసన్నుత! నీచరణారవిందసుం
దరమకరందబిందువు గదా వియదాపగ! తజ్జలంబు శం
కరుఁడు శిరోవిభూషణముగా ధరియించెఁ బ్రియంబుతో సుధా
కరశకలంబు క్రొన్నురువుపై వడి నొప్పఁగఁ దత్తటంబునన్. 28

ఆ. అది యసాధ్య మొరుల కాగౌతముండును, నాభగీరథుండు నధిక మైన
తప మొనర్చి కనిరి తద్విశేషంబ యర్థించి మద్గురుండు పంచె నన్ను. 29

ఆ. యాతనాశరీరుఁ డై నరకాగ్నుల, నొఱగి తన్నివృత్తికొఱకు నన్ను
నిట్లు పంచెఁ గాన నెడసేయ నోడి ముక్కంటిఁ దగిలి విడువఁ గంటి నేను. 30

వ. అప్పుడాగంగ యపాంగదీప్తు లోలయ నన్నవలోకించి మత్ప్రవాహవేగంబునకుఁ
దగ్గ నీవు మందటం బెరువు పెట్టకున్న నే నెటయేనియుఁ బోదుం జుమ్మన్నఁ దలంకి

తల్లీ! నేను బాదచారినై నీచిత్తంబు రా నడవ నోప నొక్క వాహనంబు నెక్కి
వచ్చునట్లుగా సెల వీవలయు నని ప్రార్థించిన నట్లు సమ్మతించెం గావున. 31

క. నీవారి గెలువ నీవల, నీవారిక కాక ధారుణీవలయములో
నేవారికి మఱి శక్యమె, యోవారిజనాభ! నాకు నొసఁగు ఖగేంద్రున్.' 32

వ. అనిన నిప్పని దీర్చి రమ్మని యాభక్తపరాధీనుండు నిజాధీనుం డగు వినతాసూను నియోగింప నాభూరమణుండు కృతాచమనుండై వచ్చి తదారూఢుం డగుటయు.

సీ. ఉంకించి యెగయుచో నుభయపార్శ్వంబులపర్వతంబులును గంపంబు నొందఁ
బక్షవిక్షేపణప్రౌఢిమ నెఱపుచోఁ గారాకులట్లు మేఘంబులు దూలఁ
గమనీయబహుచిత్రగతుల నేపారుచో సురవిమానంబులు సూరగిలఁగ
నిద్దంపుఁజూపులు నిగిడించుచో శంభుతొడవుపాములకుఁ దల్లడము గదుర

తే. గరుడగమనుండు వచ్చెన కాఁ దలంచి, నెమ్మి దళుకొత్తఁ బ్రమథగణమ్ముతోడఁ
గదలి బాలేందుశేఖరుం డెదురు నడవ, నిగిడె గరుడుండు కైలాసనగముపైకి. 34

క. ఆలోనన పంజరుఁ డిరు, గేలును దల మోపికొని యకృత్రిమబుద్ధిన్
ఖేలాగతి ని ట్లను నా, శైలసుతోపేతునకు వృషభకేతునకున్. 35

క. 'గురుహితముపాంటె నీ వగు, చరణాబ్జము లాశ్రయింపఁ జనుదెంచినచోఁ
బరమేశ! నీవు నా కొక, వర మిచ్చితి వొసఁగు మేను వడిఁ జనుచుండన్.' 36

చ. అనిన శివుండు మెచ్చి దరహాస మెలర్ప జటాకలాపబం
ధన మెడలించి 'మద్భటుఁ డితం డెటు దోఁకొని పోయె నందుఁ బో'
మ్మని తగ నానతిచ్చుడు మదంశము డిగ్గి దిగంతరాళఘూ
ర్ణనముగ మ్రోయుచుం గదలినన్ జయవెట్టి రశేషజీవులున్. 37

ఉ. భర్గజటాకలాప మనుప్రావృడుదారపయోధరంబు ని
ర్నిర్గతమై విశుద్ధస్ఫటికనీఘనవృష్టి సమగ్రసంభ్రమా
సక్త్రిశమై మహీయుగిరుఁ దాపిగఁ గల్పుపిశృప్రప్రసు
ర్వర్గముఁ బ్రోచు సింక నసి పంజరుఁ డెంతయు సంతసిల్లఁగన్. 38

ఆ. వ్యోమకేశుజడలనుండి యవ్వాహిని, తుప్పిగంతు కొనినఁ గ్రుంగె ధరణి
గిరులు వడఁకెఁ గలగె శరనిధుల్ ఫణిరాజు, శిరము వంచె దిశలకరులు బ్రెళ్ళె.

ఉ. అట్టియుదగ్రవేగమున నానది దూఱె రసాతలంబు నేఁ
బుట్టితిమి నీయధోగతులఁ బుణ్యులఁ జేయక యెట్లు పోదు న
న్నట్టును బోలెఁ బెల్లగసె నంతటిలోన మదీయు లర్హ్యా లీ
పట్టున నీకు సంచు సురభర్తకుఁ జెప్పఁ గడంగెనో యనన్. 40

క. తదవసరమ్మున నృపతియుఁ, బదపడి త్రోవ యిడ కున్నఁ బాథోరయసం
పద నిం కెట చనునో యీ, నది యని యద్దిక్కు తార్క్ష్యనకుఁ జూపుటయున్. 41

క. మిన్నుదలఁ బాఱె ఖగపతి, యన్నదియును బాఱఁ దొడఁగె నవని యద్రువ సే
మున్నో తా మున్నో యని, పన్నిదమునకు గెడగూడి పాఱినభంగిన్. 42

క. గరుడుం డెటు మెలఁగిన నప్పరమ నదియు నట్లు తాను బాఱు నుపాయాం
తరమునఁ బగ నీగుదు నని, యురవడి వెనుదగిలి పాఱునురగేంద్రుగతిన్. 43

సీ. ధరణి యంతయు మన్ను దఱఁగి వేసినమాడ్కిఁ బాథోరయంబునఁ బాయవడఁగ
నడలున నోదానఁ బడువన్యగజములకరణిని దరిగడ్డ లురలి పడఁగఁ
దఱిమెన సంధించి మెఱమినక్రియఁ దటద్రుమకోటు లున్మూలితములు గాఁగ
ఘనవజ్రహతిఁబోలెఁ దన కగ్గమైనశైలములు వేగంబె తుత్తుమురు గాఁగ
తే. వైనతేయుపక్షోత్కటధ్వనియుఁ దనక, డళ్ళపెనుమ్రోఁతయును దిక్తటంబుఁబర్వ
బాఱెఁ గృత్రిమనృపుకళేబరముదాఁక, నమ్మహానది సకలజనాద్భుతముగ. 44

క. ఆతఁడుఁ గృతకశవం బిట్లై తత్సంస్పర్శఁ జేసి యంబరగతిఁ బ్ర
ద్యోతనబింబము కెదురై, యాతని దీవించుకొనుచు నప్పుడ చనియెన్. 45

క. అది కపట మయ్యు భావన, కిది దా నిక్కువమె కాన యింద్రునిపురి నె
మ్మది నున్ననృపతిముఖ్యుఁడు, ముదితుఁ డగుచు బ్రహ్మలోకమునకుం జనియెన్. 46

వ. అయ్యవసరంబున. 47

ఉ. వంజరుఁ డొక్కయేఱు గొనివచ్చె మదాశ్రమభూమి కంచుఁ దా
యుం జతురత్వముల్ చెలఁగ రూఢిగ స్నానము లాడ నాపగా
సంజనకాంక్షులై రచటిసన్మును లందఱు భూజనంబు లో
జం జనుదెంచి యద్భుతరసంబులఁ దోఁగుచుఁ దోఁగి రానదిన్. 48

ఉ. వంజరుఁడుం గృతార్థుఁ డయి వాహసరాజము డిగ్గి భక్తితో
నంజలి చేసి నిల్చి 'జగదంబ ఫలించె మదీయవాంఛ సి
ద్ధాంజనదృష్టిఁ గైకొని మహానిధి గాంచినసాధకుండు వో
లెం జిరసౌఖ్యముల్ వడసె లెస్సగ మజ్జనకుండు నీకృపన్. 49

చ. పరహితసచ్చరిత్రు లయి పాపము లెల్లఁ దొఱంగి వేగ నీ
కరుణ నశేషభూజనులు గాంతురు ముక్తిపదంబు నింక నీ
వరుగుము స్వేచ్ఛ యైనయెడ' కంచుఁ బ్రణామ మొనర్చ నానరే
శ్వరతిలకంబు పేర నది వంజర సాఁ జని చొచ్చె గౌతమిన్. 50

క. ఆతని వీడ్కొని యవ్విన,తాతనయుఁడు నరిగె నాగదాధరుకడకుం
బ్రీతుఁ డయి చనియె వంజర, భూతలనాథుండు నొకతపోవనమునకున్. 51

క. ఇది వంజరము మహానది, యుదయము సకలేష్టదము మహోపద్రవశాం
తిద మిది యెవ్వరు వినిరేని, జదివిన నిష్టార్థసిద్ధి సమకూరు వెసన్. 52

వ. అనిచెప్పిన నవ్విప్రపుంగవుండు గంగ కిట్లనియె. 53

ఉ. 'ఈమహిలోనఁ బూర్వమున నింద్రునికిన్ సరిగాఁ దలంప ను
ద్దామఖగేంద్రుఁడై యధికదర్ప మెలర్ప నశేషనిర్జర
స్తోమసమాశ్రయంం డగుచతుర్భుజవాహన మైనయున్నతుం
డీమనుజేంద్రు మెచ్చుటకు హేతువు గల్గెనె పో మహానదీ!' 54

చ. అనిన ధరామరోత్తమున కానది యి ట్లను 'వేత్తులేక గ
ల్గనె మహిమీఁద నోషధులకుం జనక్రియ విస్మ సాధ్యసా
ధనములు లోనుగాఁ గలుగుద్వంద్వము లెల్లను హేతుపూర్వమై
చనుఁ బరమార్థ మిప్పలుకు శాస్త్రచయంబులు నిట్లు చెప్పెడిన్. 55

వ. కావున నీకుం దదీయహేతువు చెప్పెద నాకర్ణింపుము. 56

ఉ. గారవ మొప్ప నవ్విభుఁడు కర్కటిజన్మమునాఁడు నన్ను నిం
పార భజించు వేడుకఁ బ్రయాణము గైకొని రాఁ బథంబునం
గ్రూరవిహంగమం బొకటి కొంకక చంపుట వింటి గాదె త
ద్దారుణకల్మషం బొదవెఁ దార్క్ష్యునకుం బలిభృత్యపద్ధతిన్. 57

ఆ. అనఘచరిత్ర భృత్యుఁ డపరాధి యైనఁ ద, త్స్వామి దండ్యుఁ డనుట శాస్త్రమతము
కాదె యదియ సువ్వె కారణం బయ్యె వం,జరుని మోపఁ బక్షిసత్తమునకు.' 58

వ. అని చెప్పి మఱియు ని ట్లనియె. 59

క. 'విప్రవరా! నీ యడిగిన, యా ప్రశ్నల కుత్తరంబు లగుకథ లత్యం
తప్రకటము చేసితి హృద, యప్రీతిగ నింక నేమి యడిగెదు నన్నున్.' 60

చ. అనవుడు గంగఁ జూచి వినయంబునఁ జేతులు మోడ్చి విప్రుఁ 'డో
జనని! భవద్వచోమృత సుసంగత పుణ్యకథాప్రసంగముల్
వినియును నామనంబు దనివి న్వసియింపదు వంజరక్షితీ
శునియటమీఁదివర్తనముచొప్పును జెప్పఁగదమ్మ!' నావుడున్. 61

క. 'విను విప్రవర్య! వంజరుఁ, డనఘుఁడు నాకుఁ బ్రియభక్తుఁ డాభూపతివ
ర్తన మంతయు వివరించెద', నని యి ట్లని చెప్పె నమ్మహానది ప్రీతిన్. 62

చ. గురునకు నిత్యముక్తి యొడఁగూర్చితెఁ బొమ్మని యూఱడిల్లి యా
నరపతి నిశ్చయం బగుమనంబును బూని తపంబు సేయుచో
సురపతి క్రమ్మఱన్ దిగులు సొచ్చి యుపద్రవ మాచరింప నీ
వెర వొనరించెనో యనఁగ వేలుపులేమయ భోనిరామినిన్. 63

క. ఒక్క_తెఁ దోడ్కొ_ని యచటికి, నొక్క_మహీసురుఁడు నొక్క_యుర్వీశ్వరుఁడున్
జొక్క మగునొక్క_వైశ్యుఁడు, నొక్క_చతుర్థుండు వచ్చి యొుండొరుఁ గడవన్. 64

క. ఆమనుజాధీశునకుఁ బ్ర, ణామము లొనరింప నతఁడు నలుగురఁ గని 'మీ
రీమగువయుఁ దగ నిచటికి, నేమిటి కి ట్లరుగుదెంచు టేర్పడఁ జెపుఁడా.' 65

వ. అని యడిగిన నతనికి బ్రాహ్మణుం డిట్లనియె. 66

చ. 'అనయము వేశ్య యీతరుణి యాతఁడు క్షత్త్రియుఁ డేను విప్రుఁడన్
విను వణిజుండు వాఁ డితఁడు వెల్మయు నల్వురఁ దొల్లి దీనిది
క్కునఁ జరియించుచుండుదుము కొండొకకాలము చెల్ల నింతి మా
మనములఁ గల్గుప్రేమపరిమాణ మెఱుంగఁ దలంచి యి ట్లనున్. 67

ఉ. 'నీరును బాలుఁ బోలె మననెయ్యము తియ్యము నొంది నేఁడు సొం
పారెడు మీఁద నాకొకటి యైనఁ బదంపడి యే మొనర్తు రో
మీ' రని యొత్తి చూచుటయు మేలుగ విప్రుఁడు 'నీకు నగ్నిసం
స్కార మొనర్చి శల్యములు జాహ్నవికిం గొనిపోదు నే' ననెన్. 68

ఉ. 'చచ్చినతోన చత్తు ననె క్షత్త్రియజాతుఁడు' వైశ్యుఁ 'డర్థమున్
వెచ్చము సేయువాఁడ' ననె 'విప్రముఖంబున మించికాష్ఠముల్
దెచ్చి దహించువాఁడ' ననెఁ దెంపున నాలవజాతియాతఁ డీ
యచ్చునఁ బల్కు_నప్పలుకు లాదటఁ గైకొని యుండు నింతియున్. 69

ఆ. అంతఁగొంతకాల మరుగ నాయింతి కృతాంతుప్రోలి కరిగె నతఁడుఁ దోన
చచ్చె నితఁడు ధనము వెచ్చించె వాఁడు దహించె నేను శల్యసంచయంబు. 70

సీ. గంగకుఁ గొనిపోయి కలుపుచోఁ గంగ ప్రత్యక్షమై 'నీవు బ్రాహ్మణుఁడ వకట
శూద్రశల్యములు దెచ్చుట నీకుఁ బాడియే?' యనిన నేఁ బూర్వవృత్తాంత మెల్లఁ
జెప్పి 'నాయొడఁబాటు దప్పక యిట్లు దెచ్చితి నేమి సేతు నయ్యాలివరూప
మచ్చొత్తినట్లు నాయంతరంగంబునఁ బాయకున్నది మరుబాణములకు
ఆ. దప్పు ప్రైలి ననుచుఁ జెప్పఁగ నన్నఁ జిరపుడు గ్రుక్కి_నుడుఁ గృప దలిర్ప
నస్థిచయముమీఁద నాగంగ యొుకమందు; వైవ నిది పునర్భవంబు నొందె. 71

క. క్షీరాంబుధిఁ దరువఁగ మును, శ్రీరమణి జనింపఁ దోన శీతకరుండున్
బోరన పుట్టినక్రియ నీ, భూరమణుఁడు పుట్టెఁ బొలఁతిపుట్టుకతోడన్. 72

ఉ. అంత నదృశ్యమై చనియె నాదివిజాపగ యేను వేడ్క_ ని
య్యంతికరంబు పట్టఁ గర మెత్తఁగఁ దా నెడ నొచ్చి దీనితోఁ
బంతము దక్కి_ మున్ను ఘనపావకకీలల మేను వైచి యీ
యంతరమందు నీకుఁ గటిలాలక నొప్పన చేసి పోదు నే. 73

ఆ. వలదు తొలఁగు వెఱ్ఱివాఁడ వయ్యెద వేల, తాంగిఁ గదిసితేని యనిన నస్థి
సంచయంబు పుణ్యజలములఁ గలిపి ప్రాణములు మగుడఁ బడసివాఁడ నేను. 74

ఆ. నానిమిత్తమునను మానిని యిచ్చోట, బ్రతికె నింతితోడఁ బరిణమింతు
నబ్జవదనమీఁదియభిలాష విడిచి నీ, కిష్టమైనయెడకు నేఁగు మంటి.' 75

వ. అనిన నతం డుదరి యాకసంబు దాఁకి యేమీ కొంకక యింకను నిట్లు పల్కు మా
నాచేతికొలఁది చూతు గాని యని భుజాస్ఫాలనంబు సేయుచు నిలిచి యదల్చె
నేను నా ధాత్రోత్తరీయంబు నడుమునం జుట్టుకొని నెట్టుకొని యుండితి నప్పు
డీతనుమధ్య మధ్యస్థయై మమ్ము వారించి నామనోనేత్రంబులకు మీ రిరువుర
నొక్కవిధంబు కాని భేదంబు లేదు వాదంబు దక్కి మనపురంబునకు నన్నుం దోఁ
కొనిపోయి నలుగురు చెప్పినట్లు పొండని పల్కె నంత. 76

క. ఇట్టిద యగుకార్యం బని, గట్టిగ నింతిఁ గొనిపోయి కతిపయదినులం
బట్టణము సొరఁగఁ గోమటి, సెట్టియు నీకడ్డికొడుకుఁ జెఱి యొకవలనన్. 77

చ. కనుఁగొని హర్షచిత్రపులకంబులు మేనుల నివ్వటిల్ల నీ
వనితకునై కదా ధనము వాచన సేయక పాఱఁ జల్లితిం
బనివడి చేగకట్టియలు బండ్లకుఁ బూన్చితి నంచుఁ దారు చే
సినపను లుగ్గడించుచును శీఘ్రగతిం గదియంగ వచ్చినన్. 78

ఉ. చేరకుఁ డింతి నెవ్వఁ డిటు చేరినఁ బ్రాణముమీఁద వచ్చు నం
భోరుహసంభవాన్వయుఁడు పూజ్యుఁడు గాన సహించి యుంటిఁ గా
కారయ నన్యు లెంతటిబలాధికులైనఁ దృణీకరింపనే
మీర లెఱుంగ రిట్లు పులిమీసల నుయ్యల లూఁగ వచ్చునే. 79

క. అని యారాజకుమారుఁడు, కినిసి పలికె నపుడు వారికిని మాకును నీ
వనితకు వాదము ముదిరినఁ, జని చెప్పితి మప్పురంబుసభవారలకున్. 80

వ. చెప్పిన విని యాసభాసదు లందఱు నొండొరులమొగంబులు చూచి యీముడి
మాచేతం దీరదు తత్పురసమీపంబున నొక్క రాజర్షి యున్నవాఁ డతనిచేతఁ జక్క
నగు నందుఁ బొం డనిన మిమ్ముఁ గాన వచ్చితి' మని యంతవృత్తాంతంబును జెప్పి
యవ్విప్రుండు మఱియు ని ట్లనియె. 81

క. 'మానలువురవర్తనములు, వీను లలర మీరుఁ దొలుత వింటిర కాదే
యీనారీరత్నము మా,లో నెవ్వరి కర్హ మగుఁ దెలుపవే కరుణన్.' 82

మ. అని భూదేవుఁడు పల్క వంజరనరేంద్రాధీశ్వరుం 'డేను జె
ప్పిన మీ రందఱు సమ్మతించెదరె యీబింబోష్ఠి మీలోన నొ

క్కని సొమ్మయ్యెడిఁ గాన మాన రితరుల్ కామాతురస్వాంతులై
పెనఁగం బడ్డ నమంద మయ్యెడుఁ జూఁడీ పెన్పోరులై' నావుడున్. 83

క. 'వినుతయశా! తగవునకుం, జని యోడిన నరుఁడు ముదిసి చచ్చిన పగవం
బని లేదు బుద్ధిమంతుల, కనునానుడి వినమె యింత యన నేమిటికిన్. 84

తే. మీరు నిఖిలార్థవేదులు మీరు చెప్పి,నట్లు గా దని త్రిప్పంగ నగునె మాకు
ననుచు నందఱు నేకవాక్యముగఁ బల్క, వారిదెసఁ జూచి యారాజవల్లభుండు. 85

సీ. 'భూఁబోఁడి నెక్కటిఁ బుట్టించుటకు హేతు వైతి గావునఁ దండ్రి వగుదు విప్ర!
వనజాక్షిపుట్టుతోడన నీవుఁ బుట్టితి కాన సోదరుఁడవు క్షత్రియుండ!
యువతి యీల్గినఁ బూని యుత్తరక్రియలు సేయుటఁ దనూజుఁడవు వైశ్యుండ! నీవు
లలనకు నున్నకాలము కూడుఁ జీరయు నడిపి చచ్చినఁ గట్టె లిడుటఁ జేసి

తే. నీవు భర్తవు గాఁ దగుఁ జూవె శూద్ర!,' యనుచు వివరించి చెప్పిన నతనిమాట
విని రయంబున శూద్రుండు వికచవదనుఁ,డగుచు నయ్యింతిఁ జేపట్టె నాక్షణంబ.

చ. కనుఁగొని యున్నమువ్వురును గామశరానలతప్తచిత్తులై
కనలుచుఁ బోలుఁ బోల దని కాన కితం డొక కాఁపువాని కే
మని కొనిపోయి నిష్కరుణుఁడై నవపల్లవకోమలాంగిఁ గ్ర
క్కునఁ దగ నిచ్చె మానికముఁ గ్రోఁతికి నిచ్చినమూఢుకైవడిన్. 87

తే. ఎంత చెప్పిన నావగింజంతభూతి, పూయువానికి గుమ్మడికాయయంత
వెఱ్ఱి గల దనునార్యోక్తి వినమె తొల్లి, యితనియవివేక మది వేఱె యెన్న నేల.

చ. అదియును గాక పేరడవులందు మృగంబులఁ గూడి యున్న పెక్
ముదుకని కెట్టుపుట్టుఁ దుదిముట్టిననాగరికంపుఁజందముల్
వదలక తోడఁ జచ్చుట సువర్ణము దానముసేత ప్రేతరా
ట్సదనము చొచ్చి యున్నసతిఁ జయ్యనఁ దెచ్చుట యెందుఁ బోయెనో. 89

క. మోపెఁడుకట్టెలు గాల్చిన,కాపె యర్హుఁ డగునటె జగన్మోహనలీ
లాపరిచయదృగ్దీప్తి,వ్యాపారాపాంగ మైనయంగనఁ గవయన్. 90

వ. అని కోపోద్రేకంబు సైరింపం జాలక యాపెద్ద నుద్దేశించి 'యోయీ! నీవుమావేడ్క
చెలిచిలివి గావున వనితానిమిత్తమై వహ్నితప్తుండవు గ' మ్మని బ్రాహ్మణుండును 'నీ
దయితకు నీవు భ్రాతవు గ'మ్మని క్షత్రియుండును 'నీకళత్రంబునకు నీవు పుత్రుం
డవు గ'మ్మని వైశ్యుండును శాపంబు లిచ్చిన నెడ నొచ్చి యాశూద్రుండు వారి
కి ట్లనియె. 91

క. 'ఓహో! యిటు సేత గురు,ద్రోహ మగుట గాన నేరరుం గదె 'కామాం
ధో హి న పశ్యత్యనుపలు, కూహింపఁగ నిక్క మయ్యె నుడుగక మాచేన్. 92

తే. ఇచట మీరిచ్చుశాపంబు లెన్నియైన, సాక కానిందు సత్యవ్రతైకశీలుఁ
డితఁ డపరాధుఁ డగు క్షమియింపుఁ డనఁగ,నతని వారించి వారి కిట్లనియె విభుఁడు.

ఆ. 'కాముకునకుఁ బాపకర్మున కవివేకి, కవనిపతికిఁ గోపవివశమతికి
మదవిజృంభితునకు మద్యపాయికిఁ గ్రూర,చేతసునకుఁ దగవు చెప్పఁ జనదు. 94

వ. అదియునుం గాక సకలద్వంద్వములు విడిచి సమలోష్ట కాంచనుండనై యుండియు
మీతో భాషించినదోషం బూర కేలపోవు నైనను మీకు నాచెప్పినట్లగుం గదా
యని వాలాయించి యడిగినప్పు డియ్యకొని యిప్పు డిటు చేత నా భాగ్యంబ కాక
మీ రేమి సేయుదు రోపితి రేని శాపంబులు క్రమ్మఱింపు డంతకు శక్తులు గారేని
నూరక పొం' డనిన వారు 'తండ్రీ! వేసరినవాఁడు వెలుంగుమీఁద వేనీళ్ళ చల్లి
నట్లు నిలుపోపక పలికితిమి గాక నిన్ను శపింప మే మెంతవార' మని యుపచారో
క్తులు పలుకుచు దుస్సి పోయిరి గాని శాపంబులు మరలింప నోపరైరి శూద్రుండు
నతనిచేత ననుజ్ఞాతుండై యాసతియుం దానును నిజగృహంబునకుం జనియె మఱి
కొండొకకాలంబు సనుటయుం నొక్కనాఁడు. 95

క. ఆవనమున కొకభూపతి, భావ మలర వేఁట వోయి ప్రత్యక్షభవా
నీవిభుఁడో యన నొప్పెడు, నావంజరుఁ గాంచి నమ్రుఁడై యచ్చోటన్. 96

ఉ. కొండొకసేపు తద్విమలగోష్ఠి సుఖించుచు నుండి యీనృపా
లుండు మహానుభావుఁ డని లోకము వారలు చెప్ప నెప్పుడుం
విందును ముప్పు నాకు నిది నేఁడు నిదర్శన మయ్యె నన్ను నీ
తండు కృతార్థుఁ జేయఁడె ముదంబున మత్పురి కేఁగుదెంచినన్. 97

వ. అని తలంచి. 98

క. ఆతనిఁ దనపట్టణమున, కాతతభక్తిఁ గొనిపోయి యతనికిఁ బరిచ
ర్యాతంత్ర మొనర్పఁ దనూజాత సుమప నలినివాతసదనమునందున్. 99

క. ఆరాజుచేత నతఁ డటు, లారాధితుఁ డగుచు నుండె నంతట నొకనాఁ
డారామారత్నము దన,చేరువ మెలఁగంగఁ గోర్కి చిగురొత్తుటయున్. 100

సీ. అగ్ని డెందము సాయకాగ్ని చేఁ బ్రేల్చినయతులప్రతాపుఁ డీయంగజుండు
మండెడువజ్రంబు బెండుగాఁ బురుహూతుఁ గలఁచినవీరుఁ డీకాయజుండు
నాచారనిధి యైనయజుని తాలిమి వమ్ము చేసినయధికుఁ డీచిత్తజుండు
హరుని చిచ్చుఱకంటిపురుటి వదల నేఱు పఱిపినబలియుఁ డీభావజుండు

తే. తనకు నదనైన మెయిమెఱుఁ జనఁగనిచ్చు,నయ్యు యితరుల ననఁగనయ్యావనివిభుని
వ్రతము లన్నియుఁ గొనిపోయి పఱవఁ గలిపి, చిత్త మాతయుం గసిబిసి చేసివిడిచె.

ఉ. * అప్పుడు వాని నెమ్మనమునందుఁ గడుం దమకంబుదీకటుల్
ముప్పిరి గొన్నఁ దొట్రుపడి ముందర గానక పుష్పకోమలం
దప్పక చూచుఁ జూచి యటు దగ్గఱు దగ్గఱి స్వాభిలాషముం
జెప్పఁ దలంచు నుత్తలఁపు సిగ్గులచే టని కొంత చింతిలున్. 102

వ. మఱియును. 103

ఉ. ఇన్ని దినంబు లింద్రియము లే పఱఁ దాపసవృత్తి నుండఁగా
నన్నుఁ గదల్ప లేవు మదనా! మదనాగసమానయాన కీ
కన్నియ కేను లోఁబడినఁ గార్ముక మందితె యొప్పు నొప్పు నె
ట్లన్న నరుండు తోడు గల యప్పుడ తాఁ బగ నీఁగ కుండునే. 104

వ. అని యిట్లు దలపోసి విప్రాదికం బగువిటత్రయంబువలన నైనకళాపంబులు దన్నుఁ
బ్రేరేఁప నాగొంతి నతిప్రీతిం జూచి వ్యంగ్యరీతి నతం డి ట్లనియె. 105

క. 'పెక్కుఁదెఱంగుల నా కి, ట్లెక్కుడుపరిచర్య చేసె దీ వెప్పుడు నిం
కొక్కటియ సుమీ కడమం, జిక్కనయది తెలిసికొమ్ము శీతాంశుముఖీ!' 106

చ. అనవుడుఁ గేలు మోడ్చి వినయంబున ని ట్లను నాలతాంగి 'మ
జ్జనకుఁడు మీపదాబ్జములు చల్లన కాన భవత్సమీపముం
దునిచిన నున్నదాన మఱి యొం డన నేరక సన్మునీశ్వరా!
కనుఁగొన సర్వముం గడమ గాక యొకం డని చెప్ప నున్నదే. 107

ఆ. ఏను బాల నగుట యెఱుఁగరే నాయందుఁ, గడఁగి కొఱఁత లెన్నఁ గలరె మీరు
నోలిఁ దప్పు లైన నొప్పులుగాఁ జూడుఁ, డిట్టు లవధరింప నేల యనఘ! 108

ఉ. నావుడుఁ జెక్కు మీటి 'నలినస్ఫుటలోచన! మాట లేల నీ
యౌవనలక్ష్మికిన్ భటుఁడ నైతి నను గరుణింపు' మంచు వాఁ
డూవిళ్ళూరుచుం బిలువ యుత్పలగంధియు 'నోమహాత్మ! నీ
కీవిధ మెట్లు చొప్పడియె నే నొకభ్రాంతియె నీదుకోర్కికిన్. 109

సీ. ఆలోలమందానిలాధూతలతమాడ్కి నిఖఁ గాంచి హర్ష కంపనముతోడ
రతిపుష్పబుషోపహారమునఁ బ్రీతునిఁ జేయుఁగలిఁ గల్గిచూపులు గడలుకొనఁగ
మృదులతల్పము డిగ్గి యెదురేగుడెంచుచో నందెలు చెవులకు విందు సేయ
సరసభాషారంభ సంరంభయగురంభ పరిరంభసౌఖ్యసంపదలఁ బొదలి

తే. చిరతపఃక్లేశఫల మెల్లఁ జేకుఱంగఁ, ద్రిప్పు ము ప్పెన్నఁడును లేక త్రిదశవరుని
పట్టణమ్మున నెమ్మితోఁ బ్రాఁతకాఁప, వై వసింపంగఁ బ్రాప్తుఁడ వనఘ! నీవు. 110

---

* అప్పుడు వాని నెమ్మనమునందుఁ గడుందమకించి ముచ్చటల్, చెప్పఁగఁ గోరుఁ గోరియుఁను జేరు శరీరనిజాస్యపద్మముల్, తప్పక చూచు...చి ని. పా.

ఉ. అట్టిమహాపదంబునకు హానిగ నీదుతపఃప్రభావ మి
ప్పట్టునఁ గోల్పడం దగునె భవ్యుఁడ!' నావుడు నాతఁ డిట్లను
'గట్టిఁడిమన్మథుండు ననుఁ గాఱియఁ బెట్టుట కోర్వఁ జాల నీ
పుట్టువునందు నాకు నినుఁ బొందఁగఁ గల్గుటె యింద్రభోగముల్. 111

ఉ. కావున నన్నుఁ గైకొనుము కాదనునంతియ కల్గెనేని రం
భావిభవోపగూహనము బ్రాతిగఁ జెప్పితి కాద యిప్పు డా
త్రోవకు నైన నన్ బయపు తొయ్యలి! నీమనసార నింతలో'
నావుడుఁ దల్లడిల్లి నరనాథ నకుం బ్రణమిల్లి మెల్లనన్. 112

ఉ. 'కన్నియ నేను ధర్మగతి గామి యెఱింగియు నిట్టు లానతీఁ
జన్నె?' యనన్ 'లతాంగి! యిది క్షత్త్రియవంశమునందుఁ జెల్లు నా
కిన్నియుఁ జెప్ప నేల నను నేలఁ గదే!' యను వంజరుండు ము
న్నెన్నఁడు లేనినింద యిది యె ట్లగునో యనితాలు బాలయున్. 113

ఉ. కొమ్మపదారవిందములకు బ్రణమిల్లె విభుండు మేనఁ గం
పమ్ము దలిర్ప నప్పుడఁతి 'పాపము గట్టకు పార్థివేంద్ర! నీ
విమ్మెయి నిప్డు వేగపడి యీలువుపెం పెడలించి పోవఁగాఁ
బిమ్మటిమాట కోర్వ ననుఁ బెండిలి గమ్మటు లైన మే లగున్.' 114

వ. అనిన నతం డి ట్లనియె. 115

క. 'ఇది గాంధర్వవివాహము, సుదతీ! మన కిపుడు సాక్షి సూర్యుఁడె' యన 'నో
ముదుకఁడ! నీకొద దీఱిన, వదలెద వే నొల్ల' నఁ ప్రవాళాధరియున్. 116

క. 'ఏ నేల నిన్ను వదలుదు, మానిని! యనుమాన మడిగి మన్నింపుము నా
చే నొకశపథము గొను' మని, దానియడిగినట్ల చేసె ధరణీపతియున్. 117

వ. ఇత్తెఱంగున నత్తెఱవచిత్తంబు మెత్తం జేసి చిత్తజసుఖకేళిం దేలి యుండం దనివి వోక యాకన్నియ నెత్తుకొని పరదేశంబున కరిగి యొక్కవివిక్తదేవాలయంబునందు నయ్యిందువదన నునిచి గ్రాసార్థం బాసమీపగ్రామంబునకుం జనిన నం దొకవార నారీపరిచారిక వచ్చి పరిణతవయస్కుండయ్యు వళిపలితంబులం బొరయక తరుణ వయస్కుండపోలె నున్న యన్నరనాథుం జూచి 'మాయక్క యెక్కడనేని యొక చక్కనివాఁడు గల్గినంగాని కేవలనరమాత్రుల నెల్ల నంగీకరింపదు నేఁడితనిం జూపి యమ్మచ్చెకంటిచేత మెచ్చు పడయుదు' నని తలంచి యతనిం దోడ్కొనిపోయిన.

ఉ. ఆతనిఁ జూచి వేశ్యయుఁ దదాగమనోచితభాషణాదులం
బ్రీతునిఁగా నొనర్చి యధరీకృతమన్మథుఁ డివ్విటుండు నేఁ

డీతఁడు నాకుఁ జొప్పుడును యే నిల నింతకృతార్థ నౌదునే
నాతికిఁ జారుభర్తయ ధనంబులు సొమ్ములు వేయు నేటికిన్. 119

ఆ. ఇతనిఁ దడవు గాఁగ నిచ్చోట నిలుపను, వీనిమనసులోనివింతదనము
పాయఁ ద్రోవ నేయుపాయంబు గలదొకో, యుచితభంగి యయ్యె నుండవలయు.

క. అని తలఁచి వెండిపలకయుఁ, గనకపుసారెలును రత్నఖచితములై పే
ర్చిన పాచికలును దెప్పించి నృపోత్తము నెత్త మాడఁ జీరిన నతఁడున్. 121

క. 'నీతోడ నాడఁ దీరదు, నాతీ! నానాతి నేడు నావెంట నతి
ప్రీతిఁ జనుదెంచి శ్రాంతిస,మేత యగుచు నొంటి నున్న దేఁ బోవలయున్. 122

క. అనిన విని 'నీకు నిప్పుడు, వనితలు లే రనుట గాదు వచ్చినపిదప
న్మనసార నిష్టసుఖవ,ర్తనముల నొక్కింతసేపు దడయుంట కీడే. 123

క. పోయెదవు గాని రమ్మని, యాయంబుజనేత్ర దనకరాకర్షణముం
జేయుడు నొం డన నేరక, కాయజుచురిగోలఁ దగులుఖగమును బోలెన్. 124

క. ఆటలకు నోర్చి మున్నొక, జోటి నటుల దెచ్చికొనుట చూడక నృపుఁడ
య్యాటలకుఁ జొచ్చె నిం కే,యాటలకును నోడఁ డనఁగ నయ్యంగనతోన్. 125

క. అప్పుడు సతియును బతియును, మెప్పుగ సమదృష్టినుండి రుచితాసనులై
కుప్పనఁగూరలుగా మరుఁ, డప్పువ్వులకోల లేయ నద నయ్యె ననన్. 126

క. ఇతరేతరాగ్రభాగ,స్థితి నెత్తపుసారె లొప్పెఁ జిత్తజసమరో
చితముగ నప్పుడొనర్చిన, ప్రతికోటలకొమ్మ లనఁగఁ బ్రవ్యక్తములై. 127

వ. అంత నావామాక్షి దనవామహస్తంబునం బలక దాటించుచు. 128

సీ. నిజదృక్చకోరికానికరంబుకోరిక సమకూర నృపవక్త్రచంద్రుఁ జూచు
నరుణబింబాధరాధరణాయితంబులై దంతంబు లరదోఁపఁ బంత మడుగు
నతఁ డిచ్చుమధురోత్తరామృతపూరంబు శ్రోత్రయుగ్మమునకుఁ జూఱ విడుచు
మనుజులరాగంబు మన కేల మరుఁడ రాగంబు సమ్మనుచు వ్యంగ్యముగఁ బల్కుఁ

ఆ. బాసికలఁ గరాబ్జవాసనఁ బొరయించు, రమణుఁ గలయఁ గుల్కు రత్నఖచిత
కంకణములు మొరయ గల్లన వైచు న,ప్పలకమీఁద సరసభావ లెసఁగ. 129

క. దశవిధములవృత్తంబుల, శశిముఖి యే నెత్త మసిగెఁ జయ్యన నది త
ద్వశ మగు ద్యూతవిధిజ్ఞులు, ప్రశంస యొనరింప నానృపతి లజ్జింపన్. 130

ఉ. నట్టలు రెండుఁ దాన జతనంబునఁ జేకొని యున్న యిండులం
గట్టి నృపాలుసారెలకుఁ గాలిడ నెందునుఁ జోటు లేక యు
న్నట్టుగఁ జేసి యెట్టిసమయంబున నొడ్డిన సారెదిక్కుగ
న్పెట్టి దృఢాస్త్రవేదిగతిఁ బెక్కుగఁ దాఁకఁగ వైచె వైచినన్. 131

ఉ. ఓటమి మీఁద వైచుకొని యూరక పోవుట యెత్తు సాల ది
ద్యూట యవశ్యముం గెలుతు నంచుఁ జలంబున నాఁడు నాఁడి యా
యాటయు నోడు నోడి యురియాడు నిజాంగన యున్న యున్కికిం
బాటలగంధితోఁ గెలువఁ బాటరయి యుండమికిన్ విభుం డెదన్. 132

వ. ఇవ్విధంబున నమ్మహీపాలునకుఁ గాలవిడంబనంబు సిద్ధించె నంతఁ బౌరకాంత యొ
కర్తు యొక్కపనివెంట నారాజపుత్రి యున్న దేవాగారంబునకుం బోయె. 133

క. పూచినతంగెడువోలె మ,రీచినిబిడమణిగణస్ఫురితభూషణలీ
లాచాతురిఁ జెలువొందెడి, నాచపలాక్షిఁ గని యద్భుతాత్మిక యగుచున్. 134

ఉ. 'ఎక్కడనుండి వచ్చెనొకో యీనవనీరజకోమలాంగి తా
నిక్కడ నొంటి నుండఁ గత మెయ్యదియో శశిమౌళిమౌళిపై
నెక్కినయేటితోఁడఁ గలహించి హిమాద్రిజ యల్గి వచ్చి యీ
చక్కటి నిల్చెనో' యనుచుఁ జప్పుడు సేయక డాయఁ బోయినన్. 135

ఆ. బెదరి చూచు లేఁడికోదమచూపులఁ గీడు, పఱచునట్టితనదు మెఱుఁగుఁజూపు
లదర నెదురు వచ్చి యప్పౌరకామిని, తోడ నిట్టు లనియెఁ దోయజాక్షి. 136

క. 'ఎందులదానవు! వెలఁది! న,నుం దానిట డించి మన్మనోనాయకుఁ డేఁ
గెం దడవు గలదు రాఁ డే, చందమొ కానవు గదా యిచట నెచ్చోటన్. 137

మ వారవిద్వేషము దక్కి మన్మథుఁడు రుద్రాక్షంబులున్ భూతియుం
బరగం దాల్చి తదీయసత్కృపకుఁ దాఁ బాత్రుండు గాఁ బూని సు
స్థిరభక్తిం జరియింపఁ జొచ్చె నన నక్షీణద్యుతిం బొల్చు సుం
దరదేహుం డతఁ డేమి యయ్యెనొ కదా! తల్లీ! తలం కయ్యెడున్'. 138

చ. అనుచు వివర్ణవక్త్ర యగునానృపపుత్రిక నూఱడించి కా
మిని 'యొకదిక్కు చన్నతుది మిన్నక క్రమ్మఱ వత్తురమ్మ! పో
యినపని గాక భానుఁ డదె యిమ్ములఁ బశ్చిమవార్ధికిన్ రయం
బునఁ జనుచున్నవాఁడు తమముం గడుఁ బెల్లగు నింకఁ బైపయిన్. 139

క. చోరులు వత్తురు గాదే, క్రూరమృగావళులు పచ్చు గుడిలోపల నీ
వీరేయి యొంటి నున్కి వి, చారము గా దరుగుదెమ్ము చయ్యన నాతోన్. 140

చ. ఎదురుగ వచ్చు నీదుహృదయేశుఁడు సంతట రాక తక్కినన్
సుదతి! మదీయగేహమున సుప్తి వహించుట భార మైనఁ గాం
చెద నతఁ డెందు నున్న' నని చెచ్చెర నచ్చపలాక్షిఁ గొంచు న
మ్ముదుసలి యేఁగె నంత నృపముఖ్యుఁడు వచ్చి యదృష్టభార్యుఁడై. 141

ఉ. చిత్తము జల్లన న్మిగులఁ జేడ్పడుఁ బెద్దయుఁ గన్నునీరు చే
నొత్తుచుఁ జూచు నద్దెసలు నూరక యిట్టును నట్టుఁ బాఱు నె
త్తెత్తి పొరింబొరిం బిలుచు నెవ్వరు పల్కిన నాలకించు ద
గ్గుత్తిక పెట్టు నెట్లగునొకో యను నెక్కడికేఁగెనో యనున్. 142

ఆ. ఏను బోయి తడవుగా నున్న నబల యి,చ్చోట నాకు నెదురు చూచి చూచి
యొంటి నుండ వెఱచి యూరిలోనికిఁ బోవఁ,బోలుననుచు మఱియుఁబోయి వెదకు.

ఆ. నిప్పు ద్రొక్కినట్లు నిలువఁ డెచ్చోటను, నాఁడుమునుకు గని మహిళతోడఁ
గూడఁ బాఱి తేఱకొనఁ జూచు మూఁచి య,ప్పొలఁతి గాకయున్నఁ బుల్లవడును.

చ. పలుమఱుఁ దన్నుఁ జూచి మఱి పౌరజనంబులు వీఁగి వెఱ్ఱి నా
నలయక వీథులందు నిటు లాఱడిఁ ద్రిమ్మరుచున్న యమ్మహీ
తలపతిచంద మంతయును దా విని తొల్లిటివారకాంతయుఁ
వెలయఁగ నాతనిం బిలిచి వేగ వివేకము నివ్వటిల్లఁగన్. 145

క. ఉపచారోక్తుల నాతని, యుంపతాపము డిందుపఱచి యొయ్యొయ్యనఁ దా
నుపగూహనాదిసుఖముల, నపరిమితప్రీతుఁ జేయ నతఁ డట్లుండెన్. 146

ఉ. అక్కడఁ జేదరాలినిలయంబున నానృపపుత్రి నెవ్వగం
బొక్కుచు మేర లేనితలపోఁతలఁ దూలుచు నుండ నొక్క నాఁ
డక్కమలాక్షిఁ గన్గొనియె నప్పుర మేలెడురాజసేవకుం
డొక్కఁడు వాఁడు పోయి యదిపోయున్న తెఱం గెఱిఁగించె భర్తకున్. 147

ఆ 'అవధరింపు దేవ! యయ్యంబుజానన, యొప్పుచూడ నేత్రయుగము చాల
దాలతాంగిగుణము లభినుతింపఁగ నొక్క, జిహ్వ చాల దేమి చెప్ప నింక. 148

సీ. కమల మొక్కట నల్లగలువలు రెంట భృంగములు పెక్కింట శంఖము నొకంట
బిసకాండములు రెంటఁ బసిఁడికుండలు రెంట నొప్పార సృజియించె నొక్కసగము
ఘనరథాంగద్వంద్వకంబునఁ గమనీయరంభామృదుస్తంభరాజయుగ్మ
కమున మన్మథశరగౌరవ్యయంబునఁ బల్లవయుగమునఁ బరగఁ జేసె

ఆ. నొక్కసగము రెండు నొగిఁ బొందుపడఁ గూర్చి, పిడికిలించి పట్టి నడుముఁ జేసె
నజుఁడు నాఁగ నింతి యవయవోత్పాదన, లీలఁ దెల్పు నవ్వళిత్రయంబు. 149

క. అవ్వనజాయతలోచన, యెవ్వరిసొమ్మో చరించు నివ్వసుమతిలోఁ
బువ్విలుతుఁ డతఁడ కాఁ గొకఁ, దవ్వల మఱి కలఁడె' యని మహీశగఁ జెప్పెన్.

క. ఆరాజు వానిచే నటు, లారాజీవాయతాక్షియౌవనవిభవం
బారఁగ విని మదనాస్త్రవి, దారితహృదయుఁ డయి తగవు తలఁపనిమదితోన్. 151

క. ఆపదఁ దెలిఁ బిలిచి తెండని, పైపై దూతికలఁ బనుప భయ మందుచు 'హో
పాపపుదైవమ! తుది న, న్నీపాటులఁ బడఁగఁ జేచ్చితే యిచ్చటికిన్. 152

ఉ. తల్లినిఁ దండ్రిఁ బాసి కులధర్మము చూడక వెట్టిదాననై
యిల్లును బట్టు డించి యిటు లేటికి వచ్చితి వచ్చి మన్మనో
వల్లభు నిందుఁ గోల్పడితి వాఁ డిట కెప్పుడు వచ్చు నింతలోఁ
గల్లరిబ్రహ్మ యేది గతిగా నొనరించెనొ యేమి చేయుదున్. 153

క. ఈనృపతి పాపకర్ముం, డే నీతనిసమ్ముఖమున కేమని పోదున్
మానము వెలి యగుప్రాణము, మానితులకు నేమి బ్రాతి మహి నూహింపన్.' 154

క. అని తలఁచి యబల దూతీ, జనముల కి ట్లనియెఁ 'గొంతసైరణ వలదే
కనుమఱుఁగు లేక యూరక, తనవలసినచోట్ల మెలఁగుతరుణులు గలరే. 155

ఉ. ఎప్పుడు ప్రొద్దు గ్రుంకెడినొ యించుక సైఁపుఁడు మీనృపాలుతోఁ
జెప్పుఁడు వేగ మేల కడుఁ జేరువ నున్నది కార్య' మంచుఁ దా
నప్పని కియ్యకొన్నయటు లాడినఁ బోయిరి వారు వాఁటికే
యప్పటుబుద్ధి బుద్ధియుతు లాదట మెచ్చఁ దొఱంగె దేహమున్. 156

క. పుడమి నపప్రథ యగునెడఁ బడఁతికి దేహంబు విడువఁ బాడియ కాదే
సడికంటెఁ జావు మే లను, నొడువు పురాతనము గాక నూతనపదమే. 157

వ. ఇట్లాసతి మృతిపొందుట విని యమ్మనుజేంద్రుం 'డిది యెట్టి పతివ్రతయొకొ నా
చేసినధార్త్యంబునకు లజ్జించి ప్రాణంబు లుజ్జగించె' నని పశ్చాత్తాపంబు నొందుచు
నెట్టకేలకు నారాత్రి గడపి మఱునాఁడు దానికి నగ్నిసంస్కారంబు సేయ నియో
గించె నావృత్తాంతంబుఁ గర్ణాకర్ణి నాకర్ణించి వంజరుం డది తనయింతియ కాఁబోలు
నని యాందోళించుచు వచ్చి చూచి నిశ్చయం బగుటయు. 158

క. మగువ విరహవేదనఁ గను, మొగిచినగతిఁ జచ్చె నింత మోసపుఁ గార్యం
బగునె యని యార్వఁ దొడఁగిన,పగిది నృపతి గన్నుసీరు పఱపె సొదపయిన్. 159

వ. ఇట్లు శోకాక్రాంతుం డగుచు నమ్మహీకాంతుం డిట్లని విలాపించు. 160

ఉ. 'హా! మదిరాక్షి! నన్ను మదనానలకీలలఁ గ్రాఁగుమంచు నీ
వీమహితానలార్చులకు నీతను వాహుతిఁ జేసి నేఁడు సు
త్రామపురాంగనాజనకదంబముతో విహరింపఁ బోయితే
కామిని! నన్ను డించి చనఁ గా దని బుద్ధిఁ దలంపవే కదే.' 161

వ. అని విలాపించి. 162

చ. 'నలినదళాక్షి! నీవు నలి నావెనుకం జనుదెంచి నాకుఁ జే
కలిమి యొనర్చి తెప్పు డిటు లీ వమరావతికిం జనంగ నే

నిలుచుట పంతమే యిపుడు నీవెనుకం జనుదెంతు' నంచుఁ జా
రులు వెఱఁ గందఁగా నుఱికె స్రుక్కక వంజరుఁ డాచితాగ్నిలోన్. 163

వ. ఇట్లావిప్రలాపంబునకు ననురూపంబుగా నతండు మృతుం డగుటయు నావేశ్యయు నానిమిత్తంబై కదా వీ రిరువురు ని ట్లైరని తాను నయ్యగ్నియందఁ గూలె నమ్మువ్వురి మరణంబులకుం గారణం బై యుండి యే నూర కుండుట ధర్మంబు గాదని దాసియుం దదనుగమనంబు చేసె నంతయుం విని. 164

క. ఆరా జచ్చెరు వందుచు, నారాజసరోజముఖుల యస్థులు గంగా
వారిఁ గలిపి రం డని తన, వారిం బనుపంగఁ బోయి వారును నొకచోన్. 165

వ. ఒక్కవిప్రుండు పెద్దకాలంబు దేవి పురశ్చరణంబు చేసి తత్ప్రసాదంబున సంజీవని వడసి యుండుట యాప్తపరంపరవలన నెఱింగి యతనియున్నెడ కేఁగి తమ తెఱంగు చెప్పి 'విప్రా! నీవు పెద్దయుం నాయాసపడి గడించినదివ్యవస్తువునకుం దాత్కాలికంబై యత్యంతసుకృతప్రదం బగు ప్రయోజనంబు సిద్ధించె వీరలప్రాణంబు లెత్తు మిదియ నీదగునౌషధంబునకు నిదర్శనంబు నగు' నని ప్రార్థించిన నతం డట్ల చేసిన. 166

క. తారయుం జ్యేష్ఠయుం లక్ష్మియుఁ, దారాధీశుండు నెవ్విధంబున దుగ్ధాం
భోరాశిఁ బుట్టి రట్టుల, యారమణులు నతఁడుఁ బుట్టి రౌషధశక్తిన్. 167

ఆ. ఇట్లు పుట్టి యతనియింతి మన్మథవికారావలోకనంబు లడర నతని
చెట్ట పట్టఁ బోవఁ 'బట్టకు పట్టకు, పొలఁతి! నీకుఁ దోఁడబుట్టు నైతి. 168

వ. నన్నింక వరించుట యుచితంబుగా దూర కుండు' మనిన వెఱఁగుపడి యుండె నంత నవ్వేశ్యయు నాలా గె ట్లనిన నతండు దాని కి ట్లనియె. 169

క. 'ధర్మాధర్మపథంబుల, మర్మ మెకని కొకఁడు చెప్పుమాటయ లోకం
బర్మిలిఁ గొని తెలియ వలదె, కర్మాకర్మైకయుక్తి గనియెడుపనికిన్. 170

క. మదిరాక్షి! వినుము నీవును, మదంగనయు దాసియును సమంబు సుమీ నా
హృదయమున' కిప్పు డనవుడుఁ, బొదలెడుకోపమున రాజపుత్రిక పలికెన్. 171

వ. 'ఏ మేమీ గ్రుడ్లు దింటయుం గాక గూఁడెక్కి కూసెద వీవేశ్యయు దాసియు నీ కన్నుల కెంత ప్రియ మైన నయిరి కాక నాకు సవతుగా నిట్లు పలుక నెట్లు నోరాడె నీవు నన్ను వరించునప్పు డన్యకాంతాసంగమంబు సేయ కుండుటకును నన్ను వదలకుండుటకును జేసినశపథంబును గాడుపఱచితి పాపకర్ముఁడా! నీవు శుద్ధాత్ముండవైన నిన్నియలజ ళ్ళేల వచ్చు' నని నిషేధించి పలికి యంత నిలువక. 172

క. 'విందుము బొంకెడుపురుషుని, జండాలుం డనఁగ నీవు క్షత్త్రకులుఁడవై
యుండియు బొంకితి గావునఁ, జండాలత నొందు' మనుచు శాపం బిచ్చెన్. 173

క. అని వంజరుండు 'వనితా!, నినుఁ గదిసిన నట్ల యగుదు నీవును ననుఁ జే
రిన నట్టులు కా వలదే,' యనుచుం బ్రతిశాప మిచ్చినట్లుగఁ బల్కెన్. 174

ఆ. పలికి తపము సేయుంతలఁపున వనభూమి, కరిగె నదియు నొక్కయడవి కరిగెఁ
జూచి వేశ్య వనరుచును బోయె నింటికి, దాసి తనదువెంటఁ దగిలిరాఁగ. 175

వ. మఱియుఁ గొంతకాలంబునకు నొక్కనాఁ డవ్వంజరుండు నిజానుష్ఠానంబులు దీర్చి వన్యఫలంబు లనుభవించునప్పు డం దేమి విశేషంబు సోఁకెనో మస్తకంబు మొదలు కొని సకలావయవంబులందును నొక్కపొర యూడి సర్పంబుకుబుసం బూడిన ట్లైన షణ్మాసమాత్రబాలుండై. 176

సీ. పుడమి పాన్పుగఁ బడి యడుగులు మృదువాతకంపిత నవపల్లకములభంగి
నందంద కదలించు నరవిరిదమ్ములతమ్ములౌ తనదుహస్తమ్ము లెలమి
నాడించు నెడ నెద్దుఁ నంతన యుండుగు నుగ్గడుగు నూఁకరలిచ్చు నాలకించుఁ
గలువరేకులసందిఁ దలచూపుఁ జిఱుమీలకైవడి నెడమోడ్పుఁగన్ను లమరఁ

ఆ. గొంతతడవు నిదుర గూరు మిన్నక నవ్వు, మేలుకను విరక్తిశీలునట్లు
చలన లేక చూచు శరజన్ముజన్మంబుఁ, బోలెఁ దనదుబాలలీల మెఱయ. 177

వ. అంత నతనికాంతయు దైవవశంబున నాపైత్రోవ నరుగుచుండి యతనిం బొడగని వీఁ డెవ్వరివాఁడో వీనితల్లిదండ్రు లెట్లెమైరో యామిషార్థంబు పక్షిరాక్షసులం దెవ్వరేని వీనిం గొనిపోయి పోయి చేతప్పి పడవైచిరో కాక యిందు రాకకుం గారణం బేమి యని నలుదిక్కులం బరికించుచు నెత్తుకొని యుఁరంబున నొత్తుకొని.

క. మే నెంతయుఁ బులకింపం, గా నప్పుడు ప్రాణనాథుఁ గౌఁగిట నిడిన
ట్లైన మది సంశయించుచు, వానిం గొనిపోయి పెంచె వనిత ముదమునన్. 179

క. దినదిన మెక్కుకకళఁగాఁ, బెను పొందెడుచంద్రుమాడ్కిఁ బెరిగె నతం డే
డేనిమిదిదినములనాఁటికె, మనసిజుకైవడి నతిసుకుమారాకృతితోన్. 180

వ. ఇట్లు నవయౌవనుండై యావనితపై నివ్వటిల్లుతనకోర్కి వితర్కించి దానికిట్లనియె.

ఉ. 'మాతవు నీవు నిన్నుఁ గని మానస మారయ నేమి పాపమో
నాతి యధర్మలక్షణమునం జొరఁ బాఱెడు నోజ లేక నా
కీతల పేల పుట్టెనొకో యెగతి కేఁగుదునొక్కొ' నావుడుం
జేతులు మోడ్చి యవ్వనిత చెచ్చెర ని ట్లని పల్కె వానితోన్. 182

ఉ. 'నీవు శిశుత్వ మొంది యవనిం బడి యుండఁగ నెత్తుకొన్న మ
ద్భావము నిట్లు యై వెఱఁగుపాటు జనింపఁగఁ దెచ్చి పెంచితిం

దేవ ! నిజంబు చెప్పుము మదీయమనోహరుఁ డై నవంజర
స్థావిభునట్టి తోఁచెదవు కావు గదా యనుమాన మయ్యెడున్.' 183

ఆ. అనిన నతఁడు దెలిసి 'యనుమాన మేటికి, పంజరుండ నగుదుఁ గంజనయన !
వెడలఁబడితిఁ బొమ్ము విప్రాదు లగువారి, మూఁడుశాపములను ముక్తి వడసి.' 184

వ. అనిన నయ్యతివ యతని కి ట్లను 'విప్రాదు లనువా రెవ్వరు ? వారు నిన్ను శపింపం గారణం బేమి? నీ విప్పుడు శాపవిముక్తుండ వైతేఁ బొమ్మనుట యేమిటం జేసి!' యనిన నవ్విటచతుష్టయంబు వనితావాదనిమిత్తంబునం దనసమ్ముఖంబునకు వచ్చుటయుఁ దాను దీర్పనతగవు శూద్రునకుఁ దక్కఁ దక్కినముగ్గురకు ననహ్యాంబైనం గోపించి శాపంబు లిచ్చినతెఱంగునుం జెప్పి మఱియు ని ట్లనియె. 185

క. 'నీతోఁడఁ జచ్చి క్రమ్మఱ, నీతో జన్మించి పిదప నీవు పెనుపఁగా
నీతనయుండనై పెరుగుట, నోతరుణి! త్రిశాపముక్తి నొందితి నంటెన్.' 186

క. అని చెప్పుచు నెటకేనియుఁ, జన నుద్యోగించురాజసత్తముఁ గని య
వ్వనిత మతి బెదరు గదుర న,తని కి ట్లను మోమునందు దైన్యము దోఁపన్. 187

క. 'ఝషగర్భంబునఁ బొడమిన, ఝషకేతుని: గాంచి సంతసము నొందినయా
ఝషకేతువనితఁ బోలితి, ఝషకేతుసమాన! చూడు సత్కృప నన్నున్.' 188

వ. అని తొల్లి మన్మథుండు నిటలనేత్రు నేత్రవహ్నివలన సమసిననాఁడు శరమాయాడంబరుం డగుశంబరుం డంబరమార్గంబునఁ బఱతెంచి తత్సతి యగురతి నతిత్వరితగతి నెత్తుకొనిపోయి యంతఃపురంబున వైచుకొనిన నది మాయావతి యనుపేరం దన్స్వాగతం బొక్కటియు వెలిగాఁ దక్కటిపను లన్నియుఁ దానయనుసంధించుచు స్వసంకల్పకల్పితయు స్వమూర్తిసదృశయు నగునొక్కకృతకవనిత నతనికోర్కి దీర్ప నప్పుటప్పుటికి నియోగించుచుఁ దనపాతివ్రత్యంబునకు హాని లేకుండ నిట్లు చరించుచుండఁ బెద్దకాలంబునకు ద్వాపరాంతంబున నఖిలభువనపావనగుణభ్రాజిష్ణుం డగువిష్ణుండు కృష్ణుండై పుట్టిన నప్పుణ్యమూర్తికి రుక్మిణీదేవికిఁ గాముండు ప్రద్యుమ్నుండై పుట్టుట శంబరుండెఱింగి యాశిశువుం గొనిపోయిసముద్రమధ్యంబున వైవ నొక్కమీను మ్రింగె నది యొక్క వేఁటకానిచేతం దగులువడి యాశంబరునకు వాఁడు కానుకగాఁ దెచ్చి యొప్పింప మాయావతిచేతం దఱుగంబడు నప్పుడు శుక్తిమధ్యంబునం బొల్చుముక్తాఫలంబునుం బోలె నాఝషజఠరకుహరంబున నున్న బాలునిం గని యతనిగూఢవృత్తి నెత్తుకొనిపోయి యద్దేవి రహస్యప్రదేశంబున నునిచి పెనుచుచుండ నతండు సంప్రాప్తయౌవనుండై శంబరు వధియించి శంబరారి యనుపేర నిజసతీయోగసౌఖ్యంబు లనుభవించుచుండుటఁ జెప్పునప్పురాతనకథారూపంబు దీపింప నాడిన నతం డి ట్లనియె. 189

ఆ. 'నలినవదన! యల్లనాఁడు నీ వాడిన, మాట మఱచి తెల్లు మాలతనము
వచ్చు నన్నుఁ జేర వచ్చిన నే నింత. కోర్వ నింక నూరకుండనిమ్ము.' 190

క. అని యతఁడు విడియవాడిన, 'ననఘా! యింతనెగు లైన నతులితసత్త్వం
బున కుపఘాతిక మయ్యెడు,పని కొడఁబడుదురె వివేకపరిణతు లెందున్. 191

ఆ. నన్ను వదల కుండ మున్ను చేసినబాసఁ, దలఁప వైతి గాన దానఁ జేసి
సోలసి నిన్ను నట్లు పలికితి నీవు నాపనులకు లింత యొగ్గు పట్టఁ జను నె. 192

వ. అది యట్లుండనిమ్ము. 193

మ. నరకం బైనను నాక మైన మది నానందంబు గావింపదే
పురుషుం డింతియుఁ దానుఁ గూడి చనినన్ భూమీశ! చండాలదు
స్తరభావం బది నాకు నీకు సమమై సంధిల్లుఁ బ్రారబ్ధముల్
పరిభోగం బధికంబు లౌ టెఱుఁగవే పౌరాణికప్రోక్తిమై. 194

క. కావున మన మెల్లైనను, దైవకృపం జేసి బ్రతికెదము గాని ధరి
త్రీవర! నాకోరిక వృథ, గావింపకు' మనుచు మ్రొక్కెఁ గన్నీ రొలుకన్. 195

చ. నృపతియుఁ దత్కుతూహలము నెమ్మిఁ గనుంగొని యాత్మఁ దద్దయుం
గృప చిగు రొత్త నాశశిముఖిం దగఁ గౌఁగిటఁ జేర్చి మేన ద
ట్టపుఁబులకల్ జనింపఁగఁ దొడంగి మనోభవకేళిఁ దేల్చె నా
నెపమున నంత్యజాకృతులు నెట్టనఁ దాల్చిరి వార లిద్దఱున్.' 196

ఉ. నావుడు విప్రుఁ డిట్టు లను 'నాకమహానదితోడ వంజరుం
డావల మూఁడుజన్మములయప్పటిఁ గోలెను యుష్మదీయసే
వావిమలాత్ముఁ డట్టె తుది వంజరఁ దెచ్చుట యాది గాఁగ నే
లా వివిధంబు లైనవ్యాకులం బడఁ జొచ్చెఁ దపంబు పెంపఱన్.' 197

చ. అనిన 'నతండు ముక్తి వడయన్ సమయం బరుదెంచెఁ గాన యా
తనకిఁ బురాకృతంబు లగుదారుణకర్మము లొంచె నివ్విధం
బున నఘముక్తి గావలసె భూసురసత్తమ!యట్లు గాక త
క్కిన భవబంధముల్ తెగునె కేవలకర్మనిబద్ధదేహికిన్. 198

ఉ. కావున వాఁడు క్షత్రియుఁడు గాని తలంపఁగ హీనజాతి గాఁ
డో వసుధామరేంద్ర!యతఁ డున్నెడకుం జని చెప్పు మయ్య నా
జీవనగౌరవం బటులు చెప్పిన నప్పుడు వాఁడు ముక్తుఁడై
పోవుఁ బ్రియాసమేతుఁ డయి పొమ్ము సమస్తము విస్తరించితిన్.' 199

క. అని గంగానది చెప్పిన, విని విప్రుఁడు 'తల్లి!యేఁ బవిత్రుఁడ నైతిన్
బనివినియెద' నని మ్రొక్కుచుఁ, జని కతిపయతిథుల నతనిసదనము చేరెన్. 200

ఆ. అతఁడు నతనిరాక కత్యుత్కటప్రీతి, దనర నెదుర ఁజూచు చునికిఁ జేసి
కన్నయదియు మొదలు గాఁగ సాష్టాంగదండప్రణామములు గడంగి సేయ. 201

క. ఉర్వీసురవర్యుఁడు నా,శీర్వాదము లొనరఁ జేసి స్మితవదనుండై
'గీర్వాణుల కెన వచ్చున, ఖర్వగుణుఁడ వీవు సవతు గలదే నీకున్. 202

ఉ. ఏను భవన్నియోగమున నేఁగితిఁ గాశికి గంగలోఁ గృత
స్నానుఁడ నైతి నీ దగువచస్స్థితి చెప్పితి నప్పవిత్రతో
నానది దివ్యతేజ మొలయం దనరూపము చూపె మందహా
సాననకాంతితోడ నయనామలరోచులు మేళవింపఁగన్. 203

క. తనుఁ జూచిన యట్టులకా, ననుఁ జూచి ప్రహర్ష మంది నాభృత్యుఁ డతం
డనితరసదృశుఁడు సుమ్మీ, యని ప్రస్తుతిం జేసె నమ్మహానది నిన్నున్. 204

ఆ. అట్లు ప్రస్తుతించి యతఁడు సేమంబున, నున్నవాఁడె నామనోన్నతియును
జెప్పు మతని కనియె నప్పు డే నిట్లంటి, గంగతోడఁ గరయుగంబు మొగిచి. 205

ఉ. నీకరుణారసంబునకు నిక్కముగా నిటు ప్రాప్తుఁ డైనను
శ్లోకుఁడు హీనజాతుఁ డని చూడఁగ రా దతఁ డెట్టిపుణ్యుఁడో
నా కెఱిఁగింపవే యనిన నాకమహానది నీప్రభావముల్
కైకొని చెప్పి వీడ్కొలిపెఁ గంటిమి నీ వగునద్భుతక్రియల్. 206

సీ. గాఢనీహారంబు గప్పినఁ దప్పునే మార్తాండబింబవిస్ఫూర్తిపెంపు
నీఱు పైఁ గవిసిన నాఱంగ నేర్చునే ప్రకటితదావపావకునివేఁడి
మసిసోఁక మఱచినఁ బస చెడిపోవునే తనరునన ర్ఘ్యరత్నంబుకాంతి
భూరిశైవాలంబుఁ బొదివినఁ బొలియునే విలసదంభోరుహవిభ్రమంబు
తే. దైవవశమున నీకుఁ బ్రాప్తవ్య మైన, ఘోరదురితంబు నీఁగెడుఁగొఱకు నిచట
నంత్యజాకృతి నొందినయంతలోన, వర్ణ్య మగునీతపోమహత్త్వంబు చెడునె. 207

క. కంకుఁ డయి ధర్మజుఁడు వల,లాంకుం డై వాయుజుఁడు బృహన్నలయై ని
శ్శంకుఁడు పార్థుఁడు హయగో,కింకరులై కవలుఁ దొల్లి గెలువరె దినముల్. 208

క. వంజరుఁడ వీవు నీచే, వంజర యనఁ బరగెఁ గాదె వసుమతి నంహో
భంజని యాదిమగంగ స,మంజసగుణహార! నీవు మఱి యల్పుఁడవే'. 209

వ. అని యవ్విప్రుండు పలుకుప్రస్తుతవాక్యంబు లతనిచండాలత్వంబునకు నుచ్చా
టనమంత్రంబులై శివసారూప్యపదకారణంబు లగుటయు. 210

సీ. బహుభుజంగమభోగభారంబుక్రియ యఘాళి నురుజటాజూట మచ్చెరువు గాఁగ
శకలేందుమధ్యగైరికరేఖగతి మొదల్పుఁగన్ను ఫాలమున కక్కజము గాఁగ

రజతాద్రిపై మంచు గ్రమ్మినపగిది భస్మపుఁబూఁత యొడల విస్మయము గాఁగ
ధ్రువతటిత్పుంజంబు భువి నిల్పఁ బొడిచినపోల్కిఁ ద్రిశూల మద్భుతము గాఁగ
తే. లలితగజదైత్యచర్మంబు వెలయ భూరి,భుజగభూషణరాజవిస్ఫూర్తి యెసఁగ
నోలిఁ జండాలవేషంబు నుజ్జగించి,శంకరాకార మొందె వంజరవిభుండు. 211

చ. అనిమిషు లప్పు డర్థిఁ గొనియాడఁగ నాడఁగ నప్సరస్సతుల్
పనివడి కిన్నరాంగనలు పాడఁగ జూడఁగ నెల్లవారలుం
గనకవిభూషణాంబరసుగంధసముజ్జ్వలమూర్తిఁ దాల్చెఁ ద
ద్వనితయుఁ నావిమానగతిఁ దాఁ గదిసెం బతివామభాగమున్. 212

వ. అయ్యవసరంబున. 213

ఆ. కప్పురంపుఁబ్రతిమ కైలాసనగరంబు, నొద్ది పాదరసము ముద్ద యనఁగ
నానృపాలుపాలి కతిచిత్రగతులతో, వచ్చి నిలిచె వృషభవల్లభుండు. 214

వ. అట్లు సదాశివలాంఛనలాంఛితుండును సంగనాసమన్వితుండును గోరాజవాహనుండును
నై యారాజపరమేశ్వరుండు. 215

సీ. దుగ్ధాబ్ధిలోపలిదొడ్డముత్యము లెల్ల రాసిగాఁ గొనివచ్చి పోసిరొక్కొ
శరదభ్రనితతికి శాశ్వతస్థితి యిచ్చి యొకచోటన బ్రహ్మ యునిచెనొక్కొ
*కరఁగు టెన్నఁడు లేక గరివడ్డ లేమంచు దెచ్చి యున్నతముగాఁ దీర్చిరొక్కొ
విషమలోచను మోచువృషభేంద్రుఁ డంతటఁ దనియకీమూర్తియుఁ దాల్చెనొక్కొ
తే. యనఁగ ధవళప్రభాసమై హరనివాస, మై సమస్తాఘసంత్రాసమై యతీంద్ర
లాలితోల్లాస మైనకైలాసమునకు,నేఁగెఁ బ్రమథు లంతంతఁ ద న్నెదురుకొనఁగ.

వ. అట్లు గావున. 217

క. సత్సంగతి గదుఁ బుణ్యము, సత్సంగతి సేయవలయుఁ సత్పురుషులకున్
సత్సంగతి గని వంజరుఁ, డుత్సుకమతి నభవుపురికి నొప్పుగఁ జనఁడే. 218

క. ఆరాజేంద్రుం డటు శివ,సారూప్యపదంబు నొంది చనిన తెఱఁగుఁ గ
న్నారఁగఁ జూచుచునికిఁ బెం,పారఁగ నవ్విప్రుఁ డిట్టు లని వర్ణించున్. 219

ఉ. 'ఏమని చెప్ప వచ్చుఁ బరమేశ్వరభక్తులసచ్చరిత్రముల్
తామసులట్లు యుండుదురు ధారుణిలో మఱి శంభుపాలి క
ద్దామత నేఁగుచోఁ దమప్రతాపముఁ దేజముఁ జెప్పఁ జిట్టలై
భూమిఁ బొగడ్త కెక్కి తమపోఁడిమి చూపుదు రెల్ల వారికిన్. 220

క. పుట్టువుల కెల్లఁ గడపటి,పుట్టువుగా ని ట్లతండు పుట్టినదానం
గట్టిగ నంత్యజుఁ డని పే,రెట్టివిశేషార్థ మయ్యెనే యీతనికిన్.' 221

---

* కరఁగుడెన్నఁడు లేకగరివడ్డ మంచురాలేర్చి యున్నతముగాఁ జేర్చిరొక్కొ.
(ఛి. ని. పా.)

మ. అని వర్ణించుచుఁ దద్విచిత్రసుమహత్త్వాధిక్య మూహించి నా
రని వేడ్కల్ చిగురొత్త బాష్పజలధారాధౌతగండద్వయం
బును రోమాంచసమంచితాంగకములుం బ్రోత్ఫుల్లవక్త్రాబ్జముల్
వినతాకంపితమస్తకంబుఁ దగ నవ్విప్రోత్తముం డుండఁగన్. 222

ఉ. పౌరులు చేరి 'యోపరమపావనమూర్తి! భవత్సమాగమం
బారయ నెట్టిదో యిచటి యంత్యజుఁ డిప్పుడ ముక్తుఁ డయ్యెఁ బం
కేరుహసూతివో వృషభకేతుఁడవో హరివో కదయ్య నీ
వారినకాఁ దలంపు బుధవత్సల! యు'మ్మని పల్కి రందఱున్. 223

క. ఆపల్కుల కతఁ డిట్లను, 'నోపౌరశ్రేష్ఠులార! యొప్పుగ వినుఁ డే
నాపద్మజశివవిష్ణుల, లోపల నెవ్వఁడనుగాఁ బలుకు లేమిటికిన్. 224

క. విప్రుఁడ నే నయ్యంత్యజుఁ, డప్రమథాధిపతిభక్తుఁ డాతఁడు తనధ
ర్మప్రాభవమున నియ్యెడ, నప్రతిహతతేజుఁడై హరాద్రికిఁ బోయెన్. 225

క. వినుఁ డతనిమహిమ చెప్పెద,' నని తనకాశీప్రయాణ మాదిగ మఱి యా
తనిమోక్షము తుదిగాఁ గల్గునడిమివృత్తాంత మెల్లఁ గొనకొని చెప్పెన్. 226

ఉ. చెప్పినఁ బ్రీతులై యతనిఁ జెచ్చెరఁ దోకొని పోయి బూరెలుం
బప్పును నెయ్యి పాయసముఁ బక్వఫలాదులు నేత్రతృప్తిగాఁ
గుప్పిరి మున్ పథశ్రమము గూరిన మేనికి దప్పి దీఱున
ట్లప్పురివిప్రముఖ్యులు ప్రియంబునఁ గైకొని యేఁగె నాతఁడున్. 227

వ. ఇట్లేఁగి తనపురంబు చేరి యాత్మగతంబున. 228

ఉ. 'కాశికిఁ బోవఁ గంటి మణికర్ణికఁ గ్రుంకిడఁ గంటి నేను వి
శ్వేశుపదాబ్జసేవఁ బరమేశ్వరిసత్కృపఁ జాలఁ గంటి న
క్లేశగతిన్ హిమాచలముక్రిందటిభూములు చూడఁ గంటి న
చ్చో శిశువక్త్రజంబు లగుసూక్తు లొగి న్వినఁ గంటిఁ దేటగన్. 229

ఆ. అక్కజంబు లైనయట్టివిశేషంబు, లర్థిఁ జూడఁ గంటి నచట నచట
తిరిగి వచ్చి జన్మదేశము చేరఁ గంటి, మంటి' ననుచు నాతఁ డింటి కరిగె. 230

క. భయభక్తిసంభ్రమంబులు, రయమున ముప్పిరి గొనంగఁ బ్రణమిల్లినయా
ప్రియసతి నుచితవచనసంచయములఁ దగ గారవించి సౌహార్దమతిన్. 231

ఉ. ఇమ్ములఁ గాశికాపురికి నేఁగెడునప్పుడు నందునుండి య
య్యమ్మికపంపునన్ హిమవదద్రిసమీపము కేఁగునప్పుడున్
గ్రమ్మఱి వచ్చునప్పుడును గన్నవిశేషము లింతితోడ మో
దమ్మునఁ జెప్పె విప్రుఁ డది దానును జెప్పె నిజప్రసంగముల్. 232

వ. ఇట్లన్యోన్యవిశేషభాషణంబులం గొండొకసేపు వినోదించి యెల్లదానంబులయందును నన్నదానం బసమానం బనియును నందు సిద్ధించుపుణ్యం బగణ్యం బనియును నెఱింగిన వారై యాదంపతులు తదీయాచరణంబులు తమకు శరణంబులుగాఁ బ్రవర్తించుచు ధనధాన్యసమృద్ధియుఁ బుత్రపౌత్రాభివృద్ధియుం గలిగి బ్రతుకుచుండిరని చెప్పి సర్పటిసిద్ధుండు. 233

సీ. అన్నంబు బలకరం బన్న మాయుర్వృద్ధికర మన్న మత్యంతకాంతికరము
తనుఁ జంప వచ్చినఘనశత్రునకు నైన నన్నంబు బంధుత్వ మావహించు
నన్నంబువలనన యమరులు ప్రీతులై పరులకుఁ గోరినవరము లిత్తు
రన్నదానముఁ బోల వన్యదానంబులు ధరణిలోపల నెల్లదానములకు

ఆ. ఫలము సరిగఁ జెప్పఁబడుఁగాని యన్నదా,నంబుసేఁత కీఫలం బనంగ
నబ్జభవుఁడు నోపఁ డటు గాన నీవును, నన్నదానపరుఁడ వగుము భూప! 234

క. ఇది నీయడిగినప్రశ్నకు, సదమల మగునుత్తరంబు జనవర! యేఁ బో
యెద' ననిన నాతఁ డిట్లను,' నిది తగవా మిము భజించు టిట్లనుటకు నే. 235

సీ. అఖిలదానములందు నన్నదానంబు విశేషంబుగా మీరు చెప్పుచున్న
వారు తత్ఫలములవలనను జేరెడునను వు సేయను మీరె యగుటఁ జేసి
తత్ప్రతిగ్రహముసేఁతకు మీర యర్హు లారయ నిప్పు డవ్వేళ యయిన దదియుఁ
గాక మీయందును గనఁగ నామీఁదియనుగ్రహం బధికసమగ్ర మగుటఁ

తే. బరిహరింపక నావిన్నపంబు మీర, లవధరింపంగఁ దగు' నన్న 'నవనినాథ!
యింత చెప్పంగ నేల నే నింతవాఁడ, నయ్యు వ్రతభంగ మగు నని యంటిఁ గాక.

ఆ. నృపకులాబ్ధిచంద్ర! నీ వింత నెట్టుకొ,నంగఁ ద్రోచి పోవ నాకుఁ దగదు
వినఁగ వలయుం నాదువిధమును నీకు న,ట్లగుట నొకయుపాయ మవధరింపు. 237

చ. అనఘ! భవద్గృహావిమలహస్తసరోరుహదత్తభిక్షయుం
దనరఁగ వేఁడి నాల్గుసదనంబులభిక్షయుఁ గాంచి యివ్విధం
బునఁ గలపంచభిక్షయును భూపవరా! భవదీయపఙ్క్తి నిం
పెనయ భుజింతు నొండనకు మిప్పని దా నుభయార్థము జుమీ. 238

ఉ. అచ్చటఁ దెచ్చుభిక్షయు నరాధిప! నీయశనంబు గాదె నీ
వచ్చపుఁగూర్మిఁ బ్రోచుమనుజావలిసొమ్ము భవద్ధనంబ కా
కెచ్చటనుండివచ్చె నిది యిట్టిదకా మది నిశ్చయింపు నా
కిచ్చన విమ్ము' నావుడును 'నిట్టిదృఢవ్రతుఁ డెందుఁ గల్గ నే. 239

క. పట్టఁగ వలవదు వ్రత మది, పట్టినఁ దుది విడువ వలదు పట్టినవ్రత మే
పట్టున వదలక జరిపెడి, నట్టిజనులు పూజ్యు లనిమిషావళి కైనన్'. 240

వ. అని కొనియాడుచు నమ్మనుజేంద్రుం డక్షమతింప నతం డట్ల చేసె నట్టిరువురు నా
హారంబులు గొనినతదనంతరంబ. 241

క. భోజమహీపతిచేతం, బూజితుఁడై యరిగె సిద్ధపుంగవుఁడు నరేం
ద్రా! జగతి నన్నదాన, భ్రాజిష్ణుం డయ్యె నానృపాలవరుండున్. 242

చ. వినుము నరేంద్ర! భోజపృథివీతలనాథుని రాజ్యలీల రుం
బొనరఁ దదీయకాలమునఁ బుట్టినయట్టివిశేషరీతులుం
గొనకొని నీదుకర్ణములకు న్విశదంబుగ విస్తరించితిన్
మనునిభుఁ డవ్విభుం డతనిమార్గము తక్కినవారి కబ్బునే. 243

సీ. మొదలిసామోపాయమున సర్వభూప్రజాపరిపాలనము సేయుఁ బాడితోడ
నడరి రెండవయుపాయం బైనభేదముఁ బచరించుఁ బుణ్యపాపములయందు
మొగిఁ దృతీయోపాయ మగుదానవిభవంబు నెఱపు నశేషార్థినికరమందు
నటఁ జతుర్థోపాయ మైనదండక్రియ యడరించు మృగయావిహారమందుఁ
తే. దనకు నెందును నెదురు లేకునికిఁ జేసి, చతురుపాయములకు నిట్లు గతి యొనర్చె
నార యితఁడంచు నీతిజ్ఞు లాదరింప, బుధపయోధిసుధాంశుండు భోజవిభుఁడు. 244

సీ. చర్చింప రెండవచంద్రుఁడు మూఁడవయశ్విని నాలవయగ్నిదేవుఁ
డైదవలోకపాలాఖ్యుఁ డాఱవపాండుసంతాన మేడవచక్రవర్తి
యెనిమిదయగుసన్మునీశుఁ డాతొమ్మిదయగు భోగిపతి పదియవవిరించి
పదునొకొండవచక్రపాణి పంద్రెండవశూలి పద్మూఁడవసూర్యుఁ డనఁగఁ
ఆ. దనరుఁ గాంతి రూపమునఁ బ్రతాపమున సత్యమున ధర్మచరిత నాజ్ఞ శుచిని
భూరిసత్త్వమునఁ బ్రబుద్ధతఁ గలిమిని, భూతిఁ దేజమునను భోజవిభుఁడు. 245

ఉ. ఆరసి వీరు వీ రని కృతాదియుగంబుల మూఁటియందు నిం
పారఁగఁ బేర్కొనం గలుగునట్టిఘనుల్గల రెన్నుచో బహు
త్కారవణోత్తముల్ కలియుగంబున భోజవిభుండు సద్గుణా
కారుఁ డొకండ కాని మఱి కల్గఁడు తత్సదృశుండు భూవరా! 246

తే. క్షీరపూరితఘటము కర్పూరయంత్రకరండ ముద్యదిందుద్యుతి రమ్యమైన
కైరవాకర మనఁగ జగంబు మెఱయ, భోజవిభునిత్యకీర్తి విస్ఫూర్తిఁ జేసి. 247

చ అవిరళకీర్తినిత్యుఁడు సమంచితసత్యుఁడు శ్రీప్రయాగమా
ధవకరుణావలోకనసుధారసజన్ముఁడు కామినీజన
ప్రవిమలచిత్తజన్ముఁడు ప్రభాకరతేజుఁడు భోజుఁ డొప్పు వై
ష్ణవశుభయోగలక్షణవిచక్షణుఁడై చిరజీవనోన్నతిన్. 248

క. అభినవభోజుఁ డనంగాఁ, బ్రభవించెఁ దనూజుఁ డానృపశ్రేష్ఠునకున్
శుభలక్షణలలితుఁడు శత్రుభయంకరుఁ డార్యసన్నుతుఁడు ధీయుక్తిన్. 249

క. నెట్టన భోజునికడుపున, బుట్టినపుత్త్రుఁ డఁట యవ్విభునిచారిత్త్రం
బెట్టి దన నేల పులికిం, బుట్టినకూన యఁట వేఁడి పులు మేసెడినే. 250

చ. అవనికిఁ జందనంపుఁగలయంపి పయోధికి ఫేనచిహ్న వృ
క్షవితతికిం బ్రసూనతతి శైలచయంబునకుఁ సితాభ్రగౌ
రవ ముడువీథికిన్ సురతరంగిణివెల్లి యనంగ నొప్పు భూ
భువనబిడౌజుఁ డైననవభోజునికీర్తి మనోజమూర్తియై. 251

ఉ. ఆతఁడు గాంచెఁ బుత్త్రుల ననంతగుణాఢ్యులఁ దత్తనూజులుం
జాతిగఁ గాంచి రాత్మజులఁ జారు యశస్కుల వారలుం దనూ
జాతులఁ గాంచి రున్నతవిచారుల నీక్రియ భోజవంశ మ
త్యాతతకీర్తి నొప్పె భరతాన్వయసన్నిభమై జగంబునన్. 252

క. ఈభోజరాజచరితము, భూభువనమునందు నిఖిలపుణ్యాస్పదమై
శోభిల్లు నధికతేజో, లాభంబుల నిచ్చు శ్రోతలకు వక్తలకున్. 253

వ అని భోజరాజీయంబు సెయ్యంబున నాద్యంతంబు నత్యంతహృద్యంబుగా నుప
న్యసించి. 254

సీ. అత్రిపుత్త్రుండు పవిత్రచరిత్రుండు వితతతపోమార్గసతతపథికుఁ
డజ్ఞానదూరుఁ డతిజ్ఞానసారుఁ డంతర్వేది విదళ నాఖర్వబలుఁడు
జిరతరాయుష్మంతుఁ డురుతరస్వాంతుఁ డష్టాంగయోగక్రియాసంగతుండు
లక్ష్మీనివాసుండు లక్ష్మీనిరాసుండు నిఖిలాశ్రితవ్రాతసుఖకరుండు

ఆ. నజరుఁ డచలుఁ డనఘుఁ డజుఁడు దత్తాత్రేయ,మునివరుండు దనకు వినతుఁ డైన
మహుని వీడుకొల్పి మహితకృపావృష్టి,రీచు లెసఁగ బుధులఁ బ్రోచుచుండె. 255

క. దత్తాత్రేయప్రోక్తము,దాత్తసుకృతభోగవిశ్రుతసునీతిపథా
యత్తంబై యితిహాసము, క్రొత్తగదే భూమి ననుచుఁ గొనియాడంగన్. 256

క. ఆచక్రవాళ మాప్పు, ధ్వీచక్రం బాశశాంకతిగ్మమయూఖం
బాచతురాస్యముఖాఖిల, ఖేచర మగుఁ గాత నాదుకృతిరత్నము దాన్. 257

సీ. అఖిలజగత్సేవ్యమై భూమిపై నహోబలముదా నెందాఁక వెలయుచుండు
నాతీర్థమందుఁ బ్రఖ్యాతమై భవనాశనీనది యెందాఁక నెగడుచుండు
నామహానదిపొంత నత్యంతపూజ్యమై గరుడాద్రి యెందాఁకఁ గదలకుండు
నయ్యద్రిశిఖరంబునందును నెందాఁక శ్రీనృసింహస్వామి స్థిరత నుండు

ఆ. నస్మదీయకృతియు నందాఁక సంతత,శ్రావ్యమై సమస్తసభలయందు
విస్తరిల్లుఁ గాత వివిధకథానూత్న,రత్నభూషణాభిరామ మగుచు. 258

క. గోవులకును బ్రాహ్మణులకు, భూవలయములోనిపుణ్యపురుషులకు సభీ
ష్టావాప్తి యొదవుఁ గావుత, దేవార్చితుఁ డగునృసింహదేవునికరుణన్. 259

చ. అని జగదేకవంద్యునకు నాదినృసింహున కిందిరామనో
వనజమధువ్రతేంద్రునకు వారిజనాభునకున్ సరోజలో
చనునకు సూరిలోకనుతచర్యునకున్ భవబంధజాలమో
చనునకు నేను నీవిమలసత్కృతి కానుకఁగా నొనర్చితిన్. 260

క. నన్ను భవద్భృత్యులలో, నెన్ని దయాదృష్టిఁ జూచి యిది మొదలుగ నీ
వెన్నఁడు వదలకు మిది నా,విన్నప మట్లైన నఘనివృత్తుఁడ నగుదున్. 261

చ. సరసిజపత్త్రనేత్ర! భవసాగరబాడబవీతిహోత్ర! ని
ర్జరపరిచార! రాత్త్రిచరసంఘవిదార! విఘాతపాతకో
త్కర! సుకృతార్థికైరవసుధాకర! యాశ్రితపారిజాతసు
స్థిరవరదాత! యోగిజనసేవిత! శాస్త్రపురాణభావితా! 262

క. అవయవయుతపరతత్త్వా!, భువనత్రితయాంతరాత్మ! పూర్ణమహత్త్వా!
భవనాశనతటినీతీరవిహారా! భాస్వదిందిరావనికీరా! 263

తోటకవృత్తము చందనకుంకుమసంయుతవక్షా! కుందసుకుట్మలకోమలధామా!
వందితభక్తజనప్రియ! యోగా, నంద! యహోబలనాథ! నృసింహా! 264

గద్యము. ఇది వాణీవరప్రసాదలబ్ధవాగ్వైభవ తిక్కనామాత్యసంభవ సుకవిజనవిధేయ అనంతయనామధేయప్రణీతం బైనభోజరాజీయంబను కావ్యంబునందు వంజరుండు నిటలాక్షనీరజాక్షులఁ బ్రత్యక్షంబు చేసికొనుటయు విష్ణుప్రసాదంబునఁ బతంగాధిపుం దనవశంబు చేసికొనుటయుం వంజరమహాప్రవాహవరంబును వంజరుకడకుఁ దమ తగవు దీర్చుకొన వచ్చి బ్రాహ్మణక్షత్త్రియవైశ్యులు శపించిపోవుటయు నృపకన్యాసంగమంబును త్రిశాపానురూపఫలానుభవంబును బితృపునరాగమనంబును శివసాయుజ్యసంధియు నన్నదానవిశేషాకర్ణనంబును సర్పటి పంచభిక్షాన్నసేవయుం భోజుం డన్నదానపరాయణుండై రాజ్యంబు సేయుచుఁ బుత్త్రపౌత్త్రాదిసంతానసమృద్ధిం బ్రవృద్ధి నొందుటయుఁ దత్ప్రసంగంబులు విబుధకుముదవనాశ్రయుం డగుదత్తాత్రేయుం డుపన్యసింప నఖిలధరాభారవహుం డగుమహుండు విని కృతార్థుఁడై నిజస్థానంబునకుం జనుటయుం నీభవ్యకావ్యస్ఫూర్తిపరిపూర్తి నొంది ప్రహ్లాదవరదుండును భవనాశననదీతీరవిహారుండును నైహికాముష్మికసుఖప్రదుండును నహోబలతీర్థభర్తయు నగుప్రసన్నలక్ష్మీనృసింహదేవునకు విన్నవించుటయు నన్నది సర్వంబును సప్తమాశ్వాసము.

శ్రీ శ్రీ శ్రీ

చెన్నపురి: 'వావిళ్ల' ప్రెస్సున ముద్రితము.—1952

BCI

KLVA104B148

పద్యకావ్యములు

		ప్రతి 1-కి రూ. అ.	
ఆంధ్రభారతము, పద్యకావ్యము:—			
ఆది సభా పర్వములు	...	4	[illegible]
అరణ్యపర్వము	...	[illegible]	[illegible]
విరాటోద్యోగపర్వములు	...	4	[illegible]
భీష్మద్రోణపర్వములు	...	4	[illegible]
కర్ణశల్యసౌప్తిక స్త్రీపర్వములు	...	4	[illegible]
శాంతిపర్వము	...	4	[illegible]
అనుశాసనిక, అశ్వమేధ, ఆశ్రమవాస, మౌసల, మహాప్రస్థానిక, స్వర్గారోహణపర్వములు	...	4	[illegible]
ఆదిపంచకము, వికటసంస్కృతము	...	11	4
యుద్ధపంచకము, స్త్రీపర్వము	...	7	8
శాంతిపర్వము	...	[illegible]	[illegible]
అరణ్యపర్వము, పద్యకావ్యము, పెద్దఅచ్చు	...	1	[illegible]
ఆంధ్ర శ్రీమద్రామాయణము—శ్రీ జనమంచి శేషాద్రిశర్మగారిది, 3 సంపుటములు	...	15	[illegible]
ఆంధ్రభాగవతము, పద్యకావ్యము, 2 సంపుటములు	...	15	[illegible]
ఉత్తరరామాయణము, [illegible]	...	6	[illegible]
ఉత్తరహరివంశము, నాచనసోమన	...	3	[illegible]
కళాపూర్ణోదయము, సూరనార్యకృతి	...	4	[illegible]
కాశీఖండము, శ్రీనాథకవి	...	[illegible]	[illegible]
కుమారసంభవము, నన్నెచోడుడు	...	5	[illegible]
చాటుపద్యమణిమంజరి, ప్రథమభాగము	...	1	12
చిత్రభారతము, చరిగొండ ధర్మన	...	1	[illegible]
జైమినిభారతము	...	2	8
దశావతార చరిత్ర, పద్యకావ్యము	...	4	0
నరసభూపాలీయము, సటీక	...	3	0
నలచరిత్ర, ద్విపద, క్యాలికోబైండు	...	2	4
నిర్వచనోత్తరరామాయణము	...	2	8
పాండురంగమాహాత్మ్యము, లఘుటీక, క్యాలికోబైండు	...	6	8
భాస్కరరామాయణము	...	[illegible]	0
మనుచరిత్ర, వావిళ్ల రామస్వామిశాస్త్రిగారి వ్యాఖ్యానముతో, [illegible] మేలుకాగితములమీఁద ముద్రితము	...	5	[illegible]
రాఘవపాండవీయము, సటీక	...	[illegible]	[illegible]

వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్,
పోస్టుబాక్సు 1372. 292, ఎస్ప్లనేడు, చెన్నపురి.

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA104B148
పుస్తకం పేరు	భోజ రాజీయము
తారీఖు	31 January 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	269
పెద్ద సైజు పేజీలు	no
ఖాళీ పేజీలు	CI, BCI
లేని పేజీలు	no
తయారు చేసినది	naima
పేజీలు విడదీసినది	naima
స్కాన్ చేసినది	THASIN
పరీక్ష చేసినది	
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good